

# భూమిక

## సుధామ

పీఠికలు–ముందుమాటలు

సంపాదకులు:

అల్లంరాజు ఉషారాణి




# భూమిక

## సుధామ పీఠికలు– ముందుమాటలు

# భూమిక

## సుధామ

పీఠికలు - ముందుమాటలు

సంపాదకులు:

**అల్లంరాజు (సూకూరు) ఉషారాణి**

**స్నేహిత స్రవంతి**

జి. 12, సాదత్ టవర్స్, పద్మావతి అపార్ట్‌మెంట్స్

సలీంనగర్‌కాలని, మలక్‌పేట

హైదరాబాద్ - 500 036

**BHOOMIKA**

[illegible]

of **Sudhama**

*Edited by :* **Allamraju Usharani**

© Allamraju Usharani

*First Edition* : 2018

*Price* : ₹ 300/- **$** 10

*No of Copies* : 500

*For Copies* :

**A. Usha Rani**
**Snehitha Sravanti**
G.12, Sadath Towers, Padmavathi Apartments
Saleemnagar Colony, Malakpet
Hyderabad - 500 036, (Telangana)
Cell: 9849297958/9848276929

&

**All leading Book Shops**

*Book Production* :
*'Pustakashilpi'*
**T. Muralidhar Goud**
tmgowd@gmail.com

*Cover Concept*:
**Snehith Allamraju**

*Cover design*:
**T. Mallesh**

*D.T.P. Layout & Photo Setting:*
**M. Kavitha Reddy**

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044

# తొలిపలుకు

ప్రతి పుస్తకానికీ అసలు గ్రంథంలోకి వెళ్ళేముందు ఒక ప్రముఖుని పీఠిక లేదా గౌరవనీయ, ఆత్మీయుల ముందుమాటలు ఉండడం సాధారణంగా పుస్తక ప్రచురణ స్వరూపంలో జరుగుతూనే ఉంటుంది. ఒక గ్రంథాన్నీ, ఆ గ్రంథ రచయితనూ గురించి సంక్షిప్తంగా, జనరంజకంగా అందించడం అందరికీ చేతనైన విద్య కాదు. పుస్తకంలోని అంశాలకు సంక్షిప్తంగా పీఠిక అద్దం పడుతుంది. చాలామంది నిజానికి ఆ 'భూమిక' ని చదివే పుస్తకంలోకి ప్రవేశిస్తారు.

ఇవి సుధామ గారి పీఠికలు, ముందుమాటలు. ఈ సంకలనంలో కవిత, కథ, వ్యాసం, నవల, నాటకం, కార్టూన్, కాలమ్, గళ్ళనుడికట్టు ఇలా అనేక ప్రక్రియలలో వచ్చిన గ్రంథాలకు ఆయా కవులు, రచయితలు, సాహిత్యకారులు సుధామ గారిచేత రాయించుకున్న పీఠికలు, ముందుమాటలు ఉన్నాయి. ముందుగా వారందరికీ అభినందనలు, అభివందనాలు.

సుధామగారి అసలుపేరు అల్లంరాజు వెంకటరావు. తమ పధ్నాలుగవ ఏటనుంచే కవిత్వం రాస్తూ, కార్టూన్లు గీస్తూ వారు పత్రికా ప్రపంచానికీ, లోకానికీ పరిచితులు. కరీంనగర్‌లో రెండు సంవత్సరాలు లెక్చరర్‌గా ఉద్యోగం చేసి, ఆ తరువాత 1978 నుండి ఆకాశవాణిలో ప్రవేశించి, 2008లో కార్యక్రమ నిర్వహణాధికారిగా స్వచ్ఛందపదవీ విరమణ చేశారు. అనంతరం కొన్నాళ్ళు బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఏ. ద్వితీయ తెలుగు విద్యార్థులకు అకడమిక్ కౌన్సిలర్‌గా బోధనచేశారు. కవిగా, రచయితగా, కార్టూనిస్టుగా, కాలమిస్టుగా, సమీక్షకునిగా, ఒక వక్తగా, పజిల్స్ నిర్మాతగా సాహితీవేత్తగా ప్రసిద్ధులైన సుధామగారి పీఠికలకై, ముందుమాటలకై అభిలషిస్తూ అందుకే ఎందరో గౌరవాదరాలతో, ఆత్మీయతతో కోరి వ్రాయించుకున్నారు. సుధామగారు ఆకాశవాణిలో చేరకముందు నుండే సాహితీలోకానికి పరిచయం మరి!

అంతేకాదు! జంటనగరాల ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థగా రాణించిన 'యువభారతి'కి క్రియాశీల కార్యకర్తగా ఉన్నారు. ప్రస్తుతం సుధామగారే యువభారతి ప్రచురణలకు ప్రధాన సంపాదకులు. యువభారతి పునర్ముద్రించిన కావ్యలహరి, మందార మకరందాలు, భావన, ప్రజాసూక్తం, భోగినీలాస్యం, వేమన్నవేదం గ్రంథాలకు అలాగే లహరి పరంపరలో నిర్వహించి ప్రచురించిన వేద విజ్ఞానలహరి, ఉపనిషత్సుధాలహరి గ్రంథాలకు, కావ్యలహరి పునర్ముద్రణకు ప్రధాన సంపాదకులుగా సుధామ సంతరించిన పీఠికలు ఈ 'భూమిక'లో చేర్చడం సంతోషంగా ఉంది.

ఆచార్య తిరుమల, విహారి, వాసా ప్రభావతి, జనార్దనమహర్షి, తిరుమల శ్రీనివాసాచార్య, రంగనాథ్, చలపాక ప్రకాశ్, ఆచార్య ఫణీంద్ర, కె.బి.లక్ష్మి, డా. నాగినేని భాస్కరరావ్, తురగా జానకీరాణి, పొత్తూరి సుబ్బారావు లాంటి అనేక మంది ప్రముఖ కవుల కవితా సంపుటులకు మాత్రమే కాదు, కొత్తగా కవిత్వం రాస్తూ, సంకలనాలు వేసుకున్న వారయిన తరిగొప్పుల వి. ఎల్లెన్. మూర్తి, తిరునగరి శ్రీనివాస్, ద్విభాష్యం వెంకటరామకృష్ణ శాస్త్రి, గిడుగులక్ష్మీదత్, వర్చస్వి, అనంతోజు మోహనకృష్ణ, రాణీచిత్రలేఖ వంటివారిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ పీఠికలు రాసారు.

ప్రముఖ నవలా, కథా రచయితలు కాకాని చక్రపాణి, పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి, తమిరిశ జానకి, సింహప్రసాద్, శారదా అశోకవర్ధన్, గంటి భానుమతి వంటివారు సుధామ గారిచే తమ గ్రంథాలకు పీఠికలు వ్రాయించుకున్నారు. ఆంధ్రభూమి వార మాసపత్రికల సంపాదకులు, శ్రీమతి ఎ.ఎస్.లక్ష్మి తమ 'అద్దంలో మనం'కు రాయించుకున్నారు. అలాగే ప్రముఖ చిత్రకారులు చంద్రగారి డస్ట్‌బిన్ కార్టూన్లకు, ఎలనాగ ప్రచురించిన గళ్ళనుడికట్టు పుస్తకానికి కూడా సుధామ ముందుమాటే. శారదా శ్రీనివాసన్ గారి 'చిరంజీవి సాహిత్య సమాలోచన'కు, సత్యం మందపాటి కాలమ్ గ్రంథం 'ఎన్నారై కబుర్లు', రాంపా కాలమ్ గ్రంథం 'భామ-భీమ', ఆచార్య ఎస్.వి. రామారావు, అరుణావ్యాస్, వేదుల శకుంతల వంటివారి వ్యాససంపుటులను సాహితీలోకానికి తమదైన రీతిలో సుధామ పరిచయం చేశారు. పలు నాటక గ్రంథాలకు కూడా తమ పీఠికల ద్వారా, ఆ పుస్తకాలలోని కీలక అంశాలను సుధామ తమ ముందుమాటలలో వివరించి పరిచయం చేశారు.

ఇక్కడే మీతో పంచుకోవాల్సిన మరో సంగతి వుంది. సాహితీవేత్తగా ప్రసిద్ధులైన సుధామ కార్టూనిస్టు, చిత్రకారులు కూడాను. సుమారు ఓ వందపుస్తకాలకయినా ముఖచిత్రాలు వేసినవారే. ముఖ్యంగా సుధామ చేతివ్రాతను చాలామంది ఇష్టపడతారు. అందుకే ఆయనచేత పీఠికలు రాయించుకుని, ఆ పీఠికలను సుధామ దస్తూరీలోనే

తమ పుస్తకాల్లో ప్రచురించుకున్న వారున్నారు. కాకాని చక్రపాణి, సింహప్రసాద్, కపిల రాంకుమార్, డి. కామేశ్వరి, వాసా ప్రభావతి, కె.బి.లక్ష్మిల గ్రంథాల్లో పీఠికలు సుధామ దస్తూరిలోనే వున్నాయి. అంతేకాదు పీఠికరాయించుకోవడం మాత్రమే కాక తమ గ్రంథం మొత్తం సుధామ దస్తూరీలో ప్రచురించుకున్నారు. డా.కె.బి. లక్ష్మి, డి.కామేశ్వరి, వాసా ప్రభావతి, డా. రావికంటి వసునందన్‌ల గమనం, జైలుపక్షి, అలలకొలువు, సంసారం గ్రంథాలు ఆసాంతం సుధామ గారి చేతివ్రాతలో ప్రచురితమయ్యాయి. అలాగే డాక్టర్ వూసల రజనీగంగాధర్ 'ధమ్మపదం', వాసాప్రభావతి 'జాబిల్లిరావే' పుస్తకాల పీఠికలే కాక లోని బొమ్మలు సుధామవే!

వివిధ సాహిత్య ప్రక్రియలపైనా, సామాజిక అంశాలపైనా అవగాహన, పట్టు వున్నందున ఇప్పటికీ అనేకమంది ప్రముఖులు సుధామగారితో పీఠికలను సంతరింపచేయించుకుంటూనే వున్నారు. 'సమాజ హిత చింతన' తమ రచనల 'అభివ్యక్తి'గా గల వారందరూ సుధామ గారికి ఇష్టులే! అందుకే మరి సుధామ పీఠికలు–ముందుమాటలలో ఆ ప్రస్తావన విరళంగా కనబడుతుంటుంది. వారు రాసిన అన్ని పీఠికలూ లభించకపోయినా ఇంతవరకూ వివిధ సాహిత్య ప్రక్రియా గ్రంథాలకు వైవిధ్యభరితంగా సుధామ గారు రాసిన పీఠికలు – ముందుమాటలు అన్నింటినీ సమగ్రంగా ఒకచోటికి తెచ్చి అందించాలనే సంకల్పమే ఈ 'భూమిక' ప్రచురణ. ఇందుకు ఆమోదించిన సుధామ గారికి నా ధన్యవాదాలు. ఈ పుస్తకం ఇంత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేసిన పుస్తకరూపశిల్పి, ప్రముఖ కవి శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడు గారికీ, ఓపికతో డి.టి.పి. చేసిన శ్రీమతి యం. కవితారెడ్డి గారికీ, డిజైనర్ శ్రీ టి. మల్లేశ్ గారికీ, అర్థవంతమైన ముఖచిత్రాన్ని చిత్రించి అందించిన మా చిరంజీవి స్నేహిత్ అల్లంరాజుకు, అందంగా పుస్తకాన్ని ముద్రించి సకాలంలో అందించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్‌వారికీ కృతజ్ఞతలు. ఈ భూమిక గ్రంథాన్ని మీరు సమాదరిస్తారని ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ......

*అల్లంరాజు ఉషారాణి*
*సంపాదకులు*

# విషయమార్గం


- తొలి పలుకు - సంపాదకులు ........................................ 05

**కథా సంపుటాలు**

- అభయం - శ్రీ రావిపల్లి నారాయణరావు ............................ 13
- సాగర మథనం - శ్రీమతి గంటి భానుమతి .......................... 18
- పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి కథలు ........................... 22
- తమిరిశ జానకి మినీ కథలు ........................................... 26
- స్త్రీకారం - సింహప్రసాద్.................................................... 30
- ఊహా విహంగాలు- సాహితీతరంగాలు - శ్రీఎస్.పి. పార్వతీశం .... 35
- దృష్టి - ఎస్వీ. కృష్ణజయంతి ............................................ 40

**నవల**

- నిప్పు- కాకాని చక్రపాణి................................................ 46

**కవిత్వ గ్రంథాలు**

- మాట్లాడే మల్లెలు - కీ.శే. ఆచార్య తిరుమల......................... 51
- పువ్వులు నవ్వుతున్నాయి - జి. కుమారస్వామి నాయుడు ............ 55
- చైతన్యరేఖలు- కీ.శే. శేషం రామానుజాచార్యులు ..................... 58
- గజలు సుందరి - కీ.శే. ఆకునూరి కిషన్‌రావు (కవిగారు).......... 60
- సాగర మథనం - శ్రీ వారణాశి భానుమూర్తిరావు .................... 64
- మరో ఉదయాన్ని పిలుస్తా - డా॥ లింగంపల్లి రామచంద్ర........... 66
- సమాజశిల - కీ.శే. డా॥ నాగినేని భాస్కరరావు....................... 68
- వెలుతురు ప్రవాహం - శ్రీ తిరునగరి శ్రీనివాస్ ...................... 73
- పునరపి జననం - శ్రీ తరిగొప్పుల వి.ఎల్.ఎన్. మూర్తి............. 78
- అహో! ఆంధ్రభోజా - కీ.శే. శేషం రామానుజాచార్యులు............. 81
- నగారా - శ్రీ కపిల రాంకుమార్ ......................................... 84

- తాయిలం– శ్రీ బొమ్మనబోయిన సోమసుందరం ..................... 87
- చేతగాని నటి – కీ.శే. తురగా జానకీరాణి ............................ 89
- అక్షర పుష్పాలు– శ్రీ కోట రత్నయ్య .................................. 93
- వాక్యం రసాత్మకం – ఆచార్య ఫణీంద్ర ................................ 95
- అమ్మే జీవనవేదం – శ్రీ ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి ......... 99
- గమనం – డా॥ కె.బి. లక్ష్మి ........................................... 102
- అలలకొలువు – డా॥ వాసా ప్రభావతి ................................ 109
- చింతన – శ్రీ పులివర్తి కృష్ణమూర్తి....................................... 114
- చైతన్యార్జునం – కీ.శే. నిమ్మల అర్జునగౌడ్.......................... 117
- జ్ఞాపకాల అలలపై – శ్రీ ద్విభాష్యం వెంకటరామకృష్ణశాస్త్రి ........ 120
- చూపు– శ్రీ చలపాక ప్రకాష్ .......................................... 123
- వీక్షణం – డా॥ కె.బి. లక్ష్మి ........................................... 128
- ప్రేమపక్షి – శ్రీమతి డి. కామేశ్వరి.................................... 132
- బాలబ్రహ్మం – ఆచార్య రావికంటి వసునందన్ ..................... 135
- పుడమి తల్లికి సంకెళ్ళు – శ్రీ పొత్తూరి సుబ్బారావు................. 138
- ఉషోదయము – కీ.శే. గురజాడ అప్పారావు ........................ 144
- భగవాన్ శ్రీ సత్యసాయి శతవసంతం– డా॥ రాధాశ్రీ............... 148
- కాంతికెరటాలు (రెక్కలు)– శ్రీ మోపిదేవి రాధాకృష్ణ................ 151
- తొలకరి – శ్రీమతి గురజాడ విజయశ్రీ ............................ 156
- అక్షరతూణీరం – డా॥ వూసల రజనీగంగాధర్ ...................... 159
- అగ్నిపూలు– శ్రీమతి శైలజామిత్ర ...................................... 163
- మనసు – శ్రీమతి గురజాడ విజయశ్రీ ............................. 168
- కవిగానే కనుమూస్తా – శ్రీ జనార్ధనమహర్షి ........................ 170
- మధ్య 'మా' గతి– శ్రీ విహారి ......................................... 177
- బొమ్మ బొరుసు– శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ ........................ 183
- దివాకరప్రభ– డా॥ తిరుమల శ్రీనివాసాచార్య....................... 186
- చింతలచెట్టు – శ్రీమతి సింహాద్రి పద్మ ............................ 190
- ఇవి అబద్ధాలు కావు – శ్రీ సత్యవోలు సుందరశాయి............... 193

- భ్రమరమ్ - శ్రీమతి గురజాడ విజయశ్రీ ......................... 199
- బాపూరమణ (శతకం) డా॥ అక్కిరాజు సుందరరామకృష్ణ ......... 200
- అమ్మపాటలు- కీ.శే. శ్రీమతి సింగరాజు నాగలక్ష్మి ................ 204
- ధమ్మపదం - డా॥ పూసల రజనీగంగాధర్ ......................... 207
- ఆకసాన్ని మింగాలని - శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ ................ 212
- అర్థార్థచంద్రికలు- శ్రీ రఘుశ్రీ ........................................ 215
- లోకాస్సమస్తా - శ్రీ వర్చస్వి ............................................ 220
- అక్షరసాక్ష్యం - కీ.శే. రంగనాథ్ ...................................... 223
- కాలంతెరలు- శ్రీమతి గిడుగు లక్ష్మీదత్ ............................ 230
- జాబిల్లి రావే (బాల గేయాలు) డా॥ వాసా ప్రభావతి ................ 233
- రెక్కలరవళి - శ్రీ దుగ్గిరాల సోమేశ్వరరావు ........................ 235
- అక్షర (కవితా సంకలనం) - ప్రచురణ: కీ.శే. వేదగిరి రాంబాబు 241
- కాలం- నా కరవాలం- శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి ............ 244
- కొత్త బాణీ (ప్రయోగపద్యాలు) - శ్రీ ఎలనాగ ...................... 245
- పారిజాతాలు - శ్రీ తిరుమల వెంకటస్వామి ........................ 251
- వారి తీరే వేరు - శ్రీ పొత్తూరి సుబ్బారావు .......................... 254
- నగరం నిద్రపోదు (దీర్ఘకవిత) - కీ.శే. నాగినేని భాస్కరరావు ..... 259
- రెక్కల గుర్రం - డా॥ రమణ యశస్వి .............................. 264
- అక్షరమాల - శ్రీ తిరుమల వెంకటస్వామి .......................... 272
- రాగమోహనం - శ్రీ కె.హరనాథ్ .................................... 274
- ఆలోచనచేద్దామా- శ్రీ అనంతోజు మోహన్‌కృష్ణ .................. 276
- కీ.శే.చక్రవర్తి రంగస్వామి సంపూర్ణ కవితా సంపుటి ................ 280
- వన్నెపూల విన్నపాలు - శ్రీమతి రాణీ చిత్రలేఖ ..................... 286
- అలలసవ్వడి (మినీకవిత) - డా॥ వాసా ప్రభావతి ................. 290
- చిగురాశల ఊహలలో - శ్రీ ఎన్.వి. రఘువీర్ ప్రతాప్ ............ 293

## నాటక రచనలు


- ప్రపంచపు ప్రథమ నాటకం - భారతీయం
  - శ్రీ ఎన్.ఎస్.కామేశ్వరరావు ........................................ 298
- ద్వాదశి- కీ.శే. గురజాడ అప్పారావు .................................. 302
- ప్రకృతికే ఆభరణాలు - డా॥ సరోజన బండ ........................ 306
- విదియ - కీ.శే. గురజాడ అప్పారావు .................................. 308
- పృథ్వీరాజ్ - శ్రీ తిరుమల వెంకటస్వామి ............................ 311


## వ్యాస సంపుటులు


- స్పందన - వేదుల శకుంతల ................................................. 315
- మహనీయులు - చిరస్మరణీయులు - కీ.శే. వై.వి.రత్నం .......... 318
- వేదవిజ్ఞానలహరి - యువభారతి ........................................ 320
- వేమన్నవేదం - ఆరుద్ర .................................................. 326
- సమాలోచన - కీ.శే.శేషం రామానుజాచార్యులు .................... 330
- మనోవీక్షణం - ఆచార్య ఎస్.వి. రామారావు ........................ 333
- ఉపనిషత్ సుధాలహరి - యువభారతి .............................. 338
- భోగినీలాస్యం - కీ.శే. వానమామలై వరదాచార్యులు.............. 348
- మంచిమాట - శ్రీ పులివర్తి కృష్ణమూర్తి ............................ 352
- మరో జంఘాలశాస్త్రి - శ్రీ అయలసోమయాజుల నాగేశ్వరరావు .. 355
- దాశరథి కవితా వైభవం - డా॥ తిరుమల శ్రీనివాసాచార్య ......... 362
- మందార మకరందాలు - డా॥ సి. నారాయణరెడ్డి ................. 365
- విజయానికి అభయం- శ్రీ గంధం నారాయణ ..................... 368
- కావ్యలహరి - ఆచార్య దివాకర్ల వేంకటావధాని - యువభారతి .. 373
- చిరంజీవి సాహిత్య సమాలోచన - శ్రీమతి శారదా శ్రీనివాసన్ .... 378
- అక్షరమే ఆయుధం - డా॥ సరోజన బండ ......................... 383
- సాహితీదీపికలు - శ్రీమతి కె. అరుణావ్యాస్ ........................ 385
- కరెంట్ ఇష్యూస్ ఇన్ ఎకనమిక్స్ అండ్ కామర్స్
  - శ్రీ కె. రామకృష్ణశర్మ ............................................... 388
- గ్రామీణ ప్రగతి సోపానాలు - కీ.శే. గురజాడ అప్పారావు ......... 392

● ఆధ్యాత్మిక్ - శ్రీ పులివర్తి కృష్ణమూర్తి ............................. 395
● వ్యాసార్థం - డా॥ వోలేటి పార్వతీశం.............................. 397

**ఇతరాలు**

● ఎన్.ఆర్.ఐ. కబుర్లు - శ్రీ సత్యం మందపాటి ..................... 401
● బాపు - నేను - కీ.శే. ఎం.ఎస్. రాజలింగం ........................ 404
● బాలానందం 1,2- అన్నయ్య అక్కయ్య రచనల సంపుటాలు ...... 407
● ప్రజాసూక్తం (సామెతలు) - యువభారతి ........................ 409
● వ్యక్తిత్వ వికాసం (సూత్రాలు- సూక్తులు) -యుభారతి............ 413
● భావన (సుభాషితాలు) - యువభారతి............................. 415
● వాచస్పతి (ఆకాశవాణి కళాకారులు)............................... 418
● డస్ట్‌బిన్ కార్టూన్లు - చంద్ర ............................................. 424
● భామ- భీమ (కాలమ్‌వ్యాసాలు) - రాంపా ........................ 428
● సాహితీసుధానిధి- డా॥ తిరుమల శ్రీనివాసాచార్య
అమృతోత్సవసంచిక.................................................. 433
● పిల్లల చేతుల్లో పెన్నిధి- ప్రపంచవారసత్వం
- తురగా వసంతశోభ.................................................. 437
● జోకులు వేయి- శ్రీ కొండూరి కాశీవిశ్వేశ్వరరావు.................. 439
● లచ్చుమమ్మ ముచ్చట్లు - డా॥ సరోజన బండ ..................... 442
● అక్షరసేన (దైనందిని)- సాధన సాహితీస్రవంతి.................... 444
● 'పద'నిసలు- శ్రీ సత్యసాయి కొవ్వలి ................................ 446
● నా సిరిచుక్క సికింద్రాబాద్ - శ్రీమతి శారదా అశోకవర్ధన్ ........ 451
● అద్దంలో మనం 4 (ఆంధ్రభూమి వారపత్రిక కాలమ్)
- శ్రీమతి ఎ.ఎస్.లక్ష్మి.................................................. 456
● నుడిక్రీడ - శ్రీ ఎలనాగ.................................................. 459
సుధామ పరిచయం...................................................... 467




# సంస్కార కథా కల్ప(నా)వల్లి - రావిపల్లి

## అభయం (కథా సంపుటి) - రావిపల్లి నారాయణరావు

"కథలంటే విషాదమూ బీభత్సమేనా" అని ఇటీవల దశాబ్దికి పైగా వార్షిక కథాసంకలనాలు తెచ్చిన ఓ పెద్దమనిషి వాపోయాడు. కళ్లుంటే, సరికాదు. చూపు బాగుండాలి. మనం ఒక పార్శ్వాన్నే చూస్తూ - అదే సత్యదర్శనం, సమస్తమూ అనుకుంటే అలానే వుంటుంది. ఇటీవల కథా ప్రపంచంలో సాహిత్య విమర్శకులు, సంకలనకర్తల ధోరణి చూసినప్పుడు, వారు పాఠకుల దృష్టితో కాక, తమదైన రంగుటద్దాలలోంచే కథల మంచి చెడుల ఎంపిక కావిస్తున్నారనిపిస్తుంది. వాళ్లు వారి పరిధులు దాటి వస్తే విశాల కథా ప్రపంచం కళ్లకు కడుతుంది. అందులో నేడు అనేకులు విస్మరిస్తున్న మంచికథల పార్శ్వాలు కనబడతాయి.

చిన్నప్పుడు కథలంటే అనివార్యంగా ఒక 'నీతిని' సంతరించుకుని వినిపించేవి, కనిపించేవి. పెద్దయ్యాక నీతులు అక్కర్లేదా? నిజానికి ఇవాళ 'పెద్దలకే సుద్దులు' అవసరమైన - వక్రపథాల సమాజంలో వున్నాం మనం! అవినీతి విరాడ్రూపాలు దర్శిస్తున్నాం గానీ, మంచికీ, మానవీయ విలువల దర్శనానికీ అంధులమవుతున్నాం. సమాజ హితాన్ని కోరవలసిన సాహిత్యం, ఆ సాహిత్య సృజనకారులు కూడా - గుర్తింపు ఆరాటాలకూ, ప్రలోభాలకు లోబడిపోతూ, పథనిర్దేశనం చేయవలసిన తామే దారి తప్పుతుంటే అది విషాదమూ, బీభత్సమూ కాక మరేమిటి?

మరి – ఈ సాహిత్య తిమిరంలో వెలుగు చూపగల దీపధారులే లేరా? అని భయం వేస్తున్నప్పుడు "చుట్టూరా ఆవరించుకొని వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది" అని ఆ పూనికగల కథకులకు కొరతేమీ లేదు కాంచగలగాలే గానీ, అని 'అభయం' ఇస్తున్న కథారచయిత – వివిధ పత్రికల్లో ఇప్పటికే మంచి కథలు రాసిన శ్రీ రావిపల్లి నారాయణరావు గారు.

కథలు సమాజంలో ఒక సంస్కారాన్ని పెంచగలగాలి. ఉదాత్తమైన మానవీయ విలువలను ప్రోదిచేయగలగాలి. పిల్లలకు చెప్పినట్లు 'నీతి' కథలో నేరుగా చెప్పనక్కర్లేదు. కానీ పెద్దల కథల్లోనూ అది ఆవిష్కృతం కాగలగాలి. కథకు ఒక ప్రయోజనం వుంది. కేవలం ఒక సన్నివేశాన్నో, సంఘటననో, వ్యక్తి జీవనాంశాన్ని వ్యక్తీకరించేదిగానో కనబడవచ్చుగాక, కానీ అంతస్సంజ్ఞముగా పఠితకు అది అందాలి. శిల్పము, ప్రయోగము అంటూనో, దరిద్రమూ, పోరాటమూ అంటూనో అవే గొప్పకథలన్న భ్రమావరణంలో బ్రతికేవారినీ, ధమ ధమార్భటులను కావించే వారినీ కావించనీయండి... వర్తమానంలోనూ, తాత్కాలికంగానూ – 'మోత' బలిమివల్లా, "మ్రోత" బలిమివల్లా అవి నెత్తికెత్తుకోబడవచ్చుగాక! కానీ – విలువలకై తపించే మధ్యతరగతి కథలూ, ఒక తృప్తితో ఆదర్శనీయంగా వ్యవహరించే నడవడికల జీవితాలూ, ఆ పాత్రలూ, వాటి చిత్రణం అధిక సంఖ్యాకులైన సగటు పాఠకులకు సదా సమాదరణీయంగా నిలువ గలుగుతూనే వుంటాయి. ఆ కోవను అందిపుచ్చుకోనిచ్చేదే 'అభయం.'

'అభయం' కథా సంపుటిలో రావిపల్లి నారాయణరావు గారు అందించిన కథల్లో అధికశాతం కథలు ఇలాంటి సంస్కారంతో, సమాదరణీయ మధ్యతరగతి పాత్రలతో, సన్నివేశాలతో వుండడం సంతోషం కలిగిస్తున్న సంగతి! ఇవి చదివించే కథలు మాత్రమే కాదు, మంచిని పంచే, పెంచే, ఒక ఆరోగ్యదాయకమైన విలువల సమాజాన్ని ఆకాంక్షింపచేసే కథలు..

'ప్రస్థానం' అనే కథలో ఒక రైలు ప్రయాణమే సన్నివేశం. పై బెర్తుకు వెళ్లగలిగే ఆరోగ్యమూ, అవకాశమూ వుండీ, ఆ సామర్థ్యం లేని పెద్దాయన నోరు తెరిచి అడిగినా, తిరస్కరించిన వట్టి పేరుకి 'బంగారయ్య', చివర్లో మారిన వైనం, అందుకు దోహదపడిన ఉదంతం ఈ కథలో చిత్రితాలు. కథాంతంలో రచయిత

అన్న మాటలు చిన్నవే అయినా మిన్న అయినవి – "ఒకర్ని ద్వేషించటం, విమర్శించటం పనిగా పెట్టుకున్న చాలామంది కాలాన్ని వృథాపరచి, వారి కర్తవ్యాన్ని మర్చిపోతున్నారు. అంతేకాక అభివృద్ధి కార్యక్రమాలను ఆటంకపరుస్తున్నారు. అరవై డబ్బైమంది ప్రయాణికులున్న ఈ కోచ్‌లో ఒకరికొకరు సహాయపడాలన్న ఉద్దేశం మనకు లేనప్పుడు, కోట్లాది జనాభాగల దేశంలో మనమేం సాధించగలం? – ఇదే ప్రశ్న వేసుకుని మన ధర్మాన్ని మనం నెరవేర్చుకున్నప్పుడే దేశపురోభివృద్ధి సాధ్యపడుతుంది." ఎంత వాస్తవం!

"లోకంలో మంచి చెప్పేవారు లేక లోకం చెడిపోవడం లేదు. ఆచరించేవారు లేక" అని ప్రముఖ కథా రచయిత బుచ్చిబాబుగారు ఒకచోట అన్నట్లు, కథల్లో నీతి చెప్పడం కాక –నీతిమంతమైన పాత్రలను నిలపడం ముఖ్యం. పుస్తకం శీర్షికగా గల కథ 'అభయం' అలాంటి సంస్కారవంతమైన పాత్రలతో నిండిన నిజమైన మంచికథ. ఒక స్త్రీ అత్యాచారానికి గురి అయితే ఆమె తప్పులేదని తెలిసినా, ఇంటా బయటా వెలివేయబడినట్లు, ఆమె అవమానాలనూ, తిరస్కారాలనూ ఎదుర్కునే సమాజంలో – సంస్కారవంతమైన మనుషుల 'అభయం'తో ఆమె సంతోషంగా జీవితం గడపగలగడం ఈ కథాసారాంశం. ఈ కథ నడిపిన తీరు, సంస్కారంలోని సోపానాలుగా వైష్ణవి భర్త రమాకాంత్, తండ్రి మహేంద్రబాబు, మామగారు కృష్ణమూర్తి, అంకుల్ అయిన రచయిత పాత్ర సారథిని చిత్రించడం, నిజంగా అందరూ ఇటువంటి సంస్కారవైఖరినే వైష్ణవి వంటి స్త్రీలపట్ల చూపగలిగితే ఎంత బాగుంటుందో కదా అనిపిస్తుంది ఈ కథ. అలాంటి ఉదాత్త సమాజ నిర్మాణానికి 'అభయం' ఇవ్వగల ఇలాంటి కథలు మంచి కథలుగా ఆనకపోతే.... అది విమర్శకుల విజ్ఞతకే వదిలేద్దాం!

'ఇన్‌విజిలేటర్', 'మీ అడుగుజాడల్లో' కథలు రెండూ నిజానికి ఒకే కథ రెండుసార్లు రాసినట్లే! కానీ అవినీతిమయ నేటి సమాజంలో, ఇలాంటి మాస్టార్లూ, వసుంధర అయినా, కస్తూరి అయినా అలాంటి శిష్యురాండ్రూ ఒకటికి రెండింతలుగా పెరగవలసిన అవసరం వుంది కనుకే – ఈ చర్విత చర్వణాన్ని అంగీకరించేయ వచ్చును.

సంస్కారం ఒక వర్గం వారికే వుంటుందని గానీ, కొందరు ఎల్లప్పుడూ సంస్కార దరిద్రులుగానే ప్రవర్తిస్తారనిగానీ అనడం కుదరదు. 'సమయోచితం'

కథలో సంస్కారం చూపి, ఒక పేదపిల్లవాడిని సంస్కారవంతుడిగా తీర్చిదిద్దిన రచయిత పాత్రే – పనిపిల్ల పట్ల 'కుసంస్కారం'తో ప్రవర్తిల్లినప్పుడు, తన యజమాని కాపురం నిలబెట్టడానికి ఆ పిల్లవాడే అబద్ధం చెప్పి సంస్కారాన్ని ప్రదర్శించడం, పతనమైన మనిషిలోని సంస్కారాన్ని తన చర్యతో పునరుత్థానం చేయడం చూస్తాం! పేదవాడు ఎంత 'విశ్వాసం' చూపినా, సంపన్నునిలో 'మాట' మాత్రంగానయినా కానరాని వర్గదృక్పథమూ రచయితకు తెలుసు. 'విశ్వాసం' కథే అందుకు నిదర్శనం. సహజాతాలను అధిగమించగలిగే సంస్కారమూ అవసరమనే సూచికని ఇలాంటి కథలు ఇస్తాయి. 'మనసులోని మనసు'లో చక్కటి మాండలికంలో చిత్రించిన 'ఆదెమ్మ' కథ కూటికి పేదలయినా గుణానికి పేదలు కా(లే)ని సంస్కార స్థితినే చాటి చెబుతుంది. స్వభావ విరుద్ధంగా చేసిన పని – సంస్కారజీవిని ఎంత అతలాకుతలం చేస్తుందీ, చివరకు ధర్మం వైపే ఎలా అంతరాత్మ తరుముతుందీ విశదపరుస్తుందీ కథ.

శ్రీ రావిపల్లి వారి కథల్లోని ఈ 'సంస్కారవల్లి' నిజంగా అభినందించదగింది. బ్రతుకు విలువల్లో పెనవేసుకోదగినది. అలాగే 'మావారు శ్రీవారు' కథ – భవాని కాపురం నిలబెట్టడానికి మాలిని, వరదరాజు ఆడిన నాటకానికి – భవాని భర్త, తల్లియే కారణం కావడంగా చిత్రించడం కూడా ఒక కుటుంబ సంస్కార లక్షణమే! విడాకులు విచ్చలవిడిగా విస్తరిస్తున్న నేటి అసమసమాజంలో, దాంపత్య సంస్కార సంచయానికి సహజోద్దీపనం కాగల కథ ఇది.

'కోటయ్య కుర్ర' చదువుతుంటే కోట శ్రీనివాసరావు, బాబూమోహన్ తెలుగు సినిమా పాత్రధారులు పాఠకుల ముందు కదలాడతారు. సినిమాయవ్వారంగానే అయినా, రెడ్డి నాయుడు తన కూతురు కోకిలమ్మను – పేదోళ్ల కుర్రాడు ఎంకన్నకు, వారి ప్రేమను గ్రహించి, ఇవ్వడానికి అంగీకరించడం అనే సంస్కారం ప్రదర్శించడం – బాగుంది. బెమ్మానందం అని బ్రహ్మానందంగా కథనడిపినా, బాబూమోహన్... ఆ యాసలో, ఆ తన్నులాటల్లో కదలాడతాడు రావిపల్లి వారి కథలో. 'జోరీగ' ఓ చిత్రమైన కథ. శ్రీపతికి కలలో కనబడి మాటలతో హోరెత్తించిన జోగినాథం, కథాంతంలో అదే రూపుతో సాక్షాత్కరించడం అబ్సర్డ్ అనిపించినా – 'ఏమో గుర్రం ఎగరావచ్చు' అని కదా!

ఏమయినా "జీవితంలో ఎన్నో సమస్యలెదురవుతాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కొని శాంతియుతంగా పరిష్కరించుకోగలిగినప్పుడే మనిషిలోని మంచితనం

బయటపడుతుంది. తొందరపడి తీసుకున్న విరుద్ధమైన నిర్ణయాలు...” ఎలాంటి పరిస్థితులు తెచ్చి పెడతాయో ‘జీవితమే ఒక నాటకం’ కథలో తెలుస్తుంది.

ఇవన్నీ వివిధ పత్రికలలో ప్రచురితమై ఈ సరికే పాఠకులను చదివించిన కథలు. రావిపల్లి నారాయణరావు గారి ‘అభయం’ కథాకల్పవల్లిగా – ఇలా రూపుదాల్చడం ఆనందమూ, అభినందనీయమూ. ‘సంస్కార కథాకల్పవల్లి రావిపల్లి’ అని ఈ కథలు చదివాక పాఠకులు అనుకోకుండా ఉండరు. విషాద బీభత్సాలు కాక, మంచినీ, మానవత్వాన్నీ, సమాజ సంస్కారాన్నీ పెంచి పోషించే ఇలాంటి కథలకు ఆదరణ ‘అభయం’ కాగలిగితే, అంతకంటే కావలసిందేముంది! రచనా, రచయిత కూడా ధన్యులు.

*3 జనవరి 2011*




# కథాసుధ

## సాగరమథనం (కథల సంపుటి) – గంటి భానుమతి

"I think the best stories always end up being about the people rather than event, which is to say character-driven".. - ***Stephen King***

ఒక సంఘటన గానీ, కొన్ని సన్నివేశాలు గానీ, కథ కావచ్చు. కానీ అంతకన్న కథకు ప్రధానమైనది– అది కలిగించే 'అనుభవం'. ఒక కథ చదివాక 'అది మనగురించి మనకెంత తెలుసు' అని ఆలోచింపచేసి, మన జీవితపు ఏదో ఒక పార్శ్వాన్ని బలంగా తాకి, హృదయాన్ని స్పందింపజేసి, జీవనరసానుభవాన్ని ఆర్ద్రంగా అందించగలిగినప్పుడు అది మంచికథ అవుతుంది. మంచికథ వ్యక్తిత్వ వికాసానికి ప్రేరకమయ్యే జీవధాతువు.

అదిగో అలాంటి రసమంచిత మూలకణాలు– గంటి భానుమతిగారి కథల్లో కానవస్తాయి. నేలవిడిచి సాముచేసే ప్రయోజన రాహిత్యమైన ఊకదంపుడు సంవిధానాలు ఆమెకు గిట్టవు. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' అనే జీవనమకరందం అందించడం ఆ కథల లక్ష్యం. అందుకే ఈ కథల్లో ప్రకృతి, పరిసరాలు, సంఘటనలు ఏవయినా– మనుషుల గురించీ, వారి బ్రతుకుల సిసలైన సార్థకత గురించీ ఆరాటపడుతూంటాయి. మానవ సంబంధాలు, నేడు మరీ ముఖ్యంగా పటిష్ఠం కావలసిన ఆత్మీయానుబంధాలు, ప్రకృతితో మమేకమై నేర్చుకోవలసిన పాఠాలు, ఎంతటి ప్రతికూల, అననుకూల పరిస్థితుల్లోనయినా వదులు కోకూడని ఆశావహ దృక్పథం – మనసుకు హత్తుకునేలా కంటికి తాకే అభివ్యక్తి కాంతులు గంటి భానుమతి కథలు.

ఇందులోని ఇరవైరెండు కథలూ మనసు పెట్టి చదివితే పాఠకులను చేరవలసిన చోటికే చేరుస్తాయి. స్ఫూర్తిదాయకమైనవి కొన్ని కాగా, నిజంగా ఒక 'దిక్సూచి'ని చూపగలవి కొన్ని. కొన్ని ఒక్కసారి వెనక్కి వెళ్ళి మనల్ని మనం తరచి చూసుకుని పురోగమించేందుకు సరికొత్త 'పునాదులు' వేయగలవి. 'సంధ్య వెలుగు'కు 'గోరంతదీపం' చాలు! అవతలివారి బాధ్యతని ఆత్మీయంగా జీవితాంతం వహించడానికి సిద్ధపడి తాముగా వొట్టిపోయే 'రాములమ్మ' వంటి స్త్రీ నేడెక్కడ? అనే ఆర్తి సంకలనంలోని తొలికథలోనే కలిగించారు. ఇవాళ 'కెరీరిజం' పెరిగిపోయింది. విజయశిఖరాలు అధిరోహించామనుకుంటున్న కొందరు వనితలు, ఆర్థిక స్వాతంత్ర్యం పేరున, స్వేచ్ఛాజీవితం పేరున సంసారాలను పణంగా పెట్టి సంస్పందనలు లేని అగాధాల నిశ్శబ్దంలో ఎలా కూరుకుపోతున్నారో తెలిపే ఆలోచనాత్మక కథ 'మన గురించి మనకెంత తెలుసు?'. జీవితానికి అర్థం చూస్తున్న కోణం సరైనది కావాలనీ, ఆత్మపరిశీలన చేసుకోగల్గే ఒంటరితనం మంచిదేననీ అనిపిస్తారీ కథలో.

సామాజిక జీవన వికాసం ముఖ్యం. సొంతపిల్లలు, కుటుంబంనుంచే కాదు, గ్రామం, గ్రామంలోని తమ అనుకునే తన జనంనుంచి కూడా బ్రతుకు చరమదశలు అర్థవంతాలని ప్రబోధిస్తారు రచయిత్రి. 'అతను–ఆమె', 'తృప్తి ఎక్కడుంది?', 'సాగరమథనం', 'సంధ్యవెలుగు' వంటి కథలు వ్యష్టినుండి సమష్టివైపు పయనించి జీవించడంలోని గొప్పతనాన్ని, ఆ మానవీయ సంబంధాల ఆవశ్యకతను చాటి చెబుతున్నాయి. "ఏది సత్యం? ఏదసత్యం?' అనే కథ గృహస్థాశ్రమ ఉదాత్తతను, ఉత్తాలతను చాటి చెబుతోంది. "ఇంట్లో వుండి, ఇంట్లో వాళ్ళకి పనులు చేయడం, బాధ్యతలు, ధర్మాలు నిర్వర్తించడమే పెద్ద జ్ఞానం" అన్న వివేకం నిజంగా గొప్పది.

'సాగరమథనం' నిజంగా సమష్టి జీవన ఆవశ్యకతను ప్రకృతి పరంగా కూడా అవలోకించి చూపిన మంచికథ. స్వార్థం విడనాడి ఉమ్మడి సంపదను ఉమ్మడిగా అనుభవించే కలివిడి బ్రతుకులోని అసలు సిసలు కలిమిని మించిన అమృతత్వం లేదని భానుమతిగారు చాటి చెప్పారీ కథలో. వృద్ధాశ్రమాలకి వెళ్ళనవసరం లేకుండా ఒకరి కొకరు తోడుగా, సాయంగా సమష్టి జీవనం సాగించగల మార్గదర్శక సూత్రం అంతర్మథనంతో అందివస్తుందని నిరూపించారు.

'ఆడవాళ్ళు జీనియస్సులు కారా', 'ఆ రాత్రి' అనే రెండు బహుమతి కథలు ఈ సంకలనంలోని భానుమతిగారి విశిష్ట రచనలు. "జీవితం ఓ లెక్కల పుస్తకమా? అన్నీ వేసుకున్న స్టెప్పుల ప్రకారం చేసేసి వెనకనున్న ఆన్సర్ చూసుకోవడానికి! జీవితపు పుస్తకంలో ఎంత జాగ్రత్తగా స్టెప్పులు వేసినా ఒక్కొక్కసారి వెనక పేజీల్లో జవాబులు దొరకవు" అంటూ 'కెరీర్' గురించి ప్రాకులాడే నేటి యువతులు కొందరికి, 'అమ్మతనం'లోని గొప్పదనాన్ని, మాతృత్వపు మహనీయతనూ చాటి చెప్పిన కథ– 'ఆడవాళ్లు జీనియస్సులు కారా!'. ఈ కథలో గంటి భానుమతిగారిలో ఓ భావుక కవయిత్రి కూడా దాగివుందనిపించే కవిత్వపంక్తులున్నాయి. పసిపాప– తల్లికి ఎలా 'జీనియస్' అనేదాన్ని తన్నివేసే, స్పందనానందమో నిజంగా కవితాత్మకంగా చెప్పారు. అలాగే 'ఆ రాత్రి' అనే స్వాతి బహుమతి కథలో– రంగనాథం సాహసోపేత పరోపకారం ఆదర్శవంతంగా చిత్రించారు. అయితే కథ మొదట్లో తన భార్యాకొడుకు యాక్సిడెంట్‌కు గురి అయ్యారని ఆత్రంగా రంగనాథం టాక్సీని మాట్లాడుకున్న స్వామి వృత్తాంతం ఏమైందో పాఠకుల ఊహకే అర్థాంతరంగా వదిలినట్లనిపించింది. అన్ని కథలూ అన్ని విధాలా సమగ్రంగా వుండాలని ఆశించడం సరికాదేమో!

సంపుటిలోని మరో మంచికథ 'పునాదులు'. సంయుక్త పెద్ద తమ్ముడు పెళ్ళికని మరదలికోసం సిల్కుచీరకొని ప్రింట్ వేయించి, కష్టపడి ఎంబ్రాయిడరీ చేసి మరీ కానుకగా ఇస్తుంది. కానీ ఆ మరదలు సునీత ప్రవర్తనవల్ల కుటుంబమే అశాంతిపాలవుతుంది. మరదలికి బహుమతిగా కుట్టిన చీరలో స్నేహంకోరిన హస్తం, ప్రేమను అభిలషించిన హృదయం వున్నాయి. కానీ ఆ చీరను సునీత ఖాతరే చేయదు. అయితే చిన్న తమ్ముడుకు పెళ్ళి కుదిరినప్పుడు చిన్నమరదలు ప్రీతి ఆ చీరనే సంయుక్త సృజనాత్మకతను మెచ్చుతూ స్వంతం చేసుకోవడం మానవ సంబంధాల మధ్య వెలుగు వెన్నెల వెల్లువగా రచయిత్రి మనోజ్ఞంగా రూపుకట్టించారు. 'గోరంతదీపం' మానవ విశ్వాసానికి సంబంధించిన కథ. 'బిలీఫ్ ఈజ్ యువర్ గాడ్' అంటాడు టాల్‌స్టాయ్. ఆశ మనిషిని నడిపిస్తుంది. 'ఫోటో?' కూడా అలా నమ్మకానికి నిదర్శనమైన చెట్టు గురించిన కథ. సముద్రంమీద చేపలు పట్టేందుకు వెళ్ళేవారి జీవితాల భిత్తికపై కూర్చిన 'ఆ చేతులు' సంకలనంలోని చివరి కథ. కూతురు తమ బ్రతుకుల పై రాసిన పుస్తకం చదవడం కోసం అక్షరాలు నేర్చిన నాన్న కనులు చెమరింపజేస్తాడు.

ఇలా గంటి భానుమతిగారి కథలన్నింటిలో మానవీయం వెన్నంటి వుంటుంది. కంటికి చెమరింపునూ, హృదయానికి ఆర్ద్రతనూ కలిగించడం చాలా కథల్లోని మౌలిక లక్షణం. స్త్రీలకు సంబంధించిన ఇతివృత్త కథనాల్లో కూడా అభ్యుదయ దృక్పథం విడవకుండానే, కుటుంబాన్నీ, మనుషులనూ ఏకత్రితం చేసి హృదయదఘ్నంగా, ఉన్నతంగా, ఉదాత్తంగా నిలిచే 'మానవి'ని మలిచి చూపారు రచయిత్రి. ఉత్తమ కథా రచయిత్రిగా తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం అందుకున్న గంటి భానుమతిగారు పాఠకుల మనస్సుల్లో అలా తన స్థానాన్ని పదిలపరుచుకోగలరన్న దానికి సరికొత్త దాఖలా ఈ కథా సంపుటి.

జీవనామృతాన్ని అందించగల 'సాగరమథనం'కు స్వాగతం చెప్పండి. అభివ్యక్తి సామర్థ్యంగల ఈ రచయిత్రి కథాసుధా స్వాదనం చేయండి. '"Good Literature boils down to two things. How interesting is the story you are telling, and how interesting is your telling.

*2015*



# జీవానంద సత్యహేలా కథకుడు

## పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి కథలు

ఆయనలాంటి కథకులు మాత్రమే కాదు మనుషులు కూడా చాలా అరుదు. జీవితాన్ని ఆయన దర్శించినట్లు, దర్శించిన జీవితాన్ని ఆయన చిత్రించినట్లు; దర్శించడం, చిత్రించడం అందరికీ చేతనయ్యే పని కాదు. ఆయనలోని హాస్య ప్రవృత్తి, సంప్రదాయ అనురక్తి, మానవీయ విలువలపట్ల ఆయనకున్న అపారమైన భక్తి ఆయన కథలలో అభివ్యక్తమవడం అందుకే స్పష్టంగా గ్రహించగలం. ఈ కథన ధోరణి వారికి రచనలు ప్రారంభించినదాదిగా ఉన్నదే. ముఖ్యంగా గత శతాబ్ది అరవయ్యవ దశకంలో అంటే రచయితగా మంచి జోష్‌లో వున్నకాలంలో – రాసిన కథలు గమనిస్తే ఆయన జీవితపు విలువలుగా వేటిని స్వీకరించి తన రచనలలోనూ వ్యవహారంలోనూ అనుష్ఠించారో స్పష్టంగా అర్థం అవుతుంది.

ఉదాహరణకి 'దయ ఖరీదు' అన్న కథనే చూడండి – అనాథశిశు శరణాలయం ప్రారంభోత్సవానికి పది రూపాయలు జేబులో వేసుకుని బయలుదేరిన దయానిధి స్టేషన్ దగ్గర రిక్షాదిగుతూ ఆ పర్సు పారేసుకుంటాడు. చావు బతుకుల్లో వున్న తల్లి మందు కోసం డబ్బులేక అలమటిస్తున్న రంగడికి ఆ పర్సుదొరికి ఆ డబ్బుతో మందుకొనుక్కుని పోబోతుంటే దయానిధి పర్సు లాక్కోవడం, కొట్టువాడు మందు లాక్కోవడం, అమ్మని పోగొట్టుకొని రంగడు అనాథగా మిగిలిపోవడం జరుగుతుంది. రోజూ దినపత్రికలమ్మి ఆ కూలి డబ్బులతో బ్రతికే రంగడు అమ్మ చచ్చిపోయినా ఆకలి చచ్చిపోలేదు కనుక యజమాని దయతో తిరిగి పనిలోచేరి పత్రికలమ్ముకుంటుంటే, అదే దయానిధి తాను చేసిన అనాథ శిశుశరణాలయం

ప్రారంభోత్సవ ప్రసంగం వచ్చిందని ఏడు పైసల పత్రికను పది పైసలకు కొని రంగడు చిల్లర ఇవ్వబోతుంటే "అక్కర్లేదులే, అవి నువ్వు తీసుకో" అంటూ వెళ్ళిపోతాడు.

ఆ రోజున పది రూపాయల పర్సుతోబాటు అమ్మ ప్రాణాల్ని కూడా తన దగ్గర్నుంచి బలవంతంగా లాక్కుని పట్టుకుపోయినాయన దయ ఖరీదు ఇవాళ పదినయాపైసలు. అందులో తన వాటా మూడు పైసలు అని అలాగే నిలబడిపోయిన రంగడి చేతుల్లోంచి జారి మట్టిలోకలిసిపోతాయి ఆ మూడు పైసలూనూ. ఈ కథలో పెద్దమనుషుల నైజాన్ని ఎంతవాస్తవికంగా చిత్రించారో మానవీయ అంశను అంతబలంగానూ చెప్పగలిగారు. అన్నిటికన్నా ఆశ్చర్యం కలిగించేది పది రూపాయలకు, పది పైసలకూ నాడున్నవిలువ కూడాను.

జమీందారీ ఫాయిదాలో కనబడే కొన్ని గొప్ప బ్రతుకుల డొల్లతనాన్ని శ్రావణి కథలో వివరించారు. భర్త పోయిన వైదేహి– తన పెద్దకొడుకు పనివాడిని తొలగించడం, గుర్రపు షార్టుని అమ్మివేస్తాననడం, కూతురికి నాసిరకం బట్టలు పెట్టడం, చిన్నవాడి ప్రయాణానికి సెకండ్ క్లాస్ టికెట్ కొనడం గ్రహించి బాధపడుతుంది. వాటికన్నా ముఖ్యంగా ఏటేటా వేదవిజ్ఞానవేత్తలైన ఉర్లాం పండితుల్నీ, ఘనాంతర స్వాధ్యాయ వేత్తల్నీ రప్పించి ఘనంగా వారిని సన్మానిస్తూ దశదిశలు మారుమ్రోగేటట్లు నలభై ఏళ్ళపాటు భర్త అవిచ్ఛిన్నంగా జరిపిస్తూ వచ్చిన 'శ్రావణి'ని కొడుకు జరిపించడని విని పెద్దవాడితో మాటలాడడానికి, పిలిపిస్తుంది. గొప్పలకు పోయి తండ్రి తమను అప్పులపాలుచేసిన విషయం తల్లికి తెలిసిపోయిందేమోనని భయపడిన కొడుకు వాస్తవ పరిస్థితులు ఆమెకేమీ తెలియవని గ్రహించి, తెలియచెప్పడానికి మనస్కరించక 'శ్రావణి'ని నిర్వహించడానికే నిశ్చయిస్తాడు. సంఘంలో పేరుప్రతిష్ఠలకోసం ఒక తరం వ్యక్తులలోని తపన, వారి ఊహలకూ అసలు వాస్తవాలకూమధ్య లంకె కుదర్చడానికి తరువాతివారు పడే ఘర్షణ ఈ కథలో హత్తుకునేలా ఆయన చిత్రించారు.

1971 దీపావళి జ్యోతి ప్రత్యేక సంచికలో వచ్చిన 'దేవుడు ఏమనుకున్నాడో' అనే కథ గౌరి మాధవయ్యకోసం చేసిన త్యాగాలను చిత్రించింది. అతనికి భార్య కాకపోయినా, భార్యపోయాక అతని పిల్లలను సాకిన ఆమె, చివరకు ఆ పిల్లలే తమ పెళ్ళిళ్ళకు ఆమెకి తండ్రితో గల బంధం అవరోధంగా భావించినప్పుడు,

మళ్లీ త్యాగ బుద్ధితో వెళ్ళిపోవడానికి సిద్ధపడుతుంది. అప్పుడు మాధవయ్య తమ అవసరం ఇప్పుడు పిల్లలకులేదనీ, కానీ ఇన్నాళ్లూ తనకోసం త్యాగం చేసిన గౌరికే ఈ వయసులో తన అవసరంవుందనీ, పిల్లలను వదలి తానే గౌరీతో వెళ్లిపోతాడు. ఈ కథలోని మానవీయ స్పర్శ కదిలిస్తుంది. గౌరిని ఒక వారవనితగా కాక ఉదాత్తంగా చిత్రించిన వైఖరి ఔచిత్యంతో భాసిస్తోంది. ఒక రథోత్సవం సందర్భంగా కలిగిన పరిచయంతో మొదలైన కథ – చివరకు గౌరీ మాధవయ్యలు ఇంటినీ, పిల్లలనూ వదలి బయటికొచ్చినప్పుడు అదే రథోత్సవం సన్నివేశంతో ముగించడం కథా శీర్షికకు అనువైన మంచి నిర్వహణం.

పోలాప్రగడ వారిలోని హాస్య, చమత్కారాలు కొందరికి అంతగా తెలియవేమో గానీ వారిలోని ప్రత్యేకత నిజానికి ఆ నైజమే. అయితే ఆ హాస్యంమాటునకూడా వారు మానవీయ విలువలకే పాదులు వేసారు. విజయ పత్రికలోని 'అభిమానవతి' అనే కథలో అభిమానవతిగా ఆయన పేర్కొన్నది ఒక వ్యక్తిని కాదు, ఆయన సైకిల్‌ని. మనుషుల్లో మాదిరిగానే సైకిళ్లలోనూ రకరకాల మనస్తత్వాలుంటాయని తమాషాగా చెబుతారా కథని. ఆ సైకిల్‌ను ఆయన మిత్రబృందం ఆటపట్టించే తీరును మంచి హాస్యంగా వివరించారు. అయితే ఎవరు ఏమన్నా దానిమీద ఆయనకు మమకారమే. అయితే ఒకసారి ఆయనే దానిమీద విసుక్కుంటారు. ఓ రోజు గుడిముందు పెట్టి తాళంవేసి లోనికి వెళ్లి వచ్చేసరికి అది కాస్తా మాయమౌతుంది. అలాంటి ఆ సైకిల్ పోయినందుకు అంతా సంవత్సరాదివంకతో పండుగ చేసుకున్నారనీ, ఆ అభిమానవతి తనకొక్కడికే అర్థంకావడంవల్ల దిగులు పడింది తను మాత్రమేననీ, తనకంటే ఎక్కువ దిగులు పడింది ఎవరైనా వున్నారంటే అది నిత్యం ఆ సైకిల్ రిపేరు చేసే మస్తానే అనీ కథ ముగిస్తారాయన. యజమాని అండ వున్నంతకాలం ఎన్ని అవమానాలనైనా భరించిన అది – కేవలం ఆ రోజు తనుకూడా తిట్టినందుకే అలా తప్పిపోయిందంటా రాయన.

రాజ్యలక్ష్మి గారు నన్ను చదవమని ఇచ్చిన మరో కథ "రాజు+రాంబాబు= నేను?" కానుక సంకలనంలోని ఈ కథ రచనాకాలం ఏదోగానీ, ఇవాళ చదివితే జోకులన్నింటిని ఇంత చక్కగా కథగా మలచగలిగిన ఆయన ప్రతిభకు హేట్సాఫ్ అనిపిస్తుంది. కొలీగ్స్ అవివేకతను, అమాయికతను, వెర్రి వెంగళాయతనాన్ని ఈ కథలో చిత్రించారాయన. వచ్చిన ప్రతి రూపాయి మనియార్డర్కీ ఒక అప్లికేషన్ ఫారం పంపమని వెయ్యి ఫారాలిస్తే, అయిదువందలకే వెయ్యి ఫారాలూ పంపి

ఊరుకున్నాడు రాంబాబు. ఎలా జరిగిందలాగంటే మనియార్డర్ బాపతు రసీదువుందికదాని ఒక ఫారం, అసలు మనియార్డర్ రాగానే ఇంకోఫారం అలాఒకే మనిషికి, పంపిన ఒకే రూపాయికి రెండుఫారాలవంతున పంపించడం జరిగిందన్నమాట! వచ్చిన కవర్లు చింపి, లోపల కాగితాలు బొత్తు పెట్టమంటే లోపల కాగితాల సమేతంగా కవర్లు చింపేసి, మొత్తం కరస్పాండెన్స్ అంతా చింపి పోగులు పెట్టాడు రాజు. గబగబా వస్తూ చెప్పులు తెగిపోయేసరికి వాటిని అలాగే చేతిలో పట్టుకొని ఆఫీసర్ గదిలోకి ఎంటరై తన ఆయాసాన్ని ఆవేశం అని ఆఫీసర్ గారు కంగారుపడేలా చేసాడు రాంబాబు. తెల్లగడ్డం వున్న పెద్దమనిషి ఆఫీసర్ ని కలిసివెడితే, ఆయన వారి పినతండ్రి అని తెలియక "రవీంద్రనాథ్ ఠాగూర్ మీ బంధువని చెప్పారుకాదేమండీ" అంటాడు రాజు. ప్రక్క ఇంట్లో దొంగతనాలు జరిగాయని మా ఇంట్లో విలువైన వస్తువులేమీ లేవని తలుపుకి చీటీ అంటించి, చీకట్లో అది కనబడుతుందోలేదోనని తలుపుకి లాంతర్ తగిలించారట ఆ మిత్రద్వయం. అర్థరాత్రి తమ ఇంటికి దొంగలు రాలేదని ఆనందపడ్డారుగానీ తెల్లారేసరికి లాంతరుమటుకు మాయమైంది.

హంపీ శిథిలాలు చూడడానికి ఆ మిత్రద్వయంతో ప్రయాణమైన రచయిత అనుభవాలు నవ్వు తెప్పిస్తాయి. రాంబాబు, రాజు పలవరింతలూ, తిరుగు ప్రయాణంలో వాళ్ల హడావుడీ ఇవన్నీ కథను ఆసక్తిగా చదివిస్తాయి. రాంబాబు, రాజులతో కలగలిపి వారి మిత్రుడైనందుకు తననూ జనం ఈక్వేట్ చేసివుందురేమో నన్న ఫీలింగ్‌తో ముగించారు కథని.

ఈ కథలురాసి దశాబ్దాలు గడిచాయి. అయినా సరే ఇప్పుడు చదివినా ఒక కొత్త రచయిత సరికొత్తగా రాసినట్లుగా అనిపిస్తాయి 'శ్రావణి' లోని సంప్రదాయం మీద గౌరవ దృష్టి, 'దయ ఖరీదు' లోని పేదవాని పట్ల ప్రేమ, 'దేవుడు ఏమనుకున్నాడో' లోని మానవీయ భావనలు నేటికీ సమాదరణీయాలు. ఇక ఆయన హాస్యప్రియత్వానికి 'అభిమానవతి', 'రాజు+ రాంబాబు= నేను?' మౌలిక ఉదాహరణలు. ఒక అయిదు కథలు తీసుకుని విశ్లేషించిన మాత్రాననే జీవిత రస మాధుర్యాన్ని ఇంతగా అందిస్తున్న రచయిత ఎంత ప్రతిభామతో, స్నేహశీలో ప్రత్యేకించి చెప్పాలా! ఆయన కథలను నేటి యువతరానికై ఇలా సంకలిస్తూ రాజ్యలక్ష్మి గారు ఆయన ఆశయ దీప్తిని పరివ్యాప్తం చేస్తున్నందుకు మనసా అభినందిస్తున్నాను.

*డిసెంబర్ 2013*




# తెరిచిన కిటికీ

## తమిరిశ జానకి – మినీ కథలు

విస్తృతంగా చెప్పడం ఒక విధంగా సులభం. కానీ క్లుప్తంగా చెప్పడం అంటే దానికి ఎంతో ప్రజ్ఞ కావాలి. అందునా – క్లుప్తతలో గాఢత సాధించడం, సంక్షిప్తంగా వుంటూ ఒక అనంత వైవిధ్యాన్ని దర్శింపచేయగలగడం మామూలైన విషయం కాదు. శ్రీమతి తమిరిశ జానకిగారి మినీ కథలు – జీవనవైవిధ్యాలనే కాదు, మనుషులనూ, వారి మనస్తత్వాలలోని అనేక పార్శ్వాలనూ కళ్ళకు కట్టిస్తూ, మనసు మూలాలను తాకేవిగా వున్నాయి.

"When you read a short story you comeout a little more aware and a little more in live with the world around you" అని జార్జ్ సౌండెర్స్ (ఇంగ్లాండ్ రచయిత, నటుడు) అన్నమాట గుర్తుకొచ్చింది ఇవి చదువుతుంటే. మానవ మనస్తత్వాన్నీ, నైజాన్నీ – గాఢంగా, అందంగా, నాజూకుగా, సున్నితంగా, వ్యంగ్యంగా, చమత్కారంగా అభివ్యక్తం చేసే బహుముఖీన పాత్రలను, సన్నివేశాలను జానకిగారు ఈ కథలలో ఎంతో హృద్యంగా చిత్రించారు. మేం కుర్రాళ్ళుగా వున్నప్పుడు 'విశాలి' వంటి నవలతో ఆకట్టుకున్న రచయిత్రి ఆవిడ. ఆవిడ మినీ కథలకు ఇవాళ ఇలా నన్ను ఓ ముందుమాట రాయమనడం నాకెంతో సంబరంగా వుంది. నా పట్ల వారి గౌరవాదరాలకు, అభిమానానికి సూచిక తప్ప ఇది నిజానికి మరింకేమీ కాదు.

'ఎడ్గార్ ఎలెన్ పో' అనే ప్రముఖ అమెరికన్ రచయిత అన్నట్లుగా – మినీకథ ఒక 'మూడ్'కు దర్పణం. ఆ రచనలోని ప్రతి పదం ఆ 'మూడ్' నిర్మితికి

దోహదపడేదే! అలానే మరో అమెరికన్ కథారచయిత 'లోమూర్' చమత్కారంగా చెప్పినా – మినీకథ ఒక ప్రేమవ్యవహారం లాంటిదయితే, నవల 'వివాహం'ట! మినీకథ ఓ ఫోటో అయితే నవల ఓ 'సినిమా'ట! వివాహం , సినిమా అనే పెద్ద కాన్వాస్ మీద జీవితాలు చూపడానికీ, ఓ ఫోటోలో, ప్రేమ వ్యవహారంలో జీవితం ప్రతిబింబించడానికీ బోలెడు తేడా వుంది! నిజానికి మన తొలి ఆసక్తులు ప్రేమమీదా, ఫోటోమీదే వుంటాయి మరి!

తమిరిశ జానకిగారి పాతిక మినీ కథలు ఇవి. ఈ పాతిక ఫోటోలూ – మానవ జీవనసరళికీ, వివిధ మనఃప్రవృత్తులకీ గ్రంథస్తమైన ఓ 'ఆల్బమ్'. ప్రతి ఫోటో ఒక ఛాయాచిత్రమే! ప్రతి కథా – ఒక బ్రతుకు వాస్తవికతను పాత్రగతంగానో, సంఘటనాగతంగానో, మనోవిశ్లేషణాగతంగానో సందేశించడం విశేషం! విలక్షణ వాక్యనిర్మాణంతో, సలక్షణ పఠనానుకూలతతో మినీలోనే 'మెనీ'గా భాసిల్లే నైజం వీటికుంది. స్త్రీల వేదనా తిమిరసంహార చైతన్య స్ఫూర్తి కూడా తమిరిశ జానకి కలంలో వుంది.

'డబ్బు కంటే తీసిపోయే వస్తువులా ఆడపిల్ల మానప్రాణాలు' అని సంపుటిలోని తొలికథ – 'కనిపించని జాడలు'లోనే రచయిత్రి మానవీయ చైతన్య దృక్పథపు కనిపించే జాడలు పఠితలకు ఇవి ప్రయోజనదాయక కథలన్న స్పృహ కలిగిస్తాయి.

"రేపు విచ్చుకోబోయే మొగ్గని చూసి సంతోషపడుతుంటాను నేను. అందమైన భవిష్యత్తు అది. తప్పకుండా అందమైన భవిష్యత్తును చూస్తానన్న విశ్వాసం నా పెదవుల మీద చిరునవ్వుని చెరగనివ్వదు. మీరు మొగ్గని చూడరు. దానికింద వున్న ముల్లునే చూసి దిగాలుపడుతుంటారు. విచ్చుకోబోయే మొగ్గని విస్మరిస్తే మనస్తాపమే కదా మిగిలేది" అనే వర్ధని పాత్ర – 'ఆత్మస్థైర్యమే ఆ చిరునవ్వు' అన్న కథ ద్వారా, నిజానికి ఎందరో ఆడపిల్లలకు ఆదర్శదాయకంగా నిలిచేదనడంలో సందేహం లేదు. "మనిషికి లేనప్పుడే దేని విలువయినా తెలుస్తుంది. ఎదురుగా ఉన్నప్పుడు అందుబాటులో ఉన్నప్పుడు ఆ విలువ తెలియదు" అని 'తాతగారూ బాగున్నారా?' కథ కమనీయంగా చెబుతూ, చిన్నవయసు వాళ్ళకి చిరాకే అయినా వయసుడిగిన పెద్దవాళ్ళ చిన్న కోరికలు పట్టించుకోవాలని ప్రబోధించడం బాగుంది. 'చెట్ల మీద కాదు నేలమీద మనుషుల్లోనే వున్నాయి దయ్యాలు' అంటూ

శివ – 'ఊరు బాగుపడాలి' కథలో, మృగాడయిన పంతులయ్యను పోలీసులకు పట్టించడం చదివాక, రామాయమ్మ అన్నట్లు – "చెడ్డపని చేసే పిల్లల్ని వెనక్కి లాగాలి కానీ మంచిపని చేసే పిల్లల్ని వెనక్కి లాగితే వాళ్ళు బాగుపడరు. ఊరూ బాగుపడదు". ఆత్మీయతల మధ్య అడ్డుగోడగా నిలిచేవారి పట్ల అప్రమత్తంగా వుండాలని చెప్పే కథ – 'మనసు మూగపోయింది' అనుబంధాల గాఢతను ఆవిష్కరిస్తోంది. వృద్ధాశ్రమంలో కన్నవారిని చేర్పించే అనివార్య పరిస్థితులను అర్థం చేసుకోవచ్చుగానీ, అంతటితో బాధ్యత తీరినట్లు చేతులు దులిపేసుకోక, తరుచు వారితో గడపడం – ఆత్మీయతా విలువలకు ఆనందసంధాయకం అని చెప్పే కథ – 'ఒక చిన్నమాట'. ఆ తరం అయినా ఈ తరం అయినా మనందరిదీ ఒకటే ఆత్మీయతరం. నిజంగా అది మనసుకు పట్టాలి – 'ఎటు పోతోందో ఈ లోకం' కథలో చెల్లెలు సుకన్య జీవితాన్ని అమ్మ నమ్మకానికి అనుగుణంగా సంస్కరించాలన్న పాత్ర భావన సమాదరణీయం.

ప్రతి కథలో జీవనమూల్యాలను తట్టిలేపే ఒక సంస్కారం, ఆశావహ జీవితాలకు కలిగించే ఒక భరోసా తమిరిశ జానకిగారి కథల్లో తొణికిసలాడు తున్నాయి. "మనిషి మారడానికి పదిరోజులో పది నెలలో పది సంవత్సరాల కాలమో పట్టాలని లేదు. పది సెకన్ల సమయమైనా చాలు. నిజం" అని 'పరివర్తన' కథలో అవినీతి వ్యతిరేకతను హృదయదఘ్న సంఘటనాత్మకంగా చెప్పారు రచయిత్రి. ఆ వాక్యంలో కాలక్రమానుగతి అవరోహణ క్రమంలో రాయలేదని విమర్శకుడనచ్చు గానీ, అదో సారస్యమే! 'సంతోషం' కథలోని ఓ ఫోటోలో ముఖాలు కనబడకుండా రంగు రంగుల చీరలు ధరించిన ఓ పదిమంది స్త్రీలు వున్న ఫొటోను చూస్తూ సామ్రాజ్యం – చీర రంగూ, దానిని ధరించిన తీరూ బట్టి ఆయా స్త్రీలను పేర్లతో గుర్తించడం నిజంగా ఓ తమాషాయే! చీర సంగతీ, దాని ధర సంగతీ భార్య మొహంలోని మెరుపు ముందు దిగదుడుపే అనుకోవడం నిజమైన భర్త 'సంతోషం'. – ఇలా అన్ని కథల గురించి చెప్పేయాలన్న 'లౌల్యం' సరికాదు కనుక తమాయించుకుంటున్నాను గానీ, తమిరిశ జానకిగారి ఈ కథలన్నీ ఉటంకింపులకు సమార్హమైన రచనలే.

'ఇది కథ కాదు', 'బతుకుబండి','అమ్మాయిలూ జాగ్రత్త', 'ఆ రోజు వస్తుంది' 'దృష్టికోణం', 'మానవసంబంధాలు' మొదలైన ఈ కథలన్నీ నిజంగా 'చల్లని నీడ'లా – పలు ఆర్తుల నుండి సేదదీర్చి స్ఫూర్తినిచ్చేవే! 'ఆకుపచ్చని అంతిమయాత్ర'

– పచ్చని ప్రకృతిలోనే బతుకు ఆద్యంతాలుండాలనిపింపచేస్తుంది. 'మట్టి' కథ మట్టిమనుషుల హృదయపు ప్రేమాదరాల గట్టిదనాన్ని రూపుకట్టిస్తుంది.

(అహం) 'నేను' అనే కథ రచయిత(త్రు)లకు కూడా ఆత్మావలోకనం చేయించేది –

'పెద్ద విషయాలవనీ, చిన్న విషయాలవనీ మంచిమార్పులు కలగాలి కదా కథలు చదివిన జనాల్లో? చిన్న విషయం అయినా చిన్నదే కదా అని కొట్టి పడెయ్యకుండా మనిషి తనలో మార్పు తెచ్చుకుంటే కథలు రాసినందుకు ఫలితం దక్కినట్టు అవదూ రచయితలకి" అనుకునే రచయితతో –

"మీరు రాతల్లో చూపిస్తారు సమాజసేవ. చాలా గొప్ప మనిషి మీరు. నేను చేతల్లో చూపిస్తాను. మామూలు మనిషిని కదా! మీ ముందు నేనెంత" అని భార్యామణి అన్నప్పుడు –

"ఇది పొగడ్తా? వెక్కిరింతా?"

"పొగడ్తగానే తీసుకుంటాను. నా అహం దెబ్బతినకుండా వుంటుంది" అంటూ కథ ముగించడం వాస్తవికతకు అనుపమానంగా వుంది. రచయిత్రికి జేజేలు!!

ఈ 'మినీ' కథలతో 'మనీ' ప్రపంచపు తరాన్ని 'మనః' ప్రపంచంలోకి తీసుకువెళ్ళి అంతరంగాలను చైతన్య తరంగితం చేసి, మానవసంబంధాల పటిష్టతతో – విలువల జీవనానికి విలువైన సందేశస్ఫూర్తిమంతమైన రచయిత్రిగా శ్రీమతి తమిరిశ జానకిగారు ఈ సంపుటితో మరింతగా పాఠకుల సమాదరాన్ని అందుకోగలరని నా విశ్వాసం.

"Short stories are tiny windows into other worlds and other minds and other dreams. They are journeys you can make to the far side of the universe and still be back in time for dinner"

**-Neil Gaiman**

మినీ కథా ప్రపంచంలో మనల్ని విహరింపచేస్తూ జీవనమాధుర్యాలనూ, మానవీయ విలువలనూ గాఢంగా ప్రోది చేస్తూ, సమాజహిత చింతనాత్మకమైన శ్రీమతి తమిరిశ జానకిగారి ఈ కథాసంపుటికి మీ గుండెకింది చిరునామానివ్వండి.

*19 జనవరి 2016*




# బ్రతుకు బహుమతి కథకుడు

## స్త్రీకారం (కథల సంపుటి) - సింహప్రసాద్

A Good story just like a good sentence does more than one job At Once. That's what literature is: A story that does more than tell a story , a story that manages to reflect in some way the multilayered texture of life itself.

***- Karen Thompson walker***

శ్రీ చెలంకూరి వరాహనరసింహ ప్రసాద్ ఒక కథల కర్మాగారం... 'కర్మాగారం' అంటే యాంత్రికత స్ఫురిస్తుంది అంటే... కాదు... కాదు... కథానికా 'సుక్షేత్ర కర్షకుడు'. తను పండించే కథలపంట పఠితలకు జవాన్ని, జీవాన్నీ అందించే- ధాన్యరాశి. శతత్రయాన్ని చేరబోతున్న కథలు, షష్టిని చేరబోతున్న నవలలు రాశి రీత్యానే కాదు, వాసిరీత్యా - రచయితగా ఆయనను, ముఖ్యంగా పత్రికా పాఠకుల 'హృదయవాసి'గా ఇప్పటికే స్థిరీకరించాయి! విశేషంగా చెప్పుకోదగిన విషయం ఏమిటంటే- కథా, నవలా రచనల పోటీల్లో తాను సాధించినన్ని బహుమతులు అనితరసాధ్యాలనిపించుకున్నాడు. వందలు వేలుగా వచ్చే పోటీ కథలను, న్యాయ నిర్ణేతలు అనేక వడపోతలు చేసి, బహుమతి కథలను ఎంపిక చేస్తారని మనకు తెలుసు. అలా కథల నిగ్గుదేల్చే, నవలల సారం పిండే పోటీల్లో - అర్ధశతం వరకూ కథలకూ, డజనువరకూ నవలలకూ బహుమతులు తాను గెలుచుకున్నాడంటేనే 'సింహప్రసాద్' కలంపాటవం కళ్లకుకడుతుంది.

A good story cannot be devised, it has be distilled

***- Raymond chandler***

అన్నమాట సింహప్రసాద్ కథలకు నప్పుతుంది. కథల నిగ్గు తేల్చినపుడు 'నిల్చే' తన రచనాకౌశలానికి ఒప్పుతుంది. ఈ సరికే 'బోన్సాయ్‌మొక్కలు', 'విశ్వమానవుడు', 'బ్రహ్మానందలహరి', 'సింహప్రసాద్ కథలు', 'జో అచ్యుతా నంద జోజోముకుందా' మొదలయిన కథా సంపుటులు వెలువరించిన - తన సరికొత్త కథా సంకలనం ఈ 'స్త్రీకారం'. 2013-2014 సంవత్సరాల్లో వివిధ పత్రికల్లో తాను రాసిన పదమూడు కథలు, 2011లోని ఓ కథతో కలిపి ఈ పధ్నాలుగు కథల సంకలనం వెలువడుతోంది.

కథకుడు సమకాలీనంగా ఉండడం ఎంత ముఖ్యమో, తను చెప్పిన కథ ద్వారా అంత సార్వకాలికుడు కావడం గణనీయం. సింహప్రసాద్‌లో కథకునిగా ఆ లక్షణం బలీయంగా ఉంది. వర్తమానవ్యవస్థనూ, వ్యవస్థలోని సామాజిక కౌటుంబిక వాస్తవాలనూ అద్భుతంగా చిత్రిస్తూనే- పరిరక్షించుకోవలసిన మానవీయ విలువలను, ఉదాత్తపాత్రల గతంగా విశదపరుస్తాడు. అమానవీయతపై సింహసదృశ గర్జనలా విరుచుకు పడకపోయినా, గొప్ప 'సింహావలోకనం'తో 'సుపథ' గామిగా గోచరిస్తాడు.

The role of the writer is not to say what we can all say. But what we are unable to say - **Anais nin** అన్నది నిరూపించేలా రాస్తాడు ఏ కథరాసినాను.

ఈ కథ లేవీ నేలవిడిచి సాముచేసేవి కావు. కళ్ళముందటి కఠోర సత్యాలను కలంతో చిత్రిస్తూనే- కలకలం రేపేవీ, కళవళపెట్టేవీ, కళ్ళముందు సాక్షాత్కరింప చేస్తూనే- రచయితగా ఒక సామాజిక బాధ్యత నెరవేర్చగల ఆలోచనలను, వివేచనలను, తన కథల ద్వారా పఠిత మనస్సులో మేల్కొలుపుతూ, ఎద పొరల్లోకి ఇంకే రసానుభూతులను తన అనుభవ సృజన నుంచి ఆవిష్కరిస్తాడు సింహప్రసాద్.

మొదటి కథ 'నేల'- చిన్నప్పుడు చదువుకున్న ఆరడుగుల 'నేల' కథకు అద్దిన ఆధునిక విరాడ్రూపం. 'సూర్యాస్తమయంలోగా చుట్టివచ్చిన భూమి అంతా నీదేనంటే'- ఎండలో దురాశతో 'ఇంకాస్త దూరం- ఇంకాస్త దూరం' అంటూ పరుగులు పెట్టిన మనిషి- ఆ పరుగుకు అలసి సొలసి మరణించి, చివరకు

విగతజీవికి అవసరమైన ఆరడుగుల నేల సొంతం చేసుకున్నట్లు.... ఆనాటి కథకు ఈనాటి వ్యవస్థలోని మనిషి కేవలం దురాశపరుడుగా ఉండడమే కాక తన స్వార్థం కోసం అవతలివాడి నేలను కూడా కబళించే తృష్ణతో, ఎంతటి అమానవీయ ఆలోచనలు సైతం చేయగలడో - సింహప్రసాద్ ఈ కథల్లో రత్నాకరరావు పాత్రద్వారా చిత్రించారు. రియల్ ఎస్టేట్ బిల్డర్ అయినా అపార్ట్‌మెంట్ పార్కింగ్ ఏరియాలో శవంగా పడుకోవడమే ముగింపు గల ఈ కథ బహుమతి పొందిన 'నవ్య!' కథే!.

ఇది చదివేక - "నేలంటే భూదేవి- నీదీ నాదీ ఎలా ఆవుద్దయ్యా మన పిచ్చిగానీ" అన్న శర్మదంపతుల్లా జీవితం గడపగలగడంలోని సంతృప్తిని అందుకోగలిగితే ఎంత బాగుంటుంది అనిపింపజేస్తారు.

ప్రజల సామూహిక చైతన్యమే ప్రజాస్వామ్యానికి ప్రాణం. అయితే అందుకోసం, పౌరహక్కుల కోసం ఒక సామాన్య గృహిణి ప్రభుత్వం మీద ధైర్యంగా పోరాడి గెలవగలగడం అసామాన్యమే! 'అనన్య'మైన ఈ చేతనా కథనం 'ప్రతిధ్వని' కథలో ప్రతి బింబితమైంది.

సన్మానాల పేరిట నేడు సాహిత్యలోకంలో జరుగుతున్న 'ఫార్స్'లను చూస్తున్నప్పుడు, శ్రీపాద వంటి ఒక మహావృక్షం ఎంతటి ఔదార్యంతో, 'రామచంద్ర చతుర్వేది' గారికి నీడనివ్వగల సన్మానం చేసి, అజ్ఞాన తిమిర ఛేదనం చేసిందో, తెలిపే కథ 'మహావృక్షం'.

బొరుసు అనుకున్నదే- నాణేనికి 'అసలు విలువ' తెచ్చిన బొమ్మగా ఎలా అభివ్యక్తమయిందో' 'బోడెమ్మ' అనే పెద్ద దిక్కు పాత్ర ద్వారా నిరూపితం చేసే కథ- 'తులసిదళం'. ఈ కథ చదివాక గుండెపొరల్లో చిన్న చెలమ తాలూకు చెమ్మ పాఠకుడికి కళ్ళల్లో ఊరకపోదు.

"పిల్లల్ని పెద్ద చెయ్యడం, ప్రయోజకుల్ని చెయ్యడం, తల్లిదండ్రుల కర్తవ్యం. అది అంతవరకే పరిమితం. వయస్సు మళ్ళినప్పుడు వాళ్ళు తమ చేతికి ఆసరా అవుతారు, అవ్వాలి అని ఆశించడం ఉందే.... అది మాత్రం అత్యాశే! వాళ్ళు ఆదరిస్తే సంతోషమే. లేకపోతే వారిని నిందించడం తగదు.... అంచేత మీరూ మీ బరువు పిల్లల మీద పడకుండా వారి దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి బ్రతకాల్సిన పరిస్థితి దాపురించకుండా ముందే మేల్కోండి" అని ప్రబోధించే కథ- 'రేపటి తండ్రి'.

డిగ్నిటీ ఆఫ్ లేబర్ అనేది లేకుండా, నైరాశ్యపు భావనల్లో కూరుకుపోకుండా, చిన్నపాటి పని అయినా చిత్తశుద్ధితో, నిజాయితీతో ఆనందంగా చేస్తూ వెడితే 'కష్టేఫలి' అనేది ఏ కాలానికయినా వర్తించే సూత్రమేనన్నమాట– సుధీర్ పాత్రద్వారా, సీతారామారావు అనే స్ఫూర్తిప్రదాత పాత్ర తోడుగా, నిరూపితమైన కథ 'నిచ్చెనమెట్లు'.

రాంబాయమ్మకు ఎం.ఓ. తెచ్చిచ్చే పోస్ట్‌మేన్– ఆమె కుటుంబంలోకే కాక, అమెకే తెలియక ఆమెను ఆదుకునే 'దేవుడుండే చోటు'గా ఎలా పరిణమించాడో తెలిపేకథ, ఆర్ద్రతను అభివ్యక్తీకరించే కథ. బినామీ– బ్రతుకు వేదనను తండ్రి ద్వారా– కొడుకుకు జీవిత సూత్రంగా నేర్పిన కథనం 'ఎర్ర అట్టపుస్తకం'.

ఇక సంకలనం పేరిటి 'స్త్రీకారం' కథ– స్త్రీలపై అమానుషాలు పెచ్చరిల్లు తున్న నేటి సమాజంలో–ఓ కీచక మనస్తత్వ భర్తకు, నిర్భయంగా భార్య వేసిన బహిష్కరణ శిక్షను సమాజంలో మార్పుకు శ్రీకారంగా, రచయిత మలచిన తీరు అభినందనీయం! తనకోసం, తన ఆరోగ్యం కోసం, తన క్షేమం కోసం తపించే ఇల్లాలి కనుగప్పి, తన వ్యసనం నిర్వర్తించుకుంటూ వచ్చిన 'అభయ్' లోని పరివర్తనను 'నిన్ను నన్నుగా' కథలో చిత్రించగా, 'ముఖాన్ని వెదుకుతూ' కథలో స్వార్థపరుడైన వ్యక్తికి 'స్నిగ్ధ' హృదయం గల వనిత ఎలా క్షమారాశియై నిలిచిందో చిత్రించారు.

చివరికథ 'యాత్ర' ఒక తాత్త్విక అనుభూతిని రేపుతుంది. బ్రతికున్నవారి మేలు కోరితే తిరిగి మనకేదో ప్రతిఫలం దక్కవచ్చు. కానీ గతించిన వారి కోసం ఆశాదృక్పథంతో ఉత్తమగతుల్ని అర్థించడంలోని భారతీయ ఆత్మానుభూతిని– 'చార్ ధామ్' నేపథ్యంలో, ఆసక్తి కరంగా మలచిన జీవనయాత్రా కథనం– 'యాత్ర'.

అలాగే ఈ సంకలనంలోని మరో రెండు విశిష్ట కథలు– 'మృత్యోర్మా అమృతంగమయ', 'రెడ్‌కార్పెట్'. 'మృత్యోర్మా అమృతంగమయ' అవయవదాన విశిష్టతను ఎంతో ప్రతిభావంతమైన ప్రబోధచలనంగా చిత్రించింది. "మనుష్య ఋణం, సమాజ ఋణం కొంతైనా తీర్చడానికి నా శరీరం సైతం ఉపకరించాలి" అన్న 'ఆశయదీప్తి'ని ప్రకాశింపచేసే కథ ఇది!

రెండు తెలుగు రాష్ట్రాలు, రాజధానుల వైభవ చర్యల వర్తమాన నేపథ్యంలో– 'రెడ్‌కార్పెట్' కథ విదేశీ పెట్టుబడులను, సంస్థలను ఆహ్వానించే రాజకీయం తీరులో ప్రజోపయోగ చర్యల పేర జరిగే తంతులోని అసలుతనాన్నీ, ప్రభుత్వం ఆ విదేశీ సంస్థలకు కేటాయిస్తున్న భూములు అంతర్జాతీయ విపణిలో విదేశీయులకే లాభసాటిగా మారుతూ, ఎలా మనల్ని అవివేకంలోకి, స్వచ్ఛంద బానిసత్వంలోకి నెట్టుతున్నదీ ప్రతిభావంతంగా కథనం చేశారు. నేతలు గ్రహించాల్సిన సత్యం వుంది!

శ్రీ సింహప్రసాద్ కథల్లోని ఈ వైవిధ్యం, జీవన వైరుధ్యం, అందిపుచ్చుకోవలసిన మానవీయ విలువల ప్రబోధసారథ్యం, పఠితలను తప్పనిసరిగా ఆకట్టుకుంటాయి. హాయిగా, అలవోకగా కథ చెప్పడం వల్ల – చదివించే గుణం వీటిల్లో బాగావుంది. ఒక ఆర్ద్రతను రేకెత్తించగల శైలి వుంది. ఉబుసుపోక కథ అంటూ ఏదీ లేకుండా, ఉపయుక్త చేతనను కలిగించడం వీటి విశేషం! మానవ జీవన ఘర్షణలనుంచి సమాజశ్రేయోదాయక విత్తులు జల్లి, సాఫల్య జీవన ఫలాలనందించే కథావ్యవసాయం చేస్తున్న సింహప్రసాద్ గారు మంచి కథల మంచిమనిషి. వారికి అభినందనలు.

A human being is nothing but a story a Skin around it

***- Fred Allen***

'స్త్రీకారం'– కథానికల పట్ల పాఠకులకు మమకారం పెంచే సహృదయ కథాసంపుటి. చదివి ఆనందించండి. బ్రతుకు కథను అవధరించండి.

*20 ఏప్రిల్ 2015*




# విలక్షణ వ్యాస, కథారచనా ప్రావీణ్యం

## ఊహా విహంగాలు - సాహితీ తరంగాలు

## (కథలు-వ్యాసాలు) - శ్రీ శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

**అ**ధ్యయనశీలత ననుసరించి అభివ్యక్తి సామర్థ్యం సమకూడుతుంది. ప్రాచీన సాహిత్యాన్ని 'లోనారసి' అవలోఢనం చేసిన ప్రజ్ఞతో, రసగ్రహణ పారీణుడైన వ్యక్తి ఏ విషయ వివరణం చేసినా - అందులో సారభూతమైన అనుభూతి ఉంటుంది. పాతకొత్తల మేలుకలయిక సాహిత్యానికి భిత్తికను, విశాలతను కూడా సమకూరుస్తుంది. మునుపటి కవులూ, రచయితల్లోని సార్వజనీనత - సార్వకాలికత ఆకళింపుచేసుకుని, ఈ తరం పాఠకులకు - ఆ రచనల్లోని భావరమ్యతను, అనుభూతిని, సాహిత్య మకరందాన్ని, భారతీయ సాహిత్య ఆత్మగత హృదయసంస్కృతిని కమనీయంగా 'సాహితీతరంగాలు'గా అందిస్తున్న శేముషీ సంపన్నుడైన వ్యాసకర్త శ్రీ శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం. పండితులను ఆరాధించే, పండితునిగా ఆరాధింపబడగల గుణసంపన్నులీ పండితారాధ్యుల వారు.

తెలుగు భాషా, సాహిత్యాల సొబగులను, మర్మాలను ఎరిగిన నేర్పరి పార్వతీశంగారు. ఆకాశవాణిలో శ్రోతలను తన వినూత్న ప్రసంగాలతో అలరించారు. ఏ విషయంమీదనయినా సాధికారికంగానూ, సమయోచితంగానూ, సార్థకంగానూ విశ్లేషించి వివరించి చెప్పగల, రచన చేయగల దక్షత వారిది. ఆయన సాహిత్యోపజీవి. కవిగా, సాహిత్య వ్యాసకర్తగా వారి గురించి తెలుసుగానీ,

ఈ గ్రంథంలోని తొలివిభాగం 'ఊహావిహంగాలు' వీక్షించినప్పుడు కథకునిగా ఎంత ప్రతిభామతో తెలిసి అబ్బురపడ్డాను. హృద్యమైన పద్యంరాయగల పార్వతీశంగారు సాహిత్యవ్యాసాన్నేకాదు, కథారచనలో కూడా చూపిన విన్నాణాన్ని దర్శించినపుడు అసలు ఇలా వచనరచనా వైభవాన్ని వెలార్చగలవారీనాడు కరువైపోతున్నారు కదా అనీ అనిపించింది.

'ఊహావిహంగాలు- సాహితీతరంగాలు'గా తమ కథలను, వ్యాసాలను ఇలా సంపుటీకరిస్తున్నందుకు ముందుగా వారిని అభినందిస్తున్నాను. ఎస్.పి. పార్వతీశం గారిలో చక్కని హాస్యచతురత, చమత్కారవైఖరీ వున్నాయి. వ్యంగ్య వైభవం సంగతి సరేసరి! ఊహవిహంగాలులోని పదహారు రచనల్లో ఇలాంటి కథల కమనీయత కనబడుతుంది. 'శాస్త్రిగారు- ముఖాముఖి' అనే తొలి రచనే తీసుకోండి. నిజానికి తాను చెప్పదలుచుకున్న చమత్కార నిర్వచనాలకు ఒక కథానికా రూపం సంతరించిన తెలివిడి తనకే చెల్లింది. జంధ్యాలశాస్త్రి అనే పాత్ర ముఖతః పార్వతీశంగారు విచిత్ర 'పదార్థ' విజ్ఞానాన్ని ఇందులో అందించారు. వాటిలో కొన్ని క్రోడీకరిస్తే ఈ నిర్వచన నిఘంటువు ఇలా అలరిస్తుంది.

| | |
|---|---|
| త్యాగధనులు = | ఇతరులు త్యాగము చేసిన ధనము కలవారు |
| కర్మయోగి = | ప్రతిపనిని ఇది నా ఖర్మ అనుకుంటూ చేసుకుంటూ పోయేవాడు. |
| జ్ఞానవృద్ధుడు = | 'జ్ఞా' అంటే తెలివి 'న' అంటే లేని ముసలాయన |
| మానవుడు = | మనలేనివాడు మానవుడు (విజ్ఞానశాస్త్రం వేయి వెఱ్ఱి తలలు వేయడం వలన) |
| దానవుడు = | దాపులోని భావి మానవుడు |
| ధరవరలు = | రవరవల ధరలు |
| సంసారం = | సం (Some) అంటే కొంతమాత్రమే సారంగలది |
| మహానసం = | ఇల్లాలు తన మొగుడి సమక్షాన మహా నసపెడుతూ వంట చేసుకుంటూ పోయే పాకశాల (అనగా వంటిల్లు) |
| గృహస్థుడు = | గృహమందు భార్యముందు స్తబ్ధుగా ఉండేవాడు |

కొంగుబంగారం =ఒక స్త్రీ తాను కొంగున కట్టుకున్న ఒక బంగారపు వర్తకపుభర్త

త్రికరణములు = మనో (మనీ= డబ్బు) వాక్కు (నోరుపెట్టుకుబతికే లక్షణం) కాయం (శారీరక బలం చూపించటం- దాష్టీకం)

ధర్మయుద్ధం = ఎవరికి వారు ధర్మం తమ పక్షాననే ఉంది అనుకుంటూ చేసే యుద్ధం.

ఈ అంశాలను చెప్పడానికి ఓ కథను కూర్పు చేసిన నేర్పు పార్వతీశం గారిది. 'కథచెక్కినకథ' అనే కథలో 'మనవంశానికి సాహిత్యం అచ్చిరాలేదని బామ్మ చెప్పినా దానిని అధిగమించి ఎలాగో కథ రాసి 'తిరిగొచ్చినకథ' అని పేరుపెట్టి పంపగా వారం రోజుల్లో కథ తిరిగివచ్చింది. అంతకు ముందు రోజు నుంచే ఆ పత్రిక ప్రచురణ ఆపివేశారట అని ముగించడం చక్కని హాస్యభావనే! 'పర్సనల్ వర్క్' అనే కథ కేవలం ఆ పదం ఓ అమ్మాయి ఫోన్‌లో తన సహోద్యోగి తండ్రితో వినియోగించడం వల్ల ఉత్పన్నమైన పరిణామాన్ని చిత్రించిన కథ. దీని ముగింపును కార్గిల్ ఘటనతో ముడిపెట్టి దేశభక్తిని వెలార్చడం ఓ నేర్పు. 'కల్లోలం' అనేది ఓ లలిత శృంగారకథ. అనుమానపు పొరలు దంపతుల నడుమ విడిపోవడమే తీపికల్లోలం అనిపిస్తారు. 'పిచ్చినాన్న' కథ తనను కొడుకు నిర్లక్ష్యం చేసినా అతనిని తన కట్టుకథతో ఎ.సి.బి. వలలోంచి రక్షించాలని తాపత్రయపడ్డ తండ్రికథ. ఉద్యోగంలో ఉదాత్తత లక్ష్యంగా పెట్టుకోవాలన్న బోధచేసే ఆర్ద్ర రచన. 'మీలో ఎవరు తెలివీశ్వరుడు' కథ ఒక వ్యంగ్య కథ. కోటి రూపాయలు గెలుచుకున్న వెయ్యి సంవత్సరాల తరువాత చెల్లింపు అనే ప్రామిసరీనోటు పత్రం విజయచిహ్నంగా ప్రదానం చేయడం తమాషా! ఊహావిహంగాలులో చెప్పుకోదగ్గ ఓ ఉదాత్తరచన 'ఆఖరికి'. నీల్‌గ్రాంట్ వ్రాసిన 'ది లాస్ట్ వార్' అనే ఆంగ్ల నాటిక ఆధారంగా చేసిన ఈ రచనలో మానవుడనే వాడు పూర్తిగా మాయమైపోయి కేవలం అడవిలో జంతుజాలం, క్రిమికీటకాలు మాత్రమే మిగిలిన ప్రపంచాన్ని కనుల ముందుంచే రచన. ఈ కథ- మానవుడు తనను తాను సరిదిద్దుకోవడానికి నిజానికి ఉపయుక్తమయ్యే సందేశధారను అందించేది.

ఇలా ఊహావిహంగాలు లోని పార్వతీశం గారి కథలు హాస్య చమత్కారాలతో బాటు, మానవీయ విలువలను ప్రోది చేసే రచనలుగా భాసిస్తున్నాయి.

ఇక 'సాహితీతరంగాలు' లోని పద్దెనిమిది వ్యాసాలూ దేనికదే కమనీయంగా, రమణీయంగా పఠితలను అలరించేవి. 'క్రమకవితలు' పేర రాసిన పది వ్యాసాలలో పోతన గురించి, జాన్ కీట్స్- కాళిదాసుల రమ్యత గురించి, మరీ ముఖ్యంగా తనకెంతో ప్రియమైన కరుణశ్రీ కవితామకరందం గురించి వివరించిన తీరు రసమంచితంగా వుంది. వీరేశ్వరశర్మ గారి గురించి, దివాకర్ల వేంకటావధాని గారి గురించి రాసిన వ్యాసాలు విలక్షణమైనవి. వాగ్మివతంసులుగా, వక్తగా పేరుగాంచిన దివాకర్ల వారిని క్రమ కవితా మూర్తిగా రూపుకట్టించిన మంచి వ్యాసం ఇది. రాజ సందర్శనం, మధువనం, కవిపరాజయం, త్రింశతి అనే దివాకర్ల వారి నాలుగు ప్రసిద్ధ పద్యకృతులను పార్వతీశంగారు 'సాహితీ సంస్కార దివ్యధుని దివాకర్ల వేంకటావధాని' అనే ఈ వ్యాసంలో అద్భుతంగా విశదపరిచారు. తన కవిత్వం నన్నయ్య రచనా ఫణితిలో వుంటుందని దివాకర్లవారు స్వయంగా సంభావించేవారు. అవధానిగా దివాకర్ల ప్రతిభను, వారి భువన విజయ రూపక వైభవాన్ని పార్వతీశంగారు వివరించారు. అలాగే కీ.శే. మల్లంపల్లి వీరేశ్వరశర్మ గారి ఋషి చరిత్ర కావ్యం గురించి విశ్వనాథ వారికి ఆయన నీరాజనాలు పట్టిన తీరును భావచమత్కార సౌందర్య గాంభీర్య సంభరితంగా అందించారు. 'సముదాత్త సంస్కృతి', 'సద్రూపభావన' పేర రెండు రెండు వ్యాసాలందించారు. సద్రూపభావనలో 'ఓంకార సంకేతమే వినాయక స్వరూపం' అనే రచన విశిష్టమైనది.

'సాహిత్యము- సద్భాషణం' అనే విభాగంలో అందించిన నాలుగు వ్యాసాలలో సాహిత్యం సార్వజనీనం కాదా? సంఘర్షణ ప్రేరణకేనా సాహిత్య విమర్శ అని చర్చించిన వైఖరి సముదాత్తంగా వుంది. నేడు కులవృత్తుల వ్యవస్థ, ఆధిక్యభావ అవస్థలు లేవనీ, కానీ వాటిని ఉన్నట్లుగా, అవి సాహిత్యాన్నీ, సమాజాన్ని ముంచేస్తున్నట్లుగా ఊదరగొట్టేలా కులసంఘర్షణలను, స్త్రీపురుష విద్వేషాలను రెచ్చగొట్టడమే ప్రధానవిధిగా సాహిత్యవిమర్శ వెలువడుతూండడం శ్రేయస్కరం కాదనీ నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

భాషపట్ల సాధికారిత, అభినివేశం వున్న వారిగా పార్వతీశంగారు రాసిన 'అలవాట్లుగా మారుతున్న పొరపాట్లు' 'అక్షర దహనాలు,' 'పలకటాల పలుగుపోట్లు' అనే రెండు వ్యాసాలలో చెప్పిన అంశాలు పత్రికలలో పనిచేసేవారికి, ప్రసారమాధ్యమాల్లోనూ ముఖ్యంగా టీవీ ఛానల్స్‌లో పనిచేసే యాంకర్లు వంటివారికీ ఎంతో ఉపయుక్తమైన వ్యాసాలు. నిజానికి ఈ రెండు వ్యాసాలూ భాషా బోధకులకూ, శిక్షణాతరగతుల నిర్వాహకులకూ ఔదలద్చాలదగిన మార్గదర్శక వ్యాసాలు.

నిజానికి సాహిత్య తరంగాలలోని వ్యాసాల గురించి ఎంతగానో ఉదాహరించి వివరించాలన్న తపన పరిహరించుకుంటున్న కారణం వాటిని చదివి పాఠకులు ఎవరికి వారు ఆ అనుభూతి రమ్యతను, రసోల్లాసాన్నీ స్వయంగా అందుకుని ఆనందించగలరనే విశ్వాసమే. నా పట్ల గౌరవాదరాలతో ఈ 'మున్నుడి' పలికించిన పార్వతీశంగారికి మనసా శుభాభినందనలు.

*15 ఆగస్టు 2018*




# చిత్తం పాఠక హృదయం మీదా 'దృష్టి' కథారచన మీదా

## 'దృష్టి' (కథాసంపుటి) – ఎస్వీ కృష్ణజయంతి

"కథలూ– కాకరకాయలూ" అని మనకో మాట ఉంది.

'కథ' అంటే కల్పన అనుకుంటాం గానీ, ఆ కాల్పనికతకు ఆధారభూతమైన ఓ నిజం ఉంటుంది. అది– రాసే వారి స్వానుభవంలోనిదే కావాలన్న నియమం ఏదీ లేదు. చుట్టూవున్న వ్యక్తుల నుంచో, పరిసరాల నుంచో అంటే మొత్తానికి సమాజం నుంచి పరిగ్రహించే అంశమే అయివుంటుంది. అయితే "అంతా నిజమే చెబుతాను – అబద్ధం చెప్పను" అని గీత మీద ఒట్టేసి చెప్పడానికి– ఇదేమీ కోర్టు బోనుకెక్కిన ముద్దాయి వ్యవహారం కాదు. నిజాన్ని కాల్పనికతతో జోడించి కమనీయమైన కథ చేయడం ముద్దు అయిన వ్యవహారం. 'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నట్లు కథ– రాసిన కథకుడికి ముద్దు అయితే సరిపోదు. అది పాఠకులకు నచ్చాలి. వాళ్ళ మనసుపై 'ముద్దుర' వేయాలి.

ఇంతకీ కాకరకాయ మాట ఏమిటంటారా! నిజం ఎలా చేదుగా వుంటుందో కాకరకాయా అలా చేదుగా వుంటుంది. ఓ చేదునిజాన్ని యథాతథంగా స్వీకరిస్తే అది వార్తయో, అనుభవమో అవుతుందిగానీ కథయో, అనుభూతియో కాలేదు. కాకరకాయను కాకరకాయగా నేరుగా స్వీకరించడం కష్టం. చాలామందికి కాకరకాయ కూర ఇష్టం వుండదు. కానీ, విన్నాణంగల గృహిణి కాకరకాయలోని చేదు తెలియకుండా లొట్టలు వేసుకుంటూ తినేలాగా, జిహ్వాకు సైతం రుచిమంతంగా– కాకరకాయ కూరను ఎలా చేయగలదో, ఒక జీవన వాస్తవాన్ని కథగా కమనీయంగా మలచడం కూడా అలాంటిదే.

నిజానికి కాకరకాయ ఒంటికి మంచిది. దేహ ఆరోగ్యానికి అవసరం. అది చేదుగలకాయే మౌలికంగా. కాకరకాయ అనగానే ఆ చేదు స్ఫురించి 'వద్దు' అనేసే వారుంటారు పిల్లల్లోనూ, పెద్దల్లోనూ కూడా. ఎలాగూ కమ్మని కాకరకాయ కూర తినడం కష్టమనే కాబోలు అది ఇష్టమేగానీ ఇష్టమైనది కాశీలో వదిలివచ్చేయాలంటారని 'అదివదిలేశాం' అని చెప్పి తెలివిగా తప్పించుకుంటుంటారు కొందరు.

కథల విషయమూ అంతే. కొందరికి కథలు నచ్చవు. నచ్చవంటే నచ్చవని కాదు. అందులోని నిష్ఠుర సత్యాలను స్ఫురించాక తట్టుకోలేరు కొందరు. అందుకే దాదాపు కథకులందరికీ అనుభవంలోని విషయమే. వారొక కథ రాస్తే ఇంట్లో స్వజనంలోని సభ్యులో, బంధువుల్లోనో, మిత్రుల్లోనో ఎవరో ఒకరు అది తమ కథే రాసారని గింజుకునేవారో, గుమ్మడికాయల దొంగంటే భుజాలు తడుముకునేవారో, 'నామీద ఎందుకు రాసావ్?' అని నిలదీసేవారో తారసపడుతూనే వుంటారు. లేదా ఆ కథాంశాన్ని కథకునికే ఆపాదించి వారిని విజిగీషతోనో, అనుమానంతోనో చూసేవారుంటారు.

అంచేత కాకరకాయ వండడం ఎంత నేర్పరితనమో ఒక కథ వండి పాఠకులకు వడ్డించడం, ప్రేమగా తినిపించి రసాస్వాదనాతత్పరులను చేయడం అంత నేర్పరితనం. ఒకప్పుడు నలభీమపాకాలనేవారు, అద్భుతమైన వంట అన్నపూర్ణమ్మ తల్లి వ్యవహారం అనుకునేవారు. ఇప్పుడు రోజులు మారాయి. హోటళ్ళు పెరగడమే కాదు. కాలనీల్లోనే కాదు, అంతటా– గల్లిగల్లీకీ కర్రీపాయింట్స్ వచ్చేశాయి. హాట్ చిప్స్‌లో కాకరకాయ చిప్స్‌కీ డిమాండ్ పెరిగింది.

ఇవాళ కథకులు కూడా చాలామంది వున్నారు. దిన, వార, పక్ష, మాసపత్రికల్లో కథలు లేకుండా దాదాపు ఏ పత్రికా రావడం లేదనే చెప్పాలి. అయితే కర్రీపాయింట్స్ కమర్షియల్ అయినట్లుగా, కథ పూర్తిగా కమర్షియల్ అయిందా అంటే చెప్పలేం గానీ, పత్రికలు పోటీలు అంటూ నిర్వహిస్తే అది ప్రధానంగా ఎక్కువశాతం కథాప్రక్రియకే అయివుంటాయి. నవలల పోటీలు, కవితల పోటీలు వంటివి కథల పోటీల తర్వాతి స్థానంలోనే వుంటాయి విరళత్వంలో. ఒక పప్పో, కూరో, పులుసో, చికెనో, మటనో... వంటకం అదే! కానీ వండేవారిని బట్టి, అవి రుచివంతమై, ఎందరి నాల్కలకో రుచించి, కడుపునిండా తిన్న అనుభూతితో, హృదయానందం కలిగించినట్లుగానే ఇతివృత్తం

ఒక్కోసారి కొత్తది కాకపోయినా, చుట్టూ మనుషుల్లో సమాజంలో చూస్తున్న అంశాలే అయినా వాటిని రచయితలు కథలుగా మలచి చెప్పడంలో ఆ కథలు హృదయానికి దగ్గరై రసానందాన్ని అందిస్తాయి.

అన్నీ గొప్పకథలు కాకపోవచ్చు, చిరకాలం ప్రభావం వేసి గుర్తుండిపోయేవి కాకపోవచ్చు, మనల్ని వెంటాడే కథలు కాకపోవచ్చు. కానీ ఒక కథ చదవగానే మంచి భోజనం చేసినట్లుగా తృప్తినివ్వాలి. భోజనంలో పదార్థాలన్నీ గొప్పగా వుండవు. ఒకటేదో బాగా నచ్చుతుంది. కావాలని అదే మారు వడ్డించుకుని తృప్తిగా భోంచేసిన అనుభూతి పొందవచ్చు.

అలాగే కథలోని ఇతివృత్తం, శీలం, పాత్రలూ, వర్ణనలూ, సంభాషణలు, ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు ఇలా అనీ అద్భుతంగా అమరకపోయినా ఓ కథ మనకు ఎందుకో నచ్చుతుంది. కొన్ని కథలు మనకు నచ్చవు. అంటే ఏమిటన్నమాట? వండిన పదార్థం రుచికరమైనదే అయినా అది భోంచేసేవాడి మానసిక స్థితిపైన, సమయం పైనా, అరుచి లేని ఆరోగ్యస్థితి పైనా కూడా ఆధారపడివుంటుంది. 'ఆకొన్న కూడె అమృతము' అని ఊరికే అనలేదు మనవారు. కడుపు నిండిన వాడికి పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించినా లాభం లేదు. ఒక స్థితిలో మామూలు పచ్చడి మెతుకులే అమోఘంగా వుంటాయి. అయితే వండడంలోనే కాదు– వడ్డించడంలోనూ, కొసరి కొసరి తినిపించడంలోనూ కూడా ఎలాగైతే భోజనం విలువ పెరుగుతుందో అలాగే కథాప్రక్రియ కూడాను.

ముందు వంట చక్కగా చేయడం మీద గృహిణి దృష్టి పెట్టి, వండినదాన్ని ప్రేమానురాగాలతో భర్తకూ, పిల్లలకూ, అలాగే ఇంటికి వచ్చిన అతిథులకూ వడ్డించి, తినేలా చేయడానికి ప్రత్యేకంగా దృష్టిపెట్టడంలోనే ఆ ఇల్లాలి ప్రతిభ, ప్రావీణ్యం, పదుగురి ప్రశంసలూ నేటికీ భారతీయ జీవన విధానంలో ఎలా దాగివున్నాయో– ఎన్ని హోటళ్లూ, కర్రీపాయింట్లూ, విందులు, వినోదాలూ వున్నా 'ఇంటి తిండి'కి ఎలా మొహంవాచిపోవడమూ, ఎంత ప్రాధాన్యమూ ఇప్పటికీ నిలిచివున్నాయో ఎవరికి వారికి ఎదమీద చెయ్యి వేసుకుంటే ఎఱుకలోని విషయమే. రుచికీ, ఆరోగ్యానికీ కూడా ఇంటిభోజనం తర్వాతే ఏదయినా, ఎప్పుడయినా.

వైష్ణవంలో 'సాహిత్యం' అనే మాట భుజించే పదార్థాలతో సంబంధం కలిగినదే. 'సహితస్య భావమ్ సాహిత్యం' అన్నారు. అంటే అందరికీ హితం

కలిగించేది సాహిత్యం. సాహిత్యంలోని ఏ ప్రక్రియకైనా ఇది వర్తిస్తుంది. మరీ ముఖ్యంగా కథలకు. పిల్లలకు కథలు చెప్పడం నుండే పెద్దలకూ, పిల్లలకూ మధ్య మానవీయ సంబంధాల వారధి నిర్మితమౌతూ వచ్చిన కుటుంబజీవన వ్యవస్థ మనది. కథ చివర ఓ నీతి అనివార్యంగా వుండేది. ప్రతి కథా చివరకు పవిత్రమైన కంచికే చేరేది. నీతి చెబుతున్నాం అంటేనే– సమాజంలో అనైతికత, అధర్మం, అవినీతి అన్నీ వున్నాయి కనుకనే వాటన్నింటినీ వివరించినా, అధిగమించి చివరకు జీవన వికాస సూత్రంగా నీతిని అందుకోమనేది కథాసారాంశం. జీవన సారాంశం.

అంచేత కథ అంటే జీవితమే. సమగ్ర జీవితం కాకపోవచ్చు. అణువూ అణువూ కలిస్తేనే సమగ్రత. ఏ అణువుకు ఆ అణువు దాని పరిసీమిత శక్తి మేరకు మళ్లీ సమగ్రమైనదాని క్రిందనే జమ. అంచేతే కథలు అనేకం వుంటాయి. మానవ జీవితం అనేది ఒకటిగానే అనిపించే మాట. కానీ వైవిధ్యాలూ, వైరుధ్యాలూ అనేకం. అందుకే మనిషిలో, వ్యవస్థలో ఎంత వైవిధ్యం, ఎంత వైరుధ్యం వుందో కథల్లోనూ అంత విస్తృతి వుంది, వైశాల్యం వుంది, లోతు వుంది, గంభీరతా వుంది.

కృష్ణజయంతి గృహిణి. భర్తనూ, పిల్లలను చూసుకుంటూనే కథలు రాస్తోంది. భర్తమీద వున్నట్లుగా కథల మీదా ఆమెకు ప్రేమ, గౌరవాదరాలూ వున్నాయి. పిల్లల మీద వున్నట్లుగానే– కథల మీదా అనురాగం, శ్రద్ధా వున్నాయి. అందువల్లే ఆమె కథలు ఆమె కోణంలోంచి చూసి అభినందించదగినవిగా వుంటాయి. ఈ కథలు రాయడంలో ఆమె దృష్టి ముందుగా గ్రహించగలిగితే ఆమె నిజాయితీనీ, విశ్వాసాన్నీ, శ్రద్ధనూ అభినందించకుండా వుండలేరు పాఠకులు. స్వతహాగా మితభాషి. కానీ, ఆమె కథ బోలెడు మాటాడుతుంది. ఆమె సౌజన్యశీలి. ఆమె కథ అవసరమయితే తిరుగుబాటు చైతన్యాన్నీ చెంగలించగలదు. ఆమె నిగర్వి. కానీ ఆమె కథ రచనాసామర్థ్యంతో కథానికా ప్రపంచంలో గర్వంగా తలెత్తుకు కనబడగలుతుంది. అందువల్లే ఈ సంపుటిలోని కథలు అనేక పోటీల్లో నిలబడి బహుమతులు గెలుచుకున్నవి. సామాజిక అంశాలు, మానవీయ అంశాలు, హాస్యం, వ్యంగ్యం... ఇలా ఏది ఎంచుకుని కథ రాసినా కృష్ణజయంతి ఆ కథానిర్మాణ

క్రమంలో చూపిన శ్రద్ధ, కథ చెప్పిన తీరు పాఠకులకు నచ్చుతుంది. భర్తను తన కనుగుణంగా మార్చుకోవడానికి, అతని నిర్లక్ష్యాన్ని సంస్కరించడానికి పరాయి పురుషునితో నాటకం ఆడే '(అ)నైతికం' వంటి కథ అచ్చెరువు కలిగిస్తుంది కూడా. కానీ, కథాసంకల్ప బలం ముందు కాకరకాయ చేదుని కమనీయ శాకం చేసిన ధోరణే మరి!

సంకలనం పేరిటి 'దృష్టి' కథ నిజంగా ఒక మంచికథ. అనాకారిత్వం అందునా చర్మవ్యాధి గతమైనది – శరీరానికి గానీ, మనసుకు అంటనంతకాలం అంధత్వంలో కూడా కోటివెలుగుల మానవజీవన ప్రకాశం భాసిస్తుందని నిరూపించే కథ అది. కృష్ణజయంతి కథల్లో ప్రముఖంగా చెప్పదగిన మంచికథ.

కలంస్నేహాన్ని ప్రేమాయణంగా మార్చుకుని పెళ్లికి ముందే ఒకసారి తనకు కాబోయే భర్తను కలిసి మాట్లాడాలని అతగానికి ఉత్తరం రాసి స్నేహితురాలి తోడుగా అన్నవరం ప్రయాణం పెట్టుకున్న ఓ అన్నులమిన్న అతగాడు రాకపోయేసరికి ఖిన్నురాలై పెళ్ళయ్యాక మొదటి రాత్రి అతన్ని నిష్ఠురమాడి ఉత్తరం రాసినా రాకపోయినందుకు శిక్షగా ప్రతినెలా లేఖ రాసిన ఆ రెండో శనివారాన్ని మౌనవ్రతంలో గడుపుతుంది. అతనికి ఉత్తరం అందలేదన్నది అబద్ధం కాదని యాభైసంవత్సరాల తర్వాత భర్త శ్రాద్ధకర్మ రోజు, అదీ... రెండో శనివారం నాడే తిరిగివచ్చిన అలనాటి ఉత్తరం తేటతెల్లం చేస్తుంది.

'కారణజన్ములు' అనేది లాయర్ల మీద సంధించిన వ్యంగ్యం.

విదేశాలకి వెళ్లడమే గొప్ప అనీ, అక్కడవున్న తమ కొడుకులు, కూతుళ్ళు, బంధువుల గురించి గొప్పగా చెప్పుకుంటూ విదేశాల్లో సెటిలవ్వడమే జీవిత ధ్యేయంగా యువతలో బీజం నాటేది తల్లిదండ్రులేననీ, డాలర్ల మోజు పిల్లలకు కాదు, వాళ్ళు అలా సంపాదించాలని తల్లితండ్రులకే ఉండి ఆ దిశగా నిర్బంధ వలస చేయిస్తున్నారనీ నిష్ఠుర నిజాన్ని వివరించిన కథ 'వలస'.

ఇలా ప్రతి కథనూ సంపుటి నుండి ఉదాహరించుకుంటూ, కృష్ణజయంతి కథన నైపుణ్యాన్ని పాఠకులు అందుకోకుండా చేయడం సరికాదు కాబట్టి, ఈ

కథలు చదివి ప్రతి పాఠకుడూ 'తనదైన అనుభూతి తనుగా' అందుకోవడానికి– మీకూ, కథలకూ మధ్య ఈ 'ముందుమాట'ల అడ్డు ఇక్కడ తొలగించేస్తున్నాను.

ఇప్పుడు కృష్ణజయంతి వర్ధమాన రచయిత్రి అయితే కావచ్చుగానీ, ఆ శ్రద్ధాసక్తులు, కథలు రాయడంపై ఆమె ప్రసరించే దృష్టి – కాలం కలసివస్తే ఎస్వీని 'యశస్వి కృష్ణజయంతి'గా మలచకపోవు.

"జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః" కథారచనా సుకృతితో జయంతి పాఠకులను రససిద్ధులను చేయాలని ఆకాంక్ష...

*జనవరి, 2008*




# 'పాణి'నీయ భావాగ్ని

## నిప్పు (నవల) - కాకాని చక్రపాణి

శ్రీ కాకాని చక్రపాణి గారూ నేనూ సహ 'కాలమిస్టు'లం. ఆంధ్రభూమి దినపత్రికలో 1998 అక్టోబర్ 30 నుండి ఆయన 'కథలూ- కాకరకాయలూ' శీర్షికలో కాలమ్ ప్రారంభించారు. 1998 నవంబర్ 16 నుండి ఆంధ్రభూమి దినపత్రికలో సం.సా.రాలు (సంస్కృతి- సాహిత్యం- రాజకీయాలు) శీర్షికతో నా 'కాలమ్' మొదలయ్యింది. చిన్న కథలు- గల్పికలను తలపించేట్టు ఆయన కాలమ్ నిర్వహించడం నాకు తెలుసు. ఒక ....కాలమ్‌గా 'సంసారాలు' కాలమ్, మధ్యలో కొంత విరామం తీసుకున్నా, ఇప్పటికీ శుక్రవారాల్లో ఆ పత్రిక ఎడిట్‌పేజీలో వస్తూనే వుంది. కథలూ- నవలలూ పాఠకజన రంజకంగా పండించగల చక్రపాణి గారు నేను చదివిన ఆంధ్రసారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేయడం, నా సీనియర్ మిత్రుడు డి. చంద్రశేఖర రెడ్డికి సహోద్యోగి కావడం కూడా, ఆయనపట్ల నా గౌరవానికి, ఇష్టానికీ ఇంకో కారణం.

కాలమిస్టునే అయినా మౌలికంగా 'కవి' గా జీవించడమే నా కిష్టం అయినట్లు, కాకాని చక్రపాణి గారికి- కథా, నవలా రచనే మౌలిక ప్రవృత్తి. అనువాదాలూ... ఎన్నో చేసినా, కాకాని చక్రపాణిగారంటే 'కథకుని'గానే సాహిత్య ప్రపంచం గుర్తించడం నాకు తెలుసు. ఆయన కథలూ, నవలలూ నేనూ చదివాను. ఎమెస్కో ప్రచురణగా వెలువడిన కాకాని చక్రపాణి గారి నవలల్లో నాలుగవ

సంపుటిని ఆవిష్కరణ సభలో నేను ఆవిష్కరించి, 'ది ఘోస్ట్', 'నువ్వు నా కొద్దు' నవలల గురించి మాట్లాడే సదవకాశం కల్పించిందాయనే! ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 31 మార్చి 2001 నుంచి, ఆగస్టు 2001 వరకు పందొమ్మిది వారాలపాటు ధారావాహికగా వెలువడిన 'నిప్పు' నవలను నాకు పంపి 'ముందుమాట' రాయమన్నప్పుడు ఆశ్చర్యపోయాను. నాపట్ల వారికి గల సౌమనస్యం తప్ప మరింకేం 'అర్హత' నాకుంది? ఎలా కాదనగలను! నేను చేసిన ఆలస్యాన్ని కూడా ఆయన మన్నించారు.

* * *

"భశుం– ఇంత కంగాళీ అవకతవక సినిమా నేనెప్పుడూ చూళ్ళేదు" అన్న బాపుగారి కార్టూన్,

***"చాలామంది నీతిమంతులుగా ఉండటం***
***చాలినంత ధైర్యం లేకపోబట్టి***
***అవినీతికి అతి సాహసం కావాలి"*** అన్న

పఠాభి 'పన్‌చాంగమ్' పదం–'నిప్పు' నవల చదవగానే గుర్తుకొచ్చాయి. నిజం నిప్పులాంటిదన్నారు. నిజాలు నిజాలుగా వుండక, నిజాలకు చెదలు పడుతున్నప్పుడు, నిప్పుకీ చెదలు పడతాయనిపిస్తుంది. పాతివ్రత్యానికి నిప్పుని సంకేతించడం ఉంది. శీలానికి అంటగట్టే అధిక ప్రాధాన్యం అనర్థహేతువే!

"Virtue be damned. A virtue that only causes havoc and unhappiness is worth nothing. You can call it virtue if you like. I call it cowardice" అన్న భావనకు ప్రోదిగా విలియం సోమర్‌సెట్ మామ్ రాసిన 'వర్చ్యూ' కథ కలిగించిన ప్రేరణ 'నిప్పు' నవలకు మూలం. అయితే అది ఒక భాగం మాత్రమే. అదే ప్రధాన భాగం అనిపించకుండా మర్రిమాను మర్కటయ్య అనే వ్యాపారస్థుడు సినిమా తియ్యడానికి సమకట్టి, 'బాటసారి' అనే కలంపేరున్న రాజు అనే కథకుడి చేత ఈ రచయిత సమక్షంలో కథ చెప్పించడం నవలలో ఎత్తుగడగా మొదలై సాగుతుంది.

ఈ నవల అంతా ఉత్తమపురుష కథనంలో నడుస్తుంది. కథకుడికుండే సౌలభ్యం ఉత్తమపురుష కథకుండదన్న మాట యథార్థం! నవలలో మామ్ 'వర్చ్యూ'కి

అనుసరణగా సాగే కథలో అందుకే రచయిత పాణి– "సేతు మాధవ్ చెల్లెలి పెళ్లికోసం చేసిన ప్రయత్నం ఎలా విఫలమయిందా అని ఆలోచించ సాగాను. ప్రభు రాసిన ఉత్తరమూ, దివ్య చెప్పిన మాటలూ నాలోని కథకుడి ఊహకు పదునుపెట్టాయి. వాళ్ల పరిచయం, సంబంధం ఎలా ప్రారంభమై, ఎలా కొనసాగి, చివరకు ఎలా లుప్తమైందో ఊహించాను. వివరణలో పొరపాట్లు ఉండచ్చేమో కానీ, ముగింపు అదే అన్నది నా విశ్వాసం. ఆ కథ మీకు చెప్తాను" అంటూ చిత్రించిన సంఘటనలూ, అలాగే తపతి, ప్రభుల విహారయాత్రలు– చార్మినార్ కుతుబ్‌షాహి సమాధులు వగైరా వాళ్ళ సంభాషణ, సాదిక్ అలీకథ అంతా, తపతి చెప్పగా విని మృదుల పాణికి వివరించినట్లుగా నవల సాగుతుంది. నిజానికి ఇదంతా 'మామ్'కు అనుకరణ కాదు. ఇది రచయిత మౌలిక కల్పనే. 'దివ్య' పాత్ర కూడా ఫెమినిజానికీ, విమెన్‌లిబ్‌కీ ప్రతీకగా రచయిత సృష్టించిందే, అందుకే– ప్రభుతో శారీరక సంపర్కం కలిగినా అతనితో వివాహానికి తిరస్కరించి వెళ్లిపోతుంది ఆమె. కానీ తపతి ప్రభుప్రేమలో పడి, వివాహిత అయినందువల్ల భర్త సేతుమాధవ్ నీ అలజడి పాలుచేసి, కాపురం అతలాకుతలం చేసుకుంటుంది.

"అసలామె ప్రభుతో సెక్స్ సంబంధం ఎందుకు పెట్టుకోలేదు. పెట్టుకుంటే సేతుమాధవ్‌కి ఆ విషయమే తెలిసేది కాదు. అందువల్ల ఎవరికీ ఏమాత్రం నష్టం జరిగి ఉండేది కాదు. ఆమె, ప్రభు శిథిలాలు పట్టి తిరక్కుండా, అతను వున్న నెల రోజులూ హాయిగా గడపగలిగి ఉండేవాళ్ళు. ఉపాఖ్యానానికి చక్కటి ముగింపు ఒనగూడిందన్న భావనతో అతను తృప్తిగా డెహరాడూన్ వెళ్ళిపోయివుండేవాడు. ఈ నెలరోజులూ ఇద్దరికీ ఓ అందమైన జ్ఞాపకంగా మిగిలిపోయి ఉండేది. ఆమె కూడా సంతోషంగా సేతుమాధవ్ గూటికి చేరి ఉండేది. మళ్ళీ ఎప్పటిలా ...తన కాపురం తాను చేసుకునేది" అని రచయిత పాణి అన్నప్పుడు– పెదాలు తడుపుకుని మృదుల 'శీలం పోయాక మనిషెందుకు? శీలం విలువ తెలియకుండా మాట్లాడొద్దు?' అంటుంది.

"ఎందుకు తగలబడ్డ శీలం. కష్టాలు, దుఃఖాలు కలిగించే శీలం నువ్వనుకునేంత విలువైంది కాదు. నువ్వు దాన్ని శీలమని పిలుస్తావేమో కానీ, అది పిరికితనం తప్పమరేం కాదు."

"స్వార్థంతో వ్యవహరించే స్త్రీ కంటే నీతితప్పి చరించే ఆడదాన్నే ప్రశంసిస్తాను. జారిణి అయినా ఫర్లేదు, బుద్ధి లేనిది అవకుంటే" అంటాడు రచయిత పాణి.

"నిప్పెక్కడ ఉంది? నిప్పుకు చెదలు పట్టదన్నంత అసత్యమైన నుడికారం మన తెలుగుభాషలో మరొక్కటి లేదు" అని కూడా అభివ్యక్తీకరించేది రచయితే! నిజానికి 'మామ్' కథను అనుసరిస్తూనే, 'దివ్య' పాత్ర కల్పనతో చక్రపాణిగారు– మామ్ భావసామ్య సన్నిహితత్వానికి మెరుగుపెట్టారు.

"మనిషి చేపట్టే పనులన్నీ పైకి కన్పించేంత పరార్థ చింతనతో కూడినవి కావు. ఆ కర్మలకు కార్యకారణ సంబంధాలను వెదకటం కష్టం. ఫలితం ఏదయినా కర్మలకు ప్రేరణ సీదాగా ఉండదు. ఏ పని చేయటానికయినా మూలం స్వార్థం. ఆయా పనులవల్ల కలిగే స్వీయానందం" అన్న మామ్ భావాల సన్నిహిత మనస్కతే 'నిప్పు' నవలకు మూలకందం. 'జీవితమూ+ సినిమా' అనే ముడిని 'నిప్పు' నవలలో వేశారు. స్టోరీడిస్కషన్‌కు సినిమా తీసే మిత్రులతో కూచుంటూ– పౌరాణికమూ, సాంఘికమూ, డిటెక్టివ్, క్రైమ్, సెక్స్, దయ్యాలూ, భూతాలూ ఇలా అన్ని కలిపి సాగే 'బాటసారి' కథ వింటూ, నేటి సినిమా తీరుతెన్నులమీద ఓ విమర్శకు 'పాణి' సాక్షీభూతునిగా ఒకవంకా, ఒక యథార్థ జీవితపు కథనంలో భాగస్వామిగా మరోవంకా 'నిప్పు' నవల సాగింది. ఈ రెండింటి అనుసంధానం చిత్రంగా అనిపించినా, రచయిత సమర్థంగా నడిపారు.

ఒక అబ్సర్డు సినిమా కథ నిర్మాత మఱ్రిమాను మర్కటయ్య, అతని మిత్రుడు గుర్నాథం, నిర్మాత బావమరిది తిరుపాలు, నిర్మాత భార్య మాణిక్యం, సినీరచయిత రాజు (బాటసారి), డైరెక్టర్ వైకుంఠం కూటమిలో రూపుదిద్దుకుంది. "నేను చెప్తున్న కథ గురించి నాకే భయమవుతున్నది. కథలో ఓ థీమ్‌లేదు. ఎలా సాగాలోనన్న ప్రణాళిక లేదు. ఎలా ముగించాలో తెలియదు. తర్వాత కథ ఏం చెప్తానో తెలియదు. అన్ని రకాల కథలూ కలబోసి ఓ అధ్వాన్నపు మిశ్రమం చేయమన్నారు వాళ్ళు" అని నవలలో సినీరచయిత పాత్ర 'బాటసారి' వాపోతాడుగానీ, ఫ్లాపవుతుందనుకున్న అదే చివరకు గొప్ప సక్సెస్‌ఫుల్ సినిమా అవుతుంది. రచయిత పేరెక్కడా మాత్రం వుండదు. ఈ భాగంలో నేటి అన్ని రకాల సినిమాల మాస్ మసాలాలనూ చక్రపాణిగారు గొప్పగా 'కాక్‌టైల్' చేసారు. తెలుగుసినిమా తీరు తెన్నులమీద ఒక రకమైన విమర్శ నిజానికి ఇది. కానీ దాన్ని ఆయన చిత్రించి అందించిన తీరు విలక్షణమై, ఆసక్తికరంగా చదివిస్తుంది.

ఇక మామ్ 'వర్ఛ్యూ' కథలోని జెరాల్డ్ మార్టన్, ఛార్లీ, మార్జరీ, బిల్‌మార్ష్, జానెట్ మార్ష్ పాత్రలను 'నిప్పు' నవలలో వరుసగా కుమారప్రభు, సేతుమాధవ్, తపతి, సదాశివరావు, మృదులలుగా చిత్రించారు. మృదులకు కూడా 'పాణి'

పట్ల ఓ ఆకర్షణ వుందేమో ననిపిస్తుంది నవల చదువుతుంటే. ప్రేమ, ఆకర్షణ, బంధం, శీలం చుట్టూ తిరిగే ఈ కథనంలో మానవీయమైన సాదిక్ అలీ, ఫెమినిస్టు దివ్య పాత్రల కల్పనతో చక్రపాణిగారు 'నిప్పు'కే పుటంపెట్టారు.

డి.ఎన్.ఎ కణవిభజన, పరాన్నజీవులు, సినిమాపాటల సాహిత్యం, చార్మినార్, హైదరాబాద్ నగర చరిత్ర, గోల్కొండ, కుతుబ్‌షాహీ సమాధులు, 'డిఫ్యూజ్డ్ బ్రెయిన్ ఇన్‌జ్యూరీ', ఫెమినిజం, సినిమాల్లో భాష, మాండలికాలు, సాకీ పులి కథనం, బోధిసత్వ నాగార్జునుడు, ఫ్యామిలీపెన్షన్, ఎల్.ఐ.సి. ప్రీమియం, ఆస్తిలో వాటాలు, చిన్న కోనోపీ, కన్సెల్టెన్సీ, మగ ఆడపిల్లల పెంపకం, డోవర్‌బీచ్... ఇలా 'నిప్పు' నవలలో రచయిత – పాత్రల పరంగా వారి నోట అందించే విలువైన ఆసక్తిదాయక సమాచారం, చక్రపాణిగారి వివిధ విషయాల అధ్యయన పాటవాన్నీ, ఆయా సమాచారాలను కథలో పాత్రగతంగా అందించే నేర్పునీ తెలియజేసేవిగా వున్నాయి. సినిమా తీరు తెన్నులను వివరించే అధ్యాయం, 'వర్ఫ్యూ' కథానుసరణ అధ్యాయం ఒకదాని తర్వాత ఒకటిగా నవలలో ప్రసక్తమవుతుంటాయి. ఈ సంవిధానం వల్ల ఛానెల్ మార్చి మార్చి చూసినట్లు పాఠకులకు కొంత రిలీఫ్ కలుగుతుందన్న మాట నిజమే. అయితే ఒక ఆసుపత్రి సీన్ వెనువెంటనే సాదిక్ అలీ వివరించగా తపతి ప్రభులు తెలుసుకున్న ఏ చార్మినార్ చరిత్రో, తపతి నుంచి విన్నట్లుగా మృదుల పాణికి వివరించినట్లుగా పాఠకుడు చదువుకోవడం ఉత్తమ పురుషలో కథనం సాగడం వల్ల ఒనగూడిన పరిణామమే!

ఏమయినా ఇలాంటి నవల రాయడం, రాసి ఒప్పించడం అసాధారణమైన సంగతే. అవిభక్త కవలల్లా రెండు భాగాలు ఒకే నవలగా రాణించడం ప్రయోగ సాఫల్యమే. సినిమానీ జీవితాన్ని కలగలిపి, ఆ జీవితం కూడా విదేశీమూలం నుండి ప్రేరణగా తెలుగుతనంతో నింపి, మనుషుల నైజాలనూ, మానవమనస్తత్వాలనూ సృజనాత్మకంగా విశ్లేషిస్తూ రచించడం నిజంగా రచయిత ప్రజ్ఞ. కాకాని చక్రపాణి గారిని అందుకుగాను మనసా అభినందిస్తున్నాను. సినిమానీ, జీవితాన్నీ ఒకే పాత్రలో వైవిధ్యభరితంగా కలిపి, రుచికరమూ, ఆలోచనల ఆస్వాదనీయమూ చేసినందుకు ఆనందిస్తున్నాను. ఈ నవలా పఠనం మీకూ నచ్చుతుందని ఆకాంక్షిస్తున్నాను.

*13 అక్టోబర్ 2013*




# మల్లెలకో మంచుబొట్టు

## మాట్లాడే మల్లెలు (కవితా సంపుటి) – ఆచార్య తిరుమల

ఉద్రేకాలను అక్షర ద్రావకంగా కాగితపు సీసాల్లో నింపడం కవిత్వం కాదు. స్పందించే హృదయంతో బాటు ఆ అనుకంపను సువ్యక్తపరచుకునే తీరు తెన్నులు, వ్యష్టి నుండి సమష్టికి పయనించే పాదాలు అవసరం. బాధ విశేషం కాదు. బాధకుడు కూడా బాధపడవచ్చు. బాధే ముఖ్యం కదా అని తన బాధనే వెల్లడించడం లోపం. ప్రపంచపు బాధను తన బాధను చేసుకోవడంలో బాధకుడి బాధను వెనకేసుకురావడం లోపం. బాధితుల కంటినీరు తుడవడానికి తాను కేవలం ఉద్రేకపడి పోవటం సరికాదు. ఓదార్చబోయి– భోరుమనేవాడిని, భోరు మంటున్న వాడు ఓదార్చవలసి రావడం లోపం. అందుకే సంయమనం అవసరం. కేవలం అనుభూతుల దయమీద ఆధార పడ్డ మనిషి అయినా బలీయమైన అను భూతుల్లో మునిగి ఆవేశాలను అదుపులో పెట్టుకోలేని కవి అయినా పరిపూర్ణులు కాలేరు.

A man at the mercy of his feelings is immature. And a writer with strong feelings but without control of them is an immature writer

***-H. Coombes***

*'ఇన్‌స్పిరేషన్లో కూడా*
*రేషన్ తలెత్తింది కాబట్టే*
*నేను తలదించుకుని వున్నాను.*
*గొంతు చించుకుని వున్నాను'*

అంటూ పుష్కలమైన అనుభూతి వుండీ, చక్కని కవిత్వం రాస్తూ కూడా కవిగా తన కవితా సంకలనాన్ని విడుదల చేయడానికి సంయమనంతో ఇంత కాలం ఆగిన ఆచార్య తిరుమల ఈనాడు తన మల్లెలను మాట్లాడిస్తున్నాడు. అక్షరాల సిరా తడి ఆరకుండా అచ్చు కెక్కాలని ఆరాటపడే వారెందరో చూపలేని పరిణత లక్షణం ఇది.

ఇవి మాట్లాడే మల్లెలు. ఈ మల్లెలు

***"...నగ్న సమాజం***
***కనులకాంతిని***
***హృదయకవాటాల్ని, ఆశాపాశాల్ని,***
***ఆర్ద్రభావాల్ని, దైనందిన జీవితాన్ని***
***ప్రతిబింబిస్తాయి కవితను ఆమ్రేడించి***
***కాషాయాంబరాన్ని చుంబిస్తాయి." (లే)***

స్వచ్ఛతకు, శుభ్రతకు, సుగంధానికి మల్లెలు ప్రతీకలు. ఎవరయినా సువ్యవస్థకు ఆశించే లక్షణాలివేగా. ఆచార్య తిరుమల మల్లెల్లో అనుభూతివుంది. అది హద్దు మీరిందికాదు. ఆవేశం వుంది. అది గుచ్చుకుంటుంది. మల్లెలన్న పదం వినేసి ప్రణయకవితో, భావకవితో అని పొరబడకూడదు. ఇవి మాట్లాడే మల్లెలు. (ప్ర)గతి కవితలు. అయితే వీటిల్లో ఇంకా కొంత మార్మికత వుంది. 'స్వప్న వాసంతిక' వంటి ఖండికలు పదార్థ విజ్ఞానం లా తోచవచ్చు సామాన్య పాఠకుడికి. కానీ కవి లోతులు ముట్టే చోటులవి. 'నాగబంధం' లో సమాజపు నాణేనికి బొమ్మా బొరుసూ అరటిపండు వొలిచినట్లు చూపుతాడు. అయితే దాన్ని రెండు నాల్కల విషజ్వాలలుగా విలువకట్టి ఆర్పడానికి అశ్రుతర్పణ మవుతానంటాడు. భావనలో నిజాయితీ వున్న వ్యక్తి. ఈ కవి-కలం ప్రధానంగా పాటల గంధి. అందుకే పాఠకుల హృదయాల్లోకి చొచ్చుకుపోవడంలో దానికున్న చేవ చెన్ను మీరింది.

కవి మిత్రుడి గురించి ముఖ్యంగా చెప్పవలసిందొకటుంది. స్వీయ వ్యక్తిత్వం ఆధారంగా విరబూసిన మల్లెతీగ ఇతని సంకలనం. ఎవరి జెండానో ఎగరేస్తున్న వాడు కాదు. నమ్మినా నమ్మకపోయినా గాలివాటు చూసి కలం పోటు వేస్తున్న వాడు కాదు.

నినాదాల నిండు సరస్సులో మునిగి శుష్క ఆవేశం చేతులెత్తితే కవిత్వా నికి రక్షణలేదు. తను వ్రాసింది నమ్మడం, నమ్మింది ఆచరించడం, రచనకు జీవితానికి సాధ్యమైనంత తక్కువ దూరం వుండటం, చాలా అవసరం అనీ, ఆదర్శాలు వ్యక్తి లక్షణాలు కావాలిగానీ, కేవలం కవిత్వానికి ముడిసరుకు కాకూడ దనీ నమ్మినవాడు. కవిత్వాల్లో తప్ప వ్యక్తిత్వాల్లో ఆశయాలు, ఆదర్శాల ఆచర ణలు కనబడని గతాన్నీ, గతం కవుల్నీ భవిష్యత్తుకింకా వారసత్వంగా నిలప నక్కరలేదు. భవిష్యత్తు గతంమీద కాక వర్తమానంమీద నమ్మకం పెట్టుకుంటుంది. అందుకే అంటాడు.

*'గుండె తలుపు తెరు*
*శవం కావాలనకు*
*గతం రావాలనకు.'* అని

***'365 రోజుల దూరంలో***
***నాజాతి***
***చూపుతో సూర్యకిరణాలు***
***త్రాగుతున్న దృశ్యం'*** కనబడిందందుకే తనకి.

*'ఒకని శ్రమశాఖకి పదిమంది*
*తలక్రిందుగా వేలాడుతున్న ప్రకృతి దృశ్యాన్ని'* చూపుతూ
*'కరిగే కండల్ని కంచంలో వడ్డించుకోకు*
*ఎగిరే జెండాతో చొక్కాకుట్టించుకోకు'* అని ప్రబోధిస్తూ
***"నా ముందుతరం భోగిమంటలు***
***ఈ తరం ఆకలి మంటలు కాకూడదని***
***నా ముందుజాతి అడుగులకి***
***నేటి వామనత్వం అడ్డుపడకూడదని"***

*"ఈ నేలను నీడలా వెన్నాడే*
*మూఢ విశ్వాసాల్ని*
*మన ప్రచండ వీక్షణా కిరణంతో*
*ఉరితీద్దాం రా*
*కాంతి వర్షిద్దాం రా"* అని స్వాగతం చెబుతాడు.

లోచనలేని ఆలోచనలతో, దేశానికి పనికిరాని సందేశంతో, గతిలేని ప్రగతి కావాలనే వాళ్ళని నీముందు నిలబెట్టి, నలిగిపోయిన పూలకూర్పు నేర్పుతో వర్ణ క్రమాల అక్షయఅక్షరాల శిక్షగరిపి, ధనిక మర్యాద హద్దులు చెరిపి, పగిలిపోయిన గుండెల విషాన్ని విరిచి, అమృతదృష్టిని అందరికీ విందు చేసే కవి ఈ సంకలన కర్త. బ్రతుకు గోడలకి ఆదర్శాల ఉక్కు మేకులు కొట్టి, సుస్పష్ట న్యాయ చిత్ర పటాలు తగిలిస్తానంటున్న నిఖార్సయిన నిజాయితీని హామీయిస్తున్న కవి. –

ఈ సంకలనమంతటా పరుచుకున్న కవితల మల్లెలు – వెలుగును, వెన్నెలను, వేడిని, స్వచ్ఛతను, సౌకుమార్యాన్ని, సందేశాన్ని సమకూర్చుకుని మిమ్మల్ని కుదుపుతాయి. అరుదైన ఈ మాట్లాడే మల్లెల సౌరభాన్ని దోచుకోండి –గుండెల్లో దాచుకోండి.... !

*1979*




# పువ్వుల్లో కుమార కవితారుణ సుధ

## పువ్వులు నవ్వుతున్నాయి- జి.కుమారస్వామినాయుడు

**'ము**సురుతున్న మసక చీకట్లలో - మినుకు మినుకుమంటూన్న -

వెలుగు రేఖలు - యువకులు - చుక్కలు'

సజీవ 'మౌన శిల్పాల'ను 'జాలి'గా చూస్తూ, 'కాలం వేసిన గాలం'తో 'శ్రామిక ప్రతినిధు'ల కేర్పడిన 'రక్తం మరకలు' 'రాత్రి పగలు' తుడుస్తూ, 'చికిత్స' చేస్తూ, 'చుట్టూతా' కనబడుతున్న 'మత్తు గమ్మత్తు' లను 'ఇది ఎదుగు బాటా' అని ప్రశ్నిస్తూ, 'వాగ్దానాల ముళ్లు' గుచ్చుకుని 'చినిగిన విస్తరి' 'జీవితం'గా 'అపస్వరాలతో బతుకుతున్న 'వీళ్ళ'ను కొత్త 'యుగధర్మం' 'ప్రాతిపదికలు' తో 'గుండెల్లో సూర్యుడు'ని ఓ 'సూక్తి సూర్యుడు'గా చేసి, 'చీమల తిరుగుబాటు' తత్వంతో 'సమాధి' నుండి మేల్కొల్పి, 'స్వార్థం నేలరాలే కాలం' కోసం 'మానవతా మహోదయం' కోసం 'అరుణారుణ జ్వాలా పతాకం' ఎగుర వేస్తూ 'కవి'గా ముందుకు వస్తున్న సమాజ సాహిత్యాంబరపు కొత్త కలం చుక్క - కుమారస్వామి.

* * *

To act is so easy, To think is so hard **-Goethe**.

జీవించడం సులభమే. ఆలోచనా జీవిగా జీవించడమే కష్టం. అందునా నగరాల యాంత్రిక జీవనంలో ఆలోచనలు కూడా మరలుగా మారినప్పుడు

‘భజన చేతిలో సృజన ఓడిపోయిన చిహ్నాలే’ కనిపిస్తూ, హృదయం దారి హృదయానిది, బ్రతుకుదారి బ్రతుకుదీ అయిపోతుంది. కుహనా నాగరికతను చూసే అంటాడు కవి.- **“నగరంలో జనం-సాగరంలో జలం. పల్లెల్లో జనం వర్షించే ఘనం”** అని.

కుమారస్వామి పల్లెను వెన్నెముకగా పొదువుకున్న వాడు. నేడు కనిపించే కొందరు యువకవుల్లా నగరాల నినాదాల నగారాలు మ్రోగించేవాడుగా కాక, ‘కాళ్ళ కింద నలుగుతున్నా పరిమళాన్ని వీడని పువ్వుల్లా’, ‘సంకుచితత్వం చర్మరోగంతో వళ్ళంతా కుళ్ళిపోయి భోరున ఏడుస్తున్న నగరంలో’ అధ్యాపకునిగా నిలబడి ‘కారుణ్యాన్ని అకారణంగా - దారుణంగా బలిచేస్తున్న - నవ నాగరిక దానవులను-అరుణనేత్రాలతో చూస్తూ-త్యాగం తెగింపులతో - వికసించిన విప్లవం పువ్వులతో - నవ్యంగా నవ్వుతున్న అరణ్యం’ గమనిస్తున్నాడు. పల్లెని అరణ్యంతో మేల్కొల్పి పట్టణానికి సూక్తి సూర్యునిగా ఉదయింపచేయడం, స్వచ్ఛ హృదయానికి త్యాగం, తేజంనేర్పి కశ్మల సమాజ క్షాళనానికి సమాయత్తం చేయడం కవి బాధ్యతగా భావిస్తున్నాడు.

***‘చెరసాలగా మారిన వ్యవస్థలో-బందీ అయి అవస్థపడే సమాజ విడుదలకు ప్రయత్నించే జనులు ఘనులు - స్వార్థ దాహంతో అధికార మోహంతో- ఆ జైలు గేటు కీపర్లయిన జనులు -కృతఘ్నులు’*** అంటాడు.

ఆశయానికి ఆచరణకు మధ్య అతనికి నిశ్చితమైన అభిప్రాయం ఉంది. ***‘కొండంత ఆశయం గోరంత ఆచరణ ఉంటే- ఆ జీవితం గ్రీష్మం. గోరంత ఆశయం కొండంత ఆచరణ ఉంటే ఆ జీవితం వసంతం’*** అంటాడు.

ఆ వసంతంతోనే ఈ పువ్వులు నవ్వుతున్నాయి. చుట్టూతా ఆ వసంతం కోసమే ఈ పువ్వులు నవ్వుతున్నాయి.

చెయ్యెత్తి పువ్వులు కోసుకోవడం వేరు, చెయ్యి చాపి అందుకోవడం వేరు. కవిత్వమూ అంతే.

కుమారస్వామిది చెయ్యెత్తి స్వీకరించదగిన కవిత్వం. చెయ్యి చాపి స్వీకరించేది వేరు. ఎందుకంటే తనే అన్నట్లు-

*“విప్లవానికి చెయ్యి లేపితే స్వర్గం*
*బానిసతనానికి చెయ్యి చాపితే నరకం”*

* * *

నవ్వే పువ్వుల నందనవని కవితా సంపుటి.

‘పుస్తకం పుట్టిన చోటికల్లా – సుమ హృదయాలొచ్చి సుధలో తడిసి తరిస్తుంటాయి’

మీరూ సు(మ) హృదయులవండి.

ఈ కుమార కవితారుణసుధ సేవించండి.

*29 నవంబర్ 1981*



# మిత్రవాక్యం

## చైతన్యరేఖలు (కవితా సంపుటి) – శేషం రామానుజాచార్యులు

శేముషికీ, సృజనకూ అంతగా పొంతన కుదరదని కొందరి వాదం. కానీ మా శేషం ను చూస్తే ప్రతిభాపాండిత్యాలు ఒకచోట కనపడడం మటుకే కాదు, సవ్యమైన పంథాలో అతని మేధస్సు, హృదయం పయనిస్తున్నాయని గొప్ప నమ్మకం కుదురుతుంది.

తన చైతన్య రేఖల్లో ఒక్క 'అగ్ని పుష్పం' చాలు అతని కవితా గంధం ఇపుడు వీస్తున్న గాలితో ఏ బాధాసరిత్సాగరం మీదుగా, ప్రాణదాతగా ఏ చైతన్యశిఖరాల వైపు అందంగా గమిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు.

***"పంజా చాచిన కేసరి – దాహం తీర్చుకున్న చేతుల్తో పులిమిన – రక్తంతో– తూర్పుగోడకు – చేతిగుర్తులా సూర్యుడు– పైకెత్తిన ఉక్కు కందరాల – ధర్మజలంతో కరిగిన కొలిమిలోని ఉక్కు ముక్కలా వున్నాడు"*** అన్నప్పుడూ,

***"ఎక్కడో తలలోకి ఎదిగి పోయిన కళ్ళు – వీపున విశ్రాంతి తీసుకుంటున్న వీపు"*** అన్నప్పుడూ, ***"అరాచకపు రక్తపు మడుగులో ముంచితీసిన గుడ్డలా దేశపటం వుంది"*** అన్నప్పుడూ రామానుజాచారి ఇమేజరీ Intellectual and emotional complex in an instant of time అన్న ఎజ్రాపౌండ్ నిర్వచనానికి పరమ దృష్టాంతాలుగా కాంతిచ్ఛటలు కుమ్మరిస్తాయి.

తానెందుకు రాస్తున్నాడో తనకు తెలుసు –

*"గుప్పిటనిండా విసిరేసిన - నింగిపూలవానలలో - వేళ్ళ సందుల్లో నుండి జారిపోయిన అభాగ్యుల బాధాగాథలు - సంపుటాలలో చదివిచూడాలి".*

శ్రమయే పూజనీయం అనీ అతనికి తెలుసు

*"శ్రమవీరుని ఘర్మజలం*
*గంగకన్న మధురం*
*-యజ్ఞాహుత హవిర్భావ*
*ఫలముకన్న పవిత్రం"* అంటాడు..

మండుతున్న సూర్యుని ఎండల జండాల చూసి భయపడకు అంటూ కొత్త రాగానికి బెంబేలుపడే భీరువులకు ఉత్సాహం నూరిపోస్తాడు 'ఎర్రటి ధరణీతలాన్ని చీల్చుకుని వచ్చిన నిప్పు మొలక'గా చెరబండరాజుని అన్నప్పుడూ, 'కాలం ఆనుభవాల గాయం' అని వాస్తవాన్ని వడ బోసినప్పుడూ ఈ కలం కొత్తదిగా కన్పిస్తున్నా, లేతది మాత్రం కాదనీ, వ్యవస్థలోని 'కోత' ను గ్రహించి మార్పుకు 'ఊత'గా నిలవగలదనీ నమ్మకాన్ని పెంచుతుంది.

ఇతని కలంసృష్టికి తుది విజయం అసాధ్యం కాదు కనుక ఆ పంథాలో పురోగమించాలని ఈ మిత్రవాక్యం.

*18 నవంబర్ 1987*




# అను(భూతి) వాద భావన

## గజలు సుందరి - ఆకునూరు గోపాల కిషన్‌రావు

పచ్చగడ్డి తిన్న ఆవు ఇచ్చే పాలు - పచ్చగా వుండవు.

ఆరగించేదానికీ, అభివ్యక్తం చేసే దానికీ అంతరం వుంటుంది.

ఎంత తిన్నాం అన్నది కాక - ఎంత జీర్ణించుకున్నాం, ఎంత శక్తిమంతులమై సంచరిస్తున్నాం అన్నది ముఖ్యమైనట్లుగానే - అందుకున్నదానికన్నా, అందించే దానిమీదే దృష్టి.

సౌందర్యం వుంటుంది. కానీ దాని అసలు సౌందర్యం అనేది మన అనుభవంలోనూ, అనుభూతి లోనూ ఆందుతుంది మనకు.

"తాను మునిగింది గంగ.. తాను మెచ్చింది రంభ" అన్న సామెత విన్నదేకదా!

'అందనిది ఎంత అందమయినదయినా మనకేం ఉపయోగం!' అనుకునే వారు కొందరుంటే- అందనిదే అయినా - దూరం నుంచే చూసి ఆనందించే వారు కొందరుంటారు. సాహిత్యం విషయమూ అంతే. ముఖ్యంగా అనువాద సాహిత్యం సంగతి.

ఒక భాషలోని సొగసు, జిగి, బిగి, తళుకు, బెళుకు, గాఢత, సాంద్రత, తత్త్వమూ పూర్తిగా ఆ భాషకే సొంతం. అవి వేరే భాషలోకి రావా అంటే వస్తాయి. కానీ యథాతథంగా రావు. తేడా పాడాలతో వస్తాయి. అనువాదకుడు ప్రతిభామతి అయితే 'అసలు' ఎలావున్నా, అనువాదం ఆకర్షణీయ మౌతుంది.

అసలు అనువాద రచన ప్రయోజనం ఏమిటి? అనువాదకుడు – ఉభయభాషాజ్ఞాని, సరసుడు, సహృదయుడు అయినప్పుడు ఒక భాషా సాహిత్యంలో తనను అలరించిన, ఆకర్షించిన, తన హృదయాన్నీ బుద్ధినీ కూడా రంజింప చేసిన రచనను, తనకు నచ్చిన మరో భాషలోకి (మరీ ప్రత్యేకించి సహజంగా తన మాతృభాషలోకి) అనువదించడానికి సంసిద్ధుడవుతాడు. అనువాదకుడు ఏ భాషలోంచి రచనను అనువాదం చేస్తున్నాడో– ఆ మూల భాష రాని పాఠకులు, ఏ భాషలోకి అనువాదం చేసాడో– ఆ భాషా పాఠకులు చదివి ఆనందించడమే ప్రధానంగా అనువాద రచన ప్రయోజనం. ఉర్దూ బాగా వచ్చిన పాఠకుడు ఉర్దూ గజల్స్, రుబాయీలు నేరుగా చదువుకుని ఆనందించగలడు. ఉర్దూ రాని తెలుగు పాఠకుడు ఉర్దూ గజల్స్, రుబాయిల సౌందర్యాన్ని, రచనా విశేషాలను, ఆ కవితా మాధుర్యాన్ని అందుకోవాలి అంటే అనువాదమే శరణ్యం.

కవిగారి 'గజలు సుందరి' తెలుగు పాఠకుల కోసం దిగివచ్చిన సుందరి. ఆ 'హసీనా' హసాలను ఆయన అక్షరాల్లో గుమ్మరిస్తున్నారు. గాలిబ్ వంటి సుప్రసిద్ధ కవి ఉర్దూ కవితా సౌందర్యాన్ని మాత్రమే కాదు, నూటపాతిక ఇతర ఉర్దూ కవుల రచనా సౌందర్యాన్ని కవిగారు తెలుగులో తేటతెల్లం చేసేందుకు సంకల్పించి చేసిన కృషి ఇది. అంతే కాక కొన్ని తన భావాలూ వెల్లడించారు.

ఉర్దూ మూలాన్నీ, తెలుగు అనువాదాన్నీ పక్క పక్కన పెట్టుకుని తులనాత్మక అధ్యయనం చేసే పండితులకోసం, ఉర్దూ కవితలోని ఛందస్సులు, గణ మాత్ర పరిగణనలు అనువాదంలో, తెలుగులో ఏ తూగులో, ఏ లయల్లో వచ్చాయి అని విశ్లేషణ చేసే విమర్శకుల కోసం కవిగారు ఈ అనువాదం చేయలేదు.

కవితలో సౌందర్యం కోసం, అచ్చమైన అనుభూతి కోసం అర్రులు చాచే సహృదయ సామాన్య పాఠకుల కోసం ఆయన ఈ అనువాదానికి పూనుకుని నిర్వర్తించారు.

ఉర్దూ నుండి ఇది యథాతథంగా మక్కికి మక్కీగా చేసిన అనువాదం కాదనీ, తాము నాల్గవ తరగతిలో వదిలి పెట్టిన ఉర్దూను – గజల్స్ గొప్పదనానికి మురిసి, తుప్పుపట్టిన మెదడులోని ఆ భాషా కోశాన్ని దులిపి, ఆకళింపు చేసుకుని, చదువుతున్న క్షణంలోనే అనువాద భావం మెదలి, అక్షరబద్ధం చేస్తూ ఈ రచనలు సాగించాననీ కవిగారే స్వయంగా చెప్పుకున్నారు.

అందువల్ల తెలుగులోకి వచ్చిన కవిగారి "గజలు సుందరి" సౌందర్యం బురఖా లోనే వుండి పోలేదన్న మాట వాస్తవమే కానీ, కొన్ని తావుల్లో పరదాల మాటునుంచి మెరిపిస్తూ, మురిపిస్తూ కనబడే మాట మాత్రం నిజం. అయితే ఈమె స్వేచ్ఛ, సరళత, సూటిదనం ఈ నవ్య కాలానికి తగిన నాగరిక సౌందర్యంతో భాసిస్తున్నాయి.

*"అసలే పరదాలలో*
*ఆపై మరో పరదా*
*చూపుకసలు అందవు*
*అందకుండ ఉండవు*
*ఏమి ఈ ఊగిసలాట*
*ఇదేమి మన సయ్యాట"*

అని ఆవేదన కలగకుండా కవిగారు, శతాధిక ఉర్దూకవుల భావశబలతను అనుభూతిరమ్యంగా, స్వచ్ఛందంగా, రసప్రవచనంగా అందించారు.

ప్రణయం, ప్రళయం, వలపు, వగపు, శృంగారం, సింగారం, తరుణ రక్తి, ముక్తి వంటి భావాలన్నీ లలితంగా రంగరించి పోశారు. అనువాదం నడక లో ప్రాసలూ యతులూ అంటూ లేకపోయినా, వచన కవిత్వపు నడక లో సైతం ఒక అంతర్లయ స్ఫురించగల సమతూకపు పదాలను ఎంచుకొన్నట్లైతే మరింతగా భాసించేది. ఏమయినా ముందే చెప్పినట్లు – అనువాదం అంటే ఆరగించినదాన్ని ఆరగించినట్లుగా ఆరబోయడం కాదు. కావలసింది 'కక్కు' కాదు. ఒక 'కిక్కు'.

పచ్చగడ్డినే తిన్నా, ఆవు– పరమ రమణీయంగా స్వాదువయిన క్షీరాన్ని ఎలా అందిస్తుందో – ప్రతిభామతి అయిన అనువాదకవి మూలాన్ని మూలమట్టంగా ఆకళింపు చేసుకుని, ఆ మౌలికతను జీర్ణం చేసుకుని, సారవంతంగా అక్షరాల్లో అనూదితమౌతాడు. రసక్షీరాలను పాఠకులకు అందిస్తాడు. కవిగారు ఆ పనే చేశారు. పొదుగు పొదువుకున్న మేర పితికినన్ని పాలు. ఇక్కడ 'పచ్చగడ్డి' అంటే గోవు దృష్టిలో జ్ఞానస్వరూపమయిన పరబ్రహ్మాత్మకమైన అన్నమే తప్ప

లౌకికమైన పచ్చగడ్డి కాదని గ్రహించడం మరీ ముఖ్యం. ఎందుకంటే ఈ 'మూలం' అనే దానికి వున్న విలువ, గొప్పతనం సవ్యంగా సంభావించడం ప్రథమ కర్తవ్యం.

***"అన్ని అందాల కన్న***
***ఆత్మానందం మిన్న***
***నశ్వరాలానందాలన్నీ***
***శ్వరము లేని దాత్మేనన్న !"***

– అని విశ్వసించిన కవిగారు ఈ 'గజలు సుందరి' లో అనువాద సౌందర్యానికి మించి, అనుభూతి ఆత్మకు ప్రాముఖ్యమివ్వడం ప్రశంసనీయం. కవిగారి ఈ అనువాద మానస సరోవరంలోనికి పాఠక 'హంస' లకు సుస్వాగతం.

*13 అక్టోబర్ 1997*



# ఆశల కేరింత

## సాగర మథనం (కవితా సంపుటి) – వారణాశి భానుమూర్తి రావు

'కవిత్వమొక తీరని దాహం' అన్నమాట ఎందరిలోనో నిదాఘ పిపాస. ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వడంలో ఎంతో మథనం జరిగి–అనుభవ మంథరానికి స్పందనా వాసుకిని చుట్టి వస్తువు, శైలి అనే ఇరు పార్శ్వాలను పట్టి–బుద్ధిని, హృదయాన్ని ఏకకాలంలో చిలికితేగాని ప్రయోజనం సిద్ధించదు.

*"తొలిసంజె చీకట్లను చీల్చుకుని*
*నా హృదయ వాకిటిలో నిలచి*
*నవ్వే కాంతి కిరణాలను చూసి*
*సమ్మోహితుడినై పోతాను నేను"*

అనేంత సుకుమార భావుకుడు వారణాశి భానుమూర్తి. 'కవితాభివ్యక్తికి చిరదీక్షా తపస్సమీక్షణ' అవసరం అన్న విషయం తనకు తెలుసు. అందుకే తన కవితా సంపుటికి 'సాగర మథనం' అని పేరు పెట్టాడు. సమాజంలోని అసమానతలను, అసమగ్రతలను, గరళంలా దిగమ్రింగి, అమృతభావనలను 'జీవితవేదం'లా పరివ్యాప్తం చేయాలని తన ఆశ.

*"ప్రతి సమస్యా ఒక సీసపద్యమై*
*ఛందస్సు రాక*
*సమస్యాపూరణం చేతగాక*
*అసంతృప్తి పురాణాన్ని వ్రాస్తూనే వున్నాను."*

అంటూ నిజాయితీ భావనలను ప్రకటిస్తున్న భానుమూర్తి– 'జీవనగీతం'లో తానే అన్నట్లు

***"నవ గీతానికి***
***రసమయ జీవితానికి***
***సుప్రభాతం పాడాలనుకునే ముందు***
***ఆచరణను అద్వితీయంగా***
***సనాతనంగానే కాదు.***
***సనూతనంగానూ***
***మలుచుకోవాలి***
***ఉప్పునీటి సముద్రాన్ని***
***ఉదాత్త జీవధారగా***
***కవితామృతం చేసి పంచాలి."***

ఆ వాసి, రాశి కోసం 'వారణాశి'కి శుభాకాంక్షలు.

మార్చి *2000*




# పిలుపుల తలపు

## మరో ఉదయాన్ని పిలుస్తా– డా॥ లింగంపల్లి రామచంద్ర

*"ఉదయం కానే కాదనుకోవడం నిరాశ*
*ఉదయించి అలానే వుంటుందనుకోవడం దురాశ"*

అంటారు కాళోజీ. అందుకే ఆశావహుడైన కవి లింగంపల్లి రామచంద్రగారు ఉదయం నుంచి ఉదయానికి – హృదయం ప్రస్థానంగా– 'మరో ఉదయాన్ని పిలుస్తా' అంటారు. నిన్నటి ఉదయం బాగుంటే – నేటి ఉదయం సమస్యాత్మకంగా తోచినా మరో ఉదయం – 'రేపటిది' మళ్లీ బాగుంటుందనేదే– ఆశాజీవి లక్షణం. లింగంపల్లి రామచంద్ర కొత్తగా కలంపట్టిన కవేమీ కాదు. ఇప్పటికే పరిత్రులోకానికి పరిచితులే. "కవిత్వం రానేరాదనుకోవడం నిరాశ – కవిత్వం నిరంతరం అలానే వుంటుందనుకోవడం దురాశ" అన్నది కూడా ఒక్కోసారి కవులు వివేచించుకోవాల్సిన అగత్యం ఉంది. ఒకప్పటి కవిత్వ కీర్తితో నిరంతరం మనుగడ సాగించడం కష్టం అని తెలుసు కాబట్టే కవులూ, కవులుగా చెలామణి కాదలుచుకున్నవారూ, తమ కవితాభ్యాసాన్ని నిరంతరం కొనసాగిస్తూ వుంటారు. ప్రయత్న పూర్వక రచన అయితే అది ప్రయత్న పూర్వకంగానే తోస్తుంది. అలాకాక 'చిరదీక్షా తపస్సమీక్షణ' అన్నంత సీను లేకపోయినా, నిజంగా భావావేశం కలిగి చేసిన రచన– హృదయదఘ్నంగా అనుభూతి చెంది అభివ్యక్తమైనప్పుడు– కవిగా వ్యక్తి ఆరాటానికి సాంత్వన మాత్రమే కాదు, చదువరికి రసాలంబనమవుతుంది. కవిగా ఎదుగుదలలో క్రమత సాధిస్తుంది.

మట్టి పరిమళాన్నీ, ప్రకృతి వైవిధ్యాన్నీ ఇసుకకలిపినీ, చైతన్య స్వప్నాన్నీ, గుండెలోని దీపాన్నీ దేనిని భావనామయం చేసి కవితగా దీపింపచేసినా, రామచంద్రగారిలో అయోమయం, పులుముడులు లేవు. ఆయనకు మంచి అనేదే ముద్దు. మిగిలినవేవీ వద్దు. గురువు, రైతు పరువు, మానవీయతే దరువు– ఆయనకు ముఖ్యం.

*"రేపటికి బాటలు వేసే పాదాలకు*
*నమస్కరిస్తున్నాను.*
*పేదకడుపులకు బువ్వ అందించే*
*చేతులకు అంజలిస్తున్నాను.*
*మానవత వివస్త్ర కాకుండా చూచే*
*ఆశయాలకు హృదయాన్ని అర్పిస్తున్నాను"*

అంటారు. ఆయన దృష్టిలో అక్షరాలు మేధో కుసుమాలు. పంజరంలో కుదించాలని చూస్తే – రెక్కలతో చువ్వలను ఛేదించి – స్వేచ్ఛా విహాయనం చేయగల 'చరిత్ర గుర్తులు' అంటారు. ఆయన భావశబలత బాగుంది. సౌందర్య దిదృక్ష ఎక్కువ. అందుకే కొన్ని సామాజిక అంశాల వ్యక్తీకరణ వచ్చినప్పుడు కొంత నినాదప్రాయం గానూ, స్టేట్‌మెంట్స్‌గానూ అనిపించే తావులువున్నా, 'గాలివాటు' కవిత్వం అనుకోవల్సిన అవసరం లేదు.

*"హృదయం విషపు మొక్కకు పాదుకాకుండా చూడాలి*
*సమాజం విషప్రయుక్తం కాకుండా చూడాలి*
*అప్పుడు గుండెలో రుషితనం పరిమళిస్తుంది"*

అంటూ మంచికోసం ఆరాటపడుతూండే కవి కనుకే, ప్రతి మార్పూ సూర్యుడుగా ఉదయిస్తుంది కనుకే 'మరో ఉదయాన్ని పిలుస్తా' అంటాడు. వర్తమాన తిమిరాలను ఛేదించడానికి సమాయత్తమౌతాడు. పూల పరిమళాలు, సాగర కెరటాలు, మంచు భుజాలు, వెలుతురు దుస్తులు, ఉషస్తారలు ఇవన్నీ లింగంపల్లి రామచంద్ర కవిత్వ కలిమి లోనివి.

ఆశావహమైన కవిత్వాన్నీ, అందమైన కవిత్వాన్నీ అందిస్తున్నందుకు రామచంద్రను అభినందిస్తున్నాను.

*29 జూన్ 2000*




# ఈ శిలలకు కవిత్వశిల్పి

## సమాజశిల – డా॥ నాగినేని భాస్కరరావు

[illegible], [illegible], [illegible], [illegible] - **[illegible]** ([illegible])

**కా**దనలేం. అనుభవం అక్షర రూపం దాల్చడం ముఖ్యం. హేతువూ, తర్కమూ, నైతికత అనేవి అక్షరబద్ధమైన అనుభూతిని వెన్నంటి రావాలే గానీ – ముందే వాటి గురించి ఆలోచిస్తూ కూర్చుంటే అభివ్యక్తి వెనుకపడుతుంది. హృదయం ఒకసారి ముడుచుకుంటుంది. మరోసారి వికసిస్తుంది. దానికి కారణం జీవితంలో జరిగే ప్రతికూలతా, అనుకూలతా ఘటనలే. ఆ విధంగానే కవితావేశమూ చోటు చేసుకుంటుంది. అందరూ ఒక రీతిన వుండరు, ఒకరీతిన ఆలోచించరు. ఒకే రీతిగా ఆవేశపడరు. ఒకేరీతిగా ఆ అనుభూతినీ, అనుభవాన్నీ అభివ్యక్తమూ చేయరు. అనుభవం ‘శిల’ అయితే – దాని కవితాభివ్యక్తి ‘శిల్పం’. శిల శిల్పాకృతి దాల్చనిదే ప్రయోజనం ఏముంది? రాతిని చెక్కుతూ పోతే సరిపోదు. సమాదరించదగిన ఓ రూపు ఏర్పడాలి. నల్లని బండరాయి కి అనుకున్న ఆకారం వచ్చేదెలా? దానికే విన్నాణం కావాలి. అందరూ శిల్పులు కాలేరు. అయితే అన్ని రాళ్లూ శిల్పుల కోసమే ఎదురుచూడవు.

*“నేను రాయిని నిత్యజీవన ప్రదాయినిని*
*నా దేహాన్ని తూట్లు తూట్లుగా చేసి*

*ముక్కలు ముక్కలుగా నరికితేనే*
*కూలిడబ్బులతో, నవ్వుతూ, తుళ్లుతూ*
*ఆనందంగా ఇంటిముఖం పట్టే కష్టజీవుల్ని చూస్తే*
*నా గాయాల బాధ మరిచిపోతాను"*

అంటూ ఎండనకా, వాననకా రాళ్లు కొట్టుకుని బతికే కష్టజీవి శ్రామికుని జీవనయానం ముఖ్యమా? సమష్టిగా ఒక శిల్పాకృతి నివ్వలేని, తమలో తాము కొట్టుకు చచ్చే వర్గాలవారి ప్రయోజనం రూపెత్తని విన్నాణం ముఖ్యమా?

సమాజశిలకు ఏ రూపం ఇవ్వాలనేదీ వివాదమై, అసలు ఏ రూపమూ ఇవ్వలేని కుహనా వాదాలూ, వర్గాలూ చెలరేగుతూ, బ్రతుకును మలచే, నలుగురు కొలిచే తీరే లేకపోవడం అంత విషాదం ఏముంది?

*"ఒక గ్రూపు - కొంతకాలం చెక్కారు*
*గొప్ప త్యాగుల్లా ఫోజు పెట్టారు*
*అనుకున్న ఆకారం రాలేదు - వికారమైంది.*

*వేరొక గ్రూపు వారొచ్చారు-*
*నీతులెన్నో చెప్పారు, వారూ చెక్కారు కొంతకాలం.*
*ఏదో ఒక ఆకారంలో వున్న శిలకాస్తా నిరాకారమైంది. వక్కిపోయింది.*
*అంతలో మూడో గ్రూపు పుట్టుకొచ్చింది -*
*పుడుతూనే ప్రగల్భాలు పలికింది-పులిలా గర్జించింది...*
*ఆ గర్జించిన పులీ కాగితం పులిలా*
*ధరల పిశాచంగా మిగిలింది.*

*సమాజ శిల-చిక్కి నల్లని బండరాయిలా వుంది*
*నిస్వార్థ శిల్పులకోసం అలాగే ఎదురుచూస్తోంది"*

అంటూ యాభైఏళ్ల గణతంత్ర వ్యవస్థనీ, సమాజ అవస్థనీ నిజమైన ఆస్థతో అక్షరీకరించడం సలక్షణమైన అనుభవ ప్రకటనం.

* * *

తను కవి. కాదు కాదు అంతకన్నా ముందు మనిషి. అయితే ఈ మనిషి 'పచ్చని చెట్లమీద, తీయని పక్షికూతల మధ్య, భయం ఎరుగని దారులమధ్య,

వెన్నెల సముద్రంలో, సూరీడు విసిరిన కిరణ సమూహంలో, చెట్లు చిలుకరించిన శీతల ఛాయలో, జనారణ్యంలో, కుటుంబావాసంలో, ప్రేమ మోహంలో కనిపించే ఒంటరితనంలో వివశుడవుతూనే– "ఒంటరిగా కనిపించేదంతా ఒంటరితనంకాదు – ఒంటరిమనస్సు ఒక మండుతున్న అగ్నిగోళం"గా – జారిపోయిన సుఖ క్షణాల్లోంచి పుట్టిన యాతననీ, మారిపోయిన మనుషుల స్వార్థపు సెగల పొగల వేడినీ, విరిగిపోతున్న సంబంధాల ఘర్షణల రాపిడినీ గురించి ఆలోచనల గోళంగా పరిభ్రమిస్తూ – వ్యష్టి నుండి సమష్టి వైపుకు ప్రయాణించేవాడు. అందుకే తన ఆలోచనలన్నీ కేవలం తన చుట్టూ మాత్రమే అల్లుకుని ఎప్పుడూ ఎక్కడా వుండవు. ఏ వస్తువుని స్పృశించినా, ఏ ఇతివృత్తాన్ని ఎంచుకున్నా, ఏ అనుభవం గురించి పేర్కొన్నా సహజసిద్ధంగానే హృదయపు సంకోచ వ్యాకోచాల ఆవేశానుభూతితో – అక్షరమై ప్రతిఫలిస్తాడు. దేనినీ అలంకారభరితంగానో, శిల్ప విన్యాణంతోనో చూపాలని తను అనుకోడు. అయోమయం, పులుముడు లేవు.

చెప్పదలుచుకున్నది–అందునా తనకు తెలిసిన, తను అనుభవించిన శాస్త్రవిషయమైనప్పుడు – వచనమై తేలిపోతానేమోనన్న శంకకు కూడా చోటివ్వడు. అందుకే అతని అనుభూతిని వెంటనంటివచ్చే హేతువు, తార్కికత అతని ఆలోచనల్లోని నిజాయితీని మనముందుంచుతాయి. ఏదీ వట్టి నినాదంగా పలికినదికాదనీ, తాను విశ్వసించి నిశ్వసించినదనీ గ్రహించమంటాయి. తనలోని దేశభక్తి, సమాజహిత చింతనా, మానవీయ సంబంధాల పట్ల ప్రేమ, కృతజ్ఞతా అన్నీ తనని ఆశయశీలిగా, నమ్మిన ఆశయం కోసం అవరోధాలను ఎదుర్కొంటూ మనుగడసాగించే యథార్థవాదిగా రూపుకట్టిస్తాయి.

"మతం ఒక క్రమశిక్షణే కానీ అవశిక్షణ కాదు, శాస్త్ర పరిశోధనల్లో ఎన్నో విజయాలు సాధించినవానికి మతమౌఢ్యమెందుకు" అని ప్రశ్నించినా, పశు పక్ష్యాదుల్లో వున్న సమత లేకుండా "ఆస్తి, ఆహారాలను అసమానంగా ఆర్జించి దాపరికం చేసేది మనిషి ఒక్కడే" అని ప్రకటించినా, ఎన్నో దుష్కార్యాలకు అడ్డుపడి, తీరిపోయినప్పుడు బ్రతుకును సుఖమయం చేసే అనుమానం గురించి ప్రస్తావించినా, "కలవరాలకు కదలివచ్చే 'కల' ఒక వరమనీ, జీవనస్వరమనీ, 'కంటితుడుపయ్యే జంట' అనీ సంభావించినా, ముక్కు సూటిగా పోయే మనిషి అభిమానానికి దెబ్బతగిలినపుడు వచ్చే 'కన్నీరు' గురించి పేర్కొన్నా, 'శౌర్యతారలు'గా జవానులను కీర్తిస్తూనే, త్యాగమూర్తుల శతజయంతులూ వర్ధంతులూ చేయడం

కాదు. వాళ్ళ పోరాటథగాలు, బోధలు, వాళ్ల త్యాగాల కెన్నికయిన బాటలు బాసలు విస్తరించాలి మన మెదళ్ళ నిండా" అని ప్రస్తుతించినా, ఒక చైతన్యస్పృహను ఎంతో వైవిధ్యంతో కూడిన అంశాలతో ప్రేరేపిస్తాడు.

* * *

తను డాక్టరు. 'పేషెంట్స్'ను చూడ్డంలో ఎంతో "పేషెన్స్' చూపుతూ – రుగ్మతలను పోగొట్టే క్రమంలో – తను రుగ్మత పాలయినా, ఆశనూ, ఆశయాన్నీ, ధైర్యాన్నీ రవ్వంతయినా సడలనీయకుండా ఎదుర్కొని – కవిత్వంలో వలె, బ్రతుకులోనూ పునరుజ్జీవనమైనవాడు. "ఆశయంతో కవిత్వం రాయి దానిని ఆచరిస్తేనే బ్రతుకు" అన్న కవికుమారుడు తననూ, తన కవిత్వాన్నీ కూడా ఇప్పుడు మళ్ళీ బ్రతికించుకున్నాడు. తన 'జీవనవిశ్వాసం' అంత ఉదాత్తమైనది.

తను మిత్రుడు. మిత్రుడు అంటే సూర్యుడు. భాస్కరుడు. భాస్కరుడు మధ్యందిన భాస్వరమే కాదు. పడమట క్రుంగినా మరుదినం తూర్పున సరికొత్తగా– 'హృదయం'గా ఉదయించేవాడు. తన అక్షర కిరణాలతో ప్రాణశక్తిని పంచి పెట్టేవాడు. 'మేం' కలిసి రాసినప్పుడు ఎలా వున్నాడో, ఆ తరువాత వృత్తిలో తాదాత్మ్యమై కవిత్వరచనా ప్రవృత్తిలో కొంతమందగించినట్టు తోచినా, తన అధ్యయన వేదిక సృజనశక్తిని చల్లారనీయలేదు. అభిరుచిగల నాటకాన్ని నాగినేని మధిరలో పండించాడు. నర్సింగ్‌హోంను, పాథలాజికల్ లాబొరేటరీని సమర్థంగా నిర్వహిస్తూ, నమ్మిన పార్టీ సిద్ధాంతాలకనుగుణంగా ప్రజాసేవ చేస్తూ తనలోని ప్రాణవత్ చేతనను అలానే నిలుపుకున్నాడు.

బ్రతుకును 'డాక్యుమెంటేషన్' చేసి చూపే అనుభవ దృశ్య సాక్షాత్కార ప్రజ్ఞ తనకు ఇష్టం. అలాంటి ప్రతిభే రాజకీయాంశంతో 'తెలుగు దున్నపోతు' లోనూ, 'ఫలించని స్వప్నం' లోనూ, ఒక జీవన తార్కికతతో, తాత్త్వికతతో – 'నాల్గు ముఖాల చావు', 'డోనార్ డోనార్ కిడ్నీ డోనార్' ఖండికల్లోనూ, సామాజిక ప్రతిబింబంగా ఒకరోజు పేవ్‌మెంట్ కథనంగా సాగే 'సాక్షి' లోనూ – పాఠకులు అందుకోగలుగుతారు. తనూ డాక్టరు కనుకనే క్రానిక్ రీనల్ ఫెయిల్యూర్ (మూత్రపిండాలు చెడిపోవడం) గురించి, మరణించాక కూడా మనిషి మరొకడిని బ్రతికించగల కొన్ని 'అవయవదానాల' సంవిధానాల గురించీ కవిత్వీకరణకు అవరోధం అనుకోకుండా అవసరంగా చెప్పాడు.

* * *

తనకు ఇంతకీ కవిత్వం అసలేమిటి?–

" THERE WILL ALWAYS BE REVOLT IN POETRY, SO LONG AS ACTION AND "REACTION" PLAY THEIR SYSTOIC AND DIASTOIC IN LIFE" -**J.J.LOWELS** (CONVENTION AND REVOLT IN POETRY)

జీవితంలో హృదయపు సంకోచ వ్యాకోచాలంత సహజానుభూతి– ఈ 'తిరుగుబాటు'. ఈ 'తిరుగుబాటు' బ్రతుకులోని, సమాజంలోని, అస్తవ్యస్థతల మీద, రకరకాల రుగ్మతల మీద. తిరుగుబాటు' అంటే 'హింస' కాదు, కేవలం విధ్వంసం' కాదు. అలాగని హింస, విధ్వంసం ఎక్కడ అనివార్యమో అక్కడ– రోగకారక క్రిములయిన – వాటి పై 'యాంటీబయోటిక్స్' చేసే 'తిరుగుబాటు' వంటిది తన కవిత్వం.

***– దిగులు చీకట్లో వెలుగును పంచడం దాని పరమావధి***

***– కవిత్వం గొడ్డు చలిలో ఒక అగ్గి నెగడు***

***– కవిత్వం కవి ఆవేదన, అనుభూతి ప్రతిధ్వనులు.***

ఆయినా ఎప్పటికప్పుడు సామాజిక ప్రయోజకాలు.

**– చుట్టూరా వుండే తోటిమానవుల మానసిక బాధల్ని నివారించే 'అసాధారణ లేపనం' కవి తయారుచేసే కవిత్వం.**

– ఇదీ కవి డాక్టర్ నాగినేని భాస్కరరావు అనేమాట. కవిత్వం బాట. సరళీకరణలు, ప్రైవేటీకరణలు, గ్లోబలీకరణలు పేరిట మనిషి ఒక సరుకుగానూ, లేదా యంత్రంగానూ మారుతూ, మానవ సంబంధాలన్నీ అడుగంటి, ఒక ఆకారమూ సాకారమూ లేని నల్లటి బండరాయిగా సమాజం రూపెత్తుతున్న నేటి కాలాన, హృదయాలు కూడా బండరాళ్లవుతున్న తరుణాన, ఈ 'కవిత్వలేపనం' సమాజశిల గాయాలను కూడా మాన్పి, నిజమైన 'డోనార్' గా పునరుజ్జీవన మిచ్చి ఆశయాల మేరకు శిల్పీకరించే మంచి కృషి. మారేదీ, మార్పించేదిగా ఆప్తమిత్రుడు భాస్కరరావు కవిత – తనవలెనే పునరుజ్జీవన చైతన్యంతో మానవ సేవలో పునరంకితం కావాలనీ, కాగలదనీ, 'సుధా'కాంక్ష. శుభాకాంక్ష.

*25 ఫిబ్రవరి 2000*




# కవిత్వమంటే జీవిత సంకలనమే

## వెలుతురు ప్రవాహం - తిరునగరి శ్రీనివాస్

"Individualised element in Literature is not something supplementary, not some recherche sause for something more substantial, not an appendage from objective material, but a method for the aesthetic understanding of life which makes it possible to reveal the world in its true wealth of colours, in its close relationship with man. Such an approach is relevant with respect to all branches of Art"

**-Mikhail Kravchenko**
(Soviet Literary Critic)

**"శరీరాన్ని అక్షరాలుగా వొలుచుకుని చూస్తేనే కదా**
**పరిణామక్రమాలు స్పష్టంగా కనిపించేది.**

***తర్కం అఖ్ఖర్లేదు***
***శాస్త్రం తెలియాల్సిన పనిలేదు***
***తడబాటు అసలే అవసరంలేదు***
***సహజాతాలతో జతకట్టి అనూహ్యరూపాలతో***
***ఆకాశాన్ని మహావస్త్రంగా ఒకే ఒక్క చేతితో నేయాలి"***

అంటాడు తిరునగరి శ్రీనివాస్. అందుకే A man in search of a man collecting tears and innerfire అనిపిస్తాడు. అతని అన్వేషణ అంతా- మనిషితనం కోసం. అందుకోసం - తననే కేంద్రబిందువు చేసుకుని 'ఆకాశాన్ని కుమ్మేసే

విశ్రాంతి పొందిన మనస్సు' నే నేపథ్యంగా నిలుపుకుని, తానొక దృశ్యాన్నవుతూ 'వెలుతురు ప్రవాహం' కావాలను కుంటున్నాడు. అతనికి వైయక్తికతనే చుట్టుకుదురుగా పెట్టుకుని గదిలోనే కాదు హృదయభాండంలోనూ సముద్రాలు పొంగించడం తెలుసు. **"తీరాల తీగల్ని కలిపి ముడివేసే వ్యక్తిత్వపు జెండాలు ఏ క్షణాన్నయినా తలెత్తుకుని ఎగురుతాయి"** అన్న తను - అసలు వ్యక్తి ముందు వ్యక్తిగా నిలబడగలిగితే, ఆ తరువాత సామూహిక శక్తి కాగలడన్న వాస్తవాన్ని విశ్వసిస్తాడు.

> ***"అన్వేషించే నయనం చూపులను ప్రసరించి తీరుతుంది***
> ***వంగని ఆకాశానివి నీవు***
> ***నిన్ను తుంచివేయాలనుకోవడం ముమ్మాటికీ అవివేకమే"***

అని వృద్ధాప్యపు 'శిఖరం' గురించే కాదు, ఎంత వయసు పై బడినా వైయక్తిక ప్రతిభకు, 'తన' తనానికి మరణం రాదనీ, రాకూడదనీ అంటాడు.

తిరునగరి శ్రీనివాస్‌లోని విలక్షణత –తను ఒక 'రివ్యూపొయెట్'. జీవితాన్నీ, సంఘటనల్నీ, మనుషుల్నీ, వర్తమానాన్నీ, రానున్న భవిష్యత్ చిత్రపటాన్నీ అన్నింటినీ సమీక్షిస్తాడు. సమీక్షించడానికి ముందు వాటి లోతుల్ని పట్టుకునేందుకు ఒక రిపోర్టర్ లా కృషి చేస్తాడు. అది ఒక గవేషణ.

> ***"చట్రంలా గిర్రున తిరిగిపోతున్న జీవితాన్ని***
> ***సమీక్షించుకునేందుకు***
> ***నువ్వో సమీక్షకుడివి కాక తప్పదు....!"***

అని అంటాడందుకే. 'జీవనచట్రాన్ని తరుముకుంటూ వెళ్లడమే పనైతే ఇంతకీ మనం ఏ గమ్యం వైపు పయనిస్తున్నట్లు' అని ప్రాణాంతకపు ప్రశ్ననీ సంధించి, 'పరాయి తాంబూలం' పుచ్చుకుని తన్నుకు చస్తున్న స్థితిని సమీక్షించగలిగాడు కాబట్టే– **"ఆఘమేఘాల మీద ప్రపంచ గ్రామం వెలుస్తోంది. సింథటిక్ జీవనంలో పూడ్చలేని అఖాతాల్ని "స్టేటస్' గా మార్చి భుజాలపై ఎంతకాలం మోయాలో"** అని ఆవేదన పడుతున్నాడు. 'జీవితపు పగుళ్లలో మొలచిన కృత్రిమత్వానికి సానబెట్టే గీటురాయి కోసమేనా నీ అన్వేషణ' అంటాడు. కృత్రిమత్వం అనివార్యమౌతోందని తనకు తెలుసు కానీ– మానవత్వం, మనిషితనం చచ్చిపోకూడదనే తన ప్రగాఢకాంక్ష. ఏ మార్పయినా రావలసింది మనిషిలోకదా!

అప్పుడే– **'ఏమీ కావనుకున్నవే ఒక్కోసారి మహత్తర చరిత్రలవుతాయి. – ఏమోలే అని వదిలేసేవే ఉద్యమాలుగా పోతపోసుకుంటాయి.'** – ప్రపంచాన్నీ, జీవితాన్నీ దాని అసలు రంగుల్లో చూసే కిటికీకన్ను తిరునగరి దృష్టి. అందుకే ఉగాది గురించి మూడు కవితలూ, దీపావళి గురించి ఒక కవితా సంతరించిన భావలోచనంతోనే– 'యే వతన్ తేరేలియే' అని కార్గిల్ వీరుల గురించీ, 'హే స్వర్ణభారతీ' అని స్వాతంత్ర్య దిన స్వర్ణోత్సవాల గురించీ అనుభూతి చెందుతాడు. తన 'రివ్యూ' అంతా దేనికంటే–

***"ఆలోచనల కదలికల్ని బిగబట్టలేక***
***మానవత్వాన్నవ్వాలని ఉంది.***
***పీలికైన మనిషి తత్త్వాన్ని కలిపికుట్టలేక***
***తెగని అనుబంధాన్నవ్వాలని ఉంది.***
***చెరోముఖమైన ఆత్మీయుల్ని కలపలేక***
***ఎడతెగని సంఘర్షణకు సమాధానం కోసమే అన్వేషణ***
***మనిషితనాన్ని బతికించడం కోసమే ఆరాటం.***
***ఖాళీ అయిన ఊళ్లని మనుష్యులతో నింపడమే తక్షణ కర్తవ్యం***
***గురి తప్పని మానవబాణాలు రావడమే ఇక ఆలస్యం"***

అంటూ వ్యక్తులు 'మానవత్వం' గురితప్పని వారై ఉండాలనీ, అలాంటి వ్యష్టి నుంచి సమష్టివైపుకు పయనించాలని...కాదు కాదు ప్రవహించాలనీ కవి తపిస్తాడు.

రిపోర్టింగులతో, సమీక్షలతో కొన్ని కవిత్వ ఇతివృత్తాలలో వచనమై తేలిపోవడానికి ఎందుకు సిద్ధపడతాడు అంటే అక్కడి సంభాషణ అంతా ఒక అవగాహనకూ, అర్థావబోధనకూ అని గ్రహించినప్పుడు. మరోవంక 'పదచిత్రాలు' లో ఎంత పిండీకృత కవితానుభూతిని అందివ్వగలడో కూడా అర్థం చేసుకోవచ్చు మనం.

***"దృష్టి దృష్టికో తేడా***
***త్రీ డైమెన్షన్‌లో రెటీనా***
***తియ్యగా చంద్రుడికి కాటు"*** – అన్నప్పుడూ,
**"భూగోళాన్ని**
**బుడ్డోడు**
**బుడగలుగా వదులుతున్నాడు"** – అన్నప్పుడూ,

తన భావుకతను అందుకోవచ్చు. వ్యక్తి అంశకు విలువనిచ్చేవాడు కాబట్టే జీవితంలో, కవిత్వంలో 'అంతర్మథనం' తనకు ఇష్టమైన విలువ. మరి అది ఆత్మసమీక్ష వంటిది కదా!

**"అలుపెరుగని ప్రశ్నలతో అంతర్యుద్ధం - కకావికలమవుతున్న ఆలోచనలతో కుస్తీపట్లు - జతకూడని భావాలతో బేరసారాలు - ప్రతి ప్రశ్నకూ ఏదో దొరుకుతుంది సమాధానం - ఏమైనా చివరకు మిగిలింది మాత్రం నా నీవే!!'** అనడంలో నిలుపుకోవాల్సిన 'తన' తనాన్నే నిలుపుతూ, 'కుత్తుకలో కత్తులు దిగినా ఇంకా తనపై తనకే నమ్మకమనీ, అంతా పోగొట్టుకున్నా గెలుచుకున్నవాడి గర్వం నాది', అనీ నరనరాల్లో వెలుతురు ప్రవాహం పారడమే ధ్యేయమంటాడు శ్రీనివాస్.

మానవత్వం ఉన్న మనిషి కాబట్టే, గాఢంగా, లోతుగా అన్నిటినీ హృదయదఘ్నంగా నిజాయితీగా ఫీలవుతాడు కాబట్టే, పత్తి రైతు ఆత్మహత్యలకు చలించిపోయాడు. 'రణ'సీమ' లో సహజీవన ధ్యేయంగా సాగుతున్న 'అడగుప్ప' గ్రామం గురించి ఉప్పొంగిపోయాడు. తన వూరి వాగుని తలచుకుని కరవుతెప్పను అధిగమించడానికి మళ్లీ పారాలని పాడాడు. ఊహించే మేధ, స్పందించే హృదయం ఉన్న శ్రీనివాస్‌ది రాటుదేలిన కలం కావడానికి ఎంతో కాలం పట్టదు.

***"అనంతవేదనను అమాంతంగా కక్కేసిన అక్షరమే***
***'ఎజెండా' ను ఎత్తుకున్న సిసలైన కార్యకర్త."***

తిరునగరి శ్రీనివాస్ కావ్యకర్త మాత్రమే కాదు, మంచి కార్యకర్త.

**జీవితమంటే సేకరణే!** - ఒక్క వాక్యంలో ఎలా నిగ్గుదేల్చాడు! అవును. ఎన్ని పోగేసుకుంటున్నాం. పొందుతూ, సేకరిస్తూ, పోగొట్టుకుంటూ కూడాను.

కుంచెలో రంగై రగులుతున్న సెగపట్టిన భావం - మనిషితనాన్ని చంపేసే కాలం పహారాను తరిమేసే కవితగా పుట్టిన కాంతిరేఖ, తిరునగరి శ్రీనివాస్ 'వెలుతురు ప్రవాహం'. దోసిలితో తాగుతారో, కాళ్లు కడుగుకుంటారో, మునిగి స్నానం చేస్తారో, పడి కొట్టుకుపోతారో పాఠకులుగా మీ ఇష్టం.

తప్పిపోయిన భూగోళాన్ని చేతులన్నీ కలసి వెదికిపట్టుకోడానికీ, మట్టివాసన విలువను ప్రపంచవేదిక పై డాట్ కామ్ వెబ్ సైట్లోనూ పరిమళింపజేయడానికీ,

పరిధిని మించిన విస్తరణదిశగా సాగి, గాలి ఎక్కువయిన బుడగలా పేలిపోయే ప్రమాదమున్న ప్రస్థానాన్ని 'అంతర్నెట్'లో రక్షించడానికీ, ప్రపంచపు అంచు దృశ్య విషాదాల్లో చంద్రుడే ఐవిట్నెస్‌గా నిలచి పరితాపము తీర్చే వెన్నెలల్ని స్రవింపచేయడానికీ, ద్రవీభవించడం ఎక్కడో ప్రారంభమయినట్లు కంటిలో కదలాడే చెమ్మల ఆనవాలుని అందిపుచ్చుకోవడానికీ, వేపకొమ్మల జైలుగోడల్నుంచయినా చైత్ర చైతన్యగీతం ఆలపించే యుద్ధకోకిల కావడానికీ, జీవిత యవనిక నిండా సమీక్ష కోసం ఎదురుతెన్నులు చూస్తున్న కొత్త పుస్తకం కావడానికీ – వ్యక్తిత్వ సూక్ష్మరేఖలను వర్ణభరితం చేస్తూ తిరునగరి శ్రీనివాస్ నిలబడేవుంటాడు ఒక ఉదయకవి సూర్యునిగా. అతని కవిత్వపు వెలుగులు వెల్లువలై పారాలని శుభాకాంక్షిస్తున్నాను.

*28 మార్చి 2001*




# ఆప్తవాక్యం

## పునరపి జననం (కవితా సంపుటి) – తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

**యు**వత సాహిత్యానికి దూరమైపోతోందనీ, యువతరానికి 'కెరీరిజం' ముఖ్యమైపోయిందనీ, రచనా వ్యాసంగం పట్లా, సాహిత్యకార్యక్రమాలకు హాజరవడం పట్లా వారికి ఆసక్తి వుండడం లేదనీ అనుకుంటున్న ఈ రోజుల్లో తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి లాంటి యువమిత్రులను చూస్తే నిజంగా ఎంతో ముచ్చట వేస్తుంది.

ఈ నాటి యువతరానికి ప్రతిదీ వేగంగా అయిపోవాలి. ఇటు డబ్బూ, అటు కీర్తి ప్రతిష్ఠలూ ఆర్జించాలనే 'ఆబ' చాలామందిలో కనిపిస్తోంది. నిజానికి అలా అనుకోవడం తప్పేమీ కాదు. కానీ అందుకు తగిన వేగవంతమైన కృషిని చేస్తున్న వారెంతమంది? మంచి అభిరుచులు, ఆశయాలూ ఏర్పరుచుకుని చక్కటి ఆదర్శాలను రూపొందించుకుంటున్నవారు ఎంతమంది?

ఇలా ఆలోచించినప్పుడు మూర్తి చేస్తున్న కృషి మరీ ముచ్చట గొల్పుతుంది. తను సరియైన దిశగా ప్రయాణిస్తున్నాడని అనక తప్పదు. ఒక పరిణతి చెందిన కవి అభివ్యక్తీకరణను యువకవిగా తాను ఇప్పటికే అందిపుచ్చుకున్నాడు. నిజానికి హైకూలు వంటివి పలికించడానికి విస్తారమైన అనుభవాన్నీ, ఊహాశక్తినీ మథించి, కుదించి రాటుదేల్చిన క్లుప్తత, గాఢత కావాలి. అందుకు అధ్యయనం, పరిశీలనం ప్రాతిపదికలు.. వాటిని తాను చక్కగా అందిపుచ్చుకున్నాడు.

వయసు సహజమైన వలపు భావాలనూ, చైతన్య స్పృహను నాణేనికి బొమ్మా బొరుసులా కలిగివున్నాడు మూర్తి. 'సిరి-గొప్ప'లకోసం తపించేవాడుగా మాత్రం కాకుండా తరిగొప్పుల తన భావాలనెల్లన్ ఒక ఆదర్శనీయ నైజంతో నిజాయితీగా అల్లెన్ అనచ్చు, వివెల్లెన్ మూర్తి హైకూలు, కవితల్లో ఆ కృషి స్పష్టంగా కనిపిస్తోంది.

***'బ్రతుకిచ్చిన భూమిని***
***ప్రొద్దున్నే పూలతో-పూజిస్తోంది...చెట్టు'*** అంటాడు
***'తనలాగే మనకీ***
***ఆయుక్షీణమవుతోందని***
***కేకుమీద కొవ్వొత్తి కేక'*** అంటాడు,
***'మనిషి గాలి సోకింది***
***గొంగళి పురుగుని***
***ఈసడించుకుంటోంది***
***సీతాకోక చిలుక'*** అంటాడు.

అలాగే కవితల్లో-

***'ఒక కాకి ఛస్తే వందకాకులు అరుస్తాయి***
***ఓ మనిషి మరణిస్తే పదిమంది కూడి ఏడుస్తారు***
***ఆ 'అరుపు'లో ఐకమత్యతా సూత్రం వినిపిస్తోంది.***
***ఈ 'ఏడుపు' లో ఆనవాయితీ మాత్రం కనిపిస్తోంది...'*** అంటాడు.

ఇలా అనడానికి ఎంతో అనుభూతి, ఆర్తి కావాలి. మూర్తిలో ఆ రెండూ పోగు పడ్డాయి. పోగు అంటే గుర్తొచ్చింది.

***'దూది మబ్బుల్లోంచి***
***దారపోగులు రాలుతూ***
***వాన చినుకులు'*** అంటాడు. ఎంత చక్కటి ప్రకృతి పరిశీలనం!?

ఇంత సీరియస్ మనిషీ...

***'ఆలూ కర్రీకి***
***మైదా చీర చుట్టారు సమోసా ప్రత్యక్షం'*** అని చిలిపి హాస్యం సృష్టిస్తాడు.

*'ఎత్తయిన కొండలను*
*చుట్టు ముట్టిన మబ్బుతెర*
*ఆమె గుండెలపై పైట కొంగు'*

*'మీసం ముళ్ల మధ్య*
*అతనికి అమృతాన్ని అందిస్తోన్న*
*ఆమె అధరం – గులాబీయే'*

*'శృంగార పూజలో*
*అక్షతలు*
*నఖక్షతలు'* అని సరసశృంగారాన్నీ దట్టిస్తాడు...

తరిగొప్పుల తన కవితా వైశిష్ట్యాన్ని హైకూలకు మాత్రమే పరిమితం చేయకుండా విరివిగా కవితా ఖండికలను రచించాలనీ, ఉత్తర రచన, పజిల్స్ పూరణల నుండి కవిగా, కథకునిగా ఎదిగి మంచి సాహితీ సృజన సాగించాలనీ నా ఆకాంక్ష. అందుకు తగిన చేవ అతనికి ఉంది. అవకాశాలు తప్పకుండా తలుపు తట్టి మరీ ఆహ్వానిస్తాయి. తనదైన ఒక కవితా మార్గాన్ని తాను ఏర్పరుచుకుంటాడనీ, మాతామహులు, పితామహులు వారసత్వంగా అందించిన స్ఫూర్తిని జాజ్జ్వల్యమానం చేసుకుని అచ్చమైన సిరి గొప్పలను సాధించుకోగలడనీ నా శుభకామనలు.

*'గంధం చెట్టుకి*
*నన్నెవరో బంధించారు!*
*ఆమె బాహువుల్లో నేను!!'*

...అంటూ పరవశిస్తున్న మూర్తి ఆ కవితాకన్యతో సృజనాత్మక సంసారాన్ని సాగించి రాణించగలడని నా విశ్వాసం.

*14 డిసెంబర్ 2001*




# మిత్రవాక్యం

## అహో! ఆంధ్రభోజా! (పద్యకృతి)- శేషం రామానుజాచార్యులు

పసిడి రెక్కలు విసిరి కాలం పారిపోతూనే ఉంటుంది. గతించిన కాలమంతా చరిత్ర కాలేదు. చరిత్రకు నిలిచే గతంలోని వ్యక్తులు, సంఘటనలు మాట ఎలా వున్నా, చరిత్రకు సాక్షీభూతంగా మిగిలిపోయే స్థలాలే పురాస్మృతులను మేల్కొల్పు తాయి. గత వైభవ స్మరణం అందుకే చారిత్రక అంశమే అవుతుంది. పర్యటనల కారణంగానే మనిషి అనేక ప్రదేశాలను, స్థలాలను సందర్శించ గలుగుతాడు. ఆ సందర్శన సందర్భంగానే గత చరిత్రను సంస్మరించి, సంస్కృతీ వైశిష్ట్యాన్ని గ్రహించి అనుభూతి చెందుతాడు.

కాలం వెనుక స్మృతి పేటికలోకి జారిన వ్యక్తులనూ, సందర్భాలనూ, ఆయా స్థల క్షేత్రాలనూ అందరు పర్యాటకులూ అనుభూతి చెందడం వేరు. భావుకుడయిన ఒక కవి అనుభూతి చెందడం వేరు. కవి అనుభూతిలో కవిత్వీకరింప బడిన చరిత్ర సజీవంగా సాక్షాత్కరించడం మటుకే కాదు, రసావేశం కలిగిస్తుంది.

ప్రియమిత్రుడు శేషం రామానుజాచార్య హంపీ విజయనగర స్థల సందర్శనంతో తనకు కలిగిన అనుభూతి స్పందనలను 'అహో! ఆంధ్రభోజా' అనే పద్యకృతిగా ఆవిష్కరిస్తున్నాడు. నేడు పద్యం రాయగల దొక్క శుద్ధి వున్న కవులే తక్కువ. గణయతి ప్రాసల కూర్పుతోనే పద్యం ఏర్పడదు కదా! పద్యానికి ఏర్పడ వలసింది ఒక రూపు కాదు. పద్యం ఇచ్చేది ఒక ఊపు. ఆ ఊపు కవి ధీ విశేషత వల్లనూ, వస్తువు పట్ల హృదయదఘ్నంగా కవి స్పందించిన నైజం వల్లనూ

ఏర్పడుతుంది. **"ఎదలో మౌనము జివ్వునన్ ఎగసెనో - యింపైన భావంబులే పదమై షట్పదరాగ రంజితములై ప్రాబంధికా గంధమై ముదమారన్ చదివింపజేసెడిని"** అన్నట్లుగా హంపీ విజయనగర సందర్శనంతో కవి మౌనం కరిగి కదలి హృదయగత రసభావాలు ప్రిదిలి హృద్యమైన పద్యాలుగా పొంగాయి.

ఒకచో గతవైభవ కీర్తన, ఒకచో తిరిగిరాని ఆ స్వర్ణకాలం గురించిన ఆవేదన, ఒకచో సాహితీ సమరాంగణ సార్వభౌముడనిపించుకున్న కృష్ణదేవరాయల సమున్నత వ్యక్తిత్వం పట్ల ఆరాధన ఈ మూడూ ముప్పేటలుగా అల్లుకున్న ఈ పద్యకృతిలో లఘు ప్రబంధ లక్షణాలు కూడా ద్యోతకమౌతున్నాయంటే అందుకు కారణం విశేషించి కనబడే వర్ణనాదులే. ముఖ్యంగా ప్రత్యూషతోషియగుచూ భాసించిన ద్యుమణి గూర్చీ, హోస్పేట ఎర్రచెఱువు గురించీ చేసిన వర్ణనలు 'శేషం' భావుక విశేషాలే!

***"చౌర్యమెరుగని విజయ రాజన్య సీమ***
***రాత్రి ప్రియురాండ్ర యెదల వస్త్రాల దోచు***
***పవన చోరులు తప్ప వేరెవరు లేరు"***

వంటి సరస చమత్కారాలు కూడా శేషానికే చెల్లాయి.

మా రామానుజాచార్య కవిత్వం పట్లా, చరిత్ర సంస్కృతుల పట్లా అపరిమితానురాగం గలవాడు. ప్రాచీన కవుల పట్ల ఎంత శ్రద్ధాభక్తులు కలవాడో, అధునాతనం పట్ల అంత ప్రేమానురక్తులు కలవాడు. వచనమయినా, పద్యమయినా, వచన పద్యమయినా అతని రచనలో ఒక 'ధార' వుంది. దాని నైశిత్యం సహృదయ హృదయైక వేద్యం.

ఈ పద్యకృతిలో హజారా రామాలయం, వేణుగోపాలస్వామి ఖండికల్లోని భక్తి గరిమ, రాయల వ్యక్తిత్వం, పాలన, భువన విజయ కవుల ప్రశంసా పద్యాల్లో చూపిన కవిత్వ పటిమ పఠితలను అలరిస్తాయి. కొన్ని భావాలు పునరావృతమైనట్లు తోచవచ్చును గానీ పురావైభవ స్మరణంలో ఆర్తి చెందిన హృదయం తదనుగుణంగానే పలవరిస్తుందన్నమాట వాస్తవమే కదా!

ఏ పద్యమూ పనిపడి కూర్చిన ఫణితిలో కాకుండా సహజ రమ్యంగా సాగిపోవడం విశేషం. ఆ ఆశు లక్షణ 'ధార' ఇందలి పద్యాలలోని గుణం. పద్యాల క్రమం కూడా తదనుగుణంగానే హృదయ స్పందనాన్ననుసరించి

ఏర్పడినదిగా తోస్తుంది. అందువల్లనే ఈ కృతి రససమంచితం కావడంలో నిసర్గ రమణీయమవుతోంది.

మిత్రుడు శేషం రామానుజాచార్య తన కవిత్వ 'చైతన్యరేఖల'ను ఇన్నాళ్ళ తర్వాత హృద్యమైన పద్యం వైపు మరల్చి తన యాత్రాస్మృతిని "అహో ! ఆంధ్రభోజా" అనే ఈ కృతిగా వెలువరించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. సహృదయ పాఠకులను ఇది అలరించగలదనీ, శేషం రచనా వ్యాసంగం నిరంతరం విశేషంగా కొనసాగాలనీ, కీర్తిమంతం కావాలనీ నా ప్రగాఢ ఆకాంక్ష.

*ఫిబ్రవరి 2002*




# మెచ్చుమాట

## నగారా (కవిత్వ సంపుటి) – కపిల రాంకుమార్

***"ఊసులేవో చెప్పటానికి***
***మనసు నీతో విప్పటానికి***
***చేరవచ్చే మంచి నేస్తం***
***చెలిమికోరే పుస్తకం"***

అంటూ పుస్తకాన్ని మించిన చెలిమి లేదని 'నగారా' మ్రోగిస్తూ– ఈ కవితాక్షరాలు కుమ్మరిస్తున్నాడు కపిల రాంకుమార్. 'నయాగరా' అంత తన భావాల జలపాతాలను 'నయగారాలుగా' ఛందో బందోబస్తులు లేని స్వేచ్ఛా భావ పరంపరలుగా ఈ కవిత్వ పాదాలలో అడుగులు వేయించాడు.

కపిల– కవిత్వం'పిలక'ను బానే పట్టుకున్నాడు. అతని చేతిలో అది గెలలు వేస్తోంది. గెలుపుల కోసం అర్రులు చాస్తోంది. రాసేదాని పట్ల 'మొక్కుబడి' తనం కాక ఒక మథింపు, ఒక మదింపు, ఒక కుదింపు వుండడం అతని కవిత్వంలో ఇంపు నింపే విషయం.

సమాజంలో జరుగుతున్న అవకతవకల పట్లా, లుప్తమవుతున్న మానవ విలువల పట్లా తనకు ధర్మాగ్రహం వుంది.

ఆ ఆగ్రహం వల్లే మాటలు తడబడతాయి. అర్థస్ఫోరకాలు కావలసిన పదాలు అస్తవ్యస్తమనిపించి విస్ఫోటనం సృష్టిస్తాయి.

***"వావి వరసలు కానలేని***
***కామరాజుల కళ్లకు***
***తల్లి, చెల్లి, చిన్నపిల్ల***
***చప్పరించే గుళికలా?***
***పిచ్చిదైన బిచ్చగత్తెను***
***మందు పిచ్చిలో తల్లి చేసే***
***అచ్చుబోసిన ఎద్దుమించిన***
***మదపు వెధవల కంత మెపుడో"***

అంటూ నిరసిస్తాడు. ఆగ్రహాన్ని ఎంత అణచుకోలేడో, అనుగ్రహాన్నీ, అనురాగాన్నీ కూడా అంతగానూ అభివ్యక్తీకరిస్తాడు. అదే సమయంలో "గతపు చరితల నడకమార్చగ– వెలుగుకోసం– బతుకుకోసం పోరుచేయక తప్పదన్నా.. అంతకన్న దారిలేదు" అనీ ఉద్బోధిస్తాడు. **"ఎవరికొరకు ఈ రాజ్యం– ఎవరి సరుకు ఈ భోగ్యం– సొంతకాళ్లనిలిచేలా జనులందరు కదిలేలా... కళ్లు తెరిచి ఉద్యమించు స్వాతంత్ర్యాన్ని రక్షింపగ"** అని మేల్కొల్పుతాడు.

ఆడపిల్ల గురించీ, చాకిరీలో మగ్గిపోతున్న బాలకార్మికుడి గురించీ మతమౌఢ్యం గురించీ, అంటరానితనం జాడ్యం గురించీ, చెట్టు గురించీ, ప్రగతిమెట్టు గురించీ ఏది రాసినా తనకొక హృదయగతి లయ వుంది. ఆ 'లయ'కు గేయాల 'ఆలయం' కట్టే యత్నం చేసాడు. ఈ ఖండికలన్నింటిలోనూ ఒక 'తూగు' కోసం అతను అప్రయత్నంగనే 'ఊగు' లాడాడు.

రాంకుమార్ పోరాట శీలత్వం చైతన్య సంబంధి మాత్రమే కానీ ఉగ్రవాదం కాదు. **"హింస వీడి దారి మార్చి– నేటికైన కళ్లు తెరిచి– జనజీవన మార్గానికి– మనిషిలాగ కదలండి"** అంటూ ధర్మమార్గాన్ని చెబుతాడే కానీ ఉగ్రవాదాన్ని నిరసిస్తాడు. మంత్రాలు, మహిమలు, జిమ్మిక్కుల గారడీలు కపిలకు నచ్చవు. **'మోసగాళ్ల చేతిలో కీలుబొమ్మ దైవం– వ్యాపారపు సరళిలో ప్రజల నుండి దూరం'** అవుతున్నాడని భగవంతుడి గురించి కూడా జాలిపడతాడు.

హేతువును, తర్కాన్నీ ఆహ్వానిస్తూ–

***''రాయిరాయి రాపిడిలో నిప్పుపుట్టినా***
***వెదురుపొదల గాలి చేరి పాట పుట్టినా***

*అవసరాలు తీరుటలో సాధనాలు ముఖ్యం*
*సాధనాల పుట్టుకయే విజ్ఞానపు గమ్యం"*

అని పురోగమిస్తున్న శాస్త్రసాంకేతికతను స్వాగతిస్తాడు.

ఇది చైతన్యపు 'నగారా'

'అచ్చరాల బాటలో పుచ్చ వెన్నెల కాయించి', బక్కవాడి పక్కన నిలచి– సామ్యవాద భావనతో, ఒక్కతాటిన నడిపించే కవితాధ్వానం ఇది. 'మీ కోసం' ఈ 'కవిగారి కాన్వాసు' మున్ముందు మరింత విస్తృతం కాగలదన్న 'ఎదురుచూపు' నా 'ఆశ'. ఈ 'చెకుముకి' కవికి నా శుభాకాంక్షలు. మనసు తలుపులు తెరిచి నిర్భయంగా ఈ 'నగారా' వినండి. ఎందుకంటే

*''ఉహలకిది అందదు*
*ఊపిరులు తీయదు*
*ఊసుపోని హామీల*
*ఊబిలోకి దింపదు"*

సరికదా! కవిగారే హామీ ఇచ్చినట్లు ఈ నగారా ఏమని నినదిస్తుందంటే–

*"ముదనష్టపు బుద్ధులు*
*మార్చగాను పాడెద!*
*ముదము కూర్చువారిని*
*లాలించి చూచెద!!*

'కపిల' కవిత్వ లాలనామోద– ముదము నందుకునేందుకు, మీ పఠన పాటవం మీటేందుకు 'నగారా'ను అందుకోండి, కపిల రాంకుమార్ చైతన్య ధ్వానానికి సహృదయ స్పందనం కావించండి.

*13 ఏప్రిల్ 2002*




# గేయసుందరం 'బొమ్మ'

## తాయిలం (బాలగేయాలు)–బొమ్మనబోయిన సోమసుందరం

'**తా**యిలం' అన్న పేరులోనే తెలుగుతనం, తెలుగు–ఇళ్ళ మధురమైన బాల్యం చిప్పిల్లుతోంది. చిట్టి పొట్టి మాటలతో పిల్లలకు విలువయిన గట్టి గట్టి సంగతులను–పాటలుగా కట్టిన బొమ్మనబోయిన సోమసుందరం గారి బాల గేయాలన్నీ నిజంగా సుందరమైన బొమ్మలే. రెండు మూడు చరణాలలోనే విషయ వివరణంతో–పిల్లలకు అరటిపండు వొలిచి పెట్టినట్లు అర్థమయ్యేలా లయాత్మకంగా చెప్పడం సోమసుందరం గారి ప్రతిభ.

అమ్మ, నాన్న, గురువుల దగ్గరనుండి అంతరిక్షంలో చుక్కలదాకా వైవిధ్యంతో కూడిన ఇతివృత్తాలను పిల్లలకు ఆసక్తి కలిగేవాటిని ఎంపిక చేసుకుని, వాటిని అంత ఆసక్తికరంగానూ పాటలుగా మలిచారు. ఇవి బాలబాలికలకు ఆసక్తికరంగా వుంటాయనే వాస్తవం ఆకాశవాణి ద్వారా ప్రసారమైన వారి గేయాలు ఈ సరికే చాటి చెప్పాయి.

**"పసితనాన యెదను తన్ని ఎన్ని చిందులేసినా గుండెలోన ఆనందం గూడుకట్టుకున్న నాన్న"** ఋణం తీర్చుకోడానికి, పెరిగి పెద్దయ్యాక చదువులెన్నో చదివాక ఆయన సేవ చేసుకుంటాననే ఉదాత్త భావనలను ప్రోదిచేయడం–అంతరించిపోతున్న కుటుంబ విలువలకు, మానవ సంబంధాలకు ఒక కాపు కాయడమే. చుక్కమ్మ గురించి చెబుతూ **"మింటిలోన వుంటావని అనుకొంటిని ఇన్నాళ్ళూ, వున్నాసరే రావంటూ చెప్పారు మా వాళ్ళు"** అంటూనే. –**"ఎప్పుడైనా**

**చేరుకుంటా చిన్నారి ధ్రువునిలాగ"** అనడంలో బాలల్లో ఒక ఉత్తమ ఆశయదీప్తిని పాదుకొల్పడం వుంది. చిన్నారి-పొన్నారి బుంగమూతి గురించీ, తూనీగ గురించీ, ఇంద్రధనుస్సు గురించీ, సెలయేరు గురించీ, ఇలా ప్రకృతి అందాల గురించి రాసినా, బడిగంట, గడియారం, వంటి వస్తువుల గురించీ, పండుగల గురించీ- ఏమి రాసినా ఒక తూగువుంది. నన్ను ముఖ్యంగా ఆకట్టుకున్న విషయం వ్యక్తి పూజనూ, ఆరాధననూ ప్రోత్సహించే తరహా రచనలను, బాలగేయాల పేర 'సోమసుందరం' గారు ఈ 'తాయిలం'లో చేర్చకపోవడం. 'పొడుపు కథలతో పాట' చిన్ని మెదళ్ళకు మేతగా తెలివిని పెంచేది.

సంకలనంలో కెల్లా 'చిట్టిపడవ' మరీ ఆకట్టుకుంది. 'చిట్టి పడవా నడక భద్రం' అని జాగరూకత పలుకుతూ-**'పారు నీటికి వేగమొస్తే-పరుగుతీసే సమయమొస్తే- తెలివితేటల తేరుపైన కదిలి రేవును చేరుకో'** అన్న సందేశమే పిల్లలకు బొమ్మనబోయిన సోమసుందరం గారి గొప్ప 'తాయిలం'.

*30 జూన్ 2002*



# ద్రవ హృదయం కవిత్వం

## చేతకానినటి (కవితాసంపుటి) – తురగా జానకీరాణి

జీవితం కథగానే ఉంటుంది. ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో, కథనం ఎలా సాగుతుందో కథ నడుస్తూండగానే తప్ప తెలీదు.

అయితే మలుపుల్లో, మెరుపుల్లో గుండెల్ని పట్టే ఒక అనుభూతి రేఖ ఏదో రసమై చిప్పిల్లుతుంది. మొత్తం కథనంతా కుదిపేసి, కుదేసి ఒక గాఢానుభవం – అంతటినీ అతలాకుతలం చేస్తుంది. కానీ రక్తం చిందించిన ఆ అనుభవాన్ని రసమై ఇముడ్చుకోవడంలోంచే పుడుతుంది కవిత్వం.

కథ – కటిక వాస్తవం.

కవిత్వం – ఆ కథను నడిపే హృదయ సంబంధ శక్తి. ఒక లౌకికాంతర అభివ్యక్తి.

కథా రచయిత్రిగా ఖ్యాతి పొందిన తురగా జానకీరాణిగారి కవిత్వం ఇది. ఆమె జీవిత కథలోంచీ, ఆ కథ మలుపుల్లోంచి మెరిసిన అనుభవ గాఢతలోంచీ, హృదయాన్ని ఆవిష్కరించే అక్షరాలు ఇవి. కనుకనే అక్షరాలా ఇది ఆమె కవిత్వం. ఆమె హృదయం.

కవిత్వం ఖచ్చితంగా హృదయ సంబంధి అని – 'బాధ కవిత్వానికి పర్యాయపదం' అన్న మహాకవి మాటను 'కవిత్వం బాధకు ఉపశమన పథం'గా మలచుకున్న ఉదాత్త వ్యక్తిత్వ లక్షణం, తనను తానుగా వ్యక్తీకరించుకున్న క్షణం

– ఈ అక్షర సంపుటి. జానకీరాణి కవిత్వం ఆమె వినమ్రతతో భావించినట్లు ఎవరి ఔదార్యంతోనో అచ్చు కాలేదు. అచ్చంగా ఆమె తనను తాను కవిత్వం మాటున గుండె నిబ్బరంగల మనిషిగా జీవితాన్ని శిల్పీకరించుకున్నారు.

చిత్తంలో ప్రతి దెబ్బా సుత్తిదెబ్బగా మలచిన
మానవమూర్తిని మించిన మహిత శిల్పమేమున్నది

అని ఒక కవి అన్నట్లుగా – తన కవితా శిల్పాన్ని శోక, స్మృతి సాహిత్య ఆలంబన మీదనే అనిపించినా – కథల వచన రచనే కాదు, జీవనాన్ని ప్రతిష్ఠం చేసిన ప్రవచన రచనగా కవిత్వం కూడా మలుచుకున్నారు. కవిత్వాన్ని 'సర్వైవల్ బెనిఫిట్' గా, కవిత్వాన్ని బ్రతుకువరంగా మలుచుకుని అచ్చంగా కవిత్వం ఉదాత్తతను చాటారు.

**'నిన్ననే పౌర్ణమి వెళ్లిందని మరచి – నన్నీవేళ కాటేసింది అమావాస్య'** అన్న అభివ్యక్తిలోనే ఒక గాఢ విషాదాన్ని ఇమడ్చడం కవిత్వం కాదా?

**'తలుపులు వేసినా, తలపులు మడచినా జివ్వుమని గుబులు గాలులు వీచక మానడంలేదు....మధుర క్షణాలు  కొన్ని ఎదలోంచి వెతికి తీసి చిన్న చితుకుల మంట చేద్దామనుకుంటున్నా'**నని అనడం కవిత్వాన్ని చలికాచుకునే మంటగా భోగినాటి తెల్లవారు జాము చేయడం కాదూ!...

తండ్రి లేకుండా పాపకు పుట్టినరోజు పండుగ చేస్తున్నప్పుడు –

***'నీకిచ్చిన తీపి మిఠాయిని అదృశ్య హస్తం దోచేస్తున్న***
***భీతినెరుగని లేత నిబ్బరం, శోకం తెలియని అయోమయం***
***నిను చూస్తుంటే, నాలో ఉబికి, ఆగక కురిసే***
***ధారలు కట్టే అకాల వర్షం'***

అనడం కవిత్వ వర్షంలో నిబ్బరంగా తడవడమే.

**"మీరు లేని ఈ లోకం బొట్టు లేని రాణి ముఖంలా ఉంది"** అన్న జానకీరాణి – కవిత్వాన్ని నుదుటి చుక్కగా మలచుకున్నారు. తెల్లని అబద్ధంపై నల్లని నిజాల తెరలు జారినా, తెరల మాటున దాగిపోకుండా, రంగస్థలంపై నాటకాన్ని ప్రేక్షక జన సమ్మతంగా దర్శకత్వం వహించి, రెండు తెల్ల కలువలను కళా ప్రసూనాలుగా వేదిక మీద నిలిపారు.

'మెత్తని మనిషి – చిక్కని శిల', 'కలవరింత' వంటి కవితా ఖండికలను పరిశీలించినప్పుడు కాటేసే ఏకాంతంలోనే వాటేసే తోడును అనుక్షణం ఆమె ఎలా నిలుపుకున్నదీ తెలుస్తుంది. కవిత్వాన్ని తోడు చేసుకుని రాణి ఎలా రాణించిందీ, రాణకెక్కిందీ తెలుస్తుంది.

**'రాత్రి కథలోనే బతుకుతోంది అంతరంగం'** అంటూనే 'వాన రాత్రి' ఖండికలో 'రాత్రి క్రొత్త రూపుదాల్చిందేమిటి? రంగు మారినదా' అని నిజంగా నివ్వెరపోయేలాగానే – వేదనలోంచే జీవన నాదాన్ని శ్రుతి చేసుకున్నతనం, గొప్పతనం తనది. **'నాకైనవారు లేరు. లేనేలేరని గ్రుచ్చి చెప్తున్న రాకాసివాణి'** కూడా తన బాణీకి మలచుకుని, సుఖశాంతుల, కాంతి మందహాసాల జీవితాన్ని – కళ్ళు చెలమలవుతున్నా నవ్వే పెదాలతో అనవరతం జీవించిన ఘటికురాలు జానకీరాణి. ఆమె 'చేతగాని నటి' కాదు. తన జీవన సహచరుడిని కవిత్వంగా మలచుకుని, తోడుగా నిలుపుకుని ప్రస్థానం సాగించిన నిత్య వధూటి.

*"పండు పరకలు రెండు వస్తేనేమి*
*పట్టు చీరలే కట్టుకుంటాను*
*పాత సంఘం కట్టుబాట్లను తెంచి*
*నవ్వి, తుళ్ళి హాయిగా తిరుగుతాను*
*ఇంకా నా ఆనందంలో అపశ్రుతి ఏముంటుంది?"*

అని అందుకే నిబ్బరంగా అనగలిగారు.

*"సిరాలోనుంచి పుట్టినవేవో కొన్ని వ్రాసి*
*అచ్చొత్తించేస్తాను ! లోకం పోకడ ఇలాగే ఉంటే*
*కీర్తి శాలువాలు కప్పించుకుంటాను*
*ఇంక నా ఘనతకేమి తక్కువ*
*ఉభయ భాషలతో కాస్త పరిచయముంది*
*అవసరమున్న జ్ఞానపత్రాలు తిప్పుకుంటాను,"*

అంటూ నిజంగా మనగలిగారు.

అయామ్ హ్యాపీ! అయామ్ వెరీ హ్యాపీ. – జానకీరాణి కవిత్వం 'బాసట' నిరూపించినందుకు – కవిత్వం 'బాట' పయనించినందుకు. ఆవిడ లిప్తకాలమైనా

నిర్లిప్తంగా ఉండలేనితనాన్ని, తోడునీ, స్నేహాన్ని, సాహచర్యాన్ని, సంతోషాన్నీ ఈ అక్షరాలే ఇచ్చాయి. అందుకే నిజమైన కవిలా ఆమె 'కవితాయద్యస్తి రాజ్యేన కిమ్' అన్నట్లు ఈ కృష్ణమోహనాక్షరాల మమేకంతో అనగలిగారు ఇలా –

***"నాలో ఒక ఘోష విశ్వసంగీతం లా ఉండాలి***
***లేకపోతే పాపం ఈ అనుభవానికి శ్రుతి ఏది***
***అంతర్వాహినిగా వేదన రోదనగా ప్రవహిస్తుండాలి***
***లేకుంటే ఈ గుండెకు జీవనాధారం ఏది?***
***నల్ల చీకటి నీటి లోతుల కోనేరు నాలో తప్పదు***
***అదే నా కడుపులో మంచుకు, మనస్థితికి నిలయం"***

కృష్ణా ఎక్స్‌ప్రెస్ కారణంగా జీవితంలో ఆక్సిడెంట్ జరిగినా – అంతటి ఘోర ప్రమాదాన్ని తట్టుకుని, తననూ తన బిడ్డలనూ ఇవాళ లోకం ముందు సగర్వంగా నిలబెట్టుకుని, 'మహిళా సాధికారిత' కు మకుటం లేని మహారాణిగా దృష్టాంతంగా నిలిచి, వేదనానుభవాల్లోంచి జీవన వేదాన్ని ఆవిష్కరించి, విశ్వసంగీత ఘోషను ఈ కవితాక్షరాల్లో హృదయదఘ్నంగా నిలిపిన కవయిత్రికి సహృదయ పాఠకుడిగా నమస్కరిస్తున్నాను. ఉద్విగ్న హృదయం నుండే ఉషారమణీయ వసంతశోభను నిలిపిన కవయిత్రిని అభినందిస్తున్నాను.

ఆతురతగా – జానకీరాణి కవిత్వాన్ని పట్టుకోండి.
కవిత్వం హృదయదఘ్నం – తట్టుకోండి.
ఇది అనుభవ తిలకం – నుదుట బొట్టుగా పెట్టుకోండి.
మనస్కరిస్తే మీరూ నమస్కరించండి.
**'కవిత్వం ఒక తీరని దాహం'.**

**'కాఫీ కొంచెమే ఉందండీ'** – ఆకలి లేకపోయినా పూర్తిగా తాగేయండి. ఎందుకంటే జానకీరాణి కవిత 'ఉప' ద్రవం కాదు. హృదయార్ద్రవం. ద్రవ హృదయం.

*సెప్టెంబర్ 2002*




# ఆశంస

## అక్షరపుష్పాలు (కవితా సంపుటి) – కోట రత్నయ్య

తపన మంచిది. ఆ తపన మంచి అభిరుచితో కూడి, ఒక సంస్కారవంతమైన ఉదాత్తకృషి కోసం అయినప్పుడు మరీ మంచిది. తపన నుండే తపస్సు పుడుతుంది. తపస్సు చేతగానీ– 'ఉత్తమకళ' ఆవిష్కరణ కుదరదు. మొగ్గ అంటూ తొడిగినప్పుడు ఏ నాటికయినా పుష్పంగా వికసించగల ఆశ, ఆస్కారం, విశ్వాసం వుంటాయి.

రత్నయ్యగారు కవిత్వం గురించి తపిస్తున్నారు. కవిగా ఎదిగేందుకు, సాక్షాత్కరించేందుకు తపస్సు చేస్తున్నారు. ఆయనకు లోక వృత్త పరిశీలనం వుంది. 'సమాజం'లో నేటి 'సిరిమాయలు' గురించి తెలుసు. 'శ్రమజీవులు' గురించీ తెలుసు. కొన్ని 'నిత్యసత్యాలు' ఆయన ఆకళింపయితే చేసుకున్నారు –

*'భూగోళంలో అధికభాగం జలమయం*
*భూలోకంలో అధికశాతం జెలసీమయం'*

అని అందుకే అన్నారు. 'పోటీతత్వం విజయసూచకం – జెలసీతత్వం వినాశకరం'. అందుకే ఆయన తన రచనా కృషిలో తనదైన అక్షరపుష్పాలు వికసింప చేస్తున్నారు. అంత్యప్రాసల మోజు, భావప్రకటనంలో విషయాన్ని సూటిగా చెప్పాలనే తపనతో వచనమై తేలిపోయే రివాజు గురించి తెలుసు కనుక దానిని అధిగమించడం "ఇంకెంతకాలం?" తప్పక ఆయన 'ప్రతిభకు పట్టం' కట్టుకునే తరుణం వస్తుంది.

***"నమ్మకం వరిస్తుంది***
***మూఢ నమ్మకం హరిస్తుంది"***

'జీవనగమనం'లో 'పంజరంతో హృదయం' బంధించుకోక, 'క్షణాలమయం' నిండా 'అపూర్వనయనాలు'తో విషయాలను కవిత్వ వీక్షణం చేస్తూ, 'అక్షరప్రాకారం'లో 'మహనీయుడు'గా నిలిచి – మంచికవిగా రాణించగల నమ్మకంతో ఇలాగే సాగిపోవాలనీ, అందుకు 'అక్షర పుష్పాలు' 'నాందికావాలి' అనీ మనసారా శుభాకాంక్షలు. రత్నయ్య కవిరత్నమయ్యే 'పుట్టినరోజు'కు అభినందన శాంతివసంత మాలికలు.

*మార్చి 2003*




# ప్రశంసా వాక్యం

## వాక్యం రసాత్మకం (ఏక వాక్య కవితలు)– ఆచార్య ఫణీంద్ర

"ఆదియందు 'వాక్య' ముండెను" అనే బైబిల్ సూక్తం. సృష్టి నుండి, Sentence to Death అనే మృత్యువు తీర్పువరకూ – అంటే జననం నుంచి మరణం వరకూ వాక్యానికున్న ప్రాముఖ్యం తులలేనిది. కొన్ని అర్థవంతమైన పదముల సమూహం 'వాక్యం'. అయితే అర్థవంతమైన ఆ పదముల పోహళింపు వల్లనే, అంటే కూర్పు యొక్క ఫణితి వల్లనే, 'వాక్యం' కూడా అర్థవంతమవుతుంది. మీదు మిక్కిలి రసవంతమవుతుంది. పరస్పర సంబంధంతో కూడి ఏకార్థత్వము కలిగి క్రియతోగానీ తదితరము తోడగానీ సమన్వయించు పదసమూహము 'వాక్యం' అన్నది నైఘంటికార్థమే గానీ, నిజానికి వాక్యము అన్న దానికి యోగ్యత, ఆకాంక్ష, వాదము, సూత్రము, నీతివాక్యము, విధివాక్యము అని కూడా అర్థాలున్నాయి.

అలాగే ఆంగ్లంలో Sentence అన్నదానికి వాక్యము అని మాత్రమే కాదు తీర్పు, శిక్ష, దండన అనే అర్థాలు కూడా వున్నాయి. వాక్యం యొక్క శక్తి, బలం, జీవిక తెలుసు కనుకనే, మహావాక్యాలు, ఉద్గ్రంథాలు చేయలేని పని, వేయలేని ప్రభావం ఒక్కొక్కసారి ఒకే ఒక్క వాక్యం చేయగలదు, వేయగలదు అనే – 'వాక్యం రసాత్మకం కావ్యం' అంటూ 'రసాత్మకమైన వాక్యమే కావ్యం' అని వాక్కీకరించారు మనవాళ్లు.

సంభాషణను 'వాక్యాలాపం' అంటాం. మాటనేర్పరిని, చాతుర్యం కలవాడిని 'వాక్య విశారదుడు' అంటాం. వాక్యరచన, వాక్యవిన్యాసం బట్టే కవుల, రచయితల ప్రతిభా ప్రాభవాలు, తత్కారణంగా వారి కీర్తిప్రతిష్ఠలూ గణించబడతాయి.

వాక్యాలతో కూడింది కాబట్టే 'వాక్కు' – పలుకు, భాషకు అంత ప్రాముఖ్యం. ఇంతకీ వాక్యం గొప్పది. జనన మరణాల మధ్య మనిషికి అంతా ఒక వాక్యమే. అందుకే ఏకవాక్యానికి జనజీవన మమేకమైన గొప్ప విలువ వుంది.

ఇదిగో! ఈ మహత్తర భిత్తిక అంతా తెలుసు కనుకనే ఆచార్య ఫణీంద్ర ఏక వాక్య కవితలు అనే ఈ రసాత్మక రచనకు పూనుకున్నాడు. హైకూలు, నానీలు మొదలైన వాటికి కొంత విదేశీ వాసన – ప్రక్రియలోనో, ఛందంలోనో వుందేమోగానీ, ఫణీంద్ర ఫణితి అంతా భారతీయ పూర్ణేందుసాహితీ సంబంధితమే. వాక్యానికున్న విస్తృత శక్తిని ఈ కావ్యం తేటపరుస్తుంది.

పద్యాన్ని హృద్యంగా పలికించగల ఆధునికులలో, అందునా నవీన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పద్యంలో ప్రయోగించి మెప్పించగల దక్షులలో, ఉన్న అతికొద్ది మందిలో ముందువరుసలోనే వుండే ఫణీంద్ర భాషమీద మంచి పట్టు ఉన్నవాడు. భావుకతకు కొదవలేదు. అలాగని సామాజిక ప్రయోజనం విస్మరించి 'కళకళకోసమే' అన్న సిద్ధాంతాన్ని పట్టుకు వ్రేలాడేవాడు కాదు.

సంప్రదాయం మీద ఎంతగౌరవం, భక్తి ప్రపత్తులు వున్నాయో, చైతన్యశీలమైన మార్పులకు చేయెత్తి ఆహ్వానం పలికే నైజం అంతగానూ వుంది. అందుకే శతకరచన చేసినా, వచనకవితా రసగుళికలు తయారుచేసినా, దేశభక్తితో కార్గిల్ కదనం పై విజయవిక్రాంతిని వెలయించాడు. విశ్వజనీన ప్రేమతో 'ముద్దు గుమ్మ' కావ్యాన్ని వెలువరించాడు. ఇప్పుడు అల్పార్థముల అనల్పార్థ రచనగా ఈ ఏకవాక్యకవితలను పాఠకహృదయాలకు సంధిస్తున్నాడు.

ఇవన్నీ రసాత్మక కవితలు. 'ఎందుకయ్యా బండ్ల కొలదిగ ఎద కదల్చని కావ్యరాశులు' అన్నట్లు – పసముత్యాల పేరులుగా ఈ ప్రక్రియకు పూనుకున్నాడు. ఇది పూర్తిగా స్వదేశీ సంప్రదాయ ఫణితి. మేధకూ, హృదయానికీ కూడా ఏకకాలంలో ఆనందాన్నీ, అనుభూతినీ అందించే గుణం వీటిది.

ఈ ఏకవాక్య కవితలలో నిర్వచనాలుగా నిలిచేవి, నినాదాలుగా ధ్వనించేవి, సూక్తులుగా భాసించేవి, నీతులుగా తోచేవి, లోకంతీరు పై వ్యంగ్యోక్తులుగా 'గిల్లి' గింతలు పెట్టేవీ, అనుభూతితోనో, భావుకతతోనో రసగుళికలుగా అలరించేవి వున్నాయి. పొట్టి వాక్యాలూ వున్నాయి. కొంత దీర్ఘవాక్యాలూ వున్నాయి. అభివ్యక్తం

చేయదగిన అంశం బట్టి వాక్యాలనిడివిని కవితాత్మకంగా రసవంతం చేసే ఫణీంద్ర ఫణితిని స్పష్టంగా వీటిల్లో గ్రహించగలం. 'అవ్యక్తానుభూతిని అల్పాక్షరాలలో పెట్టగలిగితే – అదీ అసలైన కవిత' అంటూ ఫణీంద్ర – 'వాక్యం రసాత్మకం ' ఉద్గ్రంథాలెందుకు' అన్న లక్ష్యంతోనే రెండువందల యాభైరెండు వాక్యాలతో రసాత్మక కవితలను సంతరించాడు ఈ గ్రంథంలో.

లోతులు తరచిన కొద్దీ పాఠకుడి సహృదయతను బట్టి, విశ్లేషణను బట్టి, రసస్పందనను బట్టి ప్రతి కవిత్వపు పంక్తి కాంతిచ్ఛటలు కుమ్మరిస్తుంది.

'అగుపించేది కళ్ళకు – అనుభూతి గుండెకు' అన్నాడందుకే. 'వేల మైళ్ళ ప్రయాణమైనా వేసేది – ముందు ఒక అడుగే', 'జీవితం బ్లాక్ అండ్ వైట్ చిత్రం', 'చిలిపి మనసు – కోతి', 'కష్టపడు – సుఖం నీదవుతుంది', 'గుండె గుప్పెడే – కోరికలనంతం', 'పట్టుదలే విజయానికి పట్టుగొమ్మ', 'మితిమీరిన వాహన వేగం – శ్రుతి తప్పిన జీవనరాగం' వంటివి కొన్ని మునుపే విన్నట్లుగా అనిపించినా, ఫణీంద్ర రసాత్మకం చేసిన అన్ని వాక్యాలు అత్యంత విలక్షణంగానూ, ప్రతిభావంతంగానూ భాసిస్తున్నాయి.

***నింగిని నేలను నీళ్ళదారంతో ఒక్కటిగా కుట్టిన దర్జీ – సముద్రుడు.***
***కళ్ళకిటికీల గుండా – మనసు తొంగిచూస్తోంది***
***కనిపించదు – లేదని మాత్రం అనిపించదు.***
***శిల్పి కల శిలలో ప్రతిఫలించింది.***
***మట్టిమనిషవుతుంది – మనిషి మట్టవుతాడు***
***నడుము తీగపై నాభి – మొగ్గ***
***ఆ బుగ్గ పై సొట్ట – నవ్వు పువ్వునెవరైనా కోసుకున్నారేమో***

ఇలా ఉదాహరించు కుంటూ పోతే పుస్తకం రెండుసార్లు అచ్చొత్తించారేమో ననుకోవచ్చు. ప్రతిదీ ఉదాహరించదగిన కవితా వాక్యంగా రచించడమే ఫణీంద్ర ప్రతిభ.

***'కవి నా నామధేయం – నా కావ్యమే నా పరిచయం'***

అన్న ఫణీంద్ర –

***'వెళుతున్నా – నా ముద్ర నీపై వదలి'***

అని ఆసాంతం చదివిన పాఠకుడితో అందుకే నిర్ద్వంద్వంగా అనగలుగుతున్నాడు, ఈ 'రసాత్మకం' సంపుటితో. **'మరో ప్రతిభావంతుడు పుట్టినంత మాత్రాన నీ పుట్టి మునిగినట్టు ఏడిస్తే ఎలా'** అని తమ నీడన మరో మొక్కని మొలవనివ్వని మఱ్ఱిచెట్లను నిరసిస్తూనే, **'అనామకుని ప్రతిభను పట్టించుకోని ప్రజలు కీర్తిమంతుడు 'కీ' అన్నా, 'కా' అన్నా కీర్తిస్తారు'** అని లోకరీతిని కూడా నిర్మొహమాటంగా చెబుతున్నాడు ఫణీంద్ర. అయినా తనే అన్నట్లు 'ఆశకు, ఆశ మీద ఆశ నెరవేరాలని ఆశ' – అచ్చమైన 'మన తనం' కోసం, 'మనీషి తనం' కోసం తపిస్తున్న ఆచార్య ఫణీంద్ర 'వాక్యం రసాత్మక కావ్యం' అన్న ఆర్ష వాక్యానికి దృష్టాంతంగా ఈ ఏకవాక్య కవితలను ఒక నూతన ప్రక్రియగా అందించడం ఎంతయినా అభినందనీయం, సహృదయ సమాదరణీయం.

*మార్చి 2004*




# మిత్రవాక్యం

## అమ్మే జీవన వేదం (కవితా సంపుటి
## - ఎం.ఆర్.వి. సత్యనారాయణమూర్తి

**స్పం**దించే హృదయం ఉండాలేగానీ, సమాజంలో నిత్యం అనేక సంఘటనలు-ఆవేశాన్నీ, ఆలోచనను రేకెత్తించేవే. మామూలు మనుషులు చూడని, చూడలేని పార్శ్వాలను కవి వీక్షిస్తాడు. కవి చేసేపని ఏమిటంటే-వాటిపట్ల తన స్పందనను అభివ్యక్తం చేయడం ద్వారా, సాటివారిని స్పందింప చేయాలని ప్రయత్నించడం! కవి భావనను అందుకోగల్గిన పఠిత-కవితలోని కవిహృదయాన్ని అర్థంచేసుకుని, అతగాడు ఇచ్చే ప్రబోధాన్నో, సందేశాన్నో అందుకుని, కవిభావనలతో ఏకీభవించడం ద్వారా, సహానుభూతి ప్రకటించడం మాత్రమేకాక, సమాజంపట్ల, వ్యక్తులపట్ల కవి చూపిన దిశగా ఆలోచించి-ఆచరణకు పూనుకోగల్గుతాడు. "POETS ARE UN ACKNOWLEDGED LEGISLATORS OF THE WORLD" అన్న మాట అందుకే వచ్చింది. కవులు నేరుగా శాసనకర్తలు కాకపోవచ్చు, కానీ తమ కవిత్వ భావనలద్వారా పాఠకుల హృదయాలను చైతన్యవంతం చేసి, వారిని మంచివైపు ఆచరణాత్మకంగా అనుశాసింప గల్గుతారు. కలం బలం బట్టి కవి శాసనకర్తృత్వం అనేది ఉంటుంది.

అందరు కవులూ ఒకేలా ఉండరు. నిబద్ధత, నిమగ్నత గలవారు కొందరయితే, సమయానుకూలంగా జెండా ఎగురవేసేవారు కొందరు. ఇజాలతో, వాదాలతో, ఉద్యమాలతో మమేకమయ్యేవారు కొందరయితే, అటువంటి తీరు ఏమీ లేకుండా-కేవలం కాలిక స్పందనలకు, అభివ్యక్తికి ఆలవాలమైనవారు

ఇంకొందరు. అయితే ప్రతికవీ సమాజహితాన్నీ, మానవీయవిలువల పరిరక్షణనీ అభిలషిస్తాడనేది, అభిలషించాలనేది అంగీకరించవలసిన విషయం.

"అమ్మే జీవనవేదం' అంటున్న కవి ఎం.ఆర్.వి.సత్యనారాయణమూర్తి ఈ సరికే పాఠకలోకానికి పరిచితుడు. పేరులోని 'సత్య' నిష్ఠ అతని మూల సూత్రం. అందుకే కరిగే 'కొవ్వొత్తి' అయిన స్త్రీ మూర్తిలోని అమ్మదనానికి నీరాజనాలిస్తున్నాడు

***"అలజడి మా జీవితం***
***ఆందోళన మా ఊపిరి***
***తిరుగుబాటు మా వేదాంతం"*** అనడు ఈ కవి,

***"అమ్మే జీవితం***
***అమ్మే సర్వస్వం***
***అమ్మే జీవనవేదం"*** అంటాడు. ప్రపంచీకరణ, కన్స్యూమరిజం నేపథ్యంలో 'అమ్మే' అనేది అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన వ్యాపార పరంగా ధ్వనించే దౌర్భాగ్యం ప్రబలుతోందనీ మనకు తెలుసు. అందుకేనేమో 'బాల్యం విడిచిన కన్నీటి చారికలు' అనే కవితలో ఇలా అంటాడు-

***"డబ్బు అందరికీ అవసరమే***
***ఆ సంపాదనే***
***జీవన మాధుర్యాన్ని కొల్లగొట్టి***
***చెఱకు పిప్పిలా చేస్తోందని గ్రహించాలి***
***బిడ్డల లాలనకు కూడా టైం లేదనడం***
***నాగరిక మూర్ఖత్వానికి దర్పణం"***

ఎవరికి వారు మనకెందుకులే అని నిర్లక్ష్యం చేస్తే, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఎడారిలో ఒయాసిస్సులై జీవనవిలువలు కనుమరుగవుతాయి. అలా కాకూడదనే ఈ కవి ఆర్తి.

***"కంప్యూటర్లు, సెల్ ఫోన్లు***
***నువ్వు తల పైకెత్తి చూసినా***
***'కొస' కనిపించని ప్రగతిస్తంభం..!***
***అంతర్లీనంగా శోధిస్తే***
***అవగత మవుతుంది***
***అది ప్రగతి స్తంభం కాదు***

*ప్రపంచబ్యాంకు అప్పుల*
*అగ్నిస్తంభమని...!"*

ఉదాత్త మానవవిలువలను ప్రోది చేసే మూలాలను మరిచిపోని కవి! మంచినే గెలిపించు అని ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహిస్తూ నిష్కర్షగా చెబుతాడు. 'స్త్రీ నిత్యదరహాసిని' కావడానికి అందాల పోటీలు కాదు... అందరి హృదయాలు గెలిచే పోటీలు రావాలి– ఆడది నిర్భయంగా తిరిగేస్థితి కావాలి– కలకంఠి కంట కన్నీరు చిందని రోజు వుండాలి" అని అభిలషిస్తాడు.

*"భారతీయుడిగా జన్మించినందుకు గర్వపడాలేగానీ*
*విలువలను దిగజార్చి*
*సంపాదనే ధ్యేయముగా జీవించడం*
*మనిషిగా నీకు తగదు"* అని హెచ్చరిస్తాడు.

భారతీయ సంస్కృతిపట్ల, సంప్రదాయాలపట్ల అపారమైన గౌరవం వున్నవాడు కవి. అలాగని మతఛాందసుడు కాదు. 'ఎదగాలి' అన్నకవితలో నేడు మనిషికి కావలసిన లౌక్యం గురించీ, అణచివేసుకోవాల్సిన అంతరాత్మ గురించీ వ్యంగ్యంగా పేర్కొంటాడు–

*"జీవన వృక్షానికి పట్టిన చీకాకు చీడను*
*సహనం చిరునవ్వుతో తొలగించి*
*అనురాగ జలధారల్ని*
*అణువణువూ పులకించేలా అందించు"*

అని జీవన–వేదనల గురించికాక, ఆశావహమైన సందేశనాదాలను నినదిస్తాడు కవి. అయోమయం, పులుముడు, మార్మికత, ప్రయోగలౌల్యం వంటివేమీ లేకుండా, సాదాసీదాగా కవ(చ)న పద్ధతిగా చెప్పడమే కవికి ఇష్టం. ఎలాచెప్పాడు అనేదానికన్నా ఏంచెప్పాడు అన్నది ముఖ్యంగా గ్రహించుకోవడం అవసరం. 'విజ్ఞత' గల 'వాడంతే'. 'దిగజారుడు' తనం విడిచి, 'కలం' 'ఎదగాలి' అనే 'ఆలోచించు'. అటువంటి మంచి కవి 'నేస్తం' సత్యనారాయణమూర్తికి మనసా శుభాకాంక్షలు.

*24 మార్చి 2005*




# 'లక్ష్మి (కవిత్వ) కళ'

## గమనం (కవితా సంపుటి) - కె.బి.లక్ష్మి

**'సీతాకోకచిలుక రెక్కలపై**
**చిక్కులుగా అల్లుకున్న కలల వల**
**రంగులు విరిసే హరివిల్లులా**
**కొండ అంచుల్లో పరుచుకున్న**
***పచ్చని అడవిపూల పారాణి,'***

కె.బి.లక్ష్మి స్వతహాగా భావుకురాలు. 'ముద్దుమురిపాల మంచుముసుగై మనసును కరిగించే కోమలత్వం' గా ఒక వంకా, 'ఎదలోయల్లోని మంచుపొగలో వికసించే అగ్నిపుష్పం'గా మరోవంక తారసిల్లే తరుణి. ఆవేశం, ఆవేదన, సౌహార్దం ముప్పేటలుగా అల్లుకుని అభివ్యక్తమయ్యే మనసుమాట - తన కవిత్వం.

అక్షరాల్లో ఆలోచనను రేకెత్తించినట్లే, అభివ్యక్తిలో ఆకర్షణనూ, రసానందాన్నీ పంచిపెట్టగలిగేదే నిజమైన కవిత్వం. అందుకే చదువుకుని ఆలోచించి ఆనందించే కవితలు కొన్నయితే, కవిముఖతః విని ఝటితస్ఫూర్తినీ, వెనువెంటనే రసానుభూతినీ పొందే కవితలు కొన్ని. కవిత్వం-పఠిత, లేక శ్రోత భావ వినిమయానికి చైతన్యస్ఫోరకం కావాలి. కలంపట్టి కాగితంమీద కవిత్వం రాసి అచ్చుపోస్తే అవి అక్షరాస్యులకే అందుతాయి. కానీ రాసిన కవితను గళంవిప్పి జనహృదయాల్లోకి రసరమ్యంగా చొప్పించగలిగినప్పుడు మరుక్షణం కరతాళధ్వనుల ప్రతిస్పందనం వినిపిస్తుంది, కనిపిస్తుంది. రాసే కవిత్వానికీ, వినిపించే కవిత్వానికీ అనివార్యంగా

అందుకే కొంత తేడా వుంటుంది. చదువుకుని ఆలోచించి ఆనందించడానికి సమయం పట్టేదిగా కాక – విన్నవెంటనే శ్రోతల్లో ఆలోచన రేకెత్తించి రసానంద పరవశుల్ని చేయగలగాలి. కవిసమ్మేళనాల్లో పాల్గొనేకవులు అందుకే ముందు శ్రోతలను తాము వెనువెంటనే రంజింపచేసే అభివ్యక్తికీ, పఠనా ఫణితికీ ప్రాధాన్యమిస్తారు, ఇవ్వాలి.

కవికి 'కమ్యూనికేటివ్ స్కిల్స్' చాలా ముఖ్యం. రాయడం ఒక ఎత్తయితే, రాసినదాన్ని జనంలో అంత ఆలోచనాత్మకంగానూ, అర్థవంతంగానూ చదివి వినిపించి, వారిని రసోన్ముఖులను చేయడం ఒక ఎత్తు. చాలామందికి ఈ ప్రజ్ఞ అలవడడం అరుదు. తన కవితను తాను చదివి వినిపించి శ్రోతను ఆ కవితలోని భావంతో ఆకట్టుకోవడం కూడా కవికి అవసరం. 'నేను రాసినదేదో అచ్చుఅక్షరాల్లోనే చదివి పాఠకులు ఆనందించాల'ని వారు అనుకుంటే, జనమమేకం కావలసిన పార్శ్వాన్ని వారు కోల్పోతారు.

చప్పట్లకోసం, జనాకర్షణకోసం రాసే కవిత్వంలో అంత పస, బిగి వుండవనుకుంటే అది కవి దోషమేగానీ వేరు కాదు. తాననుకున్న భావాన్ని శ్రోతకు కవిత ద్వారా కవితాపఠనం చేస్తూ అందించవలసిన బాధ్యత కవిదే. కవిసమ్మేళనాలలో శ్రోతలను ఆకట్టుకోలేకపోతే కవులు కేవలం అక్షరాస్యులకీ, అందునా కవిత్వాన్ని ఒక బ్రహ్మపదార్థంగా మలిస్తే కేవలం సాటి కవిబృందానికి మాత్రమే పరిసీమితమౌతారు. "గుడు గుడు గుంచం" వ్యవహారంగా తయారయ్యే కవిత్వం–ఏ సామాజిక ప్రయోజనం కోసం, ఏ స్పృహతో, లక్ష్యాలతో రూపొందాలో ఆ ప్రయోజనాలకు దూరమైపోతుంది. అందువల్ల జనంలో కవిత వినిపించి రసరంజనమో, ప్రభంజనమో పుట్టించగల అభివ్యక్తిశక్తి కవికి కావాలి.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే కె.బి.లక్ష్మి "గమనం"లో తాను కవిసమ్మేళనాలలో వినిపించిన కవితలనే ఎక్కువ చేర్చింది. ఆ రకంగా ఇది ఒక విశేషతను సంతరించుకుంది. ఇందులోని కవితలు పైకి చదివి, చుట్టూ శ్రోతలను ఆకట్టుకునే తీరులోనే ఎక్కువ తారట్లాడుతున్నాయి. అందునా ప్రత్యేకించి తెలంగాణ మాండలికంలో లక్ష్మి వినిపించే కవితలు ఆయా కవి సమ్మేళనాలలో శ్రోతలను విశేషంగా ఆకర్షించడం స్వయంగా నేనెరుగుదును. పలు సంస్థల కార్యకర్తలు లక్ష్మిని తన కవితను మాండలికంలోనే రాసుకురమ్మని కోరడమూ కద్దు. ఇందులోని

ప్రతికవితా కవిసమ్మేళనం కోసమే రాయకపోయినా, రాసాక మటుకు ఏదో ఒక వేదిక నుండి చదివి వినిపించిందే. అందుకే ఈ సంకలనం ఒక విలక్షణతను సమకూర్చుకుంది. బహుశా కవిసమ్మేళనం కవితలే అన్నింటినీ కూర్చుకుని వెలువడుతున్న కవయిత్రి కవితా సంకలనం ఇదే మొదటిది అనుకుంటాను. ఆ రకంగానూ ఇది ఒక ప్రత్యేకతను సంతరించుకుంటోంది.

ఇంకా తానే-సామయికతను దృష్టిలో పెట్టుకుని కొన్ని కవితలను స్వయంగా ఎడిట్ చేసుకుంది. సమకాలికంగా కవి సమ్మేళనాల్లో సభారంజకంగా పలికిన కొన్ని పంక్తులను ఔచిత్యం దృష్ట్యా పరిహరించుకోవడం కూడా ప్రశంసనీయం. అది తన విజ్ఞతకు తార్కాణం. కొన్ని తత్కాల చమత్కారాలను గ్రంథస్థం చేయక పోవడమే మంచిదని తను భావించింది. వ్యక్తులను, వ్యవస్థను అక్కడి లోపాలను తూర్పారబట్టినప్పుడు జనంలో ఉత్సాహమూ, ఉద్రేకమూ కలిగి కరతాళధ్వనులు ప్రతిధ్వనిస్తాయి. ఆ సామయిక సందర్భం పాతబడిపోయినప్పుడు కవితలో ఆ పంక్తులు అప్పటి తీవ్రతను సంచలనాన్ని కోల్పోయి చల్లబడతాయి. అందుకే కవిసమ్మేళనం కవితలను సంపుటీకరిస్తున్నప్పుడు లక్ష్మి తీసుకోవలసిన జాగ్రత్తలు తీసుకుంటూనే కవిత్వీకరణకే ప్రాముఖ్యం ఇచ్చింది.

ఈ 'గమనం'లోని కవితల క్రమంలో కూడా ఒక కాలక్రమం కనిపిస్తుంది. జనవరి నుండి డిసెంబర్ వరకు ఏడాదిలో వచ్చే పన్నెండు నెలల్లో వచ్చే ప్రత్యేక సందర్భాలు ఈ కవితల క్రమం ఇతివృత్తాలయ్యాయి. సంక్రాంతి, ఉగాది, దసరా, దీపావళి వంటి పండుగలు, అంతర్జాతీయ మహిళాదినోత్సవం, ఫ్రెండ్‌షిప్‌డే, గ్రంథాలయ వారోత్సవం, జెండాపండుగ, కార్గిల్‌డే, రాష్ట్రావతరణ, జన్మభూమి వంటి సందర్భాలు ఈ కవితలకు ఇతివృత్తాలు. కవిసమ్మేళనాలు జరిగే సందర్భాలన్నీ లక్ష్మి కవితారచనకు కారకాలయ్యాయి.

చెప్పదలుచుకున్న భావాన్ని అందంగా, నేరుగా శ్రోతృజన స్పందనాను గుణంగా కవిత్వీకరించడం, అంత ప్రతిభావంతంగానూ చదివి వినిపించడం లక్ష్మికి అలవడిన కళ. ఈ లక్ష్మీకళ ఆమె కవిత్వ 'గమనం'లో ఉట్టిపడుతుంటుంది. ఇవి కవిసమ్మేళనాల కవితలు కాబట్టి పాఠకులు చదువుకుంటున్నప్పుడు వాచ్యంగా తోచే అభిధా పంక్తులలోని కవయిత్రి వ్యంజనాశక్తిని గ్రహించగలిగినప్పుడు కవిత్వ

రసానుభూతిని సభాముఖంగా శ్రోత అందుకున్నట్లుగానే అందుకోగలుగుతారు. గహనమూ, జటిలమూ, మార్మికమూ, అయోమయం, పులుముడు వీటిల్లో కనిపించదు. హృదయంనుండి హృదయానికి ప్రత్యక్ష ప్రసారం చేసే భావవినిమయ రచనలివి. అలవోకగా పలికినట్లున్నా వాటి వెనుక ఆమె ఆర్తినీ, స్ఫూర్తినీ తాను లక్ష్యించిన సామాజిక ప్రయోజనాన్నీ గుర్తించడం ముఖ్యం.

***"శ్రమైక జీవన సౌందర్యానికి ఖరీదుకడుతూ***
***మెట్టుమెట్టు ఎక్కుతూ***
***కలాన్ని ఝళిపిస్తూ... అక్షరక్షరాన్ని చెక్కుతూ***
***ప్రత్యేక కంఠస్వరాన్ని వినిపిస్తూ నిలబడినవేళ***
***ఎంత శిల్పాన్వితమో మనుగడ!"*** *(సత్యం శివం సుందరం)*

అంటున్న లక్ష్మి కవితాశిల్పాన్ని-

***"కాగితం మీద పొదిగిన పంక్తులు వచనీయం***
***కనులమాటుల దాగిన కబుర్లు అనిర్వచనీయం"***

అన్నట్లుగా వీక్షించి ఆనందానుభూతినొందడం సహృదయ హృదయైకవేద్యమే. కవితానుభూతి 'అర్హత అందానికి సంబంధించింది కాదు - అంతరంగానికి సంబంధించింది' మరి!

***"ప్రతి ఊర్పు నిట్టూర్పై***
***బాధల భారంతో హృదయం బరువెక్కిపోతే***
***ఓదార్పునాశించడం అపరాధమా?"***

అని ప్రశ్నిస్తూ హృదయాలను తేలికపరచే మామూలైన మాటల్లోనే తన కవితను ఒక అనుకంపగా మలచగలిగిన లేఖిని తనది.

***"దుఃఖసాగరం కంటే పృథ్విగొప్పది.***

***కన్నీటి బిందువు కంటే మట్టిరేణువు గొప్పది"*** అంటూనే దేశమంటే మట్టికాదు మనుషులన్న భావనకనుగుణంగానే మనుషులు - మట్టిని, మాతృభూమిని ప్రేమించాలన్న జాతీయతను తాను మేల్కొల్పుతుంది.

***"జెండా ఒక నమ్మకం***
***జెండా ఒక ప్రేరణ***
***జెండా ఒక గర్వకారణం***
***జెండా ఒక రక్షణకవచం"*** అని కవిత్వం జెండా ఎగురవేస్తుంది. 'అమ్మా బయలెల్లినాది' కవితలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నేడు కావాలనే వారికి–ఉన్న తీరును వ్యంగ్యంగా బహిర్గతం చేస్తూ, "ఇస్పీచులల్లు" కాక "దిల్‌భర్" వుండాల్సిన దేశభక్తిని గురించి హెచ్చరిస్తుంది."అణుబంధమే తప్ప అనుబంధాలు తెలీని మూర్ఖ పోరాటవాదాన్ని" నిరసిస్తుంది.

ఆలోచనలు పెంచే పుస్తకం గురించి –

***"ఈనాడు నీవు హస్తభూషణానివి కావు***
***అక్షరలక్షల అమూల్య సృజనవి***
***మా ఆలోచనల్ని పదునెక్కించే పరుసవేదివి"*** అంటుంది.

వెండితెర వ్యామోహాలనుండి, వెకిలి ఛానెళ్ల వ్యాపారధోరణుల నుండి రక్షించే రక్షణకవచంగా సంభావిస్తుంది.

కె.బి.లక్ష్మిలో అంతస్సూత్రంగా ఒక తాత్త్వికత దాగి వుంది. అది నైరాశ్యం కాదు, జీవితం పట్ల అవగాహనతో కూడిన ఒక ఆలోచనాసరణి. వ్యక్తి శక్తిగా మారే, సమాజ సంఘటిత దృక్పథం.

***"మూడక్షరాల జీవితం***
***ఎన్ని జీవన వేదాంతాలను విడమరుస్తుంది.***
***మన ఉనికి మనకోసం కాదు***
***మనతోటి వారి కోసమన్న నిజాన్ని***
***అనుభవం అనుక్షణం జాగృత పరుస్తుంది"*** అన్న తాత్త్విక స్మృతి రేఖ తనది.

***"సృష్టిని సంస్కరించాలనుకోవడం***
***నీ భావాల కొలమానంతో తూచాలనుకోవడం అవివేకం***
***ధ్యానమార్గాన మనోయాత్ర సాగనీ"*** అంటూ ఆ యాత్ర జనమమేకమూ, సృష్టిమమేకమూ కావల్సిన బృందగానమే కానీ, సోలిపోయే 'సోలో' కాదని చెప్పకనే చెబుతుంది.

*"ఈ ప్రపంచం ఒక సుందర రచన - ఈశ్వర సృజన*
*ఒక అద్భుత స్వర సమ్మేళనం*
*ఆ ఝరీనాదంలో నీ హృదయలయని మేళవించు"* అని హితవు పలుకుతుంది.

ముందే చెప్పినట్లుగా లక్ష్మి కవిసమ్మేళనం కవితల్లోని ప్రత్యేకత "మాండలికం". తెలంగాణ యాస అంటారో, హైద్రాబాద్ తెలుగు అంటారో మీ ఇష్టంగానీ - ఆ శ్రమ జీవుల పలుకుబడితో ఇందులో అరడజను కవితలదాకా వున్నాయి. పాయసంలో జీడిపప్పులా వాటి రుచి ఒక ప్రత్యేకత.

*"పవేట్ దస్తర్ల కొలువాయే*
*గింతన్న పురుసత్తి దొరకది*
*పెయ్యి బాగులేకున్న గాని*
*కొలువుకురకాలె",* అని సంక్రాంతినాడు వుండే 'పరేషాన్' చెప్పినా,
*"బతుకురంగు దిగిన బద్‌నసీబ్‌లాడుంటె*
*గీడ రంగులు గుప్పనింకి నాకు సేతులు రాలె*
*గందికే హోలి ఆడుదు బంద్ జేసిన"* అన్నా-

*"దునియ తీరు జూస్తే దిమాక్ ఖరాబయితున్నది*
*ఇగ పండుగ జేయాల్నంటే హుషారేడకెల్లోస్తది"* అంటూ

*"ఎప్పుడు తినే పచ్చడేనాయే!*
*మల్లమల్ల ఏందింటవ్‌గాని*
*చక్కెర తక్వయిందని నకరాలు చేయకుంట*
*జర గరీబోల్ల చాయ్ తాగిపో*
*ఇన్నవా? జర చాయ్ తాగిపో?"* అని ఉగాదిని పల్కరించినా-

*"కమలమ్మ పెండ్లికి కారటొచ్చింది గని*
*నేనైతే పెండ్లికి బోతలేను"*

అని ఆ వైనాన్ని కవితలో కథనాత్మకం చేసినా-వాటి వెనుక ప్రస్తుత వ్యవస్థ తీరుతెన్నుల పట్ల ఒక స్పష్టమైన దృశ్యావలోకనం, ఆర్తి గల కవయిత్రి ఆ అనుభూతిని కవితాత్మకం చేస్తూ చైతన్యం చెంగలింపజేసే తీరును అందిపుచ్చుకోగలం.

మూడు దశాబ్దాలకు పైగా సాహిత్యకృషి కొనసాగిస్తున్న డా॥ కె.బి.లక్ష్మి ముప్ఫై కవితలతో తొలిసారిగా కవితాసంపుటిని వెలువరిస్తున్న ఈ 'గమనం' వెంట–పాఠకుల 'హృదయంగమ గమనం' సాగుతుందని నా ఆకాంక్ష. 'మనసున మనసై' న కథకురాలిగా ఇప్పటికే పాఠకలోకం తనను సమాదరించింది. మహిళా జర్నలిస్టుగా, మంచివక్తగా, సంపాదకురాలిగా, యాంకర్ గా, స్నేహశీలిగా సాహిత్య ప్రపంచంలో సుపరిచితమైన డా. కె.బి.లక్ష్మి తొలుత కవయిత్రిగానే కలం పట్టింది. కళాశాల రోజుల్నించి కవిసమ్మేళనాల్లో కంఠం విప్పి కవిత చెప్పి శ్రోతలను ఆకట్టుకుంది. మౌలికంగా కవితాహృదయంగల లక్ష్మి తన ప్రత్యేకతను చూపుతూ (కవిసమ్మేళన కవితలతో వెలువడుతున్న తొలి కవితా సంపుటిగా) వెలువరిస్తున్న 'గమనం'కు మనస్ఫూర్తిగా అభినందనలందిస్తూ, ఈ సంకలనం పాఠకజనాహ్లాదమూ, ఆమోదమ ఇతి...... మిత్రవాక్యమ్!

*10 మార్చి, 2006*




# సద్యోజనిత భావనలు

## అలల కొలువు (మినీ కవితలు) – వాసా ప్రభావతి

"Poetry is the spontaneous overflow of powerful feelings, It takes its origin from emotion recolleted in tranquility" **-"Words Worth**

"There is nothing either good or bad but thinking makes it so"

**- Shakespeare**

**మ**నసున వున్నది, చెప్పాలని వున్నది మాటలుగా అభివ్యక్తం కావడం అనుకున్నంత సుళువు కాదు. అయితే అనుభూతి తీవ్రత నుండి, మనోద్వేగక్షణం నుండి ఉప్పతిల్లిన పలుకు కవిత్వ రూపం ధరిస్తుంది. అది ఒక సద్యోజనిత స్థితి. సూటిగా, గాఢంగా, సంక్షిప్తంగా, అర్థవంతంగా తరగలెత్తే భావ బిందువులే మినీ - కవితలనేవి. ఆ అక్షరాల మొలకలు పఠితకు అనుభూతి వృక్షాల రసచ్ఛాయల నివ్వగలుగుతాయి. పఠిత ఆలోచనా పరిధి ననుసరించి కవిత్వానుభూతి అందుతుంది. నిజానికి మినీకవిత ఒక భావశకలం, సద్యోజనిత భావన. అద్దంలో కొండను దర్శించడమే మినీకవితలోని సమగ్రత. కొండను చూసిన ప్రత్యక్షానుభూతి కావాలంటే విస్తారంగా వెళ్ళి చూడాల్సిందే. అయితే కొండవద్దకు స్వయంగా వెళ్ళలేనప్పుడు కొండనే మన దగ్గరకు తెచ్చుకోవాలంటే అద్దమే నయం కదా! అద్దం అబద్ధం చెప్పదు. ఎటొచ్చీ అద్దం పరిశుభ్రంగా, మరకలు లేకుండా, హెచ్చుతగ్గులు లేకుండా ఉండాలి. మినీకవిత ఒక అద్దంలాంటిదే. అద్దం అలంకార సామగ్రిలోనిదే అయినా, వ్యక్తిత్వ వికాసంలో

దాని పాత్ర అవిస్మరణీయం. సాహిత్యాన్ని సామాజిక దర్పణంగా మనం భావిస్తాం. అందుకని నిలువుటద్దం సైజులో తన 'మహాప్రస్థానం' అచ్చేసుకోవాలని శ్రీశ్రీ కలగన్నాడు. స్త్రీలు ఇవాళ తమ వ్యానిటీ బాగ్‌లో చిన్న అద్దం వెంటనుంచుకుంటూంటారు. ఒక అద్దాల పరికిణీలాగానో, జాకెట్టులానో, అద్దపుబిళ్ళలు అమర్చిన ఆధునిక భవంతిలోని ఒక అందమైన భాగం లాగానో కవిత్వంలోనూ మినీకవితలు భాసించగలుగుతాయి. ఆ విధంగా అవి తమ రూప పరిమాణం మేరకే సమాజ ప్రతిబింబాలు కాగలుగుతున్నాయి. **"గగనమంత భావాన్ని – చిన్నకవితలో ఇమడ్చడమంటే – ఏనుగును చిన్న అద్దంలోలాగా – చూపడమే"** అంటారు ప్రభావతిగారు కూడా.

మునుపే డా॥ వాసా ప్రభావతి 'మంజీరనాదాలు' పేర 1993లో వెలువరించిన కవితా సంపుటి మినీకవితల సంకలనమే. అయితే ఆవిడ ఆ విషయం ప్రత్యేకించి అనలేదు. అందులో ఆమె వెలువరించిన భావాలు ప్రధానంగా స్త్రీల సమస్యల చుట్టూ అల్లుకున్నవే. మినీకవితలను డా॥ సి. నారాయణరెడ్డి గారు 'సౌదామినీ'లు అన్నారు. మెరుపువంటి భావాలను మెరిపింపజేసే మినీకవితల లక్షణానికి అది యుక్తమైన పేరు. ప్రాసక్రీడలు, ఇంటింటిపజ్యాలు, పంచపదులు, ముక్తకాలు, ఉర్దూప్రభావంతో వచ్చిన రుబాయీలు, జపనీస్ హైకూలు డాక్టర్ ఎన్. గోపీ నుండి తడవడం మొదలుపెట్టిన నానీలు ఇవన్నీ రకరకాల మినీకవితలే. అవన్నీ విత్తులు, మొలకలు. వాటిలోని నాణ్యతను బట్టి, కవి హృదయపు భూసారాన్ని బట్టి అవి కవిత్వం చెట్టుగా, మహా వృక్షాలుగా లేదా పంట పైర్లుగా ఎదగగలుగుతాయి. లేదా నాని నాని పనికిరాకపోనూవచ్చు! విత్తనం ముఖ్యమే. అది నాణ్యంగా విత్తబడి కవిత్వపు పంటపైరో, విశాలవృక్షమో కాగలగాలి. నీడనూ, పండునూ, ఎండిపోయాక కూడా వంటచెరుకునూ ఇవ్వగలగాలి. విత్తనంగానే మెత్తబడి సారహీనమై పోకూడదు. వృక్షస్థాయికి ఎదగగల విత్తనమే కృషీవలుడికి ప్రయోజనకారి. విత్తనం మీద పెత్తనం చెల్లదు. సామ్రాజ్యవాద వ్యతిరేకతలో విత్తనం గురించి కూడా అందుకే ఆలోచిస్తున్నాం.

వీటన్నిటి నేపథ్యంలోనే డా॥ వాసా ప్రభావతి గారి ఈ మినీ కవితలు విస్తృత సాంఘిక అంశాల నుండి, మానవీయ సంబంధాల నుండి తలెత్తాయి.

*భావనా చిత్ర*
*రూపసౌందర్యానికి*
*నిలువుటద్దం*
*కవిత*

*ఎండిన ఆకుల మొదళ్ళలో*
*తిరిగి కొత్త చిగుళ్ళు*
*భావసంఘర్షణ అంచుల్లోంచి*
*కొత్త ఆలోచనలు*

అంటూ కవయిత్రి వందలాది మినీకవితా విత్తనాలను పాఠకజన హృదయ కేదారాలపై వెదజల్లుతున్నారు.

**"కలకలలాడే - ఇంటినిమించి - అందమైన దృశ్యకావ్యం - మరొకటి లేదు"**

***"మనసులు - విప్పకపోతే - ఎవరింట్లో వారే - పరాయివారు"***
**"పక్షులు వాలని - చెట్టుకు - పిల్లలు లేని ఇంటికి - పరమార్థమేది"**

అని కుటుంబమే, ఇల్లే మూలకందంగా నిలిపి, వర్తమాన సమాజస్థితి గతులను వ్యక్తుల విరుద్ధ స్వభావాలను, మానవీయ విలువల ఆటుపోట్లను వీటిల్లో తూర్పారబట్టారు. తప్పులు విప్పి చెప్పినట్లే, మెప్పులూ చెప్పి ఒప్పించారు. మార్పును సూచించారు. నిర్వచనాలు ఇచ్చారు, నీతులు ప్రవచించారు, వచనాలు, ప్రవచనాలూ రచించారు. ప్రకృతి అందాలను సంభావించారు, మానవ ప్రవృత్తి చందాలను సంధానించారు. కొన్నిచోట్ల వ్యంగ్యం, కొన్ని చోట్ల ఆర్తి, కొంతస్ఫూర్తి, రవ్వంత తాత్త్వికత వీటిల్లో నిబిడీకృతమై వున్నాయి.

*"కొండలు పిండిచేసే*
*అతనిది ధనబలం కాదు*
*అది తప్పకుండా*
*శ్రామికబలమే"* *అంటుంది కవయిత్రి.*

*"పరభాషల్లా*
*నైలాను చీరలెందుకు*
*నేతచీరలా ఒక్క మాతృభాష చాలు*
*వన్నె పెంచడానికి"*

అంటూ దేశీయకట్టును, **'ఒకనాడు బల్లకింద చేయి చాచినా తప్పే - ఇప్పుడు బల్ల మీదే - రెండు చేతులూ'** అని అవినీతి గుట్టును చెబుతారు.

**"మరణించడానికి**
**ఒక్క విషపుబొట్టు చాలు**
**జీవించడానికి**
**వేల రక్తపుబొట్లు కావాలి"** అని రక్తదాన మహత్తును కూడా చెప్పకనే చెబుతారు.

**"నేను అహం**
**మేము స్వార్థం**
**మీరు మర్యాద**
**మనం ఆత్మీయం"**

అంటూ స్వభావ నిర్వచనం; 'మంచి సలహా- మలయపవనంలా - చల్లగా నిమురుతూ - మనసును తాకుతుంది' అని సాంత్వన వచనం పలుకుతారు. "ఎంతటి వారికయినా - ఆపదలో నిలువనీడ - స్నేహమే" అని అన్నవారే "స్నేహానికీ - మరకలుంటాయి - అసలైన ఆనందం - ఏకాంతంలోనే" అని భావించడం చిత్రంగా తోచవచ్చు. "కాలానికి - ఎండ వాన తప్పవు - మనిషికి లౌక్యం- ఏ ఎండకాగొడుగుపట్టడమే" అని బతకనేర్చిన తనాన్ని నిర్భయంగా విశదీకరిస్తారు.

**"కోకిల ఎప్పుడూ**
**తియ్యగానే పాడుతుంది**
**అది మనిషి కాదుగా**
**గొంతులు మార్చడానికి"** అని ఎద్దేవా చేస్తారు.

**"పొగిడేవారికి**
**తెగిడేవారికి**
**దూరమున్నవాడే**
**నిటారుగా ఎదుగుతాడు"** అని దూషణభూషణలకు అతీతంగా నిలబడాలంటారు. ఇలా ఉటంకింపులకు పూనుకుంటే పలు అంశాలపై ప్రభావతి ప్రభావోపేతంగా పలికిన పంక్తులు బారులు కడతాయి.

**"Give me a theme" - the little poet cried,**
**"And I will do my part"**
**"Its not a theme you need", the world replied**
**"You need a heart"** **- R.W. Glider**

హృదయమున్న కవయిత్రిగా తన స్పందనలను సమాజహిత చింతనతో, మానవీయ విలువలపై అపారమైన విశ్వాసంతో వెలువరించిన డా॥ వాసా ప్రభావతి గారిని అభినందిస్తున్నాను.

*జూన్ 2006*




# కవి చెంతనే సమాజ చింతన

## చింతన (కవిత్వం) - పులివర్తి కృష్ణమూర్తి

సమాజ నిశిత పరిశీలన నుండే చింతన ఆవిర్భవిస్తుంది. 'చుట్టూ ప్రపంచం ఎట్లాపోతేం నాకేం?' అని ఉదాసీనంగా వ్యవహరించేవాడు కవి కాలేడు సరికదా సామాజికుడూ అనిపించుకోలేడు. ప్రపంచాన్ని పరిత్యజించి ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే ఆధ్యాత్మికత నేడు లేదు, అక్కరలేదు. సంసారంలో, సమాజంలో తనవంతు కర్తవ్యాలను నిర్వర్తిస్తూనే అదే సమయంలో అంతఃశోధనతో, ఉదాత్తవిలువల చింతనతో మాధవస్మరణానుచిత్తుడై భక్తిభావనలను, ఆధ్యాత్మికతను కలిగి వుండగలగడం సబబైన కాల లక్షణం.

శ్రీ పులివర్తి కృష్ణమూర్తి అలాంటి చింతనామృత శీలుడు. ప్రజాతంత్ర మర్మజ్ఞతల నెరిగి ఒక వంక సాంస్కృతిక ప్రతినిధిగా, మరోవంక ఆధ్యాత్మిక విషయరచనాసక్తునిగా, మరోవంక ప్రత్యక్ష ప్రసార వ్యాఖ్యాతగా, వక్తగా, చిత్ర సమీక్షకునిగా ఇలా వైవిధ్యభరితమైన వ్యావృత్తులు కలిగినవాడు. ఇటీవలనే 'సాయి సూక్తి సుధామృతం' పంచినవాడు.

ఈ నవ్యరచన షట్పదులుగా సంభావించవచ్చు. ఆరుపాదాలలో లోకం పోకడలను, మానవస్వభావ ధోరణులను భావబంధురమైన ఒక సూక్తిగానో, నిర్వచనంగానో, వ్యాఖ్యగానో, వింగడింపుగానో, సందేశంగానో సంతరించిన మినీ కవితాధోరణి వంటిది ఈ రచన. వీటిల్లో ఒక హితచింతన అంతస్సూత్రం. వ్యక్తిత్వవికాసం సంకల్పం. కొండొకచో హాస్యం, వ్యంగ్యం అద్ది చురుక్కు మనిపించే నిష్ఠుర సత్యాలను ఆవిష్కరించిన తావులూ వున్నాయి.

పైకి చాలా అలవోకగా, సద్యఃస్ఫూర్తితో పలికినవిగా అనిపించినా తరచిచూస్తే వీటిల్లో అంతర్గతంగా దాగివున్న ఒక ఆర్తి, గాఢత, నిజాయితీ పఠితలకు స్ఫురించకపోవు.

*"కుళ్ళు లోకమంటూ*
*కన్నీళ్ళు కార్చకు*
*కారాలు మిరియాలు*
*నూరుతూ బ్రతుకకు*
*నీవు మారితే ముందు*
*లోకమే మారుగా"*

అంటూ సంస్కరణ, లోక సముద్ధరణ వ్యక్తి నిష్ఠతోనే మొదలు కావాలంటాడు. ప్రపంచ స్థితికి వగచి లాభం లేదు, ఆగ్రహించి ప్రయోజనం లేదు. ఆ రెండింటినీ సమపాళ్లలో మేళవించుకుని ముందు స్వీయసంస్కరణతో ఉద్యమించాలంటాడు.

*''మంచి చెప్పని మతము – మనకొద్దు మనకొద్దు*
*మానవత్వము లేని – కులము అసలొద్దు*
*మానవుడే మాధవుడు – ఏ మతమైతే ఏముంది"*

అనడంలో కులమతాలకు అతీతమైన మానవత్వమే సమాదరణీయమనీ, ఆరాధనా యోగ్యమనీ మనిషినే మాధవునిగా దర్శించాలని ప్రబోధిస్తాడు. ఆలయాలలోని అరాచకాలు చూసి "కనకానికే సామి కట్టుబడివున్నాడు" అన్న తరహా ఆవేదనను ప్రకటించినా 'సాధువులకెందుకు కాషాయవస్త్రాలు, రంగులెందుకు చెప్పు రంగేళి సాములకు – రంగనాధుడే నీదు మనసులో కొలువుండ' అని నిజమైన భక్తి – హృదయగతమేనంటాడు.

*"మంచిమాటల తోటి*
*మనసు రంజిల్లును*
*మనసు నిర్మలమైన*
*నీతిమార్గమె తోచు*
*నీతిమంతుల కిలను భయమేల చెప్పుమా"*

అంటూ మంచిమాట, నిర్మల మనస్సు, నీతి స్వభావం మనిషికి త్రిశరణాలని హృదయంగమంగా చెప్పి భయరహితమైన అభయజీవనం సాగించే మార్గనిర్దేశనం చేసారు పులివర్తి కృష్ణమూర్తి.

*"చెప్పాలనే వుంది - వినేంత గొప్పగా*
*వినేవాళ్లే లేరు - విన్నవించేందుకు*
*చెప్పేవాడికే గదా - వినేవాడు లోకువ"*

అని తను తమాషాగా అన్నా 'జీర్ణమంగ్గే సుభాషితమ్' అన్న భర్తృహరి మాటల్లోని చింతనే దీప్తిమంతమవుతోంది.

ఈ ఖండికల సంపుటికి మాధవ్ వేసిన బొమ్మల గురించి కూడా ఓ మాట చెప్పితీరాలి. "మాటలు లేని పద్యమే బొమ్మ' అంటాడు సిమొనైట్స్. మాధవ్ బొమ్మలు పులివర్తి భావనలను దృశ్యసాక్షాత్కారంతో రసవర్ణభరితం చేస్తున్నాయి. కృష్ణమూర్తి, మాధవాచార్యుల మాట, బొమ్మల ఈ జమలిక పాఠకులకు గుండెనిండుగా, కనుల పండుగ - రెండూ దండిగా వున్నాయి. నేటి సమాజంలో చెలామణీలో వున్న విపరీత ధోరణులకు అద్దం పడుతూనే వాటి నిరసన ధ్వనులను వాచ్యం చేయకుండా ధ్వనిమంతంగా వదిలిపెడతాడు కవి.

*ధనమున్న చాలును - దర్జాగ బ్రతకొచ్చు*
*సర్కారు జాబైతే - సరదాగ మనవచ్చు*
*ధనము పదవి వున్న - కులముతో పని ఏమి*

వంటి 'ఝులక్'ల్లో దాగి వున్నదదే. ఈ 'చింతన'లో ఎక్కువభాగం వ్యక్తిని ఆధ్యాత్మిక భావరక్తునిగా మలచేదిశలో సాగినవే

*నాది అన్నదే సున్న - నేనొక సున్నరా*
*నీదన్నదే సున్న - నీవొక సున్నరా*
*ఈ ప్రపంచమే ఒక పెద్ద - గుండు సున్నాకదర*

అన్న చింతనామృతంలో పరిపూర్ణతను గ్రహించగలగడంలోనే శూన్య మనస్కుడైన వ్యక్తి జీవన వికాసగమ్యం దాగివుంది. పాదాలలో భావనలు కొంత పట్టుసడలిన తావులు కొన్ని వున్నా, మరింత చిక్కనైన అల్లిక, గాఢమైన కూర్పు కలం రాటుదేరిన కొద్దీ సాక్షాత్కరిస్తాయి. శ్రీ పులివర్తి కృష్ణమూర్తి భాషితంగా రూపొందిన ఈ చింతన - వ్యక్తి వికాస ఉపయుక్తమై అందరికీ సమాదరణీయ మైనదన్న గ్రహింపు కలగాలని నా శుభాకాంక్షలు.

*జనవరి 2007*




# పాటల పథం

## చైతన్యార్జునం (లలితగీతాల సంపుటి) – నిమ్మల అర్జునగౌడ్

**ఒ**క విషయం పదేపదే చెప్పుకోవాలి. చెప్పుకోవడమే కాదు మననం చేసుకోవాలి. దైవభక్తి, మాతృభక్తి ఎంత ముఖ్యమో అంతకు రెట్టింపు ముఖ్యం దేశభక్తి. జన్మభూమిని ప్రేమించలేనివాడు, కీర్తించలేనివాడు నిజమైన పౌరుడే కాడు. తల్లిదండ్రుల ఎడల దయలేని పుత్రుడిలాగా తల్లినేల మీద అభిమానం లేనివారు పుట్టలోని చెదలతో పోల్చదగినవారే.

నిమ్మల అర్జునగౌడు దేశభక్తిగలపౌరుడు. సర్వోదయ సిద్ధాంతం మీద, మత సామరస్యం మీద, మానవతా విలువల మీదా గాఢమైన అనురక్తిగలవాడు. మార్కెటింగ్ శాఖలో ఉద్యోగం వృత్తిరీత్యాకాగా కవితాశాఖలో సద్యోగం ప్రవృత్తిరీత్యా గలవాడు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో 'ప్రభాతగీతం' పేరిట ప్రతిరోజూ ఉదయం దేశభక్తి గీతం ప్రసారమౌతుంది. బృందగీతాలు, దేశభక్తి గీతాలు ఇతరత్రా కూడా కార్యక్రమాలుగా ప్రసారమవుతూ వుంటాయి. నిమ్మల అర్జునగౌడు రాసినవి అన్నీ దేశభక్తి గీతాలే.

దేశమాతను కీర్తించినా, పతాకాన్ని స్తుతించినా, వీరులను ప్రస్తుతించినా, దేశనాయకులకు నీరాజనాలిచ్చినా, యువతకు దేశభక్తిని ప్రబోధించినా, దేశరక్షణకై ఎలుగెత్తి సందేశించినా, సమాజంలో మత సామరస్యాన్ని, పర్వదిన సంస్కృతీ ప్రాభవాన్ని ప్రపంచించినా ఏ గీతమైనా దేశభక్తి ప్రపూరితమైనదే. నిజానికి 'దేశభక్తి' అన్న ఒకే ఒక్క అంశాన్ని ఇంత విస్తృతంగా విభిన్న పల్లవీ,

చరణాలలో పాటలుగా మలచిన పాటవం తనది. చెప్పిందే చెప్పడం చెప్పక తప్పని అవసరం వల్లనే. చెవినిల్లుకట్టుకుని పోరడమంటారే అలాగే ఒకే భావనను చర్వితచర్వణంగా చెప్పడం భావదారిద్ర్యంగా కాక 'నొక్కివక్కాణించడం'గా అర్థం చేసుకోవాలి. ఒకే అంశానికి ఇవి విభిన్న ప్రతిమలవంటివి. అచ్చుగుద్దినట్లు, మూసపోసినట్లు వున్నాయని పెదవి విరచడంకాక ఈ భావాలను ఎవరికి నచ్చిన పాటగా వారు స్వీకరించి పాడుకోగలిగితే కవి తహతహల తపన నెరవేరినట్లే.

**"ఎగరాలనివుంది నాకెగరాలని వుంది"** అంటూ ఎగిసిన అర్జునగౌడు దేశభక్తి పతాక –

***"మనిషి మనిషికి మధ్య***
***మానవత పెంపొంద***
***మోడువోయిన బ్రతుకు***
***మొగ్గలుగ చిగురించ"***

'మనిషిగా బ్రతకాలిరా' అనే మహోన్నత సందేశం సంకలిస్తూ ముగుస్తుంది. సుమారు నాలుగు పదుల ఈ పాటలన్నీ నాలుగు కాలాలు నలుగురి నోళ్ళల్లోనూ నానగలిగితే దేశభక్తి భావనా బీజాలు భూజాలుగా మారడానికి అవకాశాలు లేకపోలేదు.

***"పల్లెలను చైతన్యపరిచీ – ప్రగతికోసం పాటుపడవలె***
***గుండెగుండెకు దేశభక్తిని – దండిగను పండించుకోవలె"***

అని గ్రాస్‌రూట్ లెవెల్లో చైతన్యం చెంగలించాలంటాడు కవి.

**"మంచినెప్పుడు మరిచిపోకుము–వంచనతో జీవించనెంచకు–కులమతమ్ముల కుమ్ములాటతో – కుత్సితాలను పెంచబోకుము"** అని దేశమును ప్రేమించ రమ్మంటాడు.

గాంధీ, నెహ్రూ, వినోబా వంటి మహనీయమూర్తులను, సంక్రాంతి, దీపావళి వంటి పర్వదిన సందర్భాలను ఈ పాటలపథంలో అర్జునగౌడు తీసుకువచ్చి తన మౌలికసందేశాన్ని ఆ గీతావళిలోనూ ఆవిష్కృతం చేసాడు.

ఇందులో పలుగీతాలు ఈ సరికే ఆకాశవాణి ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చాయి. పాఠశాలల్లో విద్యార్థులు పాడుకునేందుకు, వేదికలపై గాయకులు

వినియోగించు కునేందుకు వీటిని ఇలా గ్రంథస్థం చేయడం ఎంతైనా ముదావహం. సంకలనంగా తెస్తున్నప్పుడు పునరుక్తభావనలు కొన్ని పరిహరించుకునే వీలున్నా ఏ పాటకు ఆ పాటగానే పాడుకునేవి, వాడుకునేవి కాబట్టి వాటిని యథావిధిగానే గ్రంథస్థం చేసి ఉంటాడీకవి.

ఈ దేశభక్తి భావనా ప్రాతిపదికల పై నిమ్మల అర్జునగౌడు మున్ముందు తన కవితాకల్హారాలు, మరిన్ని కూరుస్తాడని ఆకాంక్షించవచ్చు. జాతీయ కవిసమ్మేళనం కవితానువాదాలు చేసిన సృజనశీలి కూడా కాబట్టి కవిగా అర్జునగౌడు మరింతగా రాణించాలనీ, రాణించగలడనీ ఆకాంక్ష.

*2007*




# తట్టదగిన భుజం

## జ్ఞాపకాల అలలపై - ద్విభాష్యం వేంకటరామకృష్ణశాస్త్రి

తపన గొప్పది. పతనం కాక ఉత్థానం కోసమైనప్పుడు మరీ దొడ్డది. తపనలు ఆవిష్కృతం కావడానికే కవి అక్షరాలను ఆశ్రయిస్తాడు. అక్షరాలకు అనుభూతిని తొడిగి కవిత్వం రూపు ఇస్తాడు. 'తనదైన అనుభూతి తనది కాన' విషయం ఏదయినా, లోకవృత్తంలోని ఇతివృత్తం ఏదయినా తన పలుకు పలుకుగా ఒలికించడానికి పూనుకుంటాడు. అనుభవం బలపడుతున్న కొద్దీ అభివ్యక్తి సాన దేరుతుంది. అభ్యాసం కుదిరిన కొద్దీ ఆలోచనలకు అక్షరసాక్షాత్కారం అలవోక కాగలుగుతుంది.

తపనలో కొన్ని తడబాట్లు, పొరపాట్లు సహజం. కొంత బాల్య చాపల్యం, కొన్ని యౌవనోద్రేకాలు చెలరేగినా క్రమంగా ఒక తాత్త్వికభూమిక ఏర్పడవచ్చు. చెప్పదలచుకున్నదేదో చెప్పడమే ముఖ్యం. గొప్పగా చెప్పగలిగేంతవరకూ బహిర్గతం కాకూడదనుకుంటే లోలోన గుడుసుళ్ళలోనే కాలం గడుస్తుంది. ఒకరి వెక్కిరింతలకు, కొక్కిరింతలకు వెరవక తప్తహృదయాన్ని ఆరవేసుకోవడమే సబబు.

*'కఠినశిలలకు సైతం జ్ఞాపకాలుంటాయి*
*అవి శిలాజాల రూపంలో బయల్పడుతుంటాయి?'*

జ్ఞాపకాలను గతానికే పరిమితం చేయకుండా అవగతం చేయగలగడం మేలు. 'అర్థం లేని ఆరాధన లోనో - అంతులేని అనురాగంలోనో - భాషకందని భావాలెన్నో కన్నీళ్ళై ప్రవహిస్తాయి. కన్నీళ్ళు కూడా కవిత్వభాషే!

**భాషకు కన్నీళ్ళు లేవు**
**భావాలకు మాత్రమే**
**కళ్ళకూ కన్నీళ్ళు రావు**
**మనస్సుకు మాత్రమే**

అని అందుకే అనగలిగాడు శాస్త్రి. **'జగత్తు మిథ్యే అయినా - నాకో స్థానం ఉందక్కడ - మరి ఈ జ్ఞాపకాల అనంత సాగరంలో - నేనెక్కడ? నేనెక్కడ?'** అని ప్రశ్నించుకోగలుగుతున్నాడందుకే.

ఒకసారి పాటయై ప్రవహిస్తాడు. ఒక్కోసారి కొంచెం ఈటెయై గుచ్చుకుంటాడు. ఒక్కోసారి మాటయై మనసు మూలకు చేరుతాడు. ఒక్కోసారి మౌనిలా పరమంగా అంతర్ముఖుడవుతాడు. ప్రకృతిలో మమేకమై స్వచ్ఛమైన గాలి, నీళ్ల కోసం పరితపిస్తాడు. ప్రకృతికి ఒక రక్షణ కవచం వుండాలని భావిస్తాడు. 'నలువైపులా' 'నేస్తానికి' 'నిరీక్షణ నిలిపి' 'కర్మయజ్ఞం'లో హోమసమిధ వ్రేల్చి, 'విద్యున్మాలిక'లా 'మబ్బులు' ఛేదించి, 'చెదరని ఆశయం' 'గీటురాయి'గా 'మానవత' కై 'ప్రగతి' బాట పడతాడు.

శాస్త్రి కవిత ఒక 'ఆనందవీక్షణం'

***'శూన్యం లోంచి***
***లక్ష్యాన్ని సృజించు కోవడమే***
***ప్రాజ్ఞత'***

***'క్షమాహృదయం కావాలంటే***
***మరో బుద్ధుడు రానక్కర్లేదు***
***పిడికెడు మట్టిని చేత తీసుకుని***
***పాత కాలాన్ని స్మరిస్తే చాలు'***

***'దూరపు కొండల నునుపును గ్రహించి***
***అనుభవాలుగా మలిచేవేళ***
***యౌవనం నుండి బాల్యంలోకి***
***తిరుగుప్రయాణం మొదలవుతుంది.***
***వృద్ధాప్యం రాదు మనిషికి***
***మృత్యువు లేదు మానవత్వానికి'***

**"కవి చూపే మార్గంలో ఆంక్షల్ని ఉంచకు**
**ఉక్కు పరదాల్ని ముక్కలు చేసేందుకు అదొక్కటే దారి'**

జడత్వం వదలడానికి ఈ తరహా భావనలు ఎన్నో పాఠకహృదయాలను సంచలింపజేస్తాయి. తను మరీ ప్రాథమికంగా ఏమీ లేడు. పరిణతమార్గంలోనే పయనిస్తున్నాడు. రాటుదేరిన కలంతో మునుముందు కవిత్వ గుణాన్ని బట్టి చూస్తే మంచికవుల వరుసలో చేరకపోడు. ఆ దిశగా కృషి కొనసాగించాలని శుభాకాంక్షలు.

*16 ఏప్రిల్ 2007*




# చూపులో కవిత్వం చూపు

## చూపు (కవితా సంపుటి) - చలపాక ప్రకాష్

**దృ**ష్టి, వీక్షణము, దర్శనము, వ్యక్తము చేయు, ప్రకటించు అని 'చూపు'కు అర్థాలు. అంతమాత్రమేకాదు-భావనామయమైన దృశ్యం, భావపూర్ణమైన అంతర్దృష్టి.రాజకీయధురంధరుని భవిష్యద్దర్శనం, లోకాతీతమైన, భావిసూచకమైన దృశ్యం ఇవన్నీ 'చూపు' అనే అనబడుతున్నాయి. ఇచ్చు, నివేదించు, ఏర్పరుచు, బయలుపరుచు అనే అర్థాలలో కూడా 'చూపు'ను వాడుతున్నాం.

'రవిగాంచనిచో కవిగాంచును' అనడంలో కవిచూపు విశిష్టతను, విలక్షణతను విశదపరచడమే సంకల్పం. చలపాక ప్రకాష్ తన కవితాసంపుటికి 'చూపు' అని పేరు పెట్టడంలో మంచి విజ్ఞత వుంది. ఈ సంకలనంలోని కవితలద్వారా తను బయలుపరుస్తున్న అంశాలన్నీ సామాజికనిష్టాలే.

చలపాక ప్రకాష్ చూపు ప్రధానంగా రెండు అంశాలమీద ప్రసరిస్తోంది- స్థలము, జలము. ఎంతో గాఢంగానూ, బలీయంగానూ ఆ రెండూ అతని కవిహృదయాన్ని కళవళపెట్టి, సమాజహిత చింతనతో కూడిన ఒక 'విజన్'ను పాఠకుల ముందుంచుతున్నాయి. జలము కేవలం బాహిరమైన నీటి సమస్యే కాదు, అమానవీయమౌతున్న కరుణ కదలి కారే నీరు-కన్నీటి సమస్యకూడానూ. అలాగే స్థలము అంటే-వట్టి మట్టికాదు. చెట్టు, పుట్ట పొలము గురించి ఆలోచింప చేసినట్లే-ప్రాంతీయతల పేర సృష్టిస్తున్న విచ్ఛిన్నతల గురించీ, దృశ్యమాధ్యమ స్థలము అయిన బుల్లితెర నేడు జీవితాలను ఎలా అతలాకుతలం చేసి

అవస్థలమయము కావిస్తోందో ఆ దుష్టసంస్కృతి గురించీ కరాఖండీగా కవిత్వీకరిస్తున్నాడు..

తనకు నచ్చని అంశాలను నిర్ద్వంద్వంగా ప్రకటిస్తాడు. సమైక్యతలో మమైక్యత చెందినవాడు. వేర్పాటు వాదం నచ్చదు. ఆ మాటకు వస్తే అసలు వాదం అంటేనే తన భావపూర్ణమైన దృష్టిని ఇలా సారిస్తాడు

**"వాదాన్నెప్పుడూ నమ్మకు/అది ఒకవైపు నుండే/సరైన దారిని చూపిస్తూ/నీలో మానవత్వమున్న మనిషిని,/మనస్సుని చంపేస్తుంది"** అని-వాదం అనేది ఒక పార్శ్వం అనీ, మనిషీ, చూపూ కూడా పార్శ్వాలుగా విడిపోవడంకాక, ఒక సమగ్రతను, సమష్టిని నిలుపుకోవాలన్నది తన భావన-

**"రాయీ రాయీ రాపిడిచేస్తే/నిప్పుని పుట్టించినట్లు/మనిషిని మనిషీ/ఘర్షణల రాపిడికి గురిచేసి/నీలోని మానవత్వమనే గొప్పగుణాన్ని/మంటగలిపే/గొప్పవరంగా ప్రసాదిస్తుంది/ఖాళీ సంచిని అందంగా/భుజానికి తగిలించి/కాలే కడుపునే మిగులుస్తుంటుంది"** అన్నదందుకే.

వ్యక్తి కాక సమష్టి ఎప్పుడూ గొప్పదే. అయితే స్థలము గురించి ఆలోచించినప్పుడు-దేహంలో అయినా, దేశంలో అయినా కొన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, కొన్ని క్షీణించిపోతే అది సమగ్రాభివృద్ధి కాజాలదు. దేహంలో ఏ భాగం ఎలా వుండాలో, ఎంత పరిమాణంలో వుండాలో, అలావుండక వాపు అయితే అది బలిమి కాజాలదు కదా! అయితే ఒక తానులో ముక్కలు వివిధ ప్రయోజనాలు సాధించగలిగినప్పుడు 'తానుతాను' గానే వుండిపోవడం కుదరదు మరి!

కొన్ని స్థలాల్లో మేట వేసుకు కూర్చున్నా ప్రమాదమే! ఇవాళ టీవీల ముందు జనం అలా కూర్చునే, పేరుకు రిమోట్ చేతిలో వున్నా, తామే బుల్లితెర కు బద్ధులైనట్లుగా మారిపోతున్నారంటాడు-

**"చూపులు ఒక్కచోటే/నిలిపి వుండలేవు/చేతివేళ్ళు మీటాలమీద/నాట్యమాడించగల కంట్రోల్ చేసుకోలేవు"...........**

**"షాకు పుడుతున్నా/షోకులే ఉరి ఉచ్చు బిగించుకునేలా చేయగలదు/బుల్లిదొ(తె)రే కదాని కనికరిస్తే/ఒకొక్క టెలిపురుగునూ/విజన్ 'బల్లి' నోటిమరలో**

**వేసుకుని/గుటుక్కు మనిపించనూ గలదు"** అని 'చూపు' లో హెచ్చరిస్తాడు. ఎలక్ట్రానిక్ ప్రపంచంలో ఇవాళ– **"కీబోర్డులు,రిమోట్లు నొక్కి/వేళ్లు వాచిపోయే కాలం/స్థూలంగా/ మానవుడు అభివృద్ధి పథంలో 'పోయే'కాలం"** అంటాడు వ్యంగ్యంగానూ చలపాక.

చలపాకలో అభివ్యక్తి సారళ్యం వుంది.అయితే అది 'పలచబారాక' వ్యవహారం కాదు." **పల్లెలన్నీ 'ప్లాటు'లైపోయి–పట్నం రంగు పులుముకుంటూంటే– నా ప్రశాంత నివాసం ఎక్కడో అర్థంకాక–పారిపోయే పరిస్థితులలో–నేను...!"** అని స్థలవేదన ప్రకటిస్తూనే. **"ప్రాంతీయ ముళ్ళుగుచ్చి–రక్తపు చుక్కల రుచిని చూసేందుకు–సిద్ధపడుతున్నాడేంటీ?–ఎవడువాడు, ఎచటివాడు?స్వార్థపు గ్రహణం పట్టిన కవే వాడా?–రాజకీయపు రంగుని పులుముకుంటున్న– చీడపురుగు నీడా?!!"** అని ప్రశ్నిస్తాడు.కవులకు,కళాకారులకు ప్రాంతీయతా ముద్ర కాక విశ్వజనీన వీక్షణం ఉండాలనేది కవి అభిమతం.

**"ప్రాంతీయ భేదాల గోదాల మధ్య మిత్రుడ్ని–శత్రువుగా చేర్చినకాడ– ఎన్ని వారధులేస్తే ఏం..? ఎన్ని స్నేహాలు ఆలింగన పరుచుకుంటే ఏం? ఈర్ష్యా జ్వాలలు ఎగిసిపడే చోట–పచ్చదనం ఎలా మొలకెత్తించటం?"** అని ఆర్తి చెందుతాడు.

**"అమ్మను సైతం–తలా మొండెం వేరు చేసేసి–సజీవాన్ని విగతజీవిగా మలిచే ప్రయత్నం–ఇప్పుడు ఈనేల చేసుకుంటున్న దౌర్భాగ్యం"** (సర్వమంగళం')అని తీర్మానిస్తాడు. 'అంతా విశేషమే' లోని శేషం కూడా – పొరలుకమ్మిన ఈర్ష్య'లానే కనబడుతుందంటే కారణమదే. 'అశాంతి' కవితలో–

**"తిత్తి తీయడానికి – కనిపించని రాక్షసులు, దెయ్యాలతో పనిలేదిప్పుడు.... మానవవేషంలో వున్న రాములమ్మలే/ఆ కొరత తీర్చుతున్నట్లు కనిపించట్లేదూ!?...**

**"తెలం'గానం',ఆంధ్రాకు 'గాలం'/రెండు జోడు గుర్రాలపై ఊరేగాలని/ భ్రాంతితో వున్నట్లు/భూతద్దంలో చూడకుండానే కనిపించటంలేదూ..."** అంటూ విజయాలకు శాంతి వుంటుందా? అని–సినీమానసి రాజకీయ ఆరడి గారడీలను నిర్మొహమాటంగా వ్యక్తీకరిస్తాడు. 'మట్టిచేతులు' కవితలో వృత్తికళాకారుల గురించి రాస్తూ– **"పొగరు,అశ్రద్ధలకు బలిచేస్తే/పగిలేవి సొగసైన కళాకృతుల పెంకుముక్కలుకావు/మా చేతుల్లో కళాజీవం పోసుకుని/మీకు కనువిందు చేసిన మా పిల్లల/గుండెముక్కలే అవి"** అని కార్పోరేట్ ధనస్వామ్యాన్ని నిరసిస్తాడు..

చలపాక ప్రకాష్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేకత,గ్లోబలీకరణ పేరున పట్టణాలనుంచి పల్లెలకూ ప్రాకుతున్న విషసంస్కృతి,దానికి హేతువవుతున్న బుల్లితెర, ఆఖరికి సెల్ ఫోన్,ఎఫ్.ఎం.రేడియో కల్చర్ మీదా నిరసన వీక్షణాలు ప్రబలంగా వున్నాయి.

ఇంటికి వచ్చినవారికి మంచినీరు ఇవ్వడం అతిథి మర్యాద.దప్పిక గొన్నవాని దాహం తీర్చడం పుణ్యకార్యంగా సంభావించడం వుంది. అలాంటిది మంచినీటి ప్యాకెట్లను అమ్ముకునే స్థితి పరిఢవిల్లడానికీ, మన బావినీరునే మంచినీటి సీసాగా మనకు తెలియకుండా మనకే అమ్ముతున్న కుట్ర విస్తరిస్తున్న సామ్రాజ్యవాద ధోరణినీ–చలపాక ప్రకాష్ సవ్యంగా సంవీక్షణ చేసాడు కనుకనే–ఆ ఆర్తినీ,తద్గత చైతన్యాన్నీ అక్షరీకరించాడు.

**“వేటంతా లాభార్జనగాలంలో జూదంగా–చిక్కుకుని వేలాడవల్సిందే ననుకుంట!–కొట్టుకుపోతున్న మానవత్వపు ఆనవాళ్ళు–రూపాయినీళ్ళ పాకెట్లు అమ్ముకుని సంపాదించే నాలుగురాళ్ళు!! – కల్తీ, అవినీతి ప్రదర్శనలో అనేక లేబుళ్ళు తగిలించేసుకున్నాయి–మీరూ కాస్త తాగి చూసారా? –కాళ్ళకున్న మట్టిని కడగటమేకాదు–మానవతా విలువలకు పట్టిన చీడనూ–ఏ మినరల్ వాటర్‌తో కడుక్కుందామో–మీరు కాస్త చెబుతారా?”** అని ప్రశ్నించినా –

**“భూమి ఎండింది–చుక్క కన్నీరు కార్చే శక్తిని కోల్పోయింది–సెంటర్ సెంటర్లో ఇంతక్రితం వరకూ వున్న నీటి కుళాయిలు–ఆవిరైపోయి–ప్యాకెట్ల రూపం కొత్తఫ్యాషనై అమ్మకాలు సాగిపోతున్నాయి....ఇప్పుడు గొంతెండితే ఏం చెయ్యాలి? ఆకలేస్తే తిండిలేక నీరు ఆహారమయ్యే–పేదకడుపులు ఏంకావాలి”** అని నిలదీసినా– **“పగ–పగ–పగ–చల్లని గాలినిచ్చే చెట్టుతల్లిని నేల కొరిగిస్తున్నందుకు పగబట్టిందా?దాహార్తిని ప్యాకెట్లలో బేరం పెట్టిన–మనిషి వికృత నైజానికి శిక్షవేసిందా”** అంటూ సునామీల హేతువూ–జలదానానికి సైతం జనవాదం దూరమై ధనవాదం పెరిగిపోవడమేనని స్పష్టీకరిస్తాడు.

చలపాక ప్రకాష్ ‘చూపు’ అతని హృదయభావాల అభివ్యక్తిలో స్పష్టంగానే వుంది. మానవత్వం మంటగలుస్తోందన్న ఆర్తితో అతని కనులు చెమ్మగిల్లుతున్నాయి కనుకనే, ఆచూపులో మనకేదయినా వుందంటే అది కన్నీటిపొర కారణంగానే.దృశ్యాలను స్పష్టంగా చూడడంలో,చూపడంలో అతని కవిత్వ పటలం సజావుగానే వుంది.అయితే కలం పదును దేరిన కొద్దీ, అభివ్యక్తిలో మరింత

గాఢత,పాఠక హృదయ సంస్పందనానికి మరింత చిత్రిక సాధ్యమవుతాయి.ఎవరో ఏదో అనుకుంటారని కాక, నిజాయితీగా కొన్ని అంశగత అభిప్రాయాలను కవిత్వీకరించిన 'కలేజా' అభినందనీయం.

**"సైబర్ విషవృక్షం రాక్షసంగా మొలకెత్తుతున్నప్పుడు/రాలిన అక్షరం,భూమిలోకింకి విత్తుగా/కొత్తమొక్కగా మొలకెత్తేదెప్పుడు"**- ఇలా అక్షరాల ఆర్తి గలవాడు కనుకనే, **"రాలిపోతూ మొలకెత్తని చెట్టుబిడ్డలలో-పునరుజ్జీవం పోసేందుకు ఓ ఉద్యమకారుడు రావాలి-కలాలు,గళాలు పదును పెట్టించే, అక్షరయోధుడు-సరిక్రొత్తరూపం దాల్చి చెండాడాలి"** అని చూపును తీక్షణమూ చేసాడు చలపాక ప్రకాష్.చూపును పదునెక్కిస్తున్న నిజాయితీ అక్షరపోరుడికి ! అభినందనలు. ఈ చూపులో చూపు కలపండి.హృదయం ప్రకాశవంతమవుతుంది.

*నవంబరు 2007*



# క్షణం రెక్కలు

## వీక్షణం (కవితా సంపుటి) - కె.బి. లక్ష్మి

రెప్పల రెక్కలు విచ్చినప్పుడల్లా చూపుల విహంగాలు దృశ్యవిహాయసంలో విహరిస్తాయి. ఎన్నెన్ని దృశ్యాలు! అంతరిక్షం ఒకటే- అంతర్వీక్షణలు అనంతం!!

విహరించదలచిన విహంగానికే- దృశ్యాల మీద వాలడానికి, దృశ్యాంతరంగానుభూతితో కువకువలాడడానికి ఏకాగ్రత కావాలి. ఎగిరి వాలడంలో ఒడుపు కావాలి. పక్షిగాయపడితే, అవరోధం ఎదురయితే దృశ్యం చలించిపోతుంది.

కనుగుడ్ల గూడులోనే బందీ అయితే ఏం లాభం? పక్షి ఎగరాలి. ఆకాశాన్ని అంతరంగంలో దించుకోవాలి. అంతరంగం తరంగితమై సహృదయాలను రసప్లావితం చేయాలి.

ఇవి కె.బి లక్ష్మి క్షణం రెక్కలు
భావబిందువులు
అనుభూతి శకలాలు
ఊహా 'పదాలు

మనోభావం- మీటిన మానసవీణగా ఈ మూడ్సను రసతంత్రుల మీదుగా అభివ్యక్తీకరించింది. అవును ఆ క్షణంలో ఆమెకు 'అనిపించిందిలా...' అనుభూతి దగ్ధ కనుక... 'ఇలాగే అనుకున్నా' అంటుంది.

ఔను ఇవి సౌదామినీలు!

అంతలోనే అంతరాలకు రివ్వుమని ఎగిసే పై చూపు, చిరదీక్షాతపస్స మీక్షణ కన్నట్లుగా చాలా అలవోకగా తనలోకి తాను జారిపోయేలో తూపు.... లక్ష్మి క్షణాల కాటుక రెప్పల మీదనుంచి కదలివచ్చింది. లక్ష్మి అనుక్షణాల కవితా వీక్షణానికి క్షణం రెక్కలు విచ్చింది.

ఆమె గమనం
ఆమె వీక్షణం
వెరసి కవిత్వ నాణెం

ఈ వీక్షణంలో క్షణం రెక్కలు విదల్చి లక్ష్మి కావించిన కవితా విహారం అనేక భావదృశ్యాల సమాహారం. ఇది నేలవిడిచి చేసిన సాము కాదు.

చుట్టూతా ప్రపంచాన్ని చుట్టివచ్చిన వీక్షణం ఇది. దృశ్యాలు మారిపోతుంటాయి. ఒక భావబిందువు నుండి మరొక అనుభూతి శకలం వైపుకు అంచెలంచెలుగా ప్రయాణం. ఇవన్నీ వేటికవే. ఒకదానికొకదానికి సంబంధం ఉందంటే ఉంది. లేదంటే లేదు.

సమాజమే మూలకందంగా– విస్తరించిన ఈ వీక్షణ వృక్షానికి మనసుకు చల్లదనం ఇచ్చే నీడ, ఊహావిహారాలకు స్వేచ్ఛను ఇచ్చే జాడ, అనుభూతి ఫలాస్వాదనం కావింపజేసే రీతి, చెప్పకనే చెప్పే ఒక నీతి మొత్తానికి ఒక కవిత్వఫణితి వుంది. కొమ్మలు రెమ్మలుగా విస్తరించిన ఈ కవిత్వ వీక్షణం – పక్షులు వాలిన చెట్టై పఠిత నేత్రపర్వంగా ప్రకృతిలో భాసించే స్పందనలను అందిస్తుంది.

కొందరి హైకూతలతో నానినాని వున్న రసలుబ్ధులైన పాఠకులకు ఇది విలక్షణ విందు. ఈ 'బఫే' లోంచి ఏ పేజీ తీసి ఏది కావాలో గుండె పళ్ళెరంలో వడ్డించుకోవచ్చు. ఇవన్నీ సాదాసీదా వంటకాలేకావచ్చు. కానీ రుచి ఎరిగినవారు రుచిమరిగినవారూ – కాగలుగుతారు–

చూడడానికే కాదు
ఆస్వాదించడానికీ
ఆకర్షణీయం, ఆరోగ్యదాయకం

పిల్లలు, పువ్వులు, పడతులు, మతాలు, అభిమతాలు, రాజకీయాలు, శాంతి ప్రవచనాలు, సమాజ స్థితిగతులు ఈ వీక్షణం ప్రసరించిన తావులు విభిన్నాలు! వైవిధ్య సంభరితాలు! పైకి డ్రైఫ్రూట్స్‌లాగా కనిపిస్తూనే, అనుభూతి రసాన్ని చిప్పిల్ల జేయగల నైజం వీటిల్లో మీరు పట్టుకోవచ్చు.

జీవితాన ఆలంబనగా నిలిచే అనేక ఆలోచనలు, ఆలోచనలకు ఆస్కారం ఇచ్చే క్షణక్షణ ఘటనలు, ఘటనల వెనుక దాగిన సర్వజనీన ప్రవృత్తి నైజాలు, నైజాలననుసరించి ప్రవర్తిల్లే మానవులు, మానవులు కోల్పోతున్న విలువలు, అభిలషిస్తున్న మలుపులు అన్నీ ఈ ప్రాతిపదికల కవిత్వంగా భాసిస్తున్నాయి.

కె.బి.లక్ష్మిలోని ఊహాశక్తి, కల్పనా సౌందర్యం మటుకే కాదు క్షణం రెక్కలు విచ్చి కవితావిహాయసంలో విహంగమై ఆమె దృశ్యీకరించి ఇచ్చిన అంశాలు ఇవన్నీ. వీటిల్లోంచి ఉదాహరణలు ఇచ్చుకుంటూ పోయే లౌల్యాన్ని నేను పరిహరిస్తున్నాను. అవి పాఠక హృదయైక వేద్యాలు.

వీటిని ఒక క్రమంలో చదువనవసరం లేదు. అలా చదవద్దు కూడాను. మీకు గాఢ ఆనందం కలిగినప్పుడో, నిర్వేదం కలిగినప్పుడో, ఇవి రెండూ లేక ఉబుసుపోనప్పుడో ఏ క్షణంలోనైనా సరే ఈ పుస్తకంలోని ఏదో పేజీని తిప్పి అందులోని ఏదో ఒక ఖండికను చదవండి. పఠితగా మీ హృదయ స్పందనం ఎలా వుంటుందో మీకు మీరే తార్కాణం! అయితే తెరిచేటప్పుడు విశ్వాసంతో తెరవండి, ప్రేమతో తెరవండి, నిరపేక్ష గానే తెరవండి. గీటురాయి పై సానబెట్టడానికో, అయస్కాంత పరీక్ష చేయడానికో, రంధ్రాన్వేషణ దృష్టితోనో చూడకండి, చదవకండి.

హాయిగా, అలవోకగా చదవండి
ఆ పంక్తులను పలవరించండి

మీ అనుభూతి రెక్క ఎలానో విచ్చుకుని స్వేచ్ఛగా ఆనందవీక్షణం సాగేవైనం పొడగడుతుంది.

ఇంతకన్నా ఎక్కువేమీ చెప్పనవసరం లేదు.
ఈ వీక్షణం ఇప్పుడు లక్ష్మిది మాత్రమేకాదు
పఠితలందరిదీ.

ఈ భావ బిందువులు, ఊహాపదాలు, అనుభూతి శకలాలు
సహృదయ పాఠకులను ఎలా అలరించేదీ వారే గ్రహిస్తారు
ఎటొచ్చీ ఆ అనుభూతిని వారు అక్షరబద్ధం చేసి
ప్రతిస్పందించగలిగితే ఈ వీక్షణంకు సహృదయవీక్షణం
ప్రతి స్పందనం అభిలషించడం కవి నైజం
ప్రతి స్పందించడం నిర్ణయించేది పాఠక సమాజం.
ఈ వీక్షణం
మీ హృదయ విహంగ విహారానికి
అనుభూతి దృశ్య ఆహ్వానాలందిస్తుందని
మిమ్ములను అలరిస్తుందని ఆకాంక్ష!

లక్ష్మి కవిత్వ గమనవీక్షణం నిరంతరాయం కావాలనీ, మనసున మనసైన అనుభూతి ప్రపంచాన్ని ఆవిష్కరించాలనీ, సమాజహిత దృక్కోణం మరింత నిశితమూ, విస్తృతమూ కావాలనీ మనసా కోరుకుంటున్నాను.

*2007*



# కవిత్వ కౌతుకం

## ప్రేమపక్షి (కవితా సంపుటి) - డి. కామేశ్వరి

**కా**మేశ్వరి ప్రధానంగా కథకురాలు. తెలుగు సాహిత్య ప్రపంచంలో నవలా, కథా రచయిత్రిగా ఇప్పటికే సుప్రసిద్ధురాలు. రచన ఒక అషామాషీ వ్యవహారంగా కాక, ఒక నిబద్ధతతో స్వీకరించిన పరిణీత. తన రచనలకు అభిమానులైన పాఠకులను సంపాదించుకున్న మంచి రచయిత్రి.

కథ వేఱు. కవిత్వం వేఱు. రెండింటికీ 'వేరు' స్పందనలోనే వుంది. ఒక సంఘటనకో, పరిణామానికో, వ్యక్తుల ప్రవర్తనకో చలించడం నుండి - స్పందన ఉదయించవచ్చు. ఆ స్పందనలకు అక్షరాకృతి నివ్వడమే రచన. ఆ రచన చదివిన పాఠకునిలో, రచయిత సంకల్పించిన రసావిష్కరణం కలిగినప్పుడే- ఆ రసానుభూతితో రచన ప్రయోజనం సిద్ధించినట్లు.

కవిత్వరచన, వచనరచన పైకి కేవలం ప్రక్రియాభేదాలు అనిపించవచ్చు గానీ, స్పందన అభివ్యక్తం కావడంలో సున్నితమైన ఓ తేడావుండనే వుంది. ప్రతిదీ కథ కానట్లే, ప్రతిదీ కవిత్వం కాలేదు. ఏ విషయం కథగా రాయాలి, ఏది కవితగా అభివ్యక్తీకరించాలి అన్న విషయం తెలియాలి. ప్రతి కవీ కథకుడు కాలేడు. ప్రతి కథకుడూ కవి కాలేడు. కానీ సవ్యసాచిలా రెండింటినీ నిర్వహించి మెప్పించగలవారు ఏ కొందరో ఉంటారు.

'పొయెటిక్ ఎక్స్‌ప్రెషన్' అందరికీ చేతకాదు. ఆ మాటకొస్తే మంచి వచనం రాయడం మరీ కష్టం. వాక్యం సూటిగా కథలో గుండెను తాకించగలగడం

సామాన్యమైన ప్రజ్ఞ ఏమీకాదు. కవిత్వం అంటే వచనాన్ని- వాక్యాలను కొన్ని ముక్కలుగా చేసి, ఒకదాని అడుగున ఒకటి పేర్చడం కాదు. దానికి ఒక అంతర్లయ వుంటుంది. అద్భుతమైన అనుభూతి స్పర్శ వుంటుంది. కొందరు కథకుల్లో విషయాన్ని కథనం చేయడంలో, వర్ణనల్లో, పాత్రగతవిశ్లేషణల్లో ఇలాంటి కవితాత్మక శైలి కనబడుతూ వుంటుంది. కథల్లో కవిత్వం పలికించడం కుదురుతుందేమోగానీ, కవితలో కథ పలికించడం కుందుర్తి ఆశించిన కథాకావ్యధోరణిని అనుసరించిన ఏ శీలావీర్రాజు వంటికొందరికే సాధ్యమైంది.

ఇంతకీ కవిత్వమూ, కథా కలగలిసి పోవాల్సిన అగత్యం లేదు. దేని ప్రయోజనమూ, దేని నిర్దుష్ట లక్ష్యమూ దానిదే. చక్కటి కథలు వ్రాసిన శ్రీమతి డి. కామేశ్వరి కవిత్వ రచనకు ఎందుకు సమకట్టిందనేదే కుతూహలం. తనకు కథాంశాలు ఏవో, కానివేవో స్పృహవుంది. కథకు ఒదగని స్పందనలను కొన్ని సద్యఃస్ఫూర్తితో ఆవిష్కృతం చేయాలనే రచనా కౌతుకం ఈ పని చేయించిందనాలి. అందుకే కొన్ని రచనల్లో మనకు కథా బీజాలు కూడా కానవస్తాయి. 'మరుపుకు మందు' ఎత్తుగడ అలా ఓ పాత్ర పరిచయంలా కనబడుతుంది. కానీ ఓ ప్రేమభగ్నతను కథగా విస్తరించే వీలున్నా హృదయగత ఉద్విగ్నత ప్రకటనమే ప్రధానం కనుక, ఒక రస బిందువుగా ఆవిష్కృతం అయింది. 'అర్థం కానిది' ఖండిక ఒకటి చూడండి. కామేశ్వరి కవిత్వ భావుకత ఏమిటో అర్థం అవుతుంది. ఈ ఖండికల్లో ప్రేమ సంబంధమైనవి, అమ్మతనంతో కూడినవి విరళంగా కనిపిస్తాయి. కథలుగా కంటే, అనుభూతి రసాత్మకాలుగా భాసించే భావనలకు అందుకే కామేశ్వరి ఇలా అక్షరాకృతి కల్పించారు.

కథా ప్రక్రియలో బాగా చేయితిరిగిన రచయిత్రి కాబట్టి వాక్యకథనాలుగా కొన్ని అనిపించినా, వెనువెంటనే తద్భిన్నమైన మౌలిక భావుకతతో వాటిని విప్పార్చే- సుమవికసన ప్రకృతిని దృశ్యీకరించారు. 'తరాలు మారినా' ఖండికలో ఒక నవలకు పట్టేటంత కాన్వాస్‌ను మినియేచర్ పద్ధతిలో సంక్షేపించి చెప్పగలగడం మంచి ప్రతిభే. 'కన్నీటికథ' కూడా- కథకాదగివుండీ, అల్పాక్షరాలలో అనల్ప భావ ప్రకటనం కాగలగడం చూస్తాం.

కవిత్వం ఓ ముడిసరుకు. మఱ్ఱిచెట్టయినా చిన్న మఱ్ఱి విత్తనం నుండే మొలకెత్తినట్లు, కవిత్వపు మౌలిక స్పందనల నుండే జీవితపు విశాలత్వమూ

పరుచుకుంటుంది. కవిత్వం హృదయం మూలాధారనాడి. లయబద్ధమైన గుండెచప్పుడు వున్నప్పుడే జీవితం మనుషులతో, సంఘటనలతో, ప్రణయాలతో, ప్రయాణాలతో నిరంతరాయంగా సాగుతూంటుంది. చెప్పవచ్చేదేమిటంటే- రచయితల్లో కవిత్వాంశ అనేది అలాంటి కేంద్రక బిందువు. బిందువు బిందువుగానే ప్రతిబింబించక పోవచ్చు. ప్రతిఫలించకపోవచ్చు అందరిలో. మంచి వచనం రాయడానికి ఎలాంటి మౌలిక కవిత్వ బిందువు అవసరమో, అదిగో- అలాంటిదేదో కామేశ్వరిలో దాగివుంది. ఆవిడ సాధన చేయలేదు గానీ, లేకపోతే ఇప్పటికే ఎప్పుడో ఉత్తమ కవయిత్రిగానూ పాఠకలోకం గుర్తించేలా కవిత్వం రాయగలిగేవారు.

ఇప్పటికీ కవిత్వానికి ఒక ఉదాత్త, ఉత్తాల స్థానం వుంది కనుకనే- రచనాభిలాష వున్నవారు, ఈ సరికే కథకులుగా, నవలాకారులుగా లబ్ధ ప్రతిష్ఠులయినవారు- కవిత్వ రచనపట్లా ఆసక్తులవుతూంటారు. చాసో కవిత్వం, చలం కవిత్వం, రావిశాస్త్రి కథల్లోని కవిత్వం ఇలా వచన రచయితల్లోని కవిత్వ పార్శ్వాలను ముందుకు తెచ్చిన ప్రయత్నాలు ఇప్పటికే జరిగాయి.

కామేశ్వరి గారి కథల్లోనూ, నవలల్లోనూ వున్న, దాగున్న కవిత్వాన్ని కావలస్తే ఏ పరిశోధకుడయినా సిద్ధాంతీకరించవచ్చుగానీ, రచయిత్రి స్వయంగా కవిత్వ రచనకు పూనుకుని ముప్ఫైకు పైగా కవితలు రాయడం, వివిధ పత్రికలలో కొన్ని ప్రచురితం కావడం, వాటినన్నింటినీ ఇలా ఒక సంపుటిగా క్రోడీకరించడం నిజంగా హర్షనీయం.

కథలు, నవలలు రాస్తున్నా- అంతర్గతాభిలాషకు అడ్డుకట్టవేయక, చక్కని చిక్కని భావాలను రసానుభూతుల ప్రేరణతో ఇలా అక్షరబద్ధం చేయడం, వీటిని ఒక సంకలనంగా రికార్డు చేయడం అభినందనీయం.

కామేశ్వరి సుప్రసిద్ధ కథా నవలా రచయిత్రి మాత్రమేగాక, కవయిత్రి కూడానని- ఈ సంపుటి పాఠకుల ప్రశంసలందుకోవాలని శుభాకాంక్షలు.

*1 ఏప్రిల్ 2008*




# శైశవ జీవన వేదం

## బాలబ్రహ్మం (దీర్ఘ కావ్యం) – ఆచార్య రావికంటి వసునందన్

ఈ కవి పేరే వసునందన్, అంటే బాలకృష్ణుడు. ఇతడు సాహిత్యలీలా బాలుడుగా ఎదిగిన ధురంధరుడు. నాలుగు కథాకావ్యాలు, ఏడు దీర్ఘకావ్యాలు, మూడు గేయకావ్యాలు, తొమ్మిది వచనకవితా సంపుటులు, నాలుగు సాహితీ విమర్శపరిశోధన గ్రంథాలూ, ఇంకా ఏడు వివిధ కృతులు, ఇలా ఇన్నాళ్లూ అవలీలగా రాసివేసి ప్రతిష్ఠాత్మకమైన షోడశ పురస్కారాలు అందుకున్న సాహిత్య జగజ్జెట్టి. సంప్రదాయాన్నీ, ఆధునికతను సమంగా సంతరించి సాహిత్యరథం నడుపుతున్న సారథి.

ఈ వసునందనుడు ఇప్పుడు తాత అయ్యాడు. 'మనుమ' సిద్ధితో శ్రీహర్ష పులకాంకితుడైన కవి గుండెపొంగితే వెలువడిందీ కావ్యం. 'బాలబ్రహ్మం' అనడంలోనే సృష్టిలోని శైశవ వైశిష్ట్యాన్ని సృజనాత్మకంగా ఆవిష్కృతం చేయడం స్పష్టమవుతోంది. స్వచ్ఛశైశవ హృదయం వున్న కవిగానీ బాలబ్రహ్మాన్ని దర్శించడం సాధ్యం కాదు.

ఈ కావ్యం శైశవాన్ని భిత్తికగా చేసుకుని, వ్యక్తి తాత్త్విక రసానుభూతిని బ్రహ్మానందమయం చేస్తుంది. పిడికిళ్ల కొద్దీ రహస్యాలు, దోసిళ్లకొద్దీ తారంగాలు, ఆనందామృతగంగలు తన రచనా విన్యాసంతో అందిస్తాడు కవి. రూప రస గంధ స్పర్శలనూ, పంచ భూతాత్మక ప్రపంచాన్నీ, సకలసృష్టి అందాలనూ –

అన్నిటినీ పసివాడి ప్రతి కదలికలో దర్శించి, అక్షర రమ్యతతో అనుభూతిమయం చేయడం - పరిణత లేఖినికే సుసాధ్యం.

కొనసాగుతున్న వసునందన్ కవితాయాత్రలో 'బాలబ్రహ్మం' ఒక తీర్థయాత్ర. 'ప్రకృతి మనిషికిచ్చిన కోటికోటి పుణ్యఫలం పసితనం' అని అందుకే సంభావించ గలిగాడు. 'చొంగకార్చే నోటిలో పచ్చి పసితనం గుబాళింపులు - ఎన్ని పుట్ల సుగంధ ద్రవ్యాలు సాటి?' అనగలిగాడు.

***"పవ్వళిస్తే వటపత్రశాయి***
***పరవశిస్తే మహానందదాయి***
***కాళ్లు చేతులు కదిలిస్తే మత్స్యమూర్తి***
***పారాడితే శ్రీకూర్మం***
***ఆడుకుంటే ఆదివరాహం***
***కూర్చుంటే లక్ష్మీనారసింహం***
***అడుగులు వేస్తే వామనావతారం***
***ఆగ్రహిస్తే పరశురామం***
***విద్యాబుద్ధుల శ్రీరామం***
***జ్ఞానానంద శ్రీకృష్ణం***
***బాలబ్రహ్మం"***

మొత్తం కావ్యసారాన్నీ, శైశవంలోనే- పుంజీభూతమై వున్న జీవనసారాన్నీ ఇలా ఆవిష్కరించగలగడం వసునందనుడికే చెల్లింది. "అమ్మ ఒడే మానవత గుడి- ఊగే ఉయ్యాలే ఆనందలోకాల జంపాల - తల్లి పయ్యెదమాటు దోబూచులే జగన్నాటకానికి తెరతీసే ప్రయత్నాలు'' అని దశావతార ధర్మాన్ని మానవజీవనసారంగా ఆ జగన్నాటక సూత్రధారి తదేక క్రీడా ధ్యాస -జీవనవేద బాలబ్రహ్మశ్వాసగా అభివ్యక్తీకరించడం, అభినందనీయం కాదామరి!

మొదటి సంవత్సరం- అంటే పన్నెండు నెలల కాలంలో ఎదిగే పసివాడి జీవన సరళిని - పన్నెండు చిరు అధ్యాయాలుగా పరిచి చెప్పిన ఈ రచన జీవనవేదనాదాన్నీ, బ్రతుకు తాత్త్వికసారాన్నీ ప్రతీకాత్మకం చేయగలగడం విశేషం.

ప్రహ్లాదుని భక్తి 'పట్టు'ను, ధ్రువమార్కండేయుల 'ఆత్మబలాన్ని' సాక్షాత్కరింపచేయడం మానవేతిహాసంలో మరపురాని వ్యక్తిత్వ చింతామణిగా దర్శించడం సహేతుకమే.

*"నిరంతర ప్రగతితో నిత్య సంతోషంతో*
*నిర్నిద్ర కాంతితో నిర్నిమేష మనీషతో*
*మహా యశస్సుతో మహిత మానవతా తపస్సుతో..."*

శ్రీ హర్ష ప్రతీకగా సువిశాల విశ్వవ్యాప్తంగా బాల్యం సుఖంగా వర్ధిల్లాలనే ఆచార్య రావికంటి వసునందన్ ఆశీర్వాద సదాశయమే- ఈ కావ్య ఫలశ్రుతి!

*25 సెప్టెంబర్, 2008*




# వచన కవిత్వంతో ఊరుతున్నపొత్తు

## పుడమితల్లికి సంకెళ్లు (కవితా సంపుటి)- పొత్తూరి సుబ్బారావు

**కొం**దరుంటారు కవులు. సామాన్యుడి కోసమే రాస్తున్నామనీ, ప్రజాకవులం తామనీ, తమకు తాము సంభావించుకుంటూ ఉంటారు. కానీ నిజంగా ప్రజలకు సంబంధించిన సమస్యలు వారికి పట్టవు. పర్యావరణ పరిరక్షణ గురించీ, అంతరించి పోతున్న జంతు సంతతి గురించీ, అనేక సమస్యలకు హేతువవుతున్న అధిక జనాభా గురించీ, ఆలోచనాశక్తిని పెంచే పుస్తకాన్ని విస్మరించి- ఆక్రమించుకుంటున్న మీడియా గురించీ, అతివల అభ్యుదయం గురించీ రాయడం కొందరి దృష్టిలో ప్రభుత్వ ప్రచారాలకు వత్తాసుపలికే కవిత్వంగా సంభావింపబడుతుంటుంది. అందుకే వాటి జోలికి పోరు. వారికి భావాంబర విహారమే నచ్చుతుంది. కవిత్వంపేర సమస్యల్లో కూడా రొమాంటిసిజం వెలార్చడమే వారి ధోరణి. అందమైన ప్రతీకల కోసం, భావ చిత్రాలకోసం శిల్పం పేర వారి దేవులాట. తాము ఎవరికోసం రాస్తున్నామంటున్నారో - వారికి తమ కవిత్వం అర్థం కావాలి అనే విషయం మాత్రం వారికి పట్టదు. పేరు ప్రఖ్యాతులు, ప్రచురణావకాశాలు, మిత్రకూటములు దండిగా ఏర్పరచుకొని, పరస్పరం ప్రమోట్ చేసుకొనే లౌక్యాలు, దక్షతలు, అవకాశాలు వారికి ఉంటాయి. సిగరెట్లు, మందు, మగువ అవన్నీ భోగవస్తువులుగా వినియోగించుకుంటూనే, లోకం పాడైపోతోందనీ- తిన తిండీ, వుండడానికి నివాసం లేక పేదలు అలమటించి పోతున్నారనీ, వారి పట్ల సంఘీభావం ఉన్నట్లుగా రచనలు చేస్తూంటారు.

ఆచరణలో పేదవాడికోసం పైసా విదల్చనివారు, తాము, తమ పిల్లలు అమెరికా సంస్కృతిలో ఐశ్వర్యవంతులు కావడానికి తహతహలు, తాపత్రయాలు పడుతూండేవారు చేసే రచనల్లోనూ,పాల్గొనే సభల్లోనూ అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ మాతృభాష గురించి, భారత దేశపు మట్టి గురించి ఘోషిస్తూంటారు. ఆత్మశుద్ధి లేని ఆచారాలు, చిత్తశుద్ధి లేని కావ్య రచనల వల్ల ప్రయోజనం ఏముంది?

నిజమే! కొందరు మామూలు కవులు. వీరికి సమాజపరమైన లౌక్యాలు తెలియవు. కీర్తి ప్రతిష్ఠల ఆర్జన మార్గాలు తెలియవు. చేసే పనులేవయినా నిజాయితీతో చేయడం, ఎవరిపట్ల సహానుభూతి ఉందో వారితో కలిసిమెలసి మెలగడం, తమ ఆలోచనలను అక్షరబద్ధం చేసి పంచుకోవడం వారి ధోరణి. ఏ పని చేపట్టినా దాని పట్ల పూర్తి నిమగ్నతతో, దీక్షతో దానితో మమేకమై సాగించడం వారి వైఖరి. కావచ్చు. వీరిలో గొప్ప అభివ్యక్తి నైపుణి, ఆలంకారిక శిల్పం లేకపోవచ్చు. వచన కవిత్వం రాస్తున్న వీరిలో ఒక్కొక్క సారి వచనత్వమే ఎక్కువ ఆనవచ్చు. ఐతేనేం ! అయోమయం, పులుముడు, మార్మికత, పదాల గారడీ, అభివ్యక్తి, నైపుణిపేర అసలు నైజాన్ని కప్పుకొని గొప్పగా కనబడడం వీరిలో ఉండదు. రచనకు జీవితానికీ పొంతన వీరిలోనే కనబడుతుంది. అనుకున్నదీ అన్నదీ ఒక్కటిగా నిజాయితీగా వ్యక్తమౌతారు వీళ్లు.

కవుల మధ్యనే గుడుగుడుగుంజంగా తిరిగే కవిత్వం కన్నా, సామాన్య పాఠకులకు అర్థమయ్యే కవిత్వం అది కొంత వచనమై తేలిపోయినా ఫరవాలేదనుకునే వైఖరి కుందుర్తి గారిలోనే మొదటగా కనిపిస్తుంది. ప్రయోజనం తండ్రి, పరమ సౌందర్యం తల్లిగా భాసించే కవిత్వమే రసానంద కల్పవల్లిగా సంభావించారు కుందుర్తి. అమ్మ- అమ్మయే! ఆమె సర్వాభరణ సంశోభిత కాకపోవచ్చు. ఆమె ప్రేమ, ఆప్యాయత, ఆమె పంచి ఇచ్చే విలువలూ... అవన్నీ పరమ సౌందర్య సంభరితాలే! ఇంతకీ అందం బాహిరమైనది కాదు. అది గుణపక్షం, ఆత్మగతం అన్నది సార్వకాలిక సత్యం. పైపై మెరుగుల భ్రమసే లోకానికి- అందమంటే ఆకర్షణే అనుకునే సంవిధానానికి ఈ మాట నచ్చకపోవచ్చు. కానీ వాస్తవం వాస్తవమే!

ఇదంతా ఎందుకంటే-నిజాయితీ, చిత్తశుద్ధీ, విలువలపట్ల నిబద్ధతా, రచనకూ జీవితానికీ పొంతన వుండే జీవన వైఖరులలో నిమగ్నతతో ఇవీ అసలైన

కవి లక్షణాలనీ చెప్పడానికి. కవికి మానవ బలహీనతలు ఉండవచ్చు. కానీ వ్యసనపరుడు- సందేశహారుడూ, ప్రవక్త, శాసన కర్తా కాజాలడు. కారాదుకూడాను. కవులు గుర్తింపబడని శాసనకర్తలు అనబడ్డారంటే దానికి కారణం- మంచి మార్పు తేగల మహిత సామర్థ్యం వారి వద్ద వుందనే..

*''అయ్యా! ఈ నేల మీద ఇప్పుడంతా*
*డబ్బులు పండిస్తున్నారు కానీ*
*పూలమొక్కలనెవరూ పెంచరట*
*ఇక్కడొక బహుళంతస్తుల భవనం కట్టి*
*టెర్రస్ మీద పూల కుండీలు నిలుపుతారట"*

*"తరతరాల సంప్రదాయ వారసులైన*
*పెద్దలందరినీ వృద్ధాశ్రమాలకు సాగనంపి*
*పబ్బుల్లో పండుగలు చేసుకొని*
*పబ్బంగడుపుకునే పరాయితనానికి*
*అచ్చమైన తెలుగింటిలో జరుపుకునే*
*స్వచ్ఛమైన పండుగల సంగతులెలా తెలుస్తాయి"*

*"తన ఇంటన అనుదినం*
*పలికే హింసధ్వని రాగాలకు*
*సాటి మహిళలైన ఇరుగమ్మలు పొరుగమ్మలు*
*తాళం వేస్తుంటే ఎక్కడుంటుందిక మహిళాభ్యుదయం"*

*"అయ్యవారి అవతారమని చెప్పుకునే*
*వరాహాన్ని తరిమికొడతారు*
*మత్స్యాన్ని వండుకుని తింటారు*
*కూర్మానికీ అదే గతి*
*బుద్ధుని బోధనలు పట్టించుకోరు*
*......*
*జంతువులపైనే కాదు దేవుళ్లపై కూడా వివక్ష*
*ఏంటో! ఈ మానవ నైజం అంతా వివక్షే కదా"*

**"ఆ నేత్రపు చూపులిపుడు దారి తప్పుతున్నాయి**
**ఇరవైనాలుగు గంటలూ వార్తలను**
**తెరపై చూపాలన్న తపన**
**రెప్పవాలనీయకుండా చేసిందా కన్నునిపుడు**
**.....**
**తన కన్నును తానే పొడుచుకున్నట్లుంటుంది"**

**"దుకాణదారుడు ఇచ్చే ప్లాస్టిక్ బ్యాగును**
**నిరాకరించినప్పుడే**
**పర్యావరణ పరిరక్షకులమవుతాము**
**అప్పుడే మన ఇల్లవుతుందొక**
**నందనవనం"**

**"అరవైలో ఇరవై అంటే**
**అంతకన్నా ఆనందమేమున్నది**
**....**
**అదొక వ్యక్తి జీవిత విషయమైతే**
**పురోగమనమే అవుతుంది**
**కానీ**
**ఒక స్వతంత్ర జాతి చరితకు**
**అరవై దాటినా ఇరవైలోనే ఉంటే**
**అంతకు మించిన హాస్యాస్పదం**
**మరొకటుండదు"**

తను రాసే వచన కవిత్వంలో ఇలా భావ వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్న పొత్తూరి సుబ్బారావు కవితల్లో సమాజహిత భావన వుంది. వృత్తిలో ఉన్నంతకాలం దానికే అంకితమై పనిచేసి, రిటైరయ్యాక తన కవిత్వరచనాభిలాషకు రెక్కలు తొడిగిన నిజాయితీపరుడు తాను. "సాహితీ కిరణం" సంపాదకునిగా ఉన్నంతలో ఉపయుక్తమైన కృషి చేస్తున్న చిత్తశుద్ధిగల వ్యక్తి. తన అభివ్యక్తిలో కవిత్వ సాంద్రతకు కృషిచేస్తూనే- అదే సమయంలో నిరలంకార వచనకవితను వెలారుస్తున్నవాడు. పత్రికల్లో, కవిసమ్మేళనాల్లో జనజీవన మమేక ఉద్యమాంశాలకు స్పందిస్తూ తను

నిరంతర కవితా కృషిని సాగిస్తున్న కృషీవలుడు. వర్తమాన అంశాలతో విలీనమవుతూ విశిష్టమైన అభిప్రాయాలను నిర్ద్వంద్వంగా- అభివ్యక్తం కావిస్తున్నాడు మిత్రుడు పొత్తూరి. సంఘహితమే ధ్యేయంగా వచన కవిత్వంతో ఊరుతున్న పొత్తు- పొత్తూరి సుబ్బారావుది.

భూపోరాటాలు ఈ సంకలనం కవితల్లోని ఒక ప్రధానాంశం. నమ్ముకున్న భూమిని అమ్ముకునే రైతుల దీనస్థితి, బడా పారిశ్రామిక వేత్తలకోసం బలిపెడుతున్న ప్రభుత్వ సెజ్‌ల వైఖరి, పేదవాడి గుడిసె కోసం భూమి దొరకని దౌర్భాగ్య దైన్యం పొత్తూరి చిత్తాన్ని కలచివేసిన వైనం ప్రబలంగా కనబడుతుంది. 'మీ బలగాల పహారా వ్యయంలో వాళ్లడిగిన నేల వెల ఎంతో తెలియచెప్పండి?' అని ప్రశ్నిస్తాడు. పేద గూర్ఖా గురించి 'నిండు అమావాస్యరాత్రుల్లో- కనిపించని చంద్రుడ్ని - నీ టార్చ్‌లో బంధించావో ఏమో' అని అంటూ పౌరులు నిశ్చింతగా నిద్రపోవడానికి 'నిశాచరుడు' అయినా అతన్ని గౌరవించే సంస్కారం మనకింకా అబ్బనందుకు ఆర్తి చెందుతాడు. 'నరక యాతనను మించిన-నగర యాతన భరించలేక- శివారు ప్రాంతానికి- తరలిపోక తప్పిందికాదు' అంటూ నగర దౌర్భాగ్య స్థితిని పేర్కొంటాడు. ఇప్పటి బాల్యం ఎంత సేపూ ఆ కంప్యూటర్ ముందూ, టీవీలో వచ్చే ప్రోగ్రాములకు పరిమితమైపోవడం తనను కలచివేస్తుంది.

"జీవించే హక్కును- మన రాజ్యాంగం- ప్రసాదించిందంటూ- గొప్పలు చెప్పుకుంటే సరిపోదు. జీవించాల్సింది- ఈ భూమిపైనే అని- గ్రహిస్తే అర్థమవుతుంది. - ఈ బడుగు జీవులందరికీ కాసింత చోటివ్వడం సముచితమని" అని సుస్వరాలు పలుకుతాడు. వృద్ధాప్యం సెకండ్ ఇన్నింగ్స్ అని క్రికెట్‌తో పోల్చి- 'లైఫ్ టెస్ట్ తొలినాళ్లలో- సాధించిన ఘనకార్యాలేమైనా వుంటే- అవి పరిపక్వతనొంది- వాటి పరితుష్టి నందుకొనేది- మలినాళ్ళలోని జీవితమే' అని వృద్ధాప్యం 'బెస్ట్ ఇన్నింగ్స్' అని సమాదరిస్తాడు.

గాట్ ఒప్పందాలు, అణు ఒప్పందాలు ఈ బాపతు ఒప్పందాలన్నీ ఒప్పడం, ఒప్పకపోవడం అటుంచి-

***"వీటన్నిటికంటే***
***మనిషి మనిషికీ నడుమ***
***మమతలు పెంచే ఒప్పందమేదన్నా***
***చేసుకుంటే బాగుంటుందేమో"***

అని మానవీయతకు మకుటం పెట్టడం– సమాదరణీయమైన పొత్తూరి కవిత్వ మహత్వ వైఖరి.

"అందరి భావాలూ - అందరి అభిప్రాయాలూ - ఏకమయ్యేటట్లు- ఊరూ వాడా వినిపించేలా – గొంతు చించుకుని మరీ – కొత్త గానాన్ని ఆలపిద్దాం" అని ఒక సమైక్య భావాన్ని జాగృత పరుస్తూ 'పాట ఒకటే అయినప్పుడు - రాగమేదయితేనేం' అని ప్రతిపత్తిని సమర్థిస్తాడు.

హృదయాంతరాల ఉహాసౌధాలు జనాంతరాల్లో దృగ్గోచరం కాగలవనీ, సరళీకరణమే సర్వరోగ నివారణమనీ భావించి 'గాట్' గాయాలకోర్చి మనం ఎలా సామ్రాజ్యవాద అమెరికా ఒత్తిడులకు తలవొగ్గి అతలాకుతలమవుతున్నామో పొత్తూరి సుబ్బారావు గ్రహించాడు.

***"వాళ్ళకు తలవంచి నిర్మించుకున్న***
***ఊహా సౌధాలన్నీ***
***శ్వేత సౌధపు ఆర్థికమాంద్యానికి***
***ఊగిసలాడుతుంటే***
***ఎటుపోవాలో తెలియక తికమక పడుతున్నామిప్పుడు"***

అని అందుకే అంటాడు. అదిలించాల్సింది ఎక్కడో, ఎదిరించాల్సింది ఎక్కడో, ప్రేమతో ఒదిగించాల్సింది ఎక్కడో స్పష్టమైన అవగాహన తనకు ఉంది. పుడమి తల్లికి సంకెళ్లు విడివడడానికి కలివిడిగా చేయాల్సిన కార్యాచరణపట్ల ఉన్ముఖీ కరణ చేయడమే తన సంకల్పం. కవిలో స్పష్టత వుంది. మరింత గాఢత అవసరం. పలికే ఒక మామూలు మాటేకవిత్వమయ్యే– 'వాక్యపు నిర్మాణబాట' అనే 'ఆల్కెమీ' సాధనతో మరింత వశమవుతుంది. దాశరథి అన్నట్లు ఊహించే మేధ– స్పందించగల హృదయం– రాటు దేలిన కలం' అనే కవి లక్షణాల్లో తొలి రెండూ పుష్కలంగా ఉన్న కవి పొత్తూరి సుబ్బారావు కలం మరింత రాటుదేలగలదనీ, తన కలం నుండి నిజాయితీతో కూడిన ఉత్తమ కవిత్వం మరింతగా వెలువడి పాఠకసమాదరణీయం కావాలనీ శుభాకాంక్షలు.

*8 డిసెంబర్ 2008*




# రుబాయీ స్వరాలు- అప్పారావు జాడలు

## ఉషోదయము (కవితా సంపుటి) - గురజాడ అప్పారావు

నిజానికి రుబాయీ చదువుకోవడాని కన్నా కవిసమ్మేళనాల్లో వినడానికి బాగుంటుంది. ఆ నాలుగు పాదాల కవితలో ఒక తూగు వుంటుంది. నిజానికి రుబాయిలు అంటున్నాంగానీ, అరబ్బీలో 'రుబాయీ' అంటేనే బహువచనం. ఒకటయితే 'రుబాయత్, 'రుబాయీ' అనగానే ఉమర్ ఖయ్యాం గుర్తొస్తాడు. ఉర్దూలో రుబాయీని శృంగారానికీ, సందేశానికీ అధికంగా వినియోగించుకున్నారు. గాలిబ్, మీర్ అనీస్, అమ్జాద్ హైదరాబాదీ, పార్సీలో-సూఫీసర్మద్, ఉమర్ ఖయాం, ఫిరదౌసి, సాదీ లాంటివారు ఈ ప్రక్రియను పరిపోషించారు.

తెలుగులో రుబాయీ ప్రక్రియను అదే నిర్మాణ దక్షతతో మొదటగా తెచ్చింది 'దాశరథి' గారేనని చెప్పుకోవాలి. 1975 ప్రాంతంలో ఒక కవి సమ్మేళనంలో వాటిని వినిపించి, శ్రోతలను ఉర్రూత లూగించటం బాగాగుర్తు. అప్పుడాయన వినిపించిన రుబాయిలు రెండు నాకు ఇప్పటికీ బాగా జ్ఞాపకం -

*"కళ్ళెం ఉన్నది మన చేతిలో*
*గుర్రం మాత్రం పడే గోతిలో*
*దప్పితీరదని నేనంటాను*
*నీళ్ళే లేని మన నూతిలో"*

*"పడవ నడపలేనివాడు నావికుడు*
*పాటపాడలేనివాడు గాయకుడు*

*అందుకోసమే వేదనతో నేనంటాను*
*ప్రజల నడపలేనివాడు నాయకుడు"*

ప్రతిపాదం సమతూకంతో వుండి, ఏ పాదానికి ఆ పాదం విడిపోతూనే, నిర్మాణపరమైన అందం, ఆకర్షణలతో – మూడోపాదానికి తప్ప తక్కిన పాదాలకి అంత్యప్రాసనియమంతో, మూడోపాదం పై రెండు పాదాలకు కొండకచో వ్యాఖ్యగా వుంటూ, నాలుగో పాదంతో ముగుస్తుంది రుబాయి.

లోకం తీరునీ, హితోక్తుల్నీ, సామాజిక వ్యాఖ్యల్నీ, వ్యంగ్యాన్నీ క్లుప్తంగా, చమత్కారంగా, ఒక మినీ గేయంలా భాసింపచేసేవి రుబాయిలు. దాశరథి, సి.నా.రె, తిరుమల శ్రీనివాసాచార్య, పెన్నా శివరామకృష్ణ, నాగభైరవ, యస్.ఆర్.పృథ్వి మొదలైనవారు రుబాయిలు వ్రాశారు.

ఇప్పుడు గురజాడ అప్పారావు వంతు.

ముత్యాలసరాలు సృజించిన గురజాడ అప్పారావు వంశవారసుడే ఈ గురజాడ అప్పారావు. తనూ, తన శ్రీమతి విజయశ్రీ ఇద్దరూ కవిత్వ సంసారంకూడా సాగిస్తున్న కవి దంపతులు. విశ్వసాహితి, సాహితీ స్రవంతి, తెలుగుభాషా వైభవ పరిరక్షణ వేదిక వంటి పలు సంస్థలు నిర్వహించే కవిసమ్మేళనాలలో గురజాడ అప్పారావు గొంతు వినబడుతూంటుంది. ఆయన కావ్యకర్త మాత్రమే కాదు కార్యకర్త కూడాను. స్వయంగా పలు సంస్థలకు తానొక సహకార సారథి.

ఇప్పుడీ సంపుటితో గురజాడ అప్పారావు 'రుబాయికవి'గా ఉషోదయం చూస్తున్నాడు. ఒక బిగిని, జిగిని సంతరించుకునేందుకు తన భావాభివ్యక్తికి – రుబాయి చేపట్టిన, మూడువందల ఇరవైనాలుగు రుబాయత్తు కవిత్వ దాహార్తులకు షర్బత్‌లా అందిస్తున్నాడు. వర్తమాన సామాజిక స్థితులు, రాజకీయాలు ఒకటేమిటి ఇందులో తాను స్పృశించని అంశంలేదు. అల్లిక ఎలాగయినా చెల్లిపోతుంది. అనుకున్నది నిక్కచ్చిగా అభివ్యక్తీకరించడమే ఒక తెగువ.

*"ఎందుకీ తపన ఏదో వ్రాయాలని*
*భవిష్యత్ పాఠకులకు తెలియాలని*
*ప్రచురించక వ్రాసుకుంటూ పోకు*
*ఆలోచించి సమస్య ప్రజలముందుకు పోవాలని"*

అనడంలో అప్పారావు సంకల్పసిద్ధి స్పష్టమవుతోంది.

*"ఒక్కమాట చాలు హృదయం పగిలేందుకు*
*ఒక్క మెరుపు చాలు కన్ను చెదిరేందుకు*
*భారతీయునిగా జన్మించిన వానికి*
*దేశభక్తి చాలు మనిషిగా మిగిలేందుకు"*

అనడంలో ఆ గురజాడ అప్పారావు నుండి ఈ గురజాడ అప్పారావు వరకు దేశభక్తి మానవీయ విలువల మూలకందంగా నిల్పడం గమనార్హం.

*"కాలంతో కవి నడవాలి*
*కవితలతో చలనం తేవాలి*
*సమాజాన్ని క్రుంగదీసే*
*సమస్యల పై జన సమీకరణ కావాలి"*

అనడంలో కవిత్వ ప్రయోజనాన్ని, కవి బాధ్యతనూ గుర్తు చేస్తున్నాడీ గురజాడ. కుహనా రాజకీయాలను, నేతల దుశ్చేష్టలను, పార్టీల స్వార్థపరత్వాలను ఎండ గట్టిన కళికలు ఇందులో ఎన్నో వున్నాయి.

*"కత్తిపట్టె వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి*
*భక్తి మార్గాన్నెంచుకునే మీరాబాయి*
*కత్తికంటే పదునైన కలముపట్టి సమాజ*
*కుళ్ళును ఎత్తి చూపు గురజాడ రుబాయి"*

అని స్వయంగా ప్రకటించుకున్నాడీ కవి.

*"ప్రేమిస్తే కష్టాల నెదిరించాలి*
*జీవితాంతం కలిసి జీవించాలి*
*ఆటుపోట్లను తట్టుకుని*
*ఒక్కటై సంసారం సాగించాలి."*

అని నవయువతకు సందేశం సంకలించిన కలంతోనే

*"అన్నమయ్య కీర్తన పాడుకుందాం*
*తొక్కుడు బిళ్లలు ఆడుకుందాం*
*కాళ్ళు చేతులు విరగకుండా*
*బుద్ధిగా రోజూ చదువుకుందాం"*

అని పిల్లలకూ రుబాయత్ నందించారు.

*"మేఘాలు కరిగితే వర్షపు చుక్క*
*మది వ్యథ చెందితే కన్నీటి చుక్క*
*వ్యథ చెందినా వర్షంలో తడిసినా*
*కుదురుకోవాలంటే కావాలి మందుచుక్క"*

అని 'మందుచుక్క' అనడంలో హాస్యంగా మద్యపానాన్ని స్ఫురింపచేస్తూనే 'ఔషధం' అని శ్లేషార్థంతో ఒప్పించే చమక్కులు కొన్ని చేయడం కవి కొంటెతనం అనే చెప్పాలి. నిజానికి రుబాయీలు ఇంతలా 'రాశి' పోసిన విస్తృతి వలన వీటిల్లో సాంద్రతను,గాఢతను పట్టుకున్న వాటిని పట్టు చిక్కించుకోవడం పాఠకుడికి ఓ పఠన ప్రహేళికయే!

*"చేప ఈతను చూసి నేర్చుకో*
*కష్టాలెన్నయినా ఓర్చుకో*
*నష్టపడినా భయపడకు*
*సుఖాల ఒడి చేరుకో"*

*"పుట్టినరోజున ఆర్పేరు దీపాలు*
*మరణించగానే ముట్టించేరు దీపాలు*
*జీవితం వెలుగు నీడల సయ్యాట*
*అందుకే నిత్యం దేవుని ముందు దీపాలు"*

అంటూ సందేశాన్ని, జీవన తాత్త్వికతను కూడా సంతరించడం గమనిస్తాం. తిరుమల శ్రీనివాసాచార్యగారి తరువాత ఒకేసారి ఇంత అధిక సంఖ్యలో రుబాయీలు అంటూ రాసింది గురజాడ అప్పారావుగారేనేమో! గణనీయమైనవి ఎన్నని ఎంచుకునే సౌలభ్యం, సహృదయత పాఠకులదే మరి.

అనుభవసారాన్ని జల్లెడపట్టి తాలు లేకుండా పఠనానందానికి వీలు కల్గించడం బాగుంటుందని అంగీకరిస్తూనే, గురజాడ అప్పారావు రుబాయీల రాశిలో, వాసి గలవి 'వన్నెవాసి' కెక్కుతాయని భరోసా చెందుతూ ఇంతటి కృషి చేసినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

*1 మార్చి 2010*




# మున్నుడి

## భగవాన్ శ్రీ సత్యసాయి శతవసంతం (పద్యకవిత)

## – డా॥ రాధశ్రీ

'బిలీఫ్ ఈజ్ యువర్ గాడ్' అనగా 'విశ్వాసమే దేవుడు' అంటాడు టాల్‌స్టాయ్. మనుషులను విశ్వాసులను చేయగలవారే మహితాత్ములు! 'దైవం మానుషరూపేణా' అంటే, మానవులను ఉద్ధరించే మహితాత్ములు, మానవరూపంలోనే సాక్షాత్కరిస్తారు. కనుగొన గలగాలేగానీ–కనుకొలకుల సాటిమనిషిపై చిప్పిల్లి కదిలి కారే కన్నీటి చుక్కలో – ఆ పరమేశ్వరుడు ప్రతిష్ఠితుడై వుంటాడు.

'ఫలించిన వృక్షమునకే రాతిదెబ్బలు' అన్నట్లుగా, ఎంతటి మహితాత్ములకయినా విమర్శలు తప్పవు. కానీ మానవసేవలో, మానవోద్ధరణ సత్యధర్మనిష్ఠలో వున్న వారికి అవేవీ అంటవు. వారి సంచారం విశ్వాసి మానస విహారమై విస్తరిస్తూనే వుంటుంది.

హృద్యమైన పద్య సేద్యం చేస్తున్న కవి డాక్టర్ రాధశ్రీ.డి.ఎ.వి. ఆర్.కె. ప్రసాద్ అసలుపేరు. ధర్మం, ఆధ్యాత్మికం, వేదాంతం రంగరించుకున్న కవితా ప్రసాదం శతకాలుగా ఇప్పటికే చెన్నప్ప శతకం, వర్గల్ వాణీ శతకం, నరసింహ శతకం, శశిమౌళి శతకం, చౌడేశ్వరీ శతకం, విశ్వనాథ శతకం, శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ళ శతకం, నాగలింగ శతకం.... ఇలా ఒక్క చేతిమీదుగా ఇన్ని శతకాలను

వెలయింప చేస్తున్న వర్తమానకవి తనేనేమో! ఆ శతకరచనా సంవిధానకృషి పథంలోనే ఇప్పుడీ సరికొత్త రచన భగవాన్ శ్రీ సత్యసాయి శతవసంతం. ఇందులో మరో విశేషం ఏమిటంటే–"శరణు సత్యసాయి శరణు శరణు" అని భక్తిప్రపత్తులు ప్రకటిస్తూనే, సత్యసాయి జీవితచరిత్రను సాకల్యంగా సాక్షాత్కరింప చేయడం. వందపద్యాలలోనే–సత్యసాయి జీవిత ప్రధాన ఘట్టాలనూ, ఆయన లీలలనూ, భక్తులకు చూపిన మహిమలనూ ప్రస్తావిస్తూ రాయడం నిజంగా ప్రజ్ఞే. రాధశ్రీకి పద్యంమీద గల పట్టు, అందునా ఆటవెలదితో ఆటాడుకోవడం నల్లేరుపై బండి నడక తీరే మరి!

పుట్టపర్తి సత్యసాయి–రత్నాకర సత్యనారాయణరాజు. తండ్రి పెద్దవెంకమరాజు. తల్లి ఈశ్వరమ్మ. తాత కొండమరాజు. కరణము. సుబ్బమ్మ, సుబ్బనాచార్యులు సాయికి–కృష్ణునికి ఆ యశోదానందులవంటివారు. పుట్టపర్తిలోనే జన్మించి, విద్యాభ్యాసం చేసి, వెంకావధూత గురువై అనుగ్రహం దయచేసిన సత్యసాయి, స్కౌటులో చేరి బాల్యంలోనే సేవాభావన అలవరుచుకున్నారు. పదునాలుగేండ్లకే సత్యసాయిగా మారిపోయాడు.

నీటికరువుకు నిలువెత్తు దాఖలాగా వుండే అనంతపురం సీమక్షేత్రాన్ని–సజలమయం చేసింది ఆయనే! 'ప్రభుత చేయలేని పనిచేయు ప్రభుడవు' అని రాధశ్రీ అందుకే కైమోడ్పులందిస్తారు. పండితులకే భాగవతార్థాన్ని బోధించగల పండితోత్తముడు సాయి. జంతుబలులు మాన్పడం, ముసల్మానుకు తప్పిపోయిన గుర్రాన్ని చూపడం, అగ్నిబారినుండి అతివను రక్షించడం, నీటిని పెట్రోలుగా చూపటం, బాబు గొంతులో ఇరుక్కున్న పావలా బిళ్ళను వెలికితీసి ప్రాణదానం చేయడం, ఒక లడ్డు ప్రసాదమే వేయిలడ్లుగా మారే విస్మయఘటన, ఇసుకనుండి గీతోపదేశ సన్నివేశ విగ్రహాన్ని తీసి చూపడం, శ్రీశైల మల్లన్న దేవళంలో స్వర్ణబిల్వపత్ర శతమొసంగడం, బదరికా, వారణాసి క్షేత్ర సందర్శనం, ఆలుద్రక్కరనే అమెరికావాసికి విమానంలో ప్రాణంపోకుండా కాపాడటం వంటి అనేక సత్యసాయి జీవిత వృత్తాంతాలను–రాధశ్రీ ఈ పద్యాలలో నిక్షేపించి వివరించడం జరిగింది. శతకరచనను ఇలా మలచడం ఓ విశేషం! రాధశ్రీ పద్యంలో ఒక ధారాశ్రీ వుంది. ఎక్కడా కృతకత్వం కానరాక, అలవోకగా రచన, ఆశువుగానన్నట్లు సాగిపోతుంది.

**"నీ విభూతి తోడ, నీదు నామము తోడ**
**పాపచయము లెల్ల బాయుచుండ**
**పాపచింతనులును పాపాయి లౌదురు"**

అంటాడు రాధశ్రీ. ఈ పద్యాలు చదివాక సాయి జీవిత చరిత్ర పఠనం చేయాలనే కోరిక పాఠకులకు రేకెత్తించడం కవిగారి లక్ష్యం అనిపిస్తుంది. ఆయన చెప్పిన మహిమాన్విత వృత్తాంతాల పూర్వాపరాలూ, ఆ సన్నివేశ గాథలూ వివరంగా తెలుసుకోవాలంటే-బాబా జీవితచరిత్ర చదవాల్సిందే! అందుకు ప్రేరక గ్రంథం ఈ శతకం!

ఈ 'దిడుగు' వంశస్థ కవి సంప్రదాయానికీ, భక్తి భావనలకూ ఒక 'గొడుగు'. 'వీరమాంబ గర్భశుక్తి ముక్తాఫలం కనుక- సాహిత్యరచనా వీరత్వం, నిజంగా 'అమృతలక్ష్మి' అర్ధాంగివలె లభించింది. కావ్యభావన, కవితాచేతన అతని రెండు కళ్లు. సాయిలో సకల దేవతాస్వరూపాలనూ, అల్లానూ, జీసస్‌నూ కూడా దర్శించే మతాతీత మానవాత్మ 'రాధశ్రీ' కలానిది.

ఈ సర్వజనహిత చింతనాశీలికి 'సకల సన్మంగళాని భవంతు'!

*మార్చి 2010*




# మోపిదేవి మోపిందేవి?

## కాంతి కెరటాలు (రెక్కలు)– మోపిదేవి రాధాకృష్ణ

**మ**నిషి ఎక్కడైనా మనిషే! ప్రపంచంలో – ఏ దేశంలో, ఏ రాష్ట్రంలో, నివసించినా–మానవ జీవనానుభవ స్పందనల సారూప్యతే మానవీయతకు దాఖలా! గాలి తరంగాల పైగా స్వేచ్ఛా పక్షాలు – ఒక స్వప్నం! సుతిమెత్తని "ఈకల" రెక్కలు. ఈ 'కల'యే వుంది మరి! ఆత్మను ఉన్నతీకరించే రెక్కలు. రెక్కల ప్రపంచంలో కావాలనుకునేదీ, లేనిది అస్తిత్వంలోకి తెచ్చేదీ, ఒక వాస్తవిక అనుభవ ప్రపంచం!! యునైటెడ్ స్టేట్స్ మధ్య పడమరగా కన్సాస్ (KANSAS) అనే స్టేట్ ఉంది. 'టోపేకా' దానికి రాజధాని. ఒక యూరోపియన్ 151 లోనే ఆ ప్రాంతాన్ని కనుగొన్నాడు. ఫ్రాన్సిస్కో వాస్కోడో కొరోగో అతని పేరు. 'కంస' అనే ఒక జాతి జనులు జీవించే చోటది! 'పీపుల్ ఆఫ్ ది విండ్' అని వారికి పేరు. అనేక పౌరయుద్ధాలు, బానిస తిరుగుబాటు పోరాటాలు జరిగి, 1861లో స్వేచ్ఛాయుతమై, సరిగ్గా నూటపన్నెండేళ్ళ క్రితం 1898 ఏప్రిల్ 6న స్వతంత్ర్య 34 వ దేశంగా యు.ఎస్. లో ఆవిర్భవించింది కెన్సాస్!

ఇంతకీ ఈ నేపథ్యం ఎందుకంటే – 'కెన్సాస్ పొయెట్రీ' ఇవాళ ఒక విశిష్టతను సంతరించుకుంటోంది! 1927లోనే హెలెన్ రోడా హూపర్ (HELEN RHODA HOOPER) "కాంటెంపరరీ కెన్సాస్ పొయెట్రీ" అని సంకలించిన సమకాలీన కవిత్వంలో – రాయ్‌బ్రామెల్ అనే కవి 'వింగ్స్' అనే కవిత రాసాడు. 'రెక్కలు' భావుకతను స్వప్నించాడు! 'పీపుల్ ఆఫ్ ది విండ్' అయినా, 'విండ్స్'కు పైగా

"An intellectual and emotional complex in an instant of time" లోకి తీసుకువెడతాయి.

మోపిదేవి రాధాకృష్ణ తన రెక్కలు కవిత్వానికి 'కాంతి కెరటాలు' అని పేరు పెట్టడంలోనే – ఒక స్వేచ్ఛాతరంగం వచ్చి తాకి, హృదయతీరాన్ని కాంతిమంతం చేయడం అనే వైఖరి ద్యోతకమవుతోంది! చిన్నప్పుడు కవిత్వం రాసినా, ఉద్యోగబాధ్యతల్లో నిశ్శబ్దం వహించి, పదవీవిరమణ తరువాత – అచ్చం సుగమ్ బాబు అన్నట్లే– 'ఒక శోచనీయమైన వాతావరణం'గా, ఒక విషాద సంఘటన ఛెళ్ళున తాకగా, రాయడం మొదలు పెట్టాడు. "ఇప్పుడు కాస్త ఆత్మ సంతృప్తిగా వుంది" అంటున్నాడు. కవిత్వం ఆత్మీకరణం కావడం ఆహ్వానించదగిన పరిణామం!

'కాంతి కెరటాలు'లో నూటరెండు ఖండికలున్నాయి. 'తెలియనంత వరకు అజ్ఞానం' అని మొదలై, "ఓంకారం జీవన శ్రీకారం" అని ముగియడం – మోపిదేవి తన రెక్కల పాదాలను ఎక్కడ మోపి, రసార్ణవం దేవుతున్నాడో అర్థమవుతుంది స్పష్టంగా!

***"గర్భస్థ శిశువుకి***
***స్కానింగ్***
***రిపోర్ట్ ఎందుకు?–***

***స్వాతిచినుకే***
***ఆణిముత్యం !?"***

అనడంలో – భౌతికంగా రూపొందే ప్రతి శిశువూ, ఒక విలక్షణ, విశేష, విశిష్ట మానవుడే అనిపిస్తాడు. అందుకే "ఎలాంటి పరిస్థితిలోనైనా ఉండాలి ఉన్నతంగా బురదలో పద్మంలా!" అని మౌలిక సందేశమిస్తాడు. జీవితంలో వెలుగునీడలు, కష్టసుఖాలు సహజాతాలు. ఎంతటి విషాదంలోనయినా, ఎంత పోరుగాయాలలోనయినా, అంతఃశక్తి కోల్పోరాదంటూ "ఎంత ఉతికినా భరిస్తుంది బండ– సహనం అంతఃశక్తి" అంటాడు.

రాధాకృష్ణ కవిలోని మరో విలక్షణ పార్శ్వం అతని అభివ్యక్తిలోనే వుంది.

*"ఒక అవమానం*
*జీవితానికి*
*అవుతుంది*
*పాఠం*
*ప్రతీకారమే*
*సూర్యోదయం !?"*

సూర్యోదయాన్ని ప్రతీకారంగా రెక్కవిచ్చడంలో– నాకు 'కెన్సాస్' దేశపు పౌరయుద్ధాలు కూడా స్ఫురించాయి! బానిసత్వ అవమానాల నుండి ప్రతీకారంగా ఒక స్వేచ్ఛాదేశంగా అవతరించిన రెక్కల దేశం! గాలికి ఎదురీదిన జాతి! స్వాతంత్ర్య సూర్యోదయం ధ్వనించింది. కవిత్వం విశ్వజనీనం అనడానికి ఇదొక దృష్టాంతం కదూ! – "ఎప్పటికీ మానవాళికి సంప్రదాయమే తోడు – వితండం అనర్థం" అనడంలో అనవసర సాంకేతికత, అభివృద్ధి పేర తెస్తున్న అనర్థాలను సూచిస్తూ – "అంత కడివెడు పాలపై ఒక్కింత మీగడ పేరినట్లుగ మనకు మిగులును గతములోపలి మంచి. అదియే సంప్రదాయము" అన్న సినారె పలుకులనూ గుర్తు తెస్తాడు. సముద్ర మథనంలో అమృతంలాగా – పరిశోధనల్లోనే సత్యావిష్కరణ జరుగుతుందని "నిన్ను నువ్వు తెలుసుకో" అనే –మతం చెప్పినా, గతి తార్కిక భౌతికవాదం చెప్పినా చెప్పే, పరిశోధన ఆవశ్యకతను ఆవిష్కరిస్తాడు. "స్వయంకృషితో పొందిన ఆనందం వర్ణనాతీతం – తేనెటీగల శ్రమే తేనె" అంటాడు.

కవిత్వం కేవలం సమాజ దర్పణంగావుంటే సరిపోదు. సమాజహిత చింతన ఉండాలి అందులో. "ఎన్నిసార్లు చూసుకున్నా అద్దంలో కనబడేది నీ ఆకారమే – కన్పించనిది ఆత్మసౌందర్యం" అంటూ, పట్టుకోవాల్సిన బింబ ప్రతిబింబాలేమిటో తెలుసుకోమంటాడు. తెలుగునాట భక్తిరసం తెప్పలుగా పారుతోంది అన్నట్లు – "ఇచ్చేది పరమాత్మే బాబాలు సన్యాసులు కాదు – రంగురాయి రత్నం కాదు" అని 'చిల్లర రాళ్ళకు మొక్కుతువుంటే చెడిపోదువురా ఒరేయ్ ఒరేయ్' అనే తత్వాన్ని మీటుతాడు.

"మర్యాదను ఇవ్వడం పుచ్చుకోవడం గొప్పక్రియ, తీరంలోనే కెరటం!", "మంచి పుస్తకం ఒక్కటి చాలు నిన్ను మార్చేయడానికి – సందేశంతోనే పరివర్తన!" అంటూ చిన్నభావాలనయినా మిన్నగా వ్యక్తీకరించాడు. "చరిత్రలో నిలిచిపోయేవి

కొన్ని మరుగునపడేవి కొన్ని - చెరిగిపోనిది శాస్త్రవిజ్ఞానం" అని సైన్సు ప్రాధాన్యతనూ విస్మరించడు. హోలీ పండుగనూ ఒక రెక్కలో బంధించే సామాన్య లౌల్యాలు కొన్ని పరిహరించు కోవచ్చు. అభ్యుదయశిల్పం ఒక ఇరుకు గల్లీగా సంభావించడం వైయక్తిక పాక్షికాభిప్రాయమే అవుతుంది! "మౌఖికం నుంచి తాళపత్రం నుంచి కాగితం మీదుగా అక్షర ప్రయాణం - నేడు మనిషికి ప్రతీక కంప్యూటర్" అన్నవాడే-

*'సంగీతం*
*సాహిత్యం*
*జాతిని బతికించే*
*శ్వాసలు-*

*సంస్కృతీ*
*వైభవాలు !"*

అంటాడు. ఈ 'కాంతి కెరటాలు' భౌతిక, ఆత్మిక ఒడ్డులను ఒరసి తరగలెత్తేవి. చిన్న నీటితుప్పరే అయినా - వేసవి నిదాఘం మీద ఎలా అనుభూతి రమ్యమవుతుందో, మోపిదేవి రాధాకృష్ణ కవిత్వపు రెక్కలు - సున్నితమూ, సునిశితమూ అయినవే అయినా, బలమైన గాలి కెరటాల మీదుగా కాంతిచ్ఛటలై ప్రయాణించేవి!

నిశ్శబ్దాన్ని శబ్దిస్తున్న శుద్ధాంతఃకరణ అక్షరాలు ఈ కాంతి కెరటాలు. మీ గుండెల్లో పొదువుకోండి! ప్రపంచీకరణమైన మానవీయతను అదుము కోండి! "తోడుకున్న వారికి తోడుకున్నంత!" కవిని తోడుంచుకోండి. సరేనా!

*6 ఏప్రిల్ 2010*



# ఆకాంక్ష

## తొలకరి (కవితా సంపుటి) – గురజాడ విజయశ్రీ

తిరిగే కాలు, తిట్టేనోరు ఊరుకోవని సామెత. రాసే కలమూ అంతే! అందునా 'తొలకరి' విజయశ్రీ అంటే – నిమిత్తమాత్రంగా ఎలావుండగలుగుతుంది? ప్రపంచ పద్మవ్యూహంలో కవిత్వమే తీరనిదాహం కదా! కనిపించినదాంట్లోంచి కవిత్వం తోడుకోవడం, మినరల్ వాటర్ బాటిల్స్‌లో నింపయినా పంచి పెట్టడం! నీరయినా వ్యాపార సరుకైపోయిందికానీ, కవిత్వమింకా కానేలేదు. పంచుకోవడానికీ, పరస్పరం మమతలు, స్నేహాలు పెంచుకోవడానికీ, కవిత్వ జలమే ఆఫర్ చేసే సరుకు! 'పయనమెటో' స్ఫుటం కాకపోయినా, 'హార్ధిక స్వాగతం' సహృదయలక్షణం! 'ఘనస్వాగతం' పఠితల పై ఆధారపడి వున్నది!

అప్పటికీ – కొన్ని కారణాలతో మనోవేదన చెందిన విజయశ్రీ సాహిత్యానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుని, పదమూడు రోజులు కలాన్ని పట్టనప్పుడు, ఆమెనలా వుండనీయకుండా, కాలం కాని కాలంలో కోయిల ఆమె చుట్టూ తిరిగి ప్రోత్సహించింది! అందుకే ఈ సంకలనంలోని 'ఆశాలత' కవిత ఉద్భవించింది! 'సాహిత్యపథం, నుంచి తప్పుకోవాలన్న నా నిర్లిప్తత ఒప్పుకాదంటూ నీ కుహూ కుహూలలో ప్రవచిస్తున్నావా?' అంటూ, 'ప్రకృతి సహకరిస్తే', 'చెయ్యని తప్పు వెయ్యని శిక్ష, కారాదని, తన 'జీవితచక్రాలు' మరల మరల్చుకుని, భర్త గురజాడ అప్పారావుతో బాటు – కావ్యరచనా ప్రపంచానికి 'సంయుక్త ఆహ్వానం' పలకడం జరిగింది శ్రీమతి విజయశ్రీ.

ఈ సంపుటిలోని అనేకం వివిధ కవిసమ్మేళనాలలో 'విజయశ్రీ' తన గళంతో వినిపించినవి. కలంతో రాసిన కవిత కవిసమ్మేళనంలో గళంతో శ్రోతలకు అభివ్యక్తమవుతుంది. పత్రికలో అచ్చుకాగా చదువుకునే కవితకూ, ఓ కవి సమ్మేళనంలో కవి ముఖతః వినే కవితకూ తేడా వుంటుంది. ఆలోచనామృతమైన రచనను శ్రోతలు విన్నంతనే అనురక్తులయ్యేలా ఆపాతమధురంగా చదివి వినిపించడం కూడా అందరికీ సాధ్యమయ్యే సంగతి కాదు! ప్రేక్షకుల కరతాళధ్వనులు పొందడం కూడా సునాయాసమైన సంగతి కాదు!

'విజయశ్రీ' చాలా సులభమైన పదాలలో, అందరికీ అర్థమయ్యేలా, కవిత్వ వచనాన్ని అక్షరీకరించడంలో ఒక అలవోకతనం అభివృద్ధి పరుచుకున్నారు! 'సంక్లిష్టత' ఛాయలు సోకని, విశుద్ధ 'రచనం' తనది! సమాజగత సంఘటనల కెన్నింటికో - కవయిత్రిగా ఆమె ప్రతి స్పందనలు వీటిల్లో నమోదుకావడం చూడగలం!

***''స్వార్థం ద్వేషం పైశాచికత్వం***
***మితిమీరి రక్తాలు చిందిస్తూంటే***
***శాంతికపోతం తెల్లని రెక్కలు***
***రక్తపు చిందులతో ఎర్రగా***
***మారుతున్నాయని నా నయనాలు***
***చెమర్చినాయి ఒక రోజు!!''***

అలాంటి కవయిత్రి - ఎన్నికల జోరందుకున్న ప్రచారంలో పావురాల రెక్కలకు పసుపు రంగు అద్ది వేదికపై నుంచి ఎగురవేసిన దృశ్యానికి సంచలించిపోయింది! "శాంతి కపోతం-రంగులే మార్చేస్తారని ఊహించనైతి" అంటారు. రాజకీయంలో 'రంగు మారింది' అంటే 'ఇదే ప్రకృతి' అని కాక, ఇదేం ప్రకృతి అని ఆర్తిచెందుతారు. అందుకే –విరోధి, వికృతుల నిష్క్రమణాగమనాల సంగమ సందర్భంలో –''ఓ! నవ వసంతమా'' అంటూ "రాజకీయ రంగులవలయంలో చిక్కుకుంటున్న అమాయక యువతను రక్షించు", "కాంక్షిత ప్రదాయినివై , నిలువుమ"ని అభ్యర్థిస్తారు. అలాగే వసంతానికి విజయశ్రీ నిరంతర నేస్తం! ఆమెలో లాలిత్యభావాలు, అనుభూతి పదాలు, వున్నాయి. "ప్రేమనే నేను ప్రేమిస్తాను" అంటారందుకే !

*"ప్రేమబీజం వివిధ శాఖలై*
*రూపాంతరాలలో*
*స్నేహబంధం, వలపుబంధం,*
*దాంపత్య ప్రేమ, దేశప్రేమ, సాహిత్య ప్రేమ*
*వెరసి మానవాళికి ఆనందాన్ని పంచే*
*ఈ మహోన్నత ప్రేమనే*
*నేను ప్రేమిస్తాను"* అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తారు ఆమె.

విజయశ్రీ పత్రికలలో రాసిన కవితలు మునుపే ఓ సంపుటిగా రూపాంతరం చెందాయి. ఇప్పుడు ఈ సంపుటిలో పత్రికలలో వచ్చిన రచనలు కొన్ని వున్నా, ప్రధానంగా శ్రోతను అలరించే కవిసమ్మేళన కవితలే అధికభాగం చోటు చేసుకోవడం ఓ విశేషం! ఆ సమావేశంతోనే అవి గాలికిపోకుండా, శ్రోతలకు అందించిన ఆ కవితా సుమ పరిమళాలను ఇలా గ్రంథరూపంలో కూర్చి ప్రకటించడం అభినందనీయం! ముప్పైమూడు కవితల ఈ సంపుటికి 'తొలకరి' అన్న పేరుకూడా విజయశ్రీ మానసాన్ని చిలకరిస్తోంది! ఉగాదుల పై, సంక్రాంతులపై, మదర్స్ డేకు, సహకారవారోత్సవాలకు, ఎన్నికలవేళ విజయశ్రీ ఉత్సాహపు కలం చిందులు – ఈ కవితల్లో 'తొలకరి' హర్షాన్ని పొటమరిస్తున్నాయి. గురజాడ విజయశ్రీ, అప్పారావుగారలిద్దరూ కవిదంపతులు! కవిత్వరచనా సంసారాన్ని కూడా జంటగా సాగిస్తున్నవారు. ఎవరి అనుభూతులకు వారు పురుడుపోస్తున్నవారు. విజయశ్రీ అన్నట్లు – "రెండు హృదయాలు ఒక వేదికగా సాహితీరాణికి స్వాగతం పలుకుతు"న్నారు.

*"అడుగుజాడ గురజాడది*
*అది భావికి బాట*
*మనలో వెధవాయత్వం*
*మరిపించే మాట"* అంటాడు గురజాడ గురించి శ్రీశ్రీ. ఆ ఆనువంశిక గృహనామధేయులైన విజయశ్రీ కలం, వచనకవితా రంగాన 'తొలకరి'ని అధిగమించే, మరిన్ని 'విజయశ్రీ'లు సాధించాలని మనసా ఆకాంక్ష.

*13 జులై 2010*



# వూసల ఊసులు

## అక్షర తూణీరం (కవితా సంపుటి) – వూసల రజనీ గంగాధర్

పద్యం మీద 'మంచిపట్టు' వున్న కవి, తానే వచనంగా కవిత చెబితే – అందునా అంత్యప్రాసల ఊసలతో 'విట్టు' పట్టున చేరి, సమాజం 'గుట్టుమట్టు'లు విప్పే భావాల ఊయల లూగితే 'ఆ మట్టున' ఎలా వుంటుందో, ఈ పట్టున చెప్పే పుస్తకమే "అక్షర తూణీరం". వూసల రజనీ గంగాధర్ వచనపు తునకల మెరుపు కళికలూ.... కొండొకచో కణికలూ ఇవి! తనకు పద్యకవిగా పేరుండనే వుంది!

సంక్రాంతినో, ఉగాదినో, అధికధరలనో, అమానవీయ ఘటనలనో, ఒక శ్రీశ్రీనో, జ్యోతిబసునో... వస్తువుగా తీసుకున్నది ఏదయినా – వ్యక్తీకరణలో 'సూటి'గా 'ధాటిగల మాట'గా చెప్పడం ఇతనిలో కనిపిస్తుంది! కవి సమ్మేళనాల్లో పలికిన శ్రోతృజననిష్ఠమైన రచనలు కనుక – చప్పట్లనాశించే ఒక 'తూగు' ప్రేక్షకులకు అలవోకగా అర్థంకావాలన్న 'పలుకులపోగు' ఇందులో సాక్షాత్కరిస్తుంది!

గంగాధర్‌ది రజనీకరమోహన జనాభ్యుదయ భావన! 'శాంతికావ్యం రాస్తా' నంటాడుగానీ, దేశం గొప్పదనే భావం కలిగించలేకపోతే – 'ఆ దేవుడు నాకొద్దు' అని త్రోసి రాజంటాడు. నూతనం నూతనం అని సనాతనాన్ని సమాధిచేసే ఆరాటం పట్ల ఆవేదన చెందుతూ, మానవత్వాన్ని మానవత్వంగానే ఉంచడానికి మనసారా ప్రయత్నిద్దాం గానీ, 'మానవత్వం లోనైనా నూతనత్వాన్ని వద్దనుకుందాం' అని కరాఖండీగా చెబుతాడు.

**"ఖర్మ అనే కుళ్ళిపోయిన సిద్ధాంతం పోవాలి. శ్రమయే సర్వ సౌఖ్యాలకు మూలమనే సిద్ధాంతం రావాలి. దేవునికంటే దేశం గొప్పదనే భావం కావాలి"** అనే తీర్మానిస్తాడు.

'ఎన్నికలు ఓ ఫార్స్ – ఎవ్వరికీ చెయ్యకు సిఫార్స్'!, 'నోటు – ఓటు' 'ఓ సంస్కారమా ! నీకో నమస్కారం!', 'ఆరాటం –పోరాటం', 'భావన– దీవెన', 'నిజం ప్లస్ ఇజం జర్నలిజం', 'బిందువు –సింధువు', 'మమకారం – సహకారం', 'అమరం – అజరామరం'.

ఇలా శీర్షికల్లోనే ప్రాసల ధ్యాసగల గంగాధర్ రచనల్లో – అభ్యుదయ భావబలిమి అనే కలిమి వుంది కనుకనే, కవిత్వపు లేమిని కష్టజీవికి ఇరువైపులా నిలిపిన వాడు కనుక, కాదనకుండా ఆహ్వానించగలం! మెచ్చక ఉండలేం!

తాజ్‌మహల్ కంటే అమరవీరులకెత్తిన 'స్మృతి చిహ్నం' గొప్పదని ఎంతబాగా అంటాడు –

**"ఒకటి డాబుదర్పాల పునాదిగా కట్టిన సమాధిభవనం.**
**మరొకటి త్యాగధనులకు స్మృత్యంజలిగా కట్టిన సమాజభవనం".**

"పిచ్చి పిల్ల నొక్కదాన్ని – పిల్లతల్లి జేసెనొకడు – పదినిండని పసి పాపను చెరచి చంపె నింకొక్కడు – ఎక్కడుంది? ఎక్కడుంది? ఎక్కడుంది మానవత" అంటూ గేయంలో సమాజపు గుండెగాయాన్నీ సలుపుతాడు! ప్రపంచీకరణ దుష్ఫలితాలను కళ్ళకు కట్టేలా చెబుతాడు. "అమలాపురంలో ఉన్నా – అమెరికా పోకడలే... ఓ పల్లెటూరిపిల్లా – పాశ్చాత్యుల్లా ప్యాంటేమిటంటే ద్రౌపదీ వస్త్రాపహరణం పునరావృతం కాకుండా ఉండాలనట. ప్రపంచీకరణ వేగంలో ఇదో భాగమట!" అని ఎత్తిపొడుస్తాడు వ్యంగ్యంగా.

శ్రీ పూసల రజనీ గంగాధర్ 'ఆదర్శం' ఎన్నతగింది –
***"పడిలేచే కెరటం కాదు నా కాదర్శం***
***అలలకు తలవంచి లేచి నిలబడే గడ్డి పరక నా కాదర్శం"*** అంటూ –

**"అన్యాయం అక్రమం అంటూ ధర్నాలతో ధ్వజమెత్తే రాజకీయనాయకుడు కాదు నా కాదర్శం. అణగారిన ప్రజలకోసం తనప్రాణాలను పణంగా పెట్టే విప్లవకారుడు నా కాదర్శం. కష్టం తెలియకుండా కోట్లుగడించే - ధనవంతుడు కాదు నా కాదర్శం. తను తాగే గంజిలో సగం ఎదుటివాడి నోటికందించే కటిక దరిద్రుడు నా కాదర్శం"** అని నిర్ధారిస్తాడు. ఇది మానవ విలువల కెత్తిన పతాక!

'కాకి - కోకిల', 'పులి - సింహం', 'పులిని చూసి నక్క', 'మూడు చేపలు' వంటి పిల్ల కథా శీర్షికలే కాదు 'తెల్లకోయిల' వంటి వ్యంగ్యవైభవపు శీర్షికనూ రచనలకుంచడం తనకు చెల్లింది! **"దళితుని గాలి సోకితే దేవుడు మైలపడిపోతాడట. గుడికి రాళ్ళెత్తిందీ, పల్లకి మోసిందీ దళితుడేనని తెలిస్తే!... దేవుడు భూగోళం విడిచి పారిపోతాడేమో!"** అని అపహసిస్తాడు. ఇలా అనడానికి మరి ఎంత కలేజా వుండాలి! ఫోర్త్ ఎస్టేట్ అనే జర్నలిజం ముసుగును ఓ కవితలో తొలగించిన వూసల, 'స్వేచ్ఛ-స్వాతంత్ర్యం'కు నేటి అర్థాన్ని చెబుతూ' "దొంగనోట్లు యథేచ్ఛగా వెయ్యొచ్చు - రిగ్గింగ్ రివాజుగా మారొచ్చు- ఎలా గెలిచినా ఎన్నిసార్లయినా రిజైన్ చెయ్యొచ్చు ఏడాదికోసారి ఎలక్షనొచ్చినా రావచ్చు - ఇదే స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు మచ్చు" అంటూ ప్రజాస్వామ్య డాంబికాన్ని ఎకసెక్కం చేసాడు.

కేవలం వాస్తవికదృశ్య చిత్రణం మటుకు చేసి వూరుకుంటే సరిపోదని, అవసరమైన చోట సదాశయ సందేశాలనూ సంకలించాడు.

**"అదుపూ... పొదుపూ - ధనానికే కాదు**<br>
**జలానికీ అవసరమేనండోయ్..**<br>
***బిందువు బిందువు కలిస్తేనే...***<br>
***సింధువవుతుంది మరి"***

అని నీటి పొదుపు చెబుతాడు.

ఆంగ్లనూతన సంవత్సరాన్ని 'అర్ధరాత్రి అతిథి' అనీ, "విరోధి ఉగాదికి అరిషడ్వర్గాలు తెల్ల కోయిలలై ఓట్ల కూతలు కూస్తున్నాయి" అనీ అనడంలో అర్థవంతమైన నవభావనలున్నాయి.

"కలం నాది-గళం నాది- నేలదున్నే పొలంనాది" అని కవికర్షకుల పేటెంట్ హక్కును నినదిస్తూ, కుహనా రాజకీయాలు స్వభాషను తెలుగు, ఆంధ్రము అంటూ మాతృభాషామూర్తి హృదయాన్ని రెండుగా చీల్చడాన్ని నిరసిస్తూ, అభ్యుదయ భావదీపాలను వెలిగిస్తూ – సాగిన "అక్షర తూణీరం" ఇది. "నీవు కాశీలో గంగవైనా కాలుష్యం తప్పలేదు నీకు" అంటూ పర్యావరణ పరిరక్షణ స్పృహ కలిగిన, పరిశుద్ధ ప్రకృతి చింతకుడీ రచయిత!

పద్యంలా హృద్యంగా వచనకవితా సేద్యం చేస్తూ – అభ్యుదయభావ గంగాఝరులు పారిస్తూ, నిజమైన కవిత్వపు పంటలు పండించాలని మనసారా మరింతగా ఆకాంక్షిస్తున్నాను! శ్రీ వూసల రజనీగంగాధర్ ను అభినందిస్తున్నాను.

*26 ఆగస్టు 2010*




# అగ్నిపూల కాంతి పరిమళం

## అగ్నిపూలు (కవితా సంపుటి) – శైలజామిత్ర

"Every poem is created by a journey through darkness and return to light, the journey from light back to light which cannot be made except through darkness, and the finished poem is the image of that journey" **- C.D.Lewis**

**మా**రుతున్న కాలాన్ని అనుసరించి, మారుతున్న సాహిత్య ధోరణులను అనుసరించి, కవితా విమర్శక సూత్రాలు కూడా మారాలి! లక్ష్యాన్ని అనుసరించి లక్షణాలు ఏర్పడవలసిందేకానీ, లక్షణాన్ని అనుసరించి జీవనది లాంటి సాహిత్యం, ముఖ్యంగా 'కవిత్వం' సాగదు.

వ్యక్తిప్రాధాన్యం తగ్గి, సామాజిక ప్రాధాన్యం గుర్తించిన తరువాత–ఆధునిక జీవితం అనేక విజ్ఞాన సాంకేతికాది విషయాల్లో గతిశీలమైన తర్వాత, కవిత్వంలో మార్పులు కానవస్తూనే వుంటాయి. పైకి వ్యక్తినిష్టంగా కనబడేదే అయినా, ఆ 'నేను' సామూహికతకు ప్రాతినిధ్యమే వహిస్తుంది.

ప్రవాహసదృశమైన కవిత్వంలో కొత్తపరివర్తనలు రావడం సహజం. నిత్యనూతనత్వం అనేది ప్రకృతి సిద్ధమైన స్వభావంలోనేవుంది. ప్రగతిమార్గంలో కొత్తకొత్త విలువలు పుడుతూంటాయి. ఆ విలువలను కవి స్వీకరిస్తూంటాడు. ఒకే కవిలో విభిన్నమైన భావధారలు అందుకే కాలానుగుణంగా చూస్తూనే ఉంటాం.

విషయాన్ని సూటిగా ఎంచుకుని- వ్యక్తీకరణలో క్లుప్తత, ఒక భావలయ, పరిమితకాలంలోనే హృదయానికి అనుభూతిని, బుద్ధికి ఆలోచనా సంప్రీతిని అందించే వైఖరి, వ్యంగ్యం, చమత్కారం, సందేశం, సామాజిక స్పృహ, కేవల భౌతికాభివృద్ధితో సంతృప్తి చెందని ఒకానొక అంతర్ముఖీన ఆంతర్యానుభవ అభివ్యక్తి స్వీకరణ వంటి అంశాలన్నింటినీ – లఘుకవితారూపాలను స్వీకరిస్తున్న కవులు నేడు ఉపయుక్తం చేస్తున్నారు ! అదీకాక, జ్వాలాముఖి అన్నట్లుగా 'వేగవంతమైన సామాజిక జీవితానికి వ్యాఖ్యానంలేని క్లుప్త అభివ్యక్తి ఒక మార్గాంతరం. ఒక సర్దుబాటు. మినీకవిత, లఘుకవిత మున్నగు ప్రక్రియలన్నీ క్లుప్తతను నిర్వహించడానికి వచ్చిన రూపపరిమితులే. వేగానికి క్లుప్తత అనివార్యం...'

అయితే క్లుప్తత నుండే గాఢతను, సాంద్రతను రసాభివ్యక్తిని సాధించగలగడం కవి ప్రతిభ మీద ఆధారపడి వుంటుంది. సంగ్రహంగా, విశిష్టంగా, వైచిత్రితో కూడిన కవిత – ధారణకు కూడా వీలు కల్పించి, కవిత్వం జ్ఞాపకానికినిలిచే గొప్పతనాన్ని కూడా సంతరించుకోగలుగుతుంది. లఘుకవిత్వ రూపాల ప్రయోజనం ఇది కూడాను! అందుకే నేడు – నానీలు హైకూలు, రెక్కలు, చుక్కలు వంటి మినీకవితా రూపాలు కవులకు సౌలభ్యంగా, పఠితకు సౌకర్యంగా మారాయి.

శ్రీశ్రీ పేర్కొన్నట్లు 'మినీకవిత ఐతేనేం – ఏ కవిత్వం మీదనైనా నాకు సదభిప్రాయమే ఉంది. ఎక్కడ దొరికినా, ఏ సైజులో దొరికినా, కవిత్వాన్ని అభిమానించడం మానలేను' అనుకునే సహృదయులవల్లే లఘుకవిత్వరూపాలకు ప్రాచుర్యం లభిస్తోంది.

ఈ ప్రాతిపదికల పైనే నేటికాలం కవయిత్రులలో 'శైలజామిత్ర' తనదైన ఉనికిని,మనికిని స్థిరపరుచుకుంటోంది. వచనకవితారచనలో అభివ్యక్తి ప్రావీణ్యంతో మంచి కవయిత్రిగా ప్రగతిశీలమవుతోంది. కాలం వెంట కదలి, కాలానికి నిలిచే కవయిత్రిగా ఎదిగే క్రమంలో – ఇప్పుడు మినీకవితలను సంపుటీకరిస్తోంది. ఏది చెప్పినా కవిత్వం చెప్పడం కదా ముఖ్యం! ఇంతకుమునుపే శంఖారావం, మనోనేత్రం, నిశ్శబ్దం, తరంగాలు, అంతర్మథనవేళ వంటి ఉదాత్త వచనకవితా సంకలనాలు వెలువరించిన శైలజామిత్ర ఆంగ్లంలో కూడా కవిత్వం రాసే ప్రవీణ. 'సిల్వర్‌లైన్స్' ఆంగ్ల కవితల సంపుటి ప్రచురించడమే కాక, తనకునచ్చిన తెలుగు కవిత్వాన్ని అనువాదం చేయడంలో కూడా'అందెవేసినచెయ్యి' అనిపించుకుంటోంది.

ఇప్పుడు ఈ 'అగ్నిపూలు' మినీకవితల్లో 'అగ్నిజల్లినా అమృతం కురిసినా అందం ఆనందం దాని పరమావధి' అన్న తిలక్ మాటలకు అచ్చుమచ్చు తిలకంగా భాసిస్తోంది. వర్తమాన సమాజాన్నీ, సంఘటనల్నీ, సామాజిక స్థితిగతుల్నీ అక్షరీకించడంలో, ఒక కవయిత్రిగా స్త్రీల మనః ప్రపంచాన్నీ, సమాజంలోని అస్తిత్వాన్నీ అభివ్యక్తీకరించడంలో, అదే సమయంలో ఒక వ్యంగ్యవచోవైభవాన్ని రూపుకట్టించడంలో – ఈ 'అగ్నిపూలు' భావపరిమళాలను ఎగదోయడంవిశేషం! తెలిసిన విషయాలే అయినా, తెలియచేసే పద్ధతిలోని నిపుణత ఆకర్షిస్తుంది.

***"చేతిలో సెల్‌ఫోన్***
***కంటిముందు ఇంటర్నెట్***
***నిండుజీవితాలలో***
***బంధాలన్నీ కట్"***

అంటూ ఆధునిక సాంకేతికత, మానవీయతకు అవరోధమవుతున్న వైఖరికి ఆర్తి చెందుతుంది.

***"రైతు గుండె***
***ఆగిపోయింది***
***పర్లేదు***
***రైతు***
***దేశానికి***
***వెన్నెముక"***

అనడంలో – వ్యాఖ్యానం ఎంతయినా చేయగలిగిన, అన్నదాత వర్తమాన దుఃస్థితి ప్రతిబింబిస్తోంది! వ్యవసాయస్థితిగతులు, రైతుల ఆత్మహత్యలు, ప్రభుత్వ వైఫల్యాలు ఎన్నింటినో ఒక్కసారిగా కనులముందు కదిలింపచేస్తుంది. కవయిత్రి కలం నవ్యంగా ఉందనటానికి దాఖలాలు ఇవి కొన్ని:– **'దేశంకోసం – ఏదో ఒకటి చేయాలి – కనీసం ఉద్యమాలైనా' – 'అతను – చాలా గొప్పవాడు – అందుకే – విమానం నుండి కింద పడ్డాడు'– 'ఆకాశం చిల్లుపడ్డది – ఊర్లన్నీ – నిండిపోయాయి – తేలుతుందొక్కటే – రాజకీయం' – 'జై తెలంగాణా ! జైజైసమైక్యాంధ్ర..!! అన్నమో.. రామచంద్రా...!!!'** వీటిలోని కాంతిచ్ఛటలు వేరే విశదీకరించాలా ?

ఒక స్త్రీగా శైలజామిత్ర ఈ అగ్నిపూలలో తనదైన జెండర్ స్వరాన్నీ బలీయంగా చూపింది ! సంసారం సాగరం అంటారు కదా ! అందుకే తానిలా అంటుంది.

*"వారు గజ ఈతగాళ్లు*
*సాగరంలోకి ఉదయమనగా వెళ్ళి*
*రాత్రి బయటకు వచ్చారట.*
*నేనే నయం*
*ఇరవైఏళ్ళ కిందట*
*లోపలికివెళ్లి ఇప్పటిదాకా రాలేదు"*

అని చమత్కారంగా అంటున్నా, అందులో ఎంత గాఢతవుందో గుర్తించగలం! **'నాన్న నన్నెప్పుడూ ఆదరించలేదు – బహుశా నా ముఖంలో వాళ్ల అమ్మ ! కనిపించిందేమో', 'ఏడుకొండలు ఎక్కితే ఆ శ్రీనివాసుడు దయతో కనిపించాడు ఏడేడు జన్మలు కలసినడిచినా – శ్రీవారు శ్రీమతికి కనిపించడు', 'మా ఇంట్లో గడియారం పేరు – అనసూయ – మా అమ్మ', 'అతను చాలా మంచోడు – అడగకనే అన్నీ ఇస్తాడట – భార్యకు తోడుగా మరో భార్యను కూడా... రాతిబొమ్మ' 'ఆమె దోసిట్లో సముద్రం వుంది – కన్నీటి ప్రవాహంతో', 'బతికున్నప్పుడు – అమ్మకు నాలుగు గోడలే ప్రపంచం చేశారు – పోయాక ఇన్నేళ్ళ వేడిని గుర్తించారేమో – ఐస్‌లో వుంచారు'...** వీటన్నింటా ఆమె రూపుకట్టించిన స్త్రీ చిత్రపటాన్ని మనం 'అగ్నివర్ణాలతో' అందుకోగలం. 'పురుషుడు ఆకాశం...స్త్రీ అవని, స్త్రీ పురుషులిద్దరూ ఎప్పుడూ కలవని సముద్రాలు' అని శైలజామిత్ర అన్నప్పుడు – "ఒకటిగా శయనించే దాంపత్యం తలల్లో సప్తసముద్రాల అనుల్లంఘనీయ వ్యత్యాసం" అన్న చలం గుర్తొస్తాడు.

"అతను మాట్లాడుతూ మాట్లాడుతూనే పోయాడట. పాపం బహుశా భార్య తనను కూడా మాట్లాడించిందనే అనందంతో కాబోలు" వంటి జోక్‌లు కొన్ని కనబడినా, కొన్ని కఠోర వర్తమాన సత్యాలను ప్రకటిస్తుంది. 'ఇపుడు బాల్యం విలువ పెరిగిపోయింది ఎల్.కే.జీ.కి పాతికవేలు', 'అతడు స్వదేశంలో ఎంతో కష్టాలకోర్చి మేధస్సును సంపాదించాడు–విదేశాలలో కన్నుమూయడానికి'

అగ్నిపూల భావాక్షరాలను ముద్రించుకోవాల్సింది ఇక పఠితల హృదయాల్లోనే మరి !

*'మనసు చాలా*
*తేలికయింది*
*అందుకే*
*మనల్ని తేలిగ్గా ముంచేస్తుంది?'*

*'మనిషి*
*చాలాగొప్పవాడు*
*ప్రపంచాన్నే గెలిచాడు*
*మరోమనిషిని (మనసును) తప్ప'*

*'మనసు*
*మిణుగురు పురుగులాంటిది*
*చీకటున్న చోటే*
*వెలుగుతుంది?'*

వంటి భావాలు – పఠితలను ఆకట్టుకుని జ్ఞాపకం వుండిపోతాయి. 'అగ్నిచెడును దహిస్తుంది'. 'పూలు' కొత్త ప్రకృతిని పరీమళింపచేస్తాయి అందంగా, 'అగ్ని' నాగరికతను ఇచ్చిన చరిత్ర! 'పూలు' మానవత్వమనే పూజా ద్రవ్యాలు! శైలజామిత్ర 'అగ్నిపూలు' ప్రయోజనాన్ని జ్వలించే భావసుమాలు! చీకటినుంచి వెలుతురులోకి ప్రయాణింపచేసేవి!!

*"ఇవాల్టి నా ఆహారం*
*అక్షరాలే*
*అప్పుడప్పుడు*
*భావాల దాహం...అంతే!"*

అని అంటుంది కవయిత్రి. "కవిత్వమొక తీరని దాహం" అయినప్పుడు మండువేసవిలో చలివేంద్రం పెట్టడమే – 'అగ్నిపూలు' శైలజామిత్ర వెలువరించడం! కవయిత్రిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

*జనవరి 2011*



# అక్షరాలుగా గుప్పెడు 'మనసు'

## మనసు (కవితా సంపుటి) – గురజాడ విజయశ్రీ

ప్రకృతి అందాలను పరిశీలిస్తూండడం వలన కవిత్వ రచన చేయవచ్చున్నదీ గురజాడ విజయశ్రీ 'మనసు'. నగర జీవనంలో ఉనికి సాగిస్తూనే – అందువల్లనే "నేను సాహిత్య సాధనలో పయనిస్తున్నాను" అనగలగడం విశేషమే! ఏమయినా – 'తెలుగు పలుకు పలకడం' అన్నది తనకు సహజాతలక్షణం! మాతృభాష వర్తమానస్థితి గురించే – తన 'మౌనరోదన!' "పుస్తకం చదివి మస్తకం పెంచుకో. నీ పుస్తకాన్ని మరో మస్తకంగా మలుచు" అంటూ, "మస్తకాలకు బూజు పట్టెను మనసా! –పుస్తకాలే వదలగొట్టును చిలకా" అన్న విషయం గుర్తు చేస్తారు. పలు కవితల పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటూ, బహుమతులు పొందిన ఆనందం. బహు–'మతులు'గా, ఆమె భావాలను కవితల పేరిట అభివ్యక్తీకరిస్తూ వుంటాయి. 'నిజానికి సాక్ష్యం భానూదయం' అనీ, 'వ్యవస్థ స్వచ్ఛందమై రూపుదిద్దుకున్న వేళనే నిజమైన వసంతం' అని – తన భావన.

'మద్యరక్కసి' గురించీ, 'సహకారం' వెటకారం కారాదనీ, 'తారతమ్యాలు వీడు' మనీ, 'ఆనందం'లోనే ఆరోగ్యం వుందనీ, సామాజిక సందేశాలను సంకలించే విజయశ్రీ, గ్రామీణాభివృద్ధి, గ్రామీణులు – సహకార సంఘాలు వంటి ప్రభుత్వ ప్రచారాంశాలను కూడా రాసారు. గాంధీ గురించీ, జాతీయ జెండా గురించీ అటువంటప్పుడు ఎలా రాయకుండా వుండగలరు?

"నేను అబలనా??" అని తనను తాను ప్రశ్నించుకుంటూ – **"బహుపాత్రలు పోషిస్తున్నాను – బహుముఖ ప్రజ్ఞాశాలిని – నూటికి నూరుపాళ్ళు సబలను"– అన్నీ నేనే – మరి నా శత్రువు ఎవరు? – నాలో ఉన్న నేను – నాలో వున్న నన్ను సంస్కరించుకుంటే నేను సబలనే"** అంటూ – 'స్వీయలోపము లెరుగుట పెద్దవిద్య' అన్న 'గాలిబ్' పలుకును గుర్తు చేస్తారు.

'సర్వేజనా స్సుఖినోభవన్తు' అనే ఆమె 'మనసు' కాంక్ష! "ఊహించే మేధ, స్పందించగల హృదయం, రాటుదేరిన కలం కవిగా రూపొందడానికి ముఖ్యలక్షణాలు" అన్నాడుగా దాశరథి మహాకవి. తృతీయం కోసం ద్వితీయతో ప్రథమ ప్రయత్నాలు ఆమె పేరుకు తగినట్లు 'విజయశ్రీ' పరంపరలు ప్రసాదించాలని, ఆకాంక్షిద్దాం! జనప్రియ మహానగర్‌లో వసిస్తూ, మెప్పించడం, కవిత్వ పిపాసువుల దాహార్తిని తీర్చడం అలవోక వ్యవహారమేమీ కాదు! కవిత్వం గురించి అందుకో వలసిన 'గురజాడ' లెన్నో వున్నాయిమరి!

ఏమయినా కవిత్వం గురించి – 'మనసు' పడడమే, నేటి యాంత్రిక ఉరుకుల పరుగుల స్వార్థమయ ప్రపంచంలో, అభినందించదగిన 'అనుభూతి రేఖ'. తన కవితా సంపుటికి 'మనసు'గా పేరిడుకోవడంలోనే – విజయశ్రీ ఆరాట స్వచ్ఛత ఆవిష్కృత మవుతోంది!

ఎవరి కవిత్వానికి ఎన్ని ముందు మాటలు, ఎన్ని వెనుక మాటలు అమరినా – అసలు మాట్లాడేది, అమరిన కవిత్వ పంక్తుల మాటలే! కవిత్వాన్ని పట్టుకోవడం అంటే – పరుసవేది విద్యను పట్టుకోవడం లాంటిదే! ఆ విద్య తెలిస్తేనే – అక్షరాభరణంగా కవి అనుభూతి, పసిడి వెలుగులు తీర్చిదిద్దుకోగలిగేది! నిరంతర కవిత్వరచనాభిలాషి, అక్షరాభివ్యక్తుల సాహసి – గురజాడ విజయశ్రీ. పాఠకుల 'మనసు' ఎరిగి, ప్రవర్ధమానం కావాలని శుభాకాంక్షిస్తూ.

*27 మే 2011*




# జనార్ధన షష్టికం

## కవిగానే కనుమూస్తా (కవితా సంపుటి) – కె. జనార్దన మహర్షి

**కా**లం వెంట కవిననీ, కాలాన్ని నిద్రపోనివ్వననీ కంఠమెత్తి కొందరు పలుకుతున్న ఈ కాలాన– కె.జనార్దన మహర్షి ఎవరండి బాబూ! 'కవిగానే కనుమూస్తా,' అని నిష్క్రమణం గురించి నిబ్బరంగా చెబుతున్నాడు అనుకుంటున్నారా? అవును! అది నిఖార్సయిన నిబ్బరమే! 'ప్రవేశం' అంటూ జరిగాక 'నిష్క్రమణ' అనివార్యం! అయితే 'కన్నుమూయడానికీ', 'కనుమూయడానికీ' కూడా 'లోనారసి' చూస్తే తేడా వుంది.

ధ్యానమగ్నమై తనను తాను తెలుసుకోవడానికీ– 'కనుమూయడం' వుంటుంది. బహిర్నేత్రాలు మూతపడిన వేళ, అంతర్చక్షువులు తెరుచుకుంటాయి! 'మహర్షి' తపస్సు కోసం కనుమూస్తాడు. జనాన్ని అర్థం చేసుకున్న 'జనార్దనుడు', 'కవిగానే కనుమూస్తా' అనడంలో తనను తానే సంకేతించుకోవడం లేదు, మిమ్ములనూ ఉద్దేశిస్తున్నాడు. కనుమూస్తా అనడంలో 'మీవి'– అనే అర్థ సూచనా వుంది!

ఇంతకీ కనులు మూసే ఈ 'దోబూచి' ఆట ఏమిటి?లో'బూచి'ని తరిమికొట్టి, పంచేంద్రియాలనూ అదిమిపట్టి, కవితాత్మను ఆవిష్కరించినప్పుడు – రవి గాంచనిది కవి గాంచుతాడు. 'నానృషిః కురుతే కావ్యమ్' అని, కావ్యం రాసిన "మహర్షి" గురించీ, తెలుసుకుంటాడు పఠిత!

ఇందులో ఆరు విభాగాలున్నాయి. 'కవిగానే కనుమూస్తా' అనేది పృథివికి, 'వెన్న ముద్దలు-2' అప్ (అనగా 'నీరు')కు, 'అతను చెప్పిన రెండుమాటలు' తేజస్సుకి, 'ప్రేయసి', 'ఆమె చెప్పిన కొన్ని మాటలు' వాయువుకు, 'గంధర్వగానం' .ఆకాశానికీ సూచికలుగా కవిత్వపరంగా భాసిస్తూ వున్నాయి.

మొదటిది మట్టే! "మనిషిని బ్రహ్మయ్య మట్టితో చేసెనయా" అని, మట్టిలో పుట్టి మట్టిలో కలసిపోవడమే. కనుమూయడమే. కనులు మూసుకు పుట్టి, కనులు తెరిచి, తిరిగి కనులు మూయడమే పుట్టుక, జీవిక, మరణం అనేవి.

*"నాలోని బాహ్య ప్రకృతిని*
*అంతర్ ప్రకృతిని*
*ఋతుఘోషలలో లాలించి*
*మనో కావ్యాన్ని చిలికి*
*నా కవితాంతరంగ వెన్నముద్దల్లో*
*జ్యోతిస్సు, తమస్సుకీ*
*ఘర్షణకీ, బంధనకీ*
*మైత్రికీ, పదధ్వనికీ*
*పెద్దపీట వేసి*
*ప్రపంచ వేదికగా చేసి*
*పంచేంద్రియాల్ని*
*ఇంద్రలోక సింహాసనాన్ని*
*అధిష్ఠింప చేయించి*
*కవిగానే కనుమూస్తా"*

అనడంలో ఈ జీవయాత్రను నిక్షిప్తం చేసాడు కవి. కల, కోరికా కాక- ఆశయంగా, చాటింపు, హెచ్చరికా కాక- ధ్యేయంగా... 'కవిగానే కనుమూస్తా' నంటాడు. పిడికెడు మట్టి యొక్క గట్టి ఉపయోగం- అది 'కవిత్వం కుండ'గా- -అంతర్వాణి 'తరవాణి'ని రుచిగా, శుచిగా, వందేళ్ళ వంటగా అందడమే మరి! "నా కవితలు చదవడానికి అరదినము చాలేమోగానీ వాటి సువాసనలు జీవితాంతం ఉక్కిరిబిక్కిరి చేస్తూ కవితా వాత్సల్యంలో పద పవిత్రతను కాపాడతా. సుగంధ స్నానం స్వచ్ఛందగానం చేయిస్తా" అన్నప్పుడు - వాటి సువాసనలతో అనయినా

వుండాలి. లేక పవిత్రతను 'కాపాడతాయి' స్వచ్ఛందగానం 'చేయిస్తాయి' అనయినా వుండాలి! కవితాకుండ, కాయేన వాచాకవిత్వం, మనోజీర్ణ జీవనకోణం, కవితాడుగుల్లో, అనంత గుణార్వనాలలో వంటి శబ్ద ప్రయోగాలు... మట్టిలో నడుస్తున్నప్పుడు గుండె పాదాలకు గుచ్చుకునే కొన్ని గులకరాళ్ళు కావచ్చు!

ఇంతకీ అసలు జనార్దన మహర్షి అనగానే గుర్తొచ్చేవి వెన్నముద్దలు. అనుభవమనే 'చల్ల' చిలికి, తాను అందించే 'వెన్నముద్దలు' నిజంగా 'అప్'గ్రేడ్‌వే! "నా కోసం కాదు నీ కోసమే నా కంతా చెయ్యి" అని ఆ జనార్దనుడికి ఈ మహర్షి నివేదిస్తాడు ఈ వెన్నముద్దలు.

***"నీకు దేవుడు తెలుసా?***
***తెలుసు***
***దెయ్యం తెలుసా?***
***బాగా తెలుసు... దేవుణ్ని తెలుసుకోక ముందు***
***నేనదేగా"***

ఇంతకన్నా బాగా ఎవరు చిలుకుతారు! "వెనుకవాడు తోస్తున్నాడని- ఆ పని నువ్వు చెయ్యకు – నీకు ముందెవ్వడూ లేడు", "పండు బాగా పండింది- రాలబోతోంది – తొందరపడి రాయి విసరకు – రసం రాయిపాలు, పండు మట్టి పాలైపోతుంది" అని ఎంత బాగా చెప్పాడు! బల్బుని మార్చగలం, స్విచ్చునీ మార్చగలం. కానీ విద్యుత్తే చచ్చిపోతే? ... గొప్ప విద్వత్తుతో చెప్పిన జ్ఞాన బోధ- వెన్నముద్ద.

***"పుట్టాడని పరవాన్నం***
***చచ్చాడని తద్దినం***
***మధ్యలో అంత మజ్జిగన్నం***
***... ...***
***ఇందుకా ఇంత సున్నం"***

అంటాడు వెన్నలో–సున్నను (పూర్ణత్వాన్ని) దర్శించడం ఇది!

***"రెండు కళ్ళే ఇచ్చాడు***
***కానీ... ఇవి తెరుచుకోడానికే***
***ఒక జన్మ సరిపోవడం లేదు"***

అన్న 'వెన్నముద్ద' - కవిగానే కనుమూస్తాకు ఎంత తార్కికంగా సమన్వయం అవుతోందో చూసారా! అంత ప్రతిభామూర్తి కనుకనే-

***సర్వం నేర్చుకుని***
***శక్తిని సమకూర్చుకుని***
***యుద్ధానికి సిద్ధమయ్యాను***
***దయచేసి***
***'నాకో శత్రువు కావలెను'*** *- అనగలిగాడు.*

*వెన్నముద్దల జనార్దనుడు 'అజాతశత్రువు' కదా!*

స్త్రీని ప్రకృతి అన్నారు. కృతికి ఆకృతినిచ్చేది ప్రకృతియే! నిజానికి ఉచ్ఛ్వాస-నిశ్వాస అని ద్విధాప్రయుక్తమయ్యే ఊపిరి ఆమెయే! అందుకే ఈ కవితాసంపుటిలో 'ప్రేయసి', 'ఆమె చెప్పిన కొన్ని మాటలు' అనే రెండు కవిత్వపు అధ్యాయాలు ఈ ప్రాణప్రదమైన గాలి తరగలుగా వున్నాయి. మగవాడు ఎంత తేజోమూర్తి అయినా, ఈ ఊపిరి ఉన్నంత వరకే! అతని ప్రవేశమూ, నిష్క్రమణా రెండూ ప్రకృతి లోంచి, ప్రకృతి వల్లా, ప్రకృతిలోనికే. అందుకే 'అతను చెప్పిన రెండు మాటలు' ప్రేయసికి, ఆమెకు నడుమనే! నా సదా సుఖ సంతోషిణీ, నా నేర్పరీ సుగుణశీలీ, నా సర్వంతర్యామినీ, నా హృదయ తుషారమా, నా అణువణువు నిండిన అమృతానందమయీ, నా మృదు మధురభాషిణీ, నా కనులలో కనబడే ఏకైక స్వరూపిణీ, నా సర్వ ఆలోచనలకీ శక్తి ప్రదాయినీ, నా వయ్యారి సుకుమారీ, నా సమస్త ఆశల సంధాయినీ, నా దివ్య మంగళ స్వరూపిణీ, నా మనోల్లాస మహత్తర శక్తికారిణీ, నా స్వప్నరాగలీనా... అంటూ ప్రేయసికై ఎగశ్వాస దిగశ్వాసల ఊపిరి ఊయల లూగుతాడు అతడు!

***"గగనం గగనాకారం సాగరం సాగరోపమః***
***రామరావణయోర్యుద్ధం రామరావణయోరి వః"***

అన్నట్లు- "ఆమె కుడికన్నుని ప్రపంచంలో ఏ అద్భుతంతో పోల్చగలం అంటే... ఆమె ఎడమ కన్నుతోనే" అంటూ ప్రణయదగ్ధంగా కనుమూస్తాడు. "భగవంతుడా! అరణ్యాలనీ సెలయేళ్ళనీ పచ్చికబయళ్ళనీ కొండల్ని లోయల్ని ఎక్కడపడితే అక్కడ పడేసి ప్రకృతి అని పేరు పెట్టావు. మంచిదే... నాకు మాత్రం అరణ్యాలనీ, సెలయేళ్ళనీ, పచ్చికబయళ్ళనీ, కొండల్నీ, లోయల్నీ ఎక్కడ ఏవి

ఉండాలో అలాగే ఉంచి– చీరలో చుట్టి ఆకృతిని చేసి పంపావు... ధన్యుడిని.. కానీ ప్రభో! ప్రకృతికి లేని 'నోరు'ని ఈ ఆకృతికి ఎందుకిచ్చావ్" అనడం తనకే చెల్లింది!

ఈ సంపుటిలో సమాజ ప్రతిఫలనం కంఠదఘ్నంగా కనబడే అధ్యాయం– 'అతను చెప్పిన రెండు మాటలు' లోనే. వర్తమాన సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు అనే సం.సా.రా.లు అన్నీ సారభరితమై ప్రతిఫలించే మాటలు ఇందులో వున్నాయి. –

*"పద్మశ్రీలు, పదవులు మీరే తీసుకోండి*
*పిడికెడు గోధుమపిండి ఇప్పించండి"*

*"మేం పొలాల్లో పడి ధాన్యం పండిస్తున్నాం*
*అందుకే మీకు గడ్డిపోచతో సమానమయ్యాం "*

*"మా మంత్రిగార్ల మలమూత్ర ధనదాహాలు చాలు*
*ఈ సుందర నగరాన్ని మలినంలో ముంచగలపనీకి"*

అన్న కలంతోనే జనార్దన మహర్షి– సంఘటిత జీవిగా తన బాధ్యతనూ గళమెత్తుతాడు –

*"ఉద్ధరించడానికి నేనీ ప్రపంచానికి రాలేదు*
*కానీ నువ్విలా నాశనం చేస్తే మాత్రం ఆగబోను"*

*"పండ్లు పంచాలని నేనేం విత్తనం నాటలేదు*
*కానీ దాన్ని బస్తాల్లో నీ ఇంటికి తోలుకెళితే ఊరుకోను"*

*"పదిమందికి సాయం చేద్దామని నేనేం కంకణం కట్టుకోలేదు*
*కానీ వారిని ఎదగకుండా అడ్డుకుంటే చేతిలో కత్తి పడతాను"*

అని తేజస్సును ఉద్దీపన చేస్తాడు. "సాధించడం రెండు రకాలు నాకు తెలిసేలా... నిద్రలో. – ప్రపంచానికి తెలిసేలా... నిద్ర లేకుండా." అనడంలో ఈ యథార్థం ప్రతిఫలిస్తోంది. "ప్రపంచపు నలుమూలలా సుఖం ప్రాణవాయువులో కలసి ప్రవహిస్తోంది. ఎవరి సుఖాన్ని ఎవరూ లాక్కోలేనంత సుఖం..." అంటూనే– "తెల్లారి లేవగానే నీ పరుగు వల్ల ప్రపంచంలో ఏ గొప్ప

ఘనకార్యమూ జరగదు. హడావుడిగా నువ్వు చేసే ఇరవై నాలుగు గంటల ఆర్భాటం వల్ల ఏ చరిత్రా జరగకుండా ఆనకట్ట కట్టబడదు... ఎవరి వల్లా నువ్వు మారవు... నీ వల్ల... ఏదీ మారదు" అంటూ... తేజస్సు ఒక వృషణాయాసంగా తాత్త్వికమయం చేసేస్తాడు మహర్షి.

'ఆమె చెప్పిన కొన్ని మాటలు' బలమైనవి. తేజస్సుకు సార్థకత నిచ్చేవి. స్త్రీ ఔన్నత్యాన్నీ, ప్రకృతి ఆవశ్యకతనీ, ఆమె ఆధిపత్యాన్ని శిరసావహించడంలోని సౌఖ్యాన్నీ, ఆమె ఒడి చేరడంలోని శాంతినీ, లాలననూ ప్రస్ఫుటీకరించేవి! "పడిపోవడానికే మగాడు పుట్టాడు – పట్టుకోవడానికే ఆడది పుట్టింది" అని ఉన్నమాట ఉన్నది ఉన్నట్లుగా చెప్పడం 'మిన్న'దనం! **"ఏ దేవుడైనా భార్యని దేవతలాగే చూశాడండి... అది విశేషం కాదు! కానీ... రాక్షసుడైన భర్తని సైతం భార్యలు దేవుడిగా పూజించారండి"** అన్నప్పుడు నిజంగా స్త్రీ ఔన్నత్యం అర్థమై శిరస్సు వంచాలనిపించదా! "నన్నే వద్దనుకున్నాక ఇక నీకెవ్వరుండీ ఏం లాభం!" అని అన్న ఆరోమాట అరకొరమాటగా ఎలా తీసిపారేయగలం? 'నువ్వు పదిసార్లు చెప్పి' అర్థం అయ్యిందా అని– వందసార్లు అడుగుతావు. అందులో అసలు– 'అర్థం ఉందా? అని– ఒక్కసారైనా ఆలోచించవేం' అంటుందామె! "ఏ క్రియ వల్ల కర్త యొక్క ఖర్మ మారుతుందో ఆ క్రియలో నువ్వే ప్రక్రియలు చేయకపోయినా, 'సక్రియ'గానైనా ఉండు" అని ప్రబోధించడం; "ఈ ఇంట్లో ఉన్న ప్రతి వస్తువు విలువ నీకు తెలుసు... తెలియంది 'నేనే" అనడంలో వున్న 'స్త్రీవాదం' గొప్పది కదా! –

ఇక జనార్దన మహర్షి కవిత్వఆకాశం చివరకు– 'గంధర్వగానం'తో నిండింది. ముఖస్తుతి మాటలు కావు గానీ, ఇవి రవీంద్ర గీతాంజలి పాదముద్రల్లో... సహచరించేవిగా వున్నాయి! మొదట్లోనే అంటాడు – "దేవాది దేవా! ధన్యుడ్ని. తెలుసుకున్నాను. నా తప్పు కారణంగా కోరి నే వేసుకున్న శిక్ష 'ఈ జీవితం' అని కనుగొన్నాను. నా మీద నీకున్న అపరిమితమైన పితృప్రేమతో నువ్వు నాకు ఇష్టం లేకుండా వేసిన శిక్షతో రెండు అవకాశాలు ఇచ్చావు.

1. నీకు శత్రువుగా ఒక జన్మ ఎత్తి తిరిగి నీ పాదాల చెంతకి చేరడం.
2. నీ భక్తునిగా వంద జన్మలెత్తి రావడం.

అందువల్ల నేను నీకు దూరంగా వందజన్మలు బతకాలి. కానీ భక్తుడిగానే బతకాలనే తృప్తితో దాన్ని ఎన్నుకున్నాను. ఇది నా వందో జన్మని తెలిసిపోయింది. అతి త్వరలో నీ దగ్గరకు వచ్చేస్తున్నాను తండ్రీ!" అంటాడు జనార్దన మహర్షి. భక్తుడిగా ఎన్ని జన్మలయినా ఫరవాలేదనే భావన నిజంగా ఎంత ఉదాత్తమైనది! వైరి ఛాయలు కూడా తనకు అంటరాదనే భావనే బహుదొడ్డది! గంధర్వగానం 'పాతిక'గా సాగుతుంది.

"భక్తిని 'పాతిక', బ్రతుకు ఫలవంతమవుతుంది" అని చెబుతున్నట్లు సాగుతుంది గంధర్వగానం. సకల లోక సృష్టికర్తా! సర్వాధికారా! దివ్య మంగళ స్వరూపా! సర్వమంగళా కారా! ప్రియ నాయకా! జగత్ రక్షకా! అమర కోశాధికారీ!, కృపానిధీ! ఓంకారనాథా! పరమేశ్వరా! విశ్వరూప భగవద్గీతా గాయకా! అంటూ సాగి... మిత్రులారా!, సోదరా! సుందరీ! గోమాతా! దేశమా! మనసా! తోటి ప్రయాణికుడా! కళాకారుడా! జిజ్ఞాసీ! కులరహిత సమాజస్థాపకా! విద్యార్థీ! గాయకుడా! భగవత్ బంధువులారా! అంటూ కవి ఆ 'గంధర్వగానాన్ని' సమాజంలోని వివిధ సమూహాలస్థాయికి ఉద్దేశించి ప్రపంచిస్తాడు. ఆత్మ, పరమాత్మలను లయం చేసే దిశగా సాగుతుంది ఈ గంధర్వగానం. దేశాన్ని సర్వస్వంగా భావించాలనీ, మనసును సదా దేవస్థానంగా మార్చాలనీ కవి ప్రగాఢ కాంక్షాప్రబోధం. 'సర్వేజనా స్సుఖినోభవంతు' అనే ఈ గంధర్వగానం చేద్దామంటాడు. ఇదీ జనార్దన షష్ఠికం!...

కవిగానే కనుమూస్తానని అంతర్నేత్రం విచ్చి
మహర్షి తపఃఫలాలను అక్షర వరాలుగా ఇచ్చిన జనార్దనా!
నీకు మా సంస్కార మనఃపుష్పాలతో సన్మానం...
అందరికీ కవితాత్మ స్వరూపాన్ని దర్శనం చేయించావు.
'కవిగానే కనుమూస్తా' నంటూ నీ రాకతో
మంచి పాఠకులను బ్రతికించావ్!

*ఆగస్టు 2011*




# స్పందనాద్యుతి

## మధ్య'మా'గతి (కవితా సంపుటి) - విహారి

"I have to live for others and not for myself; That's middle class morality"

"The only man who behaves sensibly is my tailor: he takes my measurements anew every time he sees me, while all the rest go on with their old measurements and expect me to fit them "

***-George Bernard Shaw***

'మధ్య 'మా'గతి, అని విహారిగారు పేరుంచడంలోనే ఆయన 'లోనారసి'న దృష్టి, వర్తమానం కొలతలతో భవిష్యత్తుకు మానవాతీత విలువలను తొడుగుతున్న 'ఉపజ్ఞ' వ్యక్తమవుతున్నాయి. 'అప్పర్ క్లాసెస్ ఆర్ ఎ నేషన్స్ పాస్ట్, ది మిడిల్ క్లాస్ ఈజ్ ఇట్స్ ఫ్యూచర్' అని అమెరికన్ రచయిత 'ఎయిన్‌రాండ్' అన్నట్లుగా, మధ్యతరగతి 'శక్తి'ని బలీయంగా గుర్తించిన వారు 'విహారిగారు. కథకునిగా, నవలా రచయితగా, విమర్శకునిగా ఖ్యాతి చెందిన విహారిగారి కలం చిత్రాల - జీవధాతువు మాత్రం కవిత్వమే. విశ్వనాథ వారితో సహా ఎందరో రామాయణం కావ్యంగా వెలయించినా, "పదచిత్రరామాయణం"గా వాల్మీకి హృదయం పట్టుకుని, నవనవోన్మేషంగా మలిచిన గొప్ప పద్యకవితా ప్రతిభ విహారిగారి స్వంతం. పండితులనే విస్మయపరిచే ఔచితీమంతమైన పదప్రయోగాలతో, రసమంచిత

కావ్యంగా రామాయణ కావ్య రచన చేసిన కలంతోనే, ఆధునిక వచన కవితా ప్రక్రియలోనూ జనసామాన్య అవగాహనలోకి అభ్యుదయ భావజాలాన్ని - వర్తమాన అంశాలు మూలకందంగా అభివ్యక్తం చేయడం ఈ కవితల్లో కానవచ్చి, ఆలోచనామృతాన్ని ఆనందంగా అందిపుచ్చుకోగలుగుతాం!

'విహారి' గారు - మధ్యతరగతి జీవులే జాతిప్రగతి జీవనానికి రూపశిల్పులు కాగలరన్న విషయాన్ని సహేతుకంగా గుర్తించి, విలువలు, సంస్కారం, సత్కార్యాచరణ ఎప్పటికప్పుడు నేటి సంక్షుభిత కాలంలోనూ నిలబెట్టుకుంటూ వారు ముందడుగు వేయాలనీ, అందుకు సాహిత్యం కూడా ఉపకరించాలనీ విశ్వసించి, కవిగా, కథకునిగా, విమర్శకునిగా కృషిచేస్తున్న చిత్తశుద్ధి గల రచయిత. "మా అందరి ఏకత్వం జాతి చేతనకు ఆర్ద్ర కరస్పర్శ" అని ప్రకటించే సాహిత్యశీలి.

*"కవిత్వంలోనైనా, కథలోనైనా, వ్యాసంలోనైనా*
*సమస్య ముళ్ళ పొద*
*కాదంటే చిక్కుపడిన దారపు ఉండకద?*
*లేదంటే కీచురాయి రొద*
*దాని ఆలోచనలు గుచ్చుకుంటాయి*
*మొదలూ- తుదీ - కొస కనబడదు-*
*గాయాల మూలుగు ఆగదు!"*

అదీ నేటి వాస్తవిక పరిస్థితి. మధ్యతరగతి 'దుస్థితి' ఆయనెరుగుదురు. మారుతున్న కాలంలో మధ్యతరగతి మనస్తత్వమూ, వ్యవహారసరణీ ఆయనకు తెలుసు. ఒక 'హిపోక్రెటిక్' ఓత్‌తో నేటి మధ్యతరగతిజీవి ఎలా ద్వంద్వ ప్రమాణాల్లోకి నెట్టబడుతున్నాడో తెలుసు. అయితే 'దిగులుపల్లవి'తో 'మనిషిలోపలి విధ్వంసం'కు 'స్వేచ్ఛాసమారాధన' చేయక, 'మనిషి మనిషికీ చెప్పండీకథ' అంటూ - 'అగమ్యగోచరం' అయిన సంగతులనుండే "ఆత్మచేతన ప్రకటిస్తూ.. ఈ అక్షరాలు" అంటూ వెలయించిన ఈ కవితలు 'కాకిగోల' కాలంలో -'ఆత్మగతం'గా చదువుకోవాలి. తప్పదు. ఇవి వాస్తవికతా ప్రతిబింబాలు.

'మధ్య 'మా'గతి' ని విహారిగారు అన్ని పార్శ్వాలలో దర్శింపజేసారు. నేటి వికృతరాజకీయాలు, అవినీతి విశృంఖలత్వాలు, టీవీఛానెళ్ళ అమానవీయాలు, ఉగ్రవాద విధ్వంసకృత్యాలు, స్త్రీల పట్ల జరుగుతున్న అకృత్యాలు, మరింతగా

అణగారిపోతున్న పేదలు – 'దృశ్యం ఒక జ్ఞానశీల'మై నడిచే వాక్యాలుగా ఈ కవితల్లో – కదిపి, కుదిపి, ఆలోచింపజేస్తాయి. అంతలా పట్టుకుని, ఆకట్టుకుంటాయి ఇందులోని కవితలు.

మనం నిలబెట్టుకోవాల్సిన మనవైన సమాదరణీయ విలువలను గుర్తుచేస్తారు. వాటిల్లోని ఉదాత్తతను ఉనికిలో నిలుపుకోమని సందేశమూ ఇస్తారు 'విహారి'.

*"తమ కోసం మిగుల్చుకున్న ముద్దని*
*అన్నార్తుల కిచ్చే తల్లుల*
*ఉదారముంగిళ్ళు కదరా – మాలోగిళ్ళు"* (నీ పేరు నలుపు)

*''ఒక తరం భవిష్యత్ స్వప్నాల్ని*
*ఈ తరం*
*'పడమటి' సంద్రంలో ముంచుతోంది*
*ఇల్లు చక్కబెట్టుకునేందుకు దీపం*
*ఏ మూలవుందో చూసుకోవాలి"* (మనిషిలోపలి విధ్వంసం)

**"మందిలో పదిమంది మారినా**
**వ్యక్తికీ, సమష్టికీ శ్రేయోదాయకం"** (మనిషి మనిషికీ చెప్పండీ కథ)

*''ఆర్థిక సంబంధాల సమ్మెటపోట్ల క్రింద*
*నజ్జునజ్జుగా నలిగినలిగి నాశనమైపోతున్న*
*రాగబంధాల అర్థాలు, పరమార్థాలు*
*టీకా తాత్పర్య సహితంగా*
*'న్యూ సిలబస్'గా భవిష్యత్ తరాల సమవీక్షణకు రక్షగా*
*రాజముద్రిక కాకూడదా అని!".* (నాలోనే... నేనూ, మీరూ!)

ఆర్తి చెందుతారు కవిగా విహారి.

కవి విహారిగారి సమాజ పరిశీలనాశక్తి గొప్పది. సమస్యను నిశితంగా విశ్లేషిస్తారు. ఒక అంశం యొక్క పూర్వాపరాలను క్షుణ్ణంగా గ్రహించి, అందులోంచి అభివృద్ధిదాయకమైన మలుపును అందిపుచ్చుకునేలా ఆలోచనాత్మక ప్రబోధాన్ని అందిస్తారు. సందేశమైనా ఎక్కడా వాచ్యంగా తేలిపోనివ్వరు. 'దారిని

విశ్లేషించాలంటే పేజీ తిరగేయక తప్పదు' అంటూ – 'ప్రవర' లో, ఆర్థికంగా నేడు వెనుకబడిన బ్రాహ్మణీయ దళితత్వాన్ని కూడా నిక్కచ్చిగా చూపుతారు.

నాటి 'పోతన'ను ఉద్దేశించి 'అగమ్యగోచరం', నేటి 'శ్రీశ్రీ'ని సంబోధించి 'వ్యత్యస్తం'అని రాసిన కవితల్లో విహారిగారి గడుసుదనం, నేటి సాహిత్య పోకడలమీది విసురుదనం కానవస్తాయి.

***''నీ కవితని 'గ్లోరిఫై' చేసి***
***తిరగరాసి, అరగదీసి***
***పరిహాస మాడటం***
***ఫ్యాషన్ విమర్శకుల 'వైకేరియస్ ప్లెజరయింది''***

అని శ్రీశ్రీని గురించిన విహారి భావన–ఎందరి సాహిత్యాభిమానుల ఎదల్లోనో విహరిస్తున్నదే! అలాగే పోతన ప్రాంతీయత గురించీను.

"రాజకీయంగా, సాంస్కృతికంగా, సాహిత్యంలోనూ – వివక్షాక్షతగాత్రుణ్ణి – ఏం చేద్దామన్నా, ఉన్నచదువూ సంస్కారం అడ్డొస్తుంది. పెదవి – కొరుక్కుంది. అవును– నా కోపం నాదే కదా మరి!!" అనడంలో మధ్యతరగతి రచయిత స్థితినీ ప్రకటితమొనరించారు.

'గ్లోబలి', 'ధరా'ఘాతం – వంటి ప్రయోగాలూ, "ప్రతి వ్యూహానికీ ప్రతివ్యూహం వుండనే ఉంటుంది" వంటి అర్థచమత్కృతులూ, 'భారతీయులే ఎక్కువ తిండిపోతులు' అన్న జార్జ్ బుష్‌వల్ల అమెరికా– 'అగ్ర' వాద నిరసనలూ, 'దినమంతా దిగజారుతూ' పేరు(కు) మాత్రమే సజీవమైన సగటు జీవి బ్రతుకు బాగుపడాలన్న చైతన్య వ్యక్తీకరణలూ, ఇందులోని కవితల్లో పరుచుకుని కనిపిస్తాయి.

***"దారి ఇప్పుడు 'సాఫ్ట్' ఎన్నిక కాదు***
***'వేర్' టు గో – అనే ప్రహేళిక"*** *(నిప్పులయేరు)*

అంటూ వర్తమాన మిడిల్ 'క్లాసిజం' నూ చూపుతూ –

***"ఎక్కడో అనంత కాలాలకు***
***ఆవలితీరంలో అభివృద్ధి మిణుగురు***
***సాగుతూనే ఉండాలట***
***అన్ని అన్ని తరాల బతుకుపోరు!!"*** *(సున్నకు సున్న)*

అంటూ –"చావంత బతుకు పరిస్థితి – బతుకంత చావు దుస్థితి!" అని ఎరుకపరుస్తూనే, కవి కలం "సమూహాల కందిస్తోంది కొత్త వ్యక్తీకరణం– సమాజాని కందిస్తోంది కొత్త వ్యాకరణం". ఔను నిజం!

***"అన్ని తెలివితేటలూ ఉండి***
***ఏమీ చేయలేని అసహాయత ఏదో***
***గుండెని దహించేస్తుంది***
***వాస్తవం అల్పద్రోణిలో***
***వ్యామోహం సుడిదిరుగుతుంది***
***లోకం మీది 'అనర్థం'గా***
***తిక్కరేగుతుంది"*** *(అ నుండి క్ష వరకు)*

అంటూ మధ్యతరగతి మేధావి స్థితికీ దర్పణం పట్టారు.

***''బతుకు నెరిగి, జనం వెతలు చదివి, నలుగురికీ పంచమనే కోర్కె***
***మనసాగ్ని కీలగా లేచిన ఈ తరం కతల పొత్తమిస్తే***
***వాడు పరధ్యానంగా పేజీలు తిరగేసి పారేయగలడు***
***అంతనా పొంతనాలేని తలబంతిని గిలికి అధ్వాన్నపు***
***ఆరు సెంటీమీటర్ల సమీక్ష రాసేయగలడు"*** (గంజాయి మొక్కలు)

అంటూ సాహిత్యవిమర్శ స్థితినీ దృశ్యమానం చేశారు.

***"రచనా చలనోత్సవం***
***నీరసంగా – కోరుతోంది***
***రవ్వంత హాస్యం –అణువంత దరహాసం***
***అంతర్జ్వాలగా ఇంత కన్నీటి చెమ్మ***
***'మహాప్రాణ' శక్తి నందించమంటోంది***
***కలం కోరుతోంది***
***ఆశావహ అక్షరభాస్వరం"*** అని అభిలషిస్తారు.

'నడిచే వాక్యం కావాలి' అన్నది 'మధ్య' 'మా గతి' లోని ఓ మంచి కవిత. సాహిత్యోపజీవిగానే కాదు, మనిషిగా, మహోదాత్త ఆశయవిహారిగా – అందులో ఆయన అందించిన తాత్త్వికతా సందేశం అందిపుచ్చుకోదగింది –

***"పుట్టుక మంచి ముత్యం***
***బతుకు గచ్చుపొద***
***చావు అదృశ్య విశ్వరహస్యం***
***ఇంత సత్యం గమనించి సాగిస్తున్న***
***ఈ గమనంలో***
***మన బొమ్మల్ని రేపటి పౌరులకు***
***చూపుతానంటున్నది***
***కాలలిపి!***
***అందుకే గుండెల్ని సాహిత్యీకరించుకుందాం రండి!***
***కండల్ని సంస్కృతీకరించుకుందాం రండి!***
***అహంకారాల విషపాత్రల్ని పక్కకినెట్టి***
***ఆత్మస్థైర్యాల ఆచరణామృతం***
***ఆస్వాదిద్దాం రండి!***
***'మనం – మనం' మానవహారమే – 'రండి! రండి!"***

అంటూ 'మధ్య 'మా'గతి' వర్తమాన సమాజదర్పణంగా, మానవాభ్యున్నతికి ప్రేరకరీతిగా సంతరించారు. 'పచ్చని శ్వాస'తో మళ్ళీ నడక సాగించడానికీ, మధ్యతరగతీయులే అయినా నిరం'తరం' విజయోన్ముఖంగా వారు,... తరలి పోవడానికీ – జవం, జీవం 'విహారి' కవిత. ముందుమాట లక్కరలేనంత 'ముందున్న' సుప్రసిద్ధ సాహితీవేత్త ఔదార్యమే నా ఈ అనుభూతి స్పందనకు హేతువని వేరే చెప్పాలా!

*"As a prose Writer, I work with language and those who work with language twin to poetry for renewal* **- Samuel R.Delany**

అని అన్నందుకైనా భాషను, భావాన్నీ కవిత్వంతో పునర్నిర్మిస్తూ ఒక కథకునిగా, విమర్శకునిగా, సుప్రసిద్ధులైన విహారిగారు తన మూలాధారనాడి కవిత్వమే అని – 'మధ్య 'మా'గతి'తో నిరూపిస్తున్నందుకు మనసా అభినందిస్తున్నాను. కవిత్వాభిలాషులను ఈ సంపుటి తప్పక అలరించగలదని ఆకాంక్షిస్తున్నాను.

*1 జూన్ 2012*




# రెండంచుల నాణేల మూట-వ్యంజకాల మాట

## బొమ్మ బొరుసు (వ్యంజకాలు) - కేతవరపు రాజ్యశ్రీ

కవిత్వం లఘురూపాలలోకి ఒదిగిపోతున్న కాలం ఇది. 'విస్తృతి'కి 'విస్మృతి' సంభవించి, చదవడానికీ, గుర్తు పెట్టుకోవడానికీ, క్లుప్తతను -వేగవంతమైన కాలమాన పరిస్థితుల దృష్ట్యా కూడా స్వీకరిస్తున్న అనివార్యత! మినీ కవిత్వం నానీలుగా, రెక్కలుగా రూపందాల్చి - ఎందరికో కవులుగా ఆకృతినిచ్చింది! కాలాను గుణంగా 'రూపం' మారుతుంది. అది సహజం! వ్యక్తి రూపు మారడం ఎంత సహజమో, సాహిత్యరూపాలు మారడం కూడా అంతే సహజం అనుకోవచ్చు.

'సాహితీకిరణం' మాసపత్రిక సంపాదకులు శ్రీ పొత్తూరి సుబ్బారావు ఈ 'వ్యంజకాలు' ప్రక్రియను ప్రారంభించారు. నిజానికి ప్రాచీనాలంకారికులు పదములకు లేక శబ్దములకు అర్థమును బోధించే ఒక శక్తి వుందనీ, ఆ పదపదార్థ సంబంధశక్తినే 'వృత్తి' 'శక్తి', 'వ్యాపారం' అని పేర్లతో ఉటంకించారు. ఆ శక్తి అభిధా, లక్షణ, వ్యంజన అని మూడు రకాలు. 'వాచకము' లేక "శక్తము" అయిన శబ్దము చేత 'వాచ్యము' లేక 'అభ్యుదయము' లేక 'శక్యము' అయిన అర్థమునిచ్చేది 'అభిధా' అనీ, 'లక్షకము' అయిన శబ్దంచేత 'లక్ష్యము' అయిన అర్థానిచ్చేది 'లక్షణా' అనీ, 'వ్యంజకము' అయిన శబ్దము చేత వ్యంగ్యము అయిన అర్థాన్నిచ్చేది 'వ్యంజనా శక్తి' అనీ ఆలంకారికులు పేర్కొన్నారు. పొత్తూరి సుబ్బారావు గారు 'వ్యంజనాలు' అనకుండా మరి 'వ్యంజకాలు' అనే అన్నారు. ఎందుకంటే

వ్యంగ్యము, అధిక్షేపము మాత్రమే కాక – ఒక లోకరీతినీ, సామాజిక వైఖరినీ నాణేనికి – ఒక బొమ్మవైపే కాక, బొరుసువైపునూ చూపుతూ, విలువను అనుసంధానం చేయడం ఆయన ఉద్దేశ్యం. వ్యంజనా అనడంలో శక్తి వుంది. వ్యంజకం అనడంలో శబ్దాలకూ, పదాలకూ ప్రాముఖ్యం ఇచ్చి, నేటి కాలరీతుల కనుగుణంగా అభివ్యక్తి పదప్రయోగం చేయగల వైచిత్రి వుంది! మొదటి రెండు పంక్తులలో ఒక అంశాన్ని చెప్పి, మిగతా రెండు పంక్తులలో సమన్వయం చేయడానికి – ఆ పాజిటివ్‌కు, నెగిటివ్ అభివ్యక్తిని జోడించడం ఈ వ్యంజకాలు లోని ప్రయోగం! అంటే మొదటి రెండు పంక్తులూ సహజ ప్రకృతిని చెబితే, తదనంతర రెండు పంక్తులు వికృతి స్వభావాన్ని కూడా ముందుంచుతూ మొత్తంమీద మొత్తం నాలుగు పాదాలూ కలిసి– బొమ్మబొరుసూ కలిసిన నాణెంలా ఒక సమష్టివిలువను సంతరించు కోవాలన్నది సంకల్పం! రెండంచుల నాణేల మూట ఈ వ్యంజకాలన్న మాట!

'సాహితీ కిరణం' మాసపత్రికలో నెలనెలా ఈ వ్యంజకాలు విరివిగా ప్రచురింప బడుతున్నాయి. సహజంగా కొత్తదనం పట్ల ఆసక్తి, కవిత్వరచనానురక్తి కల శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీగారు మునుపే నానీలు, రెక్కలు వెలువరించి, ఈ 'వ్యంజకాలు' పట్ల ఆసక్తి కలిగి, పొత్తూరి సుబ్బారావు గారి కన్నా ముందే పుస్తక రూపంలోకి తీసుకు వస్తూండడం అభినందనీయం! ఒక క్రియకు ప్రతిక్రియ, ఒక ప్రకృతికి వికృతి, ఒక స్థితికి దుస్థితి, ఒక మేలుకు ఒక కీడు ఒక సంతోషానికి ఒక దుఃఖం లోకంలో సహజం. 'వ్యంజకాలు' ఆ అర్థాలను శబ్దించేవే. అభివ్యక్తీకరించేవే. రాజశ్రీగారు తన పరిశీలనాశక్తితో సామాజిక చేతనతో, కాలరీతులనూ, మనుష్యస్వభావాలనూ ఈ వ్యంజకాలలో చక్కగా పట్టుకున్నారు.

***'అపార్టుమెంట్ నిర్మాణం***
***ఎందరికో ఉపాధి కల్పించింది***
***నిరుపేదలకు నిలువనీడపోయింది.'***

అనడంలో పేదల గుడిసెలు కూల్చి బహుళ అంతస్తుల భవనాలు నిర్మితమౌతున్న అమానవీయ సంస్కృతికీ అద్దం పట్టినట్లయింది.

*'పెళ్లికూతురు*
*అందాలరాశి*
*కట్నకానుకలు తేలేని ఆమెను*
*అవిటికిందే లెక్కకట్టారు'*

*'మొగుడు వదిలేసినా కాయకష్టంచేసి*
*కొడుకును బడిలో వేసింది*
*అడ్మిషన్ ఫామ్‌లో*
*నాన్న పేరు రాయమన్నారు '*

వంటి వాటిల్లో 'స్త్రీవాదం' తొంగిచూసేలా చేయడం రాజ్యశ్రీప్రత్యేకత! ఇది స్త్రీగా కవయిత్రి లక్షణం!

*'అమ్మానాన్నలు*
*బండిచక్రాలవంటివారు*
*బండిపై బరువును మోపటానికి*
*కొందరు పిల్లలు ప్రయత్నిస్తుంటారు'*

*'విదేశీ సంపాదనతో*
*స్వదేశంలో విలాసవంతమైన ఇళ్లు*
*వాటికి కాపలాగా*
*వయసుమళ్లిన మాతాపితలు'*

వంటి 'వ్యంజకాలు' వట్టి వ్యంగ్యార్థ సూచకాలే కాదు, నేటి మృగ్యమౌతున్న మానవీయవిలువలను కనులముందుంచి, చెమరింపచేసేవి. "రమణీయార్థ ప్రతిపాదక శబ్ద" మేదయినా కావ్యమేనని 'జగన్నాథుడు' అన్నాడు. కావ్యశరీరలక్షణం – అనగా రూపును ముందు గ్రహిస్తే, ఆ రూపు నుండి రూపుకట్టే– కావ్యాత్మవైపు ప్రయాణం చేయగలుగుతాం. 'వ్యంజకాల' ను రూపొందించిన శ్రీ పొత్తూరి సుబ్బారావు గారికీ, ఆ ప్రక్రియనందిపుచ్చుకుని మొదట తానే గ్రంథ రూపంలో వెలువరిస్తున్న శ్రీమతి కేతవరపు రాజ్యశ్రీ గారికి అభినందనలు.

*ఫిబ్రవరి 2012*




# దివాకరునికి పద్య జలజాతం

## దివాకర ప్రభ (పద్యకావ్యం)- డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

**మ**నం నన్నయభట్టునిచూడలేదు. అల్లసాని పెద్దననూ చూడలేదు. కానీ వారు సాక్షాత్తూ ఇలాగే వుంటారా అనిపించేట్లుగా మా యువతరం ఓ సాహితీమూర్తిని దర్శించింది. నేను హైస్కూల్లో వున్నప్పుడు మా పాఠశాల వార్షికోత్సవ సభలో ఆయన ఉపన్యాసం విని, తెలుగుపట్ల విపరీతమైన మమకారానికి లోనయ్యాను. సైన్స్, లెక్కలు కాదనుకుని ప్రాచ్యకళాశాల విద్యార్థినయ్యాను. అప్పుడే 'యువభారతీ' యుడిసీ అయ్యాను. ప్రాచ్యకళాశాలలో, ఆ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం. ఏ. తరగతుల్లో ఆయన బోధనలు వినే అదృష్టం లభించింది. యువభారతి 'కావ్యలహరి' తో ఆయన సాన్నిధ్యం మరింతగా దక్కింది. నేను రేడియోలో చేరాక ఆయన ఉపన్యాసాలను ధ్వనిముద్రణం చేసే భాగ్యమూ సమకూరింది. 'నేను' ఈనాటి 'నేను'గా రూపొందడం వెనుక ఆయన మనోవైభవ దీప్తి వుంది. ఆశీర్వచనం వుంది.

నేనే కాదు ఇలాంటి 'నేను'లు ఎన్నెన్నో!! ఒక తరాన్ని కంఠదఘ్నమైన తమ ప్రభావంతో తీర్చిదిద్ది, ఎందరో శిష్య ప్రశిష్యులతో తెలుగు భారతీ మణిమకుటంగా భాసించిన మహోన్నత సారస్వతమూర్తి ఆయన, వాగ్మివతంసుడాయన, ఆంధ్రవాఙ్మయ దివాకరుడాయన – ఆయనే ఆచార్య దివాకర్ల వేంకటావధాని.

దివాకర్ల వారి శతజయంతి సందర్భంగా ఆయన ఉపన్యాసపరంపరలతో వృద్ధి చెందిన యువభారతి ఆయనపై ఇలా ఓ పద్యకావ్యాన్ని తన ప్రచురణగా

తీసుకురావడం ఎంతో సంతోషంగా వుంది. దివాకర్లవారి వ్యక్తిత్వ కవిత్వాలను శ్లాఘిస్తూ, వారి జీవితచరిత్రకు ఈ పద్యకావ్య రూపమిచ్చినవారు యువభారతి గౌరవాధ్యక్షులు డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యగారు.

"తారీఖులు, దస్తావేజులు ఇవి కావోయ్ చరిత్రసారం" అని శ్రీశ్రీ అన్నట్లు – ఒక వ్యక్తి జీవితచరిత్ర అంటే జీవితంలో జరిగిన కేవల సంఘటనల క్రమంగా కాకుండా, ఆ మహనీయమూర్తి జీవనసాఫల్య వైభవప్రాభవాలుగా శ్రీనివాసాచార్యగారు ఈ పద్యకావ్యాన్ని సంతరించారు. బాల్యంనుండి అస్తమయం వరకూ ఆ వాఙ్మయ దివాకరుల జీవనరేఖలను ఓ క్రమంలో కనులముందుంచుతూనే, వేంకటావధాని గారి జీవన గమనంలోని మహనీయతనూ, సాహిత్యానికి వారు చేసిన సేవనూ ఈ పద్యాలలో హృద్యంగా వెల్లడించారు శ్రీనివాసాచార్య.

దివాకర్ల వేంకటావధానిగారికి గొప్పవక్తగా, ఉపన్యాసకునిగా ఎనలేని కీర్తి వుంది. ముఖ్యంగా విద్యార్థులలో తెలుగు సాహిత్యంపట్ల అభిరుచిని పెంచి, ఎందరెందరినో సాహితీ ప్రియులుగా, సాహితీ వేత్తలుగా మలచిన ప్రభావశీలురు ఆయన. ఆయన రాసిన 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర' వంటి గ్రంథాలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకై రాసిన పాఠ్యగ్రంథాలు, 'గైడ్స్' ఎందరికో 'రిఫరెన్స్ బుక్స్' అయ్యాయి. ఆయన చేసిన అనేక రచనలు సాహితీ లోకానికి పరామర్శ గ్రంథాలుగా నేటికీ రాణిస్తున్నాయి. నలభైకి పైగా గ్రంథాలు వెలువరించిన దివాకర్ల వేంకటావధాని గారు కవిగా నన్నయ మార్గంలో పద్యరచన చేసినవారు. విశ్వనాథ సత్యనారాయణ శిష్యులుగా దివాకర్ల వారు – విశ్వనాథ 'ఏకవీర' నవలను ఆయన చెబుతుండగా రాసిన సంగతి చాలామందికి తెలియకపోవచ్చు. డాక్టర్ సి.నారాయణ రెడ్డి వంటి నేటి ఎందరో మహనీయ సాహితీ దిగ్దంతులకు దివాకర్లవారే గురువు అన్న విషయమూ కొందరికి తెలియకపోవచ్చు. దివాకర్ల వారి విశిష్టతలను డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యగారు ఈ పద్యకావ్యంలో బహుధా వర్ణించారు. దివాకర్ల వారి జీవితాన్ని గురించి పూర్తివివరాలతో వచనరచననూ ఈ గ్రంథంలో సంతరించడం జరిగింది. పద్యకావ్యంలో శతాధిక పద్యాలలో తిరుమల శ్రీనివాసాచార్యగారు శతజయంతి సాహితీమూర్తి దివాకర్లను రస సమంచితంగా రూపుకట్టించారు. పద్యంలో జీవితవిశేషాలను ఇలా హృద్యంగా చెప్పగలగడం

ఆచార్యులవారి ప్రజ్ఞే! అసలు అవధానిగారి జీవితమే ఒక ఖండ కావ్యంగా తోస్తుంది కనుకనే ఈ కృతి – ఆకృతి దాల్చిందేమో!

*"భావనము సేయ నవధాని జీవితమ్ము*
*పద్యమయ ఖండకావ్యమ్ము భంగిదోచు*
*గుణములన్ని ఛందోగత గణములయ్యె*
*భవ్యధార ధారణ యతి ప్రాసలయ్యె"* – అంటారు తిరుమల వారు. అవధానిగారి భార్య, పిల్లలు, ఆయన ఉద్యోగజీవితం, సాహిత్యసంచారం, గ్రంథరచన, మిత్ర శిష్యతతి ఈ పద్యాలలో చిత్రించబడిన తీరు అంతా కవితాత్మకమైన సౌరు. దివాకర్ల వేంకటావధానిగారి రూపును మూడు పద్యాలలో ముచ్చటగా ముందుంచిన ఘనత శ్రీనివాసాచార్య గారిదే –

*"సువిశాల ఫాలఫలకము*
*న విమలమగు నగరు తిలక నవ్యత వెలుగన్*
*నవసారస్వత జలధుల*
*పవిదిని యవధాని కనులు భాసిలుచుండెన్*

*శిరసు దివ్య బృహస్పతి శీర్ష మరయ*
*నోరు మధుర కవన ఝరీధారయద్ది*
*పెదవు లుభయభాషా ద్వారపదము లవ్వి*
*నాల్క పలుకుల చెలిచేతి చిల్కయద్ది*

*మనసులో నింపి ఛందస్సు మధురిమమ్ము*
*పలుకులో నిల్పి వ్యాకృతి విలసనమ్ము*
*రచనలో నలంకృతి శాస్త్ర రుచులు నిలిపి*
*తెలుగు భాషగా అవధాని వెలిగినాడు"* –

అన్నమాట ప్రత్యక్షర సత్యం. 'వినయము వచ్చి పండితుని వేషము వేసినట్లు'ంటారు అవధానిగారనీ, "చూచిన వెంటనే యతడొక యాచార్యుండనెడు భావ మనుకొనకుండన్ బూచును మనోవనమ్మున" అనీ, "పద్యకృతులను పాషాణగద్యములను హృద్యముగ నేర్పు నొక కృతవిద్యుడతడు'' అనీ, "సూక్ష్మపరిశీలనము గల శోధకునిగ బ్రతుకునకు గూర్చి తరుగని పరిమళములు" అనీ, "ఆదికవి నన్నయార్యుని మాదిరి యవధాని యాంధ్రమాధురి జాటెన్"

అనీ, తిరుమల వారు అవధానిగారి బహుముఖీనతను కీర్తించారు. తీరుతీరుల వారి మహనీయతను మనముందుంచారు.

*"యువభారతి లహరీ సభ*
*లవధాని వచస్సుధా మహత్త్వము జాటెన్*
*కవినాథుల కావ్యాంతర*
*కవితాశక్తిని వధాని ఘనముగ జాటెన్*

*ఆ మహావక్త యిదునుపన్యాసము విన*
*వర్షధారలన్ గొడుగులు పట్టుకొనుచు*
*దడిసిపోయిరిలే సహృదయులు వాన*
*ధారలందు వచోఽ౽ మృత ధారలందు"*

అంటూ యువభారతి లహరీ ప్రసంగపరంపరల్లో – అవధానిగారి ప్రసంగాల నాటి మనోహరదృశ్యాన్ని మళ్ళీ కళ్ళముందుంచారు తిరుమల వారు. ఏమయినా తిరుమల శ్రీనివాసాచార్యగారన్నట్లు –

*''అతని ధ్వని విని మొక్క మహాగమయ్యె*
*అతని నుడి విని చుక్క హిమాంశువయ్యె*
*అతడు పట్టిన యొక రాయి రతనమయ్యె*
*అతడు ముట్టిన మట్టి ముత్యముగనయ్యె"*

ఔను! దివాకర్ల వేంకటావధానిగారు ఒక అనన్వయాలంకారం. "నింగి కెదిసాటివచ్చును నింగిగాక – జలధి కెది పోటి వచ్చును జలధిగాక – అల దివాకర్ల శ్రీ వేంకటావధాని – గురునకెవ్వరు సాటి యా గురువెకాక". ఏతాదృశగుణగణ భూషితులైన ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారిపై వారి శతజయంతి సందర్భంగా – ఈ హృద్యమైన పద్యకావ్యాన్ని రచించిన తిరుమల శ్రీనివాసాచార్యగారు ఎంతయినా అభినందనీయులు. అవధానిగారి స్మృతి ఘృణులు సోక పాఠక హృదయసరసిలో పద్యజలజాతాలు పూయించినందుకు ధన్యవాదాలు.

జూలై *2012*



# పద్మ చింతనం

## చింతల చెట్టు (కవితా సంపుటి) – సింహాద్రి పద్మ

అక్రమంగా 'కూలి'పోయేది ఏదయినా బాధాకరమే! అమెరికాలో 'డబ్ల్యు.టి.సి' యే కానక్కర్లేదు, అందమైన బాల్యం పల్లెలోని 'చింతచెట్ట'యినా కావచ్చు. చదువుకోవాల్సిన వయసులో అనివార్యమై కూలికి వెళ్ళే ఆడపిల్లయినా కావచ్చు. పిచ్చుకగూడు కావచ్చు, పచ్చని పర్యావరణం కావచ్చు. ఉత్థానాల కన్నా పతనాలు పెరుగుతున్నప్పుడు, మనిషిలో తన తనాలు తరుగుతూ, తరతమాలు అధిగమిస్తున్నప్పుడు తల్లడిల్లే స్వచ్ఛ హృదయం ఏ కొందరికో మాత్రమే ఉంటుంది. 'ఆర్తి'లోంచి 'స్ఫూర్తి' జనిస్తుంది కొందరికి.

శ్రీమతి సింహాద్రి పద్మ ఆలోచనలు అలాంటివే! తనకు ప్రకృతి పట్లా, అందునా సహజప్రకృతిపట్లా, మనిషి పట్లా, అందునా స్నేహసుగంధాల మానవీయత పట్లా మక్కువ ఎక్కువ. ప్రపంచీకరణ పేరిట ఇన్‌స్టెంట్ అభివృద్ధి పట్లా, శ్రద్ధాత్మ శూన్యమవుతున్న యాంత్రికత పట్లా వైముఖ్యం! తెలుగు భాషపట్లా, సంస్కృతి పట్లా ఎంతో మమకారం. ఈ నేపథ్యంలోంచే

***"మనస్సుని, స్వప్నాన్ని, స్పర్శని***
***కొత్తగా ఊహించు***
***మరో ప్రపంచాన్ని ఆవిష్కరించు***
***అనురాగం పలికించు***
***ఆత్మీయతను బతికించు***
***అంతరంగాలను వెలిగించు"***

అని తనకు తాను ఉద్బోధించుకుని అందుకోసమే, తన భావాలను అభివ్యక్తీకరించుకునేందుకు కలం పట్టారనిపిస్తుంది.

*"అక్షరాలు అమృతమై*
*జనజీవన జాగృతికి జీవమైన కవిత్వం కావాలి.*
*కవిత్వం జీవితానికి జీవాన్నిచ్చే*
*సహజాతము, సజీవము, సౌజన్యమై వెలగాలి.*
*కలల్లో... కలాల్లో... కాలాల్లో*
*వెంటాడే జ్ఞాపకమై మిగలాలి"*

అన్న ఆదర్శ ఆశయదీప్తి పద్మగారిది. సహజాతముగా వచ్చిన భావాలనే సజీవంగా, సౌజన్య మానసంతో అక్షరీకరించే అభ్యాసం చేశారు. కలల్లో, కలాల్లో, కాలాల్లో వెంటాడే జ్ఞాపకంగా కవిత్వాన్ని ఉన్నతీకరించుకోవాలన్న ఉదాత్త ఆశయం ముందుగా గొప్పది! కవిత్వం అంటే జీవితమే. తిలక్ అన్నట్లు "బ్రతుకే ఒక లలిత లలిత లతాంత మాల!". ఆ సున్నితత్వాన్నీ, ఆ పరిమళాన్నీ కడగంటా నిలబెట్టుకోవడంలోనే మంచితనం, నిజమైన మనిషితనం ఉన్నాయి. అందుకు శ్రమించాలి. ఆ శ్రమలో సౌందర్యం ఉంది. పద్మ- శ్రమలో సౌందర్యాన్నీ, సృజనాత్మకతనూ కూడా చూస్తారు.

*"శ్రమను ప్రేమించేవారు జీవితాన్ని ప్రేమిస్తారు"*
*"శ్రమను ప్రేమించడం కన్నా*
*గొప్పకళాత్మక హృదయం ఎక్కడుంది"*
*"కష్టపడటంలో కళ కనిపిస్తుంది*
*.................................*
*నాటువేసి, పంటకోసం, కుప్పనూర్చి*
*ఒడ్లు బస్తాలైన కర్షకుని కంటివెలుగు*
*తాజ్‌మహల్ పున్నమి వెలుగులోని జిలుగు ఒక్కటే"*

అంటారు పద్మ. 'శ్రమజీవన సుజీవని' అనీ, 'శ్రమాయుధం ధరించి కర్మయజ్ఞంచేసేవాడే ప్రపంచ బంధువు! భగవంతుడు' అనీ పద్మపేర్కొనడం ఆమె భావనా సౌకుమార్యాన్నే కాదు, సామాజిక తత్వాన్ని కూడా తెలియబరుస్తోంది. మంచి భరోసా ఇస్తోంది.

అలాగే మట్టిని గురించి రాస్తూ

***"మట్టికి మోసం తెలీదు***
***క్షేత్రాన్ని, బీజాన్ని, పంటని, పశువుని, సమస్తాన్ని***
***మోసం చేయగలిగిన మనిషీ***
***నువ్వూ మట్టి కావలసిందే.***
***మనిషి కన్న మట్టి గొప్పది"***

అంటుంది. "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అన్న గురజాడను నూటయాభై సంవత్సరాలు దాటేసి, 'మనిషి కన్న మట్టిగొప్పది' అనడంలో పర్యావరణం, ప్రకృతి ధ్వంసమై మనిషి మనీషి కావడం పోయి, మట్టైపోతున్నాడన్న ఆర్తియే కవయిత్రిలో ఉంది.

"అమ్మంటే నిలువెత్తు నమ్మకం- గుండెలో నిండిన విశ్వాసమందిరం" అవ్వాల్సింది, నేడు 'అమ్మపిశాచి'గా రూపుకట్టే రాక్షస సందర్భాల గురించి కలతచెందుతుంది. నిరంతర సమస్యల సంచలనంతోనే 'మేధాగాండీవం' దాలుస్తోంది. శ్రీమతి పద్మ వైవిధ్యభరితమైన అంశాల గురించి కవితాక్షరాలు కూర్చారు. పండుగ గురించి, మండలి గురించి, అక్కయ్య గురించి, థెరిస్సా గురించి, జాషువా గురించీ, జాను తెలుగు గురించీ దేని గురించి రాసినా ఒక శ్రద్ధ, ఆసక్తితో రాసినట్లు కనబడుతుంది. అలాగే భావుకత్వంతో నిండిన పలు ఖండికలూ ఉన్నాయి. 'పిట్టలు'అనే కవితలో 'పిట్టలు జీవితపు సంకేతాలు - ప్రకృతి ఒడిలో బ్రతుకు పాఠాలు" అని జీవవైవిధ్య పరిరక్షణ సూచికను కూడా అందించారు. గ్రేట్!

**"పదికాలాలు పచ్చదనం భద్రపరచుకోవటానికి ఇప్పుడు నాకు నవీన ఋతువు కావాలి"** అంటున్న సింహాద్రి పద్మ కవిత్వంలో కొత్త ఋతువులకు సమాయత్తమయ్యే రచనా ప్రకృతిని, తన కలం ప్రవృత్తిగా మరింతగా మలచుకుంటారని శుభాకాంక్షలు. కవితా సంపుటికి అభినందనలు.

*12 అక్టోబర్ 2012*



# సత్యదర్పణం

ఇవి అబద్ధాలుకావు (కవితా సంపుటి)
- సత్యవోలు సుందరసాయి

ఆగ్రహం ఆవేశాన్ని కలిగిస్తుంది. ఆవేశం ఆలోచనను మందగింప చేస్తుంది. అందువల్ల విచక్షణా రాహిత్యం సంభవిస్తుంది. విచక్షణ లేకపోవడమే అనేక విరూపతలకు హేతువు అని లోకంలో సాధారణంగా అనుకునే మాట. కానీ కవిత్వంలో ఆవేశం వుంటుంది. దాని వల్ల ప్రయోజనం వుంటుంది.

Poetry is when an emotion has found its thought and thought has found words? - ***Robert Frost.***

ఆలోచనాత్మకమైన పదాలుగా ఆవేశం కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. అందుకే నిజమైన కవి అందునా సమాజహిత చింతనా పరుడైన వాడు ధర్మాగ్రహం కలిగివుంటాడు. మౌలికంగా మంచికథకునిగా ఈ సరికే గుర్తింపుపొందిన సత్యవోలు సుందరసాయి కవిగా ధర్మాగ్రహంతో కూడిన ఆవేశపరుడు. అన్యాయాన్ని, అరాచకాన్ని ఏ రూపంలోనైనా సహించనేరనితనం, మంచితనం, కలవాడు కనుకనే సంఘర్షిస్తాడు. ఆ సంఘర్షణ బహిరంతరముఖంగా సాగుతుంది.

"Out of the Quarrel with others we make Rhetoric. Out of the quarrel with ourselves we make Poetry- ***W.B.Yeats***

అంతేకాదు. కవిత్వం ఒక్కటే నిజంగా సత్యసుందరం. తారీఖులు దస్తావేజులు చరిత్రకాకుండా నిఖార్సయిన సత్యానికి సామీప్యంగా నిలచేది కవిత్వం.

'Poetry is Nearer to vital truth than History' - ***Plato***

అందుకే తన కవితాసంకలనానికి సాయి "ఇవి అబద్ధాలుకావు" అనే పేరు పెట్టాడేమో! దూరదర్శన్ సప్తగిరి హైదరాబాద్ కేంద్రంలో కార్యక్రమ నిర్వహణాధికారిగా వుంటున్న సుందరసాయి అంతకు మునుపు పత్రికారంగంలో పనిచేసాడు. మీడియాతో ప్రగాఢంగా మమేకమైనవాడు కనుకనే సమాజంలోని అసమానతలు, అవినీతులు, వ్యక్తుల వైఖరులు, రాజకీయ కాపట్యాలు, సాంస్కృతిక కాలుష్యాలు తనకు క్షుణ్ణంగా తెలుసు. అంతేకాదు పత్రికారంగం కూడా రాను రాను ఎలా విలువల పతనానికి గురి అవుతోందో, హేతువవుతోందో 'పాత్రికేళీయం'లో 'సంపాదనకత్వం'లో సూటిగా ఉటంకించాడు.

ఈ సంపుటిలోని యాభైకి పైగా గల కవితలన్నింటా ఒకవంక కవిగా తన ధర్మాగ్రహం, ఆలోచనాత్మకమైన ఆవేశం, మరోవంక సమాజహిత సందేశం, వైయక్తిక అనుభూతి సాంద్రత, ఒక విలక్షణ తాత్త్వికస్పృహ పరుచుకుని కనిపిస్తాయి. ఒక బహిరంతర ఆవేశంతోనే 'శ్లోకం శ్లోకత్వ మాగతః' అన్న చందాన సుందరసాయి ఆర్తి ఈ కవితల స్ఫూర్తిగా వెలువడిందనిపిస్తుంది. అయోమయం, పులుముడు, శిల్పం, ప్రయోగం అంటూ అనవసర అస్పష్టతలు ఏవీ లేకుండా ఇది కవిత్వమా కాదా అన్న విచికిత్సకు లోనుకాకుండా నిర్భీతితో అభివ్యక్తీకరించిన అతని స్పందనలివి. నేటి సమాజానికి నిలబెట్టిన నిలువుటద్దం.

***"లంచం విశృంఖల పథం***
***గర్వాంధకారం దాని నైజం***
***మొత్తం సమాజమే పతనం***
***డబ్బుంటే పెద్ద కులం***
***లేకుంటే అలగా జనం"***

*అని కుండబద్దలు కొడుతూ 'నిజం' కవితలో మరోసారి*

***"ఎగిరిపడే ఈ కాలానికి ప్రధానం ధనం***
***కావాలి భట్రాజుల మేళం***
***ఆలకించాలి భజంత్రీల గేయం***
***కనిపించాలి భజనపరుల వీరంగం"***

అని విశదపరుస్తాడు. "నీటిని కడుపున దాచే పథకాలు - చాపక్రింద నీరులా అవినీతి వలయాలు - వర్షాకాలంలో కొట్టుకుపోయే ఆనకట్టలు - వేసవిని తీవ్రతరం చేసే అక్రమాలు" గురించి 'కొలిమి' రాజేసి చూపుతాడు. అవినీతి, అక్రమాల గురించీ, లంచగొండితనం గురించీ పలు కవితల్లో పదే పదే కనబడే 'రీతి' పునరుక్తి దోషం కాదు.

*"అవినీతి నేటిలోకరీతి*
*ఆడంబరం ఓ సంబరం*
*అబద్ధమే నిబద్ధం*
*ఆరాటం కొలబద్ద"*
*"నీటిబుడగలాంటి జీవితంలో*
*స్వార్థమనే జలధి ఎందుకు ప్రవేశిస్తోంది*
*కరుణ, జాలి, దయా గుణాలను*
*ఎందుకు కబళిస్తోంది*
*అనంతంగా వ్యాపించే అవినీతి అంటురోగానికి*
*మందెక్కడ దొరుకుతుంది" (కదలిక)*

అని ఆర్తితో రగులుతున్నాడంటే- మానవీయత పట్లా, ఒక చిత్తశుద్ధీ-నిజాయితీతో కూడిన జీవనతాత్త్వికత పట్ల గల శ్రద్ధవల్లనే.

*"అణువణువులోని బంధం - గుండెను ఆవరించిన స్నేహం*
*తలపుల్లో జీవం - నిజంగా జీవించే నిస్వార్థం (బంధం) ...*

*కల్లోలానికి చిక్కదు స్నేహబంధం*
*స్వార్థానికి మండదు స్నేహహృదయం"*

అని అందుకే అనగలిగాడు. "ఇవి అబద్ధాలు కావు" అన్నది ఎంతనిజమో, ఇవి పచ్చినిజాలు అన్నది అంత సత్యమే. తాను సత్యసుందరుడు కనుకనే, నేటి సమాజం, సమాజంలోని వ్యక్తుల తీరుతెన్నులు సాకల్యంగా కవిగా సమీపదర్శనమూ చేసాడు కనుకనే, అనేక అంశాల గురించిన కటిక వాస్తవాలను, నిష్ఠుర సత్యాలను "ఇవి అబద్ధాలు కావు" అని కవిత్వీకరించే పనికి సమకట్టాడు. స్పందించే హృదయం కలవాడు కనుకనే స్నేహితుడు శశిధర్ మరణానికి కదిలిపోయాడు. ప్రేమాస్పద మానసం నిండారా కలిగిన వాడు కనుకనే-

*"బాధ్యతల భార్యగా కదలాడుతూ*
*నిత్యం నన్ను శాసించే నా రాణి*
*నా ఒంటరి ఊహలో మనోహారిణి*
*దూరంగా ఉన్నా హృదయమంతా ఆవరించి*
*ప్రతి పదంలో నను నడిపించే భావప్రేరణ*
*సంసారసాగరాన్ని మథిస్తున్న ఆ నయనతార" (మనోహారిణి)*

అని అర్ధాంగిని సజావుగా సంభావించగలిగాడు - అంతేకాదు 'సతి' అనే కవితలో ఇలా ఉటంకిస్తాడు-

*"సమర్థత సతి అయితే*
*అనుసరించడం అభిలషణీయం*
*మంచితనం భార్య అయితే*
*ఆ మంచిని పెంచడం కర్తవ్యం*
*వివేకం ఇల్లాలయితే విధి నిర్వహణమే శరణ్యం.....*
*క్షణక్షణం తానై - కణకణం వాడియై*
*అణువణువునా ఆశయై - నాలో నిండుగ నిండిన సగమై*
*నన్ను సమాజ శ్రేయోమార్గంలో*
*ప్రజాప్రయోజనా ప్రగతి శీలత్వంలో*
*ముందుకు నడిపిస్తున్న నా సతి"*

అని అర్ధాంగిని జీవితపథ ప్రగతి మార్గదర్శినిగా సంభావించగలిగాడు.

నిజంగా ఇది అభినందనీయ అంశం. కవిది ధర్మాగ్రహం అని ముందే చెప్పుకున్నాం. 'కోపం' అనే కవితలో ఆత్మహత్యలు చేసుకునే నైజాలను నిరసిస్తూ "ఎవరిమీదయ్య నీ కోపం - నీ ఊపిరిని క్షణికావేశంతో ఎక్కడో ఏదో అయ్యిందని-అపజయం ఎదురయ్యిందని - ఊపిరికి ఉరితాడు బిగిస్తే - లోకాన్ని ఉద్ధరించినట్లా?" అని నిలదీసి, "సాధనే సర్వశక్తులకూ నాంది - జీవితమే ఒడిదుడుకుల ఒరవడి - ధ్యేయం చేరాలి మార్గం- పట్టుదలే దానికి శరణ్యం" అని సందేశం ఇస్తాడు. ఇది ఎంత విచక్షణా శీలంతో కూడినదో గ్రహించగలం. "అసహనం అగ్ని - కోపం క్రోధాగ్ని - ఆకలి జఠరాగ్ని- కోర్కె బడబాగ్ని - మండేకొలిమి జీవితం - కోరికల కార్చిచ్చాపథం" అని 'భావిదావాగ్ని' అనే

కవితలో అంటాడు. మానవత్వంలేని వైద్యులను 'వైద్యుడు' కవితలో నిలదీసి హెచ్చరిస్తాడు. "ఏ పనయినా తొందరగా జరగాలి - అందుకోసం ఏ నీతి అయినా తప్పాలి. - మన లెక్కలన్నీ సవ్యం- ఎదుటివాడివన్నీ అపసవ్యం" అనుకునే సామాన్యుడి వైఖరిని కూడా "సాగినంతకాలం అసామాన్యులం - సాగకపోతే సామాన్యులం" అని పరిహసిస్తాడు.

***"మనసును జయించినవాడు మహాత్ముడు***
***మనసు జయిస్తే వాడు సామాన్యుడు "***

అనడంలో నిజమేకాదు ఎంత తాత్త్విక స్పృహ దాగుందో కూడా గుర్తించాలి. "ఆరని అనురాగం జడి ఈ గుండె తడి" కనుకనే కవి సమాజ శ్రేయోభిలాషిగా, మానవీయ విలువల పునర్జీవన కాంక్షతో నేటి వ్యవస్థలోని వేదనలను, వాదనలను, బహిరంతర ప్రకృతి పరిరక్షణలో మనిషి అలసత్వాన్నీ, ఉపేక్షనూ అన్నింటినీ ఈ ఖండికలలో కరాఖండిగా వెల్లడించాడు.

***"భజన ఒక తృప్తి***
***మనల్ని మనం సర్దుకునే ఓ సంతృప్తి"***

అంటూ తప్పిదనాల సమర్థింపుకు అదొక మోహరింపుగా మిగులకూడదని కాంక్షిస్తూ-

***"మా జనం కురిపించే స్వేదం***
***రాచబాటలకు నైవేద్యం"***

అని పాలమూరు కూలీతో శ్రమశక్తి ఔన్నత్యాన్ని కూడా 'స్వేదాభిషేకం'గా గుర్తించి కొనియాడుతూ, మేస్త్రీ గురించి రాసినా, కాంట్రాక్టరు గురించి రాసినా "ప్రార్థించే పెదవులకన్న పనిచేసే చేతులు గొప్పవి" అన్న చందాన, 'పనియే దైవం'గా సంభావిస్తాడు. అలాగని తాను నాస్తికుడు కాదని 'క్షోభ' కవిత చదివితే తెలుస్తుంది. "సకల చరాచర సృష్టికర్తా! ఈ పరీక్ష ఇంకెన్నాళ్లు? ఆరని జ్వాలకు అంతమెప్పుడు?" అంటూ తన ఆవేశానికి, ఆగ్రహానికి, ఆర్తికీ, ఆ జగన్నాటక సూత్రధారినే మూలభిత్తికగా నిల్పుకుని సువ్యవస్థను ఆకాంక్షిస్తూ-

*"అంకాన్ని మార్చు*
*నాలో ఆత్మస్థైర్యాన్ని నింపు*
*నా మార్గానికి నన్ను తరలించు*
*నన్నొక ప్రధాన పాత్రధారిగా నిలబెట్టు*
*నీ నాటకాన్ని నీవే రక్తికట్టించు"*

అని నివేదించుకుంటాడు.

*"నాదేశం కోసం కొంచెం మంచిని కూడగట్టలేరా*
*స్వార్థం నిండిన హృదయం నుంచి కొంచెం మంచి తొంగిచూసేవేళ*
*నాదేశంలో మంచిని ప్రసరిద్దాం*
*ఆ అవకాశం నాకు అందాలని*
*ప్రస్తుతం సాగుతున్న కాలాన్ని*
*వేడుతున్నా*
*ఆవేశపడుతున్నా*
*ఆకాంక్షిస్తున్నా"*

అంటాడు. ఇవి అబద్ధాలు కావు. ఒట్టి అబద్ధాలు కావు. సత్యదర్పణాలు. సుందర హృదయ కారుణ్యాలు. కార్పణ్యాలను తెగటార్చి, ఆక్రమాలకూ, అవినీతికీ తర్పణాలు సమర్పించాలని సమకట్టిన సందేశ సమర్పణలు. 'కాలంకన్ను', 'కదలిక'లతో, 'మనోజ్వాల', 'దీనత్వమా! హీనత్వమా!' అని 'అహరహం 'ఆది ఆవేదన' రగిలిస్తున్న 'ఆరాటం'తో, 'ముసుగు' తొలగించి, 'కొలిమి' రగిలించి, 'స్వేదాభిషేకం'తో 'బంధం'వేసి, 'పచ్చదనం' కోసం 'విన్నపం'తో, 'ఆంతర్యం'తో కేక వేసి, 'భావవిశ్వరూపం' ప్రదర్శించిన సత్యవోలు సుందరసాయి కవిత్వవైఖరి ఈ సంపుటి.

ఈ సంపుటి పాఠక సమాదరణ పాత్రమౌతుందని ఆకాంక్షిస్తూ, కవిమిత్రుడిని అభినందిస్తున్నా.

*2012*



# ఆశంస

## భ్రమరమ్ (కవితా సంపుటి) - గురజాడ విజయశ్రీ

"కవిత్వాలు విభిన్నాలు- గమ్యం ఒక్కటే' అనే గురజాడ విజయశ్రీ తన కవితలను సామాజిక సందేశాలతో, ప్రకృతి పట్ల ప్రేమతో సంతరించారు. ఇది ఆమె సరికొత్త సంపుటి. ముందు మాటలేమీ అక్కర్లేదు. ఆమె మాటలే ముందుకు ఉద్దేశించినవై వుంటాయి. అవినీతి రహిత సమాజం కోసం, అమలిన పర్యావరణం కోసం, మంచి కవిత కోసం, మంచి మనిషి కోసం తన ఆరాటం. 'జాతి విలువలు నిలుపుకుంటూ ఆశాకిరణాలమై, అడుగులు వేయాల' న్నది ఆమె ప్రబోధం. 'ఆశ- అనుకూల శత్రువు' అనడం తనకే చెల్లింది. ఆశ అత్యాశ కాకూడదన్న హెచ్చరికనిస్తారు. అలాగే సహజంగా స్త్రీ కాబట్టి మహిళాస్థితిగతులను గురించి, ఆడపిల్ల అస్తిత్వం గురించి ఆలోచనలు సంధించారు. కవితల్లో కొన్ని భావాలు పునరుక్తంగానూ చర్విత చర్వణంగానూ కొన్ని తావుల్లో అనిపిస్తాయి. కానీ పిల్లవాడికి తల్లి ఒక మంచి విషయాన్ని పదేపదే ఎలా చెబుతుందో అలా అనివార్యంగా గ్రహిస్తే ఇబ్బందిలేదు. మంచికవిత కోసం మథనపడుతూ తపిస్తూ నిరంతర కవితా వ్యవసాయం చేస్తున్న విజయశ్రీ పంట పండకపోదు. తన కవిత్వ సాధనమున గుర్తింపు పంటలు ఎన్నో పండాలని ఆకాంక్షిద్దాం. విజయశ్రీ కవితాక్షరాలను స్వాగతిద్దాం.

*13 నవంబర్ 2012*



# "ఆనందవర్ధనం"

## బాపూరమణా (శతకం) - అక్కిరాజు సుందరరామకృష్ణ

గీత రచనలో బాపు, గద్య రచనలో రమణ హాస్య వ్యంగ్యాలకు పెట్టింది పేరు. వారి జమలిక తెలుగువారికి హాస్యపు మెలిక. 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అని, తీసి చూపించింది కూడా వారే! ఆంధ్రదేశంలో బాపు రమణల అభిమానులు కొల్లలు.

*ఇద్దరిని కలిపి మిమ్ముల*
*నొద్దిక నౌకరే యటన్న యూహన్ తమితో*
*ముద్దుగ వ్రాసితి నివే- మీ*
*వద్దగల చనువుతోడ- బాపూ రమణా!*

అంటూ డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ వెలయించిన ఈ ద్విశతి - పద్య రచనలో వారికి సరిజోడీగా- హాస్య, వ్యంగ్యాలను, అధిక్షేపాన్నీ పండించి ప్రసిద్ధమైన తన శతక సంపుటులకు- తోడవుతున్న మరొకటి. ఈ ద్విశతి 'బాపు రమణ'లను మకుటంగా నిలిపి, తనదైన పద్య రచనా వైశిష్ట్యాన్ని చాటుకున్నాడు ఈ అక్కిరాజు. బాపు రమణలకు సన్నిహితమైన పత్రికా ప్రపంచం గురించీ, సినిమారంగం గురించీ, వాటి పోకడల గురించి మాత్రమే ఈ ద్విశతిలో కవి చిత్రించలేదు. సమాజ గతమైన పలు అంశాలను స్వీకరించి- నేటి వ్యవస్థ తీరు తెన్నులనూ, మానవ స్వభావాలనూ తన కలం పోట్లతో వ్యంగ్యంగా ఎత్తి చూపాడు. సుందర రామకృష్ణ మంచి కవి మాత్రమే కాదు. గొప్ప వ్యాఖ్యాత, రంగస్థల, సినీ

నటుడు. తను కంఠం విప్పి పద్యం చదివితే అనవద్యం అది హృద్యంగా వుంటుంది. తన భావాలను, అభిప్రాయాలను ఎలాంటి శషభిషలూ లేకుండా, ఎవ్వరేమనుకుంటారోననే వెరపు లేకుండా తన పద్యాలలో ప్రకటించే తెంపరితనమూ వుంది. వెల్లడించేది సత్యమైనప్పుడు వెరచే పని లేదనీ, స్వలాభాపేక్షల స్వార్థ చింతన లేనప్పుడు కాకాలకు, బాకాలకు తావిచ్చి, తేలికై పోనక్కర్లేదనీ తన ప్రగాఢ విశ్వాసం. తదనుగుణంగానే తన రచనా సంవిధానం వుంటుంది. అధిక్షేప శతక కర్తగా ఆధునికులలో పేర్కొనదగిన మంచి పద్యకవి ఎవరంటే నిర్ద్వంద్వంగా అక్కిరాజు సుందర రామకృష్ణ పేరు చెప్పవచ్చు. ఇప్పటికే "శనీశ్వర శతకం" వంటి తన విలక్షణ శతక రచనల్లో బాపూ రమణల హాస్య వ్యంగ్యాలను సమాదరణీయంగా అంది పుచ్చుకుని, మంచి కవిగా గుర్తింపు పొందాడు.

"బాపూ–రమణా!" అన్న ఈ ద్విశతికి ఒక నిర్దిష్ట ప్రణాళిక నేర్పరచుకుని– వారి ప్రశంస, వారి చిత్రాలు–వాటి విశిష్టత, అలాగే బాపు రమణల గీతలు, రాతలు, వారి తెలుగు తనపు వైశిష్ట్యం, సినీ, పత్రికారంగ నిమ్నోన్నతాలు మాత్రమే వస్తువుగా తీసుకుని, "కోతికొమ్మచ్చి" భిత్తికగా నిలుపుకుని ఆసాంతం ద్విశతి సాగివుంటే ఎంతో బాగుండేది. వారిని మకుటంగా నిలిపి చేసిన ఈ పుస్తకంలో కొన్ని పద్యాలు సాధారణీకరణమైనవిగా భాసిస్తూ ప్రత్యేకించి ఈ మకుటం క్రింద నిలుపవలసిన ఔచితి ఏమిటో తెలియరానివిగా వున్నాయి. ఏమయినా సుందర రామకృష్ణ పద్యాలలో వెల్లడించే భావాలు సూటిగా, దీటుగా, గొప్ప అధిక్షేప వైభవంతో భాసిస్తూంటాయి. గుమ్మడికాయ దొంగలు భుజాలు తడుముకున్నా రామకృష్ణ నిర్భీతి ప్రకటనకు భుజం చరచక తప్పదు..

ఇంతవరకూ బాపు రమణకు పద్మ అవార్డులవంటివేవీ రాలేదు. బాపు తెలుగు లిపికే కొత్త సొబగులద్దినవాడు. కానీ భాషా సాహిత్యాలకు వారు చేసిన సేవలు ప్రభుత్వం గుర్తింపుకు రానే లేదు. రమణగారు వెళ్ళిపోయారు. బాపుగారికి పద్మభూషణ్ ఇవ్వాలని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ప్రతిపాదన పంపిందిట. ఏమయినా బాపు రమణల ఆదర్శాలకు ఇది కాలం కాదంటాడు సుందర రామకృష్ణ ఆర్తితో.

*"మీవో ఆదర్శంబులు*
*మీవో లక్ష్యాలు లేవు మేదిని నిపుడున్!*
*దైవంబు సాక్షి సర్వుల*
*భావాలవి భ్రష్టు పట్టె బాపూ రమణా!*

*చిత్రాలదీయు తరిని ప*
*విత్రత, ధేయంబు కానిపించెను మీలో!*
*మిత్రులు మీరలు ప్రస్తుతి*
*పాత్రులె ఏనాటికేని బాపూ రమణా!"*

*"గొట్టంగాళ్ళిచ్చెడి, ఆ*
*పట్టాలును బిరుదులున్న పత్రాల్ (సి) గిత్రాల్*
*కట్టా వ్యర్థమ్ములు – ఎ*
*ప్పట్టున చూచినను మీకు బాపూ రమణా!"*

అంటూ నేటి విలువల పతనాన్ని, మనుషుల్లోని స్వార్థ చింతననూ, మందు, బందుల చిందులను, కొందరు వ్యక్తుల విపరీతపు పోకడలను, నడవడికలను ఈ పద్యాలలో ఆ ఆదర్శమూర్తులకు కవి విన్నవించుకున్నాడు. తన గురించి తాను చెప్పుకుంటూనే తనకు నచ్చిన విలువలను అభిరుచులను నిర్ధారించి చెప్పాడు.

*"కలమనగా శ్రీశ్రీ*
*గళమనగా ఘంటసాలగారిది యొకటే*
*కళయనగా 'రవి వర్మదె'*
*బలమనగా 'వజ్రి' దౌర బాపూ రమణా!*

*'పేషీ'యన సి.యం.దే*
*వేషాలన రాజకీయవేత్తలవేలే*
*రోషంబన 'సత్య'దియే*
*భాషన మన తెలుగె నిజము బాపూ రమణా!"*

అంటూ క్రొత్తపాతల మేలు కలయికల క్రొమ్మెరుంగులు చిమ్మాడు.

*"సరదాగ ప్రాసకోసము*
*మరిమరి యత్నించి యిట్లు మక్కున మీరన్*
*ఇరికించితి నిటు పదముల*
*బరువును తెగమోపి నేను బాపూ రమణా!"*

అని నివేదించుకున్నాడు గానీ, ఇవి ఛందోగణాదులు కూర్చుకుని, పేర్చుకుని యత్నించి ఇరికించిన భావాలు కాదు. మంచి ధారతో, చక్కని సామాజిక వీక్షణంతో, హాస్య వ్యంగ్య అధిక్షేప ధోరణి ప్రాణవత్ శక్తిగా రూపొందిన హృద్యమైన పద్యాలు. ఇటువంటి పద్యాలను అలవోకగా పలకగల దక్షత, ప్రతిభ సుందర రామకృష్ణ సొంతం. బాపూ రమణా మకుటంతో చక్కటి పద్యాలు రాసి –

*"చెప్పితి నా భావంబులు*
*ఒప్పుగ నా మదిని దాగి యున్నవి తెగువన్*
*తప్పైన నన్ క్షమించుడి*
*"పప్పా మమ్మీ"ల పగిది బాపూ రమణా!"*

*అని వినమ్రం కావడం.*

*"ఒరులను దూరుట వ్యర్థము*
*పరుషముగా పలుకుచుంటి పచ్చి నిజంబుల్!*
*అరయగ మేదిని నాకా*
*పరమాత్ముడె ప్రథమవైరి బాపూ రమణా!"*

అని ప్రకటించుకోవడం కవి మిత్రుడు అక్కిరాజు సుందర రామకృష్ణకే చెల్లింది. నిజానికి ముందు మాటలేవీ అక్కర్లేని పసందు పద్యాలు సుందర రామకృష్ణవి. హాస్య, వ్యంగ్య, అధిక్షేప రచనలో తనది రాటుదేలిన కలం. అటువంటి పోటుగాడయిన మిత్రుడు నన్ను రెండు ముక్కలు రాయమనడం తనకు నాపై గల అవ్యాజానురాగ మైత్రీ భావమే కారణం. గీతలో బాపు, గద్యలో రమణలాగా, పద్యంలో సుందర రామకృష్ణ జన హృదయవాసి కావాలని శుభాకాంక్షిస్తున్నాను.

*15 డిసెంబర్ 2012*




# ఆ పాత మధురం

## అమ్మ పాటలు - సింగరాజు నాగలక్ష్మి

మాట గొప్పది. పాట గొప్పది. పాటలోని మాట-మరీ గొప్పది. హృదయానికి పాట సోకినంత మధురంగా, ఆ పాటలోని మాట సోకినంత గాఢంగా, మరేదీ వుండదు! అందునా అమ్మపాట మరీను! ఎవరి అమ్మ అయినా, ఏ అమ్మపాటయినా-గొప్పది, తీయనిది, కలకాలం కమ్మనిది. అమ్మపాట అంటే అమ్మరాసిన పాట కాకపోవచ్చు. అమ్మ పాడిన ఏ పాటయినా, ఎవరి పాటయినా అమ్మపాటే ! అమ్మ పాడడం వల్లే పసితనం నుంచే ఆ పాటలు మన గుండెల్లోకి బాటలు వేసుకుంటాయి. మరపురాని మధురగీతాలుగా నిలచిపోతాయి. అమ్మ గొంతు నుంచి విన్న పాట ఎంతగా గుండెల్లో ముద్రితమవుతుంటుందంటే - ఆమె పాడిన పాటలు మనం పెద్దయ్యాక ఎప్పుడు విన్నా కూడా, ఆ పాట మాధుర్యంతో బాటు అమ్మ, అమ్మతనం గుర్తుకొస్తాయి.

ఇప్పటి అమ్మల సంగతేమోగానీ, ఒకప్పటి అమ్మలు పాటల పట్టుగొమ్మలు. పరంపరాగతంగా వారు సంక్రమింప చేసుకున్న సాహిత్య సాంస్కృతిక పరీమళం పరివ్యాప్తం చేయడంలో వారు తమ పిల్లలకూ ఆ సుగంధాన్ని హృదయదఘ్నంగా అలదేవారు. మేలుకొల్పుల నుంచి జోలపాటల వరకూ అమ్మలు నిత్యం పనిపాటలతో జమిలికగా సంచరించేవారే ! అందునా ఆ రోజుల్లో ఇంట్లోనే వుంటూ ఇంటిల్లి పాదికీ విజ్ఞాన వినోద వికాసాలందించే ఏకైక సాధనంగా రేడియోనే వుండేది. ఇంట్లో రేడియో లేకున్నా, రేడియో వున్న ఇంటికి పిల్లలు వెళ్లి వినడమో ఇంట్లో రేడియోలాంటి అమ్మ పాటలతోనే ఎదగడమో జరిగేది.

ఆరోజుల్లో సినిమా పాటల పుస్తకాలు వచ్చేవి. కానీ రేడియోలో వచ్చేవి సినిమా పాటలే కాదు. దేశభక్తి గీతాలు, లలిత గీతాలు, భక్తి గీతాలు. వాటికవే సాటి. మరి వాటికి పుస్తకాలేవీ ? అంచేత వింటూ వింటూనే పుస్తకంలో రాసుకునే అలవాటుండేది చాలామందికి. ఆ తరువాత పుస్తకం చూస్తూ హాయిగా వాటిని పాడుకునేవారు. తాము హాయిగా పాడుకుంటూ ఆనందించడమే కాదు, తమ పాటలతో నలుగురినీ ఆనందింప చేసేవారు. ఇష్టపడితే ఇష్టంగా వారికీ నేర్పించేవారు.

నిజంగా అమ్మపాటలు వింటూ పెరిగి పెద్దయినా అది పదిలపరచు కోవలసిన గొప్ప సంపద అన్న భావన ఎందరికి వుంటుంది? సునాయాసంగా పాడుకున్న పాటలే అయినా, ఆ అక్షరసంపదను భద్రపరుచుకోవడం ఎందరికి సాధ్యమవుతుంది? శ్రీమతి సింగరాజు నాగలక్ష్మిగారు ఈ విషయంలో ఒక విలక్షణ సంస్కార సాహిత్యాభిలాషిగా తమ 'అమ్మ పాటలు' సంకలించే సత్సంకల్పం చేశారు. ఈ సంకల్ప సంస్కార హేతువూ వారి తల్లిగారేనని చెప్పాలి. నాగలక్ష్మిగారు తన బాల్యంలో అమ్మ, అప్ప (తండ్రి) పాడిన పాటలను వింటూ పెరిగారు. ఆమే కాదు, ఆమెతో బాటు మొత్తం ఏడుగురు సంతానం కూడాను. మేనమామ పిల్లలు, పినతల్లి పిల్లలతో బాటు ఇల్లంతా నందగోకులంలా వుండేదని మురుస్తూ చెప్పే నాగలక్ష్మిగారు రేడియోలో పిల్లల కార్యక్రమాల్లో పాల్గొన్న మధురస్మృతులను పేర్కొంటూ అమ్మ నేర్పిన పాటలు, అవి భద్రపరచుకోదగిన సంపద అన్న జ్ఞానం తమ మరదలు 'వాణి' కలిగించిందనీ, తదాదిగా ఆనాటి పాటలను తమ పదవీ విరమణ అనంతరం తల్లి దగ్గరే కూర్చుని రాసుకుని, తమ అమ్మే కాదు అలనాటి అమ్మలందరూ పాడినవే అన్నంత ప్రసిద్ధమైన నూట పదహారు పాటలను ఈ 'సంకలనం'గా కూర్చారు.

పాటల రచయితల పేర్లు లభించినంతమేరకు ఉటంకిస్తూ, వైవిధ్యంతో కూడిన ఈ 116 పాటలనూ 'అమ్మపాటలు'గా గ్రంథస్తం చేయడం ఎంతయినా అభినందించ దగిన విషయం. భక్తిగీతాలు, దేశభక్తిగీతాలు, లలితగీతాలు, స్త్రీల పాటలు, పిల్లల పాటలు ఇలా ఈ సంకలనంలో గొప్ప వైవిధ్యం వుంది. ఈ పాటలన్నీ ఒకనాడు ఇంటింటా ఎందరినో అలరించినవే. ఆకాశవాణి ద్వారా ఎందరెందరో శ్రోతలను ఆకట్టుకున్న ప్రసిద్ధ గీతాలు ఇందులో వున్నాయి. రాట్నం పాట, నమో హిందుమాతా, జయ జయ జయ ప్రియభారత జననీ –

స్వాతంత్ర్యదీప్తిని ఉద్దీపింపచేసే పాటల్లోనివి  కాగా, వరలక్ష్మిపై, కాత్యాయనిపై, కృష్ణునిపై, శివునిపై వివిధ దేవీదేవతల స్తుతిగీతాలు కాగా, బువ్వ బంతిపాట, దీవెననడుగులు, ఏకాదశి వ్రతం వంటి విలక్షణ ప్రశస్త గీతాలూ ఇందులో వున్నాయి. గురజాడ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, కొనకళ్ళ, చింతా దీక్షితులు, వేలూరి సహజానంద వంటి సాహితీ మూర్తుల రచనలున్నాయి. రచయిత లెవ్వరో తెలియకపోయినా రసప్రపూర్ణమైన గీతాలకు కొదవే లేదు.

ఏమయినా సింగరాజు నాగలక్ష్మి గారి ఈ సంకల్పం గొప్పది. ఈతరం అమ్మలు వీటిని అందిపుచ్చుకుని తమ పిల్లలకు అందించే ప్రయత్నం చేస్తే అంతకు మించిన తెలుగు భాషా సేవ మరొకటి లేదేమో ! నిజానికి నాగలక్ష్మి గారిలాగా 'అమ్మ పాటలు' ఒకచోట చేర్చి కూర్చే ప్రయత్నం ఇంటింటా ఓ బృహత్‌యజ్ఞంగా సాగితే అందువల్ల లభించే అక్షరాల లంకెబిందెలు నిజంగా అపార ఘననిధులే కాగలుగుతాయి. నాగలక్ష్మిగారు ఇలాంటి సంకలనాలు మరిన్ని వెలువరించే ప్రజ్ఞ గలవారని నాకు తెలుసు. అందుకు తగిన సమాదరణ అన్నివైపుల నుండి వారికి అందాలని ఆకాంక్షిస్తూ, గడచిపోయిన బంగారుకాలాన్ని ఈ పాటల తోటలో విహరింపచేస్తూ మళ్లీ స్మృతిపథంలోకి తెచ్చినందుకు సంతోషంతో అభినందిస్తున్నాను.

*25 ఫిబ్రవరి 2013*



# రజనీకర చింతనాగీతిక

## ధమ్మ పదం (బౌద్ధ గీతాలు)
## - డాక్టర్ వూసల రజనీ గంగాధర్

**బు**ద్ధుడు చెప్పిన ఉపన్యాస సంహిత- 'సుత్తపిటక'. మహాయానానికి ముందర, తరువాత కూడా ఈ కూర్పు జరిగింది. మొదట మౌఖికంగా చెప్పబడిన వాటిని 'ఆగమా'లని, 'నికాయా'లని అనడం ఉంది. సంఖ్యాపరంగా ఈ విడివిడి సూత్రాలు అయిదువేలకు పైచిలుకే. 'సుత్తపిటక'లోని అయిదో నికాయమైన 'ఖుద్దక నికాయం'లోని రెండో గ్రంథం 'ధమ్మపదం'. ఇది బౌద్ధ దేశాలలోనే కాక, అనేక దేశాలలో బహుళ ప్రాచుర్యం పొందినదే. బుద్ధుని బోధలసారం మొత్తం- 'ధమ్మపదం'లో వుంది. ఇందులో ఇరవై ఆరువర్గాలలోకి, నాలుగువందల ఇరవైమూడు పద్యాలు విషయాన్ని అనుసరించి విభాజితమయ్యాయనీ, కేవలం ఆధ్యాత్మిక ప్రగతికే కాక' దైనందిన జీవితాన్ని ఎలా గడపాలో కూడా చెబుతాయనీ గుర్తించబడ్డాయి. 'ధమ్మపదం' ప్రధానంగా శాంతిమార్గాన్ని, అహింసావిధానాన్ని చెబుతుంది. "ద్వేషం ద్వేషాన్ని జయించదు. మైత్రి మాత్రమే జయిస్తుంది" అని బోధిస్తుంది. సాహిత్యపరంగా కూడా "ధమ్మపదం" ఉన్నత శిఖరాలలో గుర్తించబడింది. "ధమ్మపదం" 'థేరవాద' పరంగా, 'మహాయాన' పరంగా రెండు రకాలుగా ఉంది. 'థేరవాద ధమ్మపదం' క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దంలోనే రచింపబడింది. 'ఖుద్దక నికాయం'లోని పదిహేను గ్రంథాలలో ఒకటి. దీనికి ప్రపంచ భాషలలో అనేక అనువాదాలు వచ్చాయి. ఇంగ్లీషులో ముప్పైకిపైగా,

తెలుగులో పదహారు వరకూ అనువాదాలు వచ్చాయి. 'మహాయాన బౌద్ధ ధమ్మపదం' రెండు భాగాలుగా ముప్ఫైతొమ్మిది ప్రకరణాలలో, నీతి బోధల సంపుటిగా కానవస్తోంది. సమాధి, ప్రజ్ఞల ద్వారా స్థిరీకృతము, బలోపేతమైన సద్వర్తనను ఇది నొక్కి చెబుతుంది. "థేరవాదం"లో వ్యక్తి ప్రత్యేకంగా బోధిని పొందే యత్నం చేస్తాడు. అది కష్టతరమైంది. 'మహాయానం'– థేరవాదంలో వ్యక్తిపడే కష్టం అనవసరం అంటూ, మామూలు గృహస్తులకు, భిక్షులకూ అందరికీ ఒకేవిధంగా ఉపయుక్తమయ్యేలాగా బుద్ధుని దర్శనాన్నీ, బౌద్ధాన్ని చెబుతుంది. థేరవాదానికీ మహాయానానికి గల ప్రధాన భేదాన్ని ఉపాసక అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (గతంలో 'మిసిమి' పత్రిక సంపాదకులు) చక్కగా వివరించారు. థేరవాదం ప్రకారం మనిషి ప్రత్యేక వ్యక్తి. విశ్వంలో తనమీద తాను ఆధారపడి స్వప్రయత్నంతో ముక్తిపొందుతాడు. 'ప్రజ్ఞ' ముఖ్య సుగుణంగా, ఇరవై నాలుగు గంటలూ ధర్మంతో, 'అరహత్' ఆదర్శంతో ఉంటుంది. బుద్ధుడు ఒక ఋషిగా 'థేరవాదం' పేర్కొంటూ– కర్మకాండలు ఒల్లక, ఆధిభౌతికత ఒప్పక, మితవాదంతో ఉంటుంది.

'మహాయాన ధమ్మపదం' మనిషి ఇతరులతో కలిసి ఉండటాన్ని, అతడు ఏకాంతుడు కాడు అని, అతడు చేసే పనుల ఆధారంగా, బోధిసత్త్వుల దయ ఆధారంగా, అంటే గురుకృపతోనూ నిర్వాణం కలుగుతుంది అనిచెబుతుంది. కరుణ, అనుకంప ముఖ్య సుగుణాలు. మతం, ధర్మం ఐహిక జీవితం మేరకే. బోధిసత్త్వుడే ఆదర్శం. బుద్ధుడు ఒక రక్షకుడు. కర్మకాండలు, ప్రార్థనలు ఉంటాయి. ఆధిభౌతికత ఉంటుంది. దీనిది ఉదారవాదం. ఇదీ మహాయానన్తైనం.

'ధమ్మపదం' బౌద్ధగీతాలుగా సంతరిస్తున్న సాహిత్యశ్రీ కవిరత్న వూసల రజనీ గంగాధర్‌గారు మౌలికమైన 'థేరవాదం'లోని అంశాలను అంది పుచ్చుకుంటూనే, నీతిబోధల సంపుటిగా మహాయాన సమన్వయం కొంత ఈ గీతాలలో చేసి ఒక విలక్షణతను ప్రదర్శించారు. ఈ గీతాలను రజనీ గంగాధర్ ముప్ఫైనాలుగు వర్గాలుగా (ప్రస్థాన వర్గంలోని అష్టాంగమార్గం వంటి ఎనిమిది గీతాలతో సహా) అందిస్తున్నారు. రాగయుక్తంగా ఆలపించుకునేలా 'ధమ్మపదం' అంశాలను (సం) గీతమయం చేస్తున్నారు. ఈ గీతాలన్నింటిలోనూ వ్యక్తి చేసే పాపపుణ్యాలే సుఖదుఃఖహేతువులనీ, ధార్మిక చింతన, సత్యవాదమే సత్యలోకానికి

నిత్యమార్గాలనీ, కామక్రోధాది అరిషడ్వర్గాలను విడనాడి– ముఖ్యంగా కోరికలను అదుపులో ఉంచుకుని, విషయలౌల్యంలో పడక, శ్రద్ధ, చిత్తశుద్ధి కలిగి, సత్ప్రవర్తనతో, శ్రమణత్వంతో నిర్వాణానికి సోపానం వేసుకోవాలని ప్రబోధిస్తారు కవి.

*'ధ్యానమన్నదే మిన్న అన్నిట– జ్ఞానమెరిగి సుజ్ఞానివి కమ్ము'*

అన్న విషయాన్నే ప్రపంచిస్తారు. గౌతమబుద్ధుని బోధనలెరిగిన

బాధలుండవనీ, పునరపిజననం పునరపిమరణం అనేది మరుగైపోతుందనీ చెప్పారు.

ఇందులో కర్మకాండల నిరసనకనబడుతుంది–

*"యజ్ఞయాగాదులు– బలులు నైవేద్యములు*
*దైవప్రీతములనుచు భ్రమసి*
*మూగజీవుల కుత్తుక కఱకు కత్తులగోసి*
*రక్కసిగ చరియించి నావె*
*నీవు– భూతదయనే మరచినావే"*

*"వ్యర్థమైన యజ్ఞమ్ములు వేలువందలేలరా*
*సత్యమైన హింసలేని కరుణొక్కటిచాలురా"*

*"మహిమలేని మంత్రము మరినడవరాని యంత్రము*
*మంచితనము లేని మనసే మలినము, మాయని మలినము"*

*"కాషాయమునే కట్టినంతనె*
*కల్మషమ్ములు పోవునా*
*నిగ్రహము లేనట్టి విగ్రహ*
*పూజలే వ్యర్థమ్మురా"*

*"సాలెపురుగు తన గూడుచిక్కిన చందము*
*విషయలోలుని స్వీయకృత్యములె బంధము*
*వాంఛల విడిచి ధ్యానించుటయే అందము*
*వైరాగ్యమునే చేకొనుటే ఆనందము"*

అంటూ పూజలు, కర్మకాండలు మొదలైనవాటిని రోసి–

**"ధ్యానమ్మునందునే జ్ఞానమ్ము పొందేవు**
**జ్ఞానమ్ము చేతనే స్థిరచిత్తుడౌతావు**
**స్థిరచిత్తముంటేనే కృతకృత్యుడౌతావు**
**నీ కృత్యములె నీకు ముక్తి మార్గము జూపు"**

అన్న ప్రబోధాన్ని ముందుకు తెచ్చారు. అలతి అలతి పదాలతోనే రజనీ గంగాధర్ ఈ గీతాలను – రాగరంజితమే కాదు, రసభరితమూ చేసారు. మహాయాన సూత్రసంహిత అనేది, ప్రాథమిక థేరవాద సూత్ర ఆగమసంహితకు కొనసాగింపేననీ, ప్రాచీన మౌఖిక సంప్రదాయంలో ఖండాలుగా లభిస్తున్న జ్ఞానానికి – మహాయానులు కొంత కలిపి కూర్చి వుండడమే కాక, తమదైన నూతన భావనలను వాటిల్లోకి చొప్పించడమూ జరిగిందనీ అంటారు.

ఇంతకూ గమనించవలసిన అసలు విషయం ఒకటుంది. 'బుద్ధుడు' అనేది ఒక వ్యక్తిపేరు కాదు. బౌద్ధమత జీవితలక్ష్యం సాధించినవారినీ, జ్ఞానోదయం అయిన వారినీ మాత్రమే బుద్ధులంటారు. థేరవాదం ప్రకారం 'బుద్ధుడు' ఒక మామూలు మనిషి. కాకపోతే ఆధ్యాత్మికంగా పరివర్తితమైనవాడు. మహాయానం ప్రకారం బుద్ధ భావన అనేక రూపాలు దాల్చింది. త్రికాయాలననుసరించి– బుద్ధుడు విశ్వజీవి. మాటిమాటికి మానవ రూపం ఎత్తుతాడు. అన్ని రకాల బౌద్ధ శాఖల వారూ గతంలో అనేకమంది బుద్ధులున్నారనీ, అలాగే భావిలోఉంటారనీ నమ్ముతారు. 'మహాపదాన సుత్త' ఆరుగురు గత బుద్ధులను చెబితే, 'బుద్ధవంశ' 24 మంది బుద్ధులను పేర్కొంది. వీరందరి చరిత్రలు ఒకే విధం! ఒక్కోయుగంలో ఒక్క బుద్ధుడే. మన యుగంలో చారిత్రక బుద్ధుడు– సిద్ధార్థ గౌతముడు. 'శాక్య' అనేది బుద్ధుడు జన్మించిన తెగ. బుద్ధుడు ఆ తెగకు చెందిన వాడు కనుకనే– 'శాక్యముని' అయ్యాడు. శాక్యముని, అమితాభ, భైషజ్యగురు, వైరోచనలు ప్రధాన బుద్ధులుగా బౌద్ధ విజ్ఞాన సర్వస్వంలో కానవస్తున్నారు.

**"చండాశోకుని బండ గుండెనే కరిగించిన**
**యా శాక్య సింహుని వాక్యబాణము**
**అధర్మకులనే ధమ్మ పథమ్మున నడిపించిన**
**యా గౌతమ బుద్ధుని బోధనామృతము**

**వేదాంతమునకు నతీతంబురా**

**వేల్పుల మహిమనే ధిక్కరించురా"**

అంటూ శ్రీ వూసల రజనీగంగాధర్ అందుకే-

**"తథాగతుని యథా మార్గమున సదా చరించు.**

**వ్యథాభరితమౌ క్షుధా జగత్తును నిరాదరించు- త్యజియించు."**

అని పల్లవించారు. కొన్ని భావాలు పునరుక్తంగా ఈ గీతికలలో కనిపించినా, వినిపించినా, ఒక యథార్థ సత్యం గుండెల్లో పదిలంగా నాటుకోడానికి, పదేపదే చెప్పడం ఔచితీమంతమే! అని అంగీకరించక తప్పదు.

**"ఆత్మ సర్వదోషంబులకు**
**తానె కర్తయగుటయె నిజము**
**పాపమైన పుణ్యమైన**
**ఆత్మకృతమే దిద్దుకొనుము"**

అంటూ- మనసుకు కాదు, ఆత్మకే శుద్ధి అంటుందీ 'ధమ్మపదం'. సమసమాజానికి సమాధాన పరచగల గీతికలివి. రజనికి నా అభినందనలు.

*ఆగస్టు 2013*




# ఆంక్షలులేని ఆకాంక్షలు

## ఆకసాన్ని మింగాలని (కవితా సంపుటి) – కేతవరపు రాజ్యశ్రీ

**అ**ప్పుడెప్పుడో బాల హనుమంతుడు సూర్యబింబాన్ని చూసి 'ఎర్రటి పండు' అనుకుని మింగబోయాడట. కేతవరపు రాజ్యశ్రీ 'ఆకసాన్ని మింగాలని" వెలువరిస్తున్న ఈ కవిత్వాభిలాష అలానే ముచ్చటేస్తూంది. స్త్రీ 'ఆకాశంలో సగం' అన్నారు. కానీ రాజ్యశ్రీ 'ఆసాంతం' కావాలని అభిలషిస్తున్నది. అకారాది క్రమంలో అచ్చులతో 'అమ్మ' గురించి చెప్పడమనే పిల్లలకు నచ్చే ప్రాథమికత నుంచి, 'ఎక్కడో వున్నావనుకున్నా' అంటూ మంచి చెడుల హెచ్చరిక చేస్తూ – అంతరంగాల్లోనే వున్న దైవభావన అన్వేషణా స్థాయివరకూ సుమారు యాభై ఖండికల ఈ సంపుటిలో నిరలంకార శోభితంగా కవితాత్మను వాచ్యం చేసిన సూటిదనం, తేటదనం గోచరమవుతాయి.

***"సాహిత్యమంటే***
***అక్షర సముదాయం కాదు***
***....***
***మాటలోని శబ్దాన్ని***
***మౌనంలోని భావాన్ని***
***పాటలోని హాయినీ***
***పరువంలోని వయ్యారాన్నీ***
***కమనీయంగా దర్శింపచేస్తుంది"***

అంటారు 'సాహిత్యమంటే' అనేఖండికలో. ఎంత నిజం!

‘చీకటిని ఊడ్చిన సూరీడు’ అన్న కవిత మునుపే రాసిందయినా, ఆ శీర్షిక ఇప్పటి ఢిల్లీలో ‘చీపురు’ గుర్తుతో ఎన్నికల రణరంగంలో కేతనం ఎగరేసిన ‘ఆమ్ ఆద్మీ’ కి సూచికగా ధ్వనిస్తుంది కేతవరపు భావనలో. “చీకటిని ఊడ్చి లేకిరణాలతో ముగ్గులువేసిన” సామాన్యుడే–నేటి ఎర్రసూరీడు అనాలేమో!

***“తమకేది కావాలో***
***స్పష్టమైన అవగాహనతో***
***నచ్చినరీతిలో***
***జీవితం గడుపుతున్న నేటి తరాన్ని చూస్తే”***

పదవీవిరమణ చేసిన ఈమె “ఇప్పటికయినా మించిపోయింది లేదు – నీ కిష్టమైన రీతిలో – అర్థవంతంగా జీవించడం మొదలుపెట్టు” అన్న అంతరాత్మ రొదతో జీవితాన్ని ఆస్వాదించడం మొదలు పెట్టేందుకు వయసును పరుగులు తీయవద్దని అభ్యర్థిస్తోంది. కానీ కాలం ఆగదు కదా!

***“తమకేదో తక్కువైందని***
***ఏదోలేదని బాధపడేవారు***
***ఏమిలేని నిర్భాగ్య జీవితాలనుంచి***
***స్ఫూర్తి తెచ్చుకోవాలి***
***ఉన్నదానితో తృప్తిపడటం నేర్చుకోవాలి***
***నలుగురితో పంచుకోవడం***
***అలవరుచుకోవాలి”***

అంటూ– అప్పుడే ‘ఆనందం మన సొంతం’ అని అభివ్యక్తీకరించడం ఎంతైనా సంతోషదాయకం. గురుజాడ గురించీ, తెలుగు భాష గురించీ, ఉగాది గురించీ, మిత్రురాలు రమ గురించీ, దామోదరం సంజీవయ్య గురించీ, టంగుటూరి ప్రకాశం గురించీ, దీపావళి గురించీ, అల్లుడు శ్రీకాంత్ గురించి – ఇలా వైవిధ్య భరితమైన భావాలకు ఈ వచన కవితల్లో ప్రోదు కల్పించారు కే.రా.

నేటి నిజం, సాహితీ కిరణం, సాహిత్య ప్రవంతి, మూసీ, విశ్వరచన, సాహిత్య ప్రస్థానం, ఆదర్శవాణి వంటి పత్రికలలో ఇందులోని పలు రచనలు మునుపు అచ్చు పురుడు పోసుకున్నవే. ‘పంచుకోవడంలోని సౌఖ్యం’, ఎంతో, ‘ప్రజాస్వామ్యాన్ని నడిపించేది’ ఏమిటో, ఆమెకు తెలుసు. మానవీయత కోసం,

‘ఆమె పలవరింపు’ అని అర్థం అవుతూనే వుంటుంది. ఈ అక్షరాలబార్ల వెంట కనులు పరుగులు తీసినప్పుడు – ఎలాంటి అనవసరపు ‘సాము’లు చేయకుండా ‘నేల’ పై నిలచి భావాభివ్యక్తం చేయడమే కవిత్వం అని ఈ సంపుటి చూశాక, “అర్థం మార్చాల్సి వస్తుందేమో!”. ఏమయినా కవితా రాజ్యశ్రీ ఆకాశం మరింత ఎత్తుగా, మహోన్నతంగా విస్తరించాలని నా ప్రగాఢ శుభాకాంక్షలు. ఈ సంపుటిలోనివన్నీ ఆ సహృదయశీలి ఆంక్షలు లేని ఆకాంక్షలు. సాదరంగా స్వాగతించడం ఇక మీ పాలు.

*18 డిసెంబర్ 2013*




# మానస చంద్రికలు

## అర్ధార్థ చంద్రికలు (కవితా సంపుటి) - రఘుశ్రీ

లఘుకవితా రూపాలు ఏర్పడ్డాక ఎందరికో కవితాభివ్యక్తి సౌలభ్యం ఏర్పడింది. తమ భావాలను అక్షరాలలో, కుంచితపాదాలలో ప్రకటించుకుని - 'కవిత్వమొక తీరనిదాహం' కాదని తృప్తి చెందుతున్నారు. కవులుగా రూపొందడానికి ఈ తరానికి అంది వచ్చిన నానీలు, హైకూలు, రెక్కలు, చుక్కలు, వ్యంజకాలు వంటివన్నీ కూడా ఇవాళ చెలామణిలో వున్నాయి. ఒకప్పుడు వెలుగు వెలిగి కలం ముడిచిన విశ్రాంత రచయితలకు కూడా - నూతనోత్సాహాన్నీ, ఉత్తేజాన్నీ ఈ సౌలభ్య ప్రక్రియలు అందించగలుగుతున్నాయి.

'ఏది కవిత్వం?' అంటే సూత్రీకరించే కొలబద్దలు విమర్శకులు ఎవరేవి చెప్పినా, ఎన్ని చెప్పినా, పఠిత హృదయాహ్లాదమే మూలకందం! పాఠకులు నచ్చేది, మెచ్చేది వారికి ఆనందాన్ని, ఆలోచననూ కలిగించేది ముఖ్యం.

'రఘుశ్రీ' సాహిత్య ప్రపంచానికి కొత్తవాడు కాదు. యౌవన ప్రాదుర్భావ కాలం నుండి కలం కదిపినవాడే! ఆ రోజుల్లో మేమంతా కలసిమెలసి సాగించిన సాహితీయాత్ర చిరస్మరణీయమే. ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి రచయితల సంఘానికి వ్యవస్థాపక నిర్వాహకుడుగా కూడా పని చేసాడు. తాను స్వయంగా 'మానస ఆర్ట్ థియేటర్స్' సంస్థను నెలకొల్పి, నేటికీ కార్యకర్తగా సాహిత్యరంగంలో సుప్రసిద్ధమైన కృషి చేస్తున్నాడు. రఘుశ్రీ కవిగానూ విలక్షణుడు. తనకు హాస్య, వ్యంగ్య, చమత్కారాలంటే ఇష్టం. ఆరోజుల్లో 'ఏనుగుకు పురుడు' అంటూ తానొక

కవిత రాయడం నాకు గుర్తుంది. కేవలం సాహితీసంస్థ నిర్వాహకునిగా – కార్యకర్తృత్వంతో సరి పుచ్చుకోక, కావ్య కర్తృత్వమూ సాగించమని తన హితులు, సన్నిహితులు, స్నేహితులు అయిన మేమంతా అడుగుతూనే ఉండడం తనకు తెలుసు.

సమకాలీన చైతన్యంతో సమస్కంధంగా నడవడం తనకు ఇష్టం. పదిమంది కోసం శ్రమించడం, గొప్ప సేవా భావం, తన లక్షణాలు. చిడిముడిపాటుతో కాక, చిరునవ్వుతో నలుగురినీ ఆకట్టుకు సాగే నైజం తనది. చెప్పానుగా! – చమత్కారం, హాస్యం అంటే ఎక్కువ ఇష్టం. నిజానికి వాటిని సామాజిక చైతన్యంతో రంగరించి పలకడం సామాన్యమైన సంగతేమీ కాదు. 'అర్థార్థ చంద్రికలు' అంటూ ఓ యాభై హైకూలు, ఓ యాభై రెక్కలు కలిపి అర్థవంతమైన సంకలనం చేస్తున్న 'రఘుశ్రీ' ఈ లఘు కవిత్వంతో 'లఘుశ్రీ' ఏమీ కాదు. మంచి గురుశ్రీయే!

తను వీటిల్లో వెల్లడించిన భావాలు అనేకం పరితలకు గిలిగింతలు పెడతాయి. చమత్కారార్థ స్ఫూర్తితో భాసిస్తూ అలరిస్తాయి. అతిసామాన్యమైన వాటిని కూడా అతను పండించి ప్రకటించే తీరు నిజంగా శ్లాఘనీయం.

*"కపాలమోక్షం*
*జరిగితేనే 'ఫలం'*
*పల్లీకాయకి*

*పనసపండు*
*కాన్పుకి తప్పదు*
*సిజేరియన్*

*పావురాయికి*
*నాలుగురెట్లెక్కువ*
*కిలోరాయి"*

అనడంలోని 'వాస్తవికతా చమత్కారం' గుర్తించుతాం! అలాగే మంచి విమర్శక చమత్కారమూ వెల్లడించాడు ఇలా–

*"పాదాలనేకం*
*నేటి సాహిత్యంలో*
*నడకలేవీ?"*

– ఇది నిజంగా ఆలోచనామృతం కాదూ!

వార్తా విషయక సంఘటనలని కూడా చమత్కారభరితం చేయడంలోనూ సిద్ధహస్తుడే! పుట్టపర్తి సాయిబాబా అంతిమదినాల సమయంలో రాసింది. కానీ భక్తి భావం చెడనీయలేదు.

***"దేవుని ప్రాణం***
***వెంటిలేటర్లలో ఉంది***
***పుట్టపర్తే సాక్ష్యం."***

'వాననీటిలో కాగితం పడవలు నా కవితలు' అని తన కవిత్వాన్ని తాను నిర్వచించుకున్నాడు. అది బాల్యచాపల్యం కాదు. గొప్ప పసి(డి) హృదయానందం. కాగితంతో పడవ చేయడం అందరికీ చేతకాదు. చేసిన ఆ పడవను వాననీటిలో విడిచి, సొగసుగా ప్రయాణింప చేయడంలోని 'హృదయాహ్లాదం' ఎవరు విలువ కట్టగలరు?

***"తైలం లేకున్నా***
***వెలుగులు నింపేది***
***జ్ఞానదీపం"***

అనడంలో – ఎంత గంభీర విజ్ఞానాన్ని నింపాడు! 'తైలం' అన్న ఎత్తుగడలో తనదైన చమత్కారాన్ని మాత్రం వదులుకోలేదు చూసారా!

అలాగే రెక్కలు విచ్చుకోవడంలోనూ రఘుశ్రీ తనదైన 'సుగమ' భావప్రకటన 'బాబు'లా చేసాడు! నిజానికి ఈ రెక్కలులో రఘుశ్రీ చాలా గంభీరమైన, లోతయిన అర్థాభివ్యక్తి కావించాడు కొన్ని ఖండికల్లో.

***"నృత్యకారిణి***
***కాళ్ళట్టుకుని***
***నాట్యమాడింది***
***మువ్వ –***
***నటరాజుకి***
***పాదపూజ***

***ఊహల ఊయలకు కట్టిన***
***బ్రహ్మముడి కవిత్వం***
***వేసేది కవి***
***విప్పేది మది"***

అని ఎంత చక్కగా అన్నాడు.

*"జోలపాట*
*సుప్రభాతం*
*నిద్రపుచ్చి*
*మేల్కొలిపేవి -*
*అమ్మా!*
*నీ రూపాలెన్నో"*

అనడంలోని 'హృదయస్పర్శి' గొప్పది మరి.

*"మాట ముల్లయి*
*గుచ్చుకున్న వేళ*
*మనసుకి*
*మహాగాయం-*
*ముందస్తు ఔషధం*
*పరస్పర మౌనం"*

అంటూ – 'మౌనం' ఎలా మందులా పని చేస్తుందో, సమస్యా పరిష్కారానికి దోహదమౌతుందో వివరించాడు.

ఈ 'రెక్కలు'లోనూ తనదైన హాస్య చమత్కారాలను వదులుకోలేదు రఘుశ్రీ–

*"అలారం పెట్టుకోకున్నా*
*కొక్కొరొకో*
*నిద్రలేచాడు*
*మా బామ్మర్ది–*
*రాత్రి కోడికూర*
*తిన్నాడు మరి*

*జేబులో*
*పైసా లేదు*
*షాపులో*
*బేరాలా*
*అక్కడ ఏ.సి. వుంది మరి"*

"మా ఆవిడకు నేనంటే చెప్పలేని ప్రేమ. అంతా చెప్పుచేతుల్లోనే"– ఇలా అక్షరాలతో కార్టూన్లు గీసాడు.

*"ప్రకృతి*
*ప్రత్యయాల*
*వ్యాకరణం*
*శబ్దం-*
*ఓంకారం*
*శ్రవణ వేదం"*

అన్నాడంటే - ఈ హాస్య చమత్కార భావుకునిలోని 'తాత్త్వికతనూ' గుర్తించగలం! ఇలా ఉటంకించుకుంటూపోతే పుస్తకం రెండుసార్లు అచ్చేసినట్లవుతుంది.

*"కవిత్వం కోసం*
*నాది*
*అనుక్షణ*
*మరణం -*
*పునర్జన్మలో*
*అక్షరమవ్వాలని"*

అంటాడు రఘుశ్రీ, తాను ఇప్పటికీ అక్షరమైన సాహిత్య సేవ చేస్తున్నాడు.

సాహిత్య 'మానస' చోరుడుగా అందరి అభిమానాన్నీ కొల్లగొన్నాడు. నిజంగానే తాను అందరివాడు. కార్యకర్తగానే కాదు, కవిగానూ రఘుశ్రీ ఈ 'లఘుశ్రీ'లతో సహా, 'గురుశ్రీ'గా ఎదిగి రాణించాలని మనసా కోరుకుంటున్నాను.

*"రాయంచ*
*ఠీవి*
*తనలో*
*కవనంలో*
*'పద'*
*సుధామ"*

అని తన అభిమానాన్ని అందుకున్నందుకు ఆనందిస్తున్నాను. ఈ అక్షర పదవిన్యాసం రసకవితావిలాసంగా రాణకెక్కాలనీ రఘుశ్రీని అభినందిస్తున్నాను.

*ఫిబ్రవరి 2014*



# వర్చస్వి కవితావర్చస్సు

## లోకాస్సమస్తా (కవితా సంపుటి) - వర్చస్వి

'తేజశ్శాలి' అని పేరులోనే తెలుస్తోంది కదా! ఆ తేజస్సుకీ, కాంతికీ కారణం- అతని 'ఆశయదీప్తి!'. విశ్వశ్రేయస్సును ఆకాంక్షించేది కావ్యం. కవితారచనను- ఆ సదుద్దేశ్యంతో చేపట్టడమే 'భవ్యం'.'లోకాస్సమస్తా'... అన్నాడంటే 'సుఖినోభవంతు' అన్న సంకల్పాన్ని 'కాయకల్ప' చికిత్సలా, 'కావ్యకల్ప' చికిత్సకు సమకట్టడమే! వర్చస్వి వచనకవిత్వ వర్చస్సు అదే!

*సప్తవర్ణాల శోభనీ శోషించుకున్న*
*సంతృప్త మహేశ్వర కాంతినేమో?*

అని తనని తాను సందిగ్ధపరుచుకున్నా, 'ప్రజాకడలి అలజడి నన్ను ఉద్రేకంగా ఊపేస్తుంటే' మిన్నకుండడం ఎలా సాధ్యమన్నట్లుగా అభివ్యక్తమవుతున్నాడు. అతనికి 'కష్టమ్స్' తెలుసు. 'సుఖమ్స్' తెలుసు. 'సర్వీస్‌టాక్స్' కంటే ముందు చేయవలసిన చిత్తశుద్ధి తోడి 'సర్వీస్' గురించి తెలుసు. 'ఆనంద బాష్పం'గా వికసించనూ గలడు. 'బాధాపుష్పం' గా పరిమళించనూ గలడు. కుంచెనూ, కలాన్నీ కూడా సవ్యసాచిలా సంధించగలడు. సమాజహితచింతనను సంధానించనూగలడు.

*"అశాంతి మట్టి పిడతల్లో మెతుకుల్ని ముట్టి*
*పుట్టుకతోనే మట్టితో కరచాలనం చేసినోణ్ణి*
*అందుకే - భూగోళ గతుల్ని శాంతిగమకాలుగా తిప్పగల*
*స్వరచాలనం కూడా తెలిసినోణ్ణి"*

అంటున్నవాడు అనామకుడు ఎలా అవుతాడు? అమాయకుడు అనుకున్నవాడే అమేయంగా 'పీపుల్సుపల్సు' తెలిసి, 'ప్రకృతికావ్యం' 'నిత్యచైతన్యం'తో 'విద్యుదావేశం'తో వెలయించగలడు. వలపునీ, వగపునీ, హాస్యోక్తినీ, లాస్యోక్తినీ కూడా పలికించగలడు! 'వర్చస్వి' సమాజంతో మమేకమైన వాడు. 'విరామమెరుగక పరిశ్రమించే- బలం ధరిత్రికి బలికావించే' వారి గురించి వ్యక్తీకరించేవాడే- 'చిన్నవిరామం'లో దాగిన చిరంతనాగ్నిని పట్టుకో గలుగుతాడు. 'చిన్న విరామం' ఈ సంపుటిలోని ఓ మంచి కవిత

***"మద్దిమానులా సద్దు***
***చేయకున్నానంటే***
***శుద్ధ మొద్దని కాదు***
***ఎలాంటి యుద్ధానికైనా సిద్ధమవుతున్నట్లు***
***...........***
***మాటామంతీలేదంటే***
***వాక్సమాధుల్లో విశ్రమించడమని కాదు***
***నూరున్నొక్కభావాలు***
***పళ్ళు నూరుతున్నట్టు!!!"***

అంటూ – మౌనంలోని 'లావా'ని, అజ్ఞాతంలోని పదునెక్కుతున్న ఆయుధాన్ని ప్రకటించగల బలశాలి. తనది మానవవాదం...! మానవ వేదం.!! 'అమ్మ' కవితతో మొదలయ్యే 'లోకాస్సమస్తా'...లో 'మేడే అమ్మ' కూడా తల్లి గురించి తల్లడిల్లే గొప్ప ఆత్మీయకవితయే! అమ్మను పెద్ద 'కార్మికజీవి'గా అవిశ్రాంత శ్రమ నందించే 'రోబో'గా 'సమస్తపనిముట్ల రూపం'గా, 'గుర్తింపులేక మూలబడ్డ పాతతరం భోషాణం'గానే కాదు–

***"ప్రేమైక జీవనదిలా సాగే***
***పవిత్ర గంగానదీ తోయం***
***అమ్మకు ఎల్లలులేవు***
***కొలమానాలు అంతకంటేలేవు***
***అమ్మకి నిర్వచనం అమ్మే"***

అంటూ అనన్వయాలంకారంతో చెప్పాడు వర్చస్వి. అమ్మను దర్శించిన వర్చస్వి కవితా కోణం బహురోచిస్సులు వెదజల్లుతోంది.

*"నా ప్రతి కవితాలత*
*నీ మది పులకరింతగా అల్లుకోవడం చూస్తున్నా*
*సంద్రం మనకేం అడ్డుగోడ కానే కాదు*
*నీకోసం ఈ ఒడ్డున మొలచిన అల*
*ఆ ఒడ్డున నా తలపుల తల ఎత్తక మానదు"*

అని సందేశించడంలో – నువ్వాదరినీ నేనీదరినీ వున్నా– ఇద్దరినీ కలిపే ఒక బంధం ఎన్నడూ వుంటుందనే 'మానవీయ రేఖ'ను సంతరించాడు. అది తెలుగుల మధ్యా, వెలుగుల మధ్యా కూడా భాసించేదే మరి!

'రాతిరి రస్తా' వంటి కవితల్లో వర్చస్వి కవితా భావుకత ప్రయోగవైవిధ్యంతో అలరారుతోంది. "ఈ రాత్రి– రాత్రికి రాత్రే నన్ను చంపేలావుంది" అంటూ "పొగరు సిగలో తురిమిన చంద్రుణ్ణి చిదిమేసి, నన్ను నేను అగ్నిహోత్రంగా వెలిగించుకుంటాను. నిశీధి సమిధగా ఆనందపుటంచుల్లో ఆహుతినౌతాను. రాతిరి రస్తాని మళ్ళీరేపటికోసం అభిషేకిస్తాను" అనడం తనకేచెల్లింది. ఇలా తన 'కవితోత్పత్తి', 'కవితాతత్త్వం'– నిజమైన 'కవి సమయం'తో ముడివడినవే! అందుకే వర్చస్వి కవితా వర్చస్సు తనే అన్నట్లుగా–

***"ఒక్క సంకలన సంకెలతో కట్టిపడేయడానికి***
***అది గోడ పక్కన కట్టేసిన దండ కాదు***
***ఒక కావ్యంతో నీకు దాస్యమై పోయిందనడం సవ్యం కాదు–***
***కవితాజలధికి పరిధులు గీయడం భావ్యం కాదు."***

కవిత్వ అనంత తత్వాన్ని స్పృశించగలమే తప్ప, ఆమూలాగ్రంగా ఆవాహనం చేయలేమంటాడు. 'స్పృహ' కలిగిన 'సృజనశీలి'– వర్చస్వి! ప్రకృతినీ, మానవ ప్రకృతినీ కూడా గ్రహించి, ఆ పర్యావరణ వికృతులను అధిగమించి, ప్రేమైక రసపుష్పాలుగా వికసించి, మానవాళి సమస్త సుఖాలనూ, ఆనందాలనూ ఒడిసిపట్టాలన్నదే కవి ఆకాంక్ష! మనిషికోసం మనిషిగా – కవిత్వం కావాలి కవిత్వం అనే 'వర్చస్వి' ఆశయ సిద్ధికి సిద్ధమైన ఈ కవితా సంపుటికి నా హార్దిక స్వాగతం. శుభస్వాగతం. అభిరుచిగల కవితాప్రియలోక సమస్తానికి ఈ సంపుటి ఒక సుఖప్రాప్తి! అంటే విభూతేగానీ బూతు కాదు. శుభం భూయాత్!

*సెప్టెంబర్ 2014*




# రంగనాథ్ 'అంతరంగ అక్షర తరంగం'

## అక్షర సాక్ష్యం (కవితా సంపుటి) – రంగనాథ్

"Poetry is just the evidence of life. if your life is burning well, poetry is just the ash" *- LEONARD CHOHEN*

**"సా**హిత్యాన్ని మథించి పారించిన కవిత్వం కాదు నాది. భ్రష్టుపడుతున్న మానవత్వాన్ని చూసి చలించి, జ్వలించి, నా గుండె పలికే పలుకులు" అంటున్న రంగనాథ్– 'బ్రతుకు అద్దం' అయిన కవితాహృదయపు సృజనశీలి.

సమాజ ప్రతిబింబితంగా, వర్తమాన సంఘటనల తక్షణ ప్రతిస్పందనగా 'సామయిక కవిత్వం' రాసే కవులు బాగా చలామణీలో ఉంటూంటారు. ఏళ్లుగా నిరంతరాయంగా రాస్తున్నా, వారి కవిత్వం– తక్షణావసరాల ఉద్యమ ఉద్వేగంతో సాగుతూనే వుంటుంది. కానీ తాత్త్వికత పండని జీవితానుభవం– తాత్కాలిక ఉపశమనం కాగలుగుతుందేమోగానీ, వెలిగి వెలిగించే హృదయదీపం కాలేదు. భావతరంగాలు భౌతికత అంచులు దాటి విశ్వజనీనం కాగలగడమే అచ్చమైన కవిలక్షణం.

*''కవిని వెలుగులోకి తెచ్చే*
*కవిత్వం కన్నా*
*ప్రగతి పథాన్ని*
*కాంతివంతం చేసే*
*కవిత్వం నేడత్యవసరం!"*

– అంటున్నాడందుకే రంగనాథ్. తను హృదయదీపధారి మరి.

"A good poem helps to change the shape and significance of the universe, helps to extend everyone's knowledge of himself and the world around him" - ***Dylan Thomas***

కవిత్వం జీవిత ప్రతిబింబం. తనూ, తన చుట్టూ ప్రపంచం కూడా జ్ఞానవంతంగా రూపొందడానికీ, గుణాత్మకమైన గుర్తింపును సంతరించుకోవడానికీ మంచి కవిత్వం దోహదపడుతుంది. అందుకే సంపూర్ణ మానవత్వాన్ని ఆహ్వానిస్తూ, సమసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తూ, తన బాధను, భావాలను వ్యక్తపరుస్తూ సౌభ్రాతృత్వపు న్యాయస్థానంలో కవి చెప్పేదే 'అక్షరసాక్ష్యం' అంటాడు రంగనాథ్. పఠితకు కవి చెప్పే విషయాలు తన భావాలుగా, తన ఆలోచనలుగా అనిపిస్తూ- బుద్ధికీ, హృదయానికీ కూడా సహృదయానుభూతి నందించడం చూస్తాం. కవిగా అది గొప్పవిషయం. జాన్ కీట్స్ అన్నదదే కదా- "Poetry should strike the reader as a wording of his own highest thoughts, and appear almost a remembrance"

రంగనాథ్ 'అక్షరసాక్ష్యం'లో అందుకే జీవిత ప్రతిబింబితమైన అంగారం వుంది, శృంగారం వుంది. "అగ్ని జల్లినా, అమృతం కురిసినా, అందం, ఆనందం దాని పరమావధి" అని బాలగంగాధర తిలక్ కవి అన్నట్లుగా- తన అంతరంగ సంపద అయిన అనుభూతులను పంచడంలో, అల్లకల్లోలం సృష్టిస్తున్న అంశాలను వాస్తవిక దర్పణం పడుతూనే- వాటినుంచి ఒక తాత్త్విక ఆత్మసౌందర్యాలంకరణను సమాయత్తం చేయడంలో, రంగనాథ్ కృషి అభినందనీయం!

రంగనాథ్ ప్రముఖ సినీనటుడు. ఏ పాత్ర ధరించినా దానికి అక్షరాలా న్యాయం చేకూర్చే అసలుసిసలు హీరో! జీవనరంగస్థలం మీద ప్రతి ఒకడూ నటుడే అని తెలిసిన తాత్త్విక గుణసంపన్నుడు కావడం వల్లే, సృజనాత్మక కవితాహృదయుడయ్యాడు. జీవితం వెలుగునీడల సయ్యాట అని తెలిసిన క్రీడాకారుడు కూడాను! నటుడు, కవి, క్రీడాకారుడు, వేదాంతి... అనే 'ఆ నలుగురూ' అక్కున చేరిన హృదయలయతో 'జీవనగీతి' నాలపించే రసగానం తన సొంతం! అందుకే రసార్ద్ర కవితలల్లగలుగుతున్నాడు.

సర్వకళాసంశోభిత అయిన భారతికి జయం పలికే ప్రార్థనతో మొదలయ్యే రంగనాథ్ కవితాసంపుటి వేగం- రాగబంధం అనే కాటేసే మూడుతలల పాము నుండి యువతను అంటే 'భావితరాన్ని' సంరక్షించే సందేశంతో సంపన్నమవుతోంది. అసలైన 'హీరోయిజం' నిలపడం రంగనాథ్ గొప్పదనం. కవిత్వ 'ఇంధనం.'

ముఖ్యంగా 'భావ తరంగాలు'లోని అల్పాక్షరాల అనల్పభావ కళికలు రంగనాథ్ కవిత్వసృజనశీలతకు అక్షరసాక్ష్యాలు. వైవిధ్యభరితమైన అంశాలకు – అనుభవంలో కలం ముంచి, అక్షరీకరించిన అనుభూతులవి. సామాజిక స్పృహ తొణికిసలాడుతూనే, ఒక చిరంతన సత్యమైన 'తాత్త్వికత' పరిఢవిల్లే పంక్తులెన్నో పఠిత అందుకోగల్గుతాడు. –

*"ఈ ప్రేమంటే*
*కౌగిలింత కాదు*
*కలవరింత*

*గులాబి, మందారాలు*
*మొగ్గతొడిగే సాహసం*
*చేసివుండేవి కావు*
*నా చెలి చెక్కిళ్ళను*
*చూసివుంటే ! "*

*...అనే లాలిత్యాన్ని చెప్పినా –*

***"భార్యని కౌగలించుకోవడం***
***ప్రతి భర్తకు తెలుసు***
***అక్కున చేర్చుకోవడం***
***బహుకొద్దిమందికే !***

***భార్యాభర్తలు ఒకరినొకరు***
***గుప్పిట్లో పెట్టుకోకూడదు***
***గుండెల్లో వుంచుకోవాలి!"***

...అని దాంపత్య మధురిమల ధర్మాన్ని వివరించినా,

***"తప్పయినా ఒప్పయినా***
***తను చేసిందేదైనా***
***ఒప్పుకొనే లక్షణమే***
***సౌశీల్యమౌతుంది !"***

*....అని అసలు సిసలు 'ఓపెన్ హార్ట్' ఏమిటో విశదపరిచినా –*

*"తల పాదాన్ని తాకితే*
*వందనం*
*పాదం తలను తాకితే*
*మదం !*

*మనం కోరుకోవలసింది*
*దీర్ఘమైన జీవితం కాదు*
*దివ్యమైన*
*జీవితం !*

*నిర్వికారాన్ని మించిన*
*ధ్యానం లేదు*
*ఆత్మసమర్పణను మించిన*
*భక్తి లేదు*
*నిర్గుణాన్ని మించిన*
*జ్ఞానం లేదు!* "

– అంటూ గొప్ప తాత్త్వికతను పండించినా, రంగనాథ్ లోని సంపూర్ణతా సాధన మనకు స్పష్టంగా తెలుస్తుంది. అనుభూతి రసప్లావితమౌతుంది.

ఇక 'అక్షరసాక్ష్యం' లోని కవితాఖండికలు అక్షరం గురించీ, భాష గురించీ, మానవత గురించీ, సృష్టిధర్మం గురించీ, భోగభాగ్యాల గురించీ, సత్సంకల్పం గురించీ... ఇలా అనేకానేక విషయాలను స్పృశిస్తాయి. 'స్థితిగతులు', 'చివరికి మిగిలేది', 'భోగం–భాగ్యం' కథనాత్మకంగా కానవస్తే, 'పండుగల పరమార్థం' వ్యాసవిశ్లేషణాత్మకంగా గోచరిస్తుంది.

"Always be a poet even in prose"  ***- Charles  Baudelaire***

అన్నమాట గుర్తుకొస్తుంది వీటిలోని కొన్ని ఖండికలు చూస్తుంటే. రంగనాథ్ కవితల్లో 'కవితలు' గురించి తానన్న నిర్వచనాలకు అనుగుణమైన భావాలే ప్రతిబింబితమవుతాయి. తన కవితలు –

*"గుండెల్లో పుట్టే*
*స్పందనల ప్రకంపనలు*
*బాధిత హృదయాలకు*
*చందన లేపనాలు –*
*ప్రగతిసాధకులకు*
*వీరతిలకాలు –*
*సభ్యతాసంస్కారాలకు*
*దివ్యమంగళహారతులు !"*

ప్రాణికోటి మనుగడ కోసం శివుని శిరమున పడి నేలకురికింది అక్షయగంగ అయితే, మానవాళి అభ్యున్నతి కోసం కవి మస్తిష్కంలో పుట్టి కాగితం పైకి వురికేది అక్షరగంగ... అంటాడు తను.

రంగనాథ్ కవితాభిజ్ఞతకు అక్షరసాక్ష్యంగా ఇంకొన్ని పంక్తులు ఉదాహరించక తప్పదు–

*''మానులు మొక్కలు కొత్తచిగుళ్ళు తొడుగుతున్నాయి*
*మనుషులు మాత్రం బండబారిపోతున్నారు* ! (పంచభూతాల సంతానం)

*తలవంచుకు బ్రతకాల్సిన*
*కానిపనులకు పూనుకోక*
*తగిన పనులకు తలపడి*
*తలవాల్చే సేలోగా*
*తలెత్తుకుని జీవించడం మేలు !* *(తల)*

*సంపద నిన్ను*
*ధనవంతుణ్ణి చేస్తుంది*
*పరోపకారం గుణసంపద*
*నిన్ను మహనీయుడ్ని చేస్తుంది !* *( గుణసంపద )*

*ఆశయాల ఆవిష్కరణ*
*అంతరంగంలో జరిగితే*
*ఆదర్శపు శిఖరాలను*
*అధిరోహించడం సత్యం !* *(చట్టం దారి చట్టానిది)*

*గుడులు గుడులని తిరుగుతావో*
*గుండెనే గుడిగా మార్చుకుంటావో*
*భక్తిని బజారుపాలు చేస్తావో*
*నీలోనే పెంచుకుని సేవిస్తావో*
*భక్తుడిగా మిగిలిపోతావో*
*దైవంతో కలిసిపోతావో– నీ యిష్టం... నీ ప్రాప్తం !* (భక్తి)

*చూడటం అంటే*
*కళ్ళు తెరిచి వుంచడం కాదు*
*అవసరం, ఆసక్తి... చూడటానికి ప్రేరకాలు*
*అధ్యయనం, అవగాహన*
*చూపు యొక్క ప్రయోజనాలు!"* (దృష్టి)

'సాక్షి' అంటే 'అక్షి' సహితుడైనవాడే. అక్షరమైన అంటే– 'నశించని' 'చూపు', బాహ్యదృష్టిది కాదు, అంతర్దృష్టిది, ఆత్మదృష్టిది. 'లోచూపు'తో, 'లోనారసి' చెప్పిన విషయాలే అసలుసిసలు అక్షరసాక్ష్యాలు, జీవన సత్యాలు.

*"అద్దం మీద మురికి పేరుకుపోతే*
*మన రూపం మసకబారుతుంది*
*మనసు మాలిన్యమయమయితే*
*ఆత్మ అచేతన మవుతుంది ! "*

అదిగో! అటువంటి మసకేసిన చూపుతో అంధత్వం ఆవరిస్తే –

*"ఆనందపు గనులు*
*అంతరంగంలో వున్నా*
*సుఖశాంతుల కోసం*
*పిచ్చిగా బాహ్యంలో వెతుకుతూ..."*

మనిషి నిత్యదుఃఖితుడవుతాడు. సంకల్ప వికల్పాలమయమైన మానవజీవితం ఉత్తాలమూ, ఉదాత్తమూ కావాలని ఈ కవి సంకల్పం. జ్ఞానబోధక కులం, అవకాశవాద కులం, నిస్తేజ కులం, ఉత్తేజ కులం, అధమాధమ కులం అనే కొత్త కులాల ఈ 'కువలయం'లో 'ప్రజాచైతన్యం తోనే ప్రజాస్వామ్యం

అర్థవంతం’ అవుతుందన్న సామాజిక స్పృహతోనే, విశ్వమానవ సౌభ్రాతృత్వపు సంపూర్ణ మానవీయత లక్ష్యంగా, తానూ, తన బ్రతుకే సాక్షిగా‘లోనారసి’ రంగనాథ్ అభివ్యక్తీకరిస్తున్న అంతరంగ సంస్పందనల ఈ కవిత్వం బహుధా సమాదరణీయం. మంచి భావాలను పరివ్యాప్తం చేస్తూనే –

***“సుగంధ సుమనోహర పుష్పవనంలో గడ్డిపువ్వుని***
***నవరత్నఖచిత కిరీటంలో యిసుకరేణువుని ! ”***

అనడం కవి వినమ్రతలోని గొప్పదనం.

"Try not to become a man of success
rather become a man of value" ***- Albert Einstein***

మానవీయ విలువల పోరాట, ఆరాటాల కవి రంగనాథ్. చీకాకుల చిక్కులు విప్పుకుని, అక్కున చేర్చుకుని, రసకవితా పరవశులవండి !!

*అక్టోబర్ 2014*




# అనుభూతి భూమిక

## కాలం తెరలు (కవితా సంపుటి) – గిడుగు లక్ష్మీదత్

'అనుభూతులన్నీ వెలుగులు చిమ్మేదివ్వెలే' అనే ఈ కవయిత్రి గిడుగు లక్ష్మీదత్ సుకుమార భావాలకు, ఆప్యాయతానురాగాలకు, గంపగుత్తగా మానవీయ విలువలకు ప్రాముఖ్యం ఇస్తారు. ''ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు?' అన్నట్లుగా– గతంలోని మంచిని, తన కవితల్లో అవగతం చేస్తారు. జ్ఞాపకాల తడితో హృదయాలను ఆర్ద్రపరుస్తారు. ప్రేమైక రసరసాయనాన్ని అక్షరాలలో ఆవిష్కరిస్తారు. ప్రకృతిని ఇష్టపడే ప్రకృతి, మానవ నైజాన్ని విశ్లేషించి మంచితనం పరివ్యాప్తం చేసే నైజం–దత్తు తీసుకున్న చిత్తం లక్ష్మీదత్ గారిది! అలాగని సామాజిక స్పృహ లేని కేవల వైయక్తికానుభూతుల అభివ్యక్తే– ఈ కవిత్వం తీరు, అనుకుంటే పొరపాటు. శ్రమజీవుల బ్రతుకు భారాలను వీక్షించి, వారిలోనూ దాగిన ఆప్యాయతానుబంధాల గొప్పతనాన్ని చెప్పకనే చెబుతారు.

నిత్య సంతోషిగా భావుకతతో మనసంతా ఊహల ఉగ్రూతలూపడం తనకిష్టం. మనసంతా సంబరాలు నింపడం తనకిష్టం. పలకరింపులలో ఎదలోతుల ఆత్మీయతలను పరిఢవిల్లచేయడం తనకిష్టం. వయసు మీరుతున్న వారి అనుభవ ప్రపంచాన్ని కనుల ముందుంచుతూనే, నేటి యువత తీరునూ, ఆలోచించగలిగేలా వారికి సందేశాత్మక సౌరునూ అందిస్తారు లక్ష్మీదత్..

అమ్మ గురించి, అక్కయ్య గురించి, చెలి గురించీ, చెలిమి (స్నేహం) గురించీ– అలాగే సంక్రాంతి, దీపావళి, ఉగాది వంటి పండుగల గురించీ

రాసిన అనుభూతితోనే– రాష్ట్రాలు రెండైనా 'తెలుగుజాతి వెలుగుజాతి' అని చాటే సమైక్యభావననూ సముద్దీపనం చేశారు! అత్తమామలను కూడా ఇంట్లో అల్లరిచేసే ఇద్దరు పిల్లల్లా సంభావించిన 'సందడి' ఆమె సహృదయతకు నిలువుటద్దం.

'గుండె తడి' అనే కవితలో

***"తడిలేని గుండె బ్రతుకు కమ్మదనం చూడలేదు***
***చెమ్మగిలని బ్రతుకు జీవన మాధుర్యాన్ని చాటలేదు"***

అన్న భావన– కాళోజీగారు 'నా గొడవ'లో చెప్పిన

***"చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చూడలేవు***
***చెమ్మగిలని కనులు బ్రతుకు కమ్మదనము చాటలేవు"***

అన్న భావననే తలపింపచేస్తాయి. ప్రణయం పరిణయంవైపు పయనించాలనే భావనకే ప్రోది కల్పిస్తారు రచయిత్రి. సంసార సాగరంలో కూడా సహనం, సంయమనం పాటిస్తూ తీరం చేరాలనీ "విడిపోడా లెందుకు? ప్రశాంతంగా ఒడ్డుకు చేరితే పోలే!" అనే సందేశిస్తారు. కాలం గురించి, ఆశ గురించి, అమ్మ గురించీ ఒకటి రెండింటికి పైగా కవితలల్లారు. మంచిని పునశ్చరణ చేయడం కూడా అవసరమే ననిపిస్తారు. ఇంటి ఇల్లాలిని భర్త 'నా వేగుచుక్క'గా సంభావించిన సరణిలో రాసిన కవిత ఎంతయినా ప్రశంసనీయం. లక్ష్మీదత్ కవితలు సుకుమార భావదీప్తులు. సరళమైన పదాలతో, సంక్లిష్టతలేని భావజాలంతో నిజంగానే ఒక అనుభూతి ప్రపంచాన్నే మన ముందుంచడం ఆవిడ లక్ష్యం. భాషా సాహిత్యాలకు తెలుగు లోకంలో గొడుగు పట్టిన 'గిడుగు' ఇంటిపేరిట అడుగిడిన లక్ష్మీదత్ అడుగడుగునా ఆప్యాయతానురాగాలకే పెద్దపీట వేశారు. ఈ కవితల్లో ఎక్కడా మనకు ఆవేశం, కావేశం, రెచ్చగొట్టే ధోరణులు, కేవల ఉపన్యాస సందేశ విన్యాసాలూ కనబడవు సరికదా– హృదయానికి హత్తుకోదగిన సూక్తి సుధలు బిందువులుగా చిప్పిల్లుతూంటాయి. వాటిల్లో మచ్చుకు కొన్ని మెచ్చుకు తీరాల్సినవే.

**"మనం" మాయనిది**
**'మనం' మాయలేనిది**
**'మనం' మన అందరిది**

*ఆద్యంతాలు లేనిది మనం మనం*
*ఓ మందార వనం"* (మనం )

*"అన్నీ కలగలిపిన విశ్వరూపధారిణి*
*ఆ బ్రహ్మ అందించిన కల్ప తరువు అమ్మ"* (అమ్మ ఎవరు?)

*"చేసిన సేవకు*
*బదులివ్వటం తెలిసిన*
*మహాజ్ఞాని చెట్టు"* (మల్లెచెట్టు)

*"మంచి, మానవత్వం ప్రతి జీవిలక్షణం కావాలి*
*మహనీయతను పెంచుకోవాలి"* (లోకం)

*"ఓ మంచి మాట*
*పదికాలాల పాటు బ్రతికే*
*రస స్ఫూర్తిని నింపి*
*ముందుకి నడిపే కరదీపిక అవుతుంది"* (మంచిమాట)

*"కర్తవ్యం అంటే ఓ బాధ్యత*
*నిరంతర నిర్విరామ ప్రక్రియ*
*మనకు తెలియకుండానే*
*సమాజానికి అందించే సేవ"* (కర్తవ్యం)

*"ప్రకృతే మన సూత్రధారి*
*అదే కొలమానం, ప్రామాణికం*
*ఆ అనుసరణ నుంచే మానవ జీవితం మొదలు"* (కర్తవ్యం)

*"గుండె గుప్పెడేగానీ*
*గుండ్రాయి మాత్రం కాదు"* (గుండె తడి)

ఇలా ఈ సంపుటిలోని డభై అయిదుదాకా వున్న కవితలలో అలరించే భావుకత తలస్పర్శిగానైనా తొంగిచూస్తూనే ఉంటుంది. మౌనం చేత మాట్లాడించగల ప్రజ్ఞ లక్ష్మీదత్ గారిది. 'ఆంధ్రభూమికే నా అక్షరాల ఆస్తి అంతా' అని వీలునామా రాసిన ఈ భావుక కవయిత్రి కవితా సంపుటిని రసజ్ఞ పాఠకలోకం సమాదరించాలని నా శుభాకాంక్షలు.

మార్చి *2015*




# బాలప్రభ

## జాబిల్లి రావే (బాల గేయాలు) – డా॥ వాసా ప్రభావతి

‘చిన్నప్పుడు బొమ్మలు వేసేవాడిని. చిన్నప్పటిలా ఆ బొమ్మలు ఇప్పుడు వేద్దామన్నా రావడం లేదు’ అన్నాడట ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు ‘పికాసో.’ బాల్యాన్ని వయోధికంలోనూ నిలుపుకోవడం, ఆ బాలానంద భావవైచిత్రిని తెలుపుకోవడం మాటలు కాదు. చిట్టిపొట్టి పిల్లలకు నచ్చే బాలసాహిత్యం సృష్టించడం నిజంగా ఒక ప్రజ్ఞ!

అమ్మమ్మగానో, నాన్నమ్మగానో అయ్యాక మనుమలకు, మనుమరాండ్రకూ చేరికకాగల గేయసాహిత్య సృజన చేయడం, నిజంగా ఒక తరం భవితవ్యానికి బాటలు వేయడమే! కవయిత్రిగా, రచయిత్రిగా, సాహితీవేత్తగా డాక్టర్ వాసా ప్రభావతిగారు కడు ప్రసిద్ధులు. ‘లేఖిని’ సంస్థ అధ్యక్షులుగా, స్త్రీలలో సృజనాత్మక వికాసానికి అవిరళకృషి చేస్తున్న వారిది నిరంతర ‘లేఖిని’ యే!

సరికొత్తగా ‘జాబిల్లిరావే’ అంటూ సంతరించిన ఈ బాల గేయ సంపుటిలో పాతిక రచనలున్నాయి. సరళసుందరమైన శైలిలో ఈ గేయాలు అల్లారు ఆవిడ. అందునా ఆడపిల్లల మీద, పాపల అందాల ప్రాముఖ్యం తెలిసేలా, ప్రభావతిగారు రాసిన–బంగారుపాప, గుమ్మడమ్మ గుమ్మడి, చిట్టిచెల్లెలు, నవ్వాలి చిట్టిపాపల్లారా, పాపాయి పుట్టింది, వంటి గేయాలు ఆడశిశువును అక్కునచేర్చుకుని మక్కువ పెంచే ప్రయోజనం సాధించగల స్ఫూర్తినిచ్చేవిగా ఉన్నాయి.

ఈ తరం పిల్లలకు ప్రకృతితో మమేకమై ఆడిపాడే అవకాశాలూ తగ్గిపోతున్నాయి. వాసా ప్రభావతిగారు అందుకే పిల్లలకు తాము మబ్బులు, చినుకులు, వానలతోనూ, చిలకమ్మ, కోకిలమ్మవంటి పక్షులతోనూ పరవశించే పదాలు కూర్చారు. కాలం విలువను చెప్పకనే చెప్పే గడియారం గురించీ, చదువు విలువను చాటిచెప్పే 'బడికిపోవుదమా' వంటి గేయాలు అల్లారు. 'సిపాయి'తో దేశభక్తి గురించీ, 'సీతారాములు'తో దాంపత్య మాధుర్యపు 'చిరురక్తి గురించీ చెప్పారు.

*'మంచిని పెంచే దెందుకు*
*అందరు హాయిగ బ్రతికేటందుకు'*

అన్నది లక్ష్యం కనుకనే-ఈ గేయాల ద్వారా బాలబాలికల్లో మంచిని హాయిగా మనసుకు హత్తుకునేలా సందేశాత్మకం చేశారు. 'చిట్టి చెల్లెలు' వంటి గేయాలు అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రోదికలిగించేవిగా, మానవీయ విలువల దిశగా మహోదాత్తమైనవని చెప్పాలి. అలాగే భావిపౌరుల్లో జాతీయతా ప్రచోదనం చేశారు.

***'దేశభాషలు వేరైనా***
***తెలుపునలుపు రంగులు వేరైనా***
***దేశాలు, రాష్ట్రాలు వేరైనా***
***అందరు భరతమాతకు***
***పిల్లలమని చాటండి'***

అంటారు. వృద్ధాప్యం రెండో బాల్యం అన్నారు. ఆ బాల్య మధురిమలు ఆవాసమై ఎదలో వున్నాయికనుకనే, వాసా ప్రభావతిగారు ఈ బాలగేయాలు పసిపిల్లలలాగనే-తన ఉహలరెక్కలతో వివరించి- తోచినరీతిలో తేటమాటలతో తేటతెల్లం చేశారు. తన ఆడపిల్లలనే కాక, పెనిమిటి ఆరుద్ర గారిని కూడా పిల్లల్లాగానే చూసుకున్న సౌజన్యమూర్తి, ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి కె.రామ లక్ష్మిగారికి ఈ గేయసంపుటిని అంకితం చేయడం బావుంది. ఈ గేయాలకు బొమ్మలు సంతరించి, ఆ నాలుగుమాటలు రాసే సౌగంధిక మైత్రి నెరపిన, డాక్టర్ వాసా ప్రభావతిగారికి వందన చందనాలు.

*21 జూన్ 2015*




# సమాజసోయి - రెక్కవిచ్చినహోయి

## రెక్కల రవళి(కవితా సంపుటి) - దుగ్గిరాల సోమేశ్వర రావు

'ఎగిరిపోతే ఎంత బాగుంటుంది' అన్నది ఓ ఊహ, ఓ ఆలోచన. ఆ ఆలోచన 'స్వేచ్ఛ'కు సంకేతం. స్వేచ్ఛ వేరు, విశృంఖలత్వం వేరు. స్వేచ్ఛకు కూడా ఒక అంతిమ 'నియమం' వుంటుంది. అవతలివారికి తగిలి బాధ పెట్టనంతవరకే- ఒకరు చేతులూ కాళ్లూ బారచాపుకునే స్వేచ్ఛా వుంటుందనేది మరిచిపోకూడదు. స్వేచ్ఛకు గొప్ప ఆసరా-రెక్కలు. రెక్కవిచ్చిన పక్షి విహాయస సంచారం బాగుంటుంది. రెక్కవిప్పడం అంటే ముడుచుకున్న తత్వం నుండి విముక్తం కావడమే! విముక్తం కావడం అంటే ఒక అసందిగ్ధ, అసంతృప్త బంధనాన్ని విసర్జించడమే. పక్షి రెక్కలు విప్పి ఎంత ఎగిరినా, సాయంకాలం తన గూటికి చేరుకుంటుంది. అందులో ఒక తృప్తి వుంది. ఎప్పుడు రెక్కలు విప్పుకోవాలో, ఎప్పుడు ముడుచుకోవాలో పక్షికి తెలుసు.

పక్షి శరీరాన్ని రెక్కలు విప్పినపుడు ఎగిరేలా చేసుకుంటుంది. ఆ రెక్కలే ముడిచి కుదిమట్టంగానే వుంచుకుంటుంది. శరీరానుభవానికి తాత్త్వికత రెక్కలు. జీవితానుభవం నుంచి ఎత్తుకెదిగి ఆలోచిస్తేనే 'తత్త్వం' అర్థమవుతుంది. ఎదగడంకోసం లోనికి ఒదగడం అవసరం. ముడిచిన రెక్కే విచ్చుకుంటుంది. దానికి విముక్త సంకల్పం హేతువు.

లఘు కవితా ప్రక్రియల్లో బహుశా ఈ భిత్తికపై రూపొందినవే 'రెక్కలు'. సుగమ్‌బాబు కలం నుండి ప్రక్రియగా విచ్చుకున్న రెక్కలు పలువురిని

ఆకట్టుకున్నాయి. ఆరుపాదాలలో సాగే రెక్కలు తొలి నాలుగు పాదాలు ఒక భాగమైతే, చివరి రెండు పాదాలూ అంతిమం. ఒక అనుభవాన్నో, అనుభూతినో, సంఘటనాత్మకతనో తొలి నాలుగు పాదాల్లో చెప్పి, అంతిమంగా చివరి రెండు పాదాల్లో–ఆ అనుభవం తాలూకు తత్త్వాన్నీ, అనుభూతి తాలూకు రసస్థాయినీ, సంఘటన తాలూకు వివేచనాత్మక సందేశాన్ని అందివ్వడం–'రెక్కలు' కవితలు చేసేపని. తొలి నాలుగు పాదాల్లో కూడా ఎక్కువగా ఒకటి రెండు పదాలే వుంటాయి. చివరి రెండు పాదాల్లో ఏక పదంగానే ద్యోతకం అవుతూంటాయి. అక్షరనియతికన్నా–పాదనియతి, పదనియతి 'రెక్కలు'లో చూస్తాం.

తొలి నాలుగు పాదాల పక్షి శరీరం చివరి రెండు పాదాల రెక్కలతో కవితానుభూతి విహాయసంలో ఎగిరిపోవడమే ఈ లఘు కవితాప్రక్రియలోని అంతస్సారం. అందుకే వీటిల్లో గాఢ తాత్త్వికతలే కాదు, విహంగదృష్టి కూడా వుంటుంది. ఆ మూలాధారనాడి తెలియడం ముఖ్యం.

శ్రీ దుగ్గిరాల సోమేశ్వరరావుగారు "రెక్కల రవళి" అందిస్తున్నారు. రెక్క విచ్చిన 'చప్పుడే' ఒక మధురం కదా! ఒక 'స్వేచ్ఛాస్వనం' ఎప్పుడూ ఆనందహేతువే. సోమేశ్వరరావుగారు ప్రధానంగా నాటకరంగ ప్రముఖులు. 'జీవితమే ఒక నాటకరంగం' అన్నారు. అందువల్ల ఆయన జీవితానుభవాలూ తక్కువేమీ కావు. స్వయంగా ఆయన కవి, రచయిత, నాటకరంగం కోసం రెక్కలు ముక్కలుచేసుకునేలా కష్టించిన కార్యకర్త కూడాను! 'రెక్కాడితేగానీ డొక్కాడని వాడు– రైల్వే సిగ్నలర్' అని ఎవరో చమత్కరించినట్లు, జీవన ప్రయాణానికి ఏ సిగ్నల్ ఎప్పుడు ఎక్కడ వేయాలో గ్రహించినవాడే విజ్ఞుడు. మన సోమేశ్వరరావు గారు సమాజహిత చింతనాపరులు. మానవీయ విలువల జీవనాభిలాషి. తనను, తనచుట్టూ ప్రపంచాన్నీ కూడా నిశితంగా చూడడం అందుకే ఈ 'రెక్కలు'లో కనిపిస్తుంది.

ఉదాహరణకు నాటకరంగం గురించి ఆయన రవళించిన రెక్కలు చాలు, ఆయన అభివ్యక్తి సామర్థ్యాన్ని అందిపుచ్చుకునేందుకు

*'నాటకపోటీలలో*
*గుణవిశ్లేషణ*
*గుణ నిర్ణయం*
*అంత సులభం కాదు*

*అదో*
*అగ్నిపరీక్ష*
*నాటక పోటీలు*
*తప్పనిసరి*
*బహుమానాలు*
*నటులకు ఊపిరి*
*– తప్పుడు తూకం*
*అమానుషం'*

ఈ రెండు రెక్కలలో నాటకరంగ స్థితినీ, గతినీ దృశ్యమానం చేసేసారు.

*"ప్రతిభకు*
*గుర్తింపుకు మధ్య*
*అనుసంధానం*
*అంతర్ధానం*
*–పైరవీల*
*ప్రభావం"*

ఆరు పాదాల్లోనూ ఒక్కొక్క పదమే వున్నా, అన్ని రంగాల్లో తాండవిస్తున్న నేటి దైన్యస్థితికి ఆస్పదం అయింది ఈ రెక్క. అభినందించక ఎలా వుంటాం!

*"వినకపోతే*
*ఎలా తెలుస్తుంది*
*చూడకపోతే*
*గుర్తించేదెలా*
*– బహిర్గతమైతేనే*
*పరిష్కారం"*

అని శ్రవ్యదృశ్య మాధ్యమ ఆవశ్యకతనూ, ప్రయోజనాన్నీ నొక్కి చెప్పారు మనిషిలోనే దాగిన మహత్తర మాధ్యమం ఇది.

'వ్యక్తిత్వ వికాసం' అనేదానికి నేడు అధికప్రాధాన్యం వుంది. ముఖ్యంగా యువత 'పర్సనాలిటీ డెవలప్‌మెంట్' అనే దానిపట్ల శ్రద్ధ పెడుతున్నారు.

సోమేశ్వరరావుగారి ఈ రెక్కలు చదివితే అలాంటి జీవనవికాస సూత్రాలెన్నో మంచి సందేశాలుగా అభివ్యక్తమవుతాయి. మచ్చుకు కొన్ని

*"ఇహంలో*
*ఇక్కట్లే*
*అందలమెక్కితే*
*అహం*
*– వినయం*
*సహజకవచం*

*ఉన్నదానితో*
*ఊరటచెందు*
*లేనిదానికై*
*రంకెలు వద్దు*
*– ఎంతచెట్టుకు*
*అంతగాలి*

*మేనుకైన*
*గాయం మానుతుంది.*
*మానదు*
*మనసుకైన గాయం*
*– సత్ప్రవర్తన*
*సత్సంపద"*

ఇలా–అలతి పదాలతో తెలిసిన సంగతులు అనుకున్నవాటికే, ఆచరణాత్మక ప్రభావం కలిగేలా, సుభాషితపు రెక్కలను తొడిగి, బాలబాలికలకు, యువతకూ కూడా గాఢానుభూతి కలిగేలా అందిస్తున్నారు దుగ్గిరాల సోమేశ్వరరావుగారు.

ఈ రెక్కలరవళిలో
ప్రకృతి పరిశీలన పాఠాలున్నాయి.
నవనాగరికత చేటులపై విసుర్లున్నాయి.
నేటి రాజకీయం తీరుతెన్నుల 'తెహల్కా' ఆవిష్కృతులున్నాయి.
స్త్రీసంక్షేమ భావనలున్నాయి..

పురాణాంశాల పునర్మూల్యాంకనలున్నాయి.

*ఆధ్యాత్మిక మనఃతరంగాలున్నాయి– అన్నీ ఉటంకించలేంకదా!*

ఈ రవళి ఒకరకంగా సమాజ రవళి, సమగ్రజీవన రవళి. అన్ని వయసులవారికీ–అందుకోవాల్సిన అంశాలను దుగ్గిరాలవారు మగ్గిన మధుర ఫలంగా అందిస్తున్నారు. సామాజిక అంశాల నుండి, బ్రతుకు తాత్త్విక కోణాల వరకూ – 'అందుకున్నంతవారికి అందుకున్నంతగా' అందివచ్చే భావతరంగిణి ఇది.

***"చేసేది స్వల్పం***
***ఆశించేది***
***అనల్పం మరిదక్కేది***
***– ఎంతప్రాప్తమో***
***అంతే!"***

*అన్నా*

***"నాస్తికులకు***
***ఆస్తికులకు***
***అందని వెలుగు***
***దైవం***
***– తెర***
***తొలగాలి"***

*అని అభివ్యక్తీకరించినా*

***"ఆచరిస్తేనే***
***ఆశయం విలువ***
***ఆమోదం కాదు***
***అధిక ప్రసంగం***
***– మనసుకు ఆనందం***
***మల్లెల పరిమళం "***

అంటూ, సదాశయాల ఆచరణను మనోహ్లాదపరీమళంగా సూత్రీకరించిన శ్రీ దుగ్గిరాల సోమేశ్వరరావుగారు– 'ఈ రెక్కల రవళి'ని మార్మికతకో, గుప్తతకో కాకుండా, సామాన్య పాఠక జన ప్రయోజనదాయకంగా, సుస్పష్ట భావాలతో, విస్పష్ట పద ప్రయోగాలతో సంతరించడం ఎంతయినా అభినందనీయం! ఏ పఠిత హృదయంలో ఏ రెక్క చుక్కలెక్క మెరుస్తుందో, ఏ రెక్క ఏ హృదయాన్ని అనుభూతి విహాయసంలో విహరింపచేస్తుందో, చైతన్యపు కదలికయై ఏది అమృతబిందువై అలరారుతుందో.. ఇక ఇది పాఠకపరం!!

శ్రీ దుగ్గిరాల సోమేశ్వరరావుగారికి మనసా అభినందనలు.

*15 ఆగస్టు 2015*



# సందర్భ వాక్యం

## అక్షర (కవితా సంకలనం)
## – ప్రచురణ: డా॥ వేదగిరి రాంబాబు

ఇది సందర్భం.

సంగతి – గురజాడ శత వర్ధంతి.

'అడుగుజాడ గురజాడది – అది భావికి బాట' అని శ్రీశ్రీ అన్నా, '1915లో మరణించాకే గురజాడ జీవించడం ప్రారంభించాడు' అని కృష్ణశాస్త్రి అన్నా – అది యథార్థం! గురజాడ కచ్చితంగా ఒక 'శతాబ్ది సూరీడు'. ఒక 'కన్యాశుల్కం' నాటకమో, 'ముత్యాలసరాలు' ఛందమో ఆయనకి చిరంజీవత్వాన్ని ఇచ్చేయలేదు. జాతి వర్తమానాన్ని సుదూర భవితవ్యంతో ముడివేసి, పాతకొత్తల క్రొమ్మెరుంగులు చిమ్ముతూ, కేవలం సాహిత్యంలోనే కాకుండా భాషలోనూ – ప్రజాదృక్పథాన్నీ, జీవితంలో, ఆలోచనలో హేతుబద్ధమూ, మానవీయమూ అయిన వైఖరీ అవలంబించబట్టి ఆయన 'యుగకర్త' అయ్యాడు.

బతికి వుండగానే విమర్శలెదుర్కొన్న కవి, మరణించి నిజంగా బ్రతకడం మొదలు పెట్టాక – ఏ పునర్మూల్యాంకనల పేరుతోనో, ఎవరికివారు తెచ్చుకున్న తూనికరాళ్ళ కొలమానాల్లో, హెచ్చులు పోయే కొందరు విమర్శకులచే తగ్గించబడే రాతల పాలయినమాట నిజమే! కులం, మతం, ప్రాంతం అనే హ్రస్వదృష్టులకతీతంగా గురజాడను చూడడం ఈ జాతి ఎప్పటికి నేర్చుకుంటుందో? అందుకే శ్రీశ్రీ ఒకచోట అన్నాడు – "గురజాడను కవిగా గుర్తించలేని 'వెధవాయను'

మనిషిగా నేను గుర్తించలేను. 'మనవాళ్ళు ఉత్తవెధవాయలోయ్' అని గిరీశం చేత ఊరికే అనిపించలేదు గురజాడ."

"ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికి ఒక చరిత్ర, ఆ చరిత్రకొక సాహిత్యస్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయితే ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు.

అలా సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవి గురజాడ అప్పారావు"

గురజాడ ప్రజాహితకరమైన సాహిత్యాన్ని సృష్టించాడు. ఎన్నింటికో ఆద్యుడనిపించుకున్నాడు. హాస్యంలో కూడా గంభీర హృదయస్పందనలు వినిపించాడు. మానవీయ దృక్పథమే గురజాడతత్త్వం. మనిషి గురించే ఆయన ధ్యాస. సమకాలంలోనే ఇతరులకు భిన్నంగా ముందడుగు వేసిన సాహసి ఆయన. "మంచి గతమున కొంచెమేనోయ్" అంటూ, 'మందగించక ముందు కడుగెయ్' అని వైతాళికునిగా నిలిచాడు. "వేగుజుక్క" అనిపించుకున్నాడు.

**"యెల్లలోకము వొక్క యిల్లై**
**వర్ణభేదములెల్ల కల్లై**
**నేల నెరుగని ప్రేమబంధము**
**వేడుకలు కురియు**
**మతములన్నియు మాసిపోవును**
**జ్ఞానమొక్కటి నిలిచివెలుగును"**

అని భవిష్యద్దర్శనాభిలాష అభివ్యక్తీకరించాడు. విశ్వశ్రేయోభిలాషిగా నిలిచాడు. కవిగా గురజాడను – 'దేశభక్తి' గీతం అంతర్జాతీయంగా నిలబెడుతోంది. అది సమస్త ప్రపంచమహాజనుల జాతీయగీతం అనదగిందే! రామాయణ భారతాది ఇతిహాసాలకున్న విలువ, భగవద్గీతకు మానవుని ఆధ్యాత్మికయాత్రలో వున్న స్థానం, గురజాడకవి దేశభక్తిగీతానికి వుంది అని శ్రీశ్రీ అంతటి మహాకవి సంభావించాడు. అలాగే కథానిక ప్రక్రియలో 'దేవుడు చేసిన మనుషుల్లారా' అన్న కథ తలమానికం అంటాడు.

చివరి నిశ్వాసం వరకూ సాహిత్యకృషిలో, సంఘ సంస్కరణాభిలాషలో కృషిచేసిన మహోదయులు గురజాడ అప్పారావు. తెలుగు సాహిత్యాన్నే కాదు, జాతి జీవనాన్ని కూడా తన రచనలతో మలుపుతిప్పిన మేటివ్యక్తి గురజాడ. ఒక మహాయుగానికి కర్త అనదగిన ఆ మహాకవి శతవర్ధంతి ఈ నవంబరు 30.

గురజాడ శతవర్ధంతికి నివాళిగా శతాధిక కవుల కవితాహారం సమర్పించాలన్న సంకల్పం శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్‌ది. కథానిక జీవిగా, కథానికా సారథిగా డాక్టర్ వేదగిరి రాంబాబు గురజాడ జ్ఞాపకాల బాటలో వెలుగుపూలు పరుస్తున్నాడు. నూట యాభైఏడు మంది కవుల కవితలతో ఈ 'అక్షర' రూపొందింది. దీనిని సంకలించే పనిలో సంకలనకర్తగా నేను అడిగిన వెంటనే తమ కవితలను అందించిన, చనువు తీసుకోనిచ్చి సహకరించిన కవి ప్రముఖులకు, కవిమిత్రులకు ఎంతో కృతజ్ఞతలు. ప్రకటనకు స్పందించి అందిన వాటిల్లోంచి కొందరు కొత్తవారినీ చేర్చాం. ఇది సమగ్రంగా కవులందరి ప్రాతినిధ్యంలో వుందని అనడం లేదు. ఇందులో చేరదగిన, చేర్చదగిన వారింకా వుంటారని తెలుసు. కానీ ఉన్నంతలో ఈ కవితాహారాన్ని వైవిధ్యభరితంగానూ, రసమంచితంగానూ సంతరించి గురజాడ శతవర్ధంతి నివాళిగా సమర్పిస్తున్నాం.

ఈ సంకలనం సందర్భోచితమనీ, చిరస్మరణీకమనీ భావిస్తున్నాం. కవితాభిరుచిగల పాఠకలోకం దీనిని సమాదరించగలదని ఆకాంక్ష, ఒకచారిత్రక సందర్భానికి చేసిన ఈ ప్రయత్నం నచ్చుతుందని విశ్వాసం.

***"మెచ్చనంటా వీవు, నీవిక***<br>
***మెచ్చకుంటే మించిపాయెను***<br>
***కొయ్యబొమ్మలె మెచ్చు కళ్ళకు***<br>
***కోమలుల సౌరెక్కునా***

***

***బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు***<br>
***బ్రీతి గూర్చెనో, వాడే ధన్యుడు"***

***–గురజాడ***

*25 నవంబర్ 2015*




# ఆత్మీయుల అభినందనలు

## కాలం నా కరవాలం (కవితా సంపుటి)
## – చిమ్మపూడి శ్రీరామమూర్తి

***కౌగితమున్నందుకు***
***కవిత్వం రాయకు***
***కన్నీరు తుడిచేందుకు***
***కవిత్వం రాయి***

అంటాడు శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి. ఆ మాట చాలదూ తను ఎందుకు కలం పట్టిందీ చెప్పుకునేందుకు! కన్నీరు తుడవడమే కాదు, నవ్వించే నైజం, మనసును ఆహ్లాదపరిచే వైఖరి వున్నవాడు. 'కాలమే నా కరవాలం' అంటూనే – అందుకే వెంటనే 'కాలమే నా మధుర కావ్య రసాలం' అని ముక్తాయిస్తాడు. రోడ్డు పక్కన నిలువునా పాతేసిన మైలురాయి కూడా ఆలయమూ, అర్చనాలేని దైవంలా కనిపిస్తోందంటున్నాడంటే అతని భక్తి శబలతా గుర్తించవచ్చు. ఈనాడు 'అంతర్యామి'ని పలికించే ఆర్తి వున్నవాడు కనుకనే పుస్తకం చదివాక కలిగే స్ఫూర్తి గురించే పఠనదాహార్తిని అభివ్యక్తం చేస్తాడు.

'పైకొస్తావు' అని భుజం తట్టే స్థాయిలో లేదు. భుజకీర్తులు ఎన్నో మోయదగిన అర్హత, అనుభవం వున్నవాడు. నిత్య సాహిత్య చైతన్యంతో వెలుగొందుతున్న చిమ్మపూడికి ఆత్మీయంగా చెమ్మతడి తోడి అభినందన వందనం.

*మార్చి 2016*




# ప్రమోద రశ్మి

## కొత్త బాణీ (ప్రయోగ పద్యాలు)- ఎలనాగ

**పూ**ర్వ కవిత్వ సంప్రదాయాల మీద దాడి ఎత్తినవాళ్ళు మనకు తెలుసు. ఛందస్సును సర్వపరిష్వంగంగా భావించిన వారూ తెలుసు.

*"నా యీ వచన పద్యాలనే దుడ్డుకర్రల్తో*
*పద్యాలనడుముల్ విరగదంతాను"*

అని 1939లో పఠాభి (తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి) తెలుగు కవిత్వానికి కొత్తరక్తం ఎక్కించాలనే తపనతో 'ఫిడేల్ రాగాల డజను' అని పన్నెండు వచన కవితల సంపుటిని ప్రచురిస్తూ 'నా కవిత్వం నూతనములో బహునూతన కవిత్వం' అని చెప్పుకున్నాడు. "పద్యానికి,గద్యానికి అంటుకట్టి, గ్రాంథికానికి వ్యావహారికానికి పెళ్ళిచేసి, తెలుగు, ఇంగ్లీష్‌కు పొత్తు కలిపి కవిత్వం రాస్తాను. వచన కవిత్వం అనే పేరుతో పిలుస్తా. వాటిని దుడ్డుకర్రల్ని చేసి పద్యాల నడుములు విరగగొడ్తా" నన్నాడు. ఆ ప్రయోగవాదనైపుణి సంచలనం కలిగించింది. ఆరుద్ర వంటి వారు కూడా పఠాభి జాడలను అనుసరించారు.

గణయతి ప్రాసయుతమైనదే కవిత్వం అని గాఢంగా విశ్వసించే సంప్రదాయ కవుల మీద తిరుగుబాటుగా, నవీన కవితాపద్ధతులకు పూనుకుని, కవితా నిర్మాణవైఖరులను సరికొత్తగా వెలార్చిన వారున్నారు. గురజాడ వారు 'ముత్యాల సరం' సృజించారు. అది ఆయన సొంతం కాదనీ, సంస్కృతంలోని 'మధుమతి'

అను లక్షణం అలాంటిదే అనీ పండితులు అంటారు. రాయప్రోలు సుబ్బారావు గారు సీసపద్యంలో అన్నీ అయిదేసి మాత్రలు గల గణాలను పెట్టి రాశారు.

అభ్యుదయ కవిత్వానికి మకుటాయమానంగా మనం చెప్పుకునే శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ఛందస్సులను ఛట్‌ఫట్ మని తెంచి ఏమీ పారేయలేదనీ, ఆ కవితల్లో పద్యఘణతులు ఎన్నో వున్నాయని అద్దేపల్లి రామమోహనరావు, మిరియాల రామకృష్ణ శ్రీశ్రీపై ఆనాడే వెలువరించిన తమ గ్రంథాల్లో సోపపత్తికంగా చూపిన తావులెన్నో వున్నాయి.

పద్యాన్ని నిరసించి కవిత్వం రాసిన వాళ్ళంతా గణాల గుణాలను పూర్తిగా విసర్జించినవారే అనలేం! ఏదో రకమైన నియతి–అధునాతన మంటున్న నానీలు, రెక్కలు వంటి ప్రక్రియల్లోనూ వుంది. అక్షరనియతియో, మాత్రలతోడి కూర్పో కానవస్తూనే వుంది. పద్యం ఆధునిక భావాభివ్యక్తికి వాహిక కాలేదు అని కొందరి వాదన. దాన్ని పరాస్తం చేసిన పద్యకవులూవున్నారు. గణ 'యతి' ప్రాసయుతమైన కవిత్వం ఒక లయతో, ధారణానుకూలంగా రాణిస్తుందని పద్యకవిత్వం గురించి చెప్పేవారు అంటూండే మాట!

వృత్తపద్యాలు, కందాలు, తేటగీతులు, ఆట వెలదులు ఇవన్నీ రాగయుక్తంగా సహజంగానే ఆ ఛందోరీతులవల్ల రాణిస్తాయనే భావన వుంది. వచన కవితది కేవలం 'అంతర్లయ' అనీ, పద్యం లయాత్మకమనీ అనుకునే మాట!

ఇప్పుడు శ్రీ ఎలనాగ (డాక్టర్ నాగరాజు సురేంద్ర) వెలువరిస్తున్న 'కొత్తబాణీ' తెలుగు కవిత్వంలో నిజంగా నవీనధోరణి. పద్యాన్నే రాసినా వచనకవితగా కనబడేలా–శ్రీశ్రీతో సహా అనేక కవులు ప్రయోగించినా, పూర్తి వచన రచనగా, వచనకవితగా మాత్రమే కనబడుతూ కవిత్వం రాసి, అందులో ఎక్కడా ధారణానుకూలతా, లయాత్మకతా పొడగట్టనట్లే వుంటూ, పూర్తిగా ఉత్పలమాలలు, చంపకమాలలు, శార్దూలాలు, మత్తేభాలు కలిగివుండే గణ యతి ప్రాసలను ఆ సంవిధానంలో పొదిగిన అద్భుత ప్రయోగ నైపుణి శ్రీ ఎలనాగ గారికే చెల్లింది. ఇదే అసలైన 'కొత్తబాణీ' !

ఈ 'కొత్తబాణీ'లోని కవితలు భావాభివ్యక్తి రీత్యా, పద వాక్య నిర్మాణ రీత్యా వచన కవితలే కానీ, వాటికి గురు లఘువుల మాత్రలను వేసుకుంటూ పోతే, పూర్తి గణబద్ధ పద్య ఛందస్సు గలవిగా యతి, ప్రాస నియమాన్ని

పాటించినవిగా కూడా గ్రహించగలుగుతాం.

మేము 'య మా తా రా జ భా న స వ గా' అని గణాలను గుర్తు పెట్టుకునే వాళ్లం చదువుకునే రోజుల్లో. ఏ గణానికి ఎన్ని గురులఘువులో, ఆ క్రమం ఏమిటో తద్వారా మననసూత్రంగా వుండేది.

భ ర న భ భ ర వ – ఉత్పలమాల – UII - UIU - III - UII - UII - UIU - IU

న జ భ జ జ జ ర – చంపక మాల – III - IUI - UII - IUI - IUI - IUI - UIU

స భ ర న మ య వ – మత్తేభము – IIU - UII - UIU - III - UUU-IUU-IU

మ స జ స త త గ – శార్దూలము – UUU - IIU - IUI - IIU - UUI - UUI-U

అన్నీ నాలుగు పాదాల పద్యాలే. ప్రతిపాదంలోనూ చంపకమాలకు అక్షరాల సంఖ్య 21 అయితే, ఉత్పలమాల, మత్తేభములకు 20 అక్షరాలు. శార్దూలానికి పాదాక్షర సంఖ్య కేవలం 19. అన్ని పద్యాలకూ ప్రాస పాటించాల్సిందే. ప్రాసయతి చెల్లదు. ప్రాస అంటే ప్రతిపాదం యొక్క రెండవ అక్షరం. అన్నింటికీ యతి నియమం వుంది. చంపకమాలకు ప్రతిపాదంలోనూ 11వ అక్షరం, ఉత్పలమాలకు 10 వ అక్షరం, మత్తేభానికి 14వ అక్షరం, శార్దూలానికి 13వ అక్షరం యతిస్థానాలు. పాదపుతొలి అక్షరంతో యతి కుదరాలి.

మీరు ఎలనాగ కొత్త బాణీ కవితలు చదవడానికీ, రసానుభూతి చెందడానికీ నిజానికి ఇవేమీ తెలియనక్కర్లేదు. కానీ ఎలనాగ ప్రతిభామతిని గుర్తించడానికి ఈ కవితలకు గురులఘువుల గణవిభజనను మీరు చేసుకుంటూ వెడితే, అవి ఛందో నియమాలను తూ.చ. తప్పకుండ పాటిస్తూనే, ఎక్కడా పద్యమనే స్ఫురణే కలగని సులభగ్రాహ్యమైన ఆధునిక వచనకవితలుగా ద్యోతకమై అబ్బురపరుస్తాయి. గణయతి ప్రాసలున్నాయి కదా అని వీటిని పద్యాల్లా పాడాలని చూస్తే, అంత సులువుగా ఆ లయాత్మకతకు లొంగని స్వేచ్ఛాయుత అక్షరవిహారమే వీటిల్లో వుంది! పద్యాల నడుములు విరగదన్నకుండానే – 'కొత్తబాణీ' కవిత్వం వెలార్చిన శేముషి 'ఎలనాగ' గారిది. ఏ కవితలు ఏ పద్యాలుగా మీరు లెక్కించి చూసుకోవచ్చో, కవిగారే ఆ కవితల కిందనే సూచించారు.

కవితా నిర్మాణ వైచిత్రి ఒక ఎత్తయితే, భావవైచిత్రి మరొక ఎత్తు! ఈ కవితల్లో ఎలనాగ ఆధునికమైన భావాలనెన్నింటినో ప్రకటించారు. సామాజిక అంశాలనేకం కవితా వస్తువులుగా స్వీకరించారు. కొండొకచో హాస్యం, వ్యంగ్యం,

వేరొకచో చక్కని సందేశ భావనలు కూడా అందించారు. నిజంగా ఇది గొప్ప ఉపజ్ఞ. పఠాభి అన్న"పద్యానికీ గద్యానికీ అంటుగట్టి, గ్రాంథికానికీ వ్యావహారికానికీ పెళ్ళిచేసి, తెలుగు, ఇంగ్లీష్‌కు పొత్తుకలిపి కవిత్వం రాయడం" ఈ కొత్తబాణీలోని విశేషం! వచన కవిత్వంగా ముమ్మూర్తులా కనిపిస్తూనే వుంటాయి. పద్యం అని ఏ కోశానా అనిపించనే అనిపించవు. అదీ విశేషం. ఈయన సురేంద్రుడు కనుక – ఉత్పల మాలలు, చంపక మాలలూ ధరించాడు. మత్తేభాలతో శార్దూలాలతో విహరించాడు. కానీ సామాన్యాతి సామాన్యుడిగానే, తనది అతని కోసం కవిత్వంగానే భాసించాడు –

*"కారున్నా నడపం*
*ఇదీ మన సిటీ కష్టాలవైనం*
*సడక్ పై రద్దీ సలిపే సమస్య*
*అది పద్మవ్యూహమే*
*గుంపులో దూరావో*
*ఇక అందులో యిరికి*
*ముందూ దారి లేకా*
*వెనక్కీ రాలేక*
*అదో రకం నరకమే*
*కీర్తించు యీ గాథనే"*

అంటారు 'నగరయానం' గురించి. ఇది శార్దూల వృత్తం అని నమ్మగలరా? గణయతి ప్రాసపద్ధతిలో అయితే ఇలా రాసుకోవచ్చు మరి దీనిని

*"కారున్నానడపం ఇదీ మన సిటీ కష్టాల వైనం సడక్*
*పై రద్దీ సలిపే సమస్య అది పద్మవ్యూహమే గుంపులో*
*దూరావో ఇక అందులో ఇరికి ముందూ దారిలేకా వెన*
*క్కీ రాలేక అదో రకం నరకమే కీర్తించు యీ గాథనే"*

కానీ ఇది వచన పద్యపు అంతర్లయాత్మకతను పట్టుకున్నదేగానీ, ఛందోబద్ధ పద్యాల రంగస్థల పద్యరాగాత్మకతనుకాదు అన్నది స్పష్టం!

ఎలనాగ ఆంధ్రాంగ్లాలపై మంచి పట్టువున్నకవి. అనువాదరచనలు ఎన్నో సృజనాత్మకంగా చేశారు. కవితలు, కథలు, వ్యాసాలు, పద్యాలు, గ్రంథ సమీక్షలు,

ప్రామాణికపు పదబంధ ప్రహేళికలు వివిధపత్రికల్లో వెలువరిస్తున్నవారు. కవిత్వ రచనలో కొత్తబాణీ ఆయనకు ఇష్టం. హృద్యమైన పద్యాన్ని నూరుపాళ్ళ వచనకవితగా భాసిల్లచేయడం అలవోక విన్నాణం కాదు. ముఖ్యంగా ఈ కవితా సంపుటిలోని 'నవ్యతారాగం' అనే గల్పిక- తెలుగుసాహిత్యంలో మునుపెన్నడూ ఎరుగని ప్రయోగం. అక్షరాలకు మాత్రలను క్రమంగా యిచ్చి చూస్తే ఈ గల్పిక కొన్ని ఛందోబద్ధపద్యాల పరంపరే! ఇలా రాయగలగడం ఒక మేధోమయ అక్షర క్రీడయే! ఈ గల్పిక నెలవంక-నెమలీక పత్రికవారి 2012 కలహంస పురస్కారం గెలుచుకుంది.

కొత్తబాణీలో ఎలనాగ కవితాభివ్యక్తి రమణీయార్థ ప్రతిపాదకంగా సాగింది.

*"చిరునవ్వే ఒక గొప్ప ఆస్తి*
*అది చేసే కార్యమే అద్భుతం*
*కరుణే లేని కిరాతకుణ్ణి*
*విరిలాగా మార్చటం*
*దాని మూల రహస్యం (దరహాస గరిమ) -*

*ఔను*
*పరోపకార గుణమన్నది గొప్ప*
*ఒకింత స్వార్థమే మాని*
*బికార్లకూ విధురమైన*
*అనాథల జీవితాలకూ*
*ఊనికనివ్వటం సబబు (సంఘహిత స్ఫూర్తి)*

*కళ అంటే అది ఆత్మపై*
*వెలుగునే కాస్తుంది*
*అంచేతనే కళ యెంతో మహిమాన్వితం (కళాదీప్తి)*

*నీ జీవితం కుసుమించాలి*
*వినూత్నమైన ఛవితో*
*కోర్తామిదే మేం సదా (హితోక్తి)*

*అక్షరమే అనంతనిధి*
*ఆ యెరుకే*

*ఒక సాటిలేని భాగ్యం*
*క్షితిపై మనీష*
*తన కాంతిని పూసిన*
*సాధనం యిదే!*
*(అనంతాక్షరసౌరభాల గనులు)"*

వంటి సందేశ భావజాలం పఠితను అలరిస్తుంది. 'సకల ప్రక్రియా ప్రియత్వం' అనే కవితలో కవి తనను తాను బహుముఖీనం కమ్మని, ప్రయోగవాద కవితా ఔచిత్యాన్ని గురించి ఆత్మప్రబోధం చేసుకోవడం బాగుంది. స్త్రీల పట్ల వర్తమానంలో వున్న 'చేతలు వేరు వచస్సు వేరు– ఎంతైన మగాళ్ళ పెత్తనపు– దర్పమదెంత భయంకరం కదా– దీనికి మార్గమేది?' అని ఆర్తి చెందుతాడు. దోమల గురించి, చలనచిత్రాల గురించి, దసరా, దీపావళుల గురించి, నెహ్రూ గురించి ఇలా చిన్న చిన్న అంశాలుగా కనపడే వాటినుంచే కవితలల్లడం – సామాన్యుడి స్థాయికి ఉత్తాల పద్యకవిత్వాన్నే హాయిగా దించడం ఎలనాగ ప్రతిభ. ఇది అనితరసాధ్యమనే చెప్పాలి!

*"ఇక వాక్యం*
*మెరవాలి కొత్త ఛవితో*
*ఈ నిర్ణయం*
*చర్యగా వికసించే*
*స్థితికోసమే తపన"*

ఆ 'తపన'కు కొత్తబాణీలోని ప్రతికవితా దర్పణమే! ఎండిన వాక్య ఖండికలు ఏ విధమైన రసాన్ని పొంపుతై. అందువల్ల నాణ్యతవున్న భాషతోనే రుచైన ఒక వంటను వండి పడేయాలనే 'ఎలనాగ' కవితాపాక శాస్త్ర నిపుణత– 'కొత్తబాణీ'లో చవులూరించేదిగా వుంది. ఆస్వాదించి ఆనందించండి. వెజిటబుల్ పులావ్ వెండిగిన్నెలో అమరింది. అందుకోండి!

– నా పట్ల గౌరవాదరాలతో ఎలనాగ ఇలా నాలుగు మాటలు రాసే అవకాశం ఇచ్చినందుకు ఎంతగానో సంతోషిస్తున్నాను.

*18 మార్చి 2016*




# తిరుమల అక్షరభావసుమాలు

## పారిజాతాలు (కవితా సంపుటి) – తిరుమల వెంకటస్వామి

పాలు, తాలు, జాలు, 'తాజాలు'గా 'పాతాలు'గా జారిన భావాక్షరాలు తిరుమల వెంకటస్వామిగారి 'పారిజాతాలు'. ఇవన్నీ స్వామిగారి కవితాభివ్యక్తులు. ఆయన కొత్తగా కలంపట్టిన వాడేమీ కాదు. ఈ సరికే ఇటు పద్యాన్ని, అటు వచనాన్నీ, నాటకాన్నీ, సమాజపు బూటకాన్నీ పలు రచనా సంపుటులుగా పాఠకలోకానికి అందించినవాడే!

మాతృభాషపట్ల వల్లమాలిన మమకారం కలిగినవాడు. 'భాష భావోద్వేగ ప్రతీకగా, భాష ఆలోచనకు లోచనము'గా సంభావించిన వాడు. మనిషి పట్ల, మానవీయ విలువల పట్లా మహిత గౌరవమున్న వాడు. 'సమగ్రత', గురించీ, 'సాఫల్యము', గురించీ, 'సందిగ్ధము' లేక 'నిజాలు' 'తెలుసుకో' మంటూ, 'ప్రబోధం' చేసే ఒజ్జకూడాను. 'శ్రమచైతన్యం'తో 'జీవితం' 'సోపానం' అధిరోహించడమే – 'సమంజసం' అని విశ్వసించే వాడు. అందుకే 'పారిజాతాలు'లో 'పిల్లలు'కు, 'యూత్' కు 'నేర్పవలె' అనే భావనతోబాటు 'సత్యం' 'ఆలోచించండి' అని పెద్దలకు 'ఆహ్వానం పలకడం కూడా వుంది.

***"ఆవేశంలో కొట్టుకుపోకుండా***
***ఆలోచనతో నెట్టుకుపోయేదే జీవితం*** *అంటాడు.*
*అంతే కాదు*
***వదిలిపెట్టి పోయేవాటినెప్పుడూ***

***పెంచుతూ దాచుంచాలని తలపోయకు***
***కూడగట్టుకు పోయే వాటిని మాత్రమే***
***కూర్చుకోవాలన్న నిజం తెలుసుకో"***

అంటూ–తాత్కాలిక ధనకనక వస్తువాహనాదుల కన్నా, దానధర్మపుణ్యకర్మల పట్ల మనిషి మొగ్గు చూపాలంటాడు.

***"అక్షరాలు పేరుకుని పదాలుగా కూరుకుని***
***వాక్యాలుగా రూపుదిద్దుకుని***
***అంధకారంలో వెలుతురై***
***మార్గదిశా నిర్దేశాన్నివ్వగలిగేదే కవిత"***

అంటాడు తిరుమల వెంకటస్వామి. కవి సమాజగత జీవిగనుకనే 'నాయకులు' గురించీ, 'రాజకీయం' గురించీ, 'గణతంత్రం' గురించీ ఆలోచించకుండా లేరు. ఒక కవితలో పల్లె పట్టణం మధ్యగల వ్యత్యాసాన్ని చెబితే, మరో కవితలో కరెక్టే అంటూ పిల్లలను కూడా ఆనందపరిచే ప్రాసమాటల భావాలు కట్టారు. 'అసమర్థునికి అందలం కట్టబెట్టినా – వానరానికి నిబ్బరం నేర్పినా' వ్యర్థమే అంటారు మరో చోట. ప్రజాస్వామ్యం పట్ల ప్రగాఢ విశ్వాసం గలవారు కనుకనే 'ఓటు' గురించీ, రాజ్యాంగం యొక్క పవిత్రత గురించి ఒక అచ్చమైన పౌరుడులా దేశభక్తి భావనలు ప్రకటించుకున్నారు.సన్మానాలకు సాధారణంగా కప్పే 'శాలువా' స్వగతాన్ని ఓ కవితగా మలిచారు.

శని అనేది ఒక గ్రహం అనుకుంటారేమో! తిరుమల వెంకటస్వామిగారు దాని అసలు స్వరూపం ఇలా పొడిగించారు

***"శని అనేది నీ అలసత్వం***
***శని నీ సోమరితనం***
***పని శనిని ఛేదించే అశనిపాతం"***

అని చెప్పిన భావన 'మజాకా!' నా! నిజమైన మనః పారిజాతం. 'దేవుళ్ళమొర' అనే కవిత రోడ్ల మధ్య గుడుల గోడుల గురించీ, పర్యావరణ పరిరక్షణ గురించీ భంగ్యంతరంగా వివరించే రచన.

'ఎందుకు?' 'ఏమంటావు?' వంటి ప్రశ్నార్థక భావనా కవితలు వున్న ఈ పారిజాతాలులో జారినవీ, జాలువారినవీ అధికంగా సుమధుర భావనా పరిమళాలే!

***"ఉంటుందా చెట్టు***
***పుడమివ్రేళ్ళను బిగబెట్టకుండా***
***భారతీయత ఒక్కటిగా***
***ఉంటేనే దేశసమగ్రత "***

అంటూ వెంకటస్వామిగారు – గురజాడ అన్నట్లుగా 'దేశమనియెడి దొడ్డవృక్షం ప్రేమలను పూలెత్తవలెనోయ్' అన్న సదాశయంతో అందిస్తున్న ఈ 'పారిజాతాలు' దోసిళ్ళతో సమాదరణీయాలు.

*19 సెప్టెంబర్ 2016*




# కవిత్వ ప్రక్రియాపథంలో కొత్తలాంతరు

## వారి తీరే వేరు (వ్యంజకాల సంపుటి) – పొత్తూరి సుబ్బారావు

**వ్యం**గ్యార్థాన్ని తెలిపే శబ్దానికి 'వ్యంజకము' అని నిఘంటువుల్లోని అర్థం. అభినయము, గురుతు అనే అర్థాలు కూడా కనిపిస్తాయి. "అసలు ఒకటి –అంతరార్థం ఒకటి" అన్నది లోకసహజం! బొమ్మ–బొరుసులాగానే, వ్యంజితము అయ్యే–అంటే బయలుపరుపబడే భావాలతో నాణేనికి రెండువైపులనూచూపే ఒక కవితాప్రక్రియకు మిత్రులు శ్రీ పొత్తూరి సుబ్బారావు ఒక క్రియేటివ్ లింక్ సంతరించారు. దానిని ఎందరో అందిపుచ్చుకోవడం మాత్రమేకాదు, చిత్రంగా 'మూలకారకుడు' కన్నా ముందుగానే అయిదుగురి వ్యంజకాల సంపుటాలు ముద్రితమయ్యాయి. వ్యంజకాలు రాసిన కవులు దాదాపు 100 మందిదాకా వున్నారు. ఇంకెందరు ప్రాదుర్భవిస్తున్నారో కూడాను...!

నాలుగు పాదాల లఘుకవితారూపం ఈ వ్యంజకాలు. మొదటి రెండుపాదాలలో కనబడే, వినబడే ఒక వాస్తవిక విషయంయొక్క – రెండో పార్శ్వాన్నీ, అసలున్న అంతరార్థాన్నీ – వ్యంగ్యంగా, ఒక ఝలక్‌గా అసలు పరిణామ ప్రతీకంగా అభివ్యక్తం చేయడం అనంతరపు చివరి రెండుపాదాలలో చూస్తాం. నిజానికి వ్యంజకాలులో కవి ప్రతిభామతి కావాలేకానీ ఇమడని విషయం అంటూ లేదు. ఎందుకంటే 'ద్వంద్వం' అనేది స్థిరీకృతమైన లోకరీతియే. ధనధ్రువం, ఋణధ్రువం రెండూ కలిగినది అయస్కాంతంలా ఆకర్షిస్తుంది. పాజిటివ్, నెగిటివ్ రెండూ కలిస్తేనే విద్యుత్ పుడుతుంది. వ్యంజకము అలాంటి వెలిగే బల్బు. కనిపించే

దాని వెనుక కనబడని కఠినవాస్తవం ఒకటుంటుంది. పైన పటారం తెలిసినట్లు దాగున్న లొటారం ఒక్కోసారి తెలియదు. తెలిసినా గమనించం. ‘రవిగాంచనిది కవిగాంచును’ అన్నారు కదా! వ్యంజకాలు అలా నివురును ఊది నిప్పును చూపగలవి. పొడిబారిన అంశాలవెనుక తడిని స్పర్శింపచేయగలవీ. సామాజిక చేతనతో ఉపయుక్త అంశాలనెన్నింటినో ఉద్దీపనం చేయగలవి. పటాటోపాలవెనుక గల డొల్లతనాన్ని రాజకీయాలనుండి, విభిన్నరంగాల విషయాలదాకా బయల్పరచగలవి.

సత్యాసత్యాలమధ్య, దృశ్యాదృశ్యాలమధ్య, యుక్తాయుక్తాల మధ్యగల సన్నటి తెరను చీల్చివేయడమే వ్యంజకాలు చేసేపని. పొత్తూరి సుబ్బారావు తన వ్యంజకాలను కవితాభివ్యక్తికై ఎందరికో మార్గదర్శనం చేసారు. ప్రక్రియాపథంలో ఇదో కొత్త లాంతరు.

‘వారి తీరే వేరు’ పేర వెలువడుతున్న ఈ వ్యంజకాల సంపుటి వ్యంజకరచనకు ఓ లక్షణ గ్రంథంలాంటిదని వేరే చెప్పాలా? ఎందుకంటే ఈ ప్రక్రియకు సృజనకర్త తానేకదా? ఈ సంపుటిలోని వ్యంజకాలు సమకాలీనతను, సాంఘిక స్థితిగతులను, లోకరీతి పరిణామాలను ప్రతిభావంతంగా ప్రతిఫలిస్తున్నాయి. పొత్తూరి సుబ్బారావు తానే ఒక సాహితీకిరణం. సాహితీకిరణం మాసపత్రిక సంపాదకునిగా, కవిగా, ఒక కార్యనిర్వాహకునిగా ప్రసిద్ధులు.

ఒక పాజిటివ్, ఒక నెగిటివ్ రెండూ కలగలసిన ‘వ్యంజకం’ ఒక ‘విద్యుద్దీపం’. ఆ రెండువైర్లను సరిగ్గా కలిపి మెలివేయడం ముఖ్యం. సాంకేతిక సామర్థ్యంగల ఎలక్ట్రీషియన్ లా వ్యంజకకవి వ్యవహరించాలన్నమాట! అందుకే నిపుణులైనవారి తీరే వేరు. ‘వారి తీరే వేరు’ అన్న పేరు పెట్టడంలోనే సుబ్బారావుగారు మంచి గడుసుదనం చూపించారు. రాజకీయ నాయకులనుండి సంఘంలోని విభిన్నరంగాల విభిన్నవ్యక్తుల తీరుతెన్నులకు వ్యంజకంగా చక్కగా నప్పే మాట ఇది. ఈ వ్యంజకాలు చదువుతుంటే పఠిత ‘భలే’ అనుకోవాల్సిందే. చులాగ్గా, సునాయాసంగా ఒక సత్యదర్శనం చేయించడం, వ్యంగ్య వైభవాన్ని పండించడం, కొండొకచో హాస్యంగానే కొరడాలు ఝుళిపించి ఝులక్‌లు తినిపించడం వీటిల్లో గమనిస్తాం.

నేటి నవతరం గురించి చెబుతూ..

***'వాళ్ళు ఫేస్ బుక్ లో***
***ఎంచక్కా చాటింగ్ చేస్తారు***
***కానీ ఫేస్-టు-ఫేస్***
***ఎప్పుడూ మాట్లాడుకోరు'***

అనడంలోని కఠినసత్యం నేటికాలాన అందరూ ఎరిగినదే కదా!

***'బుద్ధుడు జ్ఞానసముపార్జనకు***
***రాజ్యాధికారాన్ని వదలివెళ్ళాడు***
***ప్రబుద్ధులు ధనసముపార్జనకు***
***రాజ్యాధికారాన్ని చేపట్టారు.'***

బుద్ధులు-ప్రబుద్ధులు అనడంలోనే నేటి అధికార రాజకీయాల వైఖరిపై చురక కనబడుతోంది.

***'ప్రత్యేకహోదా తెస్తామని నాయకులు***
***హామీలెన్నో కుమ్మరించారు***
***ఏ హోదాలేని అమాయకులు***
***అందుకోసం ఆత్మాహుతులకు పాల్పడ్డారు'***

అంటూ సమకాలీన రాజకీయాంశాలను నిర్ద్వంద్వంగా చూపారిందులో. నిజానికి ఇలా పేర్కొంటూ పోతే పొత్తూరిసుబ్బారావు గారి వ్యంజకాలు అన్నీ ఉదాహరణీయాలే! నిజానికి వేరే వ్యాఖ్యానం అవసరంలేని సూటిదనంతో చెప్పదలుచుకున్న దానిని సూటిగా హత్తుకునేలా సరళసుందరంగా చెప్పడం పొత్తూరివారి ప్రజ్ఞ. ఇంత సులభంగా, హాయిగా రాయవచ్చా వ్యంజకాలు అనిపించేలా నిరూపించారు కనుకే ఈ మార్గంలో వందమంది దాకా అప్పుడే చకచకా అడుగులు వేస్తున్నారు. 'వ్యంజకాలు'పై పరిశోధనస్థాయి విశ్వవిద్యాలయకృషి సమకట్టబడడం ఆనందదాయకం.

పొత్తూరి సుబ్బారావుగారి వ్యంజకాలులోని మరికొన్నింటిని నేరుగా ఇక్కడ పేర్కొనడంతప్ప ఇంకేమీ వ్యాఖ్యానించను. ఎందుకంటే చదివే పాఠకులైనమీకే ఇవి అనుభవైకవేద్యాలు కాగలవు. లోకరీతి *దర్పణమనదగిన, వారితీరేవేరైన ఈ భావదీపాలు* చూడండి-

*"బడిబాటంటూ కనపడ్డ పిల్లలందరినీ*
*బడిలోకి తెచ్చి కూర్చోబెట్టారు*
*అధికారుల తనిఖీ పూర్తవగానే*
*ఎవరిళ్ళకు వాళ్ళను పంపించేశారు*

*జీవవైవిధ్య సదస్సులో*
*వన్యప్రాణుల సంరక్షణపై చర్చించారు*
*ఆ తరువాత డిన్నర్లో మాంసాహారం కావాలని*
*ప్రతినిధులు పట్టుబట్టారు*

*వాల్మార్ట్ ను తెచ్చి*
*లక్షలమందికి ఉద్యోగాలిస్తారట*
*చిల్లరకొట్లనుమూసి*
*కోట్లాదిమందిని నిరుద్యోగులను చేస్తారు కాబోలు*

*అతను ప్రజల సమస్యలన్నింటినీ*
*వీధుల్లో గానం చేస్తుంటాడు*
*కార్యక్రమం పూర్తికాగానే*
*కార్లలో తిరుగుతుంటాడు*

*చట్టసభల్లో ఎన్నాళ్ళకో*
*ఏకాభిప్రాయం కుదిరింది*
*సభ్యులందరూ*
*తమ జీతాల్ని పెంచుకోవడానికి*

*స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని*
*మరింత వేగవంతం చేశారు*
*అన్ని సేవలమీద*
*స్వచ్ఛభారత్ సెస్‌ను పెంచారు"*

ఈ వ్యంజక వైభవం చూస్తున్నప్పుడు కవి ఎటువున్నాడో, ఏం చెబుతున్నాడో సుస్పష్టం. ప్రక్రియ ఏదైనా అందులో ప్రయోజనం ఏమిటన్నది ముఖ్యం. అలాగే అవి కవితాత్మకం కావడం ముఖ్యం. కవిత్వంలో ఎన్ని నూతన ప్రక్రియలు

చోటుచేసుకున్నా సాహిత్య దీధితులను పరిపుష్టం చేయడానికే. ఛందస్సుల సర్వ పరిష్వంగాలు ఛట్ ఫట్ మని తెంచాకకూడా మాత్రల పేరుతో, అక్షరసంఖ్య పేరుతో నియతిని ఏర్పరచడంకూడా ఒక రకమైన బంధనమేకదా అనేవారున్నారు. పొత్తూరి సుబ్బారావుగారి వ్యంజకాలలో అందుకే అలాంటి ఛందోనియతి అంటూ ఏమీలేదు. మంచిచెడుల భావ వైవిధ్యం, ఒక అంశంయొక్క ఇరు పార్శ్వాలనూ కలిపి విలువైన నాణెంగా చూపించడమే ఈ వ్యంజకాలు చేసే పని. వారి తీరే వేరు అనే ఈ సంపుటి సమాజహితచింతనాసౌరుతో పఠితృలోకాన్ని ఆకట్టుకోగలదని ఆకాంక్ష

వ్యంజకాల రూపశిల్పి పొత్తూరి సుబ్బారావు గారిని మనసా అభినందిస్తున్నాను. ఈ పుస్తకాన్ని ఆత్మీయంగా అందిపుచ్చుకోండి.

***"పుస్తకం హస్తభూషణం***
***దాన్ని వెంట ఉంచుకోమన్నారు***
***ఆ ప్రకారమే వెంటబెట్టుకు తిరుగుతున్నాడు***
***పుస్తకం తెరిచి చదవలేదెప్పుడూ"***

అని ఆయనచేత వ్యంజకం పాలుగాకుండా 'వారి తీరే వేరు' అని ప్రశంసా పాత్రులవ్వండి మరి! శుభం భూయాత్.

*15 సెప్టెంబర్ 2016*



# నిత్యజాగృత భాస్కరుడు

## నగరం నిద్రపోదు (దీర్ఘ కవిత) – డా॥ నాగినేని భాస్కరరావు

**నా**లుగు వందల ఏళ్ళకుపైగా చరిత్ర కలిగిన హైదరాబాద్ ఎందరినో భాగ్యవంతులను చేసిన భాగ్యనగరం. అదే సమయంలో ఎందరో అభాగ్యులు అణచివేతలకు, దోపిడీలకు, మోసాలకు, ఆధిపత్య ధోరణులకుగురై అలమటించిన నగరం కూడాను.

నిజాం కాలంలో తెలుగు భాషా, సాహిత్యాలు నిరాదరణకుగురై, దొరల ఆధిపత్యానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటాలుసాగితే– భారతస్వాతంత్ర్యం తరువాత, హైద్రాబాద్ విమోచన జరిగి, ఒక భాషమాట్లాడే వారంతా ఒకచోట కలసివుండాలని భాషాప్రయుక్త రాష్ట్రాలకు తలమానికంగా విశాలాంధ్ర, ఆపై ఆంధ్రప్రదేశ్ ఏర్పడగా, అన్నదమ్ముల మధ్య పొరపొచ్చాలు ఏర్పడేలా పాలకుల వివక్ష ధోరణులు, అసమానతలు, ప్రాంతాలమధ్య అభివృద్ధిలో అసమతుల్యతలు చోటుచేసుకుని అరవైఏళ్ళు అంతరంగంలోనే అతలాకుతలం అయిన పరిస్థితులూ రాజకీయాలే మూలకందంగా రాజుకుంటూ సాగాయి.

ఒకప్పుడు తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన నేలమీదే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఊపిరిపోసుకుంది. కేంద్రంలోని అధికారపార్టీ పలుమార్లు దమన నీతితోనో, కుటిల నీతితోనో అణచివేసే ప్రయత్నాలు, తాత్కాలికంగా ఉద్యమాన్ని నీరుగార్చే సందర్భాలూ ఎదురైనా చివరకు కె.సి.ఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రభంజనమై చెలరేగి 2014 నాటికి దేశంలో

29వ ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకుంది. ఎందరి త్యాగాలో, మరెందరి తెగింపు బతుకులో దీని వెనుక వున్నాయి. తెలంగాణ ఎవరి దయాదాక్షిణ్యాలతోనో వచ్చింది కాదు. పోరాడి ప్రజలు సాధించుకున్నదే! ఆ ఉద్యమస్ఫూర్తికి మూలాధారనాడి తెలంగాణ రాష్ట్రసమితి. ఎందరో కవులు, రచయితలు, కళాకారులు ఆ నెగడును చివరంటా ఆరిపోకుండా చూశారు.

నిజాం నిరంకుశత్వం నుండి, వలసపాలకుల సర్పపరిష్వంగాల నుండి విడివడి, వడివడిగా 'బంగారు తెలంగాణ' దిశగా సాగిపోతున్న ఈ క్రమంనిండా హైదరాబాద్ నగరానికి ఓ కీలకస్థానం వుంది. "భిన్న సంస్కృతులు ఎదిగిపూచిన పాదు" అనిపించుకున్న హైద్రాబాద్ నాటికీ నేటికీ తెలుగుల గుండెకాయ. హైదరాబాద్‌తో విడదీయలేని అనుబంధం ఎందరికో. తెలుగువారు రెండురాష్ట్రాలుగా విడిపోవడానికి హైద్రాబాద్ ను కేంద్రపాలితప్రాంతం చేయాలనే ప్రతిపాదనలూ వచ్చాయి. హైదరాబాద్ పదేళ్ళపాటు ఉమ్మడి రాజధానిగా ప్రకటిస్తూ రాష్ట్రవిభజన జరిగినమాట వాస్తవమే అయినా, తెలంగాణ రాజధాని హైదరాబాద్. ప్రపంచపటంలో నిలువదగిన విశ్వనగరం హైదరాబాద్.

ఎందరో కవులకు, కథకులకు, చిత్రకారులకు, కళాకారులకు హైదరాబాద్ నగరం స్ఫూర్తి. దేశం నలుమూలల నుండీ వచ్చి నగరంతో ముడిపడిన బతుకులు అనేకం. అంతలా అందరినీ అక్కున చేర్చుకున్న నగరం ఇది. ఎవరు అనుమానించినా భరించింది. ఎవరు అవమానించినా సహించింది. ఎవరు ప్రేమించినా ధరించింది. అదే సమయంలో ఆత్మగౌరవం కోసం పోరాడక తప్పని పరిస్థితులువచ్చినప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ తాలూకు యువశక్తితో తెగబడింది. కుల, మతాల కుమ్ములాటలు చెలరేగినా అవి తాత్కాలికంగానే వుండి సమసిపోయే సహిష్ణు వాతావరణాన్ని విస్తరించింది. రౌడీలు, గూండాలూ, కబ్జాదారులు, విధ్వంసకారులు ఎందరు ఎన్నివిధాల బద్నాం చేయడానికి కుట్రలు పన్నినా, గాయపడినా, బలిదానాలు చేయాల్సివచ్చినా మొక్కవోని ధీరతతో మహానగరంగా మహిమాన్వితమవుతూ ఎదుగుతూనేవుంది.

హైదరాబాద్ నగరం మీదా, నగరజీవితం మీదా అపారమైన సాహిత్యం కథల్లో, నవలల్లో, వివిధసాహిత్య ప్రక్రియల్లో రూపొందింది. నార్ల చిరంజీవి 'భాగ్యనగరం' నుండి కుందుర్తి 'నగరంలోవాన' మొదలుకొని మొన్నమొన్నటి

కన్నోజు లక్ష్మీకాంతం 'హైదరాబాద్ నానీలు' వరకూ నగరం మీద వచ్చినసాహిత్యం ప్రత్యేకించి పట్టికగా తయారు చేసి పరిశోధనలు చేయాల్సినంతగా వుండేవుంటుంది.

మిత్రుడు డాక్టర్ నాగినేని భాస్కరరావ్ బంగారు తెలంగాణ రూపొందుతున్న ఈ సమయంలో వెలువరిస్తున్న 'నగరం నిద్రపోదు' సంపుటికి ఒక ప్రత్యేకత వుంది. హైద్రాబాద్ నగరం ఆవిర్భావ, వికాస, పరిణామాలనన్నింటినీ "తారీఖులు, దస్తావేజులు ఇవికావోయ్ చరిత్రసారం" అన్న శ్రీశ్రీ భావన మాటున నగరం అసలు సిసలు నిమ్నోన్నతాలను అక్షరీకరించాడు.

***"కవికలం జరిపింది నగర విహంగ వీక్షణం***
***తెలిసింది నగరం నిద్రపోని సంగతి తక్షణం***
***ఈ రచన కాదొక నగరం గైడ్***
***అవుతుంది నగరప్రాంతాల వివిధరకాల స్థితి జీవనాల***
***వచన కవితా కథనం!"***

అని తాను స్వయంగా పేర్కొన్నట్లుగా ఈ దీర్ఘరచన హైద్రాబాద్ నగర స్వరూప స్వభావాలను, ఇక్కడి జీవన సరళులనూ, సాగిన చారిత్రక ఘటనా ఘణతులనూ అద్దంలో కొండలా చూపిస్తోంది. కవిగా భాస్కరరావు చేసిన నగరజీవన వ్యాఖ్యానవైఖరి ఇది. హైద్రాబాద్‌తో అనుబంధం వున్నకవి. అలాగని నగర సంకీర్తనం ఏమీ చెయ్యడు. నాణేనికి బొమ్మా బొరుసులా నగరం యొక్క మంచి-చెడులు, కష్టసుఖాలు, వెలుగు-చీకట్ల పార్శ్వాలను సూటిగా బహిర్గతం చేశాడు. వల్లమాలిన ప్రేమతో ఎక్కడా కల్లబొల్లి కబుర్లు చెప్పలేదు. ఎన్నో ప్రపంచరికార్డులను బద్దలు కొట్టిన నగరం నిజస్వరూపాలను తాను నిర్ద్వంద్వంగా బద్దలు కొట్టిచూపించాడు. నగరపాలక సంస్థ తీరుతెన్నుల మురికిని ఎండగట్టాడు. విద్య పేర, వ్యాపారం పేర, ఆరోగ్యం పేర, భక్తి పేర ప్రబలుతున్న అమానుషాలను, అమానవీయతను నిలదీశాడు.

'నగరం నిద్రపోదు' అనడానికి ఈ కవి ఎన్ని నిద్రలేని రాత్రులు ఆర్తితో ఆకళింపు చేసుకున్నాడో గానీ ఈ సంపుటిలో తాను అభివ్యక్తం చేసిన నగర దృశ్యాలతో పరిచితిలేని నగరవాసి అంటూవుండడు. హైద్రాబాద్ నగరపౌరుడు ప్రతిపంక్తిలోనూ మమేకం కాగల ఈ రచన పరిచితిలేనివారికి సైతం హైద్రాబాద్ స్వరూపస్వభావాలను అద్దంపట్టి చూపిస్తుంది.

***"వందల సంవత్సరాల గతచరిత్ర పుటల్లో***
***వేలవేల సంవత్సరాల సంస్కృతీ ఛాయల్లో***
***లక్షల లక్షల విభిన్న మనస్తత్వ విచిత్ర భావనల్లో***
***కోట్లాదిజనుల ఆరాధ్యనగరంగా***
***నిత్యం సత్యంగా శోభిల్లుతూ***
***నగరం ఎప్పుడూ నిద్రపోదు***
***జనాన్ని నిద్రపోనివ్వదు"*** అంటాడు.

నగరం భూములు,నగరం వంటలు, నగరం చదువులు, నగరం ఉద్యోగాలు, నగరం హోటళ్ళు, నగరం రహదార్లు, నగరం వాహనాలు, నగరం మురికి, నగరం సంస్కృతి, నగరం దేవాలయాలు, నగరంలో హిందూ ముస్లిం పండుగల ఉత్సవాలు, ఊరేగింపులు, నగరంలో నీటి వనరులు, విద్యుత్ తీరులు, నగరంలో గడిచే గంటలగంటల కాలం, నగరం అపార్ట్ మెంట్లు, నగరం ట్రాఫిక్, నగరంలో పత్రికలు, నగరంలో భాష, గుడులు, జాతరలు, పండుగలు, నగరం ప్రతీకగా నిలిచే చార్మినార్, నగరం మ్యూజియాలు, నగరంలో రవీంద్రభారతి, త్యాగరాయగానసభ వంటి సాంస్కృతిక కేంద్రాలు, గ్రంథాలయాలు, సాహితీసంస్థలు, నగరం ఆస్పత్రులు, మెట్రోరైళ్ళు, హుస్సేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ వంటి జలాశయాలు, వివిధ సేవాసంస్థలు, పునరావాస కేంద్రాలు-ఇలా నాగినేని భాస్కరరావు ఈ రచనలో స్పృశించనిదంటూ ఏదీ లేదంటే అతిశయోక్తికాదు.

ఈ సంపుటిలో 'బ్రతుకుసమరంలో... నగరంలో' అనే అధ్యాయం చదివితే నగరం గురించిన అందమైన భ్రమలున్నవారెవరైనా వుంటే అవన్నీ తొలగుతాయి. "నగరం నిద్రపోదు – జనాన్ని నిద్రపోనివ్వదు" అని ఎందుకంటున్నాడో సుస్పష్టంగా తెలుస్తుంది. నిజమే! హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందాలంటే సంస్కరించుకోవాల్సిన అంశాలు ఎన్నోవున్నాయి.

***"నగరంలో జీవితాన్ని 'నాకం'గా చేయటానికి***
***అందరిపాత్ర అవసరమని నగరం ఘోషిస్తోంది***
***నవజీవనానికి నాంది పలకాలని ప్రజలూ యోచిస్తున్నారు"***

అంటూ నాగినేని 'అన్నిభాషల, అన్నిరాష్ట్రాల, అన్నివర్గాల నిలువెత్తు సంతకం నగరం!' అని తీర్మానిస్తాడు. నగరం నిద్రపోనిదీ, నిద్రపోనివ్వనిదీ 'సదాజీవచైతన్యంతో' నే నంటాడు.

పాఠకుడిని హైదరాబాద్ నగరాన్నంతటినీ చేయిపట్టుకుని, ఓ గైడ్‌లా మాత్రమే కాదు. అనుభూతి రసస్పర్శగల ఓ వ్యాఖ్యాతగా వుంటూ ప్రయాణింపచేసే రచనం ఇది. నిజమే! పల్లెకవిత్వం అయితే, నగరం వచనం వంటిదే! దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు అన్నది ఎంత వాస్తవమైనా, నగర జీవనం బతుకు అభివృద్ధికి సంకేతంగా సంభావింపబడే వైఖరి మనుషుల్లో పాదుకుంటోంది. కవిత్వం వచనమై పరిణమిస్తోంది. అందుకే ఈ వచనకవితకు దీర్ఘతను సంతరించాడు రచయిత.

యువభారతి జంటనగరాల సాహితీ సంస్థగా సాహిత్యచరిత్రలో ఒక బంగారు పుటను కలిగినది. నగర సాహిత్యోప జీవులను తన కార్యకలాపాలతో, సభలతో, పుస్తక ప్రచురణలతో అలరించిన సంస్థ. సమ్యక్ దృష్టితో రాణించిన సాహితీ సంస్థ. 1974లో సుధామ, డాక్టర్ నాగినేని భాస్కరరావుది 'మేం' కవితా సంకలనం ఒక వినూత్న రీతిలో యువభారతి ప్రచురణగానే వెలువడింది. అభ్యుదయ కాముకుల ప్రశంసలందుకుంది.

వృత్తిరీత్యా వైద్యుడైన భాస్కరరావు ప్రవృత్తిరీత్యా సమాజహిత చింతనా పరుడైన, అవసరమైతే శస్త్రచికిత్సోపకరణ ధారుడైన కవిభిషక్కే. కత్తినీ, కలాన్నీ పదునుగా వాడి సామాజికుల సానుభూతి మాటునో, మార్మికత చాటునో వుండక, నిజాలను నిర్భయంగా వచింపగల వచనకవితాభినివేశం భాస్కరరావుది. ఇటీవలే వానలు ముంచెత్తి బెంబేలెత్తిన నగరంమీద తన కవితాకాంతి కిరణాలతో వెలుగులందిస్తున్న 'నగరం నిద్రపోదు' అంటున్న ఈ రాసే భాస్కరుడికి స్వాగతం పలుకుదాం! ఈ రచన మీ అందరికీ నచ్చుతుందని నా ఆకాంక్ష!

కవిమిత్రుడు డాక్టర్ నాగినేని భాస్కరరావుని మనసారా అభినందిస్తున్నాను.

*29 సెప్టెంబర్ 2016*




# యశస్వి ఊహల రెక్కల హార్స్‌పవర్

## రెక్కల గుర్రం (కవితా సంపుటి) - డా॥ రమణ యశస్వి

'ఏమో గుర్రం ఎగరావచ్చు'

- ఈ మాట ఆశకే కాదు, విశ్వాసానికీ సంకేతం. ఎగరాలి అంటే 'రెక్కలు' కావాలి. గుర్రం వేగానికీ, శక్తికీ ప్రతీక. 'హార్స్ పవర్' అంటాం. అలాంటి గుర్రానికే రెక్కలు వస్తే...!

"A Means of Flight or Ascent; Necessity lends wings to inspiration"

ఒక ప్రేరణ ఊహకు రెక్కలు మొలిపిస్తుంది. ఈ కవి ఊహలు కేవలం నేల విడిచి సాము చేయవు. ఒక పరమార్థం వుంటుంది. సమాజహిత చింతన వుంటుంది. డాక్టర్ రమణ యశస్వి వృత్తికి ఆర్థోపెడిక్ వైద్యులు. ప్రవృత్తికి ప్రగతిశీల కవులు.

***"అర్థం
నిస్వార్థం
పరమార్థం
వున్న సాధనం-
నా కవిత
రెక్కల దర్పణం!"***

అంటూ 'రెక్కలగుర్రం' విడిచిపెడుతున్నాడు కవి. ఇది ఒక అశ్వమేధయాగమే. మేధలో జనించిన ఆలోచనలకు అనుభవాల అనుభూతుల రెక్కలిచ్చి తన కవిత్వ జవనాశ్వాలను పాఠక హృదయ మైదానాల్లో పరుగులు తీయిస్తున్నాడు. ఒట్టి మైదానాలేనా? 'అడవులు, కొండలు, ఎడారులా మనకడ్డంకి' అన్నట్లుగా 'ఆకాశపు దారులంట– హడావుడిగా వెళ్ళిపోయే –అరుచుకుంటూ వెళ్ళిపోయే' రెక్కల గుర్రాన్ని కూడా రెక్కపట్టి మనిషి కోసం, మనిషి హితం కోసం సవారీ గుర్రం చేస్తున్నాడు.

కవిత్వంలో 'రెక్కలు'కు రూపశిల్పి యం.కె.సుగమ్ బాబు.

Give me wings, burn them on to my skin, ink them upon my arms, let them shelter me from harm.

Give me wings so that I may try, give me wings so that I may cry, give me wings, let me fly.

అని యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన 'లీబాంక్స్' అనే నవకవి అన్నట్లు, కవిత్వంలో 'రెక్కలు' ప్రక్రియ కూడా బాగా ఇంకిందనడానికి ఇప్పటికే నూటపాతికపైగా 'రెక్కలు' సంకలనాలు వెలువడ్డాయి. 'సుగమ్' ప్రేరణతో ఈ 'వేగమ్' సాధ్యమైందనడానికి ప్రత్యక్ష సాక్ష్యం–ఇప్పుడు మీ చేతుల్లో వున్న ఈ 'రెక్కలగుర్రం'. రెక్కలకు డాక్టర్ రమణ యశస్వి ఒక వాజీకర శక్తిని సంతరించపూనుకున్నట్టుగా, ఈ 'రెక్కలగుర్రం' కానవస్తోంది.

మనసు అనేది పక్షిలాంటిది. అది గూట్లోనే కూర్చోదు. పరిపరివిధాల పరిభ్రమిస్తూ వుంటుంది.

A Bird is safe in its nest, but that is not what its wings are made for" **- Amit Roy**

అందువల్ల పక్షి రెక్కలు విదల్చడం ఎంత విధాయకమో, పరుగులు తీసే మనసు కూడా రెక్కలు విప్పుకుని గుర్రంలా పరిగెత్తడాన్ని డా॥రమణ యశస్వి 'రెక్కలగుర్రం'గా రూపుకట్టిస్తున్నారు. అనంత వైవిధ్యాన్ని అందుబాటుకు తెస్తున్నారు. అందుకని ఎత్తుగడలోనే–

*"మనసు*
*మాయ తివాచీ*
*మడతపెట్టలేము*
*అదే పేచీ -*
*ఇది కళ్ళెం లేని*
*రెక్కల గుర్రం!"*

అన్నారు. తన ఊహలకు, భావాలకు అనవసర కళ్ళేలు వేయలేదు గనుకనే, ఈ రెక్కల కవితల్లో ఎంతో వస్తువైవిధ్యం సాధ్యమైంది. సమకాలీన అంశాలను కూడా 'రెక్కలగుర్రం' మోసుకొచ్చింది. పెద్దనోట్ల రద్దు, సెల్ ఫోన్ల సుద్దు, సహజీవనం మీరిన హద్దు- వంటివన్నీ అనుభూతి రమ్యంగా అక్షరీకరించారు. అలాగే ప్రకృతి గురించీ, పర్యావరణం గురించీ, ఓట్ల రాజకీయాల గురించి రాశారు. గాంధీ, కలాం, శ్రీశ్రీ, జాషువా వంటి సామాజిక, సాహిత్య మహనీయుల గురించి భావుక రెక్క విచ్చారు. తాను స్వయంగా డాక్టర్ కనుక వైద్యపరమైన అంశాలనూ, అవయవదానం వంటి హిత సందేశాలనూ సంతరించారు.

*"సాహిత్యపు*
*జరదా కిళ్ళీపై*
*తీవిగా నిల్చిన*
*ఘాటు లవంగం-*
*రెండు శ్రీల శ్రీరంగం*
*విప్లవ రెక్కల లోహవిహంగం!"*

అని రమణ యశస్వి పేర్కొన్న శ్రీశ్రీ -కవికి వరుసకు మామయ్య అవుతారు. (శ్రీశ్రీ గారి అబ్బాయికి రమణ గారి చెల్లెల్ని ఇచ్చి వివాహం చేశారు) కాబట్టి కొంత ఘాటు, జరదా కవిత్వపు సరదా కూడా తొంగిచూస్తుంటాయి వీటిల్లో.

రమణ గారిలో అభివ్యక్తి సామర్థ్యం నిండుగా వుంది. సహజీవనం గురించీ, జాషువా గురించీ పదులకొద్దీ పలుకగలగడం తేలికైన పనేమీ కాదు.

*"సహం*
*జీవనమే*
*ఇద్దరి*
*వాలకం*

***అది అముద్రిత***
***పెళ్ళి పుస్తకం!"***

*అని సహజీవనం గురించి గొప్ప వ్యాఖ్యగా తీర్పిస్తారు.*

***"కవిగారి***
***గుర్రం దౌడు***
***కాలం***
***కన్నా ముందు-***
***విశ్వనరుడి అంతరంగం***
***జాషువా రచన తరంగం!"***

అని గుర్రం జాషువాకు రెక్కల గుర్రంతో నీరాజనమిప్పించారు కవి.

ఇవాళ పిల్లలు విద్యా ఉద్యోగాలకు విదేశాలకు తరలిపోయి, అక్కడినుంచి ఇక్కడి పెద్దలను ఆర్థికంగా ఆదుకోవడం లేదు. ఆ విషయాన్నే చెబుతారిలా-

***"రెక్కలొచ్చిన***
***రూపాయి***
***డాలరు పక్షిగా***
***మారింది***
***కన్నవాళ్ళకు***
***రుణమాఫీ చేసింది!"***

క్రమాలంకారంలో దేశస్థితిని, ఇన్నేళ్ళ ప్రగతినీ తేల్చి చెప్పేశారిలా...

***"పేదోడు***
***అడుక్కి అడుగడుక్కి***
***వున్నోడు***
***పైకి పైపైకి-***
***కూటికీ***
***కోటికీ!"***

పెద్దనోట్లు రద్దు చేస్తూ 2016 డిసెంబరు చివరి వరకూ మాత్రమే పాత వెయ్యి, ఐదువందల నోట్లు మార్పిడికి చెల్లుతాయి అనే సరికి తిరుపతి, విజయవాడ కనకదుర్గ వంటి గుడి హుండీల ఆదాయం ఎంతగానో పెరిగిపోయిందని వార్తలొచ్చాయి. కానీ సొమ్ముని అలా వదిలించుకోవడం కూడా పాపమే. పిల్లికి

కూడా భిక్షం పెట్టనివాడు న్యాయంగా, ధర్మంగా సంపాదించి వున్న దాంట్లోంచే భగవంతుడికీ నిజంగా చెల్లించే సద్బుద్ధీ వుంటే–

***"రద్దు ఐదొందలు***
***వెయ్యి***
***చిల్లరలేని***
***చెయ్యి–***
***గుడి హుండీలో***
***పిల్లి!"***

అన్న కవి వాక్కు యథార్థమయ్యేది మరి!

రమణ యశస్వి గారి 'రెక్కల గుర్రం' పయనాన్ని 'ట్రాక్ యువర్ రైడ్'గా చూపించాలనే ఆత్రం అయితే వుంది గానీ–విస్తరణ భీతి దానికి అవరోధం. పైగా 'ఐఫోన్' ను ఏమన్నారో చూశారా!

***"అరచేతిలో***
***మొలిచింది***
***ఆపిల్***
***మొక్క–***
***కాసింది***
***వాగుడు కాయ! –"***

ఎంత చమత్కృతి. ప్రకృతి, పర్యావరణం గురించి చేసిన లోతైన ఆలోచనల్లోంచి ఓ చమత్కారం, ఓ సందేశసారం చూడండి –

***"మర్రిచెట్టు***
***తపస్సు చేస్తున్నట్లుంది***
***వూడలు***
***దిగాయి–***
***ఋషుల***
***గడ్డంలా!***

*పిచ్చుక*
*పిండం*
*కాకికి*
*పెట్టడం–*
*పర్యావరణానికి*
*పెనుగండం!"*

పిచ్చుకలు అంతరించిపోతున్నాయన్న వాస్తవాన్ని ఇంత అద్భుతంగా చెప్పడం ప్రతిభామతికే సాధ్యం.

డాక్టర్‌గా కవి గారు చెప్పిన అంశాలు అనేకం వున్నాయి. వాటిల్లో మచ్చుకి కొన్ని ఉదాహరించక తప్పదు.

*"గర్భాశయము*
*సంచీలు నింపుతోంది*
*గర్వాతిశయము*
*'మనిషి'ని చంపుతోంది–*
*అమ్మతనము*
*అమ్మకానికి!....*

*పోలింగు చుక్కలు*
*సమాజ రుగ్మతకు సీలు*
*పోలియో చుక్కలు*
*మట్టుబెట్టు వైరసులు–*
*ప్రజాస్వామ్యం, ఆరోగ్యానికి*
*రెండు చుక్కలే పునాదిరాళ్ళు!....*

*అన్నదాత*
*రుగ్మతలకు*
*వరుణుడే*
*వైద్యుడు–*
*వానచుక్కలే*
*సూదిమందు! ....*

*మాగాణి బల్లపై నిండుగర్భిణిలా*
*కోతకొచ్చిన వరిపైరు*
*సిజేరియన్ ఆపరేషను*
*చేసే డాక్టర్‌లా-*
*కోతకోస్తున్న*
*కూలి!"*

ఇలా వృత్తినీ, ప్రవృత్తినీ మిళితంచేసే భావుక ఊహలు డాక్టర్ గారికే బాగా చెల్లేయి. అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్య సందేశాలు అందించిన రెక్కలూ వున్నాయి. అలాగే భాషా సాహిత్యాల గురించి కూడా తన భావుక రెక్కలను హాయిగా విప్పారు.

*"మనం ఒకే*
*తానులో ముక్కలం*
*తెలుగు తేజో*
*చుక్కలం -*
*ఆంధ్ర, తెలంగాణ వేరైనా*
*తెలుగు మందారంలో రెక్కలం!"*

అని విడని భాషాబంధాన్ని, ఆత్మీయతా గంధాన్ని వెదజల్లారు. రెండు వందల యాభైకి పైగా రెక్కలుగా సంతరించుకున్న ఈ రెక్కలగుర్రాన్ని పట్టి చూపడం అంటే యాగాశ్వాన్ని బంధించచూడటమే. అది దుస్సాహసమే మరి.

*"సెల్ఫీ*
*తీసుకున్నా*
*నా గుండె*
*గోడలపై నాన్న ఫొటో-*
*అదే*
*చిరునవ్వుతో!"*

అంటూ నాన్న కీ.శే. సంకా రామారావు గారిని ప్రేమతో స్మరిస్తూ- 'లేకపోతే స్మరణం జ్ఞాపకాల తోరణం మరణిస్తుంది మరణం' అని కనులు చెమ్మగిల చేస్తూ, డా॥రమణ యశస్వి ఈ రెక్కల గుర్రాన్ని - విహాయసానికి కాలం చేసి ఎగసిన సాహితీ సంచారయోధుడు అద్దేపల్లి రామమోహనరావుకు అంకితం చేయడం ఎంతో సముచితంగా వుంది. ఆర్ద్రతకు నెలవుగా వుంది.

*"Why pray for the wings when you got a brain intelligent enough to explore beyond the sky.* ***-Ankit Dedha***

అని డా॥ రమణ యశస్వి గారి ఊహల రెక్కలు చదివినప్పుడు మనకు అనిపించినా, రెక్కలలోని స్వేచ్ఛ, విశాలత, గాఢత, వైవిధ్యం ఇలానూ గుర్తు చేస్తాయి.

*"The reason birds can fly and we can't is simply because they have perfect faith, for to have faith is to have Wings.*

***-J.M.Barrie***

***"ఆశకు***
***ఆశయాలు  రెక్కలు***
***అధ్యయనానికి***
***ఆచరణ రెక్కలు***
***విజయానికి***
***వైఫల్యాలే రెక్కలు!***

***సందేహాల***
***దేహం***
***ఆశ నిరాశల***
***పంజరం-***
***ఆత్మ***
***ఎగిరిపోయే చిలక!"***

ఇటువంటి భావాలను కూడా నిండుగా పండించిన పూర్ణ భావుకత గల కవి డా॥రమణ యశస్వి. సుగమ్ బాబు రెక్కల ప్రక్రియకు ఒక 'వేగమ్' మాత్రమే కాదు, ఈ 'రెక్కలగుర్రం' ఒక 'ప్రయోజనం' కూడాను. మీ హృదయాధిరోహణం చేయగల ఈ 'రెక్కలగుర్రం' అధిరోహించి, సమాజ జీవన యానం చేయండి. రసానంద వివశులవ్వండి. తప్పక మీరూ ఆశతో విశ్వాసంతో అనగలరు.

కవి భావాల ఎరుకతో 'ఏమో గుర్రం ఎగరావచ్చు.'

*డిసెంబర్ 2016*




# భావసుమాల అక్షరమాల

అక్షరమాల (త్రిశతి)– తిరుమల వెంకటస్వామి

శ్రీ తిరుమల వెంకటస్వామిగారు ప్రీమియర్ కో ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రిన్సిపల్ & కరస్పాండెంట్‌గా వుంటూనే, అక్షర సేద్యం చేస్తున్న రచనా హాలికుడు. ఒక వంక కవిత్వం, మరో వంక నాటికా రచనం– ప్రధాన అభిరుచులు. విద్వత్ గద్వాల మనిషి కాబట్టి – గద్యం వైపు వాలినా, హృద్యమైన పద్యమే ఆయనకు ఎక్కువ ఇష్టంలా కనిపిస్తుంది. మునుపు చిట్టిశతకం, కవితార్ఝరి, కవితా స్రవంతి, ఈ భక్తులు మాకొద్దు (నాటిక), తెలుగు పలుకు (ద్విశతి) వినాయకా చెవితీయ్ (హాస్య వ్యంగ్య నాటిక), పృథ్వీరాజ్ (చారిత్రాత్మక నాటకం) వంటి గ్రంథాలు వెలువరించిన వెంకటస్వామిగారు ఇప్పుడు వెలువరిస్తున్న అక్షరమాల త్రిశతికి ఒక ప్రత్యేకత ఉంది. పద్యాది అక్షరం వర్ణమాలలోని వరుస అక్షరాల క్రమంలో ఒక్కొక్క అక్షరానికి కొన్ని పద్యాలుగా రాసుకుంటూ వెళ్ళారు. ఇదో తరహా ప్రయోగం అనే చెప్పాలి. 'అక్షరమాల అమరత్వము నొంద!" అనేది ఈ పద్యాలకు మకుటం. పద్యంలో వెలువరించిన భావం మకుటంతో అనుసంధానం కావడం అనే నియమం కూడా సర్వేసర్వత్రా పెట్టుకుంటే బాగుండేది కానీ, ఇదొక ప్రయోగదృష్టి కాబట్టి ఆ దృష్టి పెట్టలేదు. అయినా పద్యాలలో సాంఘిక దృక్పథం, సామాజిక చైతన్యం పట్ల దృష్టి పెట్టడం అభినందనీయం. గణాలపట్ల కన్న వారి అగణిత భావాలపట్ల పాఠకులు దృష్టి పెడితే సరి! ఎందుకంటే వచనీయత ప్రవచనీయతతో బాటు కదం తొక్కుతుంది.

*"ఊడిగ మొకప్పుడు దొరల గడియలందుండె*
*ఊడిగమునకు ఓటరులందరు రెడీ నేడు*
*బాడుగ బ్రతుకులకు ఊడిగము నేర్పే ప్రభుత్వంబులు"*

అంటూ ప్రజాస్వామ్యపు నేటి డొల్లతనాన్ని తూర్పార బట్టారు. ఘంటసాల అన్నా, ఎన్టీఆర్ అన్నా వెంకటస్వామిగారికి అభిమానం అని ఈ త్రిశతిలోని కొన్ని పద్యాలు కమనీయంగా చెబుతున్నాయి.

*"గ్రద్ద వాలు కళేబరముల మీద, య*
*శ్రద్ధవ్రాలు శక్తియుక్తుల మీద*
*ఓటువాలు బ్రతుకు సుఖశాంతుల మీద"*

అంటూ శ్రద్ధగా ఓటువేయాల్సిన అవసరం కూడా చెబుతూ, అశ్రద్ధ ఎందులోనూ పనికిరాదని హితవు పలికారు. ఇహముతో బాటు పరము గురించి ఆలోచించడం కూడా మంచిదంటారు వెంకటస్వామిగారు.

*"భగవంతుడొక్కడే భువనమున కంతకు*
*బ్రతుకొక్కటే బహురీతుల బ్రతుక*
*బ్రతుకు బ్రతుకునేల ధ్యేయము లేక"*

అంటూ ఒక ధ్యేయాన్ని ఏర్పరచుకుని అర్థవంతమైన జీవితాన్ని గడపాలని ప్రబోధిస్తారు.

వెంకటస్వామిగారు ఏది రాసినా, వాసికోసం వెంపర్లాడే మనిషే! 'క్షరముగానివి అక్షరంబులు, నిక్షేపంబులు నీతి నిజాయితీ ధర్మంబులు' అని ఆయన అన్న మాటలు అందరికీ ఆమోదయోగ్యాలే! వారి రచనాపాటవం మున్ముందు మరింతగా జాజ్జ్వల్యమానం కావాలని శుభాకాంక్షలు.

*జనవరి 2017*



# ప్రేమోన్మీలనం

## రాగ మోహనం (కవితా సంపుటి) - కె. హరనాథ్

ఇతడు సుమనో'హరనాథ్'డు. ఇతనిది ప్రేమోన్మీలనం. ఈ ప్రియరాగాలు అప్రతిహతమైన చిరంతన భావాలు. భగ్నమన్న తలపుకే రగిలి- యాసిడ్ దాడులతో, కత్తిపోట్లతో యువత చెలరేగుతున్న నేటికాలానికి, ఈ 'ప్రేమశీకరాలు' అమృతతుల్యాలు. స్వాస్థ్య సమాజ ప్రగతికి-మానవీయ అనురాగ గుళికలు. ఇవన్నీ ప్రియుడిపరంగా అభివ్యక్తమైన ప్రణయస్పందనలు. ఆమె 'అప్రాప్త మనోహరి'యే అయినా- 'తట్టుకునేశక్తిని మగవాడు తనకు తనే ప్రసాదించుకోవాలి' అని హితవు చెబుతాడు. మనసు మందారంతో అభిషేకం చేయడం, చెరువు-ఇసుక రేణువులా ప్రేమైక్యతను సంభావించడం, 'మలగనిదొక్కటే హృదయజ్యోతి' అనీ, 'వాడనిదొక్కటే హృదయ కుసుమం' అనీ పలకడం 'వలపునవోన్మేషం!'- కామం ఒక సెకను-ప్రేమ కోటానుకోట్ల సెకన్లు' అనడం, అలాగే 'ప్రేమానురాగాల మధ్య కోపతాపాలు చినుకంత మాత్రమే' అనడం ఉదాత్తంగా వుంది. అంతేనా! - ఆమెను తను-'నాదానివి', 'నా దానివి' అనడం మరింత ఉత్తాలంగా ఉంది.

***"హృదయానికి గాయం***
***అవటం సహజం***
***తట్టుకునే శక్తి***
***అందరికీ ఉండదు***
***ఏ కొందరికో తప్ప."***

కానీ ఎక్కడ వున్నా, ఏమైనా, ఒకటైనా, విడివడి ఎవరికివారే వేరయినా, పరస్పర సుఖాన్ని అభిలషించడం, మృదుమనోహర సుమపేశల భావనలతో ప్రేమను లాలిత్యంగా మలుచుకోవడం, అవసరమైతే త్యాగధారలతో పునీతం చేయడం– 'నిజమైన ప్రేమలక్షణం' అనిపింపచేస్తాడు. కవితా ప్రేరణకు బీజాక్షర మొలక అయినదేఅయిన ప్రేమయే, సృజనాత్మక విప్లవ నిశ్శబ్దం అంటున్న 'హరనాథ్' అభినందనీయుడు.

*2 జనవరి 2017*



# చేతనావర్తం

## ఆలోచన చేద్దామా! (కవితా సంపుటి) – అనంతోజు మోహన్‌కృష్ణ

"Poetry is simply the most Beautiful, impressive, and widely effective mode of saying things, and hence its importance" **- Mathew Arnold**

'పావన నవజీవన బృందావన నిర్మాతలు' అని శ్రీశ్రీ అన్నది–మా అనంతోజు మోహనకృష్ణ వంటి యువకుల గురించే అయి వుంటుందని నాకు గట్టి నమ్మకం! 'ఆలోచన చేద్దామా' అని యువకవిగా తాను అంటున్నాడంటే, వ్యష్టి భావన నుండి ఎదిగి, సమష్టి భావనలో సమన్వయం అవుతున్నాడనే. మొగ్గ అంటూ తొడగాలే గానీ... పువ్వై వికసించడం అనంతర పరిమాణ పరిణామమే. అలాగే ఆలోచనే ఆచరణకు దారి తీస్తుంది. యువకుల్లో కేవలం ఆవేశం కాక, ఆలోచన వెన్నంటి వుండడం అత్యావశ్యకం! పరిమితులు మించిన వేగంతో ప్రాణాలు తీసుకుంటున్న 'బెంజి' కార్ల యువకుల కన్నా, 'గంజి' విలువ తెలిసి, 'అపరంజి' వ్యవస్థ కోసం, అవిరళశ్రమ చేసే యువకులే అభినందనీయులు కదా మరి!

యౌవనంలో – అయితే ప్రేమ కవిత్వం రాస్తారు, లేదా ఆకలి కవిత్వం రాస్తారు. దేనిని ప్రేమించాలో, ఎందుకు, ఎలా ప్రేమించాలో తెలిసిన వాడే అసలు ప్రేమికుడు. ప్రేమికుల దినోత్సవం అనే రోజునే 'ప్రియ' భాగస్వామిని బతుకులోకి తెచ్చుకున్న మోహనకృష్ణకు దాన్ని గురించి వేరే చెప్పక్కర్లేదు. అయితే సమాజ హిత చింతనాభిలాషి కనుకనే 'ఆకలేనిజం' అనగలిగాడు.

*"అందం ముందు ఆకలి ఓడిపోతుందా!*
*ఆకలిలో ఉన్న కవిత్వం అందంలో ఎక్కడున్నది?*
*ఆకలి నిజం*
*అందం*
*అద్దానికి అబద్ధానికి అనుబంధం-"* అంటాడు.

ఆకలిలో వున్న కవిత్వాన్ని ఆకళింపు చేసుకున్నవాడు కనుకనే- అనంతోజు కవితల్లో దైహికమోజులు కాక, అంతఃసౌందర్య దిదృక్ష వుంది. స్వచ్ఛ సమాజ సౌందర్యకాంక్ష తనది. అందుకే దేని గురించి రాసినా తన భావనలు అందరితో పంచుకునే వైఖరి వుంది. సమూహంలో ఒంటరి కాక, ఒంటరిలో సమూహాన్ని వెదుక్కునే అమూల్య అనుబంధ భావన వుంది.

*"అనుబంధాలు పెంచుకుంటే*
*తెంచుకోవడం కష్టం*
*మనం నాటిన మొక్కనే*
*మన చేత్తో తుంచెయ్యలేం కదా!"*

అంటూనే- మనుషుల పట్ల స్నేహాన్నీ, ప్రేమనూ పెనవేసుకునే బ్రతుకు అభిలషణీయమంటాడు.

*"చిరునవ్వు విలువ*
*అమూల్యం*
*మనుషులను దగ్గర చేస్తుంది*
*మమతల వారధి కడుతుంది-"* అని అభివ్యక్తీకరిస్తాడు.

"Publishing a volume of verse is like dropping a rosepetal down the Grandcanyon and waiting for the echo" - ***Don Marquis***

ఇలా తన కవిత్వాన్ని సంపుటీకరిస్తున్న మోహన కృష్ణను అభినందిస్తున్నాను.

"There are three things, after all, that a poem must reach the eye, the ear, and what we may call the heart or the mind. It is most important of all to reach the heart of the reader" - ***Robert Frost***

కనిపించే, వినిపించే 'మోహనకృష్ణ' ది పాఠకుడికి దగ్గరయ్యే కవిత్వం. ఉగాది గురించి రాసినా, భగత్‌సింగ్, పుచ్చలపల్లి సుందరయ్య, జ్యోతిబసు,

బోడేపూడి, గురజాడ, జాషువా వంటి మహనీయులను స్మరిస్తూ రాసినా, నిర్భయ గురించో, రోహిత్ గురించో ప్రతిస్పందించినా, రైతు ఆత్మహత్యలకో, ఖమ్మం వేలేరుపాడు ఘటనకో కళవళపడి కలం సారించినా– గాలివాటుతనం కాక, ఓ నిజాయితీ వుంది. ప్రపంచీకరణ వైపరీత్యాలకు, సామ్రాజ్యవాద సంస్కృతికి నిరసనగా 'నీటిబుడగంత' కవితల్లో నినదించిన గళం వుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకోసం 'వేకువపూలై వికసిద్దాం' అనే చైతన్యనాదం వుంది. అదీ తన నిండుదనం.

'ఆలోచన చేద్దామా' అనే మూడుపదుల పై బడిన ఈ కవితా సంపుటిలో 'పైపైబతుకులు– వైఫై కాలం', 'వెళ్ళొస్తానంటాం...గానీ..', 'అక్షరం' వంటి కవితలు మోహనకృష్ణ కవితాభివ్యక్తి సామర్థ్యానికి 'మెచ్చు' తునకలుగా భాసిస్తున్నాయి. తన కవిత్వ పంక్తుల్లోంచి కొన్ని ఉటంకింపులు గ్రహించి 'ఆలోచన చేద్దామా'...!

*"బాధలు పడుతున్నామని*
*భయపడటం అవివేకం*
*నేడుకాకపోయినా రేపైనా*
*మనం సాధించాలి ఒక నవలోకం"* (వేకువపూలై వికసిద్దాం)

*"ఇప్పుడంతా*
*పైపై బతికెయ్యటం అలవాటు చేసేసుకున్నాం*
*ఏ క్షణాన్నన్నా పొరపాటున అంతరాలలోకి జారిపడితే*
*ఆత్మ విమర్శలు చుట్టుముడితే*
*అస్తిత్వం ప్రశ్నిస్తే*
*మిగిలేదంతా శూన్యమే!*
...
*ఇప్పుడంతా*
*పైపై బతుకు నడకలో భూమిని తాకని పాదాలే"*

(పైపై బతుకులు/ వైఫై కాలం)

*"ప్రపంచ ఐటి రంగంలో*
*విప్లవమార్పులు వస్తే*
*తొలగుతుంది నిరుద్యోగభ్రాంతి*

*కలుగుతుంది ఉద్యోగక్రాంతి" – (నిరుద్యోగి ఎదురుచూపు)*
*"మనం ఉదయిస్తున్న సూర్యుడిలా వెలుగులు నింపాలే గానీ*
*అస్తమిస్తున్న సూర్యునిలా కన్నవాళ్లకు చీకట్లు నింపటం తప్పే*
*...*
*అలసినప్పుడు నీ చెమటే చిందాలి కానీ*
*నీ రక్తం చిందించకు మిత్రమా" (ఆలోచించు నేస్తమా)*

*''నిలబడ్డ చోటునే చూపుల నదుల్లో*
*ప్రవాహమై కొట్టుకుపోతున్నాము*
*ఉద్విగ్నక్షణాల్లో మూకీ సినిమాలాగా మారిపోతున్నాము*
*మాట్లాడాలనుకున్న మాటలన్నీ*
*నిశ్శబ్దపు చెట్టునీడన నిలిస్తే*
*చేతి వ్రేళ్ళు కదిలించటం తప్ప నోటమాట పెగలదు"* (వెళ్లొస్తానంటాం.. గానీ)

*"నవజాతి వృక్షాల మొదళ్ళనూ*
*మానవజాతి మెదళ్ళనూ చీల్చుకుని*
*వ్యాపిస్తున్న ప్రపంచీకరణ వైరస్*
*చేయిస్తున్న విధ్వంసకర సర్కస్ ఇదంతా*
*ఇప్పుడు భూగోళమెంత?*
*ఆవగింజంత*
*ఏక్షణమైనా పగిలిపోయే నీటి బుడగంత"– (నీటిబుడగంత)*

– ఇలా మోహన్‌కృష్ణ కవితల్లో నిజంగా ఆలోచింపచేసే లక్షణం వుంది. ఇవాళ సవ్యమార్గంలో అత్యావశ్యకమైన విషయం అది. తన యువశక్తులను తాను ఆవిష్కరించుకుంటూ, సంఘటిత భావాలతో సమసమాజం కోసం 'మార్చ్' చేస్తున్న ఈ యువకవితో కరచాలనం చేసి పదండి ముందుకు. సాహో అనంతోజూ!...

""Great poetry is always written by somebody straining to go beyond what we can do" - ***Stephen spenden***

*జూన్ 2017*




# (స్వ) భావవ్యక్తీకరణ చక్రవర్తి – కవితాంత రంగస్వామి

## చక్రవర్తి రంగస్వామి – సంపూర్ణ కవితా కదంబం

"POETRY PUTS INTO WORDS THE PIECES OF MY HEART I FIND DIFFICULT TO OTHERWISE ARTICULATE... POETRY IS BEAUTIFUL, ELEGANT, EXPRESSIVE, AND PERSONAL. IT TOUCHES THE HUMAN HEART IN A WAY THAT MANY OTHER THINGS CANNOT" ***- JULIA GRANT***

**జ**ర్నలిజమే జీవన విధానంగా ఎంచుకుని, గ్రంథపఠనం, రచన, ఆధ్యాత్మిక చింతన ముప్పేటలుగా ముడివేసుకుని –కథా, నవలారచయితగా, కవిగా రాణించిన కలంజీవి కీ.శే. చక్రవర్తి రంగస్వామిగారు. జీవితంలో ఎన్నో దురనుభవాలు సంభవించినా, చెక్కుచెదరని మనస్థైర్యంతో తన అంతరంగ సాహిత్యామృత తరంగిణిని రసజ్ఞ పాఠకలోకానికి అందిస్తూ, తన ఎనభైరెండవ ఏట శ్రీరామపద సన్నిధిని సాయుజ్యం చెందినవారాయన. ఇది రంగస్వామిగారి శతజయంతి సమాపన సమయం.

రామలక్ష్మణ భరత శత్రుఘ్నులను కలిగిన దశరథ చక్రవర్తిలా, చక్రవర్తి రంగస్వామిగారికి నలుగురు కుమారులు. తండ్రి సాహిత్య సంపత్తిని పరిరక్షిస్తూ, ఈ శతజయంతివేళ వారి సమగ్ర సాహిత్యాన్ని ఈ తరానికి అందుబాటులోకి తెచ్చేందుకు పూనిక వహించిన పుత్రులెంతయినా అభినందనీయులు. శ్రీచక్రవర్తి సుందరశ్యామ్‌గారు సోదరులతో కలిసి తండ్రిగారి కోసం ఈ సాహితీక్రతువు తలపెట్టారు. కథారచయితగా చక్రవర్తి రంగస్వామిగారు ప్రసిద్ధులు. 'నిజమైన మనుషులు', 'చక్రవర్తి కథలు', 'రాలినపూలు' వంటి కథాసంపుటులు

వెలువరించారు. ప్రముఖ తెలుగు పత్రికలలో వారి కథలు ప్రచురితమై పఠితృలోకాన్ని అలరించాయి. 'ఆనందనిలయం' పేరిట వారు పిల్లల కోసం రాసిన కథలు కూడా పుస్తకంగా వెలువడ్డాయి. అలాగే నవలా రచనలోనూ 'చీకటిలో చుక్కలు' వెలయించారు.

జర్నలిజం వ్యావృత్తిగా గలవారు వచన రచనలో సిద్ధహస్తులు కావడం కష్టం కాకపోవచ్చు. కానీ కవిత్వం సంగతి అలా కాదు. అది నిజంగా 'అంతరంగ గంగ'. హృదయం మరోలా అభివ్యక్తం చేయలేని అంశాలు అనేకం కవితాత్మకంగా మలచిన రంగస్వామిగారు అందుకే మౌలికంగా కవి అనిపిస్తారు. ప్రజానీకపు అంతరంగాలను అలరించగల కవిత్వ సృజన ఆయన సంకల్పం. "పలికించెడువాడు రామభద్రుండట" అని పోతన సంభావించిన చందాన -రంగస్వామిగారు "శ్రీరామచంద్రుడే నాకు సర్వస్వం, ఆయనే నా చేత ప్రతిపనీ చేయిస్తాడన్న నమ్మకం నాది" అని విశ్వసించినవారు. అందుకు తగినట్లుగానే భద్రాచలరాముని దర్శన పారవశ్యంతో, గానానికి అనుకూలంగా – 'శ్రీరామపాద అమృత తరంగిణి' గేయకావ్యాన్ని రచించి, ఉత్పల సత్యనారాయణాచార్య, జి.వి.సుబ్రహ్మణ్యం, తిరుమల రామచంద్ర, ఎం.కులశేఖరరావు, యస్.టి.వి.రాజగోపాలాచార్యులు, యన్.సి.వి.నరసింహాచార్య వంటి కవిపండిత శ్రేష్ఠుల మున్నుడి ప్రశంసలందుకోవడమే కాదు, ఆ కావ్యం బహుళ ప్రచారంలోకి వచ్చి, ఎందరిచేతనో ప్రశంసలను కైవసం చేసుకుంది. అలాగే ప్రముఖ చిత్రకారులు బాపుగారి ముఖచిత్రంతో రంగస్వామిగారి ముప్పై ఎనిమిది కవితల సంపుటిగా 'అంతరంగ గంగ' – కవితాభిమానులను అలరించింది. బూదరాజు రాధాకృష్ణగారు ఆ సంపుటిలోని 'ఆకాంక్ష'లో పేర్కొన్నట్లు –

"రచయిత కొక జీవిత లక్ష్యముంది. జీవనపథంలో గమ్యంవైపు పురోగమించటానికి తానెన్నుకున్న విధానముంది. నిర్వేదంతో తలమునకలయ్యే నిరాశాబంధుర మార్గం కాదది. తన జీవితాన్ని, భావనలను, ఆదర్శాలను భగవదర్పితం చేసే నివేదనా పథమది. ఆధ్యాత్మిక మార్గం వంటి అనాదిసిద్ధపథంలో ఆధునిక భాష వంటి వినూతన సాధన సహాయంతో పయనించాలనే సంకల్పమది. ప్రాచీనార్వాచీనాలను సమన్వయదృష్టితో పరిశీలించి, సమన్విత మార్గంలో తన అంతరంగ గంగను ప్రవహింపజేసిన భగీరథుడీయన."

వారి అంతరంగ గంగలో - జీవనతరంగాలు వున్నాయి. సమాజహిత చింతనా తరంగాలున్నాయి. తాత్త్విక తరంగాలు వున్నాయి. ప్రకృతి సౌందర్య రసాస్వాదనా పారవశ్యాలున్నాయి. దీనుల పాలిటి దయార్ద్ర చేతనా రోచిస్సులున్నాయి. ఏకకాలంలో హృదయానికీ, బుద్ధికీ, సంప్రీతిని కలిగించే భావచిత్రాలు తమ కవితల్లో సంతరించడంలో చక్రవర్తి రంగస్వామిగారు నేర్పరులు. సమాజజీవిగా వుంటూనే జీవుని వేదనను రామార్పితం చేసే అంతరంగస్వామి ఆయన. ఎంత ప్రౌఢనిర్భరవయః పరిపాకులో, అంత పసిహృదయ భావుకులు. వారి 'ఉదయబాల' బాలగేయాలు అందుకు తార్కాణం. పిల్లల మనోగతాన్ని ఆకళింపు చేసుకుని చిన్న చిన్న మాటలతో వారు కూర్చిన బాలగేయాలు ఆకాశవాణి పిల్లల కార్యక్రమాల్లోనూ ప్రసారమై శ్రోతృజనరంజకమైనాయి. అలాగే యతిప్రాసలు, ఛందస్సు తెలియకపోయినా -హృద్యమైన పద్యాల్లాగా పరిఢవిల్లగల లయాత్మక రచనలు చేశారు.

'నా కవిత' అనే ఖండికలో తానే స్వయంగా పేర్కొన్నట్లు బహిరంతర భావనాదర్శనం చేయిస్తుంది ఆయన కవిత్వం. తన కవిత-

*"అద్దం బయటి రూపాన్ని చూపుతుంది*
*యంత్రం లోపలి రూపాన్ని చూపుతుంది"*

అంటారు. కవిత అంతటితో ఆగదుట-

*"కవితలోకి దృష్టిసారిస్తే*
*లోలోపలికి*
*కనపడని అణువణువులోకి*
*రహస్యాలలోకి, అనుభవాలలోకి*
*సుఖదుఃఖాలలోకి, లోని అగాధాలలోకి*
*శిఖరాల పైకి, రాగద్వేషాలలోకి*
*దైన్యంలోకి, నిర్వేదంలోకి*
*గర్వపు బలుపుల్లోకి*
*హృదయం లోపలి పుటల్లోని*
*విచిత్ర వర్ణచిత్రాలలోకి*
*మెత్తదనంలోకి, తగిలిన ఆఘాతాల్లోకి*

*లోతైన అఖాతాల్లోకి*
*మస్తిష్కంలోకి*
*అంతర్భావ వాహినీ వైభవంలోకి*
*ప్రణయయాత్రా గాథల్లోకి*
*ఒకటేమిటి?*
*బహిరంతర సమస్యల్లోకి చొచ్చుకుపోతుంది*
*చూచినట్లే కనిపిస్తుంది!*
*అందుకే విశ్వహృదయాన్ని*
*స్పందింపచేస్తుందనే ఆశ"*

అంటారు రంగస్వామిగారు. చీకటిలో కవి గుండెనుండి వెలువడి కవిత – గీతంగా, సంగీతంగా విశ్వహృదయాన్ని స్పందింపజేయాలన్న ఆశ, ఆకాంక్ష కవిది. రంగస్వామిగారి కవితల్లో అందుకే ఎంతో వైవిధ్యం వుంది. అదే సమయంలో అంతటా అంతస్సూత్రంగా ఒక జీవుని వేదన వుంది. ఆస్తిక భావనా విశ్వాసం ఉంది. ఆయన కవితాభివ్యక్తిలోని వివిధ పార్శ్వాలు ఆలోచనాత్మకాలు, రసప్లావితాలు. వాచవిగా కొన్ని కవితా పంక్తులు –

*"ఆకాశం పిచ్చిరేగిన సముద్రంలా ఉంది*
*నా జీవన గంగను అఖాతం పిలుస్తోంది"* (జీవనగంగ)

*"రేపటి మానవుడు*
*మహనీయ స్థితిని అందుకోనున్న*
*దేవతాసన్న మనోజ్ఞమూర్తి అయిన*
*ప్రేమ సామ్రాజ్యైక చక్రవర్తి"* (భవిష్యద్దర్శనం)

*"అతి దీర్ఘ నిరీక్షణానంతరం*
*చీకటి తరుగుతున్న కదలిక*
*నిశి దుస్తులు మార్చుకుంటున్న*
*సవ్వడి"* (సుందరావృత్తి)

*"ఎన్ని చక్కని హృదయాలయాలు*
*సుందర ప్రాకారాలు లేవు నీకు!!*
*ఐనా, నా శిథిల హృదయ*
*మందిరంలోనూ ఉన్నావంటే*
*ఎంత ఆశ్చర్యం!!"* (స్వర్ణకాంతి)

*"సముద్రుడు నిద్రపోయాడు కాబోలు*
*అల్లరిచేసి అలసిపోయిన పిల్లాడిలా!!*
*పక్షులు ఒళ్లు విరుచుకుంటున్నాయి*
*ఎంతో ముద్దుగా!!*
*అరుణారుణ రాగంలో*
*నీ తియ్యని గొంతుక*
*అదిగో మళ్ళీ!!"* (నవపారిజాతం)

*"తెరిపిలేని కోర్కెల తాకిడికి*
*కాలం పమిటచెంగు*
*రెపరెపలాడుతుంది"* (కాలమోహిని)

అలతి అలతిగానే ద్యోతకమవుతూ అపరిమిత ఆలోచనా స్రవంతిని అంతర్విలోకనాద్యుతిని రూపుకట్టించే భావకళికలు రంగస్వామి గారి కవితలు. పునశ్చరణమయ్యే కవిత్వ పాదాలు కొన్ని కవితల్లో కనిపిస్తున్నాయంటే ఆ అభివ్యక్తి వైఖరి పట్ల ఆయనకున్న గాఢానుభూతియే హేతువు.

*"దుఃఖవర్ణ చిత్రిత మీ*
*జీవితమొక కరుణగాథ*
*అగునుగాక భగవదేచ్ఛ"* (ఛాయారేఖ)

అని ప్రబల విశ్వాసం గల వారాయన. 'అర్చనాగ్ని', 'ఆనందహేల', 'కన్నీటి చుక్కలు', 'షష్టిపూర్తి' వంటి కొన్ని దీర్ఘ కవితలు వైవిధ్యంతో కొంత వచనకవితా కథనాత్మకత భాసిస్తున్నాయి. కుందుర్తి ఆశించిన కథాకావ్యాల బీజాలు రంగస్వామిగారూ నిక్షిప్తం చేసుకున్నారనిపిస్తుంది.

"శ్రీరామపాద అమృత తరంగిణి" రంగస్వామిగారి భక్తిభావశబలతకు ఎత్తిన పతాక. రామచంద్ర ప్రభువును భద్రాచలంలో దర్శించిన అనంతరం హృదయం ఉప్పొంగి జాలువారిన గేయధార అది.

***నా చిన్ని ఎడదలో పుట్టి-జాలుగా, సోనగా, తీయగా, హాయిగా- నా భక్తి ఏరుగా పరవళ్ళు తొక్కే - సుడులు సుడులై తిరిగి- అలలు అలలై రేగి ఆకసాన్నంటనీ!! ప్రవహించి - ప్రవహించి-పరుగులిడి -పరుగులిడి- నా స్వామి!- నీ దివ్య కైవల్య అమృతాబ్దిలో - కలవనీ! - నా తండ్రి - కరగిపోనీ!!***

అంటూ రామనామ వైభవ పారాయణం చేశారు. అంతేకాదు రామకృష్ణులకు అభేదాన్ని సందర్శించడాన్ని రూపు కట్టించారు. శ్రీరామభక్తులను తన కవితలో స్మరించుకుంటూ 'భవత్పదాంబురుహ సేవోత్సాహ సంపన్నులను తలచినా' నరుడు శాశ్వత శుభారూఢుడనిపింప జేశారు.

***"వాడదిది ఎన్నటికి- వీడదిది సౌరభము -పాయదిది సోయగము - స్వామి నీ కంకితము"*** అని రంగస్వామిగారు అన్నట్లుగానే ఆయన సుమింప చేసిన కవితాపుష్పం సౌందర్య సంభరితమై, సౌగంధికా విలసితమై నిత్యవికసనం గలది. ఆయన శతజయంతికీ ఈ కవిత్వకాంతి పాఠకహృదయాలలో అనుభూతి వెలుగులు ప్రసరింపచేసేదిగానే నిలిచివుంది అన్నమాట యథార్థం.

ఆయన కవిత్వం వసివాడని పసితనపు 'ఉదయబాల' కూడాను. ఆ బాలలగేయాలులో 'చిట్టి ఆలోచనలు'తో – 'బాలానందం'కై, ఆయన విరియించిన 'ఇంద్రధనుస్సు'లు తరాల మధ్య కమనీయంగా కూర్చిన వారధులు. నిజానికి ఈ 'ఉదయబాల' పుస్తకరూపంలో ముద్రణలో వుండి, ఉదయించకముందే 1999 మార్చి 17న చక్రవర్తి రంగస్వామిగారు కాలధర్మంచెందారు. కానీ ఉదయబాలలో ఆయన పిల్లలకై చెప్పిన అనుశ్రుతమైన కథలు, ఆశువుగా మలచినవీ బాలల వ్యక్తిత్వ వికాసానికి నిరంతర కరదీపికలు. బాలలపై తనకున్న ప్రేమ కొలదీ 'ఉదయబాల'ను చివరిగా అందించి, అస్తమించారాయన. 'రామేచ్ఛ' ఎలావుందో కీ.శే. చక్రవర్తి రంగస్వామిగారి కవితాంతరంగానికి తెలుసు. ఆయన రచనాస్వేచ్ఛ తదనుగుణంగానే సాగి, తరించింది. రామ పాదుకలను తన హృదయభావనా సింహాసనంపై ప్రతిష్ఠించుకుని స్వీయ కవితాసామ్రాజ్యపాలన చేసిన కవిభరత చక్రవర్తి రంగస్వామి. వారికి శతజయంతి నివాళులు. నాకీ 'భూమిక' నిచ్చిన శ్రీసుందరశ్యామ్‌గారికి, వారి సోదరులకు కృతజ్ఞతలు.

*17 జులై 2017*




# రాధా మోహనం

## వన్నెపూల విన్నపాలు (కవితా సంపుటి) – రాణి చిత్రలేఖ

గోపాలునికెంత మంది గోపికలున్నా
గుండెలోన నెలకొన్న రాధ ఒక్కటే! – ఆరుద్ర

“ఎవరైతే తనని లాలించి, కీర్తించి, ప్రేమించి, బుజ్జగించి, మోహించి, ముచ్చటించి... మాటలతో మంత్రించి పిలుస్తారో, రసరమ్యమైన కీర్తనలతో, కవితలతో, పాటలతో నన్ను తనవైపుకి లాక్కు వెళతారో అట్టివారి ఇంటనే రాత్రికి ఆతిథ్యం స్వీకరిస్తాను” అన్నాడట లీలామోహనుడు ఒకసారి.

***“ఎవరికుంది అంత శక్తి***
***ఎవరికుంది అంత అనురక్తి***
***ఎవరికుంది అంత ప్రణయశోధన***
***ఎవరికుంది అంత ఆరాధన”***

ఆ రాధకి కాక. తనకి కృష్ణుడి పై ఉన్న అవ్యాజమైన భక్తి, రక్తి, అనురక్తులని ముక్తిమార్గంలో మిళితం చేసి తన శక్తిమంతమైన ప్రేమని ఎలా ప్రకటించిందో, ఆ ‘రాధ’నగల ‘ఆరాధన’నంతా కవితలుగా కానుక చేస్తోంది కవయిత్రి రాణి చిత్రలేఖ. చిత్రలేఖ తానే రాధగా మారిపోయింది. పదహారు వేలమంది గోపికలూ రాధలో మమేకం అయిపోయిట్లుగా, ఆ రాధ కృష్ణునిలో తన్మయీ భావంతో తల్లీనమైనట్లుగా ప్రణయోర్మిని పలవరించింది.

*"అగమ్యంగా బ్రతుకుతున్న నాకు -*
*నీ - ప్రేమే గమ్యమయ్యింది*
*గమనం మొదలుపెట్టాను గాని*
*గమ్యం బహు గగనమయ్యింది"*

అన్న ఆర్తితోనే, ఆ మోహనవంశిని మనసారా కవితాపుష్పాలతో అర్చన చేసింది. అలజడిరేపే తన అణువణువునీ కృష్ణార్పణం చేసింది. ఇది చిత్రలేఖ కలం చేస్తున్న కలనాదం. కన్నుల్లోనే కాదు గుండెల్లోనూ ఆ మాధవుడి రూపమే! అతడే 'ధవుడు' కావాలన్న తహతహల తాపమే. కృష్ణుని రాసలీలకన్న మిన్నగా ఇది 'రాధలీల!' ఆమె ప్రణయభక్తి తత్పరమైన శృంగార హేల! ఆమెకు దివారాత్రాలు ప్రపంచం అంతా కృష్ణమయమే! సూర్యచంద్రులూ అంతేగా మరి!

***"విచ్చుకున్న కలువలని చూస్తే అర్థమైంది***
***నా కొంటె కృష్ణుడు చంద్రుడై వచ్చాడని***
***విరగబడి నవ్వుతున్న తామరలని చూస్తే తెలిసింది***
***నా నీలమేఘశ్యాముడు సూర్యుడై ఉన్నాడని"***

ఆమె అలంకరణ అతనికోసం. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆమెకోసం. సమార్జించే విలువలు, విసర్జించే వలువలూ అన్నీ అతని శరణాగతితోడి చరణాగతికే! కృష్ణుని చూపు, నవ్వు, శ్వాస, స్పర్శ, మనసు, వయసు, మేధస్సు రాధలో విరిసే ఇంద్రధనుస్సు. మధురాధిపతి అధరసుధారసానికై మోయలేని బాధలనయినా మోసే - 'విరహోత్కంఠిత' రాధ.

***"మాటలో రాయలేక, పాటలో పాడలేక***
***అభినయంతో చూపలేక, ఇంకెలా చెప్పాలో తెలియక***
***మౌనంగా ఆస్వాదిస్తున్నా***
***నీ స్మరణలోని ఆనందాన్ని, స్ఫురణలోని అనుభూతిని"***

అంటున్న రాధని ఈ కవితలో మోహనంగా, మనోహరంగా రూపు కట్టించింది చిత్రలేఖ.

***"తక్షణమే నను తస్కరించుకుని వెళ్ళు***
***భవబంధన సంక్షోభ సాగరాల నుండి***
***మనల్ని దగ్గర చేసేందుకు ఉపేక్షిస్తున్న పరిసరాల నుండి***
***నిన్ను తప్ప వేరేమీ వీక్షించలేని ప్రదేశానికి"***

అంటున్నదంటే – అది కేవలం ప్రణయమా? దానిమాటున దాగిన ప్రణవమా? ఊహించడం అసాధ్యమేమీ కాదు. పట్టుసడలే రవిక ముడులు, పెనవేసే పాదాల జతలు, మోముపై నడయాడే పెదాలు, వేణుగానంతో పులకించి 'నా మేను గానం పంపుతోంది నీకు రాయబారం – రేయి భారం తెలుసుకుని – మేనుభారం తగ్గించేందుకు హాయి చెంతకి చేరి శరీర స్వరాలు మోగిద్దాం' అనడాలు – ఇవన్నీ రాసక్రీడల కృష్ణుని చెంత రాధక్రీడలు.

*"నారికేళానికి మించిన నైవేద్యంతో*
*సిద్ధంగా ఉంది ఈ నారీమణి*
*చక్కెరకేళినే చిన్నబుచ్చే రుచితో*
*వేచి చూస్తోంది నీకై సరసకేళి"*

అని తాదాత్మ్యత ప్రకటించడం తనకే చెల్లింది.

*"వెన్నదొంగ కోసం*
*ఒళ్ళంతా వెన్నపూస పూసి ఉంచా*
*నీ ఊపిరి వేడికి వెన్న కరిగి*
*ఈ వనిత వన్నెల్ని చవి చూస్తావని"*

అని రాధ అనడం నిజంగా నవనీత రసమంచిత భావనం. ఈ ఖండికలలో 112, 113, 114, 115, 116, 117, 118... శృంగార సప్తస్వరహేలగా 'త్వమేవశరణం మమ' అని కృష్ణునికి త్రికరణాలతో అంకితమైన రాధ ఉత్తాల శృంగార రస హేలగా – చిత్రలేఖ అభివ్యక్తం చేసింది. కృష్ణునిలో విలీనమవుతూ తన తనువుకి సమాప్తం పలకాలని ముగింపులో అనడం జీవాత్మ పరమాత్మల అనుసంధానం వంటిదే.

రాణి చిత్రలేఖ చూపిన మరో చిత్రం – ఆ'రాధ'న గల... ఆరాధననే – విని, చూసి, పులకించిన గోపికలంతా ఆమె అభివ్యక్తి రసధారలలో మునిగి, కృష్ణుడు రాధాస్వామియే అని ఆనందంగా అంగీకరించడమే కాదు, నిజానికి వారికిప్పుడు కృష్ణుడికంటే రాధ మీదే అనురాగం, అభిమానం ఏర్పడ్డాయట! ఆమె ప్రేమ ప్రకటించిన తీరు వారికి అపురూపమై భాసించింది. 'ఇక మనమేల' అని వారు కృష్ణుని రాధ చెంత వదలి కదలబోతుంటే – 'కృష్ణుడు నావాడే కాదు

మీ వాడు కూడా. మనువాడకుండానే మన మనసులో నిలిచిన మనవాడు. ఈ రాత్రి నా ఇంట్లో కృష్ణుడు ఉంటాడు. నాతో సహా మీరందరూ ఉంటారు' అని రాధ అనడం – ఆ వెన్నెల రాత్రి 'స్త్రీకృష్ణమయం' అయిందనడం – అద్భుత సమష్టి రసావిష్కరణం! 'బృందావనమది అందరిదీ – గోవిందుడు అందరివాడేలే' అని రాధయే రాధామనోహరంగా ప్రకటించిందనడం,చిత్రలేఖ – అవిభక్త జీవుల భక్తి తత్పర దృష్టికి ఎత్తిన నిజమైన ప్రణయారాధనం. చక్కని ప్రణయభక్తి కావ్యాన్ని సంతరించిన రాణి చిత్రలేఖకు అభినందనలు.

*సెప్టెంబర్ 2017*




# వికాస శీకరాలు

## అలల సవ్వడి (కవితా సంపుటి) – డా॥ వాసా ప్రభావతి

"A Short poem may be a stylistic choice or it may be that poet said what poet intended to say in a more concise way. it is a meticulous attitude. Writing a short poem is often more tedious than writing a long poem"

**క్లు**ప్తతలో గాఢత ఉంటుంది. ఎద కదల్చని బండ్ల కొద్దిగ కావ్యరాశుల కన్నా, ఒక చిన్ని భావశకలం ఒక్కొక్కసారి బుద్ధికీ, హృదయానికీ కూడా ఏకకాలంలో సంప్రీతిని కలిగించగలుగుతుంది. 'అల్పాక్షరముల అనల్పార్థ రచన' అని ప్రాచీనులు సైతం సమాదరించారు. మారుతున్న కాలాన సుదీర్ఘ రచనలను పఠించే వెసులుబాటు మందగిస్తోంది. 'ఫాస్ట్‌ఫుడ్స్' లాగా 'మినీ'లో 'మెనీ' అందించే కవిత్వపు 'మెనూ' కావాలనుకునే వారున్నారు. మినీ కవితాప్రక్రియలు అనేకం అందుకే ఉప్పతిల్లి సమాదరణీయమయ్యాయి. రెక్కలు, నానీలు, చుక్కలు, వ్యంజకాలు ఏ పేరుపెట్టినా అవన్నీ మినీకవితలే!

నిజానికి విశాలభావాన్ని కుదించి చెప్పడం మాటలు కాదు. చిన్న చిన్న మాటల్లో ఒక సందేశాన్నో, జీవితసత్యాన్నో, లోకవీక్షణాన్నో చెప్పడం కూడా ఒక ప్రజ్ఞయే!

'అలల కొలువు' పేర గతంలో తన మినీకవితలతో పాఠకులను అలరించిన డా॥ వాసా ప్రభావతి గారు 'కొలువు' తీరాక, వీస్తున్న సరికొత్త భావవీచికలు–

ఈ 'అలల సవ్వడి'. 'పొడి పొడి' పదాలుగా కనిపిస్తూనే, ఒక అనుభూతి 'పుప్పొడి' వెదజల్లే- భావసుమాలు ఈ చిరు చిరు కవితలు. అన్నీ గొప్పగా ఉండకపోవచ్చు. కానీ ఉన్నవన్నీ ఊహల రెక్కలు విచ్చుకుని కానవచ్చేవే! ఒక అనుభూతి శకలాన్నో, అనుభవ సారాన్నో, లోకం పోకడనో వివరించడానికి ప్రభావతి గారు వెలార్చిన ప్రతిభా స్థాయి ఏమిటో వీటిల్లోంచి గ్రహించగలుగుతాం. ఈ సవ్వడిలో ఒక తడి వుంది, ఒక వేడీ వుంది. చూడగలగాలేగానీ బతుకు పాఠం చెప్పే బడీ వుంది, ప్రశాంతతను పంచే గుడీ వుంది.

*'మనసు ఎప్పుడూ*
*పలకదు*
*పలికించడం*
*దాని నైజం'*

అంటూనే మనసు విప్పి పలికి, పాఠకులను పలికించడం ఈ అలల సవ్వడి నైజం. మనసులోని ఎన్నో ఆలోచనలను కాగితం మీద అద్దడంలో, ఆ భావాలకు 'ఆవాసాన్ని' కల్పించడంలో వాసా ప్రభావతిగారు కృతకృత్యులయ్యారు.

*'అక్షరానికి ప్రాణం*
*మాట*
*మాటకు ప్రాణం*
*అర్థమే'*

అందుకే అర్థవంతమైన భావాలకు వీటిల్లో అద్దం పట్టారు. "ప్రాణం లేని మనిషిలా అర్థంలేని అక్షరానికి విలువ శూన్యం" అని కూడా తేల్చి చెప్పారు.

*'అలంకరణలు*
*ఆనందాన్ని ఇస్తాయి*
*కానీ ఆలోచనలకు*
*పదును పెట్టలేవు'*

కనుకనే శబ్దాలంకరణల మాటున కాక, తన అభివ్యక్తిని సూటియైన ఆలోచనలుగా అందించారు.

వ్యక్తిత్వ వికాసానికి యువతకు ఉపకరించే సందేశ భావనలు ఎన్నింటినో ఈ అలల సవ్వడి పొదువుకుంది. ఒక సూక్తిసుధ జాలువారే అక్షరపు జాలు ఈ సంపుటి.

***'ఓటమి సహజం***
***బరిలోకి దిగితే కదా***
***గెలుపు ఓటముల***
***నిజస్వరూపం తెలిసేది'***

అని 'అపజయాలు కలిగిన నాడే- గెలుపు పిలుపు వినిపిస్తుంది' అన్న ఆశంసనను అందించారు. ఏది సాధించాలన్నా సంకల్పబలమే గొప్పది అని చెబుతారు. అలాగే చిరునవ్వు మనిషికి అలంకారం అదో తీపి చిరునామా అంటారు. మోసం ఒక కళ, ఆర్భాటం ఒక అలంకారం కాకూడదని హితవు చెబుతారు. కొన్ని పునశ్చరణలుగా అనిపించినా నొక్కి చెప్పాల్సిన సంగతులకు పునరుక్తం ఒక బలీయమార్గం అనిపింపచేస్తారు.

'అండర్‌లైన్' చేసుకుని, 'అండర్‌స్టాండ్' చేసుకుంటే ఈ 'వండర్ వరల్డ్'లో బతకడానికి విలువల మార్గం సుగమం చేసుకునట్లే! ఈ 'అలల సవ్వడి' మదిలో గుడి కట్టుకుంటే- బుడిబుడి నడకల నుండే- 'తప్పటడుగులు' పడని ఒప్పులకుప్పగా గొప్పగా ఎదిగే సావధానం వుంది మరి!

***'ఏ భవనానికైనా***
***పునాదులే ఆధారం***
***దేశ భవిష్యత్తుకు***
***యువతే ఆధారం కదా!'***

అంటూ ఈ తరానికి డాక్టర్ వాసా ప్రభావతిగారు అందిస్తున్న జీవనవికాస కరదీపిక ఈ 'అలలసవ్వడి'. చేదుకున్నవారికి చేదుకున్నంత! అందుకున్న వారికి అందుకున్నంత!!

కవయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి గారిని మనసారా అభినందిస్తున్నాను. ఈ సంపుటి పాఠక సమాదరణ పాత్రం కాగలదని అభిలషిస్తున్నాను.

*అక్టోబర్ 2017*



# అనుభూతి అంచుల్లో

## చిగురాశల ఊహలలో (కవితా సంపుటి)
## - ఎన్వీ. రఘువీర్ ప్రతాప్

Poetry is the spontaneous overflow of powerful feelings. It takes its origin from emotion Reflected in Tranquillity ***-words worth***

**అం**తరించి పోతున్న ఉదాత్త విలువలపట్ల తాపం, నిజాన్ని నిర్భయంగా చెప్పగల ప్రతాపం- రెండూ సంతరించుకున్న కవిత్వం రఘువీర్ ప్రతాప్‌ది. "గోరంత దీపం కొండంత వెలుగు" కనుకనే-'చిగురాశల ఊహలలో'కి పాఠకులను తీసుకు వెళ్ళి, తన అనుభూతి సాంద్రతతో - ఆ 'పొయిటిక్ ఫీలింగ్స్' ను కలిగించి, కృతకృత్యుడు కాగలుగుతున్నాడు. ఆ దిశగా ఎదగగల్గుతున్నాడు.

***'కవిత్వం కలల పరిమళం***
***గుండె గవాక్షాలు విదిల్చిన చేదునిజం'***

అని సంభావించే తాను- తన చిట్టి కవిత 'కాగితం కొమ్మపై వాలే పిట్ట'గా సంభావిస్తాడు. అయితే - ఆ పిట్టమనసులో ఏముంది అంటే, పిడికెడంత ఆకాశమే కాదు, రెక్కల మాటున ముడుచుకున్న విశాల విశ్వమూ వుంది. పొయె'ట్రీ' మీద వాలే ఈ కవితా విహంగం ఊహలలో- అనంత వైవిధ్యం వుంది. ప్రకృతినీ, మానవ ప్రకృతినీ కూడా దర్శించి, తన అనుభవగత అనుభూతి పారమ్యతను ప్రదర్శించి, పాఠకజన హృదయాలను స్పర్శించి, రసపు జల్లులు వర్షించి, హర్షించిన

హృదయం కవికృత సందేశ ఉదయంలోకి జాగృతమయ్యే ప్రేరకుడవగలవాడీతడు. రఘువీర్ ప్రతాప్‌ది అలఘుకావ్య నిర్మాణం. సాధనాగత సమర్థ విన్నాణం.

To be a poet is a condition
Not a profession    ***- Robert frost***

అన్నట్లుగా- రఘువీర్‌ప్రతాప్ వృత్తి అటవీశాఖలో సూపరింటెండెంట్. కానీ ప్రవృత్తిలో కవిత్వరచనం అంటుతొడిగింది. సామాజికసేవ, చిత్రలేఖనం, ఓంశాంతి రాజయోగం- ఇవన్నీ ఆనుషంగిక ప్రవృత్తులే! ధర్మకేతనం సాహిత్య కళాపీఠం అధ్యక్షులుగా, తెలుగురక్షణ వేదిక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే- కవిత్వ కేతనం ఎగురవేస్తూ మానవీయ విలువల రక్షణకు కృషి చేస్తున్న సామాజిక జీవి ఈ కవి.

'అవ్యక్త' పేరుతో స్నేహం పేర తన సంపాదకత్వంలో వెలువరించిన కవితా సంకలనం, అలాగే శతాధిక కవుల బాల్యస్మృతుల సమాహారంగా వెలువరించిన 'అపురూపం' కవితా సంకలనం – రఘువీర్ సాటికవులను కూడా కూడగట్టగల సమరసహృదయ దక్షుడనడానికి కూడా నిదర్శనాలు. అవి మంచి కవితా సంకలనాల సరసన చేరిన సాహిత్యలోక ప్రశంసాసుమాలు.

మహబూబ్‌నగర్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని 'కల్వకోలు' గ్రామంలో జన్మించిన ఇతగాడు 'కలం – కౌలు'కు పుచ్చుకున్నట్లుగా, సాహిత్య వ్యవసాయంలో సాగిపోతూ, కొందరు 'ఎన్వీ' చెందేట్లుగానూ, ఎదుగుతున్న ఎన్వీ రఘువీర్‌ప్రతాప్ మరి!

'కవితాంజలి', 'అమ్మంటే', 'విశ్వరహస్య విశేషం', 'అంతర్వాహిని' వంటి సంపుటులు ఈ సరికే వెలువరించిన రఘువీర్‌ప్రతాప్ తాజా కవితా సంపుటి – 'చిగురాశల ఊహలలో'. నాలుగు పదుల కవితలున్న ఈ సంపుటి భావాల 'తలంటు'కు– కవిత్వ శరీరానికి 'నలుగు' 'పెట్టేదిగానే ఉంది. వీటిల్లో పర్యావరణ పరిరక్షణ గురించీ, జ్యోతీరావుపూలే, గురజాడ, గాంధీ, కాళోజీ, సినారె వంటి లబ్ధ ప్రతిష్ఠుల గురించీ, అమ్మగురించీ, కన్న ఊరుగురించీ, దయనీయ స్త్రీ స్థితిగతుల గురించీ – కవి 'నవకవితా వికాసం' ద్యోతకమౌతోంది. పఠిత

హృదయంలోకి ఆత్మీయ సమ్మోహనాస్త్రం సంధించగల 'అక్షరతపస్వి'గా, 'కొత్తమూస'లోకి 'కొత్త వెలుగు' లోకి 'ఊహలమ్మ' విస్తరిస్తున్న పదపాదపము ఇతగాడు.

'చిగురాశల ఊహలలో'ని వైవిధ్యాన్ని వాచవిగానైనా పరిచయం చేయకపోతే ఎలా?

'మెదడు పొరలు' అని ఎవరయినా అంటారు. 'మెదడు పొదలు' అని మొక్క వినియమరాగంలో ప్రయోగిస్తూ పర్యావరణ సందేశం– 'రాచపుండు'– 'జలజీవం' కవితల్లోనూ సంతరించాడు.

***"మొక్క వినిమయరాగాన్ని ఆలపించాలి.***
***పుడమి ఒడిలోకి పచ్చదనాన్ని పారించాలి***

***ప్రపంచదేహం***
***పాపపంకిలం కాకముందే***
***వినాశకర విషతుల్యాల వ్రణం***
***రాచపుండై పెరగక ముందే***
***మానవజాతి మేల్కోవాలి.***

**వనసంపద మట్టుబెట్టి**
**పర్యావరణం గొంతునులమకు**
**భూమి గుండెను తూట్లుపొడిచి**
**జలాన్ని తోడెయ్యకు"**

అని అటవీశాఖ వృత్తిజీవి కవితా ప్రవృత్తిలోనూ సందేశించడం– కమనీయ వృత్తి ప్రవృత్తుల సమన్వయమే!

రఘువీర్‌ప్రతాప్ 'అమ్మంటే' అన్న సంపుటినే వెలువరించాడు. అయినా తల్లిపట్ల తనకు గల ప్రేమాదర గౌరవాలు అనంతాలు. అమ్మను తలుచుకుని అడుగడుగునా ఆర్ద్రతతో తన్మయుడయ్యే తనయునిగా తలమునకలవుతూనే వుంటాడు. అది వేంకటశేషమ్మ గారి విశేషధన్యత!

'అమ్మేకాదు' ఆ 'తలంపు' కవితల్లో అంతటా ఆమెయే స్మరణీయమూర్తిగా దేవతలా అనంతాల్లోంచి దిగివచ్చి తల నిమురుతుంది. కవితల స్ఫూర్తిగా అమరుతుంది. అలాగే ఊరు గురించీ– 'ఆ కొమ్మకు పూచిన పువ్వునై', 'అపురూపం', 'చెలమనీటి జ్ఞాపకం' కవితల్లో స్మృతిపరీమళాన్ని ఆహ్వానిస్తాడు.

**"తనలో దాచుకున్న నా గుర్తుల్ని**
**ఊరు ఒక్కొక్కటిగా విప్పి చూపిస్తుంటే**
**ఎద పులకింతల వెన్నెల కాస్తోంది**
**మయూరమై పురివిప్పుతోంది"**

అని తనలో గీయబడ్డ సజీవచిత్రంగా తోడేకొద్దీ ఊరే చెలమనీటి జ్ఞాపకంగా ఊరునీ, దాని స్మృతుల 'సౌరు' నీ, అభివ్యక్తం చేశాడు. అలా 'అనుబంధాల సంద్రాన' స్నానించడం తనకు ఇష్టం.

సామాజికంగా కూడా రఘువీర్ ప్రతాప్ గొప్ప చైతన్య శీలి. సేవాపరాయణుడు, 'రక్షకుడు' కవితలో పాదరక్షలు కుట్టేవాడిని వైద్యుడిగా భావచిత్రీకరించడంలో, 'వర్ణరహితం' కవితలో సువర్ణకారుడి జీవితం ప్రపంచీకరణ మాయాజాలాన రూపెత్తిన పోకడను వర్ణించడంలో, 'కొత్తమూస'లో అందలమెక్కిన రాజకీయ అరాచకాన్ని–

***'పార్టీ ఏదైనా పదవే ముఖ్యమై***
***సిద్ధాంతాలేవైనా దోపిడే ప్రధానమన్నమాట!'***

అని నిజనిర్ధారణ చేయడంలో వర్తమాన వ్యవస్థారీతిని దృశ్యమానం చేయడంలో నేర్పరిగా, కొండొకచో తీర్పరిగా కూడా కనబడతాడు.

'పిడికిలి చిత్రాలు', 'నాకు ప్రమోషనొచ్చింది' కవితలు పిల్లల వసంతాన విహరింపచేస్తాయి. 'అమ్మా క్షమించు' కవితలో గర్భస్థ ఆడశిశుపిండం వేదన, 'మలిగే దీపాలు'లో ఎయిడ్స్ బాధితుల దుఃఖార్తి, 'సంస్కారబీజం'లో అత్యాచారాలకు వ్యతిరేకంగా 'ప్రతి ఇల్లు ఓ సంస్కృతి నేర్పే పాఠశాల కావాలి' అన్న సందేశ స్ఫూర్తి కానవస్తున్నాయి.

***"వాయువేగంతో మారుతున్న***
***ప్రపంచ పరిణామక్రమం***
***కాలాన్నధిగమించి***
***పదునవుతున్న మనిషి ఆలోచన"***

రఘువీర్‌ప్రతాప్ సవ్యంగా గ్రహించాడు. అందుకే –

***"నేస్తమా!***
***మనకు మనం విస్తరించుకుంటూ***
***మరో బాహుబలిలా బాధ్యతనెరిగి***
***మన నాగరికతకు***
***కొత్త ఊపిరిపోయాలి"***

అని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. రఘువీర్ ప్రతాప్ 'చిగురాశల ఊహలలో...' అనుభూతి చింతన ఉంది. అభ్యుదయ చేతన ఉంది. కవితాభివ్యక్తిలో మరింత నిర్మాణ విన్నాణం సంతరించుకోవడం తనకు కష్టమేమీ కాదు. కృషిలో ఖుషీ వెతుక్కునే సాధనాదక్షత గల కార్యశీలి కూడాను. తన కవితా ప్రస్థానం 'కొత్త వెలుగులు' వెదజల్లగల 'ఆశాజ్యోతి' కావాలని మనసారా ఆకాంక్షిస్తూ అభినందిద్దాం. కవితా పఠనానుభూతినాస్వాదిద్దాం– శుభమ్ భూయాత్!

A Writer only begins a book
a reader finishes it

**- *Samuel Johnson"***

*22 నవంబర్ 2013*




# తొలి సజీవనాటకం

## ప్రపంచపు ప్రథమ నాటకం భారతీయం
## – ఎన్.ఎస్.కామేశ్వరరావు

"పుట్టుటయూ నిజము
పోవుటయూ నిజము
నట్టనడిమి పని నాటకమూ
...నానాటి బ్రతుకూ నాటకమూ" అన్నాడు అన్నమయ్య.

'జీవితమే ఒక నాటకం' అనీ, 'ప్రపంచమే ఒక నాటకరంగం' అనీ, 'కనబడని చెయ్యేదో నడుపుతోంది నాటకం' అనీ, 'ఆ భగవంతుడే జగన్నాటక సూత్రధారి' అనీ, 'మనమంతా పాత్రలం' అనీ భారతీయంలోనే అసలు – ఒక భావన ప్రబలంగా వుంది. అందుకు కారణం – ప్రపంచపు ప్రథమనాటకం భారతీయం మరి!

Drama (డ్రామా) అనే పదం Action (యాక్షన్) అనే అర్థంలో గ్రీకు నుంచి వచ్చింది. పాశ్చాత్య సాహిత్యంతో ప్రభావితులైనవారంతా భరతుని నాట్యశాస్త్రాన్ని గుర్తెరుగక, ప్రపంచపు మొదటి నాటకం గ్రీసుదేశంలో పుట్టిందన్న మాట చెబుతూంటారు.

Drama does not just walk into your life
Either you create it, invite it, or associate with it.

సద్గురు జగ్గీవాసుదేవ్ అన్నట్లు – "ఒక నాటక ప్రదర్శనలో మూడువర్గాల మనుషులుంటారు. ఒక వర్గం ప్రేక్షకులయితే, నటులు మరోవర్గం కాగా, నాటక

ప్రదర్శన జరగడానికి వీలుకల్పించే దర్శకుడు, రంగస్థలం అమర్చే సాంకేతిక బృందం వగైరా మూడోవర్గం. జీవితం కూడా ఒక నాటకమే అన్నప్పుడు - మీరు జీవితంలో నటులు కావచ్చు, లేకపోతే నాటకం వల్ల ప్రభావితమయ్యే ప్రేక్షకుడూ కావచ్చు, లేకపోతే నాటకాన్ని సృష్టించే దర్శకుడూ కావచ్చు. ఎంపిక చేసుకునే అవకాశం మీకు లేకపోలేదు. మీలో దర్శకుడి పాత్ర చైతన్యవంతంగా వుంటే నాటకం మీరు కోరుకున్న విధంగా నడుస్తుంది. మీ బాహ్య జగత్తులోని నాటకం మీరు అనుకున్నట్లుగా మీరు నడపలేరు. ఎప్పుడయితే చుట్టూతా పరిస్థితుల మీ వెలుపలి నాటకం మీరు కోరుకున్నట్లు నడవడం లేదో - అప్పుడు దాని తరువాతి స్థాయి అయిన మీ మానసిక నాటకం- నియంత్రణ తప్పడం మొదలౌతుంది. మీ మానసిక నాటకానికి మీరే ఏకైక దర్శకులవ్వాలి.

మన చుట్టూరా జరిగే నాటకం జరుగుతూనే వుంటుంది. కానీ మానసికంగా మీలో నడుస్తున్న 'అంతర్నాటకం' మాత్రం నూటికి నూరుపాళ్ళు మీరనుకున్నట్లే సరిగ్గా నడుస్తూ వుంటే - బయటి పరిస్థితులు కూడా అవే దారికి వస్తాయి. అంతా చక్కగా, ఆనందదాయకంగా సాగుతూ వున్నప్పుడే ఇదంతా నాటకమేననీ, దాన్ని చక్కగా నిర్వహించాలనీ మీరు గ్రహించాలి".

'నాటకాంతం హి సాహిత్యం' అని కాళిదాసు అనడంలోనూ అంతటికీ, అన్నిటికీ శిఖరప్రాయమైనదీ, మకుటాయమానమైనదీ నాటకం అనేదే మూలాధారనాడి.

శ్రీ ఎన్. ఎస్. కామేశ్వరరావుగారు 'దైనందిన జీవితంలో మానవ ప్రవర్తననే మనం కళాత్మకంగా నటన అంటాం' అన్న అభిప్రాయంతో - మానవ జీవన సుదీర్ఘ (యీనాటి వరకూ సాగిన) ప్రయాణాన్ని మతం, కళలను మేళవించి ఒడిసిపట్టిన ప్రాజ్ఞులైన రచయిత. సుమారు ఆరుదశాబ్దాలుగా నటుడిగా, దర్శకుడిగానే కాక 'నాటక దర్శకత్వం', 'నాట్య శాస్త్రము-ఆధునిక నాటకశాస్త్రము', 'నాట్యశాస్త్రము-పొయెటిక్స్-తారతమ్యాలు', 'నాటక రంగవ్యాసాలు' అనే గొప్ప అధ్యయనశీలతతో కూడిన గ్రంథాలను నాటకరంగాభి మానులకు అందించిన మేటి రచయిత. భారతీయ నాటక రంగం గురించీ, మరీ ముఖ్యంగా మన తెలుగునాటకరంగం గురించీ ఆయనవలె ప్రామాణిక గ్రంథాలను అందించినవారు, రంగస్థలశాఖ విద్యార్థులనుండి, నాటకరంగంలో ప్రముఖులైన నటీనటులు, పండితులు, పెద్దలు సైతం పరామర్శించి ప్రశంసించే పరిశోధనాత్మక రచనలు చేసినవారూ చాలా అరుదు. వారిది ప్రశంసార్హమైన విలక్షణమార్గం.

'ప్రపంచపు ప్రథమనాటకం భారతీయం' అనే ఈ సరికొత్త వినూత్న రచన – కవిత్రయ ఆంధ్రమహాభారతంలోని తిక్కనగారి విరాటపర్వం ఆధారంగా, కామేశ్వరరావు గారు రూపొందించిన – 'అజ్ఞాతపాండవీయం' అనే నాటకం. ప్రపంచానికి భారతీయ నాటక ఆధిక్యతను, ప్రాశస్త్యాన్ని తెలియచెప్పగల సాధికారిక రచన ఇది. నాటకము–పుట్టు పూర్వోత్తరాలు ముందుగా తెలియచెప్పి–

"క్రీ.పూ. 5500 సంవత్సర ప్రాంతంలో ఒక అద్భుతమైన సంఘటన జరిగింది. ఈనాటి వరకు ప్రసిద్ధ కళాప్రక్రియగా పేరుగాంచిన నాటకం ఆనాడు భారతీయ జనజీవనంలో ఒక సాధారణ కార్యంలాగ జరిగిపోయింది! నిజానికి దానంతట అది యాదృచ్ఛికంగా జరిగిపోలేదు. ఆ కార్యసాధన ఒక మహత్తర ప్రణాళికాబద్ధంగా జరుపబడింది! ఆశ్చర్యం!" అంటూ మానవలోకంలో ప్రదర్శింపబడిన మొట్టమొదటి నాటకంగా మహాభారతకాలంలో విరాటరాజు కొలువులో పాండవుల అజ్ఞాతవాసమే ఆ సజీవ నాటకంగా – పాత్రలు, వేషధారణ, సంభాషణలతో సహా కనులముందు అక్షరాలా సాక్షాత్కరింపచేశారు. పాండవుల పురోహితుడైన ధౌమ్యుడు దర్శకుడే అయినా, నిజానికి ఏ పాత్రకాపాత్ర స్వీయదర్శకత్వంతో వ్యవహరించి రాణించిన అద్భుతనాటకం 'అజ్ఞాత పాండవీయం'.

వ్యుత్పత్తి, అభ్యాసాల భిత్తికపై ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలను నవీకరించుకునే ప్రతిభామూర్తి శ్రీ కామేశ్వరరావు గారు. ఎంతో ఔచిత్యాన్ని అవలంబించి వారు తిక్కనగారి భావాలను గ్రహిస్తూనే – స్వతంత్రించి, బోరీ, గంగూలీల భారత ప్రతులను అనుసరించి విరాటుని కొల్వులో పాండవుల ప్రవేశక్రమాన్ని మార్చి రచించి చూపారు. ధర్మరాజు, భీముని తర్వాత ద్రౌపది సైరంధ్రిగా సుధేష్ణ కొలువులో చేరడం చూపారు. యక్షునిగా యమధర్మరాజు వరం, అర్జునునికి ఊర్వశి శాపం ఈ నాటకంలో పాత్రల వేషభాషలకు, ఆహార్యానికి ఉపకరించిన వైనం విశదీకరించారు. 'అజ్ఞాత పాండవీయం'లో ఎక్కువగా క్లిష్ట పరిస్థితులకు గురైన నటుడు భీముడు. కార్యసాధకుడూ తనే! ఇతర పాత్రలతో నటనాసమన్వయం చేస్తూ, నాటకగమనాన్ని సుగమం చేసిన ధీరనాయకుడు భీముడు అన్న మాట యథార్థం! అలాగే ద్రౌపది ప్రపంచనాటకరంగంలో ప్రథమ నటీమణి అని సోపపత్తికంగా అంటారు. నాటకం మొత్తానికి వేషధారణ మార్పు అవసరమైన పాత్ర ఆయనే అన్నట్లు బృహన్నల అయిన అర్జునుడు– నపుంసక పాత్రకు ఒక ప్రాజ్ఞతను ఆనాడే సంతరించిన ప్రతిభాశాలి అర్జునుడు మరి!

‘అజ్ఞాత పాండవీయం’లో ప్రతినాయకపాత్ర కీచకుడి కారణంగా ఓ ‘అంతర్నాటకం’ జరగడం మరో విశేషం! భీముడు ఆ చీకటిరాత్రి ‘సైరంధ్రి’ గొంతును నర్తనశాలలో అనుకరించడం గొప్ప మిమిక్రీయే!

పాండవుల అభినయ కళాపరిచయాన్ని, మహాభారత కాల నిర్ణయాన్ని రచయిత చక్కగా వివరించారు. డా॥ పోణంగి శ్రీరామ అప్పారావుగారు గుప్త భావ ప్రకాశికా సహితముగా అనువదించిన భరతుని నాట్యశాస్త్రము గ్రంథాన్ని ఎన్. ఎస్. కామేశ్వరరావు గారు బాగా అవలోధనం చేశారు. అందువల్లే ఈ గ్రంథంలోని నాట్యశాస్త్రప్రభావం ప్రకరణంగానీ, అంతర్నాటకము (గర్భాంకము) పుట్టుపూర్వోత్తరాలుగానీ అద్భుత విశ్లేషణతో రూపొందాయి. అజ్ఞాత పాండవీయంలోనూ, ఆధునిక కన్యాశుల్కం నాటకంలోనూ అంతర్నాటకాలు ఆశువుగానే జరగడం, నాటక ప్రపంచంలోని అతివిశిష్ట సారూప్య సంఘటన అంటారు రచయిత. కాదనలేని కమనీయ వాస్తవం!

ఏమయినా ప్రపంచంలో ప్రథమ దృశ్య నాటక రూపం అరణ్యవాసానంతరం పాండవులు ఏడాదిపాటు ఆడిన అజ్ఞాతవాసవిధానమే అని చాటిచెప్పే రచన ఇది.

రామాయణ కాలంలో రావణాసురుడు సీతను ఎత్తుకుపోవడానికి వేసిన కపట భిక్షువు వేషం, మారీచుడు రామబాణం తాకి మరణిస్తూ – ‘హా సీతా! హా లక్ష్మణా’ అంటూ రాముని గొంతుతో చేసిన వాచికాభినయం వున్నా – అవి ‘ఏకపాత్రాభినయం’ వంటివి కాగా, ఏడాదిపాటు సాగిన పాండవుల అజ్ఞాతవాసం తిరుగులేని గొప్ప సమగ్ర రంగాలంకార శోభితమైన ‘పరిషత్తు నాటకం’ వంటిది మరి! భారతకాలంనాటి సజీవ ‘అజ్ఞాత పాండవీయం’ నాటకాన్ని ఇలా రూపొందించి రచించడం మాత్రమే కాక, ఆ పాత్రల స్వభావం, వేషధారణ, సంభాషణలు, అభినయం అన్నింటినీ ఇంత సాధికారికంగా, గొప్ప శేముషీ సంపన్నతతో రచించి అందిస్తున్న శ్రీ ఎన్. ఎస్. కామేశ్వరరావు గారు ఎంతయినా అభినందనీయులు. నాటకరంగం వారికి సదా అధమర్ణమై వుంటుంది. నాపట్ల గౌరవాదరాలతో ఈ ‘మున్నుడి’ కోరిన కామేశ్వరరావు గారికి నమస్సుమనస్సులు. శుభాకాంక్షలు.

*19 డిసెంబర్ 2017*




# మాటకారి నాటక రచనం

## ద్వాదశి - గురజాడ అప్పారావు

సాహిత్య ప్రక్రియలలో నాటకరచనకు ప్రాచీనులు పెద్దపీట వేశారు. 'నాటకాంతమ్ హి సాహిత్యం' అని దానినొక ఉన్నతీకరించిన స్థానం కల్పించారు. నిజానికి నాటకీయత అనేది ఒక మంచిలక్షణంగా మనం కథల్లో, నవలల్లో కూడా ప్రస్తావిస్తూ వుంటాం. పాత్రచిత్రణ, నాటకీయత రెండూ గొప్ప రచయిత రచనలోని గొప్ప లక్షణాలు.

ఆధునిక నాటకం అనేక గొప్ప సొబగులు సంతరించుకుంది. సాంకేతిక ప్రగతి నాటక ప్రదర్శనలకు తోడయ్యింది. ఇప్పటికీ పరిషత్తులు అనేకం నాటకపోటీలను నిర్వహించడం జరుగుతూనే వుంది. కానయితే నాటకాలు రాసే రచయితలే క్రమేపీ తగ్గిపోతున్నారు. ఒక నాటకం రాస్తే అది ప్రదర్శనకు నోచుకుంటేనే దాని ప్రయోజనం నెరవేరినట్లు. నాటక రచనాసామర్థ్యం గల పలువురు రచయితలు టీవీ సీరియల్స్ కో, ప్రచ్ఛన్నంగా సినిమాలకో రాసుకోవడం మేలు అనుకుంటున్నారు. నాటకాలు పత్రికలు ప్రచురించడం ఎప్పుడో మానేసాయి. నాటికల నాటకాల రచనను కూడా పత్రికలు, రేడియో పోటీగా నిర్వహించిన సువర్ణకాలమూ అంతరించింది.

పోటీనాటికలంటే వాటి ధోరణి వేరు. మునుపు కళాశాల వార్షికోత్సవాలకు, నవరాత్రులు ఉత్సవాలకు నాటక ప్రదర్శనలు జరిగేవి. అమెచ్యూర్ నాటక సంఘాలుండేవి. నాటకాలు వేయడం ఒక తపస్సుగా చేసినవారున్నారు. నటన

ఒక వ్యసనంగా జీవించిన వారున్నారు. ఇవాళ వాతావరణం మారింది. టీవీలు, సినిమాలు వచ్చాక రంగస్థలం మరింతగా దెబ్బతింది. అంతో ఇంతో నటనా ప్రతిభగల ప్రతివారూ రంగస్థల ప్రదర్శన చేయడంకన్నా తెరపై ముఖం కనబడాలని ఆరాటపడే ధోరణి ప్రబలింది. నాటకరంగస్థలం పూర్వవైభవాన్ని కోల్పోయినమాట కాదనలేని సత్యం. ఈ నేపథ్యంలో అసలు నాటకరచన పట్లనే ఎందరో రచయితల ఆసక్తి సన్నగిల్లింది.

రంగస్థలం పై నాటక ప్రదర్శనా కుతూహలంగల వారికి కూడా నాటకం పలురంగాలతో, స్త్రీ పాత్రలలో కూడినదై వుంటే ప్రదర్శనకు మరీ కష్టపడాలి. ఏకాంకిక నాటికలు, అందునా స్త్రీ పాత్ర లేని నాటికలు అయితే అమెచ్యూర్ సంస్థలవారికి చాలా ఉపయుక్తంగా వుంటాయి. ప్రదర్శన కూడా మరీ కష్టం కాదు. అయితే అలాంటి నాటికల్లో రచనాబలం బాగావున్నప్పుడే రాణిస్తాయి.

ఈ విషయం గురజాడ అప్పారావు గారికి తెలుసు. ఈయన కన్యాశుల్కం నాటకం రాసిన గురజాడ అప్పారావు కాదుసుమండీ! కానీ ఆ వంశీయుడే! ఆయనకు మనుమడి వరస అయ్యేవాడే! ఈ గురజాడ అప్పారావు రాసిన ఏకాంకికలు ద్వాదశి అనే ఈ గ్రంథం. ఇందులో సాహితీ రాజసూయం, శాంతిభద్రతలు అనే రెండు నాటికలున్నాయి. ఒకటి సాహిత్యరంగానికి, రెండవది రాజకీయరంగానికి సంబంధించినది. ఈ రెండు రంగాలూ నేటికాలాన ఎలా పరిణమిస్తున్నదీ మంచి వ్యంగ్యవైభవంతో వీటిల్లో రచయిత విశదపరిచారు. ఏనాటికలోనూ స్త్రీ పాత్ర లేదు. రెండూ సాంఘిక ఇతివృత్తాలే. ఎందులోనూ ఏడెనిమిది పాత్రలు మించిలేవు.

నిజానికి నాటికలంటే ప్రదర్శనలో చూసినప్పుడు ఆయా పాత్రధారుల ప్రతిభవల్ల బాగుంటూవుంటాయి. రచయిత రచనకు నటీనటులు ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. నిజానికి చూడటానికేగానీ నాటికలు చదువుకోవడానికి కాదు. కానీ సంభాషణా చాతుర్యంతో కూడిన రచనవల్ల, పాత్రోచిత అభివ్యక్తి వల్లా, ఈ రెండు నాటికలూ ముందు చదువుకోడానికి సరదాకలిగించడం ఒక విశేషం.

నిజానికి ఈ నాటికల్లో చెప్పుకోదగిన కథ అంటూ ఏమీలేదు. ముందే అనుకున్నట్లు ఒక ప్రహసన వైఖరి బాగా కనిపిస్తుంది. పానుగంటివారి 'కవితా రసిక ప్రహసనం' ఆరోజుల్లో ఎలా చమత్కార సంభరితంగా వుండేదో పాఠకులకు

తెలిసే వుంటుంది. ఈ సంపుటిలోని 'సాహితీరాజసూయం' వర్తమాన సాహిత్యధోరణుల పై ఆ బాపతు ఒక వ్యంగ్యరూపకం. పత్రికా విలేఖరుల వైఖరులు, సాహితీవేత్తలనేవారి కొందరి దర్పాలు, ఎవరికివారు నాయకత్వ ఆరాటాలతో కూటములు ఏర్పరుచుకోవడాలు, ఒక నూతన ప్రక్రియ అంటూ ఆరంభించి ఊదరగొట్టడాలు, సభలు సన్మానాల వైఖరులు, గ్రంథ ప్రచురణలు, ఆవిష్కరణలు జరుగుతున్న తీరులు, అవార్డులు, రివార్డుల భాగోతాలు ఇలాంటివాటినన్నింటినీ అప్పారావుగారు 'సాహితీరాజసూయం'లో నిష్కర్షగా, నిర్భీతిగా వెల్లడించారు. ఒక విధంగా వర్తమాన సాహిత్య విశ్లేషణను కూడా నర్మగర్భంగా ఇందులో కావించినట్లయింది. కవిత్వంలో పొటమరిస్తున్న కొత్త రచనా ధోరణులపై 'చినుకులు' అంటూ గురజాడ అప్పారావుగారు ఈ ఏకాంకికలో తెచ్చిన ప్రతిపాదన హాస్యం కోసమే అయినా, నిజానికి దానిని చేపట్టి ఎవరయినా నిర్వహించినా నేడు నివ్వెరపోవాల్సింది ఏమీ లేదు. 'పండిట్' అనే పాత్ర ద్వారా పత్రికా విలేఖరుల గోష్ఠి మూలాంశంగా సాగే 'సాహితీ రాజసూయం' నాటిక ఆలోచింపజేస్తుంది.

'శాంతిభద్రతలు' అనే రెండో ఏకాంకిక వర్తమాన రాజకీయాల మీద ఒక వ్యంగ్యాత్మక డాక్యుమెంటేషన్. ముఖ్యమంత్రి, హోం మినిస్టర్, డి.జి.పి., నగర పోలీస్ కమీషనర్, కొందరు విలేఖరులు ఈ ఏకాంకికలోని పాత్రలు. అధికార పక్షం ఆలోచనలు, విపక్షాల ఎత్తుగడలు, ప్రభుత్వ పథకాలు, వాటి అమలు తీరు తెన్నులు అలాగే ప్రాస్తావికంగా చలన చిత్రాల ప్రస్తావన వంటివన్నీ ఈ ఏకాంకికలో గురజాడ అప్పారావుగారు పాత్ర గత సంభాషణల ద్వారా చిత్రించారు.

ఈ రెండు ఏకాంకికల్లో నూ పత్రికా విలేఖరుల గోష్ఠి అనేది ఒక కామన్ పాయింట్. తన జర్నలిస్టు అనుభవం బహుశా వీటి రచనకు ఆయనకు బాగా ఉపకరించి వుంటుంది. నాటికల్లోంచి సంభాషణలు ఎత్తి చూపడం వంటి పనేమీ ఇక్కడ పెట్టుకోవటం లేదు. ఎందుకంటే ఈ నాటికల్లో వున్నదే సంభాషణా చాతుర్యం. మాటతీరుల నైపుణ్యం. అదే ఈ నాటికా రచనల మూలం.

ఈ రెండు నాటికలు చదివాక సాహిత్య, రాజకీయాల వర్తమాన ధోరణులు నేడు ఎలా వున్నది సుస్పష్టం కాకమానవు. నిజానికి మనం ఎందరమో అనుకుంటున్న విషయాలనే, సమాజంలోని ఆలోచనాశీలురు సాహిత్యం గురించి, రాజకీయాల

గురించి చేసుకుంటున్న వర్తమాన వ్యాఖ్యానాలే ఈ నాటికల్లో సంభాషణాత్మకంగా గోచరమవుతున్నాయి. అక్కడక్కడ కొన్ని సంభాషణలు చదవుతూంటే కొంత నిడివి ఎక్కువగా అనిపించవచ్చు. బహుశా ప్రదర్శనలో పాత్రధారుల నైపుణ్యంతో అవి సరిగ్గా అభివ్యక్తమై ఆ అపప్రథను తొలగించుకోగలవేమో తెలియదు. ఇంతకీ ఇవి ప్రదర్శనానుకూల ఏకాంకికలేనా అంటే ఔత్సాహిక నటీనటులే దానికి తీర్పరులుగా ముందుకు రావాల్సి వుంటుంది.

ఏమయినా దాపరికంలేని, ముసుగులు తొడగని సూటియైన, సుస్పష్ట సంభాషణలతో కొందరు సాహితీపరులనూ, రాజకీయాల వారినీ కూడా భుజాలు తడుముకొనగలిగేలా చేస్తూ, వర్తమాన వాస్తవాలకు అద్దం పడుతూ ఈ ఏకాంకికలందించిన గురజాడ వారిని అభినందించడానికి మొహమాట పడడం లేదు.

ముందుమాటలక్కరలేకుండా ముందుకు పోయి అందుకోదగిన మాటకారి నాటక రచయితకు-ప్రదర్శనలతో ప్రశస్తి లభించాలని ఆకాంక్ష!.

*ఏప్రిల్ 2011*




# విరిసిన రూపక సరోజం

## ప్రకృతికే ఆభరణాలు – డా॥ సరోజన బండ

'ఫీచర్స్' అనబడే రూపకాలు శ్రవ్యమాధ్యమమైన ఆకాశవాణిలో ఒక ప్రత్యేకతగలవి. రేడియోరూపకాలు అనేకం అశేష శ్రోతృజన సమూహాన్ని అలరించినవే. ముఖ్యంగా రేడియో– నిరక్షరాస్యులను కూడా చేరగల ఏకైక మాధ్యమంగా ఒకప్పుడు గొప్పవైభవ ప్రాభవాలతో అలరారింది. రూపక రచనను ప్రతిభావంతులైన ఎందరో రచయితలు చేయగా ప్రసారకర్తలు వాటిని రూపొందించి ఆయా 'స్పెషల్ ఆడియన్స్ ప్రోగ్రామ్స్' లో ప్రసారం చేస్తుండేవారు. ఆకాశవాణి కేవలం వినోదమాధ్యమంగా కాక విజ్ఞాన, వికాసాలకు దోహదపడింది. భాషా సాహిత్యాలకు, సంగీతానికి, సంస్కృతికి అది చేసిన సేవ నిరుపమానమైనదని ఒకతరం త్రికరణశుద్ధిగా అంగీకరిస్తుంది. రేడియోతో ఎదిగిన వారున్నారు.

సమాజంలోని విభిన్న వర్గాలకు ఉపయుక్తమైన కార్యక్రమాల రూపకల్పనలో, ప్రసారంలో ఆకాశవాణిదే ఆద్యకృషి. బాలానందం, బాలవినోదం వంటి పిల్లల కార్యక్రమాలు మొదలు, స్రవంతి వంటి వయోధికుల కార్యక్రమాల వరకూ అన్ని వర్గాల వారికీ ఉద్దేశించిన రేడియో కార్యక్రమాలలో విద్యార్థులకు అందునా ప్రాథమిక, ఉన్నత పాఠశాలా విద్యార్థులకు కూడా మధ్యాహ్నం ప్రసారాలువుండేవి. పలు పాఠశాలల్లో ఆ రోజుల్లో 'రేడియోపీరియడ్' కూడా వుండేది. పాఠ్యాంశాలను పాటలుగా, నాటకాలుగా, రూపకాలుగా మలిచి విద్యార్థులకొరకు సుబోధకంగా ప్రసారం చేయడం వుండేది. నిష్ణాతులైన

విద్యావేత్తలు వాటికి సహకరిస్తూండేవారు. అలాంటి ప్రసార రచయితలలో ఉత్తమ శ్రేణికి చెందిన రచయిత్రి సరోజన బండగారు. ఆకాశవాణికి అనేకరకాల రచనలు చేసి వైవిధ్య భరితమైన కార్యక్రమాలలో వారు పాలుపంచుకున్నవారు. పాఠశాల విద్యార్థుల కార్యక్రమాలలో పలు రూపకాలు రాసారావిడ. స్త్రీల కార్యక్రమాలలో, గ్రామస్తుల కార్యక్రమాలలో ఎన్నోమార్లు పాల్గొన్నారు. రేడియోరచన పట్టు తెలిసిన కలం వారిది.

'ప్రకృతికే ఆభరణాలు' అనే ఈ గ్రంథం సరోజన గారి రేడియో రూపకరచనా ప్రావీణ్యాన్ని మనముందుంచుతుంది. విద్యార్థి శ్రేయోదాయకమైన విషయాలనెన్నింటినో, పాఠ్యాంశగత సమాచారాన్నంతటినీ కొద్ది పాత్రలతో, నిర్ణీతవ్యవధిలో ప్రసారం నిమిత్తం సంతరించిన వైవిధ్య భరిత రూపకాలు ఇందులో వున్నాయి. వాతావరణ సమతుల్యత గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి, సత్యసంధత గురించి, రెడ్ క్రాస్ గురించి, కరుణామయి గురించి, ఏ విషయంపై రూపకరచన చేసినా వాటిల్లో సరోజనగారు సరళమైన భాషను, ఉపయుక్త సమాచారాన్ని, పాత్రోచిత సంభాషణలను సంతరించి శ్రోతలను అలరించే ప్రయత్నంచేశారు. ముఖ్యంగా రూపకరచనలో సంభాషణలు నాటకీయతతోకాక సహజత్వానికి దగ్గరగా వుంటాయనీ నిరూపించారు. చక్కగా దృశ్యీకరింపచేస్తూనే విషయ వివరణ చేస్తాయనీ నిరూపించారు. ఇవన్నీ రేడియోలో ప్రసారమైన రూపకాలే! వాటిని అలా గాలికి వదిలేయకుండా ఇలా అక్షరబద్ధం చేసి గ్రంథరూపంగా వెలువరిస్తున్నందుకు సరోజనగారిని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

*25 ఫిబ్రవరి 2016*




# వి(ద్యారంగ) ది(శానిర్దేశ) య(త్నం)

## విదియ - శ్రీ గురజాడ అప్పారావు

**భా**వితరాన్ని తీర్చిదిద్దేది ప్రధానంగా విద్యారంగం. విద్యావ్యవస్థ తీరుతెన్నుల మీదే, భవిష్యత్తరాల ప్రగతి ఆధారపడి వుంటుంది. ఒకప్పటి వీధి బడుల నుండి నేడు వీధివీధికీ వాణిజ్యం రూపెత్తిన వివిధ పాఠశాలల వ్యవస్థాపనవరకూ విద్యావిధానంలో, పాఠశాలల నిర్వహణల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. బ్రిటిష్ కాలం నాటి మెకాలే విద్యావిధానం మనలను గుమస్తాలుగా చేయడానికి తప్ప భారతీయ జీవన వికాసానికి ఏ విధంగానూ తోడ్పడలేదన్న విమర్శ నేటికీ వుంది. స్వాతంత్ర్యానంతరం కూడా మన విద్యావిధానం పాశ్చాత్య సంస్కృతికి, ఆంగ్ల విద్యకు అనుగుణంగానే అభివృద్ధి చెందుతూ వచ్చిందే తప్ప మనదైన భారతీయాన్ని సంతరించుకోలేదని విజ్ఞులు వాపోతూనే వున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అస్తిత్వాన్ని కోల్పోయి మేలయిన విద్య అంటే ప్రైవేట్ పాఠశాలల పై ఆధారపడే స్థితే దాపురించింది. నేతలు, ప్రభుత్వ పాలకులు ఎన్ని కబుర్లు చెప్పినా తమ పిల్లలను వారే ప్రభుత్వబడులకు పంపడం లేదంటే గవర్నమెంట్ స్కూల్స్ లో విద్య అంటే నేతిబీరకాయ చందంగా మారిందన్న విషాదపరిణామమే.

మిత్రులు గురజాడ అప్పారావు సహకార రంగంతో నేడు ముడిపడివున్న వారు. కానీ వృత్తిరీత్యా ఆయన ఒక అధ్యాపకుడే కాదు, సమాజాభ్యుదయ చింతగల సంస్కారి. కవిగా, రచయితగా ఇప్పటికే పేరు తెచ్చుకుని భారత

భాషాభూషణ్ బిరుదు గ్రహించిన వాడు. సాహిత్యరంగంలోనూ సహధర్మచారిణి విజయశ్రీతో కలిసి రచనా సంసారం సాగిస్తున్నాడు. అప్పారావు కలం విభిన్న పార్శ్వాలలోకి వంగుతూంటుంది. కవిత, కథ, వ్యాసం, నాటిక ఇలా పలు ప్రక్రియల్లో రచన చేస్తున్న కృషీవలుడు తాను. గురజాడ పేరిట సాహిత్య సంస్థను ఎంతోకాలంగా సమర్థవంతంగా నిర్వహిస్తున్న కార్యకర్త కూడాను.

సరికొత్తగా వెలువరిస్తున్న తన ఈ ప్రచురణ 'విదియ' రెండు నాటికల గుచ్ఛం. రెండూ విద్యారంగ వ్యవహారాలకు సంబంధించినవే కావడం విశేషం. 'విదియ' అని ఈ రెండు నాటికల సంకలనానికి పేరు పెట్టడంలో గొప్ప ఔచితి కనబడుతోంది. 'విద్యావ్యవస్థకు దిశానిర్దేశ యత్నం' వంటి తన ఆశయ భావనానుకూల నాటికల సంకలనం కనుక 'విదియ' అన్న పేరు పెట్టడం సముచితమే.

'విద్య న (అ) మ్ముకుంటున్నాం' అనే మొదటి నాటికలో విద్యాసాగర్ అనే ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ పాత్ర ప్రధానమయింది. నిజానికి ప్రైవేట్ పాఠశాలలు విద్య పేర వాణిజ్యం చేస్తున్నాయి.' అని నేడు ప్రధానంగా వినవస్తున్న మాట. కానీ ఈ నాటికలో అందుకు భిన్నంగా పిల్లలకు విద్యాబోధనకై అమ్ముకుంటున్నా, నమ్ముకుని పాఠాలు చెబుతున్నది వారేననిపించేలా రాసారు. ప్రభుత్వ పాఠశాలలపై అజమాయిషీ చేయవలసిన డి.ఇ.ఓలు ఎలా అవినీతి పరులుగా వ్యవహరిస్తున్నదీ. తమ హద్దులు మరచి విద్యారంగాన్ని ఎలా అప్రతిష్ఠ పాలు చేస్తున్నదీ ఆనందరావ్ పాత్రద్వారా చూపారు. న్యాయమూర్తి ఎదుట ఆనందరావ్ తీరుతెన్నులపై విద్యాసాగర్ స్వయంగా చేసే వాదం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభియోగాలకు సమాధానం చెప్పేతీరు విద్యాసాగర్ నిజంగా పేరుకు తగినట్లుగా విద్యా విషయంలో సాగర గంభీరమైన అధ్యయనం చేసినవాడిగా, విద్యా వ్యవస్థ తాలూకు లోటుపాట్లు, సారము ఎరిగినవాడుగా కనిపిస్తాడు. గురజాడ అప్పారావ్ విద్యాసాగర్ పాత్రలో పరకాయప్రవేశం చేసి విద్యారంగం గురించిన తన అధ్యయనశీలతను ఆవిష్కరించినట్లుగా తోస్తుంది. ప్రదర్శనానుకూలమైన ఈ నాటికలో కోర్టుసీనే ప్రధానమైందిగా చెప్పుకోవాలి. నాటికలో పాత్రధారుల సంభాషణలు మరీ సుదీర్ఘంగా వుండడం సబబు కాదని రచయితకు తెలుసు. అందుకే సూటిగా, దీటుగా సాగే సంభాషణలు కూర్చారు. "విద్యావ్యవస్థకు సంబంధించిన ఎన్నో

నగ్న సత్యాలను, చట్టాలలోని లోపాలను ఎత్తి చూపారు. చట్టాలలోని లోపాలను గుర్తించి వాటికి తగిన పరిష్కారాలు చూపమన్నట్లుగా ప్రభుత్వానికి సిఫార్సు చేసారు" అని నాటికలో న్యాయమూర్తి చివరలో విద్యాసాగర్ గురించి అన్న మాటలు రచయితకూ వర్తిస్తాయనాలి.

ఇక రెండవ నాటిక 'నేతి బీరకాయ'. నాటిక ప్రారంభంలోనే ప్రధానోపాధ్యాయుడి స్వగతం వుంది. మచ్చుకి అదే చాలు రచయిత నాటిక రచనా మనోగతం చెప్పడానికి. "ప్రభుత్వాలు మారినప్పుడల్లా నూతన విద్యావిధానాలంటూ వున్న విధానాన్ని మార్చటం ఏమిటో, ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులు ఏమిటో! ఎందుకు పాఠశాల స్థాయిని తగ్గిస్తున్నారో, పెంచుతున్నారో, ప్రాథమిక పాఠశాలనుండి జూనియర్ కళాశాల వరకూ ఒకే ఆవరణలో నిర్వహించటం ఏమిటో ఎవరికీ తెలియని బ్రహ్మరహస్యం" అంటూ స్వగతంతో మొదలవుతుందీ నాటిక. సుబ్బారావు ఆ పాఠశాలలో కొత్తగా ఉపాధ్యాయునిగా చేరడానికి రావడం, ఆ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయునికీ, సుబ్బారావుకీ నడుమ జరిగిన సంభాషణ రూపంలోనూ ఆ తరువాత తరగతి గదిలో విద్యార్థులతో భేటీ, డి.ఇ.ఓ పర్యవేక్షణకు రాగా తరగతి గదిలో సంధించబడిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు చెప్పడం ఈ రూపకంగా విద్యారంగ తీరుతెన్నులను రచయిత హాస్యంగా, వ్యంగ్యంగా విశ్లేషించే వైఖరి గోచరిస్తుంది.

'విదియ'లోని రెండు నాటికల్లోనూ డి.ఇ.ఓ పాత్రను కేంద్రీకృతం చేసి అధికారుల అలసత్వాన్నీ, అహంకారాన్నీ, అవినీతికర వైఖరులనూ రచయిత అప్పారావు నిర్ద్వంద్వంగా చిత్రీకరించడం విశేషం. విద్యావ్యవస్థ దిశాదరిద్ర యశస్సును హేళనగా 'విదియ' నాటికల సంభాషణల్లో గుర్తించగలం. ఏమయినా ఒకే ఆశయదీప్తి మూలకందంగా ఈ రెండు నాటికలను వెలుగులోకి తెస్తున్న అప్పారావు గారిని అభినందిస్తున్నాను. ప్రదర్శనలకు నోచుకుని ఇవి పఠితల, ప్రేక్షకుల ఆలోచనలకు, సముచిత పరివర్తనలకూ దోహదపడగలవని ఆకాంక్షిస్తున్నాను.

*జులై 2013*




# పృథ్వీవీరుడి దృశ్యచరిత్ర

## పృథ్వీరాజ్ (నాటకం) – తిరుమల వెంకటస్వామి

**భా**రతదేశ చరిత్ర పుటల్లో దేశభక్తి గల వీరులుగా, పౌరులుగా రాజపుత్ర వంశస్థులకు గల పేరు ప్రఖ్యాతులు అపారమైనవి. హిందూ ధర్మ పరిరక్షకులుగా యశస్సునార్జించిన ప్రముఖులూ వారే! రాజపుత్రుల్లో 'చౌహమాన' వంశానికి చెందిన పృథ్వీరాజ్ ఉత్తర భారతదేశాన్ని పాలించిన రెండవ చివరి హిందూ చక్రవర్తి. చివరి హిందూ చక్రవర్తి హేమూ తరువాత దేశం పరాయి పాలనాగతమైంది.

పృథ్వీరాజ్ చౌహాన్ గురించి రాజపుత్ర జానపద కథలు కూడా అనేకం ప్రాచుర్యంలో వున్నాయి. సాటిలేని మేటి చక్రవర్తిగా, కనౌజును పరిపాలించిన – శత్రురాజుగా సంభావింపబడే జయచంద్ కూతురైన సంయుక్తను ప్రేమించి లేవదీసుకుపోయి పెళ్లాడిన గొప్ప ప్రేమికునిగా పృథ్వీరాజ్ జన సాహిత్యంలో కూడా ప్రసిద్ధుడు.

శ్రీ తిరుమల వెంకటస్వామి గారు ప్రాచుర్యంలో వున్న ఆ కథలన్నిటినీ పరిశీలించి, ఆసక్తిదాయకమైన కల్పనలకు నాటకీయతను జోడించి, 'పృథ్వీరాజ్' నాటకం మలిచారు. పృథ్వీరాజ్ చౌహాన్ వీర పరాక్రమాలకే కాక, హైందవ ధర్మ పరిరక్షణకు, క్షమా దయా గుణ స్వభావానికి ప్రతీకగా ఒక ధీరోదాత్త నాయకుడిగా ఈ నాటకంలో కానవస్తాడు. అలాగే సంయుక్తా పృథ్వీరాజ్‌ల ప్రణయాన్ని మూర్తిమత్త్వం గావించారు రచయిత.

అజ్మీర్ రాజయిన సోమేశ్వర్ చౌహాన్, కర్పూరి దేవిలకు 1149లో జన్మించిన పృథ్వీరాజ్ చౌహాన్ చిన్న వయసులోనే సింహాసనాధిష్ఠుడయ్యాడు. 12వ శతాబ్దపు రెండవ అర్ధ భాగంలో అజ్మీర్, ఢిల్లీ జంట రాజధానులుగా ఉత్తర భారతాన్ని పాలించాడు. ఇప్పటి రాజస్థాన్, హర్యానా రాష్ట్రాలలోని చాలామటుకు ప్రాంతం పృథ్వీరాజ్ పాలనలో వుండేది. ముఖ్యంగా ముస్లిం దండయాత్రలకు వ్యతిరేకంగా రాజపుత్రులను సంఘటితం చేసిన పరాక్రమ శీలి పృథ్వీరాజ్. అదే సమయంలో శరణుజొచ్చిన పగవాడినయినా కరుణించి క్షమించాలన్న హిందూ మానవీయ ధర్మానికి మారుపేరుగా నిలిచి అదే ఆపదలు కొనితెచ్చినా వెనుదిరగని ధీరచిత్తుడుగా కనవస్తాడు.

1191 లో జరిగిన మొదటి తారాయిన్ యుద్ధంలో పృథ్వీరాజు అఫ్ఘన్ తురుష్క రాజయిన సుల్తాన్ మహ్మద్‌షాహబుద్దీన్ ఘోరీని ఓడించి గెలిచాడు. శరణు కోరాడని సంహరించక వదిలేశాడు. ఘోరీ పగతో తన బలగాలను పెంచుకొని 1192లో పృథ్వీరాజ్‌పై దండెత్తి పంచముఖ వ్యూహంతో ఓడించి పృథ్వీరాజ్‌ను బంధించి అఫ్ఘనిస్థాన్ కు తీసుకపోయాడు. పృథ్వీరాజ్‌తో బాటు అతని మిత్రుడు ఆస్థానకవి అయిన చాంద్‌భర్‌దాయ్‌ను కూడా తీసుకు వెళ్లాడని కథనం.

పృథ్వీరాజ్ గొప్ప అస్త్రవిద్యా నిపుణుడు. అందునా శబ్దభేది విద్య తెలిసినవాడు. పృథ్వీరాజ్ కళ్ళు పొడిపించి చెరసాలలో బంధించిన ఘోరీ అతని శబ్దభేది విద్యను తన ఆస్థానంలో ప్రదర్శింపచేసి వినోదించ తలిచాడనీ, అది అదనుగా తన కవిమిత్రుడు చాంద్‌భర్ సలహాతో నిండుకొలువులో పృథ్వీరాజ్ విద్యాప్రదర్శన వేళ బాణాన్ని ఘోరీకి గురిపెట్టి సంధించి వదిలి చంపేశాడనీ ఆ తరువాత తనను తాను పరిమార్చుకున్నాడనీ ఓ కథ బహుళ ప్రచారంలో వుంది. అలాగే చాంద్‌భర్‌దాయ్ పృథ్వీరాజ్–సంయుక్తల ప్రణయ గాథను 'పృథ్వీరాజ్‌సో' అనే కావ్యంగా రాశాడట.

శ్రీ తిరుమల వెంకటస్వామి గారు ఈ నాటకంలో ఆస్థానకవి బదులు రాజగురువును నిలిపారు. అలాగే పృథ్వీరాజ్ ఘోరీని క్షమించి వదలడం సేనాధిపతికి గానీ, మంత్రికి గానీ,రాజుగారి గురువులకు గానీ నచ్చకపోయినా హిందూ ధర్మంలోని క్షమాగుణ ప్రదర్శనతో ఆచరణలో తన జీవితంలో ఆ

దయను అనుష్ఠించి చూపిన గొప్ప చక్రవర్తిగా పృథ్వీరాజ్‌ను ఉన్నతంగా చిత్రించారు. అలాగే ఘోరీతో చేయికలిపి తను ప్రేమించి శౌర్య పరాక్రమాలతో స్వయంవరం నుండి గ్రహించి తెచ్చి పెళ్లాడిన సంయుక్త తండ్రి జయచంద్ర పాత్రను కూడా వెంకట స్వామిగారు నాటకీయతకు ఆసక్తిదాయకమైన విషయాలను, ఘట్టాలను చక్కగా తీర్చిదిద్ది, సమయోచిత సంభాషణలతో రక్తికట్టించే రచనోత్సాహాన్ని చూపడం నిజంగా అభినందనీయం.

సంయుక్త స్వయంవరానికి పృథ్వీరాజ్‌ను ఆహ్వానించకపోగా ద్వారపాలకశిలగా పృథ్వీరాజ్ ను చేసి జయచంద్ పెట్టడం, ఆ శిల వెనుకనుంచే సజీవంగా పృథ్వీరాజ్ వచ్చి స్వయంగా సంయుక్తను చేపట్టడం అనే ఘట్టం రమణీయంగా వుంది. ద్వారం వైపుకు వెడుతున్న సంయుక్తను తండ్రి ప్రశ్నించగా తాను వరించిన వారక్కడే వున్నారనగా 'ఆ పృథ్వీరాజా? ఆ శిలా విగ్రహమా' అని తండ్రి వికటాట్టహాసం చేయగా 'వారుకాదు నాన్నా శిల. మీరు శిల. మీ మనసు శిల' అని సంయుక్త చేత అనిపించడం గొప్పగా వుంది. అలాగే ఘోరీపై కదనానికి తానూ కదలివస్తానని భర్తతో సంయుక్త పలకడం రాజపుత్ర వీరవనిత లక్షణమే.

"నాలోని అణువణువు దేశమాత కోసం జీవించివున్నదే, శరీరం నాది కాదు దేశానిది. ఈ పరాక్రమం నాది కాదు దేశానిది. నీవు వీరపత్నిగా నుదుట కుంకుమ తిలకమద్ది హారతులిస్తే చాలు – ఇల్లాలి దీవెనలు ఇలవేల్పు దీవెనలుగా భావిస్తాను" అని పృథ్వీరాజ్ చేత చెప్పించిన సంభాషణల వంటివి అనేకం ఎంతో సన్నివేశ రమణీయంగా వెంకటస్వామి గారు రాశారు. అలాగే ఘోరీని చంపి గురుదేవులు, పృథ్వీరాజ్ పరస్పరం పొడుచుకు చచ్చిపోవడం కన్న ముందే, అతను ఓడి బందీ అయినాడనగానే సంయుక్త స్వీయహననానికి పాల్పడడం కూడా చిత్రిస్తూ సంయుక్త తన తండ్రికి రాసిన లేఖను ఆ జయచంద్ర చేతే చదివించడం కూడా – ఈ నాటక రచయిత మలచిన తీరు చెప్పుకోదగింది.

పృథ్వీరాజ్ జీవించింది కేవలం నలభై మూడు సంవత్సరాలు మాత్రమే! ఇప్పటికీ అఫ్ఘనిస్థాన్‌లో ఏటా, పృథ్వీరాజ్ సమాధిని తమ రాజు ఘోరీని చంపినందుకు అక్కడి దేశీయులు కొందరు తొక్కి తొక్కి ఆగ్రహ ప్రకటనం చేస్తూంటారట! రాజపుత్ర చరిత్రుల గాథల్లో పృథ్వీరాజ్ కథ – భారతదేశ ఔన్నత్యం

కోసం ప్రాణాలొడ్డిన గొప్ప హిందూ చక్రవర్తిగా, సంయుక్తా - పృథ్వీరాజ్‌ల అద్భుత ప్రణయకావ్యంగా ఎప్పటికీ నిలచి వెలిగేదే. భారతదేశానికి రాజపుత్రుల శౌర్య పరాక్రమ గాథల్లో చిరస్థాయి నార్జించుకున్నవాడు పృథ్వీరాజ్ చౌహాన్. చక్కటి చారిత్రక గాథకు ఆసక్తికరమైన నాటక రూపమిచ్చి, ఔచితీమంతమైన సంభాషణలతో మలచిన శ్రీ తిరుమల వెంకటస్వామి గారిని పఠితృలోకం సమాచరించగలదనీ, ఇది రంగస్థలాభిమానుల సమాదరణీయం కావాలనీ నా ఆకాంక్ష. శుభం భూయాత్!

*జూన్ 2015*



# వేదుల వాక్యం

## స్పందన (వ్యాస సంపుటి) - వేదుల శకుంతల

"చదువు రాని వాళ్ళు సూక్తుల గ్రంథాన్ని ఒకసారి చదివించుకుని వింటే చాలు" **- విన్‌స్టన్ చర్చిల్.**

తల పండిన ఓ రాజకీయవేత్త అన్నమాట అది.

ఒక సూక్తి, ఒక మంచిమాట ఎంత ప్రభావాన్ని కలిగించగలదో, మనిషిని విజ్ఞానవేత్తగా మలచగలదో, సంస్కారిగా నిలబెట్టగలదో వివరించే కథలు మనకున్నాయి. 'సహసా విదధీతన క్రియాం'... 'తొందరపడి ఏ పనీ చేయరాదు' అన్న మహాకవి భారవి తాటాకు శ్లోకం ఒక జీవితాన్ని, సంసారాన్ని నిలబెట్టిన కథ మనకు తెలుసు. నిజానికి మంచిమాటలు చెప్పడం చాలా కష్టం. ఎందుకంటే అవతలి వారు- మరొకరు తమకు 'ఏదో ఉద్బోధ చేస్తున్నారు' అనుకున్న మరుక్షణం బిర్రబిగుసుకుంటారు. ప్రభు సమ్మితాలు, మిత్ర సమ్మితాలు, కాంతా సమ్మితాలు... అనే వాటిల్లో శాసించే మాటలు, హితవు చెప్పే మాటలు, అనునయించే మాటలు వున్నప్పుడు కాంతా సమ్మితమైన వాక్యానికి వున్న ప్రభావగుణం మరీ గొప్పది.

"పురుషులకంటే స్త్రీలు విజ్ఞానవంతులు. ఎందువల్లనంటే స్త్రీలకు తెలిసినది తక్కువైనప్పటికీ అర్థం చేసుకునే శక్తి ఎక్కువ" అని ఒక జేమ్స్ స్టీఫెన్స్ అన్నా, "ఆడవారిని మించిన పుస్తకాలు, కళలు, అకాడమీలు లేవు. ఆడవారి హృదయాన్ని చదవగలిగితే అన్ని పుస్తకాలు చదివినట్లే. అన్ని కళలూ సాధించినట్లే" అని షేక్స్‌పియర్ అన్నా... తరచి చూస్తే అందులో అతిశయోక్తి ఏమీ లేదనిపిస్తుంది.

'స్పందన' పేరుతో శ్రీమతి వేదుల శకుంతలగారు కూర్చిన ఈ వ్యాస సంపుటి కూడా ఇందుకు దాఖలా. 'ఇతరులకి విసుగు కల్గించనివీ, మనతోపాటు పదిమందికి మేలు జరిగేవీ, చర్విత చర్వణమైనా అవి నిత్యనూతనాలై వర్ధిల్లుతాయి' అంటారు శకుంతల గారు. ఈ 'స్పందన' రచనలు అన్నీ శకుంతలగారి ఉదాత్త భావబలిమికీ, అనుభవ సంపత్తికీ, అర్థవంతమైన విషయాలను కాంతాసమ్మితంగా, ప్రయోజనదాయకంగా చేయగల అభివ్యక్తికీ దృష్టాంతాలు.

అభిప్రాయాలు కలిగేశక్తి అందరికీ వుండవచ్చు. కానీ, ఆలోచించగలిగే శక్తి కొద్ది మందికే వుంటుంది. తమ ఆలోచనలను అక్షరబద్ధం చేసి పఠితను కూడా ఆ అనుభవ ప్రపంచంలోకి తీసుకువెళ్లి ఆ భావాలను దర్శింపచేసి స్పందింప చేసే లక్షణం శకుంతలగారికి వుంది.

"ఈనాడు సగటుమనిషి సహజత్వం తానే కోల్పోయి కృత్రిమ జీవనానికి అలవాటు పడిపోతున్నాడు. ఇంటా-బయటా, మనసులో కూడా ఈ కృత్రిమం నిండిపోయి వాతావరణం యావత్తు కృత్రిమమే అయిపోతున్న రోజులివి." (కృత్రిమం)

"ఒక సద్గ్రంథం తరతరాల ఆస్తి. మంచి పుస్తకాల ఆవశ్యకత ఈనాటి ప్రజలకి ఎంతయినా వుంది. అవి గుర్తుంచుకొంటే ఎన్నో సత్ఫలితాలు సాధించవచ్చును. అంతేకానీ- ఖరీదైన సబ్బులూ, సుగంధ ద్రవ్యాలూ బోలెడన్ని కొని చర్మసౌందర్యమే ఆవశ్యకమనుకునే వారిని చూసి జాలిపడాలి. ఆత్మసౌందర్యం ఇనుమడిస్తేనే తనకేగాక, తన చుట్టూ సమాజంలో పరీమళాలు వెల్లివిరుస్తాయి." ('ఆవశ్యకత')

అదిగో- ఆ పరీమళాలు వెల్లివిరియచేయగల రచనలే ఈ 'స్పందన' అంశాలన్నీ. అత్యల్పమనుకునే విషయాలనుంచికూడా అనల్పమైన ఆలోచనలు ప్రేరేపించే తీరు, సౌరు ఈ రచనలది. ఇందులో స్పృశించని అంశం లేదేమో! ఏ అంశాన్ని గురించి చెప్పినా- ఏదో పైన తడమటం కాకుండా, నిజాయితీగా దాని గురించి గాఢంగా ఆలోచించి, అనుభూతమైన అంశాలనే అభివ్యక్తం చేసారు. చెప్పదలుచుకున్న విషయాలను అయోమయం, పులుముడు లేకుండా నిష్కర్షగా చెప్పారు.

ఇవి చదువుతుంటే "ఈ సంగతులన్నీ నాకు తెలిసినవే " అని పాఠకుడు అనుకున్నా, తనకు తెలిసిన సంగతులనే కొత్త పరిమళాలతో– తాను పట్టించుకోని, తనలోకి అనుభవసారంగా ఇంకించుకోని జడతను ఛేదించుకుని– గ్రహించి, ఆనందించేలా చేసారు రచయిత్రి.

ఈ పుస్తకం ఎప్పుడు, ఏ పేజీ తిప్పి, ఏ పేరా చదివినా ఒక సూక్తిమంతమైన, స్ఫూర్తిమంతమైన ఆలోచనకు స్పందన కలుగుతుంది కనుక 'స్పందన' అన్న పేరు సార్థకమే.

ఇవన్నీ 'వేద వాక్కులు' కాకపోవచ్చు. కానీ 'వేదుల వాక్కులు.' వేదుల శకుంతలగారు ఒక వేదనతో జీవితం గురించీ, విలువల గురించీ, మానవ సంబంధాల గురించీ, సువ్యవస్థ గురించీ కలవరించి, పలవరించే– హృదయం వికసించిన బుద్ధిజీవిగా చెప్పిన మాటలు ఇవన్నీ. "మనస్సు సక్రమంగా ఆలోచిస్తేనే మనిషి సక్రమంగా ప్రవర్తిస్తాడు. సక్రమ మార్గం వల్ల సమాజ శ్రేయస్సు పటిష్టంగా వుంటుంది". అని విశ్వసించినవారు కనుకనే రుగ్మతలు పోగొట్టుకునే 'క్యాప్సూల్స్'గా, 'మాత్రలు'గా, 'భావ గుళికలు' గా ఈ రచనలను రూపొందించారు.

ఆరోగ్యదాయకమైన మనుషుల కోసం, మనసుల కోసం, రేపటి మంచిరోజుల కోసం ఈ తరానికి 'ప్రిస్క్రయిబ్' చేయదగిన ఆలోచనా ఔషధం ఈ గ్రంథం. ముందుచూపు నిచ్చే ఈ 'స్పందనే' మంచి మందు. మున్ముందు ఈ రకం 'ఔషధ' ఉత్పత్తి– వేదుల శకుంతలగారు మరింతగా చేయగలరని ఆకాంక్ష.

*5 డిసెంబర్ 2001*




# రత్న దీధితులు

## మహనీయులు - చిరస్మరణీయులు - వై.వి.వి. రత్నం

తమ జీవితం ద్వారా, బోధనల ద్వారా జనావళికి స్ఫూర్తిదాయకమూ, ఆదర్శ నీయమూ అయిన మహనీయులు ఎందరో వున్నారు. వారంతా చిరస్మరణీయులే. వారిలో ప్రతి ఒక్కరిదీ నిజానికి ఒక ఉద్గ్రంథం. ఒక్కొక్కరి గురించీ సిద్ధాంత గ్రంథాలు వెలయించదగినంత విస్తార సమాచారం, పరిశోధనావకాశం ఉన్నది. 21వ శతాబ్దంలోకి అడుగుపెట్టిన మనం నేటికీ చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా, సామాజికంగా, సాహితీ సాంస్కృతిక పరంగా స్మరించ దగినవారుగా సంభావించిన ఇరవై ఒక్కమందిమహనీయులను గురించి శ్రీ వై.వి.రత్నంగారు 'మహనీయులు - చిరస్మరణీయులు' పేరిట ఈ పుస్తకాన్ని సంతరించారు. జర్నలిజం, టూరిజం, ప్రజాసంబంధాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తమ అభిరుచులుగా - సాంఘిక విద్యాశాఖలోనూ, ఆపై సమాచార పౌరసంబంధాల శాఖలోనూ వృత్తిరీత్యా ఉన్నత పదవులు నిర్వహించిన రత్నంగారు తమ ప్రవృత్తికి అనుగుణంగా - రత్నాల్లాంటి వ్యక్తులను గురించి క్లుప్తంగానూ, గాఢంగానూ వివరించారు. వారెన్నుకుని చెప్పిన మహనీయుల్లో విశ్వవిఖ్యాతులున్నారు. ఆంధ్ర రాష్ట్ర ప్రముఖులూ వున్నారు.

ఎవరి గురించి చెప్పినా కేవలం వారి జీవితరేఖలను ఇవ్వడం మాత్రమే కాకుండా, వారి జీవితంలోని ఉదాత్త లక్షణాలను, వారి బోధనల్లోని సార్వజనీనతను వివరించే కృషి చేసారు వై.వి.వి. రత్నం గారు. 'వై? వీరే విశిష్టులు' అని ప్రశ్నించే వీలు చిక్కని విశిష్ట వ్యక్తులే రత్నం గారు చెప్పిన వారంతా. అందులో

విప్రతిపత్తిలేదు. అయితే ఈ ఇరవై ఒక్కమందినీ ఏ ప్రణాళికా బద్ధంగా ఎంపిక చేసారంటే రత్నంగారు ఏమంటారో తెలీదుగానీ – బుద్ధుని, వివేకానందునీ, అరవిందుని బోధనలనూ, గాంధీ, నెహ్రూ, నేతాజీ, రాజేంద్రప్రసాద్‌ల రాజకీయ వైశిష్ట్యాన్నీ, మదర్ థెరిస్సా మానవకారుణ్యాన్నీ, అంబేద్కర్ సామాజిక న్యాయాన్నీ, రాధాకృష్ణన్ తాత్త్విక, విద్యావైదుష్యాన్నీ, దుర్గాబాయ్ స్త్రీ జనోద్ధరణ కృషినీ, రవీంద్రుడు, గురజాడ, సరోజినీ నాయుడు, గుర్రంజాషువాల సాహిత్య వైశిష్ట్యాన్నీ, రామ్మోహన్ రాయ్, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం గార్ల సంస్కరణాభిలాషనూ, పొట్టి శ్రీరాములు, ప్రకాశం, సర్ ఆర్థర్‌కాటన్ ఆంధ్రదేశానికి అందించిన వెలుగు జిలుగులనూ స్మరించుకోవడం ఈ పుస్తకం రచించడంలో రత్నంగారి ఉద్దేశం అని పఠితలు గ్రహించగలిగితే చాలుకదా!

ముఖ్యంగా ఈ పుస్తకం విద్యార్థులకు – అందునా ప్రాథమిక, హైస్కూల్ తరగతుల విద్యార్థులకు ఎక్కువ ఉపయుక్తంగా ఉండగలదు. అదే సమయంలో ఆ మహనీయులను వారి జయంతి సందర్భంగానో, వర్ధంతి సందర్భంగానో సభల్లో సమావేశాల్లో స్మరించుకోవడానికి వక్తలకూ ఎంతగానో ఉపకరించేదే. ఇలాంటి పుస్తకాలు సహజంగానే ఒక 'రెడీ రిఫరెన్స్' లక్షణాన్ని సంతరించుకుంటాయి. శ్రీ వై.వి.వి. రత్నంగారు దీనిని కేవలం మొదటి భాగంగా మాత్రమే తలచి 'మహనీయులు – చిరస్మరణీయులు, అయిన మరెందరి వృత్తాంతాలనో వివిధ రంగాలకు సంబంధించి ఒక ప్రణాళికా బద్ధంగా పొడిగించి వివరించే కృషి మునుముందు నిర్వహిస్తారనీ, నిర్వహించగలరనీ భావిస్తున్నాను.

రత్నంగారి కలం నిరంతర అభ్యాసశీలి. ఆయన గళం ఆకాశవాణిలోనూ విన్పించింది. షష్టిపూర్తి జరిగి నాలుగేళ్లవుతున్నా – నేటికీ ఇష్టపూర్తిగా నలుగురినీ కలుస్తూ, నాలుగుచోట్లా సంచరిస్తూ, నిరంతర అధ్యయనశీలిగా – ఉత్సాహంతో, చిరునవ్వుతో 'ఫ్రీలాన్స్ జర్నలిస్ట్'గా ఆయన చేస్తున్న కృషి బహుధా అభినందనీయం. కొందరి యువతకైనా ఎంతో స్ఫూర్తిదాయకం.

సహృదయులు, సాహిత్యాభిమాని అన్నింటికీ మించి గొప్ప స్నేహశీలురు అయిన శ్రీ వై.వి.వి. రత్నంగారికి ఆయురారోగ్య ఐశ్వర్యాలూ, కీర్తి ప్రతిష్ఠలూ సమకూరాలని మనసా నా ఆకాంక్ష. వారి రచనలు విద్యార్థిలోకానికి సముచితంగా ఉపలభ్యమై కరదీపికలు కాగలగాలని నా ఆశ.

*ఏప్రిల్ 2002*




# పరిచయపత్రం

## వేద విజ్ఞానలహరి – (ఉపన్యాస మంజరి) – యువభారతి

వేదం అంటే జ్ఞానం. జీవన నియతికి ప్రమాణం జ్ఞానం. విజ్ఞానం ఏదయినా జ్ఞానం వైపు నడిపించేది కాగలగాలి. ఎందుకంటే ఎప్పటికీ నిలిచేది జ్ఞానం. విజ్ఞానం కాలానుగుణంగా మార్పులు చెందవచ్చు. మనం సైన్సును 'విజ్ఞానం' అంటున్నాం. వేదం మటుకు 'జీవననాదం' అని, లౌకికతలోపడి విస్మరిస్తున్నాం. "నహిజ్ఞానేన సదృశం– పవిత్రమిహవిద్యతే" అని మనిషిని మనీషిగా పవిత్రుడిని చేసేది జ్ఞానం మాత్రమే అన్న గీతావాక్యం విశ్వసించగలిగితే, శ్రేయస్సుకు– అందునా సకల మానవాళి శ్రేయస్సుకు – అవరోధమయ్యేవిజ్ఞాన కర్మలనయినా సరే, భస్మం చేసేది జ్ఞానమే అని గుర్తించగలుగుతాం.

'వేదవిజ్ఞానలహరి' అంటే– జ్ఞానవిజ్ఞాన తరంగం అనే. లహరీ పరంపరలో కావ్య, పురాణేతిహాస, అభ్యుదయ సాహిత్య ఉపన్యాసాలను ఇప్పించి, గ్రంథాలుగా ప్రచురించిన యువభారతి ఏడేళ్ల క్రితం హాస్యలహరి తరువాత, ఇప్పుడీ 'వేదవిజ్ఞానలహరి'కి సమకట్టడం కొందరికి విడ్డూరంగా తోచవచ్చు. కాలాన్ని వెనక్కు తిప్పుతున్నారని కొందరు విమర్శించనూవచ్చు. కానీ కాలనుగుణంగా వెల్లువలో కొట్టుకుపోవడం కాక; సమాజాన్నీ, మానవీయతనూ నిలిచి నిలబెట్టడం కోసమే సాహిత్యం అనీ, విశ్వశ్రేయస్సు లక్ష్యమైన సాహిత్యం– నిజమైన ఆలోచనామృతంగా, పడగొట్టేది, విడగొట్టేదీ కాక– నిలబెట్టేదీ, బ్రతికించేదీ అనే ప్రగాఢ విశ్వాసం కారణంగానే– ఎప్పుడూ సమ్యక్ దృష్టితో ముందుకువెడుతున్న

క్రమక్రమాగత చైతన్య ధనుష్పాణిగానే సంస్థ ఇవాళ 'వేదవిజ్ఞానలహరి'కి సమకట్టింది. విస్మృతమౌతున్న మూలాధారనాడి పట్టింది.

మూలాలను వదలి, ప్రపంచీకరణజాలంలో చిక్కుకుని జీవన మూల్యాలనే ఆర్థిక ప్రయోజనాలకు పణంపెడుతూ, ఛిద్రమవుతున్న బతుకుల్లో- అసలైన సారాన్ని గ్రహించే దిశగా అడుగులు వేయవలసిన అవసరాన్నీ, అందిపుచ్చుకోవలసిన అగత్యాన్నీ గుర్తించినందు వల్లనే- ఈ సాహసం చేస్తున్నది. సాహసభావనలే సాహిత్యవిజయాలకూ మూలం. ఋక్కులు, యజుస్సులు, సామలు అన్నీ కలిసిపోయి ఒక్కటిగావున్న వేదాన్ని- వ్యాసుడు నాలుగు వేదాలుగా విభజించి 'వేదవ్యాసుడు' అయ్యాడంటారు. శాఖోపశాఖలుగా ఎంతవిస్తరించినా- ఒక్క శాఖే మొత్తం 'తరువు' కాజాలనట్లుగానే, ఎన్ని వాదాలు, ఉద్యమాలు, ఇజాలుగా, ఇవాళ విభాగాలు విభాగాలుగా ప్రాచుర్యమవుతున్నా, సాహిత్యం అంతా వాస్తవంగా ఒక్కటేననీ, తరువు మూలాలు మరచి చిటారుకొమ్మల మిఠాయిపొట్లాల గురించి పోట్లాటలు కావించుకోవడం అర్థరహితం అనీ గ్రహించుకోగలగాలి. ముఖ్యంగా సాహిత్యం పట్ల 'సమ్యక్‌దృష్టి' పెంచుకోగలగాలి.

వేదాలు అపౌరుషేయాలు అనీ, మౌఖికంగానే వ్యాప్తి చెందాయనీ, వేదమంత్రాలు ఉదాత్త, అనుదాత్త, స్వరితాది ఉచ్చారణ ప్రాముఖ్యంగా నిర్దుష్ట ప్రయోజనాలను సాధిస్తాయనీ- మనం వింటూ వస్తున్నమాట. వేదాధ్యయనం చేసినా- అందులో ఏముందో, దాని భావం ఏమిటో తెలియకుండా వల్లెవేసే వారే మిగిలే కాలం వచ్చినందువలన, అర్థజ్ఞానం లేక- 'అర్థం లేని చదువు వ్యర్థం' అన్న చందాన తయారై, సమాజంలో వేదపండితుడంటే ఒక జీవనభృతికై ఆరాటపడేవాడు అనుకునే దశవస్తోంది! సమాజానికి సంబంధించిన సమష్టి సంక్షేమ జ్ఞాన సంపత్తిని, వేదాధ్యయనతత్పరులు వైయక్తిక ప్రయోజనాలకు వినియోగించుకుంటూ, జ్ఞాన సంపత్తిగలవారమని పెత్తనం చేసారనీ నిందించినవారూ వున్నారు. ఈ వైరుధ్య భావనల్లోంచి వివేకోదయంకలగాలి.

శ్రుతి, అనుశ్రవం, త్రయి, ఆమ్నాయం, సమామ్నాయం, ఛన్దం, స్వాధ్యాయం, ఆగమం, నిగమం వంటి వన్నీ వేదాలకు వున్న పేర్లే. మాక్స్ ముల్లర్ వంటి పాశ్చాత్యులు మన వేదాల గురించి ఎంతగానో శ్రద్ధ పెట్టారు. మనకే, వేదం అంటే- పెళ్లిళ్లకూ, ఏదో కొన్ని క్రతువులకూ, గుడిలో దేవుడి మంత్రాలకు

సంబంధించింది అన్న భావన నేడు ఎక్కువగా ఏర్పడిపోయింది. వర్తమాన సమాజంలో కులవివక్షరహిత సమాజం గురించి ఆదర్శాలు వల్లిస్తూనే వేదం పేరెత్తిన వారికి కులాన్ని, వర్ణాహంకారాన్నీ ఆపాదించడం మామూలైపోయింది.

'అన్నీ వేదాల్లోనే ఉన్నాయిట' అంటే- ఆలోచించకుండానే అపహాస్యం చేసేవారూ వున్నారు. కానీ అధ్యయన గుణశీలత్వం ఏదీ? నేటి యువతరంలో ఒక సమ్యక్ దృష్టిని కలిగించడానికీ, అధ్యయనగుణం అభివృద్ధి పరచడానికీ, ఉరుకుల పరుగుల వేగవంతమైన ఈ కాలంలో, తమకోసం తాము నిలిచి అంతర్ముఖమయ్యే అవకాశం ఇవ్వడానికీ, సాహిత్యం ఉపకరించాలనేదే యువభారతి ఆరాటం. పైపై మెరుగులకు భ్రమసి, రాత్రికిరాత్రే పేరూ, డబ్బూ వచ్చేయాలనే ఆరాటాలతో పనిచేయడం కాక, వాటి గురించి వెంపర్లాడడం కాక, ఉన్నతమైన, ఉదాత్తమైన విలువలుగల వారిగా యువత ఎదగాలనీ, వారి వ్యక్తిత్వాలు వికసించాలనీ, యువభారతి నలభైఏళ్లకుపైగా కృషిచేస్తూవుంది. ఇప్పటికి నూటడెబ్బై అయిదు ప్రచురణలు వచ్చాయి. యువభారతి ప్రచురణలు గమనించిన వారెవరయినా వాటిల్లోని వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని, వెలువడిన మా ఆ ప్రచురణలవెనుక గల ఆశయాన్నీ అవగతం చేసుకోగలరు. కథలు, కవితలు, నవలలు వంటి కాల్పనిక సాహిత్య వ్యాపార ప్రచురణలు చేయడం సంస్థ లక్ష్యం కాదు.

'వేద విజ్ఞానలహరి' ఉపన్యాసాలు, పుస్తక ప్రచురణ వెనుక యువభారతి సంకల్పం కూడా మార్కెటింగ్ ప్రయోజనాలు సాధించడంకాదు. మునుపు డా॥ ఎన్.బి.రఘునాథాచార్యగారి సంపాదకత్వంలో ఆర్షవిజ్ఞాన సర్వస్వము, శ్రీ దాశరథి రంగాచార్యులు గారు వేదాలకు తెలుగుచేసిన బృహద్గ్రంథాలు వెలువడ్డాయి. ఐనా వేదాలలో వున్న విజ్ఞానశాస్త్ర అంశాలను ఈ తరం వారికి తెలియచెప్పాలన్న సంకల్పమే- 'వేద విజ్ఞానలహరి' - తలపెట్టడానికి కారణం. మాన్యులు శ్రీ.కె.వి.రమణాచారిగారి అండదండలే లేకపోతే ఈ పూనిక కార్యరూపం దాల్చగలిగేదేకాదు. ఉపన్యాసకులను, వేదాలలోని ఆ శాస్త్రవిజ్ఞాన అంశాలకు మాత్రమే ప్రాముఖ్యం ఇస్తూ ప్రసంగించమనీ, వేదాలలోవున్న ఆ విషయాలనే క్రోడీకరించి వ్యాసరూపంగా కూడా ఇవ్వమనీ కోరడం జరిగింది.

ప్రాసంగికులందరూ విజ్ఞులూ, పండితులూ. వారి వారి అవకాశాలమేరకు సమర్థవంతంగా ప్రసంగాలు చేసారు. అయితే వక్తలయిన వారందరూ గొప్ప వ్యాసకర్తలు కాగలరనీ, వ్యాసకర్తలైన వారంతా ఉత్తమ ప్రాసంగికులు కాగలరనీ అనుకోలేం! వ్యాసాన్నీ, ఉపన్యాసాన్నీ సవ్యసాచిత్వంతో నడపగలనేర్పు అందరినుండీ ఆశించలేం.

ఉపన్యాస వేళలో కొందరు వ్యక్తులు మాట్లాడిన అంశాలు ఒక గ్రంథంగా సంతరించదగినంతగా లేవు. (ఈ మాట స్థాయిని బట్టి కాదు. కేవలం పరిమాణం బట్టి అంటున్నదిగా మనవి.) అందువల్ల వ్యాసరూపంగా సవిస్తరంగా రాసి ఇమ్మని కోరాం. వయోభారం కారణంగానూ, ఇతరేతర కార్యభారాల వల్లా, కొందరు ముందు తమ అశక్తతను వెల్లడించినా, పట్టుదలతో ప్రసంగాలకు ఒక వ్యాసరూపం కల్పించడం, మొత్తానికి జరిగింది. నాలుగువేదాలలోని సామాజిక విజ్ఞాన శాస్త్రాంశాలనూ ఈ వ్యాసాల్లో క్రోడీకరించే ప్రయత్నం జరిగింది. ఇది సమగ్రం కాదని మాకు తెలుసు. ఒక ప్రయత్నం మాత్రమే. సముచిత ప్రయత్నమని మా విశ్వాసం.

వేదాల ప్రాశస్త్యం- ఋగ్వేదంలోని సామాజిక విజ్ఞాన శాస్త్రాంశాల గురించి డా॥ విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 'వేదే సర్వం ప్రతిష్ఠితమ్' వేదాల్లో అన్నీ వున్నాయి అన్నదానికి వాచవిగా దేవతాస్తుతి పరమైన మంత్రాల సమూహమైన ఋగ్వేదం ఆధారంగా వేదాల పరమార్థం ఆధ్యాత్మికమే అయినా అవి సాంఘిక విజ్ఞాన శాస్త్రాంశాలనెన్నిటినో మనకు తెలియజేస్తాయి అని- వ్యవసాయం, వైద్యం, ఆరోగ్యం, చైతన్యం, అంతశ్శుద్ధి, సంతానం, యజ్ఞయాగాలు సత్కార్యాచరణ, లోకశ్రేయస్సువంటి విషయాలను వివరించారు.

డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణ శర్మగారు యజుర్వేదం గురించి వాటిల్లోని తైత్తిరీయ, శుక్ల, మొదలయిన శాఖల గురించీ, వేదవిజ్ఞానంలో నీరు, నిప్పు, విద్యుత్తు మొదలయినవాటి గురించి, అలాగే శ్రీకృష్ణయజుర్వేదంలోని సంఖ్యేయవాచకపదాలతో వున్న హోమమంత్రాలు తెలుపుతున్న గణిత విశేషాల గురించీ, జ్యోతిషాది విషయాల గురించీ, హరప్పాముద్రికలో నమకరుద్రుడు గురించీ, సాంఘికాచారాల విశేషాల గురించీ వివరించారు.

డా॥ రేమెళ్ళ అవధానులు గారు సామవేద ప్రాశస్త్యం- సామాజిక విజ్ఞాన శాస్త్రాంశాలు వివరిస్తూ- సంగీతానికి ఆధారం సామవేదం అంటూ సామవేదశాఖల గురించీ, సంహితలోని విభాగాల గురించీ, సామవేదంలో గణిత, జ్యోతిష, ద్రవ్యవిజ్ఞాన, విశ్వవిజ్ఞాన, పదార్థనిర్మాణ, అణువులు పరమాణువులు గురించి ప్రస్తావితమైన అంశాలను గురించి, 'తత్' అనబడే ఆధునికుల 'సమ్‌థింగ్' గురించీ వివరించారు.

'సామవేదంలో అరణ్యకాండ- దాని ఆంతర్యము' అనే ఒక వ్యాసాన్ని శ్రీ మాణిక్యశర్మ గారు రాయగా, అన్నం గురించీ, రాత్రి గురించి కూడా వివేచించే ఆ రచనను ఈ సంపుటిలో చేర్చాం.

డా॥ రాళ్లబండి కవితా ప్రసాద్ గారు 'మానవజీవనసారం-అధర్వవేదం' అంటూ ప్రసంగించి, ఎంతో పఠనయోగ్యంగా మలచివ్రాసిన వ్యాసంలో అధర్వవేదం గొప్పతనం, అధర్వవేదశాఖలు, అధర్వవేదంలో మన జీవితానికి ఉపయోగపడే అనేక విషయాలు 22 వర్గాలుగా ఎలా వింగడింపబడ్డాయో వివరించారు. అధర్వవేదంలోని ప్రాణ, శత్రునిర్మూలన, పృథివీ సూక్తాలను వర్తమాన కాలనుగుణంగా విశ్లేషిస్తూ చూపారు. వేదాలలో అన్నీ వున్నాయనేది తెలుసుకోవాలంటే- అన్వేషణ, అందుకు భాష, తపస్సు, గురుశుశ్రూష, అధ్యయనం, సంయమనం కావాలని ప్రబోధించారు.

వేదసాహిత్యాన్ని సంక్షిప్తంగా పరిచయం చేసే డా॥ కొత్తపల్లి ఘనశ్యామల ప్రసాదరావుగారి వ్యాసం ఈ సంకలనంలో అందిస్తున్నాం. చతుర్వేద సంహితలను, బ్రాహ్మణములను, అరణ్యకములను, ఉపనిషత్తులను, వేదార్థ ప్రవచనాలను దిఙ్మాత్రంగా పరిచయం చేసేది ఈ వ్యాసం.

ఈ వ్యాసాలలో కొన్ని అంశాలు పునరుక్తమై కన్పించవచ్చు. ఆయా ప్రసంగకర్తలు, వ్యాసకర్తలు అలా చెప్పినవీ, వ్రాసినవీ చర్విత చర్వణాలుగా కాక, వేదగతమైన ఆ ప్రత్యేక అంశాలను పఠితల మనస్సుల్లో బలీయంగా నాటుకోవాలని సంకల్పించి చెప్పినవిగా గ్రహించినప్పుడు, వాటి ప్రాధాన్యం తెలుస్తుంది.

వేదాలలోని విజ్ఞానశాస్త్ర అంశాలను ఆసక్తిదాయకంగా కొంతమేరకయినా పరిచయం చేసి, తద్వారా వేదాధ్యయన కుతూహలం రేకెత్తించడమే ఈ ప్రచురణ ఉద్దేశం. పుస్తకముద్రణలో అనివార్యంగా దారితప్పి దొర్లిన తప్పులకు మన్నించండి. ప్రచురణ పూర్వవిరాళం 25 రూపాయలే అయినా, వందరూపాయల ఈవిలువైన గ్రంథాన్ని అన్నమాట ప్రకారం నవంబర్ ఒకటవ తేదీకే వెలువరించ గలుగుతున్నందుకు సంతోషిస్తున్నాం. మీ సూచనలు, సలహాలు మాకెన్నడూ సమాదరణీయాలు.

చిత్తశుద్ధితో, నిజాయితీతో, అంకితభావంతో, సమ్యక్ దృష్టితో చుట్టూరావున్న చీకటిలో ప్రయత్నించి మేం వెలిగిస్తున్న ఓ చిరుదీపమైన ఈ ప్రచురణను సమాదరించి జ్ఞాన కాంతులను విస్తరింపచేస్తారని ఆకాంక్షిస్తున్నాం.

*1 నవంబర్ 2009*



# అంతరించని వేమన్న అస్తిత్వం

## వేమన్న వేదం - ఆరుద్ర

"తిక్కన, వేమన, గురజాడ అసలైన తెలుగు కవిత్రయం" అంటాడు శ్రీశ్రీ. వారి వారి కాలాల చారిత్రక నేపథ్యంలో, నాటి ఆర్థిక సంబంధాల మూలమట్టాలపై నిలబడిన సామాజిక వ్యవస్థలో, ఆ కాలపు పరిమితులలో, తమ మేరకు అభివృద్ధికరమైన పాత్రను, ప్రజాభ్యుదయ భావనల పంథాను - అవలంబించిన కవులు వారు! ఆయా కాలాల్లోని 'మూసవ్యవస్థ' ను నిరసించి, భిన్నంగా నిలచి, కొత్త చూపు సంధించిన వారు. సమాజం గౌరవించదగిన నిజమైన ప్రజాకవులు. భాషా, భావాల మధ్య ఒక సారూప్యతను సాధించిన వీరి కవిత్వం- నేరుగా, జీవితానుభవసార అభివ్యక్తిగా సాగడం గమనించగల్గుతాం! భక్తినీ, తత్త్వాన్నీ, నీతినీ, సమాజ నియతినీ దేనిని చెప్పినా సమాజ కవులనదగినవారు జనం నోళ్లలో ఉంటారు. మనసు తడుముతూ, గుండెను దూసుకుపోతూ, ఉపదేశ విశ్లేషణ చేస్తూ, సూటిదనం, భావతీక్షణత రెండూ పెనవేసుకున్న కవిత్వ ధోరణి వీరిది. అందుకే శ్రీశ్రీ వీరిని తెలుగువారి కవిత్రయం అన్నాడు.

ముఖ్యంగా వేమన సమాజకవి. ప్రజాకవి. 19వ శతాబ్దం మొదలు వరకూ ఆంధ్ర సాహిత్య చరిత్రకారులెవ్వరూ వేమనను ప్రామాణిక కవిగా గుర్తించలేదు. కావలి వేంకట రామస్వామి, గురజాడ శ్రీరామమూర్తి, కందుకూరి వీరేశలింగం గారలు వ్రాసిన తెలుగు వాఙ్మయ చరిత్రలలో వేమన ఊసే లేదు! వేద పురాణాలు, ధర్మమత శాస్త్ర గ్రంథాలూ, విగ్రహారాధన... ఇవన్నీ వేమన

నిరసనకు గురికావడం వల్లనే సాంఘిక విప్లవకారుడైన వేమన పట్ల వైముఖ్యమూ, తిరస్కారమూ, ఉదాసీనతా నాటి విద్వాంసులు, పండితులు కలిగి ఉండవచ్చు. ఛందో వ్యాకరణాలతో సుదీర్ఘ సంస్కృత సమాసాలతో కావ్యాలు అల్లగలిగిన వారినే కవులుగా సంభావించే నాటికాలంలో కవిగా వేమనను గుర్తించకపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదేమో! రాజులను, రాజాస్థానాలను కూడా అతను లక్ష్యపెట్టలేదు. ఆత్మస్థైర్యంతో, చిత్తశుద్ధితో, స్వేచ్ఛాప్రకటనంతో నిలిచాడు వేమన.

"మానసిక అశాంతిలో జీవితపు అరాచకంలో సామాజిక సంక్షోభంలో పడి నలిగిన భావుకుడు వేమన. తన అనుభవం మేరకు చేదునిజాల్ని సంధించాడు కాబట్టి వేమన 'సృజనాత్మక అరాచకవాది'గా కనిపిస్తాడు. అది అతని తిరుగుబాటు తత్త్వం తేల్చిన సాంఘిక యథార్థం. దాని జన్మస్థానమూ, గమ్యస్థానమూ ఫ్యూడల్ సమాజమే" అంటాడు జ్వాలాముఖి.

తెలుగు పండితలోకం పట్టించుకోకున్నా, వేమన కవిత్వం తొలిసారిగా– అబ్బె.జె.ఎ.దిబువ అనే ఫ్రెంచి రచయిత 'హిందూ మేనర్స్ కస్టమ్స్ అండ్ సెర్మెనీస్' అనే గ్రంథంలో సుప్రసిద్ధుడైన కవిగా వేమనను ప్రశంసించడంతో విదేశీయుల దృష్టిని ఆకర్షించింది ఈ గ్రంథం. సి.పి. బ్రౌన్ కు వేమన కవితతో పరిచయం కలిగి, మొదటగా వేమన పద్యాలను సేకరించి, పరిష్కరించి, వాటిని ముద్రించడానికి హేతువయ్యింది. ఇంగ్లీష్, ల్యాటిన్ భాషల్లోకి అవి– అనువాదమయ్యాయి. డా॥ జి.యు. పోప్, మేజర్ ఆర్. ఎమ్. మ్యాక్ డొనాల్డ్, డబ్ల్యూ.హెచ్.క్యాంప్బెల్ – నిశ్చయంగా వేమన ప్రజల కవి అనీ, గొప్ప సమాజసంస్కర్త అనీ ప్రశంసించారు. 'వేమన– పాశ్చాత్యులు' అనే మరుపూరి కోదండరామిరెడ్డి గారి గ్రంథం – వేమనను పాశ్చాత్యులు స్వీకరించిన వైనాలనూ, నేపథ్యాలను వివరిస్తుంది. 1829లో ఈస్టిండియా కంపెనీ ఖర్చులతో వేమన పద్యాలు ముద్రితమై, స్కూళ్లలో పాఠ్యగ్రంథంగా కూడా బ్రౌన్ పెట్టించినప్పుడు – వేదనింద, దైవదూషణల పద్యాలు పాఠ్య పుస్తకం కావడంతో అగ్రవర్ణాల ప్రతిఘటన కూడా వచ్చింది. బ్రిటీష్ పాలకులు మ్యాక్డోనాల్డు అధ్యక్షతన స్కూళ్ల ఇన్స్పెక్టర్ హెన్రీ బవర్సు, డా॥మురడాక్ వగైరా సభ్యులతో, విచారణ సంఘాన్ని కూడా వేసింది. (దాని నివేదిక 1874 లో కానీ రానేలేదు. తమ సామ్రాజ్యవాద ప్రయోజన పరిరక్షణకు తమకు విధేయులైన ఉన్నత వర్గాలను మానసికంగా గాయపరచరాదని వేమనపద్యాల నిషేధం సమంజసమేనని డా॥ జె॥ మురడాక్ వంటి వారు అభిప్రాయాలు చెప్పారు) వేమన ఆవిధంగానూ సంచలనం తెచ్చినవాడయ్యాడు.

తదాది క్రమేపీ వేమన కవిత్వం తిరస్కారాలనూ, ఉదాసీనతలనూ ఎదుర్కొని ప్రజాదరణ పొందింది. కట్టమంచి రామలింగారెడ్డి గారన్నట్లుగా - "సృజనాత్మకశక్తికీ, సునిశిత హాస్యానికీ, వ్యంగ్యానికీ, స్వాభావికతకూ, నిస్సంకోచమైన భావప్రకటనకూ, మూఢవిశ్వాసాల ఖండనకూ, కాపట్య నిరసనకూ తెలుగు వాఙ్మయంలో వేమనను మించిన కవిలేడు. ఆయన కవిత్వం స్వచ్ఛమైన చలమశైలిలో, భావనలో స్వతంత్రమైనది. అప్రయత్నంగా పెల్లుబుకేది. అతని ఉత్ప్రేక్షలు, ఉపమానాలు అన్నీ పల్లె దృశ్యాలనుండి, గ్రామీణ వాతావరణం నుండి, వనాలనుండి గ్రహించబడ్డాయి. వేమన ప్రకృతి కవి, సహజకవి" (కవిత్వ తత్త్వవిచారం).

వేమనపై పరిశోధనకు కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు ప్రాతిపదికలు వేశారు. వంగూరి సుబ్బారావు, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, శేషాద్రి రమణకవులు, వేటూరు ప్రభాకరశాస్త్రి, నార్ల వేంకటేశ్వరరావు, బండారు తమ్మయ్య, చాగంటి శేషయ్య, వేదం వేంకట కృష్ణశర్మ, రాయవరపు పూర్ణయాచారి, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి , సి.రామకృష్ణారావు, ఆరుద్ర, మరుపూరి కోదండరామిరెడ్డి, ఎన్. గోపి మొదలైన ఎందరో వేమన వ్యక్తిత్వ కవిత్వాలను గురించి సాహిత్య ప్రపంచానికి చాటి చెప్పారు.

వేమన గురించిన కట్టుకథలూ వున్నాయి. అసలు వేమన పద్యాలు ఎన్ని? వేమన పేరున చొరబడినవి ఎన్ని? అన్నది ఇంకా శేషప్రశ్న! 'విశ్వద' అనే వేశ్యాలోలుడనీ, 'అభిరాముడు' అతని గురువనీ, వారికి చేసిన ద్రోహానికి పరిహారంగా తన పద్యాల మకుటంలో వారి పేర్లను శాశ్వతం చేసాడనీ అంటారు.

***"ఊరుకొండవీడు ఉనికి పశ్చిమవీధి***
***మూకచింతపల్లె మొదటి వీడు***
***అరసిచూడ బయలు అది ముక్తి శివుడయా***
***విశ్వదాభిరామ వినురవేమ!"***

అన్న పద్యం వేమన ప్రాంతాన్ని గురించి తెలిపేదే కాక, జీవుని(శివభక్తుడు లేక అచలయోగి) పారమ్యాన్ని తెలియజేసే మార్మిక వాద నివేదనగా కూడా కానవస్తుంది!

ఏమైనా వేమన రాయలసీమ వాడన్నది నిర్ధారింపబడిన విషయం. 1650 ప్రాంతంలో జీవించి ఉన్నాడని పరిశోధకులు నిర్ణయించారు. శైవాన్ని అభిమానించాడు. వేమన వృత్తి రీత్యా కాపు. అంటే వ్యవసాయదారుడు. సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా పైకి వచ్చిన హోదా వల్ల రెడ్ల యింటివాడిగా నిర్ధారింపబడ్డాడు. అయినా "వేమనను ఒక కులం కొక్కానికి తగిలించి ఆరాధించబూనడం, యోగిగా పూజింపబూనడం ఆధునిక యుగావసరాన్ని, ప్రజాస్వామిక ధర్మాన్ని కాలరాయడం కాగలదు" అంటాడు జ్వాలాముఖి.

వేమన వెల్లడించిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ,నైతిక ,తాత్త్విక, మతపర భావాలు నేటి ప్రయోజనాలకు ఎలా ఉపయుక్తాలో భావించి, ఆమేరకు స్వీకరించడం ప్రజాస్వామిక లక్షణం అన్న మాట యథార్థం. భిన్నాభిప్రాయాల, భిన్న అస్తిత్వాల వాతావరణంలో, అధిక సంఖ్యాకులైన ప్రజలకు సహజీవన సంస్కరణా విలువలను ప్రబోధించే వేమన పద్యాలు- నిజంగా "సామాజికావసరాలు". 'వేదం' అంటే సమాజాన్ని అభ్యుదయ పథంలో నడిపించే 'మాట'-'బాట.' అందుకే 'వేమన్న వేదం' పేరుతో - ఆరుద్ర వేనవేల వేమన పద్యాల నుండి - వేమన సమగ్ర చింతనకు ప్రాతినిధ్యమనదగిన వైవిధ్యభరితమైన నలభై పద్యాలను ఎంచుకుని, సాగించిన సామాజిక వ్యాఖ్యను యువభారతి 1974 లో తొలిసారి ప్రచురించింది. 1974 ఉగాదికి వేసినది పదివేలపైగా ప్రతులైనా, విజయదశమికే అయిదువేలకు పైగా రెండవముద్రణ ప్రతులకు నోచుకుంది. 1981లో వేసినవీ అయిపోగా, ఈ 2010 కృష్ణాష్టమికి మళ్ళీ వెయ్యి ప్రతులు ప్రచురించబడ్డాయి. అవీ అయిపోయి, ఇదిగో! ఇప్పుడిది 'అయిదవ ముద్రణం'. కాలావధులను అధిగమిస్తూ, వేమన వంటి సామాజిక కవి, జాతి అభ్యుదయానికి 'దీపధారి'గా వుంటాడనడానకి - ఇదీ నిదర్శనమే! జనమమేకమైన కవి జనం నాల్కలమీద, గుండెలమీద సదా నిలచి వుంటాడు! అతడే వేమన! ఈ తరం- జీవన వికాసానికి వేమనను అధ్యయనం చేయాలన్న మా మనవే వేమన్న వేదం పునర్ముద్రణం! ఇందుకు దోహద పడినవారు భవితకు దోహదపడినవారు. యువభారతి ధన్యం.

*నవంబర్ 2010*




# స్నేహ శీకరం

## సమాలోచన (సాహిత్య వ్యాససమాహారం)
## - శేషం రామానుజాచార్యులు

ఇంటిపేరు శేషంగానీ, తను నిజంగా ఒక విశేషం. అశేషమైన శేముషిని సొంతం చేసుకుని కూడా అతి సామాన్యంగా వర్తించగలగడం చూస్తాం. పద్యం రాసినా, వ్యాసం రాసినా, పండుగ గురించి విశేషాలు చెప్పినా, పరమార్థ విషయాన్ని చెప్పినా రామానుజాచార్యుల రచనలో విషయ వివరణం, విషయానురక్తి రెండూ నిండుగా వుంటాయి. ఆకాశవాణిలో కేశవపంతుల నరసింహశాస్త్రిగారి తరువాత సంస్కృత విభాగానికి కొన్నాళ్లు తాను కార్యక్రమ నిర్వహణాధికారిగా వుండి రూపొందించిన కార్యక్రమాలు, ఆహూతుల సమక్షంలో సంస్కృత దినోత్సవాన్ని నిర్వర్తించడం– శేషంలోని ప్రతిభావిశేషమే.

1968 నుండి అధ్యాపకవృత్తిలో వున్నప్పుడే 'భారతి'వంటి సాహిత్యపత్రికల సమాదరణ నందుకున్నాడు. తాను చేసిన సాహిత్య సమాలోచనలు విద్వన్మణుల ప్రశంసలు అందుకున్నాయి. తెలుగు సాహిత్యం పట్లా, భాషపట్లా విద్యార్థులలో అనురక్తిని పెంచిన మంచి గురువు తాను. శ్రీశ్రీ తర్వాత జాతీయస్థాయిలో తెలుగు సినిమాపాటకు అవార్డునందుకున్న శ్రీ సుద్దాల అశోక్‌తేజ తనకు పాఠం చెప్పిన శేషం వారిని నేటికీ గౌరవాదరాలతో సంభావించడం అందుకు ఒక తార్కాణం.

సుమనస్కుడయిన శేషం ఆడంబరాలకు, ఆర్భాటాలకు విముఖుడు. 'దుప్పటి వున్న మేరకు కాళ్లు చాచుకోవడమే మంచిది' అనుకునేవాడేగానీ, అతిశయాలకు

పోయేవాడు కాదు. ఇల్లాలిని, పిల్లలను అభివృద్ధిలోకి తీసుకురావాలనే తలంపుతో తన ఆర్థికవనరులను ఒక నియతితో వెచ్చించాడే గానీ, ఉద్యోగ బాధ్యతల్లో వుండగా ఎక్కువగా పుస్తక ప్రచురణల గురించి తాపత్రయపడలేదు. అయినప్పటికీ "చైతన్యరేఖలు" కవిత, "తిరుప్పావై' పద్యానువాదం, 'అహో! ఆంధ్రభోజా' పద్యకవితా గ్రంథాలను మాత్రం వెలువరించాడు. కొడాలి వారి "హంపీక్షేత్రం" ఎంత విశిష్టమైనదో శేషం 'అహో! ఆంధ్రభోజా' చారిత్రక కావ్యం కూడా అదే రీతి ప్రశంసలు పొంది, అవార్డును కూడా గెలుచుకుంది. షష్టిపూర్తికి సమాయత్తమవుతూ పదవీవిరమణకు దగ్గరవుతున్న తరుణంలో మిత్రులందరి ప్రోద్బలంతో తన వచనరచనలను వెలుగులోకి తేవడానికి సంకల్పించడం ఎంతయినా అభినందనీయం. ఏడాదికి పైగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో వారం వారం రాసిన 'చింతన' 'చింతనామృతం'గా వెలుగు చూస్తుండగా, గతంలోనూ, ఇటీవలా రాసిన 29 సాహిత్య, సాంస్కృతిక వ్యాసాలను 'సమాలోచనం' పేరిట ఈ గ్రంథంగా రూపొందించాడు.

మిత్రుడు ఏది రాసినా తన తొలి శ్రోతలలో నన్నొకడిగా స్వీకరించినందుకు సంతోషిస్తూంటాను. అపారమైన పాండితీ గరిమ కలిగివుండి కూడా సాటివారి సలహాలు సూచనలు అభిలషించడం, సహృదయ విమర్శలను ఔదలదాల్చి, చెప్పే విషయంలో సమగ్రతకు, రసనిష్ఠకు కృషి చేయడం తనలోని వినయసంపన్నత.

కలం పట్టినపుడు మాత్రమే కాదు, గళం విప్పినప్పుడూ తను మంచి వ్యాఖ్యాత. అందుకు ప్రబల నిదర్శనం తిరుపతి బ్రహ్మోత్సవాలకూ, యాదగిరిగుట్టలో నృసింహస్వామి కళ్యాణోత్సవాలకూ, భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి కళ్యాణమహోత్సవాలకు, ఆకాశవాణి, దూరదర్శన్‌ల ద్వారా తాను అందించిన ప్రత్యక్ష వ్యాఖ్యానాలు. పద్యాన్ని హృద్యంగా పలుకుతూ, రసరమ్యంగా వేడుకలను వ్యాఖ్యానించి విడమరిచి చెప్పడం తనలోని ఉపజ్ఞ.

ఈ 'సమాలోచన' గ్రంథంలో వున్న వ్యాసాలు శేషం రామానుజాచార్యుల సాహితీ సంపత్తికి, వ్యాఖ్యానసరళికి, సమీక్షా ఫణితికి దర్పణాలు. ఇందులోని కొన్ని రచనలు ఇటీవలివి కాగా మరికొన్ని చాలాకాలం క్రితం రాసినవి. ఊహించే మేధ పదునెక్కుతున్న కొద్దీ, వ్యుత్పత్తి పెరుగుతున్న కొద్దీ, కలం రాటు దేరుతున్న కొద్దీ రచన పరిపుష్టమూ, సమగ్రమూ కాగలుగుతుందన్నది వాస్తవం. ఈ

వ్యాసాలలోతుల్లోకి వెళ్లి వాటిల్లో శేషం శేముషిని విశ్లేషించుకోవడం – రసగ్రహణ పారీణులైన పాఠకుల వంతే! ఉటంకింపులు మొదలు పెడితే పుటలు పెరిగిపోతాయి మరి!

శేషం రామానుజాచార్యులు, మంత్రవాది సుధాకర్, నేనూ ఆకాశవాణిలో సహోద్యోగులం. సన్మిత్రులం. పులిహోర, దద్ధోజనం, చక్కెరపొంగలి అంటూ (ఎవరు ఏదో తెలియదుగానీ) మమ్ములను ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణాధికారి శ్రీ అట్లూరి వెంకట్రావ్ చౌదరి తమాషాగా అంటూండేవారు. జనవరి 2006లో మిత్రుడు శేషం రామానుజాచార్య పదవీ విరమణ అంటే నమ్మ బుద్ధికానంత యౌవ్వనపు చలాకీదనం, వేగం మిత్రునిలో వున్నాయి. 'వయసు శరీరానికే కానీ మనసుకు కాదు' అనడానికి తానొక తార్కాణం.

తెలుగు సాహితీలోకంలో ఇప్పుడు వెలువరిస్తున్న ఈ గ్రంథాల ద్వారా మిత్రుడు మరింత ఖ్యాతినొందాలనీ, శేషం వారి సాహితీ సౌరభాలను పాఠక ప్రపంచం అందుకుని సమాదరించాలనీ మనసారా కాంక్షిస్తున్నాను. తన పుస్తకాలకి మిత్రునిగా నాచేత నాలుగు మాటలు వ్రాయించుకుంటున్న తన ప్రేమాభిమానాలకు సదా అధమర్ణుడను.

*8 ఆగస్టు 2005*



# భావన

## మనోవీక్షణం - ఆచార్య ఎస్వీ రామారావు

*బోద్ధారో మత్సర గ్రస్తాః ప్రభవః స్మయదూషితాః*
*అబోధోపహతాశ్చాఽ న్యే జీర్ణమఙ్గే సుభాషితమ్*

అంటాడు భర్తృహరి. తెలిసినవారు మత్సర పూర్ణమతులుగానూ, ప్రభువులు ప్రబలగర్వవిదూషితులుగానూ, ఇతరులు తెలుసుకోలేకనూ వుండడం వలన నా మంచి మాటలేవో నా తలంపుల్లోనే జీర్ణమైపోతున్నాయి అని అతని ఆర్తి! సుభాషితాలు, నీతులు అనగానే నేటి కాలాన అవేవో కేవల గ్రంథస్థ విషయాలు గానూ, ఆచరణయోగ్యంకానివిగానూ, చేతకాక చేతులు ముడుచుకు కూర్చున్నవారి వృథాభాషణలుగానూ భావించేవారున్నారు. అందువల్లే రానురాను మంచిమాటలు చెప్పేవారూ తగ్గిపోతున్నారు. ఎందుకంటే ప్రయోజనంలేని పెడచెవిన పెట్టే ప్రజ పెరుగుతున్నప్పుడు, ఆలోచనలు అభివ్యక్తమయ్యే వీలు మందగిస్తుంది. మాటకన్న మౌనం బంగారం అనిపిస్తుంది. కానీ పరిస్థితులకు జడవక, తమ వంతు కర్తవ్యాన్ని మనసా, వాచా, కర్మణా సమాజహితం కోసం వెచ్చించేవారు తమ ప్రయత్నాన్ని విడిచి పెట్టరు.

సన్తః స్వయం పరహితే విహితాభియోగాః

అన్నట్లు పరహితాచరణమతులైన సజ్జనులు తమ మనోవీక్షణాన్ని తమలోనే గుప్తపరుచుకోక బహిర్గతం చేస్తారు. సదాలోచనలు అక్షరాలుగా, మాటలుగా ప్రయుక్తమైనప్పుడు ఏ ఒక్క ఎదను కదలించినా అవి సార్థకమైనట్లే.

'అన్వీక్షణం,' 'సమవీక్షణం', 'అభివీక్షణం' గతంలో వ్యాససంపుటులుగా వెలువరించిన సాహిత్యలోక యశస్వి – ఎస్వీ రామారావుగారు సరికొత్తగా ఇప్పుడు 'మనోవీక్షణం' ప్రసంగ సంకలనం పఠితృలోకం ముందుంచుతున్నారు. ఇది ఆకాశవాణి ప్రసంగ సంపుటి. రేడియోలో వారి శాబ్దిక ప్రసంగాలకు ఇవి అక్షర వ్యాసరూపాలు !

హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం తన ప్రభాత ప్రసారంలో వినిపించే 'భావన' కార్యక్రమం ఆలోచనామృతమూ, జ్యోతిపథ నిర్దేశనమూ అయిన సాహిత్యసుధలనూ, మహనీయుల మహితోక్తులనూ అందించడానికి నిర్దేశించింది. అయిదు నిమిషాల ప్రసార వ్యవధిలో రూపొందే కార్యక్రమం అది. శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్న 'థాట్ ఫర్ ది డే' కార్యక్రమం అది.

నిజానికి ఓ పావుగంటసేపు రేడియోలో ప్రసంగించడం కొంతమేరకు వెసులుబాటు కావచ్చుగానీ, కేవలం నాలుగైదు నిముషాలు మించకుండా ఒక అంశం మీద శ్రోతను ఆకట్టుకోవడం, ఆ అంశానికి సంబంధించిన విషయవివరణం చేయడం సులభసాధ్యమేమీ కాదు.

"వ్యక్తి జీవన పథానికే కాదు, అతడు సృష్టించే కావ్య జీవితానికి కూడా ప్రణాళిక అవసరం. గ్రంథరచన సౌష్ఠవమైన ఆకృతిని ధరించాలంటే దానికి చక్కని అంగముల కూర్పులో పొందిక అవసరం. కావ్యంలోని వివిధ ప్రకరణాలే దాని అంగాలు. గ్రంథంలోని విషయవిభాగాలకు క్రమమైన ప్రణాళిక లోపిస్తే ఆ గ్రంథ ప్రయోజనం దెబ్బతింటుంది" అంటూ "ప్రణాళిక అంటే ఒక కార్యం సఫలం కావడానికి అవలంబించవలసిన విధానరూపకల్పన" అని ఎస్వీ రామారావు గారన్నట్లుగానే – రేడియోలో లఘుప్రసంగానికి సుష్టు ప్రణాళిక అవసరం. వ్యక్తి జీవన ప్రగతిలో అప్పుడే అది శ్రోత శ్రవణాభిరుచిలో, అనుభూతి స్పందనలో కీలకపాత్ర వహిస్తుంది.

'ప్రేమ – స్నేహం' తో మొదలు పెట్టి 'నిశ్చింత'గా పూర్తి అయిన 'మనోవీక్షణం' – అందుకే పఠితల్లో 'ఉత్సాహం' కలిగిస్తూ, 'రసానుభూతి' నందిస్తూ, మానవీయ 'అనుబంధాల'ను ప్రోదిచేస్తూ, 'మనసు'కు 'కర్తవ్యం' ప్రబోధిస్తూ, 'దృఢచిత్తం', 'ఆత్మతృప్తి' కలిగేందుకు ఉపకరించేలాగుంది.

'అల్పాక్షరముల అనల్పార్థ రచన' అన్నట్లుగా – 'కొండ అద్దమందు కొంచెమై వుండదా' అనిపిస్తూ, విస్తృతమైన భావ సంచయాన్ని ఆలోచనాత్మకం చేసారు రామారావుగారు. లౌకికమైన 'ఆడంబరాలు – అనర్థాలు' అని 'సిరిసంపదలు' గురించి చెప్పినా, 'సాహిత్యవైవిధ్యం' అంటూ నన్నయ్య నుండి నిన్నమొన్నటి వాగ్గేయ కారుల వరకూ ఒక విహంగ వీక్షణంగా సాహిత్యావలోధనం చేసినా, "కళలు మనిషిలోని అజ్ఞానాన్ని తొలగించాలే తప్ప మూర్ఖత్వాన్ని పోషించకూడదు" అని వివేచించినా, ఆయన మనోవీక్షణంలో సమాజ హితచింత, ముఖ్యంగా నేటి యువతకై ఒక సందేశ కాంక్ష ప్రబలంగా వున్నాయి. ఆర్థిక విలువలు కాక హార్దిక విలువలు ముఖ్యమని చాటుతారు. సంప్రదాయం పట్ల గౌరవాన్ని, జాతీయత పట్ల విశ్వాసాన్నీ కలిగించే ప్రేరణ నిస్తారు.

ఇవి రేడియో ప్రసంగాలు కనుక – శ్రోతకు మొదటి వాక్యం వినగానే శ్రవణ కుతూహలం రేకెత్తించే ఎత్తుగడలు ఆయన చేపట్టడం విశేషం.

"ఒకసారి ఢిల్లీ వెళ్లాను ఏదో పని మీద" (సుకవిజీవించు)

"ప్రతి మనిషికీ ఏదో ఒక వ్యసనం ఉంటుంది" (జూదం)

"మనసుకు కూడా వీక్షణం ఉంటుందా అని కొందరికి సందేహం కలుగవచ్చు" (మనోవీక్షణం)

"చింత లేకపోవడమే నిశ్చింత" (నిశ్చింత)

"పరీక్షల్లో అనుకున్న మార్కులు సాధించలేకపోయామన్న ఆవేదనతో విద్యార్థులు" (గుండెనిబ్బరం) – అంటూ అలవోకగా మాట్లాడటం మొదలు పెట్టి, అంశం వివరణాన్ని తాత్త్విక అంచులవరకూ తీసుకువెళ్లడం రచనా ప్రతిభే. ఒక్కొక్కసారి శీర్షికగా వుంచిన విషయాన్ని నేరుగా కాకుండా, సామాన్య శ్రోతకు నచ్చే ప్రణాళికతో నిర్వహించి ప్రస్తావిస్తారు. కొన్ని అంశాలు పునరుక్తులుగా అనిపించినా సందర్భోచితంగా వాటిని సమన్వయించి విశ్లేషించడం చేసారు. ఉదాహరణకు నన్నయ్యగారి పుత్రగాత్ర పరిష్వంగ వర్ణనా పద్యం 'విపరీత ప్రతిభాషలేమిటికి నుర్వీనాథ' అనేది 'అనుబంధాలు' ప్రారంభంలోనూ, 'సుకవి జీవించు' ముక్తాయింపులోనూ చెప్పారు. అలాగే మనుచరిత్రలోని 'అటచని కాంచె భూమిసురు' డనే హిమాలయవర్ణనా పద్యం – 'సుకవి జీవించు' లోనూ,

'మనోవీక్షణం'లోనూ ప్రస్తావిస్తారు. అలాగే 'తరగల్ పిప్పలపత్రముల్,' అనే ధూర్జటి పద్యం – 'ఆడంబరాలు అనర్థాలు' లోనూ, 'సిరిసంపదలు' లోనూ పునశ్చరణ చేసారు. దీనిని భావనాదారిద్ర్యంగా కాక – ఒక అంశం పట్ల విశ్వసనీయత పెంచే ఉపబలకంగా భావించడం సహృదయ లక్షణం అని గుర్తించాలి.

ఒక పద్యంతోనో, సూక్తితోనో, నిర్వచనంతోనో ప్రసంగ విషయారంభం చేసి, ఆసక్తిగా వుండే ప్రయోజనదాయకమైన ఉదాహరణలను అనుసంధానం చేస్తూ, అంశాన్ని విశ్లేషించడం, రసానుభూతి కలిగేలా వివరించి హృదయంగమం చేయడం ఎస్వీరామారావుగారి మనోవీక్షణ ప్రణాళిక. అందుకే వారి 'మనోవీక్షణం' ఆలోచనాత్మక లక్షణంతో సహృదయ పాఠకులను ఆకట్టుకుని – విలువైన మానవీయ సందేశాన్ని మనసుకూ హృదయానికీ హత్తుకునేది కాగలుగుతోంది.

ఈ ముప్ఫైరెండు మనోవీక్షణాంశాల నుండి మరీ మరీ మననం చేసుకోదగిన వాక్యాలు ఉటంకించడం మొదలు పెడితే మళ్ళీ ఇంత పుస్తకం అయ్యే ప్రమాదం లేకపోలేదు. కానీ వాచవిగా కొన్ని –

- ❊ స్వజన స్పర్శ వెచ్చవెచ్చగా గుండెల్ని తాకి మనలోని ఆర్ద్రతా భావాన్ని వెలికితీస్తుంది.
- ❊ ఈ సృష్టికి ఆధారభూతమైన శక్తి ఒక్కటే అయినా దాన్ని నిర్వచించటంలో జ్ఞానులు విభిన్న మార్గాలు అవలంబించారు. తర్వాత వారికి అనుయాయులు బయల్దేరి వాటికి మతాల రూపం ఇచ్చారు.
- ❊ ప్రజల సానుభూతిలేని ఏ ఉద్యమం కూడా గమ్యం చేరుకోలేదు.
- ❊ స్కాలర్‌షిప్పుల పై మోజు తప్పు. స్కాలర్ షిప్ పై – అంటే విజ్ఞానం పై (విద్యార్థుల) వారి దృష్టి ప్రసరించటం లేదు.
- ❊ భోగభాగ్యాలు, విలాసాలే జీవిత పరమార్థం కాదు. అంతకన్నా ముఖ్యమైంది మనశ్శాంతి. అదిలేనివాడు భవనాలలో వసించినా, కార్లలో విహరించినా సుఖం లేదు. అవసరాన్ని మించిన సిరులు అనర్థకాలే అవుతాయి.

* చెట్టు చిగిర్చి పుష్పించి ఫలించడానికి ఎంత మథనపడుతుందో ప్రకృతే సాక్ష్యం. కాలం విలువ తెలిసినవారే దాన్ని అర్థం చేసుకోగలుగుతారు.

* అఖండ భారతం మాతృ స్వరూపిణి అయితే గ్రామం దాని ఆత్మ.

* స్త్రీ స్వామ్యమో, పురుషస్వామ్యమో కాక ఇరువురి సమస్వామ్యం ఈనాడు సమాజానికి ఎంతయినా అవసరం.

* భావుకులైన కవులు సృష్టించిన ఊహాలోకంలో తేలియాడడం ఆనందకరమేకాని, నిజజీవితంలో వాస్తవాలను విస్మరించి ఊహాజగత్తులో సంచరించటం మాత్రం ప్రమాదకరమైనది.

* విదేశాల్లో స్థిరపడిన ఆంధ్రులు తరుచుగా మహాసభలు నిర్వహించుకోవటంలో నిమగ్నులైవున్నారు కాని, తమ సంతతి తెలుగు సంస్కృతికీ, తెలుగు భాషకూ ఎంతగా దూరమవుతున్నారో పట్టించుకోవడం లేదు.

* జీవితపరమావధి గ్రహించకుండా లౌకికవాంఛలు తీరడానికి తాత్కాలికావేశంలో జపాలు, వ్రతాలు, మొక్కులు అంటూ చూపే ఆడంబరభక్తి ఆత్మవంచనే అవుతుంది.

* సంస్కారోపలబ్ధమైన అభిరుచివున్నవారే రసానుభూతి పొందటానికి అర్హులు. ఆ అభిరుచినే 'వాసన' అని ఆలంకారికులు అన్నారు.

– ఇలా గుండెల్ని తాకి మెదళ్ళను కదిల్చే భావనలను సమాజహిత చింతనతో 'మనోవీక్షణం'గా అందించిన ఆచార్య ఎస్వీ రామారావుగారిని మనసా అభినందిస్తూ, ముఖ్యంగా యువపఠితృలోకం ఈ గ్రంథ గంధాన్ని అదుము కుని, జీవితాలను పరిమళభరితమూ, ప్రయోజనదాయకమూ చేసుకుంటుందని ఆకాంక్షిస్తున్నాను.

*18 ఏప్రిల్ 2006*



# సామాజికోపనిషత్తు

## ఉపనిషత్ సుధాలహరి – యువభారతి

"వేదాలు, ఉపనిషత్తుల మీద ఉపన్యాస లహరులు అంటూ యువభారతి వెనక్కు పోతోంది" అన్నాడు ఒకాయన నవ్వుతూ. "లేదు ముందుకు పోతోంది. ముందుండినవి ఏవో, వాటి గురించి వెనక్కు మళ్ళకుండా తెలుసుకుని, ముందుకు పోయేందుకు, ఆ ముందువి ఈ తరం ముందుంచుతోంది" అన్నది దానికి నవ్వుతూనే సమాధానం.

సమాజ భవనాలు శిథిల స్థితికి చేరుకుంటున్నా, లేక మరో అంతస్తు పైన నిర్మించాలన్నా పునాదుల గురించిన పునర్వివేచన అనివార్యం. మూలాల గురించి తెలుసుకుంటే, ఏ మూలనవున్నా అభద్రతా స్థితిలేకుండా జాగ్రత్తపడవచ్చు. నిజమే! ముందువాటిలో నేటికి పనికివచ్చేవీ, మనలను ముందుకు తీసుకువెళ్లేవీ ఏమిటో తెలుసుకోవాలి. 'గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్' అనే నిర్వేదం వదలి, 'మంచి గతమున కొంచెమేనోయ్!' అని మంచికి సంకల్పించాలి. సమాజం మారుతూంటుంది. విలువలూ మారుతూవుంటాయి. కాలానుగుణంగా ఆ పరిణామాలు సాహిత్యంలోనూ ప్రతిబింబిస్తాయి. కొత్తపాతల మేలుకలయిక క్రొమ్మెఱుంగులు చిమ్మగా అడుగుజాడ సాగడమే – అసలైన అభ్యుదయం. వర్తమానంలో విజృంభిస్తున్న అవినీతి, ఉగ్రవాదం, హింస, అమానవీయత వంటి శత్రువులను దునుమాడడానికి – పరంపరాగత ఆయుధాలనూ సానబెట్టుకోవాల్సిందే. అహింస కూడా ఒక ఆయుధమే! శాంతి కూడా ఒక ఆయుధమే! బాహిరశత్రువులనే కాదు, అంతః శత్రువులను జయించడం ముఖ్యం.

సమాజం అంటే వ్యక్తుల సమూహం. అంచేత వ్యక్తులు బాగుపడే శక్తులు ఏవో గుర్తిస్తే, సమాజమూ బాగుపడుతుంది. అందువల్ల వైయక్తిక ప్రయోజనాలకంటే సామాజిక ప్రయోజనాలు ముఖ్యం. అదే అసలైన ధర్మం. ధర్మబద్ధ జీవనం గడపడం అంటే, తనూ, తనతోబాటు సమాజమూ – పరస్పరం ఆధారితమై – సుఖసంతోషాలతో జీవించడమే.

*"ఒరులేయవి యొనరించిన*
*నరవర యప్రియము తనమనంబునకగు*
*నొరులకు నవిసేయకునికి*
*పరాయణము పరమధర్మపథముల కెల్లన్"*

అని మహాభారతం శాంతిపర్వంలో వచింపబడింది. అదిగో! ఆ మౌలిక ధర్మానికి కట్టుబడాలి. 'తన కష్టాన్ని ఒకడు దోచుకోవడం, తన ఆనందానికి ఒకడు అడ్డుపడడం, తన పనిని అవతలివాడు ప్రేమతో, సంతోషంతో, సకాలంలో, నిష్కామకర్మగా విధిగా చేయక తన జీవనానందానికి అడ్డుతగులుతూండడం, సుఖమూ, శాంతి, నిశ్చింత తనకు సదావుండనీయకపోవడం' ప్రతివాడికీ అప్రియమే! ఎవరూ అభిలషించరు. మరి ఇతరులపట్ల తాను ఈ రీతినే వ్యవహరిస్తున్నానేమో అని విచక్షణ వుండాలికదా! అందుకే ప్రాచీన భారతీయ సాహిత్యం – సమభావాన్నీ, సమ్యక్‌దృష్టినీ ప్రబోధించింది. వక్రదృష్టినీ, రంధ్రాన్వేషణా దృష్టినీ వదలి, సంయమనంతో చూస్తే, అసలు సంగతులు తెలుస్తాయి. అసలు 'చదువు' అంటే అదే! 'ఏది... తెలియడం వల్ల అన్నీ తెలుస్తాయో, ఆ తెలుసుకోవాల్సిన విద్య' గురించే శౌనకుడు అంగీరసుడిని అడిగాడు. 'పరావిద్య' అయిన అసలయిన చదువు ఉపనిషత్తులలో వుంది. అందుకే వాటినే 'వేదాంతాలు' అనీ అన్నారు.

సమాజంలో ప్రతి ఒక్కరూ గ్రహించవలసిన అమూల్యమైన జ్ఞానసంపద ఉపనిషత్తులలో నిక్షిప్తమై వుంది. వ్యక్తి సామాజికునిగా అనుసరించవలసిన ధర్మం గురించీ, అతనికి సమాజం పట్ల గల బాధ్యతల గురించీ, తన కుటుంబంతో, సాటివారితో మెలగవలసిన తీరుతెన్నుల గురించీ, ఉపనిషత్తులలో పేర్కొనబడిన విషయాలు – సర్వకాలాలకూ అనుసరణీయాలైనవి వున్నాయి.

'ఉపనిషత్ సుధాలహరి' ఏర్పరచి యువభారతి వాటిలోని సామాజిక అంశాలను శ్రోతలకు ప్రసంగాలుగా అందించాలనీ, ఆ అంశాలను గ్రంథస్థం చేయాలనీ సంకల్పించిందీ సమాజాభ్యుదయ చింతతోనే! అందునా – ప్రపంచీకరణ పేరుతో, సామ్రాజ్యవాద సంస్కృతి పేరుతో, అతలాకుతలమవుతున్న సమాజంలో, శాంతి, సుఖాలను పాదుకొల్పి, అమానవీయత నుండి మనల్ని మనం సంరక్షించుకోవాలనే ఈ సంకల్పం. ఇందుకు ఉపనిషత్తులను అధ్యయనం చేయడం మాత్రమే కాదు, నేటి సమాజానికి అనువుగా – అందులోని విషయాలను ప్రోదిచేసి, సరియైన వ్యాఖ్యానం చేయగల ప్రజ్ఞగల వక్తలు అవసరం. పాండిత్యంతో బాటు – ఆ ఉపనిషత్సారాన్నీ, ఈ కాలానికీ, సమాజానికీ అనుసరణీయమయిన వాటిలోని అంశాలనూ విడమరచి బోధించడం, వ్యాసరూపంగా అందించడం నేర్పరులయిన పెద్దలకు మాత్రమే సాధ్యం. యువభారతి చాలా శ్రమకోర్చి వక్తలను ఎంపిక చేసుకోవడం జరిగింది. వారందరూ ఆయా అంశాల మీద సాధికారికంగా మాట్లాడగల పండితులు. గొప్ప అధ్యయనశీలురు, మంచి వ్యాసకర్తలు.

వేదంలోని సంహిత, బ్రాహ్మణ భాగాలు 'కర్మకాండ'గా, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు 'జ్ఞానకాండ'గా పేర్కొంటారు. వేదాల చివరివి ఉపనిషత్తులు కనుక 'వేదాంతం' అని కూడా వాటికి పేరు. కర్మకాండ నుండి – జ్ఞానసముపార్జన వైపు తీసుకువెళ్ళి, బ్రహ్మ విద్యద్వారా ఆత్మావలోకనానికి దారి చూపడం ఉపనిషత్తులు చేసేపని. ఉపనిషత్తులు జ్ఞానాన్ని బోధించాయి కానీ కర్మకాండను నిందించలేదు. అయితే కర్మకాండల ద్వారా సముపార్జించిన పుణ్యమయినా, అనుభవించిన తరువాత మళ్ళీ మనిషి పూర్వస్థితికి చేరుకుంటాడనీ, జనన మరణచక్రం నుండి విముక్తుడు కాలేడనీ, ఉపనిషత్తులు చెప్పి – శాశ్వతమైన మోక్షం గురించి జ్ఞానబోధ చేసాయి. సృష్టితత్వరహస్య మెరిగిన నిజమైన మతతత్త్వానుష్ఠానమే మోక్షం. ఉపనిషత్కర్తలు చరిత్రజ్ఞానం వున్నవారు. కర్మకాండల వెనుక గల అసలు పరమార్థం చెప్పి, ఆ పరమార్థ జ్ఞానం పొందమనీ, అందువల్ల అసలు ప్రయోజనమనీ సమాజానికి హితవు చెప్పారు.

అసలు 'ఉపనిషత్తు' అంటే సమీపంలో కూర్చుని గురుముఖతః అభ్యసించేది అని అర్థం. అంటే అసలయిన చదువే. అయితే ఈ గురుశిష్య సామీప్యత – కేవలం బాహిరమూ, భౌతికమూ కాదు. 'గురుశిష్య మనస్సంయోగ సత్యశోధన'

అది! గురువు మార్గదర్శకుడు. ఆ మార్గంలో శిష్యుడు సాధన చేసి, సత్యాన్ని దర్శించాలి. ఉపనిషత్తులలోని గొప్పదనం ఏమిటంటే – 'మేము చెప్పేది నమ్మితీరాలి' అనవు. 'మేము చెప్పిన దానికి మించిన విద్య వుందం'టాయి. ఏమిటి అదంటే – 'స్వానుభవం' అని చెప్పాయి. అపరావిద్య, పరావిద్య అని విద్యని రెండుగా విభజించి, ముండకోపనిషత్తు నిర్వచించింది.

ఆధునిక విజ్ఞానం హేతువుతో కూడింది. అది సరైన దృక్పథం. ఉపనిషత్తులు కూడా ఆ మాటే చెబుతాయి. "మేం చెప్పిందే నమ్మవద్దు. సాధనచేసి స్వానుభవం పొందు. ఆ స్వానుభవమే పరావిద్య" అని చెప్పడం – ఉపనిషత్తులు శాస్త్రీయ దృక్పథానికి పాదులు వేయడం కాక మరేమిటి?. శాస్త్రీయ దృక్పథంతోబాటు సాధనద్వారా కనుగొన్నది సమాజానికి ఉపయోగపడాలన్నది ముఖ్యం! 'నిన్ను నువ్వు తెలుసుకో' అన్నమాటే మతమూ, గతి తార్కిక భౌతిక వాదమూ రెండూ చెబుతున్నాయి. గొప్ప గొప్ప ఆవిష్కరణలు చేసే మనిషి తననూ, తనలోని శక్తియుక్తులనూ తెలుసుకోవడం కూడా అవసరం. అంతర్ముఖుడవడమంటే – జ్ఞానేంద్రియాలన్నింటినీ బాహిరప్రపంచం నుండి లోపలి సత్యం వైపుకు మరల్చడం. అప్పుడే నిజస్వరూపం తెలుసుకోగలుగుతాడని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి. ఆధునిక శాస్త్రవిజ్ఞానం ప్రపంచం యొక్క స్వభావ స్వరూపాలు, శక్తియుక్తులనూ ఆవిష్కరించేదయితే, ఈ పనిచేసే వ్యక్తుల స్వభావ స్వరూపాలూ శక్తి యుక్తుల గురించి, పరిశోధించేది, ఆవిష్కృతం చేయించేది – 'ఉపనిషద్విజ్ఞానం'. శాస్త్ర విజ్ఞానం నేడు చేస్తున్న మేలుగురించే కాక, కలిగిస్తున్న హాని గురించి ఆవగతమవుతున్నాక, మరి ఆ ప్రమాదం నుండి రక్షింపబడటానికి, నైతిక విలువలతో కూడిన పార్శ్వం తోడుకావాలి. స్థూల శరీరం నుండి కాక, సంస్కారం నుండి, అంతర్ముఖీన చింతన నుండి ఆ నైతికవిలువలు సంక్రమిస్తాయి. అంచేత శాస్త్ర విజ్ఞానం, జీవితానికి సార్ధకత పరిపూర్ణత కలిగించే – నైతిక, ఆధ్యాత్మిక చింతనా విజ్ఞానం రెండూ సమన్వయం కావాలి. సమాజంలో శాంతియుత సహజీవనానికీ, సకల మానవాభ్యుదయానికీ దోహదం చేసే ఆ విజ్ఞానమే – ఉపనిషత్తులు. అందుకే ఉపనిషత్తుల మీద శంకరాచార్యుల వంటి మహనీయులు భాష్యాలు వెలువరించి ఆలోచింపచేసారు.

సమాజంలో వున్న వివిధ వర్గాలకి చెందిన మనుషులంతా మనకి ఉపనిషత్తులలో గోచరిస్తారు. "సత్యాన్వేషణకు అందరూ అర్హులే" అని చెప్పడానికి

సత్యకాముడు, గార్గిలాంటి స్త్రీ కన్పిస్తారు. ఉపనిషత్తులది విశాలదృక్పథం. సమ్యక్ దృష్టి. ప్రధానంగా దశోపనిషత్తులు - లభ్యమౌతున్న 188 ఉపనిషత్తులలోనూ సమగ్ర సమాహార సంపదగా భావింపబడుతున్నాయి. ఈ ఉపనిషత్సుధాలహరి గ్రంథంలో - దశోపనిషత్తుల విహంగ వీక్షణం శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు గారు చేయగా, సర్వోపనిషత్తుల ఏకసూత్రత గురించి డా॥ చిర్రావూరి శివరామకృష్ణశర్మగారు విపులీకరించారు.

ఎన్నుకున్న దశోపనిషత్తులలోని సామాజికాంశాలను ఆయా ప్రసంగకర్తలు వ్యాసరూపేణా అందించగా ఇందులో సంపుటీకరించాం. 'ముండకోపనిషత్తు' గురించి శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు సంధికాలంలో కొత్తదారి చూపగలిగేదిగా విశ్లేషిస్తూ, అందులోని చదువుల గురించీ, నిజమైన జ్ఞానమైన ఆత్మజ్ఞానం గురించీ, మనుషుల్ని రూపొందించే విద్య గురించీ ఆధునికంగా ఆలోచింపచేసారు. 'సత్యమేవజయతే, న అనృతమ్' అన్న ముండకోపనిషద్వాక్యాన్ని నేటి మన సమాజవిముక్తికి అత్యంతావశ్యకమైన మహావాక్యంగా గుర్తుచేశారు. ప్రకృతి, సృష్టి, బ్రహ్మవిద్య, ధ్యానప్రాశస్త్యం, సాధనాక్రమం, ఆత్మావలోకనం, ఉత్తమగురువు మొదలయిన విషయాలను 'ముండకోపనిషత్తు' సామాజిక దృష్టితో వివరిస్తుంది. భారత ప్రభుత్వ అధికారముద్రలో 'సత్యమేవజయతే' అన్న ముండకోప నిషత్సూక్తియే (3.6) స్వీకరించబడింది. సత్యసంధత మీద ఆ గౌరవాన్ని రక్షించుకోవాల్సిన అగత్యం నేడు ఎంతయినా వుంది.

డా॥ రాళ్లబండి కవితాప్రసాద్ గారు 'మాండుక్యోపనిషత్' సామాజికాంశాల వివేచనం కావించారు. పన్నెండుశ్లోకాల పరిమాణంలో మానవమేధను జాజ్వల్యమానం చేసే మహోపనిషత్తుగా 'ఆత్మ' గురించి చర్చించిన ఉపనిషత్తు ఇది. పదివేల సంవత్సరాల క్రితపు మండూకమహర్షి అరిషడ్వర్గాలు, ఈషణత్రయాలు, స్వార్థాలు, కుట్రలు, తాపత్రయాల గురించి ఆత్మావలోకనం చేసుకున్నాడు. నేటికీ మనిషిలో అవన్నీ దాగి వున్నాయి. అవే సమాజాన్ని నడిపిస్తున్నాయి. మరి సమాజశ్రేయస్సు కోసమే అలాప్రతి ఒక్కరూ ఆత్మావలోకనం చేసుకోవలసిన అవసరం లేదా? గౌడపాదులు, విద్యారణ్యులు ఈ ఉపనిషత్తుకు భాష్యాలురాశారు. ఐన్‌స్టీన్ - 'టైమ్, స్పేస్' గురించి చర్చించాడు. కాలపరిధి, కాలాతీత పరిధిని ఈ ఉపనిషత్ చర్చించి, 'ఓం' కారనాద వైశిష్ట్యాన్ని చెబుతుంది. 'ఆత్మ' అనే దానిని 'మానవాత్మ'గా, సామాజిక అంశంగాచూసి - ఆకార, ఉకార,

మకారాల "ఓం' కారాన్ని ఎలా గ్రహించవలసిందీ, తెలియజేస్తుంది ఇది. మాండుక్యోపనిషత్తు పంచరత్నాలుగా 'కాదంబిని' శతకంలో కూర్చిన శ్రీ రాళ్లబండి కవితాప్రసాద్ గారు వ్యాసాంతంలో వాటిని చేర్చడం ముదావహం.

డా॥ మసన చెన్నప్పగారు "బృహదారణ్యకోపనిషత్తు' గురించి విశ్లేషించారు. శుక్లయజుర్వేదం వాజసనేయశాఖకు చెందిన శతపథ బ్రాహ్మణంలోని కాండ అయిన ఇది ఆరు అధ్యాయాలుగా, 415 గద్యాలతో, భారతీయ దార్శనిక దృక్పథాన్ని విశదపరిచేదిగా భాసిస్తోంది. బృహదారణ్యకోపనిషత్తు ఒక గొప్ప సామాజిక శాస్త్రంగా ఎలా విరాజిల్లుతోందో వ్యాసకర్త వివరించారు. బుద్ధిశక్తి, భుజశక్తి, ధనశక్తి, శ్రమశక్తి అనే వాటి గురించీ, 'వర్ణం' అనే దానిని ఎలా చూడాల్సివుందీ చక్కని గేయాత్మకమైన సరళ ఉటంకింపులతో పేర్కొన్నారు. 'సంన్యాస' అనగా, 'సమ్యక్ న్యాసం' – అంటే "బాగుగా ఉంచుట' అని ఈ ఉపనిషత్తు – వ్యుత్పత్తి అర్థం చెప్పింది. మానవుడు ఆచరించే కర్మలను బట్టే లోకాలు అని చెబుతూ, తిండి కోసమే జీవిస్తూ పిల్లల్నికనేవారిది 'మనుజలోకం' అనీ, స్వార్థాన్ని విడిచిపెట్టి లోకానికి మేలు చేసే వారిది 'పితృలోకం' అనీ, ప్రజలకు జ్ఞానప్రబోధం చేస్తూ నిష్కామబుద్ధితో నడిచేవారిది 'దేవలోకం' అనీ, మనిషే ఈ త్రిలోక సంచారి అనీ, సందేశమిచ్చే ఉపనిషత్తు ఇదే! ఇందులోని మూడు 'ద' ల కథ ప్రపంచానికి కావలసిన శిక్షణ అంతా ఇముడ్చుకున్నదని వ్యాసకర్త వివరించారు.

ఆధునిక సాహిత్య ప్రపంచంలో నేడు విశిష్టులైన ముగ్గురు వక్తలు ఉపనిషత్తులను సామాజిక కోణంలో ఎలా చూడగలిగిందీ చెప్పేందుకే శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు, డా॥ రాళ్లబండి కవితాప్రసాద్, డా॥ మసన చెన్నప్పగారల వ్యాసాలను గురించి ప్రస్తావించింది. ఉపనిషత్సుధాలహరిలోని మిగతా వ్యాసకర్తలు అందరూ ఆయా విషయాలకు న్యాయం చేకూర్చగల పండితులుగా సుప్రసిద్ధులు. వారి రచనలే అందుకు దృష్టాంతాలు.

ఈ వ్యాసాలలో ఉపనిషత్తులకు సంబంధించి పరిచయం చేయడంలో, విశ్లేషించడంలో పునరుక్తులుగా కొన్ని పాఠకులకు తోచవచ్చుగానీ, ఆయా సందర్భాలకు అనుగుణంగా వాటి ఉటంకింపులు అనివార్యాలుగానూ, విషయానికి ఉపబలకాలుగానూ – గ్రహించవలసిందని మనవి! 'దశోపనిషత్తులు – సామాజికాంశాలు' అనేదే ప్రధాన ఉద్దేశ్యం. 'సామాజికం' అనే మాటకు –

నిర్వచనం కూడా – సామాన్యార్థంలో గిరిగీయగలమేమోగానీ, విశాలదృక్పథంతో చూసినప్పుడు విస్తృత భావాలకు ఆలంబనం కాగలదు.

'ఈశావాసోపనిషత్తు'లోని శాంతి మంత్రం– 'అంతా బ్రహ్మమయం' అంటుంది. అంతా బ్రహ్మమయమే అయినప్పుడు, నువ్వు నేను అనే భేదభావానికి ఆస్కారంలేని విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రతిపాదించడాన్ని మించిన సామాజికత ఏముంది? 'సర్వకాల సర్వావస్థలలో అంతటా వ్యాపించియున్న పరమాత్మ మనకు శాంతిని ప్రసాదించుగాక!' అనే శాంతిమంత్రంతో –ఇలానే బృహదారణ్యకోపనిషత్తు కూడా మొదలవుతుంది. ఈశావాస్యోపనిషత్తులో 18 మంత్రాలున్నాయి. గృహస్థధర్మం గురించీ, లోభం గర్హించదగిందనీ, ఈ ఉపనిషత్ చెబుతోంది. అలాగే ఎవడైతే ప్రపంచంలోని అన్ని ప్రాణులనూ ఆత్మ స్వరూపుడగు 'తనలో' చూచుచున్నాడో, అలాగే అన్ని ప్రాణులలోనూ –ఆత్మస్వరూపుడగు 'తనను' చూచుచున్నాడో, అతడు ఎవరినీ ద్వేషించడు. అలాగే బ్రహ్మజ్ఞాని అయినవాడు సర్వాంతరాత్మగా వున్నది ఆ పరమేశ్వరుడని గ్రహించి, తనకూ ఇతరులకూ మధ్య భేదభావం విడిచి, శోక, మోహాలు అంటక ఉంటాడు అని విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని విశదపరుస్తుంది. మానవుడి 'సముచ్ఛయం' గురించి చెబుతుంది. అంటే బాహ్య ప్రపంచ వ్యవహారాల్లో సమాజంలో ప్రవర్తించడం, అదే సమయంలో తన లోపలి తత్త్వాన్ని తెలుసుకోవడం, అవిద్యకూ విద్యకూ మధ్య సమతౌల్యాన్ని పాటించడమే 'సముచ్ఛయం'. ఇందులో ఒక్కదాన్ని పాటించి, రెండవది పరిత్యజించడం అనర్థం అని సందేశమిస్తుంది ఈశావాస్యోపనిషత్తు.

'కఠోపనిషత్తు' అంటే స్వామి వివేకానందకు చాలా ఇష్టం. "ఉత్తిష్ఠత! జాగ్రత్త! ప్రాప్యవరాన్నిబోధత" అంటూ "లే! ఉద్యమించు! గురువునాశ్రయించి తెలుసుకో" అని బోధించింది ఈ ఉపనిషత్తు యముడికీ నచికేతుడికీ జరిగే సంభాషణ – శ్రేయోమార్గం, అవలంబించాలని ఉద్యమింపచేసేశక్తి. శరీరం – బుద్ధి– ఆత్మల గురించి తెలిపే అంశాలు ఈ ఉపనిషత్తులో ఉన్నాయి.

'ఛాందోగ్యోపనిషత్తు' బృహదారణ్యకం తర్వాత పెద్దది. సామవేదం చివర ఎనిమిది అధ్యాయాలలో ఉన్నదిది. 'సత్యకామజాబాల'ను గౌతముడు– "కులగోత్రాల కతీతంగా అందరూ విద్యార్హులే" అని నిరూపించి, శిష్యునిగా స్వీకరించడం 'సామాజిక న్యాయం అనే అంశం క్రొత్తదేమీ కాదు' అని విశదపరచిన ఉపనిషత్తు ఇది. 'ఆత్మజ్ఞాన మార్గం' అందరికీ అనుసరణీయమైనదని చెబుతుంది.

'ప్రశ్నోపనిషత్తు' ముండకోపనిషత్తు చేసిన తత్త్వబోధనే, ముముక్షువులకు అర్థమయ్యేలా విస్తరించి వివరిస్తుంది. పిప్పలాదమహర్షి ఆరుగురు ఋషుల సందేహాలను తీర్చడం ప్రధానాంశం. ఇహపరాల గురించి తెలిసాకే, ఆ రెండూ నిరర్థకాలనే జ్ఞానోదయం అయి, బ్రహ్మజ్ఞానంతో శాశ్వతానందం వైపు ఏ మనిషైనా ప్రయాణిస్తాడు. ఇది 'క్రమముక్తి', ఎవరు ఎప్పుడు, ఏ మజిలీవద్ద వుంటారో వారికే తెలియక పోవచ్చు. ఐహికమైన సృష్టిక్రమం నుండి ప్రశ్నావళి మొదలై, ఆరు ప్రశ్నలకు సమాధాన రూపంగా సాగే ఉపనిషత్తు ఇది. మానవుడు తన జీవితాన్ని అర్థవంతంగా సాగించేందుకు కావలసిన సాధనాలే– పదహారుకళలు. మొదట ప్రాణం, దాని నుండి మిగతా– శ్రద్ధ, ఆకాశం, వాయువు, తేజస్సు, పృథ్వి, పంచభూతాలు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాలు మనస్సుతో సహా, అన్నం, అన్నం నుండి కర్మలనాచరించడానికి వలసిన శరీరపటుత్వం, తపస్సు, ఆధ్యాత్మిక కర్మల నాచరించడానికి వలసిన వేదమంత్రాలు, కర్మలు, లోకాలు, పేర్లు ఇవన్నీ పరమాత్మ కళలుగా సృష్టించాడు. ఆ పరమపురుషుడి వ్యక్తస్వరూపమే ఈ పదహారుకళలూ కూడా! ఇవన్నీ ప్రాణం పోగానే, ఆయనలోనే లీనమవుతాయి అని చెబుతుంది ఇది.

ఇక తిత్తిరీ అనే ఋషిద్వారా (పక్షులు అని మరి కొందరంటారు) కృష్ణయజుర్వేదం లోని తైత్తిరీయ అరణ్యకంలోనిది 'తైత్తరీయోపనిషత్తు'. శిక్షావల్లి, ఆనందవల్లి, భృగువల్లి అని ఇది మూడు భాగాలు. ఆదిశంకరులు దీనికి వ్యాఖ్యానం వ్రాశారు. అధ్యయన అధ్యాపనాల గురించీ, స్నాతకోపన్యాసం గురించీ శిక్షావల్లిలోని అంశాలు విద్యార్థులు గ్రహించవలసినవి. దైవం అంటే మరేదో కాదనీ – సత్యం, జ్ఞానం, అనంతం అనీ, ఈ ఉపనిషత్తు చెబుతుంది! అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ మనే పంచకోశాలను గురించి ఇది వివరిస్తుంది. బ్రహ్మానందవల్లిలో పంచకోశవిద్య గురించి వివరించబడింది. ఇక భృగువల్లిలో నిజమైన బ్రహ్మానందం పొందాలంటే – తపస్సే శ్రేష్ఠమైన మార్గంగా వివరించబడింది. ఇక్కడ తపస్సు అంటే అరణ్యాల్లో చేసేదని కాదు. "మనసశ్చ ఇంద్రియాణాంచ ఐకాగ్ర్యం తపముచ్యతే" అని నిర్వచనం. మనస్సును, ఇంద్రియాలను పరమాత్మమీద కేంద్రీకరించడం తపస్సు. ఆత్మ పరమాత్మ ఒకటేననే విషయం, ఆత్మావలోకనమే జీవిత సాఫల్యం అనే సూచన ఈ తైత్తరీయోపనిషత్తు చేస్తోంది. తల్లి, తండ్రి, గురువు, అతిథి వీరందరినీ

దైవసమానులుగా చూడాలనీ, విద్య నేర్పడం, మననం చేయడం ఎంత ముఖ్యమో - దాన్ని ఇతరులకు పంచడం అంతే ముఖ్యమనీ, ఏ విషయంలోనైనా ఏం చెయ్యాలో తెలియనప్పుడు - ఇతఃపూర్వం పెద్దలనుసరించిన మార్గమే శ్రేయోదాయకమనీ ఈ ఉపనిషత్తు తెలుపుతోంది.

'కేనోపనిషత్తు' మనో బుద్ధ్యహంకారాలు వున్నప్పుడే సత్యాన్వేషణ సాధ్యమనీ, అందువల్లే ఆత్మ అన్నింటిలో వున్నా 'మోక్షం' ఒక్క మానవుడికే సాధ్యమనీ తెల్పుతుంది. "నా జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఆరోగ్యంగా, శక్తిమంతంగా నుండుగాక! నాకు భగవంతునిపై భక్తి విశ్వాసాలు ఉండుగాక. నన్ను భగవంతుడు అనుగ్రహించుగాక. సద్గుణ సంపన్నుడనై నేనుండుదును గాక" అనే ప్రార్థనతో మొదలవుతుందీ ఉపనిషత్తు. 'కేన' అంటే 'ఎవనిచేత?' అనే ప్రశ్నయే. ప్రశ్నేకదా హేతువుకి మూలకందం. ప్రశ్నించడం అవసరం అని ఉపనిషత్సూచనే! 35 మంత్రాలున్నాయి ఈ ఉపనిషత్తులో. ఎక్కడా గురుశిష్యుల పేర్లుండవు. 'సాధనే ఏకైక మార్గం' అని ప్రబోధిస్తుందిది. 'ఇప్పుడే, ఇక్కడే, మోక్షాన్ని పొందాలి' అనీ ఈ ఉపనిషత్తు ఘోషిస్తుంది! అంటే మానవుడిగా, సమాజజీవిగా వున్నప్పుడే మోక్షానికి అనువు అని ప్రబోధిస్తుంది. దేహాత్మాభిమానం అందరికీ సర్వసాధారణం. అగ్ని, వాయువు, వాక్కు మనస్సులకు ప్రతీకగా, ఇంద్రియాలకు గుర్తులుగా, వాటి ద్వారా బ్రహ్మమును తెలుసుకునే జ్ఞానం అసాధ్యం అని చెప్పే కథ ఇందులోదే. బ్రహ్మావలోకనం కంటే మానవుడు సాధించాల్సిన ఉత్తమస్థితి లేదనీ, అదే జీవన గమ్యం అనీ ఈ ఉపనిషత్తుయొక్క సారం.

'ఐతరేయోపనిషత్తు'... అవిద్యను తొలగించి, గురుముఖతః నేర్చిన విద్య విడువక వుండాలనీ, ఆ విద్యలోని సత్యాన్ని మాత్రమే గ్రహించి, వచిస్తూండాలనే శాంతి మంత్రంతో మొదలవుతుంది. ఋగ్వేదంలోనిది ఐతరేయబ్రాహ్మణం. దానిలోని రెండవ ఆరణ్యకంలో నాలుగు, అయిదు, ఆరు అధ్యాయాలలోని ఉపనిషత్తు ఇది, ఆత్మ జ్ఞానానికి సంబంధించిన భాగం మీద శంకరులు వ్యాఖ్యానించారు. 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనే వాక్యం ఇందులోదే! సృష్టికి పూర్వం నుండి, ఆత్మ, పరమాత్మల గూర్చి, విరాట్ పురుషుడి గురించీ, జీవజాలం, మానవ శరీరం, ఆహారం, ఉత్పత్తిక్రమం, కర్త్రాత్మ, ప్రజ్ఞానం గురించీ వివరించినదీ - ఉపనిషత్తు. 'ఐతరేయబ్రాహ్మణం నుండి మొదలెడతారు' అని పరిశోధనల గురించి అనే మాటలో నిజంగా సృష్టిని ఒక క్రమ పద్ధతిలో వర్ణించిన సంగ్రహం

ఈ ఉపనిషద్విశేషమే! ఉపాధిలోవున్న ఆత్మకంటే, అతిరిక్తమైన ఉపాధిరహిత ఆత్మయే సత్యస్వరూపం. అదే ప్రజ్ఞానం. దానిమీదనే అభ్యాసం చేసి ఆత్మవలోకనంతో పునర్జన్మరహిత మోక్షాన్ని పొందాలని ఐతరేయోపనిషత్సారం!

ఇలాంటి ఈ పది ఉపనిషత్తుల గురించీ, వాటిలోని సామాజికాంశాల గురించి పండితులు 'ఉపనిషత్సుధాలహరి'లో చేసిన ప్రసంగవ్యాసాల సంపుటి ఈ గ్రంథం.

ఏది తెలుసుకోవడం వల్ల మరేదీ తెలుసుకోవలసిన అవసరం లేదని తెలుసుకుంటామో, నీ, నా అనే భేదభావాలు మరచి, అంతా ఒక్కటేననే భావనతో, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని అర్థం చేసుకోగలుగుతామో, బహిరంతర ఆత్మావలోకనంతో సమాజాన్నీ, అంతర్గత ప్రపంచాన్ని కూడా అర్థం చేసుకున్న అసలయిన చదువుతో - అమందానంద మోక్షస్థితిని చేరుకోగలుగుతామో, ఆ ప్రయాణానికి ఉపనిషత్తులు దారి చూపి తీసుకువెడతాయి. ఆ దీపధారిగా యువభారతి ఈ ఉపనిషత్సుధాలహరితో ఏ మేరకు ఉపకరించినా ధన్యయే. ఈ గ్రంథం చదువరులకు సమాదరణీయమవుతుందని ఆకాంక్ష.

*8 ఫిబ్రవరి 2011*




# వ్యాఖ్యాన రసానందలాస్యం

## భోగినీ లాస్యం - వానమామలై వరదాచార్యులు

**కొం**దరిపై మనకు ఎంత ప్రగాఢ విశ్వాసాలు వుంటాయంటే, కొన్ని పనులు వారే చేసినా, వారు చేసివుండరని నమ్ముతాం. అంతటి గాఢమైన ముద్ర వారు ఒక తీరుగా మనపైవేయడానికి హేతువైనదానికి భిన్నంగా, వారి వ్యవహారసరళిని మనం ఊహించలేం! మనకు వారి పైగల ప్రగాఢ భక్తి విశ్వాసాలే మనలనలా భావన చేయిస్తాయి.

ఆంధ్రమహాభాగవతాన్ని తెలుగు జాతికి అద్భుత ఉపాయనంగా అందించిన మహాకవి బమ్మెర పోతన.

***"ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీ యుర్వింబురాణావళుల్***
***తెనుగున్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు తానెట్టిదో***
***తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా***
***జననంబున్ సఫలంబు చేసెద బునర్జన్మంబు లేకుండగన్"***

అని భాగవతానువాదం తన పాలిటి సుకృతమనీ, పునర్జన్మలేకుండా తన జన్మని సఫలం చేసుకుంటాననీ అన్న పోతన తెలుగు వారందరికీ పురాకృత భాగ్యవిశేషంగానే ఆ రచన నందించాడు. పైగా దానిని శ్రీరామునికే అంకితం చేశాడు. జగద్ధితంబుగా చెప్పిన రచనే కానీ పురాలు, వాహనాలు, సొమ్ములు పుచ్చుకుని ఏ రాజుకో అంకితం ఇవ్వననీ, ఆ సరస్వతీ దేవి కంటనీర్వెట్టనవసరం లేకుండా తన రచనను కూళలకిచ్చి యప్పడుపు కూడు భుజించననీ, హాలికుడిగానే

హాయిగా జీవించగలననీ పేర్కొన్న మహనీయుడైన పోతన మహాకవి భాగవతం కాక అంతకు ముందు వీరభద్ర విజయం, భోగినీదండకం రచించాడని తెలుస్తోంది. 'నారాయణశతకం' కూడా ఆయన రచన అనే వారున్నారు.

'వీరభద్ర విజయం' విషయంలో కూడా అభ్యంతరం లేదేమోగానీ భక్తాగ్రేసరుడయిన పోతన 'భోగినీదండకం' రచించాడంటే చాలా మందికి ఒప్పుకో బుద్ధిగాదు. రాజతిరస్కారం చేసిన సాహసోపేత కవి రాజవేశ్యపై కవిత్వం చెబుతాడని ఎలా ఊహిస్తామంటారు.

భాగవతం రాయడానికి ముందు రాచకొండ సామ్రాజ్యాన్నేలిన పద్మనాయకరాజయిన సర్వజ్ఞ సింగభూపాలుడి ఆస్థానంలో పోతన వుండేవాడంటారు. భాగవతాన్ని సింగభూపాలుడు తనకి అంకితం ఇమ్మన్నాడనీ పోతన దానికి నిరాకరించాడనీ కథనం వుంది. అయితే రాజాస్థానంలో వున్నప్పుడే పోతన 'భోగినీదండకం' రాసాడని ప్రతీతి.

పోతన భాగవతరచనా భక్తాగ్రగణ్యత్వం ఆయన జీవనక్రమ పరిణామం కావచ్చు. వయసులో వున్నప్పుడు ఆ వయసుకు తగిన మానసిక స్వభావం వుండడం దోషమేమీ కాదు. "కామిగాక మోక్షగామి కాడు" అన్న భావన అంగీకారయోగ్యమే కానీ, మానవ సహజస్వభావ స్థితి ప్రోద్బలకమేగానీ వేరు కాదు. ఈ దృష్టితో పరికించినపుడు భోగినీదండకం పోతన రచన కావడం విమర్శనీయమేమీ కాదు.

తెలుగు వాఙ్మయంలో తొలి దండక రచనగా కూడా విమర్శకులు పోతన 'భోగినీదండకం'ను పేర్కొంటూ వున్నారు. పైగా ఆ కాలంలో రాజవేశ్యలు కూడా కేవల సౌందర్య విలసితులు కావడం మాత్రమే కాక, ప్రతిభాపాటవాలు గల వారుగా రాణిస్తూండేవారు. ఆమెలోని నాట్య కళా వైభవానికి ముగ్ధుడై పోతన ఆమెను, ఆమె కథనాన్ని రచించి వుండవచ్చు.

***"ఉల్ల సత్ఫుల్ల మందార రాజన్మరందంబు నందంబునం***
***గ్రోలు మత్తాళి దుత్తూరముం గ్రోలునే..."***

వంటి భోగినీదండకంలో అభివ్యక్తమైన భావాలే భాగవత రచనాకాలం నాటికి మందారమకరంద మాధుర్య విలసిత పద్యాలుగా పరిణమించి వుంటాయనుకోవచ్చు. భోగినీదండకంలోని భావాలుగానీ, అనుప్రాసాది అలంకారాలుగానీ భోగినీ దండకం పోతనరచనే అనేలా వున్నాయి.

'పోతన చరిత్రము' రచించిన శ్రీ వానమామలై వరదాచార్యులుగారు 'అభినవపోతన' అనిపించుకున్న విద్వన్మణులు. పద్య, గేయ, నాటక, శతక, వ్యాస, వచన కథా కావ్య, అనువాద రచనా ప్రక్రియలెన్నింటనో నిష్ణాతులైన ప్రతిభామూర్తులు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖలో ఉపాధ్యాయులుగా పనిచేసి అనంతరం ఆరు సంవత్సరాలపాటు రాష్ట్ర విధాన మండలి సభ్యులుగా కూడా నియమితులైనవారు. పోతన చరిత్రము మహాకావ్యం వెలువరించిన వరదాచార్యుల వారు అందులో పోతన భోగినీదండకం రాసినట్లు విశ్వసించినందువల్లనే భోగినీలాస్యం గురించి డెబ్భైఏడు పద్యాలలో రసోచితంగా వివరించి రాసారు.

1974లో యువభారతి వారు పోతనచరిత్రములోని భోగినీలాస్యం, 'సాహితీవాహిని'లో మూడవతరంగంగా వెలువరించ సంకల్పించి, ఆ పద్యాలను విశేషార్థ వివరణంతో ప్రచురించడానికి వరదాచార్యులవారినే వ్యాఖ్యానం రాసి ఇవ్వవలసిందని కోరగా, మూల రచయితనైన తానే, వ్యాఖ్యానం రాయడం ఏమిటని భావించక ఎంతో ఆదరంతో అంగీకరించారు. 'భోగినీలాస్యం' అలా వెలుగులోకి వచ్చింది. వానమామలై వరదాచార్యులవారి శతజయంతి సంవత్సర ప్రారంభంలో దీనిని యువభారతే తిరిగి పునర్ముద్రించడం భాగ్య విశేషంగా భావిస్తున్నాం.

జనం భావించినట్లుగా భోగిని రాజాస్థాన వేశ్య అనీ, రాచకొండ ప్రభువైన సర్వజ్ఞ సింగభూపాలుని ఉంపుడుకత్తెయనీ భావించడం తగదంటారు వరదాచార్యులవారు. జన బాహుళ్యంలో ప్రచారంలో వున్న వైనం సింగభూపాలుని వేశ్య పేరు భోగిని. ఆమె రాజుని వలచి విరహార్త అయింది. ఆమె తల్లి తగదని వారించినా వినక ప్రభువును కలిసి అతని అనుగ్రహంబడసింది. అతని ప్రియురాలిగా హృదయ సామ్రాజ్యాన్ని ఏలింది. పోతన 'భోగినీదండకం'లోని వృత్తాంతం అదే. పోతనవంటి మహాకవి భోగిని పై రచన చేసాడంటే భాగవతభక్తులెవ్వరికీ అంత సులభంగా విశ్వాసమేర్పడదు.

విద్వన్మణులు, పోతనహృదయం మూలమట్టుగా గ్రహించిన పండిత కవి శ్రీ వానమామలై వరదాచార్యులువారు 'భోగినీ లాస్యం' రచిస్తూ ఆమె వేశ్య కాదనీ రాజుగారి భార్యయే అని అంటారు. పట్టాభిషిక్తురాలు కాని రాజు భార్యను 'భోగిని' అనడం నాడు రూఢిగా వున్నదనీ, అందువల్ల భోగినిని సింగభూపాలుని పట్టంపు రాణిగా, భార్యగా భావించడం న్యాయమనీ అప్పుడే భక్తి జ్ఞాన వైరాగ్యరాశియైన పోతనను - మహాకవి భోగిని గురించి దండకం రాసాడు అనడం యుక్తియుక్తమేననీ పేర్కొన్నారు. ధీరోదాత్తుడైన సింగ భూపాలుడు ఆమెను పాణిగ్రహణం చేసుకున్నాడనడం సమంజసం అన్నారు.

'భోగిని' గొప్ప నాట్య కళా విశారద. శృంగార రసాభినయాదుల్లో నాట్యంలో స్త్రీ లాస్యం మనోజ్ఞంగానూ చిత్తాకర్షకంగానూ భాసిస్తుంది. సౌందర్య సౌకుమార్య సంశోభితమైన భోగిని నాట్యం పోతన 'దండకం' రాసేంత ప్రేరణాత్మకం ఎలా అయ్యిందో వరదాచార్యులుగారు భోగినీ లాస్యం పద్యాలలో అభివ్యక్తీకరించిన భోగిని నాట్య వైభవం తెల్పుతుంది. భోగినీ లాస్యంకు స్వయంగా తన పోతన చరిత్రలో హృద్యమైన పద్యాలలో ఆకృతినిచ్చిన కృతికర్త వరదాచార్యులవారే వ్యాఖ్యానం సంతరించడం కవి హృదయాన్ని కవి ముఖతః తెలుపుతుండడమేగాక ఒక అద్భుత నాట్యకళా వైభవాన్ని వివరణాత్మకంగా ఆవిష్కరించినట్లయింది.

***"ఒడుపు నొదుగుఁగల్గి కడుకోమలత నొప్పి***
***యభినయించునట్టి యా లతాంగి***
***యొకొొక యవయవమ్మె యొయ్యారములనిధి***
***కవన జలధి శిల్పకళల కవది."***

అంటారు ఆచార్యులవారు. కృష్ణుని పట్ల రాధ ప్రేమానురాగాలు ఎలాంటివో సింగభూపాలునిపట్ల భోగిని భావన అలాంటిది. యముననీటికై వచ్చితిననుట యొక మిష. నీ రాగామృతంతో యీ ఘటము (దేహము) నిండిపోయింది. దీన్ని మోయలేను. నీవే భర్తవై యుద్ధరింపవలెను అని గోపిక రాధ కృష్ణుని భావన చేసినట్లే, నేను నాట్యం అనే మిషతో వచ్చానుగానీ నీ అనురాగామృతం ఆహరించుటే ప్రధానోద్దేశ్యం. నా విరహాంధకారం యమునవలె ఉరుకులాడుతోంది. దీన్ని తరింపచేసే నావవు నీవే అని భోగిని సింగ భూపాలునికి విన్నవిస్తుంది. 'హరి అనే పేరు సింగమునకు చెల్లుతుంది కనుక నీవు నన్ను పరిగ్రహించు ప్రభూ' అంటుందామె.

'భోగినీలాస్యం' పోతన చరిత్రంలోని ఒక మధురఘట్టం. నాట్యకళా వైభవాన్ని, శృంగార రస మధురిమనీ, ప్రణయభక్తి భావనారాధనాన్నీ వివరించే రచనం. సవ్యాఖ్యానంగా ఆ ఘట్టాన్ని వరదాచార్యులవారు యువభారతికి ఉపాయనంగా అందించిన గ్రంథాన్ని ఈ తరం పాఠకులకు పునర్ముద్రణగా అందించగలుగుతున్నందుకు, అదీ వారి శతజయంతి ప్రారంభ సందర్భం కావడం మాకు ఆనందంగా వుంది. రసజ్ఞ పాఠకులు దీనిని సమాదరిస్తారని ఆకాంక్షిస్తున్నాం.

*21 ఆగస్టు 2011*




# సమాజ పూజా పుష్పం

## మంచిమాట – పులివర్తి కృష్ణమూర్తి

నిజానికి భక్తి వేరు, ధర్మకర్మానుసరణం వేరు. భక్తి వున్నవారంతా ధర్మబద్ధులై ప్రవర్తిస్తారనుకోలేం. అదే విధంగా ధర్మాన్ని ఆచరించేవారు అనివార్యంగా దేవుని పట్ల భక్తి కలిగివుంటారనుకోనక్కర్లేదు. జీవితాన్ని తాముగా నియమబద్ధంగా గడిపేవారు, కొన్ని మంచి విలువలను అనుసరిస్తూంటారు. అది ఒక వ్యవస్థ, 'System'. ధర్మ బద్ధ విధానాలనూ, పద్ధతులనూ తు.చ. తప్పక పాటించేవారు – ఆ పద్ధతి ద్వారానే సమాదరణీయులవుతారు. "If you take care of system, system will take care of you" అనే మాట వచ్చిందందుకే.

'మంచి మాట' ఎవ్వరు చెప్పినా సమాదరణీయమే! అయితే ఆ 'మాట' విలువ, చెప్పే వారి వల్ల మరింతగా పెరుగుతుంది. 'మాట దారి మాటదే – బాట దారి బాటదే' కాకుండా, అన్న, అంటున్న, మంచిని – అనుష్ఠించి చెప్పేవారి వల్ల, నిజంగా 'మాటే మంత్రము' అన్న ఉదాత్తస్థాయిని సంక్రమించు కుంటుంది. భక్తి వల్ల శీలసంపద కలుగుతుందనే భావనతోనే, శ్రద్ధాభక్తులున్న వారి వల్లనే ధర్మకర్మానుసరణం సాగుతుందనే విశ్వాసంవల్లనే, భక్తికి ప్రాధాన్యము ఇచ్చారు మన భారతీయ సంప్రదాయంలో. నవవిధ భక్తిలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం ఇవన్నీ వున్నాయి. వీటిల్లో ఏ ఒక్కటి వున్నా భక్తి వున్నట్లే. భక్తి అన్న భావనలేకున్నా, సత్కృతులు ఆచరించినవారు భగవంతుని కరుణాకటాక్షాలు పొందిన కథలు

మన పురాణేతిహాసాలలో అనేకం వున్నాయి. అంటే ఏమిటన్న మాట! మనిషి తాను సువ్యవస్థలో వుండాలి. సువ్యవస్థ ఏర్పడే వ్యవస్థ తోడ్పాటుకు అనుగుణంగా జీవించగలగాలి. "లోకంలో మంచి చెప్పేవారు లేక లోకం పాడైపోతోంది" అనుకోలేం. ఆ మంచిని ఆచరించే వారు లేకపోవడం వల్లే. ఎవరికి వారు తనకు మంచిది అనుకున్నదేదో చేస్తూనే వుంటారు. కానీ పదుగురికీ పనికివచ్చే మంచిని చేయడం ఒక మంచితనం. ఆ చేసేప్పుడు, చెప్పేటప్పుడు, నీతిగా, నిజాయితీగా – తాము చెబుతున్న మంచిని, తామూ తమ పరిధుల మేరకు అనుష్ఠించి చూపినప్పుడే – అది విశ్వసనీయమూ, ఆచరణకు స్ఫూర్తిదాయకమూ అవుతుంది.

సాహితీమిత్ర, సేవారత్న శ్రీ పులివర్తి కృష్ణమూర్తిగారు మంచి మనిషి. ఆయనకు 'భక్తి' వుంది. సమాజంలో 'మంచి' పరివ్యాప్తం కావాలన్న 'అనురక్తి' వుంది. ఉన్నతమైన విలువల పట్ల ఆచరణాత్మకం కావాలన్న 'ఆసక్తి' వుంది. నేటి సమాజంలో అంతరించిపోతున్న మానవీయ విలువల గురించి 'ఆర్తి' వుంది. అందుకే నలుగురితో మంచిమాటలు పంచుకోవడం ద్వారా, విలువలు పెంచుకోవడం కుదురుతుందన్న 'స్ఫూర్తి' ఆయనది. సంస్థాగతంగానూ ఆయన మంచి కార్యక్రమాలకు పూనుకోవడం, ఊతమివ్వడం జరుగుతూంటుంది. ఇప్పటికే భక్తిసాహిత్యంలో తనదైన సేవా తత్పరతను ప్రస్ఫుటమొనరించారు. ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ప్రజాతంత్ర, చేతన మొదలయిన పత్రికల్లో ఆధ్యాత్మికమూ, ప్రయోజనాత్మక విలువలతో కూడిన పలు వ్యాసాలు, కాలమ్స్ రాశారాయన. వినాయక నిమజ్జనం, ఆలయాల బ్రహ్మోత్సవాలు వంటి కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కవిగా, రచయితగా, గాయకునిగా, కార్యకర్తగా, ఆధ్యాత్మిక భక్తిభావ ప్రచారకునిగా నిరాడంబరమైన వైఖరి ఆయనది. కృష్ణమూర్తిగారి ఈ 'మంచి మాట' సంపుటి లో అరవై అయిదు చిన్నచిన్న వ్యాసాలున్నాయి. ఇవన్నీ సర్వజన హితాభిలాషతో కూడిన అంశాలే. 'పరులను దూషించినా పరమాత్మను దూషించినట్లే' అనే వ్యాసంలో –

"మనిషిగా పుట్టింది మరో మనిషిని పీక్కు తినడానికి కాదు. ఎదుటివారికి ఇబ్బంది కలిగించటానికి అంతకంటే కానేకాదు. తాను జీవిస్తూ మరో ప్రాణి సుఖంగా జీవించేందుకు తోడ్పడాలి. మీలో మంచి భావాలుంటే, వాటి వాసనలు ఈ లోకం గ్రహించి, మీకు ఇవ్వాల్సిన గౌరవాన్ని వద్దన్నా సంక్రమింప చేస్తుంది.

హంగులూ, ఆర్భాటాలతో మోసపూరితంగా లోకం గుర్తింపు పొందాలనుకోవడం అవివేకమే అవుతుంది. ఈ విధంగా లభించే గుర్తింపు శాశ్వతమైనది కానే కాదని గ్రహించాలి. ఎదుటివారికి మంచి చేయకపోగా, వారిలోని చెడుగుణాలను వేలెత్తి చూపుతూ సదా విమర్శిస్తూ కాలం గడిపేవారు, వారంతటవారే చేజేతులా పాడైపోతున్నారు. అలాకాక పరులలో మంచితనాన్ని చూస్తూ, వారిలోని మంచిని గ్రహిస్తూ, మంచి నడవడికను అలవాటు చేసుకుంటే, తమ జన్మకు అంతకన్నా ప్రయోజనం వేరే ఏమి ఉండదు" అంటారు.

నిజానికి ఇంతకన్నా 'మంచి మాట' ఏముంటుంది. నేటి కాలానికీ, నేటి తరానికీ మౌలికమయిన 'సుభాషణం' ఇది. ఆహ్వానించి, అక్కున చేర్చుకుని, అనుసరింపదగింది. కొన్ని క్షణాలయినా ఈ యాంత్రిక ప్రపంచపు అసహజమైన తలంపుల నుంచి, వాతావరణం నుంచి దూరంగా – శాంతికి చేరువై మనశ్శాంతిని పొందడానికీ, తృప్తితో విలువైన మనుగడ సాగించడానికీ ప్రతి ఒక్కరికీ – సమాజ పూజా పుష్పం వంటిదీ పుస్తకం. కృష్ణమూర్తిగారికి మనసారా అభినందనలు.

*2004*



# జంఘాలశాస్త్రి పునరుత్థానం

## మరో జంఘాలశాస్త్రి - అయలసోమయాజుల నాగేశ్వరరావు

తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలచిపోగల పాత్రలు కొన్ని- కథకులు, నవలాకారులు, నాటకకర్తలు సృష్టించారు గానీ, తన వ్యాసాలద్వారా అటువంటి పాత్రనొకదానిని అందించిన ఘనత పానుగంటి లక్ష్మీనరసింహారావు గారికే దక్కుతుంది. నిజానికి గురజాడ 'గిరీశం' పాత్ర - లెక్చర్లకు పెట్టింది పేరుగా - ముళ్లపూడి వెంకటరమణ, వడ్లమన్నాటి కుటుంబరావ్ వంటి వారు అందిపుచ్చుకుని, ఆ పాత్రను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చారు. సమాజంలో 'గిరీశం సంస్కృతి' అనేది కూడా ఒకటి స్థిరీకరింపబడింది. 'హరి' దాని గురించి అద్భుతమైన విశ్లేషణ కూడా చేశారు. పానుగంటివారు తన 'సాక్షి' వ్యాసాల ద్వారా సృజించిన పాత్ర- 'జంఘాలశాస్త్రి' నిజానికి గిరీశం కన్నా విలక్షణమైనది, సమాదరణీయమైనది ఈ పాత్ర.

జాతీయోద్యమ సమయంలో, సంఘసంస్కరణోద్యమ కాలంలో, సాహితీ సముద్ధరణ కూడా ముమ్మరంగా సాగుతున్న రోజులలో - భారతీయభాషలపై పాశ్చాత్య నాగరికతా ప్రభావం, పలుకుబడి విశేషంగా ప్రసరించి నాటుకోవడం మొదలైంది. వివేకానందుడు, అనిబిసెంటు మొదలైన వారు భారతీయ సంస్కృతీవైభవాన్ని, తాత్త్విక భావాలను పునరుద్ధరించి పాశ్చాత్య వ్యామోహంలో కొట్టుకుపోతున్న యువకులను మరల్చి, ఆర్షవిద్యలపట్ల అనురక్తులను కావించిన సంఘటనలు తటస్థించాయి. అటువంటి వివిధోద్యమ ఝంఝామారుతంలో నూతన

చైతన్యం సంతరించుకుంటున్న తరుణంలోనే – 'ఆంధ్రపత్రిక', 'సువర్ణలేఖ'ల్లో పానుగంటివారి 'సాక్షి' రచనలు వెలువడ్డాయి. మనసులకు రెప్పపాటైనా శాంతిలేక మహాసంక్షోభం చెందుతున్న ప్రజలకు ఆ 20వ శతాబ్ది ప్రారంభంలో 'సాక్షి' సంఘం–హాస్య, సాహిత్య సుధామధురామృతాన్ని స్రావించి, ఆనందంలో ఓలలాడించిందని చెప్పాలి. 'ఆంధ్రపత్రిక'లో సాక్షి వ్యాసాలకోసం పాఠకులు ఆత్రంగా ఎదురుచూచే వారట! పిఠాపురం రాజావారు 'సాక్షి' వ్యాస వాఙ్మయానికి ధనసహాయం చేసి, ఆరు సంపుటాలుగా ప్రచురింపచేసారు. సుమారు ఆరువందల నలభైనాలుగు వ్యాసాలవి. పానుగంటివారు వాటిల్లో భారతీయ పురాతన పద్ధతులు, విద్య, వేషం, కట్టు, బొట్టు, ఆనాటి సాంఘిక దురాచారాలు, మతము, నాగరికత, వేదాంతము, రాజకీయాలు, విద్యావిధానం మొదలైనవాటి పై గొప్ప పరిశీలనతో, గాఢతతో సమకాలీన పరిస్థితులపై విమర్శనాత్మకంగా రాసిన వ్యాసాలవి. కోడిపందేలునుండి గోవింద నామస్మరణ వరకూ, తోలుబొమ్మలనుండీ తత్త్వోపన్యాసాల వరకూ, తడమని అంశం లేదనవచ్చు.

ఎడిసన్ 'స్పెక్టేటర్' ఈ 'సాక్షి' రచనలకు ప్రేరణ అని చెబుతారు. కానీ పానుగంటి వారు లోకవ్యవహార పరిశీలకునిగా– ఒక పరిశోధకుని దృష్టితో, ఒక వైజ్ఞానికుని దీక్షతో అందించిన గొప్ప వ్యాసాలివి. 'సాక్షి' అనేది ఒక సంఘం. పానుగంటి వారు అయిదుగురు సభ్యులుగల సంఘంగా దాన్ని పేర్కొన్నారు. పరీధావినామ సంవత్సర మాఘ బహుళ చతుర్దశి శివరాత్రి గురువారం నాడు లింగోద్భవకాలంలో ఉద్భవించిందట. సాక్షి సంఘంలో అయిదుగురు సభ్యులు. ఒకడు కాలాచార్యులు, ద్వితీయుడు జంఘాలశాస్త్రి, మూడోవాడు వాణీదాసుడు, నాలుగోవాడు బొర్రయశెట్టి, అయిదవది స్వయంగా సాక్షి. అయితే ఈ పాత్రలలో సాక్షివ్యాసాలకు పేరు తెచ్చింది ప్రధానంగా జంఘాలశాస్త్రి పాత్రే . జంఘాలశాస్త్రి గురించి చెబుతూ – "ఈతడు కాలినడకనే ఆసేతు హిమాచల పర్యంతం తిరిగినవాడు. అనేక సంస్థానములను చూచినవాడు. ఆయా సంస్థానముల పూర్వచరిత్ర, ఆయా సంస్థానాధీశ్వరుల లోపములను సమగ్రముగా నెరిగిన జ్ఞానసంపన్నుడు. వాచాలుడు. వాదముల యందు కఱ్ఱ జారిపోయిననూ కలయబడగల ధీరుడు. అన్ని అంశములను గూర్చి అంతయో, ఇంతయో, కొంతయో, కూసింతయో తెలిసిన ప్రాజ్ఞుడు" అని చెబుతాడు. బ్రహ్మచారి, శ్రీవైష్ణవుడు, యథార్థవాది అయిన కాలాచార్యులుగానీ, కవి అయిన వాణిదాసుగానీ,

వాణిజ్య ప్రముఖుడైన బొర్రయశెట్టి గానీ, లోకవృత్తానికంతకూ స్వయంగా సాక్షీభూతమైన సాక్షిగానీ ఈ వ్యాసాలలో పలుమార్లు వచ్చినా – ఒక ఉపన్యాసకునిగా నిలిపిన 'జంఘాలశాస్త్రి' పాత్రే విశేషంగా ప్రాచుర్యం చెందింది. దానికి జంఘాలుని వాగ్ధోరణీ వాగ్వాహినీ మోహినీ కరణ దక్షతయే కారణం! హాస్యం, వ్యంగ్యం, నిశితపరిశీలన, విషయవిశ్లేషణ, గాఢత, సభారంజనం చేయడం మాత్రమే కాక, ఆలోచననుద్దీపింప చేయగల ప్రసంగనైపుణి – జంఘాలశాస్త్రి పాత్రను అద్భుతంగా రూపొందింపచేశాయి.

ముఖ్యంగా 'స్వభాష' గురించి పానుగంటివారు జంఘాలశాస్త్రిచే చేయించిన ప్రసంగం– ఎప్పుడో ఎనభైఏళ్ళ క్రితంనాటిదైనా, నేటి సమాజానికీ నవనవోన్మేషంగా, ప్రత్యక్షర సత్యంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచేదే! తెలుగుకు ప్రాచీన హోదా దక్కిందని సంబరపడుతున్న వారంతా కూడా, తెలుగు భాషా ప్రేమికులంతా ఆ వ్యాసాన్ని ఇవాళ మరొక్కమారు విధిగా చదివి తీరాలి! అందరిచేతా చదివించి తీరాలి!

జంఘాలశాస్త్రిలోని ప్రభావోపేతమైన ఆ ప్రసంగధోరణి నేటి సమాజానికి చాలా అవసరం. సంస్థాగత లోపాలవేవయినా తూర్పారబట్టి, దిశానిర్దేశనం చేయగల, జ్ఞానసంపన్నతగల ప్రాసంగికుల అవసరం నేడు ఎంతయినావుంది. హాస్యం వ్యంగ్యాలతో బాటు – ఆలోచనాత్మకమైన అలాంటి వాదనా పటిమ, ప్రసంగపాటవం 'జ్వాలాముఖి' అందిపుచ్చుకోవడానికి జంఘాలశాస్త్రి పాత్ర ఒక ప్రేరణ అనిపిస్తుంది. గిరీశం లెక్చర్లు వేరు. జంఘాలశాస్త్రి ఉపన్యాసాలువేరు. పాశ్చాత్యవ్యామోహానికీ, సత్యం పేరిటి ఆర్థిక ప్రయోజనాల వంచనా కాపట్యాలకూ గిరీశం ప్రతీక కావచ్చునేమోగానీ, సంఘసంస్కరణాభిలాష గల భారతీయ సంస్కారవైభవ ప్రతీక పాత్ర – జంఘాలశాస్త్రి,

నేటి సమాజంలో 'జంఘాలశాస్త్రి' ఆవశ్యకతను గుర్తించినందువల్లనే, ఆ పాత్రను అందిపుచ్చుకుని వర్తమాన లోకరీతులను తదనుగుణంగా వ్యాఖ్యానింపచేసే ఈ రచనలకు శ్రీ అయలసోమయాజుల నాగేశ్వరరావు పూనుకున్నారు. 'సాక్షి' వ్యాసాలను క్షుణ్ణంగా చదవడం మాత్రమే కాదు, జంఘాలశాస్త్రి పాత్రను సమగ్రంగా ఆకళింపు చేసుకున్నారు. 1973 ప్రారంభంలో 'చుక్కాని' పక్షపత్రికలో 'జంఘాలశాస్త్రి' ఉపన్యాసాలు నాలుగైదు నవీనంగా రాసి 'యువభారతి' సాహిత్య

సమావేశాల్లో నేను వినిపించాను. అయితే అవి విన్న నాగేశ్వరరావుగారు ఈ వ్యాసరచనను ఒక అసిధారావ్రతంలా సాగించారు. 'మరోజంఘాలశాస్త్రి' అంటూ పానుగంటివారి 'సాక్షి' పాత్రనే - సమకాలీన సమాజంలో సజీవం చేశారు. నిజానికి 'మరో' అనవసరం లేనంతగా, ఆ పాత్రను ఆధునిక కాలానికి అనుగుణంగా మలచి, తన రచనతో - 'అయలసోమయాజుల జంఘాలశాస్త్రి' అనేటంతగా నాగేశ్వరరావుగారు రూపుదిద్దారు.

యువభారతి పక్షాన 'మరో జంఘాలశాస్త్రి,' రెండు సంపుటాలుగా గతంలో (1982) అయలసోమయాజుల నాగేశ్వరరావు గారు వెలువరించి పాఠకుల ఆదరణ, విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు.

ఒక చిత్రకారునిగా జంఘాలశాస్త్రికి రూపకల్పన చేసే అవకాశం నాగేశ్వరరావు - పుస్తకాలకు ముఖచిత్రం వేయడంవల్ల నాకు దక్కింది. "పానుగంటి వారు జంఘాలశాస్త్రి భౌతికాకృతిని మనకు అందచేయలేదు. కాని రచనను బట్టి శాస్త్రి -చిత్రాన్ని చిత్రించి మనకు అందచేసిన చిత్రకారుడు 'సుధామ' అభినంద నీయులు. ఆ చిత్రంతో కూడా అందంగా దీనిని ముద్రించి, ప్రకటించి 'సాక్షి'ని మన తలపునకు -తెప్పిస్తున్న యువభారతినీ, రచయిత నాగేశ్వరరావుగారినీ మనం అభినందించ వలసిందే" అని 'భారతి' మాస పత్రిక (ఏప్రిల్, 1982) సమీక్షించడం నాకు ఆనందదాయకం.

నాగేశ్వరరావుగారు జంఘాలశాస్త్రి ద్వారా అత్యాధునిక అంశాలననేకం తన వ్యాసాలలో సునిశితంగా విశ్లేషించారు. ఈనాటి పాఠకులను దృష్టిలో వుంచుకుని - సమాసభూయిష్టమైన ప్రవాహసదృశ వాగ్ధోరణి కొంత జంఘాలశాస్త్రిలో నియంత్రించారు. అలాగని ఉపన్యాసధారకు ఏ కొరతా రానివ్వలేదు. జంఘాలశాస్త్రి మాటతీరును ముమ్మూర్తులా పుణికిపుచ్చుకున్నారు. వ్యంగ్యం, మాటలపదును, ఆలోచనాధోరణి, అభివ్యక్తి తీవ్రత పానుగంటి ఒరవడిలోనే ఆధునిక సొబగులద్దుకున్నాయి. నాగేశ్వరరావు గారి రచనలో- సిటీ బస్సులు, సినిమాలు, తుఫానుకవితల పోటీలు, కవిసమ్మేళనాలు, స్త్రీలఫ్యాషన్లు, రామాయణవిమర్శ, నూతన పరీక్ష విధానము, క్రికెట్ కామెంటరీ, సమ్మెలు, పర్యావరణ పరిరక్షణం, వీధి దేవతలు, శాసనసభాసమావేశములు, ప్రభుత్వ రంగ సంస్థలు, తెలుగు టీవీ కార్యక్రమములు, జాతీయసమైక్యత - ఇలా ఏ

విషయాన్ని తీసుకున్నా తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా, కుండబద్దలు కొట్టినట్లు ఈ వ్యాసాలలో నాగేశ్వరరావుగారు వెలువరించారు. మంచి వాచకవైభవం గల నటుడెవరిచేతనైనా వీటిని కంఠస్థం చేయించి ప్రతి పాఠశాలలో, కళాశాలలో ఉపన్యసింప చేసినట్లయితే, అదేవిధంగా సాహిత్యసభల కార్యక్రమ అంశంగా మలచి అందించ గలిగినట్లయితే, ఆశించిన ప్రయోజనం కొంతమేరకైనా సిద్ధిస్తుందేమో! ఆ పని ఎవరయినా చేస్తే ఎంత బాగుణ్ణు!

'మరోజంఘాలశాస్త్రి' ద్వారా అయలసోమయాజుల నాగేశ్వరరావుగారు వెల్లడించిన వ్యంగ్యవైభవం, అభిప్రాయనైశిత్యం గ్రహించడానికి వాచవిగాకొన్ని మ(మె)చ్చుతునకలివి :

"సామాజిక స్పృహయా? ఏదీ! అసలు ఒడలిపైన స్పృహయే లేనప్పుడిక సామాజిక స్పృహ ఎక్కడిది? ఎప్పుడునూ ఏదియో ఒక మత్తు – రాజకీయ సిద్ధాంతపు మత్తో, సినీకాంతల కౌగిలింతల మత్తో, పూర్వసంస్కృతీ విరోధపు మత్తో, కవి కావలయు నను మోహపుమత్తో, మద్యపానపుమత్తో – ఏదో ఒకటి. మత్తులేకుండ కవిత్వము వ్రాసినదేది? స్పృహవుండి కవిత్వము వ్రాసినదెప్పుడు? ఏది వ్రాసినను మత్తులోనే! ఏది చేసినను మత్తులోనే! స్పృహయే లేనప్పుడిక సామాజిక స్పృహ ఎక్కడిది?"

*(కవులు–సామాజిక స్పృహ)*

"కూడు, గుడ్డలను ఏ ప్రభుత్వమయిన అందచేయును కాని కమ్మని మద్యము నందచేయు ప్రభుత్వమేది? అట్టి ప్రభుత్వము మరెచ్చటనైనను కలదా? లేదు నాయనలారా, లేదు, ఆ కీర్తి మనకే దక్కినది. భారతమాత ధన్య యయినది వహ్వా! ముందుల కేగుచున్నామని చీకటిలో వెనుకకు పయనించుచున్నామే! పురోగతికై ఉద్యమించి తిరోగమించుచున్నామే! తినుటకు తిండి, కట్టుటకు బట్ట ఉండుటకు గూడులేని మన దేశములో మద్యపానమా!"

*(మద్యపాన నిషేధము)*

"నాయనలారా! దేశమందెల్లవేళలందు, ఎల్లకాలమందు ఒకేరకమైన సిద్ధాంతము మనజాలదు. అటులే అయిన అది దేశము కాదు. వారిది సిద్ధాంతము కాదు. వారు ప్రజలు కారు. దేశకాల పాత్రములనుబట్టి ఆనాటి ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులనుబట్టి ఇది మంచి, ఇది చెడు అని మనము నిర్ణయించు

చున్నాము. ఈనాటి మంచి రేపటికి చెడుగగుచున్నది. నిన్నటి చెడుగు నేటికి మంచి యగుచున్నది... నిన్నటిదాక బహుసంతానవతి అయిన స్త్రీ పుణ్యవతి. నేడు సంతాన విహీన యోగ్యతాపత్రమున కర్హురాలు. ఇంతలోనే ఇన్ని మార్పులు జరుగుచుండ కొన్నివేల ఏండ్ల క్రిందట వ్రాయబడిన రామాయణమంత తుక్కనియు వాల్మీకివట్టి ఫూలనియు, ఈనాడు మనకున్న మిడిమిడి జ్ఞానముతో వచించుట తప్పుకాదా!" *(రామాయణ విమర్శ)*

"ఈ దీపములార్పుటయేమి? ఈ రొట్టెముక్కల కత్తిరింపులేమి? ఈ సామాజిక బృందగానములేమి? నాయనలారా! మనకు సంప్రదాయములు లేవా? ఆచార వ్యవహారములు లేవా? మనజాతి అంత గొడ్డువోయినదా? అంత నిస్తేజమైనదా? అంత నిర్వీర్యమైనదా? మీ సూటు బూటులనే కాక ఆచారవ్యవహారములను కూడా దిగుమతి చేసుకొనుచున్నారా!"

*(పుట్టినదినము పండుగ)*

"నాయనలారా! విద్యావిధానమును రాజకీయములతో ముడివేయకుడు. దానిని విద్యావేత్తల కప్పగింపుడు. జాతీయ విద్యావిధానమును రూపొందించి కాశ్మీరము నుండి కన్యాకుమారి వరకుగల యావద్భారత దేశమందును అమలు చేయుడు. దేశ ఆర్థిక, సాంఘిక అవసరముల కనువగు విద్యావిధానము మలచుడు. విద్యను మార్పు సాధించుటలో నాయుధముగ తీర్చిదిద్దుడు"

*(నూతన పరీక్షా విధానము)*

"నాయనలారా! మీ కార్యాలయమునందు నాటకకర్తలు, నటులు, కథకులు, కవులు, నవలాకారులు, సాహిత్యాభిలాషులు, క్రీడాకారులు, కార్యకర్తలు సంఘ సేవా పరాయణులు, రాజకీయ విశ్లేషకులు, వ్యాపారస్థులు వీరు వారు అననేల? అన్ని రంగములలో ప్రావీణ్యము కలవారున్నారు. కాని లేనిది ఒక్కరే! చిత్తశుద్ధితో పనిచేయు వారు, పనిని నేర్చుకుందుమను యుబలాటము కలవారు – మహాగణకుల వారి కార్యాలయములో పింఛను ఇచ్చువారే కాదు – పింఛను తీసుకొనుచున్నవారు కూడా చాలామంది యున్నారని నాకీనాడే తెలిసినది"

*(ఏ.జి. ఆఫీసు ప్రసంగము)*

"ఈ రోజులలో ధర్మము, సత్యము, నీతి, న్యాయము, అహింస, పితృవాక్పరి పాలనము వంటి పదములు అసభ్యపదజాలములైనవి. వాటిని గూర్చి మాట్లాడువారు పిచ్చివారైనారు. మనసులో నొకటుంచుకొని మాటలలో వేరొకటి

మాట్లాడుట మనవశమా? అట్లు మాట్లాడగలిగిన మనమిచ్చటికి వచ్చియుండెడి వారమా?" (పిచ్చాసుపత్రి - వింతస్వప్నము)

ఇలా ఉటంకించుకుంటూ పోయే లౌల్యాన్ని వీడకపోతే ప్రమాదమే. ఇందులోని 'వీధి దేవతలు' చదవండి. అధునాతన నగర వ్యవహారం, కబ్జాసురుల వైనం కళ్ళకు కడుతుంది. 'పర్యావరణ పరిరక్షణము', 'మనుధర్మశాస్త్రము' - సంభాషణా ప్రసంగ సరళి కన్నా వ్యాసవివరణ వైఖరిలోనే సాగినా, అందులోని విషయ గాంభీర్యం గణుతించి గుర్తించదగినది. అలాగే 'మాతృ(మృత)భాష' నేటి భాషా స్థితిని గూర్చిన ఆర్తిని చూపుతోంది. ముందుముందున్న వ్యాసాలకన్నా ఇటీవలి రచనల్లోనే కొంత దీర్ఘత వుండి జంఘాలశాస్త్రి ఉపన్యాసఫణితిలో విషయంపట్ల సమగ్ర అధ్యయనం కనబడుతోంది. తెలుగు టీ.వి. కార్యక్రమాల గురించీ, జాతీయ విద్యావిధానం, జాతీయ సమైక్యత గురించి రాసిన వ్యాసాలు ఉపన్యాస వైఖరికన్నా పరిశోధక వైఖరిని సంతరించుకున్న అధ్యయనపత్ర ప్రసంగాలుగా మారాయని నాగేశ్వరరావు గారు గుర్తించారో లేదో! విషయం దృష్ట్యా అవి విలువైన వ్యాసాలేగానీ, జంఘాలశాస్త్రి పాత్రగతంగా చూస్తే- కొంత భిన్నమార్గం తొక్కినట్లుగా తోచవచ్చు. పాత్ర సహజగతమైన అభివ్యక్తివైఖరి, ప్రసంగధోరణి, వ్యంగ్యఫణితి చివరివ్యాసాల్లో కనుమరుగు కాకుండా మరింత జాగ్రత్త వహించివుంటే బాగుండేది. "మరోజంఘాలశాస్త్రి చిన్నవ్యాసాలైతేనే రాణించి, దీర్ఘ రచన అయితే తేలిపోతాడు" అనిపించుకోకుండా - పాత్రగతవైఖరి మందగించకుండానే, విపుల రచనా సంవిధానాన్ని మునుముందు మరింతగా నిలుపుతారని ఆకాంక్ష.

ఏమయినా 'జంఘాలశాస్త్రి' పాత్రను పునఃప్రతిష్ఠ చేసి, వర్తమాన కాలానికి అనుగుణంగా మలచి, పానుగంటిని నేటికీ 'పొడగంటి' నని పాఠకులు ఆనంద సంధాయకంగా, అనుభూతి రమ్యంగా పరితృప్తులయ్యేలా-ఆలోచనాత్మక వ్యాస పరంపరను అందించిన అయలసోమయాజులుగారు బహుధా అభినందనీయులు. తెలుగు సాహిత్యంలోని ఒక విశిష్టపాత్రను సమాదరణీయ వ్యాసమూర్తిగా సమకాలీనం చేసిన ఘనత నాగేశ్వరరావుగారిదే. దీనిని మక్కువతో అక్కున చేర్చుకునే పాఠకతరం ఏర్పడాలని ఆకాంక్షిస్తూ, ఏర్పడగలదని విశ్వసిస్తూ... స్వస్తి!!

*జనవరి 2008*




# స్ఫూర్తిసుధాశరధి దాశరథి

## దాశరథి కవితా వైభవం – డా॥ తిరుమల శ్రీనివాసాచార్య

తెలుగువారి గుండెకింద చిరునామాగా నిలిచిన వీర తెలంగాణ కవివరేణ్యుడు దాశరథి. ప్రాంతాలకు అతీతమైన క్రాంతదర్శి దాశరథి.

*"తెల్లవారే వేళ కమలము/ కళ్ళు విప్పేటప్పుడు*
*బాలభానుడు తొంగిచూసే/ ప్రాగ్దిశాగ్రము నా పతా*

*కరకురాళ్ళే కరుగునట్లుగ/ కవిత వ్రాసే వేళలో*
*కాంతి విరిసీ శాంతి కురిసే/ కవి కరాగ్రము నా పతా*

*విప్లవము వర్ధిల్లు వేళల/ వీర వర్యుని కనులలో*
*ధగధగాయిత నవదవానల/ కీలికాగ్రము నా పతా!"*

అని తన పతా (చిరునామా)ను తన కవిత్వ వ్యక్తిత్వాలకు దర్పణంగా తానే చాటుకున్న ధీశాలి దాశరథి. 'నా తెలంగాణ – కోటి రత్నాల వీణ' అంటూ ప్రకటించి నిజాం పరిపాలనలో తెలంగాణ దుస్థితినీ, ప్రజల ఇక్కట్లనూ గ్రహించి నాటి ప్రభుతకు వ్యతిరేకంగా 'మా నిజాం రాజు జన్మజన్మాల బూజు' అంటూ రుద్రవీణ మీటి సింహగర్జన చేసిన కవి కంఠీరవం దాశరథి. 'తెలంగాణము రైతుదే– ముసలినక్కకు రాచరికంబు దక్కునే' అని తిరుగుబాటు జెండా ఎగరేసి జైలుగోడలమీద కూడా తెలంగాణ స్వాతంత్ర్య కాంక్షను నిర్భయంగా రాసినవాడు. ఆంధ్రప్రదేశ్‌కు ఆస్థానకవిగా దాశరథి తరువాత మరొకరు

నియామకం కానేలేదు. దాశరథి అగ్నిధార, రుద్రవీణ, కవితాపుష్పకం, తిమిరంతో సమరం- కవితా సంపుటాలు, గాలిబ్ గీతాలకు చేసిన తెలుగు అనువాదం ఆయన సాహితీ మూర్తిమత్వానికి తిరుగులేని ప్రతీకలు. ఉర్దూ గజల్, రుబాయీ ప్రక్రియలను తెలుగుకు తెచ్చి కావ్యగౌరవాన్ని కలిగించినది మొదటగా దాశరథియే. కొంతకాలం అధ్యాపకునిగా ఆపై పంచాయితీ తనిఖీ ఇన్స్‌పెక్టర్‌గా 1956 నుంచి 1963 వరకూ హైదరాబాద్‌లోనూ ఆపై 1970 వరకూ మద్రాసులోనూ ఆకాశవాణి కేంద్రంలో ప్రొడ్యూసర్‌గా పనిచేసిన దాశరథి 1961లో 'వాగ్దానం' చిత్రంతో చలనచిత్ర గేయ రచనకు శ్రీకారం చుట్టి, రెండు దశాబ్దాలకు పైబడి శతాధిక చలనచిత్ర గీతాలను రచించి, సినీకవిగా జనం నాల్కలమీద నర్తించే చక్కటి పాటలను సాహిత్య పరిమళాలతో అందించాడు. పొట్టివాడైనా గట్టివాడని, తానే రంగంలో నిలిచినా అందరితో ఆత్మీయంగా వుంటూ రాణించాడు.

అటువంటి దాశరథి కృష్ణమాచార్యగారి జీవితాన్నీ కవిత్వాన్నీ కూడా రాబోయే తరాలకు కూడా పఠనీయంగా ఆదర్శంగా నిలిచేలా డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారు 'దాశరథి కవితావైభవం' అనే గ్రంథాన్ని అందిస్తున్నారు. కొండను అద్దంలో పట్టి చూపడం ఆచార్యుల వారి ప్రజ్ఞే! దాశరథి జీవితంలో నిజాం నవాబుపై తిరుగుబాటు, జైలు జీవితం, విశాలాంధ్రకై చేసిన కృషి, ఆయన జాతీయదృష్టి, విశ్వమానవత, ఆయన వ్యక్తిత్వం వంటి అంశాల చిత్రణతోబాటు దాశరథి కవిత్వంలోని ప్రబోధం, వర్ణనలు, ఆశావాదం, శాంతి ప్రియత్వం, లోకజ్ఞత, నిర్వచనాలు, స్వతంత్ర ప్రయోగాలు, చలనచిత్ర గీతాలు వంటి విషయాలను శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యగారు ఎంతో సరళ సుందరంగా, మధుర వ్యాఖ్యలతో ఈ పొత్తంలో సంతరించారు.

దాశరథి 89వ జయంతి ఉత్సవాలను భారతదేశపు 29వ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ ప్రభుత్వం 2014 జూలై 22న అధికారికంగా నిర్వహించింది. దాశరథి మహాకవి పేర ఏటా రాష్ట్రంలో ఒక ఉత్తమ కవిని ఎంపికచేసి లక్షా నూటపదహారు రూపాయల బహుమతిని అందజేస్తామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖరరావు ప్రకటించారు. దాశరథి స్ఫూర్తిని అందిపుచ్చుకుని రుబాయీల తెలుగు రచనా ప్రక్రియలో తెలుగులో విశిష్ట సంపుటాలనెన్నో వెలువరించిన కవితాకీర్తి శ్రీ తిరుమల శ్రీనివాసాచార్య గారిదే. భాషా సంస్కృతి సంప్రదాయాలు వెల్లి విరిసేందుకు భాషాభిమానిగా,

ఒక సామాన్య కార్యకర్తగా తనవంతు సహకారాన్ని అందజేస్తానని దాశరథి జయంతి సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి కె.సి.ఆర్. వేదికపైనే వున్న తన గురువు శ్రీ తిరుమల శ్రీనివాసాచార్యగారికి పాదాభివందనం చేయడం ఒక అపూర్వ ఘట్టం! 'తెలంగాణ కోసం తొలి దెబ్బ తిన్న తొలివ్యక్తి – కవి దాశరథి' అని తిరుమల శ్రీనివాసాచార్యగారు దాశరథిపై ఈ గ్రంథం వెలయించడం గొప్ప నీరాజనం! దాశరథి స్ఫూర్తిని భావితరాలకు అందించడానికి పాఠశాల, కళాశాల స్థాయిలో ఈ గ్రంథాన్ని పాఠ్యగ్రంథంగా సంతరిస్తే ఎంతో సముచితంగా వుంటుంది.

దాశరథి జీవితం, కవిత్వ పటిమ, పోరాట స్ఫూర్తి, విశ్వమానవత విలువైనవి. దాశరథి పేరున విశ్వవిద్యాలయం ఒకటి నామాంకితం చేయాలన్న ప్రభుత్వ సంకల్పం కూడా అభినందనీయం. అవన్నీ కార్యరూపం దాల్చాలని ఆకాంక్షిద్దాం. ఈ పుస్తకం దాశరథికై రూపొందించిన 'అక్షర విగ్రహం' అనవచ్చు. రచనాశిల్పి తిరుమల శ్రీనివాసాచార్యగారు. దాశరథి కవితావైభవ విశ్వరూపాన్ని ఈ గ్రంథం ద్వారా దర్శనం చేయిస్తున్న యువభారతి ప్రచురణలకు అభినందనలు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ శుభతరుణాన ఈ గ్రంథం వెలువడడం ఎంతో ముదావహం. డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యగారికి అభివందనాలు. రాష్ట్రప్రజల సముచిత సమాదరణకు ఈ గ్రంథం నోచుకుంటుందని మనసా విశ్వసిస్తున్నాను.

*24 జూలై 2014*



# గ్రంథ సిరి

## మందార మకరందాలు - డా॥ సి.నారాయణరెడ్డి

'పద్యం' అంటే పోతనగారిది! గుండెల్లోకి ఇంకి నాల్కలపై నడయాడే 'రసతరంగిణి'. పోతన 'మహాభాగవతం' నేటికీ తెలుగువారి ఇండ్లలో వారెక్కడున్నా పారాయణ గ్రంథం. పోతన పద్యం ఒక్కటైనా నోటికిరాకపోతే ఆ తెలుగుజన్మ వృథాయే. భాగవతం పోతన కేవలం ఆంధ్రీకరించలేదు. "విబుధ జనుల వలన విన్నంత కన్నంత తెలియవచ్చినంత తేటపఱతు" అని వినయంగా అన్నాడు కానీ, భాగవత కథాసుధను ప్రత్యక్షరం తెలిసి పలికాడు. "దీనిని దెనిగించి నా జననంబున్ సఫలంబు చేసెదఁ బునర్జన్మంబు లేకుండగన్" అన్నాడు కానీ, తన జన్మనే కాదు పోతన భాగవత పఠనంతో, శ్రవణంతో తెలుగుల జన్మకే సుకృతం ప్రసాదించాడు.

భాగవతంలోని పన్నెండు స్కంధాలలో బమ్మెర పోతరాజు అనువదించినది ఒకటి నుంచి నాలుగు, ఏడునుంచి పదివరకే, అంటే ఎనిమిది స్కంధాలు మాత్రమే. బొప్పరాజు గంగరాజు పంచమస్కంధాన్ని, ఏర్చూరి సింగన షష్ఠమస్కంధాన్ని, వెలిగందల నారయ ఏకాదశ ద్వాదశ స్కంధాలను రచించారు. కూచిమంచి తిమ్మకవి 'లక్షణ సారగ్రంథం'లో ఈ విషయం విశదీకరించాడు. సర్వజ్ఞ సింగమ నాయుడు తాను కోరినా, పోతన భాగవతాన్ని తనకు అంకితం ఇవ్వలేదని కోపించి, భాగవత పురాణాన్ని గోతిలో పాతించాడని, అందువల్ల తాళపత్రాలు కొంతవరకు శిథిలమై పోయినందున గంగనాది కవులు నశించిన భాగాలు పూరించడంతో భాగవతం పూర్తిగా లభ్యం కలిగిందన్న విషయం ప్రాచుర్యంలో ఉంది.

సీ. ఘనుడు పోతన మంత్రి మునుభాగవతము ర
చించి చక్రికి సమర్పించునెడల
సర్వజ్ఞ సింగయక్ష్మావరుం దది తన
కిమ్మనివేడగా నీయకున్న
నలిగి యా పుస్తకం బవనిఁ బాతించినం
జవికి యందొకకొంత శిథిలమయ్యెఁ
గ్రమ్మఱనది వెలగందల నారప
రాజును మట్టి బొప్పరాజు గంగ

రాజు మొదలగు కవివరుల్ తేజమెసఁగఁ
జెప్పి రా గ్రంథముల యందే తప్పులొదవెఁ
గాని పోతన కవీంద్రుని కవితయందు
లక్షణం బెందుఁ దప్పునా దక్షహరణ

(కూచిమంచి తిమ్మకవి-లక్షణసారగ్రంథం')

భక్తికి, ముక్తికి భాగవతం పోతన ప్రసాదించిన వరం. పోతనవంటి కవి మరొకరు లేడు. ఆయనదే అగ్రాసనం. ఖ్యాతి గడించిన కవులెందరున్నా జనవశీకరణాద్భుతశక్తి పోతన భాగవతందే! పోతనలో ప్రతివాడూ భక్తిభావశబలతలో- 'తన'ను పో! చూసుకోగలుగుతాడు. ప్రతి పద్యంలో హృద్యంగా రసమంచితంగా తల్లీనమవుతాడు. సహజ పాండితితో కవితామృత భక్తిధారలు కురిపించిన పోతన తన గంటాన్ని పంచదారలో అద్ది ఇంత మధుర భావాలను ఒద్దికగా ఇచ్చి వుంటాడనీ, తీయని రసాల రసాలు ఆయన లేఖినిలో చింది పోసాగినవేమో అనీ కరుణశ్రీ గారు ఊరకే అనలేదు. పోతన పద్యాల మందారమకరందం గురించి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారన్నట్లు

అచ్చపు జుంటితేనియల, నైందవ బింబ సుధారసాల, గో
ర్వెచ్చని పాలమీగడల, విచ్చెడి కన్నె గులాబి మొగ్గలన్
మచ్చరికించు ఈ మధుర మంజుల మోహన ముగ్ధ శైలి నీ
వెచ్చట నేర్చినావు? సుకవీ? సుకుమార కళా కళానిధీ!

*కమ్మని తేటతెల్గు నుడికారము లేరిచి కూర్చి చాకచ*
*క్యమ్ముగ కైతలల్లు మొనగాండ్రు కవీశ్వరు లెంతమంది లో*
*కమ్మున లేరు - నీవలె నొకండును భక్తిరసామృత ప్రవా*
*హమ్ములకేత మెత్తిన మహాకవి యేడి తెలుంగుగడ్డపై?*

అన్నది ప్రత్యక్షర సత్యం! పోతన పద్యం నేరుగా పఠిత గుండెను తాకుతుంది. అన్వయక్లిష్టత గానీ, అర్థం కాకపోవడం గానీ ఏమీ వుండదు. పోతన పద్యాల భావాలు లోతులు తరచిన కొద్దీ హృదయంగమమై ఉన్నతులను చేస్తాయి.

పోతన పద్యాలకు ఔచితీమంతము, రసప్లావితమూ అయిన వ్యాఖ్యానాన్ని సంతరించి డా॥ సి. నారాయణరెడ్డిగారు ఈ 'మందార మకరందాలు' యువభారతికి ఎన్నడో ఉపాయనంగా అందించారు. యువభారతి ఇప్పటికే వేలాది ప్రతులను జనంలోకి తీసుకువెళ్లింది. 'లక్షప్రతులనోము' నోచినట్లుగా ఇప్పుడు పునర్ముద్రణకు నోచుకుంటున్న ఈ గ్రంథం ఈ తరం పాఠకుల చేతుల్లోకి వెళ్లి వారి 'హృదయవాసి' కావాలన్నది తపన. ఇంటింటా వుండదగిన గ్రంథం ఇది. భాగవతంలోని ఎంపిక చేసిన అద్భుత పద్యాలకు నారాయణరెడ్డిగారు తనదైన కవితామాధుర్యంతో, వ్యాఖ్యాన దక్షతతో- 'మందార మకరందాలు'గా ఈ రూపునిచ్చారు. ఇందులోని పద్యాలు పఠించినా చాలు, రసనపై నిలుపుకున్నా చాలు "నరుండు శాశ్వత శుభారూఢుండు". పోతన పద్యాలకు నారాయణరెడ్డిగారి వ్యాఖ్యానం బంగారానికి తావి అబ్బినట్లుగా- ఇప్పటికే ఈ పుస్తకం వేలాది ప్రతుల చెల్లుబాటే తార్కాణం! ఆచార్య నారాయణరెడ్డిగారి వ్యాఖ్యానం ఎలావుందో మళ్ళీ ఇక్కడ వ్యాఖ్యానించనవసరం లేదు. పోతన పద్యం, దానికి సినారె వివరణ గద్యం, రెండూ అత్యంతహృద్యం! యువభారతి సాహితీ సేద్యంలో ఇదొక మంచి 'పంట'. మీ ఇంట ఈ 'గ్రంథసిరి'ని నిలుపుకుని, అమందానందకందళిత హృదయారవిందులై భాసించండి.

*12 అక్టోబర్ 2012*



# మహనీయ మననగుణాల హనుమ స్ఫూర్తిగా

## విజయానికి అభయం - డా॥ గంధం నారాయణ

ఈ తరం 'మారుతతుల్యవేగం'తోనే పురోగమిస్తోంది.

నేటి యువతరానికి 'కెరీర్' మీదనే దృష్టి ఎక్కువ. అందువల్లనే 'పర్సనాలిటీ డెవలప్ మెంట్' అనే, వ్యక్తిత్వ వికాస గ్రంథాలను గూర్చి (కథ, కవిత్వం వంటి కాల్పనిక సాహిత్య గ్రంథాలను చదవకపోయినా) ఆసక్తి కనబరుస్తున్నారు. ఒకప్పుడు సుప్రసిద్ధ నవలారచయితగా పేరుగాంచిన ఆయనే, నవలలకన్నా - ఈ వ్యక్తిత్వవికాస గ్రంథాలకే మార్కెట్ ఎక్కువవుందని తన రచనావ్యాసంగాన్ని అటు మరలించుకుని, విజయానికి సోపానాలు చూపడానికి సమకట్టారు.

ఈనాడు 'సామాజిక స్పృహ' అంటూ ఆధునిక సాహిత్యంలోనే వుందనీ, ప్రాచీన సాహిత్యం చదవనవసరం లేదనీ, కొందరు పెద్దలే పిల్లలకు చెబుతూ వుండడం నివ్వెరపరుస్తూంది! నిజానికి భాషమీద, అభివ్యక్తిమీద పట్టు కావాలంటే - అపారపదసంపద, భావవ్యక్తీకరణ సౌలభ్యం కావాలంటే ప్రాచీన సాహిత్యం పఠించ వలసిందే !-నేడు జాతికి ఆరాధ్యులయిన ప్రముఖులెందరో, ఆలాంటి పునాదులమీద తమ సామర్థ్యాలను పెంచుకున్న వారే. నిజానికి ఇవాళ వాదాలుగా, ఇజాలుగా, ప్రాంతీయాలుగా వెలువడుతున్న సాహిత్యంలో కాలిక ప్రయోజనాలూ, అవసరాలు తీరుతాయేమోగాని సార్వకాలిక విలువల కారణంగానే - రామాయణ, భారతాది గ్రంథాలు వేలాది సంవత్సరాలుగా మనగలుగుతున్నాయని మనం

గ్రహించుకోగలగాలి. వాటిలోని ఆదర్శం పదిలపరుచుకో గలగాలి.

ఆ మధ్య 'ఈనాడు' ఆదివారం అనుబంధం చూసే శ్రీమతి కృష్ణవేణి గారు, జనార్దన రావు ద్వారా వారి పత్రికలో సమీక్షించడానికి ఒక పుస్తకం ఇచ్చారు. 'ప్రాచీన సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసం' గూర్చిన పుస్తకం అది. చిత్రంగా ఆ గ్రంథ రచయిత ఎక్కడా రామాయణం గురించీ, అందులోని పాత్రలు వ్యక్తిత్వ వికాసానికి ఎలా స్ఫూర్తిమంతాలు అనే విషయం గురించీ – ఊసెత్తక పోవడం ఆశ్చర్యం కలిగించింది. లోకంలో రాముడు 'పురుషోత్తముడి'గా అనాదిగా భావింపబడుతున్నాడు. రాముడిని దైవంగాకాక, ఒక మానవునిగానే నిలిపి, మానవ జీవనాదర్శాలనెన్నింటినో ఆ పాత్రలో కవి పొందుపరిచాడు. అందుకే ఎన్ని విషవృక్షాలు నాటినా – అమృత కావ్యమైన రామాయణం అంతరించి పోలేదు. పోదు కూడాను. సీతమ్మ కష్టాల నుండి స్త్రీలు గ్రహించినవీ, రామసుగ్రీవులమైత్రీ, హనుమభక్తీ ఇవన్నీ జీవనవికాసానికి విశ్లేషించి, వివేచించి అందుకున్నప్పుడు సదా సమాదరణీయాలే ! నేటికీ ఏనాటికీ.

రామాయణంలోని ఒక్కొక్క పాత్రా నేటి సమాజంలో వివిధ వ్యక్తుల మనస్తత్వాలకు ప్రతీకలుగా నిలుస్తూ పాఠాలను, గుణపాఠాలను, ఆదర్శాలను అందించేవే. వ్యక్తిత్వవికాస మార్గంలో పఠనీయాలే. అనుసరణీయాలే.

రామాయణంలో హనుమంతుని పాత్ర వైశిష్ట్యం మరీముఖ్యంగా నేటి తరం గ్రహింపదగ్గది. అందునా అవివాహిత బ్రహ్మచర్యయువత ఆంజనేయుని ఆదర్శంగా తీసుకోవడం మన భారతీయ సమాజంలో ఎప్పటినుంచో వుంది. తెలుగునాట ఆంజనేయస్వామి ఆలయం లేని ఊరులేదనవచ్చు కూడాను. నిజానికి మనిషి వానరం నుంచి పరిణామం చెందాడన్నది వాస్తవమే అయితే – ఆంజనేయుని వంటి వానరం నుంచి నిజంగా మనిషి ఆ గుణస్వభావాలతో రూపుదిద్దుకుని వుంటే ఈ సమాజం మనుషులతో, మంచి మనుషులతో, ఇంకెంత బాగుండేదో కదా! అనిపిస్తుంది. స్ఫూర్తిదాయకమైన, ఆచరణాత్మకమైన, ఆదర్శనీయమైన అనేక అంశాల సమాహార స్వరూపం 'హనుమ'. హనుమద్భక్తి, హనుమ సేవనం, హనుమ ఆదర్శం– ఎలా, ఎందుకు, ఎన్నివిధాల ప్రయోజనదాయకాలో, వ్యక్తిత్వవికాసానికి ఎలా మేలు కూర్చగలవో, డాక్టర్ గంధం నారాయణ గారు

యువభారతికి అందించడానికే – 'విజయానికి అభయం' అనే ఈ గ్రంథాన్ని రచించారు. ఈ చిరు గ్రంథ పఠనం యువతకు ఎంతో ఉపకరించే గ్రంథం అనడం అతిశయోక్తి కాదు. ఆంజనేయ స్వామి స్ఫూర్తి–వ్యక్తి రాణించడానికి అనుష్ఠించవలసిన వ్యక్తిత్వవికాస సూత్రాలను అందిస్తుంది. తద్వారా లభిస్తుంది సత్కీర్తి !

*"బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగతా*
*అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్స్మరణాత్ భవేత్"*

అని చెప్ప బడింది. హనుమను అందుకే

*"మనోజవం మారుత తుల్యవేగం*
*జితేంద్రియం బుద్ధి మతాం వరిష్టమ్*
*వాతాత్మజం వానరయూధముఖ్యం*
*శ్రీరామదూతం శిరసానమామి"*

అని భక్తులు ప్రార్థిస్తారు.

హనుమలోని విశిష్టలక్షణాలు – బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, వాక్పటుత్వం ఇవన్నీను. రాణించగోరే ఏ మనిషికయినా అవసరమైన లక్షణాలు ఇవి. ముఖ్యంగా పరిపూర్ణ మానవునిగా విజయమార్గంలో వికాసం పొందగోరే ప్రతివారూ, నేర్చుకోవలసిన, గ్రహించవలసిన, ఆచరణాత్మకం చేసుకోవలసిన అంశాలివి. ఆస్తికులయినా, నాస్తికులయినా ఇక్కడ వ్యక్తి వికాసానికి ఆవశ్యకమైన గుణసంపద ప్రధానం.

బుద్ధి మంతులు, బలవంతులు, యశోవంతులు, ధైర్య శీలురు, నిర్భయులు, ఆరోగ్యవంతులు, వాక్పాటవం గలవారే చైతన్య శీలురై, ఎప్పుడయినా, ఎక్కడయినా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా, ఎలాగయినా, ఎందుకయినా, ఎన్నాళ్లయినా రాణిస్తారు. జీవితంలో విజయానికి అభయంపొంది మనగలుగుతారు. అందుకే ఈ గుణాలప్రోవు అయిన 'హనుమ' యువతకు ఆదర్శనీయం, ఆరాధనీయం అని గంధం నారాయణ గారు స్ఫూర్తి దాయకమైన ఆ అంశాలను విశదీకరించారు.

విజయవంతంగా జీవించాలి అని ఎవరికుండదు? అయితే అందుకు కావలసిన అర్హతలు సంపాదించుకోవాలి. ఏ అర్హతల వల్ల జీవితం ఫలప్రదమవుతుందో గ్రహించి, వాటిని అలవరుచు కోవాలి. లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన గుణగణాలు ప్రయత్న పూర్వకంగా పొందడం అసాధ్యమేమీ కాదు. సంకల్పబలం, చిత్తశుద్ధి ఆ బుద్ధిని నిలుపుకునే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యం వుండాలి అంతే !

శ్రీ నారాయణ గారు ఒక్కొక్క అంశాన్ని తీసుకుని ఆసక్తిదాయకంగా విశ్లేషిస్తూ, వివరిస్తూ, యువతకు ప్రబోధాత్మకంగా ఈ రచనను మలిచారు. రామాయణంలోని హనుమ పాత్రనూ, వివిధ సన్నివేశాలలో హనుమ వ్యవహార సరళినీ మన ముందుంచుతూ – వ్యక్తిత్వవికాసానికి అందులోనుండి గ్రహించవలసిన ఉదాత్త గుణసంపద గురించి గుర్తింపచేశారు. భావవినిమయానికి ప్రధానమైన మాట గురించీ, మాటవల్ల ఎలా రాణించి, విజయాల బాటలోసాగి, సుఖశాంతుల కోటలో వసించ వీలవుతుందో ఈ రచన నుండి చక్కగా గ్రహించవచ్చు.

చిన్నప్పుడు మా అమ్మమ్మ చెబుతుండేది. సీతాన్వేషణకు వెళ్లిన హనుమ ఆమెనుచూచి, రావణుడికి బుద్ధి చెప్పే హెచ్చరికగా లంకను కాల్చి, సీతగురించిన వర్తమానం చెప్పడానికి రాముని వద్దకు తిరిగివచ్చాడు. సీతగురించి తెలుసుకోవాలన్న ఆరాటంలో వున్నాడు శ్రీరాముడు. హనుమ 'నేను' అని వాక్యం మొదలు పెట్టినా 'సీత' అని వాక్యం మాట్లాడడానికి మొదలు పెట్టినా తర్వాత ఏంచెబుతాడోననే 'టెన్షన్' అనే 'ఆవేగపు ఉత్కంఠ' రామునిలో కలిగే వీలుంది. తర్వాత చెప్పబోయేది ఏమిటో అన్న ఉద్వేగంతో రాముడు ఏమవుతాడో ననే ఆలోచనతోనే – హనుమ ప్రారంభంలోనే 'చూచితి' అని విషయం మొదలు పెట్టాడట. 'ఒక్కమాటే' అయినా, అనడంలో ముందు వెనుకలు కూడా అవతలివారి జీవితంపై అనంత ప్రభావం కలిగించగలవనడానికి ఉదాహరణంగా ఈ విషయం మా అమ్మమ్మ చెబుతుండేది.

ఆంజనేయునిలోని వాక్పటుత్వం యొక్క గొప్పదనం నారాయణగారు ఎంతో ఔచితీమంతంగా చెప్పారు. గంధం వారి రచనా ప్రణాళిక కూడా రస బంధురంగా, ఔచితీమధురంగా వుంది. జీవనవికాసానికి ఆవశ్యకాలయిన బుద్ధి, బలం వంటి

గుణాలను గురించి ముందుగా ప్రకరణాలుగా వివరించి, అనంతరం రామాయణంలోని హనుమ ఏతాదృశ గుణగణభూషితుడై విరాజిల్లుతూ, ఎలా ఆదర్శనీయుడు, ఆచరణాత్మకమూ అయ్యాడో సోదాహరణంగా వివరించారు.

ఏదో ఒక వస్తువు కావాలంటే ఏదో కిరాణా కొట్టుకు వెడతాం. కానీ అవసరమైన వన్నీ కావాలనుకున్నప్పుడు సూపర్ మార్కెట్ కు వెడతాం. అలా సకలసద్గుణ సమాహారుడు, సకలాభీష్ట సిద్ధిప్రదాయకుడు అయిన హనుమ స్ఫూర్తిదాయకుడూ ఆరాధనీయుడూ అని గంధం నారాయణ గారు ఈ గ్రంథంలో అనవరత పారాయణతో మననం చేయదగిన మంచి మంచి విషయాలను బలీయంగా చెప్పారు. ఆసక్తిగా [illegible]క అందుకుని లబ్ధి పొందడమే పఠితల వంతు.

యువతకు 'విజయానికి అభయం'గా ఈ గ్రంథం అవశ్యపఠనీయమై, ఉపయుక్తమూ, సమాదరణీయము కాగలుగుతుందని ఆకాంక్ష.

*2 మార్చి 2011*



# మరల ఇదేల....

## కావ్యలహరి (ఉపన్యాసమంజరి) - దివాకర్ల వేంకటావధాని

ఇంట్లో తెలుగే మాట్లాడుకుంటున్నా, మరి ఒకప్పుడు 'చదువు' అంటే- తెలుగులోనే, వేదపురాణ కావ్య ఛందోలంకార కావ్య శాస్త్రాదులను నేర్చుకోవడంగా వుండేది. 'గ్రాంథిక భాష పరిజ్ఞానం' వ్యావహారిక భావ వినిమయానికి దోహదపడింది. పల్లెటూరివాడయినా 'పల్లెటూరిగబ్బిలాయ్' గానే వుండిపోవాలని కోరుకోడు. తాను ఎదగడం అంటే, జీవనవికాసం పొందడం అంటే, భాషను అభివృద్ధి పరుచుకోవడం, భావ అభివ్యక్తిలో సంస్కారాన్నీ, ఉన్నతినీ సాధించడం అని నాడు భావించేవారు. వ్యావహారిక భాషావికాసానికి కృషిచేసిన పండితులైనా- గ్రాంథికం 'పట్టు' తెలియని వారేమీ కాదు! భాష ప్రధానలక్ష్యం- 'భావవినిమయం' కనుక, ఎక్కువమంది మాట్లాడుకునే భాషకే ప్రాముఖ్యం ఇవ్వడం ద్వారా, వివిధ శాస్త్ర గత అంశాలను సైతం ఆ వ్యవహార భాషలోనే గ్రంథస్థం చేయడం వల్ల, అధిక సంఖ్యాకులకు ఆ విషయపరిజ్ఞానం అందుబాటులోకి రాగలదనీ వారి భావన.

ఇవాళ 'తెలుగు' అంతరించిపోతున్న భాషల్లో చేరిపోతోందన్న ఆర్తి విస్తరిస్తోంది. నిజానికి భాష ఎన్నటికీ చావదు. ఆదానప్రదానాలతో పరిపుష్టం అవుతుంది. అయితే ఆ క్రమంలో తన మౌలికతను కోల్పోరాదన్నదే ప్రధానంగా గుర్తించవలసిన విషయం. ఆంగ్లేయులరాకతో - ఇంగ్లీష్‌భాష అనేదే 'చదువు'గా, విద్యాధికులంటే ఆంగ్లం నేర్చినవారేననే ఒక స్థితి వారి పరిపాలనతో కల్పించారు.

వారి దగ్గర పనిచేసే గుమస్తా ఉద్యోగాల- పరికల్పన చేసి, ఆంగ్లవిద్యను అనివార్యంగా మార్చారు. నిజానికి మన భాషా సంపదలలోని గొప్పతనాన్ని వారు గ్రహించి, అవీ వారికి అనుగుణంగా కొల్లగొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్లయినా ఇంగ్లీష్‌భాష ప్రభావం తగ్గలేదు సరికదా, మరింతగా విస్తరించింది. 'ఇంగ్లీష్ చదువుకుంటే తప్ప జీవనోపాధి లేదు. ఉద్యోగాలు దొరకవు' అన్న స్థితిని చేజేతులా మనమే పెంచిపోషించుకున్నాం. విదేశాల్లోనేకాదు, స్వదేశంలోనూ మనుగడకు ఆంగ్లం అనివార్యంగా మారిందంటే, దానికి స్వాతంత్ర్యానంతర మన 'విద్యా విధానాలే' కారణం! ఆంగ్లం అవసరమే. కాదనలేం. కానీ 'మాతృభాష' ను పణంగా పెట్టే స్థితిని మనం కల్పించుకున్నట్లుగా, మరేదేశం వారూ- వారి దేశాల్లో కల్పించుకున్నట్లుగా తోచదు.

మనదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమే కాదు, భిన్న భాషల సంగమం కూడాను. పాతికపైగా భాషలను రాజ్యాంగం గుర్తించింది. కానీ దేశంలో హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే తెలుగుభాషకు కేంద్రస్థాయిలో ఆదరణ తక్కువ. అంటే, సొంత రాష్ట్రంలో మనకు మనమే తెచ్చుకుంటున్న దుస్థితులే హేతువు. తెలుగు ఒక పాఠ్యాంశంగా తీసుకోకుండానే పాఠశాల విద్య, ఉన్నతవిద్య కూడా నిర్వర్తించుకునే స్థితి తెచ్చిపెట్టుకున్నాం. వివిధ రంగాలలో జాతీయ స్థాయిలో పేరొందిన తెలుగువారు కేవలం ఆ తెలుగు మాధ్యమం వల్లే ఖ్యాతి గడించినవారై కానరావడం తగ్గిపోయింది. కేంద్ర సాహిత్య అకాడమీగానీ, జాతీయ చలన చిత్ర అవార్డుల సంఘంగానీ తెలుగుపట్ల కొంత 'శీతకన్ను' వేసినట్లే ద్యోతకమవుతూంటుంది. తెలుగులో మాట్లాడడం ఈ తరంలో వున్నా, అందులో ఆంగ్లపద ప్రయోగాలే ఎక్కువ. తెలుగువారిలో ఈ తరంలో చాలామంది తెలుగు వ్రాయనూ, చదువనూ రానివారిగా తయారైపోయారు. భాష అభివృద్ధి అంటే- కేవలం వ్యవహారంలో, అంటే మాట్లాడడంలో, వుండడం మాత్రమే కాజాలదు. మాట్లాడడం, చదవడం, వ్రాయడం, ఆలోచించడం, ఆచరణలో పెట్టడం అనే అయిదు విధాలుగానూ భాష విస్తరించాలి. తెలుగు మాట్లాడడం, తెలుగు చదవడం, తెలుగు వ్రాయడం, తెలుగులోనే ఆలోచించడం, తెలుగును ఆచరణలో పెట్టడం వచ్చినప్పుడే తెలుగు సజీవంగా వున్నట్లు. వీటిల్లో ఏ పార్శ్వం లోపించినా అది సమగ్రత కాదు. విద్యావిధానంలో ఈ అయిదింటి గురించిన శ్రద్ధా వుండి తీరాలి. అప్పుడే మాతృభాషగా తెలుగు నిలచి విస్తరించేది. ఉన్న తెలుగు

పాఠ్యగ్రంథాలను కూడా– పలుకుబడి, సిఫార్సులు, రిజర్వేషన్లు, రాజకీయాలు పేరిట అందులోని పాఠ్యాంశాలు నిర్ణయించబడి, బోధనకు నిర్దేశితం అవుతున్నప్పుడు, క్రమంగా భాషస్థాయి కూడా పలచబడుతున్న మాట వాస్తవం!

ఏ గ్రంథాలు చదివి, ప్రేరణపొంది, ఏ భాషమీద పట్టు సాధించి, తమ సృజనత్మాకతను వెల్లడించిన కవులూ, రచయితలూ వున్నారో– వారి గ్రంథాలను పాఠ్యాంశాలుగా పెట్టవద్దనడం లేదు. కానీ వారి ఆ ప్రతిభా ప్రాభవాలకు మూలాధారనాడి అయిన భాషా గ్రంథాలను ఇప్పటి వారు చదవనవసరం లేదనీ, ప్రాచీన సాహిత్య పఠనం అనవసరం అనీ కొందరు పెద్దలే అనడం సరికాదు. భాష పరిణామం చెందుతూంటుంది. అది సహజం. ఒక విశ్వనాథను, ఒక శ్రీశ్రీని, ఇవాళ చదువుకుంటే చాలుననీ, వారు చదివిన 'చదువు' ఇవాళ ఉపయుక్తం కాదనీ, ప్రవచించడం సరికాదు. విశ్వనాథవల్లనో, శ్రీశ్రీ వల్లనో ప్రభావితం అయి రాస్తున్న వారి స్థాయి రచనలూ, ఆ రచనలు మాత్రమే చదివి నేడు రాస్తున్న వారి స్థాయి రచనలూ పాఠ్యాంశాలుగా రూపొందుతూ– మునుపటి రచయితలూ, వారి రచనలూ పనికిరాని పాత సరుకుగా త్రోసిరాజంటూ వుండడం వల్లనే, భాషస్థాయి క్రమేపీ పలచబారుతోంది. భాషలో అభివ్యక్తిస్థాయి మందగిస్తోంది.

సగం అనర్థాలకు అసలు కారణం అపార్థాలు. ఆ అపార్థాలకు హేతువు– అనుకున్నది అనుకున్నట్లుగా అవతలివారికి అర్థమయ్యేలా చెప్పలేకపోవడం. ఆ అభివ్యక్తి లోపానికి ప్రధానకారణం భాషమీద సామర్థ్యం లేకపోవడమే. తెలుగు మాట్లాడేటప్పుడు భాషపై పట్టు, అభివ్యక్తి సామర్థ్యం వుండాలి. మాట్లాడడం వల్లే మనుషులు పరస్పరం కలసి జీవించడం అనే మనుగడ మౌలికంగా వుంటుంది ఎప్పటికీ. ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోయి, 'కురచ కుటుంబాలు' వచ్చేసాయి. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడం, పిల్లల పట్ల– వారి అవసరాలు తీర్చడమే తప్ప, సమష్టిగా అంతా కలసి గడపగలిగే సమయాలు కుంచించుకుపోకుపోవడం వంటి పరిస్థితులు, కుటుంబ సభ్యుల మధ్య సంభాషణలనూ తగ్గించేస్తున్నాయి. భావవినిమయం తగ్గి– భాష అవసరమూ పరిసీమితమూ, కృతకమూ, యాంత్రికమూ అవుతోంది. ఇది మనం కల్పించుకుంటున్న స్థితియే.

'పుస్తకపఠనం' అంటే పిల్లలకు క్లాసు పుస్తకాలుగా మాత్రమే వుంటూ, పెద్దలకు అసలు గ్రంథపఠనమే అక్కర్లేదన్నట్లు– 'టీవీ' అనేది ఇళ్లల్లో తిష్ఠవేశాక, పరిణామాలు మరింత 'ఆర్తి' కలిగించేవిగా మారుతున్నాయి! అయితే భాష

అంతరించిపోతుందన్న భయాలకు ఈ స్థితులే కారణం. వీటిని అధిగమించగలగడం మనకు కష్టమేమీ కాదు. ఆ సంకల్పం వుండాలి అంతే! మన భాషను, సాహిత్యాన్ని, మన సంస్కృతిని మనం ఇవాళ మరింతగా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. "ఆధునిక విద్యాభ్యాసాలు వేళ్లకు బంగారు ఉంగరాలు సమకూరుస్తున్నాయి గానీ, మణికట్టు వద్ద నరాలనే బలహీనం చేసేస్తున్నాయి" అంటాడు ఒక రచయిత. పునాదులను విస్మరించి, బహుళ అంతస్థుల భవనాలను నిర్మించడం అవివేకం! సహజ ప్రకృతులను విస్మరించి, నాశనం చేసుకుని, కృత్రిమ సదుపాయాలతో సంపన్నమయ్యామనుకోవడం మూర్ఖత్వం. స్వచ్ఛమైన గాలీ, నీరూ పోగొట్టుకుని, కలుషితం చేసుకుని, ఏ.సీలు, మినరల్ వాటర్- గొప్పస్థాయి గల జీవితం అనుకోవడం ఎంత విజ్ఞత? భాషా, సాహిత్యాల విషయం కూడా అంతే!

ప్రాచీనసాహిత్యం పఠించనవసరం లేదనుకోవడం సరికాదు. అయితే అందులోని అన్ని అంశాలూ యథాతథంగా ఇవాళ స్వీకారయోగ్యాలు కాదు. కానీ భాషపై పట్టు సాధించడానికీ, అభివ్యక్తి సామర్థ్యం పెంచుకోవడానికీ అవి ఎప్పటికీ ఉపయుక్తాలే. మూలాలను విస్మరించకూడదు. గతం నుండి అవగతం చేసుకోవాల్సింది ఎంతయినా వుంటుంది. ఆ అనుభవం మీదే వర్తమానంలో నిలబడి, భవిష్యత్తును రూపుదిద్దుకోగలుగుతాం. 'యువభారతి'- సమ్యక్‌దృష్టి కలిగిన సంస్థ. "పాతకొత్తల మేలుకలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా" ఒక విలువల వ్యవస్థను ఆశించి పురోగమిస్తున్న సంస్థ. అందుకై తనవంతు కర్తవ్యం- అది ఎంత చిన్నదైనా, బాధ్యతగా, నిజాయితీతో, చిత్తశుద్ధితో అమలు పరుస్తున్న సంస్థ. ఒక సంస్థ యాభై సంవత్సరాలు మనగలగడం సామాన్యమైన సంగతేమీకాదు. 1971లో ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారితో 'కావ్యలహరి' ఉపన్యాసాలను ఇప్పించి, వాటిని గ్రంథస్థం చేసిన కాలంలో సంస్థ వైభవ ప్రాభవాలు తెలుగునేలంతటికీ తెలుసు. అప్పుడుగానీ ఇప్పుడుగానీ సంస్థ ఆర్థికంగా 'పుష్టి' కలిగినది కాదు. ఆ నాటికీ ఈ నాటికీ మార్పు అందరికీ తెలిసిందే! 'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే' అన్న భావన ఈ కాలంలో విస్తృతమవుతున్న సంగతీ తెలుసు. అయినా యువభారతి తన ఆశయ సాధనలో వెనుకడుగు వేయడం లేదు. ఏ విలువల కోసం, మానవజీవన వికాసం కోసం, సువ్యవస్థకోసం ఆరాటపడుతూ వచ్చిందో- అదే కర్తవ్యతా దీక్షతో, వనరులు తక్కువైనా, ప్రచారార్భటులు లేకుండానే 'యువభారతి' ముందుకెడుతోంది. దానికి సహృదయుల ఆదరణే కారణం.

యువభారతి స్వర్ణోత్సవాల సందర్భంగా 'కావ్యలహరి' పునర్ముద్రణను చేపట్టడం జరిగింది. కావ్యలహరి పరంపరలోనూ, ఆ తరువాతా- అవధానిగారు చేసిన మొత్తం ఏడు ఉపన్యాస వ్యాసాలు ఈ సంపుటిగా రూపొందాయి. శృంగారనైషధం, మనుచరిత్ర, పారిజాతాపహరణం, వసుచరిత్రము, విజయవిలాసము, ఆముక్త మాల్యద, పాండురంగ మాహాత్మ్యము అనే ప్రాచీనాంధ్ర అనర్ఘరత్నాలనదగిన ఏడుకావ్యాలను ఈ తరంవారికి అందించాలనే సంకల్పంతోనే ఈ ప్రచురణ. తెలుగు చదవనూ, వ్రాయనూ వచ్చిన ఈ తరం పాఠకులు, ఇవాళ ప్రధానంగా తెలుగు భాషాభిమానులైన ప్రవాస, విదేశాంధ్రులు కూడా సమ్యక్‌దృష్టితో గత వైభవాలను అంది పుచ్చుకోవాలనీ, మన భాషాసాహిత్యాలలోని ఆలోచనామృతమైన మధురమైన అంశాలను అందిపుచ్చుకోవాలనీ ఆకాంక్షిస్తున్నారు. తెలుగుభాష, సాహిత్యాలు అజరామరమని మా విశ్వాసం. మునుపటివలె కాకపోవచ్చు. కానీ నేటితరం తెలుగు భాషా సాహిత్యాభిమానులకూ కొదవేమీ లేదు. సంప్రదాయ సారాన్నీ, సమకాలీన అవసరాల్నీ సమన్వయించి భవిష్యత్ రూపకల్పనకు వారికి పాథేయంగా ఈ ప్రచురణ ఉపయుక్తం కాగలదన్న విశ్వాసం మాకుంది. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారి ఈ కావ్యలహరి వ్యాసాలు తెలుగువారి సాహితీ ప్రియత్వానికి గొప్ప 'ఉపాయనాలు'గా ఎప్పటికీ భాసిస్తాయని మా నమ్మిక. అనేక రకాల నానా చెత్తా- సాహిత్యం పేరుతో నేడు చెలామణీ అవుతూ, గొప్ప ప్రాపుతో ఆధికారికంగానూ గౌరవాదరాలకూ, అవార్డులకూ రివార్డులకూ నోచుకుంటున్నప్పుడు పునర్ముద్రణ పొందుతున్న కావ్యలహరి వంటి ప్రచురణతో యువభారతి పొందేదేమిటి? అని ప్రశ్నించేవాళ్లుంటే వుండవచ్చు. వాళ్లకు భాస్కర శతకకారుని ఈ పద్యమే విన్నవించి నమస్కరిస్తాం-

***"పండితులైన వారు దిగువం దగ నుండగ నల్పుఁ డొక్కడు***
***ద్ధండతఁ బీఠమెక్కిన బుధప్రకరంబుల కేమి యెగ్గగున్***
***కొండొక కోతి చెట్టుకొన కొమ్మలనుండగఁ క్రింద గండ భే***
***రుండ మదేభ సింహ నికురుంబము లుండవే చేరి భాస్కరా!"***

*16 ఆగస్టు 2014*




# చిరంజీవ.... చిరంజీవ... చిరంజీవి సుఖీభవ!

## చిరంజీవి సాహిత్య సమాలోచనం - శారదా శ్రీనివాసన్

తెలుగు సాహిత్యంలో నాకు తెలిసి ఇద్దరే 'చిరంజీవి'లు వున్నారు. ఒకరు 'కొమ్మలు రెమ్మలు', 'భాగ్యనగరం', 'పేను-పెసరచేను', 'తెల్లనక్కా-నల్లకాకి' వంటి రచనలతో కవిగా, రచయితగా, బాలసాహిత్యకారునిగా పేరొందిన కీ॥శే॥ నార్ల చిరంజీవిగారు కాగా - మరొకరు నాటక రచయితగా, నవలాకారునిగా, సమ సమాజ శ్రేయోభిలాషి అయిన రేడియో చిరంజీవిగా భాసిస్తున్న 'హీరో' శ్రీ కె. చిరంజీవి గారు.

శ్రీ కె. చిరంజీవిగారు సమాజాభ్యుదయం కోసం, ప్రగతిశీల చింతనతో కలం పట్టిన వ్యక్తి. ఆయన ఏది రాసినా ఒక నిబద్ధతతో రాశారు. జీవించడం కూడా... ఇప్పటికీ అంతే! నమ్మిందే పలకడం, దానినే త్రికరణ శుద్ధిగా ఆచరించడం, ఆయన వ్యక్తిత్వం. శ్రవ్య దృశ్య మాధ్యమాలు రెండింటా నాటకానికి ఒక జవం, జీవం సంతరించినవాడాయన. నాటక రచయితగా, నాటక నిర్వహణా దక్షునిగా, సృజనాత్మక ప్రయోగశీలిగా ఆయన పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడి, సువ్యవస్థ కోసం తపించి కృషి చేశారు. రంగస్థల నాటకాలతో సమానంగా కొండొకచో అంతకన్న మిన్నగా, ఆకాశవాణి ద్వారా 'శ్రవ్య నాటకాలకు' ఒక గుర్తింపు తెచ్చి పెట్టిన వారిలో ఆయన ప్రథమగణ్యులు. రచనా పరంగానూ, సాంకేతిక నైపుణ్యం పరంగానూ - చిరంజీవిగారు రూపొందించి, అందించిన రేడియో నాటకాలు అలరించినంతగా, రంగస్థల నాటకాలు కూడా ఆనాడు అలరించలేకపోయేవని అన్నవారున్నారు. అది నిజం!

1961 ఏప్రిల్1 నుంచి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో మూడు దశాబ్దాలకు పైగా పనిచేసి, 1993 మార్చిలో పదవీ విరమణ చేసిన చిరంజీవిగారు, ఆకాశవాణి వైభవప్రాభవాలకు తన శ్రమశక్తులు ధారపోసిన ఉద్యోగి. ఆకలిమందు, బీళ్లు తిరగబడుతున్నాయి, శాంతి సమరం, శ్రీకృష్ణ శిరోభారం, వంశాంకురం, ఊరోళ్ళు మేల్కొంటున్నారు, కాలయంత్రం మొదలైన – చిరంజీవిగారు స్వయంగా రాసి, నిర్వహింపజేసిన రేడియో నాటకాలు, అలాగే ఆయన ముఖ్యపాత్ర ధరించి, రూపొందించి ప్రసారం చేసిన – ఆశ ఖరీదు అణా, కంఠాభరణం, రాజా ఈడిపస్, భాగ్యనగరం, సంపంగి, పురూరవ, తుగ్లక్, షాజహాన్, కాబూలీవాలా, నిరీక్షణ, పొగమేడ, హృదయకమలం, ప్రజాశత్రువు, హిమశిఖరం వంటి రేడియో నాటకాలు, శ్రోతృ జనహృదయాల్లోకి చొచ్చుకుపోయి పేరొందాయి. రేడియోనాటకానికి సాహిత్యగౌరవం సంతరించిపెట్టింది, రేడియో నాటకం ఎలా రాయాలో, చేయాలో చెప్పి చూపించింది ఆయనేనంటే విప్రతిపత్తి లేదు.

ఆయన 'రేడియో నాటకాలు' గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం 1986లో ఉత్తమ నాటక సంకలనంగా అవార్డు నిచ్చింది. వారు రాసిన నాలుగు నాటకాలు జాతీయ నాటకాలుగా అన్ని భారతీయభాషల్లోకి అనువాదమయ్యాయి. 'ఏసియా పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బ్రాడ్ కాస్ట్ డెవలప్‌మెంట్' అనే అంతర్జాతీయ స్థాయి సంస్థ చిరంజీవిగారి 'ఆకలి మందు' నాటికను ఒక నమూనా రేడియో నాటకంగా వాడుకుంటోంది అంటేనే చిరంజీవిగారి ప్రతిభాప్రాభవాలు గ్రహించగలం!

అలాగే ఆయన రాసిన దేవుడెరుగని నిజం, నర్తనబాల, నీలి దీపాలు, పోలిట్రిక్స్, దేవుని బిడ్డలు, మహాభినిష్క్రమణం వంటి నాటకాలు రంగస్థలంపై పలు ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుని, ఆలోచింపచేశాయి. 'రసము సామాజిక నిష్టము" అన్న మాటకు ప్రతీకగా రాణించాయి. అలాగే అటు ప్రసారానికి గానీ, ప్రదర్శనకు గానీ నోచుకోకపోయినా చిరంజీవిగారు రాసిన 'సోనార్ బంగ్లా' నాటకం, ఆనోటా… ఆనోటా… తద్రచనా సామర్థ్యంతో ప్రాచుర్యం పొందింది. ఆయన నాటక రచనా సామర్థ్యానికీ, వాటి ప్రయోజన లక్ష్యానికీ ముగ్ధులై ఆయన నాటకాలను ఆంగ్లంలోకి అనువదించిన ప్రముఖులున్నారు.

నవలా రచయితగా చిరంజీవిగారిని ఉత్తాల సాహితీవేత్తగా నిలబెడుతున్నవి – 'అనంతయాత్ర', 'చీమ మనుషులు', 'ఎక్కడికీ ప్రస్థానం', 'బోలో స్వతంత్ర భారత్ కీ జై' వంటి నవలలు. అపారమైన తన జీవితానుభవాలను, సమాజ శ్రేయోభిలాషతో కూడిన తన ఆశయాలను ఆ నవలల్లో ఆయన చిత్రించిన తీరు – పాఠకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

కె. చిరంజీవి ఇంటిపేరు 'కుంటముక్కల' అయినా 'కె' అంటే 'కమ్యూనిజం' అన్నంతగా – జీవితంలో గొప్ప నిబద్ధతగల అసలు సిసలు కమ్యూనిస్టు ఆయన. నిర్భీతికి, సాహసానికి దాఖలా వారు. దాపరికాలు, మొహమాటాలు లేక అనుకున్నదే అన్నారు, అన్నదే ఆచరించి చూపించారు. అక్షరాన్ని నమ్ముకున్నవారే గానీ అమ్ముకున్న వారు కాదు. ఆశ్రయింపులు, ప్రలోభాలు, ప్రచారార్భాటాలు ఎరగని గొప్ప వ్యక్తిత్వం వారిది.

'బోలో స్వతంత్ర భారత్ కీ జై' నవల ఆయన జీవన సంవిధానానికే అద్దం పడుతుంది. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' స్వాతంత్ర్యం పూర్వ సమాజ స్థితిగతులను కళ్లకు కడితే, స్వాతంత్ర్యానంతరం 1947 ఆగస్టు 15 నుంచి – 1983 ఆగస్టు వరకూ మూడున్నర దశాబ్దాల దేశపరిస్థితులకూ, పరిణామాలకూ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, నైతికంగా ఒక డాక్యుమెంటరీ చిత్రంలా విభిన్న పార్శ్వాలలో వింగడించి, సాక్షాత్కరింపచేసే గొప్ప నవల చిరంజీవిగారి 'బోలో స్వతంత్ర భారత్ కీ జై'. నిబద్ధతగల రచయితగా – 'ప్రేమ, త్యాగం కమ్యూనిజానికి రెండు కళ్ళు' అని చాటి చూపిన స్రష్ట ఆయన. హేతువాదంలో ఐడియాలజీకి చోటు లేదేమో గానీ, మార్క్సిజం సమాజపు ఆర్థిక పునాదులకు ఎంత ప్రాముఖ్యం ఇస్తుందో 'ఐడియాలజీ' అనే భావశాస్త్రానికీ అంతటి ప్రాముఖ్యం ఇస్తుందనీ, మార్క్సిజానికి కావలసింది ముఖ్యంగా మనిషి పట్ల ప్రేమ అనీ, తత్త్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం ముప్పేటలుగా పెనవేసుకుని సమగ్రతతో అది భాసిస్తుందనీ, తన రచనల ద్వారా నిరూపించినవారు చిరంజీవిగారు.

కన్న కొడుకు మరణం, సోవియట్ యూనియన్ పతనం – తన జీవితంలోని గొప్ప విషాద సంఘటనలని చెప్పి – జీవితానికీ, రచనకూ అభేదంగా తన వ్యక్తిత్వం నిరూపించుకున్న 'మనీషి' ఆయన. తన లేఖల్లో, వ్యాసాల్లో ఆయన

నిబద్ధత, నిర్భీతి స్ఫుటంగా కానవస్తాయి. ఆకాశవాణి ప్రసారభారతిగా మార్పు చెందితే జరిగే పరిణామాలను ముందే ఊహించి వ్యాసం రాశారాయన. అలాగే కమ్యూనిస్టు పార్టీ పోకడలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తన లేఖలలో నిర్భయంగా – తను దోషాలుగా భావించిన వాటిని ఎత్తి చూపి, ఎండగడుతూ, ఒక దిశా నిర్దేశం చేసిన వారాయన. చిరంజీవిగారు 'తెలుగులిపి'ని సంస్కరిస్తూ 1973లోనే ఒక ప్రామాణిక పత్రాన్ని వెలువరించారు. తెలుగు అకాడమీ అప్పట్లో కొంత పట్టించుకున్నా కాలక్రమంలో అది మరుగున పడింది గానీ... నేటికీ ఆలోచించదగిన ప్రతిపాదన అది!

ఆకాశవాణిలో చిరంజీవిగారు పనిచేసిన కాలంలో మేమూ ఆ సంస్థలో పనిచేశామని చెప్పుకోవడం మా బోంట్లకు ఒక గర్వకారణం. 1957లో హైదరాబాద్ నుంచి వెలువడిన సోషలిస్టు పార్టీ పత్రిక 'నవశక్తి'లో, ఆ తర్వాత రెండేళ్ళు చక్రపాణి గారి 'యువ' మాసపత్రికలోనూ పనిచేసి, 1961లో ఆయన ఆకాశవాణిలో ప్రవేశించారు.

1959లోనే హైదరాబాద్ ఆకాశవాణిలో డ్రామా ఆర్టిస్టుగా చేరిన శ్రీమతి శారదాశ్రీనివాసన్ గారు, చిరంజీవిగారు కూడా అదేవిభాగంలో చేరడంతో సహోద్యోగులయ్యారు. రేడియో నాటకాల్లో ప్రధానపాత్రధారిణిగా, నాటక నిర్వహణాదక్షురాలిగా పేరెన్నికగన్న శారదగారు చిరంజీవిగారి వ్యక్తిత్వ, సాహిత్యాలు రెండింటినీ సాకల్యంగా ఎరిగినవారు. చిరంజీవిగారి సాహిత్య సమాలోచనకు, ఇలా శారదగారు సమకట్టడం ఎంతో సముచితంగా వుంది. చిరంజీవిగారి ఆలోచనాధారను, ఆయన ఆశయదీప్తిని అర్థం చేసుకుని సన్నిహితంగా ఆయన కృషిని అవలోధనం చేశారు శారదగారు.

చిరంజీవిగారి నవలలు, నాటకాలు గతంలో పుస్తకాలుగా వెలువడినా, ప్రస్తుతం చాలామటుకు అవి అలభ్యం. చిరంజీవిగారి రచనలపై ఉస్మానియా, తెలుగు విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీల్లో ఎం.ఫిల్., పిహెచ్.డి. పరిశోధనలు జరిగినా అవీ గ్రంథ రూపాన్ని సంతరించుకోలేదు. అందువల్ల ఈ పుస్తకం విలువైనదే! చిరంజీవిగారు రాసిన రేడియో, రంగస్థల నాటకాల గురించీ, నవలల గురించీ శారదగారు ఈ తరానికి వాటిని పరిచయం చేస్తూ, సమాజానికి ఉపయుక్తం కాగల ఆ రచనల విశ్లేషణను – ఈ 'సాహిత్య సమాలోచనం'గా

అందిస్తున్నారు. కులవివక్ష గురించి, చిరంజీవిగారి వసుధైక కుటుంబ భావనకు ఉపబలకంగా శారదగారు 'పూజ్యదాదాజీ' అనబడే శ్రీ పాండురంగ శాస్త్రి అరవలె గారి స్వాధ్యాయమార్గం గురించి వివరించడం ఒక విశేషం! ఆకాశవాణిలో ఉద్యోగుల సంక్షేమం కోసం చిరంజీవి గారే పూనుకుని క్రెడిట్ సొసైటీ, హౌసింగ్ సొసైటీల వ్యవస్థాపనకు, వికాసానికీ ఏ విధంగా కృషి చేసిందీ శారదగారు చక్కగా వివరించారు.

చిరంజీవిగారి సమగ్ర వ్యక్తిత్వాన్ని కూడా ఈ సాహిత్య సమాలోచనా భిత్తికపై ఆవిష్కరించారు రచయిత్రి. స్టాఫ్ ఆర్టిస్టుల యూనియన్ గురించీ, రేడియో కళాకారులచే రంగస్థలంపై ప్రదర్శనలు ఇప్పించడం గురించీ చిరంజీవిగారు ఎలా ప్రేరకశక్తిగా నిలిచిందీ – మనోజ్ఞంగా వివరించారు ఈ గ్రంథంలో.

చిరంజీవిగారి ఈ సాహిత్య సమాలోచనా గ్రంథానికి శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారు ఒక సిద్ధాంతగ్రంథ రచనా ప్రణాళికనుగాక, జనరంజకమైన ఆత్మీయ ప్రసంగవైఖరిని ఎన్నుకున్నారు. చిరంజీవిగారి రచనా ప్రతిభను, ఆయా రచనల వెనుక వారికి గల సమాజహిత చింతనను విశదం చేశారు. ఆయా రచనలను చదువని వారయినా – వాటిలోని కథనూ, సంఘటనలనూ, పాత్రలనూ, శారదగారు చెప్పిన తీరులో చక్కగా ఆకళింపు చేసుకుని, ఆ నాటకాలను విన్న, చూసిన, ఆ నవలలను చదివిన ఆనందాన్ని, ప్రయోజనాన్ని అందిపుచ్చుకోగలరు. శారదగారి రచనాశైలి ఈ పుస్తక పఠనానికి మూలాధారనాడి. ఇది నిజంగా ఒక మంచి ఉపాయనం. ఒక సహోద్యోగి వ్యక్తిత్వ సాహిత్యాలను ఇలా సమాలోచన గ్రంథంగా మునుపు ఎవరైనా వెలువరించారో లేదో తెలియదుగానీ, శారదా శ్రీనివాసన్ గారి ఈగ్రంథం ఒక విలక్షణమూ, విశిష్టమూ అయిన రచన. చిరంజీవిగారిని తెలుగు సాహిత్య ప్రపంచంలో ఎప్పటికీ సార్థక నామధేయునిగా నిలుపగల ఈ గ్రంథాన్ని పాఠక ప్రపంచం సమాదరించగలదనీ, చిరంజీవిగారి ఆశయదీప్తితో సమాజం పరిఢవిల్లగలదనీ ఆకాంక్షిద్దాం.

*10 అక్టోబర్ 2014*




# వికసిత స్త్రీచేతనా సరోజం

## అక్షరమే ఆయుధం (వ్యాసాలు) – డా॥ సరోజన బండ

శ్రీమతి సరోజన గారు పేరెన్నికగన్న విద్యావేత్త. ఆ రంగంలో అపార అనుభవం గడించడమే కాదు, ఎందరినో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినవారు. ప్రభుత్వంచే ఉత్తమ అధ్యాపకురాలిగా గుర్తింపబడినవారు. ఇది ఒక ఎత్తు కాగా, ఆవిడ సృజనాత్మక రచయిత్రిగా రాణించడం మరో ఎత్తు! కవిత, నాటకం, వ్యాసం వంటి పలురీతుల సాహితీ ప్రక్రియల్లో వారు చేసిన కృషి గణనీయమైంది. స్త్రీ చైతన్య స్ఫూర్తిగా వారు చేసిన రచనలు ఆలోచనాత్మకాలు, ఆ భావాలు అనుసరణీయాలు.

'అక్షరమే ఆయుధం' అంటున్న ఈ సంపుటిలో డా॥ సరోజనగారు రాసిన వ్యాసాలు–స్త్రీల పట్ల సమాజంలో నేటికీ పూర్తిగా తొలగని వివక్షను, ముఖ్యంగా విద్యారంగంలో పొడచూపుతున్న ఒడిదుడుకులను ప్రతిభావంతంగా విశ్లేషించి చూపాయి. 'స్త్రీ పురుష వివక్షతలో భాషోపాధ్యాయుని పాత్ర', 'పాఠ్యపుస్తకాల్లో స్త్రీ చిత్రణ' సరోజనగారి మౌలిక ఆలోచనా విధానానికి ఉదాహరణాత్మకమైన రెండు చక్కని వ్యాసాలు. పాఠ్యప్రణాళికలో కూడా లింగవివక్షత ఎలా చోటుచేసుకుంటుందో చెప్పారు. ఒకప్పుడు బాలికలకు విద్య అనవసరం అనే భావన నుండి, ఇవాళ అన్ని రంగాల్లో స్త్రీ పురోగమించే దశకు చేరుకున్నా– ఇంకా గతానుగతిక భావజాలంతో విద్య విషయంలో అబ్బాయిలు, అమ్మాయిల పట్ల చూపుతున్న తారతమ్యాన్ని సరోజనగారు నిశితంగా ఎత్తిచూపారు. ప్రభుత్వ పాఠ్యప్రణాళికా కమిటీల్లో సారథ్యం వహించి కృషి చేసిన అపార అనుభవజ్ఞురాలు

కనుకనే, రచయిత్రి చాలా మంది గుర్తించలేని అనేక సమస్యా పార్శ్వాలను గుర్తించి చూపడమేకాదు, ఎడనెడ పరిష్కారాల దిశగా ఆలోచనలను ప్రోదిచేసి చూపారు. అది ఎంతయినా అభినందనీయం.

సరోజనగారు–విద్యాప్రమాణాలు పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర బలీయమైనది అంటారు. "విద్య ద్వారా వ్యక్తిగత, సామాజిక విలువలతో పాటుగా చారిత్రక అవసరాలను బట్టి, సామాజిక స్థితిగతులను బట్టి కొన్ని ప్రత్యేకమైన విలువల్ని సాధించాల్సిన అవసరముంది. అందు నైతిక విలువలు, సాంస్కృతిక విలువలు, ఆధ్యాత్మిక విలువలు, సృజనాత్మక విలువలు, జ్ఞానాత్మక విలువలు, వృత్తి విలువలు, ప్రజాస్వామ్య విలువలతో పాటు సౌందర్యానుభవ విలువలు ముఖ్యమైనవి" అంటారు రచయిత్రి. విద్య వ్యాపార సరళిలోకి రావడం, బజారులో విక్రయించే వస్తువులా తయారవడం గురించి గొప్ప ఆర్తిని ప్రకటించారు.

'బాధ్యతతో పిల్లల పెంపకం–ఆచారాలు–నమ్మకాలు' అనే వ్యాసంలో– "ఆడపిల్లల చదువుసంధ్యల విషయానికొచ్చే సరికి ఎంత బాధ్యతగల తల్లిదండ్రులైనా ఇంకోరకంగా ఆలోచిస్తున్నారు. ఆడపిల్ల చదివి ఉద్యోగాలు చేస్తుందా? ఊళ్లేలుతుందా? ఎంత చదివినా వంటఇంట్లో పనిచేయాల్సిందే, కట్టుకున్నవాడికి ఇంత వండి పెట్టాల్సిందే అనే నమ్మకం. అదే ఆచారంగా కూడా భావిస్తున్నారు. అంతేగాక ఆడపిల్లను చదివిస్తే అదుపు ఆజ్ఞల్లో ఉండదనే నమ్మకం కూడా కొందరిది. ఒకవేళ ఎవరికైనా చదువుపట్ల సదవగాహన వుండి చదివించదలచినా, ఆడపిల్ల వివాహ సమయంలో–అంతకంటే ఎక్కువ చదువుకున్న వరుడిని వెదకవలసి వస్తుందనే నమ్మకం, ఆచారం అడ్డొస్తున్నాయి." అని సరోజనగారన్న మాటలు నేటికీ అక్షరాక్షర సత్యాలుగా సమాజంలో ద్యోతకమవుతూనే వున్నాయి. సామాజికంగా, సాంకేతికంగా ఎన్ని మార్పులు వచ్చినా–స్త్రీలకు 'చాకిరీ' అనే ప్రధాన ప్రతిబంధకం అలానే వుంటోంది. స్త్రీ ఎంత పురోగమనం చెందినా ఈ 'చాకిరీ' అనే విధాయకస్థితి ఆమెను అణచివుంచేదిగా ఉంటోంది. అందుకే 'అక్షరమే ఆయుధం'గా స్త్రీలు మలుచుకోవాలనే ప్రబోధం సరోజన బండగారు ఆలోచనాత్మక వ్యాసాలదండగా అందిస్తున్నారు. జాగృత మహిళా స్ఫూర్తికి మూలకందంగా ఈ గ్రంథం రాణించగలదని విశ్వసిస్తూ, రచయిత్రిని మనసార అభినందిస్తున్నాను.

*22 ఫిబ్రవరి 2016*




# 'అరుణ' కాంతి సోకగానే....

## సాహితీ దీపికలు – డా॥ శ్రీమతి కె. అరుణావ్యాస్

'వ్యాసార్థ'మైన సాహిత్యోపజీవని శ్రీమతి అరుణ. వ్యాసమైనా, ఉపన్యాసమైనా, ఆవాసమైన విదుషీమణి కనుకనే ఆమె అరుణా 'వ్యాస్' అనిపిస్తుంది. సంప్రదాయం పట్ల గౌరవం, అభ్యుదయకరమైన ఆధునికతపట్ల సమాదరణం, సమష్టిగా గల సమన్వయ దృష్టి ఆమెది. సంస్కృతాంధ్ర, ఆంగ్ల భాషలను తన శేముషిలో విలీనం చేసుకున్న విమలమతి. కీర్తిశేషులు శ్రీ కె.ఎస్.వ్యాస్, ఐ.పి.ఎస్ గారి సతీమణిగా – భర్త హత్యోదంతం నిబ్బరంగా జీర్ణించుకుని, నిలచి, ఒక సాధికారిక మహిళగా, సమున్నత సాహిత్యవేత్తగా 'ఉభయభారతి', 'సాహిత్యకౌముది' వంటి బిరుదులందుకున్న బహుముఖ ప్రజ్ఞా ధురీణ అరుణ.

నగరాల నడిరోడ్లను సురక్షితం చేయడానికి ట్రాఫిక్ గీతలను గీసి – 'వ్యాసరేఖలు'గా ఒకప్పుడు పెనిమిటి ఖ్యాతి గడిస్తే, సమాజ పథాన్ని 'సురక్ష'గా నిలపడానికి, తన సాహిత్య రచనాభినివేశంతో 'వ్యాసరేఖలు' వెలయిస్తూ – తన వ్యాసాల ద్వారా, రచనల ద్వారా సమాజహిత చింతనాభిలాషిగా నిలుస్తున్న ఉత్తమ రచయిత్రి అరుణావ్యాస్. 2010లో ఉత్తమ రచయిత్రిగా శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆమెను సత్కరించింది.

ఆమె పుట్టింటి వారు 'గంటి' వారయితే, అత్తింటివారు 'కోట'వారు. ఆమె అత్తగారు కీ.శే.కోట కమలాదేవి కథా, నవలా రచయిత్రి. తన సాహిత్య సృజనతో పాఠకహృదయాల 'కోట'లో అరుణ 'పాగా' వేసి, బాగా పేరు తెచ్చుకోవడం

ఆనందదాయకమైన విషయం. ఈ 'సాహితీ దీపికలు' ఆమె వైదుష్య ప్రతిభల సరికొత్త ఉపాయనాలు.

పత్రికామాధ్యమం కేవలం అక్షరాస్యులకు మాత్రమే! కానయితే – అక్షరాస్యులనే కాక, అసంఖ్యాక నిరక్షరాస్యులను కూడా చేరగలిగేది రేడియో మాధ్యమం. రేడియో రచన కూడా ఒక ప్రజ్ఞ. అది అందరికీ అలవోకగా అలవడేది కాదు. శ్రోతలతో ఆత్మీయంగా మాట్లాడుతున్నట్లు – ఆకట్టుకునే రేడియో ప్రసంగం చేయడం, చక్కని గళం, అభివ్యక్తి సామర్థ్యం కలిగివుండడం ఒక ప్రతిభ. అదిగో!.. అలాంటి ప్రతిభామతి – శ్రీమతి అరుణావ్యాస్.

'అల్పాక్షరముల అనల్పార్థ రచన' అన్నట్లుగా, ఓ నాలుగయిదు నిముషాల పరిమిత సమయంలో ఒక విషయం పై శ్రోతృజనరంజకంగా, విషయవివేచనతో ఆసక్తిదాయక ప్రసంగం చేయగలగడం అనుకున్నంత తేలిక కాదు. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో ఉదయం ప్రసారమయ్యే 'భావన' కార్యక్రమం అశేష శ్రోతల అభిమానపాత్రమైన కార్యక్రమం. 'మహనీయుల మహితోక్తులు', 'జ్యోతిపథం', 'సాహితీసుధ', 'ఆలోచనామృతం', 'ఏరినముత్యాలు' అంటూ రోజుకో పేరుతో ప్రసారమయ్యే కార్యక్రమాన్ని ఏకత్రాటి పైకి 'భావన' పేరుతో మీ సుధామ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కార్యక్రమ నిర్వహణాధికారిగా వుండగా – సౌలభ్యవంతంగా, సముచితంగా, జనరంజకంగా రూపొందించే అవకాశం కలిగింది.

'భావన' కార్యక్రమాన్ని సమర్పించడానికి ఎందరో ప్రముఖులు, విద్వన్మణులు, సాహితీ స్రష్టలు ఆహ్వానింపబడేవారు. భావన సమర్పించాలనే ఆసక్తి మెండుగా, దండిగా గల ఉద్దండులు ఎందరో వుండేవారు. 'థాట్ ఫర్ ది డే'గా వుంటూ, అనునిత్యం ప్రభాత ప్రసారంలో ప్రముఖస్థానం శ్రోతల హృదయాలలో కైవసం చేసుకున్న 'భావన' కార్యక్రమంలో – ఆహ్వానం మేరకు శ్రీమతి అరుణావ్యాస్ చేసిన (అ) లఘు ప్రసంగ వ్యాసాలు ఈ 'సాహితీ దీపికలు'లో అధికభాగం వెలుగొందుతున్నాయి. సాహో!... వాటితో బాటుగా పలుపత్రికలలో ఈ సరికే 'అచ్చు' పురుడు పోసుకున్న ఆలోచనాత్మక కాంతి శిశువులు కొన్ని. ఇరవై ఒక్క వ్యాసాల ఈ సంపుటిలో వ్యక్తిత్వవికాస అంశాలు, భాషా సాహిత్య విషయాలు, స్త్రీల సమున్నత కీర్తి గౌరవ అంశాలు 'ఆలోచనా తరంగాలు'గా అభివ్యక్తమవుతున్నాయి. ఏ అంశం గురించి రాసినా – 'ఉపరి తలస్పర్శ' ధోరణికాక లోతైన అధ్యయనం, గాఢానుశీలత, అనుభూతిరమ్యత, అనుభవ పాటవం అరుణా

వ్యాస్ ప్రత్యేకత. సంప్రదాయాను రక్తితో బాటు, సైంటిఫిక్ టెంపర్ మెంట్ అనుసంధానమై ఆమె విశ్లేషించే వైఖరి ఆశ్చర్యానందాలు కలిగిస్తుంది.

వేదాలు, ఉపనిషత్తులనుండి, విదేశీ ప్రముఖుల కొటేషన్ల వరకూ - సందర్భోచితంగా, ఆమె ఉటంకించే ఉదాహరణలు రచనకు ఓ సోయగాన్నీ, విషయానికి పుష్టినీ, తుష్టినీ కలిగిస్తూంటాయి. ఎంతో అధ్యయనమూ, ధారణా నైపుణ్యమూ వుంటేనే సాధ్యమయ్యే సంగతులవి. 'పండుగొచ్చిందమ్మ పెద్ద పండుగొచ్చింది' అంటూ సంక్రాతి వైశిష్ట్యాన్ని వివరించడం రచయిత్రికే చెల్లింది. బెంగుళూర్ లోని 'శివగంగ' అనే ప్రదేశంలో మకరసంక్రాంతి పండుగ రోజు మాత్రమే గంగ పుడుతుంది. సముద్ర మట్టానికి మూడువేల అడుగుల ఎత్తున వున్న ఈ 'శివగంగ' అనే కొండ మీద మకరసంక్రాంతి రోజున మాత్రమే నలభైఔన్సుల నీరు ఊరుతుంది. మిగితా రోజుల్లో అక్కడ ఒక్క చుక్క నీరు కూడా దొరకదు. అదీ ప్రకృతి విచిత్రం. భక్తులు దైవమాహాత్మ్యం అంటారు- అంటూ ఆసక్తిదాయకమైన సంగతులు చెప్పడం విశేషమే కదా మరి!

'అమ్మ అన్నది ఒక కమ్మని మాట', 'జగతికి ఆడదే ఆధారం', 'మమతల కోవెల', 'కలసి బతకడంలో వన్నెచిన్నెలు' వంటి రచనలు నిజంగా యువతకు, అందునా వర్తమాన తరం వారికి జ్ఞానదీపికలు. గ్రహించి తమనూ, తమ వారినీ, కుటుంబవ్యవస్థనూ సుఖసంతోషాలతో నిలుపుకోవడానికి ఉపకరించేవి. 'విశ్వమ్ ఏకమ్' పెద్దబ్బాయి శ్రీహర్ష స్మృతిలో ఒక 'ఎలిజీ' యే అయినా, ఒక ప్రణవ సత్యాన్ని ప్రపంచించే ఆర్ద్ర భావన! ఒక సమ్యక్ దృష్టి, సమన్వయ భావన కలిగిన అరుణావ్యాస్ అందుకే 'పాత కొత్తల మేలు కలయిక క్రొమ్మెఱుంగుల్ చిమ్మగా' అని గురజాడ వారన్నదానికి వారసురాలిగా కానవచ్చే రచయిత్రి. మూఢ ఛాందస నిరసనం, అదే సమయంలో వెర్రిపోకడల కొత్తదనం పట్ల ఆక్షేపణం, రెండూ చేస్తూనే, మంచి చెడుల విశ్లేషణతో ప్రగతి చింతనామృతాన్ని పంచిపెడుతోంది. నిజంగానే ఇవి 'నవచేతన' కలిగించే అక్షరాలు. 'అరుణ' కిరణాలు మట్టిని అయినా మణిదీపంగా ప్రకాశింప చేసే 'సాహితీ దీపికలు'.

'భావనా' బలిమిగల ఇంత చక్కటి వ్యాస సంపుటిని అందిస్తున్న శ్రీమతి అరుణావ్యాస్ ను మనసా అభినందిస్తున్నాను. ఇది పఠితృలోకం సమాదరణను పొందగలదని విశ్వసిస్తున్నాను.

*జూన్ 2017*




# మిత్రవాక్యం

## కరెంట్ ఇష్యూస్ ఇన్ ఎకనామిక్స్ అండ్ కామర్స్
## - కె. రామకృష్ణశర్మ

అధ్యాపక వృత్తిలో వున్నవారందరూ సృజనశీలురై ఉండాలన్న నియమం ఏమీ లేదు. కానీ సృజనాత్మకత గల అధ్యాపకులు తాము రాణించి, విద్యార్థులను రాణింపచేయగల అవకాశాలు ఎక్కువ.

సృజన అనేది సాహిత్య సంగీతాది లలితకళా సంబంధి మాత్రమేనని అనుకోనక్కరలేదు. తమ రంగం ఏదయినా అందులో అందరి కన్న భిన్నంగా తమదైన విశిష్టత కోసం యత్నించడంలోనూ సృజనశీలత ఉపకరిస్తుంది.

వృత్తిరీత్యా అధ్యాపకులకు, ఉపన్యాసకులకు తాముచెప్పే అంశాల గురించి కొంతయినా 'నోట్స్' రాసుకోక తప్పదు. బోధకుడు ముందు తాను అభ్యాసి కావడం అనివార్యమని గుర్తించినప్పుడు - మరీ ముఖ్యంగా అలాంటి తయారీ ఒకటి అలవరుచుకుంటాడు. తన విద్యార్థులకు అందించడానికో, అకడమిక్‌గా జరిగే ఏ సెమినార్ కోసమో, పరిశోధనలో భాగంగానో తన శాఖకు సంబంధించిన పత్రాల తయారీ సహజంగానే చేయవలసి రావచ్చు. తద్వారా రచనావకాశం, అవసరం కలుగుతూనే ఉంటాయి. కానయితే విధి నిర్వహణలో భాగంగా చేసే రచనకూ, రచనాభిలాషతో చేసే రచనకు తేడా వుండకపోదు.

అధ్యాపక వృత్తిలో వున్నంత మాత్రాననే అందరూ రచయితలు కాగలరనుకోవడం పొరపాటు. అందునా సృజనాత్మక రచయితలు అందరూ

కాలేరు. అకడమిక్‌గా ఒక సెమినార్‌కూ, పత్రికకు రాసే వ్యాసానికీ వ్యత్యాసం వుంది. అలాగే కమ్యూనికేటివ్‌గా రేడియోలో చేసే ప్రసంగం కోసం చేసే రచనకూ భేదం వుంది. ఒక కథో, కవితో రాయడానికీ, పూర్తిగా అకడమిక్ గా అనిపించే రాజకీయ, ఆర్థిక, వాణిజ్యాది అంశాలపై రచన చేయడానికీ ఇంకా తేడా వుంది.

రేడియోలో ప్రసంగించమని ఆయా రంగాలలో నిష్ణాతులయిన పెద్దలను ఆహ్వానించినప్పుడు రేడియో ప్రసంగ కళ గురించి అవగాహన లేనివారయితే – తాము ప్రసంగించదలచిన అంశం పై వ్యాసం తయారుచేసి 'క్రింద చెప్పిన విధముగా', 'పైన పేర్కొన్నట్లుగా', 'ఇక్కడ ఇచ్చిన గణాంకములను చూడుడు' అంటూ రేడియోప్రసంగం చేయడం శ్రోతలకు అనుభవంలోని విషయమే. కార్యక్రమ పబ్బంగడిచిపోతే చాలునన్న అలసత్వం వల్ల–రేడియో రచనపట్ల క్షుణ్ణమైన అవగాహన కలిగివుండి, తాము ప్రసంగ కర్తనుండి ఆశిస్తున్న సదరు ప్రసంగలక్ష్యం ఏమిటో కార్యక్రమ నిర్వాహకులు కూడా ప్రసంగకర్తలకు విశదపరచలేనప్పుడు, రేడియో రచనలోని ప్రాథమిక సూత్రాల గురించయినా తాము ఆహ్వానించే విషయనిపుణులకు వివరించలేనప్పుడు, ఇలాంటి పొరపాట్లు తప్పవు.

ఆర్థిక, వాణిజ్యాది అంశాలపై రచన చేయడం, అందునా రేడియోవంటి ప్రసారమాధ్యమానికి అనుగుణంగా రాయడం సులభమైన పనేమి కాదు. పైగా రేడియో– లక్షలాది నిరక్షరాస్యులు కూడా వినే ప్రసార సాధనం. కేవలం వినోదం అందించడం మాత్రమే ఆకాశవాణి లక్ష్యం కాదు. ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, ఎంటర్ టైన్‌మెంట్ మూడు ప్రధానమే. ఆకాశవాణి ప్రసారం చేసే ప్రసంగాలలో, అందుకే సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలూ, ప్రజాసంక్షేమ కోసం జరిగే అభివృద్ధి కార్యక్రమాలను వివరించే అంశాలూ విధిగా ఉంటుంటాయి.

నిజానికి సాహిత్య, సంగీత కార్యక్రమాలకన్నా ప్రత్యేక వర్గాలవారికి అంటే రైతులకు, కార్మికులకు, మహిళలకు, యువతకు, పిల్లలకు ప్రత్యేకించి రూపొందించే 'స్పెషల్ ఆడియన్స్ ప్రోగ్రామ్స్' కు ఆదరణా ఎక్కువే. అలాగే అభివృద్ధి కార్యకలాపాలను వివరించే కార్యక్రమాల ద్వారా గ్రామాలలో ప్రజలు చైతన్యవంతులు కాగలుగుతారు.

కేంద్ర రాష్ట్రప్రభుత్వాల వివిధ పథకాలను గురించీ, వాటి లబ్ధిదారులను గురించీ విస్తృతంగా ఈనాటికీ వివరిస్తున్నది రేడియో మాధ్యమమే. అలాగే

శ్రోతలను ఎప్పటికప్పుడు వర్తమానవిషయాలతో పరిచితులుగానూ, ఆలోచనా శీలురుగానూ ఉంచుతున్నది. ఈ కృషిలో భాగంగానే ఆర్థిక, వాణిజ్యాది అంశాల గురించి కూడా శ్రోతలకు విషయనిపుణుల ద్వారా ప్రసంగాల రూపంలో, పరిచయకార్యక్రమాల రూపంలో, చర్చల రూపంలో కార్యక్రమాలను ప్రసారం చేస్తోంది ఆకాశవాణి.

ఆచార్య కోటంరాజు రామకృష్ణ శర్మగారు రాసిన కొన్ని ఆంగ్ల రచనలతో బాటు ఈ సంపుటిలో వున్న తెలుగు వ్యాసాలు ఆయన రేడియో కోసం రాసినవే. అయితే ప్రసారవ్యవధి దృష్ట్యా సంక్షిప్తీకరించిన పేరాలను కూడా – ఇవి శ్రోతలకు కాక పాఠకులకుఉద్దేశించినవి కనుక, ఇందులో పూర్తి పాఠాలుగా అందిస్తున్నారు. రామకృష్ణశర్మగారికి తాము చెప్పే విషయం మీద మంచి సాధికారికత వుంది. ఒక అంశాన్ని విభిన్న పార్శ్వాలతో స్పృశించగల దక్షత వుంది. చెప్పేది ఏదయినా సమగ్రంగానూ, విస్తృతంగానూ వుండాలన్న కాంక్షవుంది. ఆయనకు ఇచ్చిన అంశం ఏదయినా దాని లోతులు ముట్టనిదే ఆయనకు తోచదు. క్లుప్తతను, గాఢతను సాధించడం అందరికీ సాధ్యమయ్యేదికాదు. సామాన్యశ్రోతకు కూడా అర్థమయ్యే సరళమైన భాషలో గహనమైన ఆర్థిక వాణిజ్యాది అంశాలను వివరించడం కత్తిమీద సామువంటిదే.

ప్రతి ఏడాది బడ్జెట్ వస్తుంది. దేని ధరలు పెరుగుతాయో ? ఏ పన్నుల భారం పడుతుందో ? అనే ఆత్రం, ఏ వెసులుబాటులు దక్కుతాయో అన్న ఆశ మధ్యతరగతి జీవుల్లో – అందునా నెలసరి ఆదాయ ఉద్యోగవర్గాల్లో సహజం. శ్రోతలలో అధికశాతం మధ్యతరగతి వారూ, గ్రామీణులే. రేడియో వినే ధనికవర్గం శాతం స్వల్పమే. అందుకే ఓ 'సాధారణ బడ్జెట్ – సామాన్యుడి ఆశలు' వంటి విషయాన్ని బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందుగా ప్రసారం చేయతలపెట్టి రామకృష్ణశర్మగారి వంటి వారిని ప్రసంగించమనడం. 'ప్రకటనలు లేని వ్యాపారం సాధ్యమా?' అనేది ఇందులోని మరో మంచి ప్రసంగం. శర్మగారు చేసిన విశ్లేషణలు వినియోగదారులను చైతన్యవంతులను చేస్తూనే, వ్యాపారవర్గాల వారి దృష్టిని, ప్రకటనల మంచి చెడులనూ తెలియజేసేవిగా ఉన్నాయి. 'భవిష్యద్దర్శనం' పేర రాబోయే శతాబ్దంలో వివిధరంగాలను గురించి బేరీజు వేసే ప్రసంగాలను

2000 సంవత్సరంలో ప్రసారం చేసినప్పుడు ఆ పరంపరలో వాణిజ్యరంగం గురించి రామకృష్ణశర్మగారు చెప్పారు.

కేవలం గణాంకాలను గుప్పించడం, 'జార్గన్' ను వాడుతూ శ్రోతలను తికమక పెట్టేయడం చేయకుండా, రామకృష్ణశర్మగారు తాము చేసిన రేడియోప్రసంగాల్లో విషయ వివరణలు, విశ్లేషణలు సరళంగా చెప్పే ప్రయత్నం చేసారు. కొండంత విషయాన్ని ప్రసారవ్యవధి అనే అద్దంలో చూపించడం కష్టమే అయినా, పావుగంట ప్రసంగంలోనే విషయసమగ్రత కోసం ఆయన తపించడం కనిపిస్తుంది.

ఈ ప్రసంగాల్లో ఇంకా సరళతా, సారళ్యమూ రావాలనీ, విషయం శ్రోతకు ఆసక్తికరంగా మలచడంలో సంవిధాన సృజనాత్మకత పెరగాలనీ ఆశించడం రామకృష్ణశర్మగారికి ఆ దక్షత పుష్కలంగా వుందనే. ఊహించే మేధ, స్పందించే హృదయం, రాటుదేరిన కలం రచయిత కుండవలసిన లక్షణాలంటారు కదా! కీర్తిశేషులు దాశరథి గారు. తనదైన రంగంలో విషయపూర్వాపరాలను సహేతుకంగా ఊహించడం, ప్రజోపయోగకరంగా స్పందించడం తెలిసిన రామకృష్ణశర్మగారి లేఖిని మరింత రాటుదేరాలనీ – రేడియోమాధ్యమం ద్వారా శ్రోతలనూ, పత్రికలూ, ప్రచురణలద్వారా పాఠకులనూ ఆయన మున్ముందు మరిన్ని రచనల ద్వారా అలరించాలనీ ఆకాంక్ష.

*24 జూలై 2001*



# గ్రామాభివృద్ధికై గుర'జాడ'గా...

## గ్రామీణ ప్రగతి సోపానాలు - గురజాడ అప్పారావు

"The Sun does not forget a village just because it is small

***- African Proverb***

వ్యవసాయం గ్రామాల ఏర్పాటుకు పట్టుకొమ్మ. ఇతర వృత్తుల ఆధారంగా ఏర్పడిన గ్రామాలూ కొన్ని వుంటాయి. రాజకీయ పరిపాలనా ప్రయోజనాలకూ, పరిశ్రమల విస్తరణకు గ్రామాలే పట్టణాలుగా, నగరాలుగా వృద్ధి చెందడం అనేది ఒక పరిణామం. అయితే గ్రామాలు అంతరించిపోతే, పెనుముప్పు వాటిల్లడం ఖాయం! నగరాల వనరులు, అవసరాలు, వాణిజ్య సంబంధాలు కూడా - గ్రామ జీవనంతో ముడిపడి వున్నాయి. నగరం దగ్గరలో వున్న గ్రామాలలోనే - పాల ఉత్పత్తులు, కూరగాయల పెంపకం బాగా జరగడం చూస్తూనే వుంటాం!

"భారతదేశం గ్రామాలలోనే వుంది" అనే వారు గాంధీజీ. ఒకప్పుడు కరణం, మునసబు, పటేల్, పట్వారీలే గ్రామ పెద్దలుగా సొంత గ్రామాల్లో వుండి, గ్రామాల పాలననూ, రక్షణనూ కూడా చూసేవారు. 1985లో వి.ఏ.వో. (విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు) అంటూ వారికి బదులుగా - గ్రామ పాలనాధికారులు ఏర్పాటయ్యారు. పంచాయితీల నుంచి రెవెన్యూ వ్యవస్థ వేరయ్యింది. 2007 నుండి "వి.ఆర్.ఓ." అనగా విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల నియామకం జనాభా ప్రాతిపదికన, అయిదు వేల జనాభా అంటూ వుంటే ఒకరు, పది వేల

వరకూ జనాభా వుంటే ఇద్దరు, పదిహేను వేల వరకూ ముగ్గురూ ఇలా... వి.ఆర్.ఓ.లు వుండడానికి వీలయ్యింది. పంచాయితీ కార్యదర్శులే 'వి.ఆర్.ఓ.లు' అయినప్పుడు ఎక్కడి వారిని అక్కడే వుంచడంతో, కొన్ని చోట్ల వుండవలసిన సంఖ్య కన్నా అధికంగానూ, కొన్ని గ్రామాలలో అసలే లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ అసమానతవల్ల ప్రజలకే కాక పాలనాపరంగానూ ఇబ్బందులొచ్చాయి. కొన్ని గ్రామాలు కలిపి ఒకే 'క్లస్టర్' అంటూ సమూహంగా చేసారు. మన రాష్ట్రంలో సుమారు 13 వేల క్లస్టర్లున్నాయి. క్లస్టర్‌కు ఒక కార్యదర్శి వుండాలి. అంటే ఒక్కోకార్యదర్శి ఓ పెద్ద పంచాయితీ, లేదా ఏడు చిన్న పంచాయితీల బాధ్యతలు చూస్తాడు. 2001 లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 1127 రెవెన్యూ మండలాలు, 1094 మండల పరిషత్తులు, 21493 గ్రామ పంచాయితీలు, 28124 రెవెన్యూ గ్రామాలు, 26614 నివాసిత గ్రామాలు, 1510 నివాసులు లేని గ్రామాలు వున్నాయిట!

నిజానికి దేశంలో 74 శాతం గ్రామీణ జనాభాయే. భారతదేశం 'ఆత్మ' నిజానికి పల్లెల్లోనే వుంది. దేశం అభివృద్ధి చెందడం అంటే నగరాలు, పట్టణాలు పెరగడం అనే భావన తప్పు. నిజానికి గ్రామాలను వదలి వెళ్లవలసిన అగత్యం పౌరులకు కలగకుండా, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతూ, ఆరోగ్యం, సౌఖ్యం, ఉపాధి అక్కడే అందుబాటులో వుండేలా చూసినప్పుడే గ్రామాలు బాగుపడతాయి.

ఈ నేపథ్యం బాగా ఎరిగి, అధ్యయనం చేసిన రచయిత శ్రీ గురజాడ అప్పారావుగారు. 'భారత భాషాభూషణ్' గౌరవం ఇటీవలే ఆయనకు లభించడం – కేవలం సాహిత్య రంగంలోనే కాక ఇలా ప్రజాప్రయోజనాల గ్రామీణభారతాన్ని దర్శించి విశ్లేషణా వ్యాసాలు రాయడం వల్ల మరింత దీప్తిమంతమయ్యిందనాలి. 'గ్రామీణ ప్రగతి సోపానాలు'గా అప్పారావుగారి ఈ వ్యాస సంపుటిలోని ప్రతి వ్యాసం మంచి సమాచారాన్ని అందించడం మాత్రమే కాక గ్రామీణాభివృద్ధికి సముచిత సూచనలనూ, సలహాలనూ కూడా ఎడనెడ సంతరించుకుని వుండడం నిజంగా విశేషం. గ్రామసభల ఆవశ్యకత, సహకార సంఘాల పాత్ర భిన్న పార్శ్వాలలో ఈ వ్యాసాలలో ఆయన స్పృశించారు. ముఖ్యంగా వ్యవసాయ పనులలో కానీ, పాడి–పంట అంశాలలోగానీ మహిళల పాత్రను రచయిత ఉత్తమంగా గుర్తించి పేర్కొన్నారు.

"భారతదేశ జనాభాలో సగం మంది మహిళలే వున్నారు. కనుక అభివృద్ధి కొరకు ఏ పథకమును ప్రవేశ పెట్టినా మహిళలను విస్మరించరాదు. ప్రత్యేకించి గ్రామీణ మహిళలను విస్మరించరాదు" అంటూ ప్రభుత్వం గ్రామీణ మహిళలను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్న విధానాల గురించీ, గ్రామీణ మహిళాభివృద్ధి గురించీ ఆలోచనాత్మక విషయాలను వ్యాసాలలో పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి అంటే పర్యావరణాన్ని పాడుచేస్తూ నగరీకరణం వైపు మరల్చడం కాదని అప్పారావుగారు సుస్పష్టం చేసారు. ఆ విధంగా వాతావరణ కాలుష్య నివారణకు కృషి చేసే పర్యావరణవేత్త కావడమూ ఆనందహేతువు.

'గ్రామం చిన్నది అని సూర్యుడు ఉదయించడం మానడు' అన్న ఆఫ్రికన్ సామెతననుసరించినట్లు గ్రామాల పట్ల పాలకులు, నేతలు మాత్రమే కాక రచయితలు, కళాకారులు కూడా శ్రద్ధ వహించవలసిన అవసరానికి అనుగుణంగానే శ్రీ గురజాడ అప్పారావుగారు ఈ వ్యాస సంపుటిని కూర్చారు. ఇలాంటి మంచి వ్యాస సంపుటిని వెలువరిస్తున్నందుకు వారిని మనసా అభినందిస్తూ ఇది పాఠక సమాదరణ పాత్రమవ్వాలని ఆకాంక్షిస్తున్నాను.

*23 మార్చి 2012*




# పులివర్తి విపులవర్తి

## ఆధ్యాత్మిక్ – పులివర్తి కృష్ణమూర్తి

పులివర్తి విపులవర్తి. 'పులి' అనే మాటకు 'పులిసిన' అనీ, 'వ్యాఘ్రము' అనీ అర్థాలున్నాయి. పిండి పులిస్తే గానీ ఆవిరి కుడుమయిన ఇడ్లీనో, మినపరొట్టెనో వేసుకోవడం కుదరదు. అలాగే జీవితపు కొన్ని అనుభవాలు 'పులిస్తే' గానీ ఒక ఆధ్యాత్మిక దృష్టి ఏర్పడదు. అయితే ఆ అనుభవాల్లో కూడా 'పులి' లాంటి ధీరత వుండాలి. అంటే కష్టసుఖాలను సమ్యక్ దృక్పథంతో తీసుకోగలిగిన స్థితప్రజ్ఞత వుండాలి. స్థితప్రజ్ఞుడు చెప్పే మాటకు విలువ వుంటుంది. ఆ మాటలో నిజాయితీ వుంటుంది, బలం వుంటుంది. నేటి రోజుల్లో అలా వుండడం, వర్తించడం అందరికీ చేతనయ్యే పనికాదు.

'పులివర్తి' పేరున ఆంధ్రప్రభ దినపత్రికలో 'పరమపథం' – అభివ్యక్తీకరిస్తున్న పులివర్తి కృష్ణమూర్తిగారు ఆధ్యాత్మిక రచనల్లో ఒక ఆత్మిక గుణాన్ని సాధించారు. తొలి రోజుల్లో 'చిత్రాలయ' మైన సినిమా కబుర్లు చెప్పిన ఆయన ప్రపంచ చిత్రాలయపు విచిత్రలోకంలో – మనిషి హీరోలా నిలచి, నిలబడగలిగే నిజమైన అస్తిత్వం గురించీ, మనిషి సాధించవలసిన పరమార్థం గురించీ, అందుకోసం చేయవలసిన సాధన గురించీ ఆలోచించడం మొదలు పెట్టారు. వార్త, ఆంధ్రప్రభ, ప్రజాతంత్ర పత్రికల్లో ఇప్పటికే కనబడుతున్న ఆయన ఆధ్యాత్మిక రచనలు చదివినప్పుడూ, అప్పుడప్పుడూ ఆకాశవాణి 'భావన' కార్యక్రమంలో ప్రసారమయ్యే వారి ప్రసంగాలు విన్నప్పుడూ – ఆయన హృదయం, అందులోని నైర్మల్యం అర్థం

అవుతాయి. వారు చెప్పే మంచిమాటలు పఠితల, శ్రోతల మానసాలకు ఆహ్లాదాన్ని, ఊరడింపునూ, ధైర్యాన్నీ, ఆశనూ కలిగించేవిగా వుంటాయి. ఒక ఆత్మిక గుణంతో ఆధ్యాత్మిక విషయాలు వివరించే వారి ధోరణి – పాండిత్యపు ప్రాగల్భ్యం కాక, సగటు మనిషి సమాదరించి సంతోష స్వాంతుడయ్యే రీతిగా వుంటాయి. ఏటా జంటనగరాల్లో జరిగే గణేష్ నిమజ్జన ప్రత్యక్ష వ్యాఖ్యానం సిటీకేబుల్ ఆయనచేత చేయించడం వారి ప్రతిభాకోణంలోని ఒక అందమైన అంచు. దైనందిన వ్యవహారంలో ప్రభాతవేళ అవశ్యపఠనీయాలయిన స్తోత్రాలను ఆస్తికులకై ఒకచోట సంతరిస్తూ, గానం వెంట ప్రవచనం కూడా ప్రయోజనదాయకం కనుక ఎంపిక చేసిన కొన్ని తమ ఆధ్యాత్మిక ప్రసంగాలను ఈ పుస్తకంలో సంకలనం చేసిన కృష్ణమూర్తిగారిని మనసా అభినందిస్తున్నాను.

ఇలా 'ఆధ్యాత్మిక్' పేర – 'వార్త' ప్రచురిత ప్రవచనాలను ఆయన ఒక చిరు గ్రంథంగా వెలువరించి అమూల్యంగా అందించారు. ధార్మిక భావనల ఇంపునింపే ప్రవృత్తితో వ్యవరిస్తున్న సృజనశీలి, స్నేహశీలి, ఆత్మిక గుణశీలి అయిన కృష్ణమూర్తి గారి 'పులివర్తి' త–విపులాచ 'పృధ్వీ' గా విస్తరిల్లి, మానవ విలువలకూ, పవిత్ర భావనలకూ ప్రోది కావాలని శుభాకాంక్షలు. విపులవర్తి పులివర్తిగారికి నమస్సులు.




# హృదయ చషకంలో సాహిత్యరసాయనం

## వ్యాసార్థం - డా॥ వోలేటి పార్వతీశం

The Touchstone of literary criticism is emotion, not reason. We judge a work of art by its effect on our sincere and vital emotion, and nothing else. All the critical twiddle - twaddle about style and form, all this pseudoscientific classifying and analyzing of books in an imitation - botanical fashion, is mere impertinence and mostly dull jargon.

***- D.H. Lawrence***

సాహిత్యావలోకనం అయినా, సాహిత్యవిమర్శ అయినా ఏదో ఇజాల పడికట్టు రాళ్ళతోనూ, శైలీ రూపాల కొలమానాలతోనూ కాకుండా ఒక మహనీయ సాహిత్య సృజన కారుడినయినా, ఒక మరపురాని పుస్తకాన్నయినా- ఆ వ్యక్తి, లేక ఆ గ్రంథం తనపై వేసిన ప్రభావం తోనో, హృదయ స్పందనంతోనో వివరించడమే నిజమైన వ్యాసార్థం. అనుభూతి రసప్లావితుడయిన సహృదయవేత్తగా అభివ్యక్తం కాగలిగేవారే పదిమందినీ ఆకర్షించగల కలం విన్నాణాన్నో వచోనైపుణ్యాన్నో చూపగలుగుతారు. వక్తగా, వ్యాసకర్తగా అలాంటి యశోవైభవాన్ని కలిగినవాడు డా॥ వోలేటి పార్వతీశం. ప్రసార మాధ్యమ ప్రముఖునిగా ప్రస్తుతం జయజయశంకర్ టీ.వీ-సి.ఇ.ఓగా లబ్ధప్రతిష్ఠుడయిన పార్వతీశం కవిగా, రచయితగా, వచోవైభవ ప్రాసంగికునిగా పరిచితుడు.

పండితకుటుంబంలో జన్మించినవాడు. అటు మాతామహుడు కందుకూరి రామభద్రరావు, పితామహుడు ఓలేటిపార్వతీశం అంశలేకాదు, జనకులు ప్రఖ్యాత కవి శశాంక (ఓలేటి సుబ్బారావు) గారి పాండితీగరిమనూ పుణికి పుచ్చుకుని సాధారణంగా లోకంలో పండిత పుత్రుడనే నిరాదరణ భావాన్ని పరాస్తం చేసి, నిజంగా శశాంకగారే ఇప్పుడున్నట్లయితే 'పుత్రాదిచ్ఛేత్ పరాజయమ్' అని గర్వించేవారు అన్నంతగా సాహితీవేత్తగా రాణిస్తున్న విమలమతి పార్వతీశం.

'సంప్రదాయాభిజ్ఞత' తన మూలాధారనాడి. ప్రాచీన అర్వాచీన సాహిత్యాలను అవలోఢనం చేసి ఏ విషయంమీదనయినా శ్రోతృజన రంజకంగా వేదికలపై నిలచి ఉపన్యసించగల దిట్ట. తన ఉపన్యాస ఫణితిలో ఓ లయ, ఓ తూగు, ఓ మార్దవం వుంటాయి.

నిజానికి వచన రచన చేయడమే కష్టం. అందునా మంచి వచనం రాయడం అందరికీ చేతనయ్యే పనికాదు. పద్యాలురాసే వారు ఆ ఛందోగతుల వల్లా, వచన కవిత రాసేవారు ఓ అంతర్లయ సాధించడం వల్లా ఆ ప్రక్రియా రచయితలుగా చెలామణి అయిపోవచ్చు గానీ, మంచి వచనం రాసి మెప్పించడం- అందునా కాల్పనిక సాహిత్యమైన ఏ నవలో, కథో రాయడంలో కాక, సాహిత్య వ్యాసరచనలో, సమీక్షలో, విమర్శలో సాధించడం గొప్ప ఉపజ్ఞ. సహజంగా వచోవైభవ విలసితుడు కావడం వల్ల పార్వతీశం వ్యాసం కూడా మనతో అంతహాయిగా మనసు విప్పి ముచ్చటిస్తున్నట్లుంటుంది. అవి నిజంగా అనుభూతి రమ్యాలు. సాహిత్య విమర్శ పేరిట 'జార్గాన్' లతో అసలెక్కడా ఎటువంటి పటాటోపమూ వుండదు. తను 'హృదయవాది' కావడమే అందుకు హేతువు.

'వ్యాసార్థం' లోని వ్యాసాలన్నీ మహనీయ సాహితీ మూర్తుల గురించో, విశిష్ట పఠనీయ గ్రంథాలగురించో తెలియ చెప్పడానికి సంకల్పించినవే! 'తల్లీ నిన్నుదలంచి' అనీ, 'శశాంక యశ్చశంద్రిక' అనీ – రాసిన వ్యాసాలు కన్నతల్లితండ్రులకు వారి గురించి రాసి స్మృత్యంజలి ఘటించినవి. అలాగే మాతామహుడు కీ॥శే॥ కందుకూరి రామభద్రరావు గారి గురించి 'ఆయన కవితల్లజుడు' అని రాసిన వ్యాసం చదివితే ఆయన వ్యక్తిత్వ కవిత్వ మహనీయత మనకు సాక్షాత్కరిస్తుంది. గాంధీ మహాత్ముని లేఖనే కాదు వారి ప్రభావ జీవన రేఖలను కూడా ఎలా అందుకున్నది అవగతమౌతుంది. ఆకాశవాణి ద్వారా దేశభక్తిని గీతాలుగా ప్రచులితం చేసిన ప్రాభవం పొడగడుతుంది.

పార్వతీశం తన వ్యాసరచనా మిసిమిని వేంకటపార్వతీశ్వర కవులు, అలాగే జంట కవులయిన కొప్పరపు కవులు, పింగళి కాటూరికవులు వంటి యుగళత్రయం కావ్యాలపైనే కాక, చిలకమర్తి లక్ష్మీనరసింహం, శ్రీరంగం నారాయణ బాబు, ఆచంట జానకిరాం, ఆలపాటి రవీంద్రనాథ్, యార్లగడ్డ బాలగంగాధర రావుల సాహిత్య వ్యక్తిత్వాలపై ప్రసరించాడు. అలాగే ఉమర్ ఆలీషా సాహితీ సంపదపైనాను.

శ్రీ విల్లిపుత్తూరులో తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన జాతీయ సదస్సుకు గోదాదేవి సౌందర్య స్వభావాలను, కృష్ణదేవ రాయలవారు అక్షరముఖంగా చిత్రించి ప్రదర్శించిన 'వర్ణచిత్తరువుల కొలువు' అంటూ ఆముక్తమాల్యద కావ్య వైశిష్ట్యంపై చేసిన రచన, అలాగే తూర్పుగోదావరి జిల్లా యంత్రాంగం ప్రచురణ సారస్వత సర్వస్వం కోసం రాసిన 'గోదావరి తూరుపు దరిలో- నవకవితాఝరి' అనే వ్యాసం, కేంద్ర సాహిత్య అకాడమీ సదస్సు కోసం 'కొవ్వలినవలలు- పఠనాసక్తి' గూర్చిన రచన ఆ సందర్భాలకు వన్నెవాసి తెచ్చిన రచనలుగా రాణిస్తున్నాయి.

ఏది చదివితే ఏమీ చదవకపోయినా అన్నీ చదివినట్లో
ఏది చదవక పోతే అన్నీ చదివినా ఏమీ చదవనట్లో

అంటూ 'విస్మృతిబాటలో ఒక స్మృతిపథం' అంటూ ఆచంట జానకిరామ్ 'నాస్మృతి పథంలో' గ్రంథవైశిష్ట్యాన్ని పార్వతీశం చెప్పిన తీరు ప్రథమ పంక్తికి నికషోపలం. అలాగే 'ఆబాలగోపాలమ్'లో సంగీత సమ్రాట్ మంగళంపల్లి బాలమురళీకృష్ణను శాస్త్ర విషయంలో సాకల్య పరిశోధకునిగా ప్రదర్శనవేళలో సంపూర్ణ రససాధనామూర్తిగా విశేషాంశాల సంగమస్థలిగా రూపుకట్టించినవైనం ఆహ్లాదసుందరం.

పద్యాన్ని హృద్యం చేసిందీ, సామాన్యులకు సైతం అభిరుచి నైవేద్యం చేసిందీ, లక్షలాది మందిని పద్యప్రేమికులుగా మార్చేసిందీ అలా వాగ్దేవికి స్వరనైవేద్యంగా నిలిచింది అమరగాయకుడు ఘంటసాల అనీ, ఒక్క ఘంటసాలమాత్రమే- కవి తన కవిత్వంలో పొదిగిన స్వభావాన్ని పాడతాడు అనీ పార్వతీశం విశదపరచినవైనం అక్షర సత్యం. తెలుగుపద్యం పలుకుబడికి ఒక కొత్త ఒరవడిని దిద్ది తీర్చింది ఘంటసాల అన్న విశ్లేషణ సర్వజనామోదమే!

'అమృతాశ్రువులు' అనే వ్యాసం 'ఎలిజీ' అనే స్మృతి కావ్యాలకు సంబంధించింది. ఆత్మీయుల మరణంతో విచలితమైన కవులు వెలువరించిన స్మృతిసాహిత్యం విషాదభరితమైన జ్ఞాపకాల విస్తరణ. ముఖ్యంగా సతీ, సుతుల శాశ్వత వియోగంతో తెలుగుసాహిత్యంలో వెలువడిన స్మృతి కావ్యాలు వున్నాయి. రాయప్రోలు, బసవరాజు, బాపిరాజు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, నాయని, భరద్వాజ వంటివారి స్మృతి సాహిత్యాన్ని ఈ వ్యాసంలో పార్వతీశం విశ్లేషించారు. అయితే అబ్బూరి రామకృష్ణారావు గారు కోల్పోయిన బాల్యం గురించిన ఖండికను ఇందులో పేర్కొనడం ఔచితీమంతంగా లేదు. ఇందులో ఆ ప్రస్తావన అవసరం కాదు. 'సాహిత్యంలో ఈ స్మృతి విస్తృతి తక్కువైనా తన ఆకృతిని బలంగా నిలిపింది. విస్మరించలేని ఒకస్థానాన్ని ఏర్పరిచింది" అన్న నిర్ధారణ అభినందనీయం.

'చివరకు మిగిలిన సగం' పేరిట రచయిత బుచ్చిబాబు గారి ధర్మపత్ని, స్వయంగా రచయిత్రి చిత్రకారిణి అయిన తొంభై ఏళ్ళపైబడిన శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి గారితో పార్వతీశం చేసిన ఇంటర్వ్యూ పూర్తిపాఠం కూడా ఈ 'వ్యాసార్థం' లో చేర్చారు. వ్యాసార్థంలోని వ్యాసాలలో సోదాహరణంగా చక్కని ఉటంకింపులతో విషయ విస్తరణం చేసిన వైఖరి, అనుభూతి రమ్యంగా ఆ మహనీయులనూ, ఆయా మహిత గ్రంథాలనూ హృదయంగమంగా వెల్లడించిన ఫణితి పఠితలను ఆకట్టుకుంటాయి. వోలేటి లోని మేటి వచనరచనా ప్రజ్ఞావిశేషమే ఇది! ఇంత చక్కని ఉపాయనం అందిస్తున్న సోదర సమానుడైన సాహితీ మిత్రునకు మనసా అభినందనలు. మీహృదయ చషకాలతో ఈ రచనామృతాన్ని గ్రోలండి! 'వ్యాసార్థం'లోని ప్రతిరచనా Aldous huxley అన్నట్లు– A literary device for saying almost everything about almost anything"

*11 జూలై 2018*



# థిక్‌ట్రూత్ – మిత్రవాక్యం

## ఎన్నారై కబుర్లు – (మరోటి) – సత్యం మందపాటి

ఆంధ్రదేశంలో ఇప్పుడు చెలామణీలో వున్న ఓ మందపాటి సత్యం గురించి చెప్పమంటారా? అమెరికాను తిట్టడం, అదే నోటితో అమెరికా ఆహ్వానానికి ప్రాధేయపడటం. ఎన్.ఆర్.ఐ.లంటే తమ అమెరికా యాత్రకు ప్రాయోజకులు. తమ గ్రంథాలను, సాంస్కృతిక కళలను డాలర్లలో ప్రోత్సాహించేవారు. గొప్ప పెళ్ళి సంబంధాలవారు. పైకి సామ్రాజ్య వాద సంస్కృతీ నిరసన. లోన అమెరికా పట్ల ఆరాధన. ఇది హిపోక్రసీయే! కానీ ఇండియాలో, అందునా ఆంధ్రదేశంలో చెలామణీలో వున్న వాస్తవం.

ఎన్.ఆర్.ఐ.లంటే ఇప్పుడు – ఇండియాలోనే వున్నారు. ఎవరంటారా? 'నాన్ రెస్పెక్టెడ్ ఇండియన్స్'. 'మనవాళ్ళు వట్టి వెధవాయిలోయ్' అని గిరీశం అన్నాడు. తెలుగు భాష పట్ల, సంస్కృతి పట్ల, కళారూపాల పట్ల గొప్ప అభిమానంతో అమెరికాలోని తెలుగు వారు ఆంధ్రదేశంనించి సాహితీవేత్తలను, కవులను, కళాకారులను, సాంస్కృతిక బృందాలను ఆహ్వానిస్తుంటే అక్కడికి వెళ్ళి డబ్బు కాపీనంతో, అక్కడి సంస్కృతి పేరిటి వికార చేష్టలతో గౌరవాన్ని కోల్పోతున్న వారున్నారు. అదే సమయంలో చదువుల కోసం, ఉద్యోగాల కోసం అనివార్యంగా అమెరికాకు తరలివెడుతున్న భారతీయులలో తెలుగువారూ ఎందరో వున్నారు. 'మనిషి మనిషికీ ఒక ఆశ. ఆశ జీవితానికి శ్వాస' మరి. ఈ వ్యవహారమంతా సత్యంకు తెలుసు. అమెరికాలో వున్న ఆ 'మెరిక'లాంటి సృజనశీలత అతని

సొంతం. 'తెలుగువాడు పైకి వస్తున్నాడు తొక్కేయండి' అనే బాపతుగాళ్ళు తనకు బాగా తెలుసు.

మందపాటి సత్యం రచయిత, కథకుడు. అమెరికాలో ఎన్.ఆర్.ఐ.గా, ఉద్యోగం చేసుకుంటూ తెలుగు బడి, తెలుగు నుడి, ఒడి చేర్చుకున్నవాడు. అమెరికా గురించీ, ఇండియా గురించీ ఇరుపార్శ్వాలనూ ఇంగితజ్ఞానంతో ఎరిగినవాడు. ఇండియానించి నెల నెలా కొన్ని వేలలో దిగుమతి అవుతున్న మన భారతీయులకీ, ముఖ్యంగా తెలుగువాళ్ళకి అమెరికా జీవితం సవ్యంగా గడపటానికి కావలసిన రకరకాల విషయాల పై సమాచారం ఇవ్వాలన్న సంకల్పమే బహుదొడ్డది. 'ఎన్నారై కబుర్లు' అలా రూపుదాల్చినవే. ఆంధ్రభూమి వారపత్రిక ఎడిటర్ ఎ.ఎస్.లక్ష్మిగారు దీనినొక శీర్షికగా మలచి వారం వారం రాయించి, ఈ కబుర్లకు కాలక్షేపాన్ని కాక, గొప్ప ప్రయోజనాన్ని సంతరించి పెట్టారు.

'ఏదో చుట్టం చూపుగా వచ్చే వాళ్లకి ఫరవాలేదు. ఎవరో ఇక్కడ సహాయం చేస్తారు. ఇక్కడ చదువుకోటానికి వచ్చేవాళ్లూ, ఉద్యోగాలకి వచ్చేవాళ్లూ ఎలాంటి బాధలూ పడకూడదనే' తన పాతికేళ్ళ అమెరికా అనుభవంతో చూసినవీ, నేర్చుకున్నవీ, మిత్రుల అనుభవాలూ చక్కని విశ్లేషణలతో, పరిశోధనతో, హాస్య చమత్కారాలతో, మానవీయ విలువలనే మూలకందంగా చేసుకుని మందపాటి సత్యం ఈ కబుర్లు వెలువరించారు. అమెరికాలో భారతీయుల జీవితాన్నీ, ఇండియాలో మనవాళ్ల అమెరికా మోజునీ నిశితంగా పరిశీలించిన పాటవం ఈ రెండో సంపుటిలోని డెబ్భై నాలుగు వ్యాసాలలో స్ఫుటంగా, ఇంత విస్తారమైన ఇతివృత్తాలను ఎన్నుకుని నిర్వహించడంలో గొప్పగా, ద్యోతకమౌతోంది!

ముళ్ళపూడి ఊరికే అన్లేదు, నిజంగా మందపాటి సత్యానిది 'ఇన్ఫోటైన్ మెంటాలిటీ'. సమాచారాన్నీ, సరదానీ మేళవించి, అదే సమయంలో బాధ్యతలనూ కర్తవ్యాలనూ గుర్తు చేస్తూ, సలహాలనూ సంప్రదింపులనూ అందిస్తూ, ఈ ఎన్నారై కబుర్లను కేవలం 'డయాస్పోరా' సాహిత్యంగానే కాక, అమెరికా రాగోరేవారికీ, వచ్చి వుండగోరేవారికీ ఒక కరదీపికగా, హితవరిగా సంతరించారు.

'తెలుగుబడి' తెలుగేతర ప్రాంతాల్లో ఇంగ్లీషులో తెలుగు చెప్పే విధానాన్ని తేటతెల్లం చేస్తూ తెలుగుపై ఇష్టాన్ని, తెలుగుతనం నిలుపుకునే సిస్టాన్ని చెబుతుంది. 'సునామీ!' మానవీయ విలువలను ప్రోది చేసిన ఘటనల సమాహారం. ఔట్

సోర్సింగ్ ఒకటి, మరోటి, ఇంకోటి, సర్జనులు, దుర్జనులు ఎంతో వైవిధ్యంతో విస్తరించిన సీక్వెల్ కబుర్లు. ఈ – కబుర్లలో ముళ్ళపూడి జోకులు చాలా చోట్ల ప్రస్తావించారు. అవన్నీ సందర్భశుద్ధితో విషయానికి బంగారానికి తావిలా అమిరాయి. 'ఎవరది' అంటే 'నేనే' అని సమాధానం. 'నేనే అంటే' అని రెట్టించి అడిగితే, అది తెలుసుకుందామనే కదా నా ప్రయత్నం' అనే తాత్త్వికత.

అమెరికాలో 'రూరల్ సోర్సింగ్' మనకి కనువిప్పు కావాలి! పత్రికలు నిజాలని నిజాయితీతో చిత్రించటమే కాదు, అన్యాయాన్నీ రాజకీయ దుర్గంధాన్నీ చిత్రిక పట్టాలి కూడా. అదే 'పత్రికల చిత్రిక'. ఎనిమిది కోట్ల తెలుగువాళ్లు, కనీసం వెయ్యి కాపీలు మాత్రమే ప్రచురిస్తున్న ప్రముఖుల పుస్తకాలను ఆదరించలేక పోతున్నారనే బాధ 'పుస్తకం హస్తభూషణం'. అడగందే అమ్మయినా పెట్టదు. ఈ అడగటమే 'లాబీ.. లాబీ...' అమెరికానుండి 'వెళ్ళొస్తామండీ' అంటున్నవారెందరు? అప్పు చేసే శక్తి, ఎస్టాబ్లిష్డ్ క్రెడిట్ వుండాలి. తలకు మించినవీ, తనకు మించినవీ అప్పులొద్దు. (ఓ ఫైవుందా సార్) 'చచ్చినా చావకు', 'వీడియో పెళ్ళి', 'చీకటిలో చందమామ', 'నాతిచరామి' 'యుద్ధకాండ', 'మనసా కవ్వించకే', 'వ్యాపారాయణం'... ఇలా ఎన్నో... ఎన్నెన్నో... ఇన్ని విస్తారమైన విషయాలను క్రోడీకరించి, ఇంత కమనీయంగా వివరించి చెప్పడం నిజంగా గొప్ప సృజనాత్మక ప్రతిభ. వారం వారం కైవారం.

అమెరికా వెళ్లినా, వెళ్లక పోయినా ఇండియాలోని ప్రతివారూ ఓసారి ఈ ఎన్నారై కబుర్లు చదివి తీరాలి. అమెరికా తెలుగువారూ విధిగా ఈ కబుర్లు తమ అనుభవాలతో కలిపి కలబోసుకోవచ్చు. వెరసి ఇది ఉపయుక్తమైన మాటామంతీ. ఒక మంచి పరామర్శ గ్రంథం. కథకుడిగా ప్రసిద్ధుడైన మందపాటి సత్యం ఈ కబుర్ల ద్వారా ఒక ఇష్టుడైన కాలమిస్టుగా, హ్యూమనిస్టుగా, తనదైన హ్యూమరిస్టు పంథాలో పాఠక జన హృదయాలను నిస్సందేహంగా అలరించగలడు. అందుకు దాఖలాయే ఈ 'ఎన్నారై కబుర్లు'. మార్గదర్శక రచయితగా అమెరికాకు, ఆంధ్రదేశంలోనూ ఇక ఈ మందపాటి సత్యం గొప్ప చెలామణీలో వుండటం ఖాయం.

*జనవరి 2007*




# గాంధీ పథగామి

## బాపు–నేను (అభిప్రాయసంపుటి) – యం.యస్. రాజలింగం

ఒక తరం పెద్దలంతా గాంధీజీ గురించి మాట్లాడుతారు. స్వర్ణోత్సవ గణతంత్ర భారతదేశంలో నేడు " గాంధీజీ" – విగ్రహాలకు, జ్ఞాపకాలకు పరిమితమై పోయారనీ, గాంధీయం వర్తమాన హైటెక్ సమాజానికి పాథేయం కాదనీ – అనేవారిని చూస్తుంటే బాధ కలుగుతుంది. "ఓ మహాత్మా! ఓ మహర్షీ! ఓ క్షమా పీయూషవర్షీ! ఎక్కడయ్యా నీ అహింస, ఎచట నీ కరుణారిరంస," అన్న శ్రీశ్రీ వంటి మహాకవుల ఆర్తి – నేటికీ సత్యనిష్ఠ గురించీ, నిరాడంబర జీవనం గురించి నిజాయితీగా ఆలోచిస్తున్న వారి హృదంతరాళాల్లో వ్యాప్తి చెందుతూనే వుంది. గాంధీ పేరు చెప్పుకుని లాభపడిన వారు ఎందరున్నా, ఆయన్ని త్రికరణశుద్ధిగా ఆదర్శంగా తీసుకుని జీవన సరళిని మలుచుకున్నవారు తక్కువ. గాంధీని ఒక రాజకీయవేత్తగా, నాయకునిగా చూసిన వారికి మాత్రమే ఆయనతో పనితీరినట్లనిపిస్తుందేమో గానీ, ఓ మహాత్మునిగా, అహింసామూర్తిగా, సత్య జీవన ఆదర్శ శీలిగా, మానవతా తాత్త్వికజీవిగా సంభావించే వారందరికీ మాత్రం ఆయన ఆదర్శ గురువుగా, ఆరాధ్య దైవంగా నిత్యజీవన మార్గదర్శిగా విరాజిల్లుతూంటారు. సత్య సందర్శనం చేయగోరే ఏ వ్యక్తికయినా ఆయన సదా అనుసరణీయులే – నాటికీ నేటికీ.

ప్రముఖ గాంధీయ వాదులు, మాజీ అమాత్యులు అయిన శ్రీ ఎం. ఎస్. రాజలింగం గారు గాంధీ పథగామి. గాంధీగారితో సేవాగ్రామ్ ఆశ్రమంలో రెండు సంవత్సరాలు వుండి జీవితాన్ని అనుభవ పరిపూర్ణం చేసుకున్నారాయన.

గాంధీజీ మీద ఇప్పటికి ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయి. కానీ ముఖ్యంగా ఈనాటి తరానికి ముఖ్యంగా పిల్లలకూ, యువకులకూ గాంధీయ అనుభవ సూత్రాలనూ, ఆచరణ విధానాలను తేలికగా తెలియచెప్పే గ్రంథాలు తక్కువే. ఆ లోటు తీర్చే పుస్తకం ఇది - 'బాపు-నేను'. తెలంగాణలో పోలీసుల బారినుండి తప్పించుకోవడానికి మారువేషం వేసుకుని వార్ధాచేరి ఆ తరువాత స్వామి రామానంద తీర్థ ప్రేరణతో- గాంధీగారి అహింస, సత్యాగ్రహం మొదలయిన సూత్రాల అధ్యయనం పట్ల జిజ్ఞాస జనించి, పలు సాంఘిక సామాజిక కార్యకలాపాల మూలకందంగా - గాంధీజీ సేవాశ్రమ వాసం చేసే రెండు సంవత్సరాల అద్భుత అవకాశం కలిగి, అక్కడే జె. సి. కుమారప్ప, ప్రభాకర్‌జీ వంటి పెద్దల సాంగత్యంతో సంచరించి, తన వ్యక్తిత్వాన్నీ గాంధీయ మార్గంలో వికసింప జేసుకున్న వారు శ్రీ రాజలింగం గారు. అందుకే ఆయన అనుభవ సంపుటిగా, మహాత్ముని జ్ఞాపకాల వాటికగా ఆరు అధ్యాయాల ఈ పుస్తకం- గాంధీజీ తాత్త్వికతలోని గొప్పదనాన్ని, ఆయన రాజకీయాలలోని ఆధ్యాత్మికతనూ చిన్న చిన్న సంఘటనలుగానే వివరిస్తూ, హృదయానికి హత్తుకునేదిగా వుంది.

గాంధీగారితో రాజలింగం గారికి ఫోటో ఏదీ లేక పోవచ్చు. కానీ ఈ పుస్తకంలో ఫోటో కట్టినట్లుగా గాంధీని తాము ఎలా గురువుగా సంభావించగలిగిందీ, ఆశ్రమంలో వివిధానుభవాలు తమను ఎలా కార్యశీలిగా మలచినదీ చిత్రించి చూపించారాయన. గోసేవలో, ఆశ్రమ పరిశుభ్రతలో, భోజనాది ఏర్పాట్లలో రాజలింగంగారు వివరించిన అంశాలు, నిర్మాణ కార్యక్రమాలు చేపట్టడం కోసం వారు 1941వ సంవత్సరంలో మధ్యలో ఆశ్రమం వదిలేంతవరకు- బాపూ గూర్చిన పరిశీలనలు ఆసక్తిదాయకమైన కథనాలుగా మలచి చెప్పిన తీరు పుస్తకాన్ని ఆసక్తితో చదివిస్తాయి.

నియమ నిష్ఠలు లేని రాజకీయాలు, మానవత లేని శాస్త్ర విజ్ఞానం, అంతః కరణ లేని ఆనందం, త్యాగములేని పూజ, నీతిలేని వాణిజ్యం, పనిలేని సంపద, శీలంలేని విద్య ఇవి సామాజిక సప్తమహాపాతకాలుగా సంభావించిన గాంధీ వాటిని అధిగమించి జీవించాలని సదా బోధించారు. ఆ మహోదాత్త జీవనాదర్శం- ఎనభై ఏళ్ళు పైబడిన వయసులోనూ అనుష్ఠించడమే కర్తవ్యంగా తాము విశ్వసించి, అట్టి గాంధీమార్గమే నేటికీ శిరోధార్యమని ప్రబోధిస్తూ రాజలింగంగారు నిజాయితీతో చేసిన రచనే 'బాపూ నేను' అనే ఈ పుస్తకం.

భూమిక

శ్రీ రాజలింగంగారే అన్నట్లు - ఇది ఒక కథగానో, నవలగానో ఒక క్రమతలో సాగిందికాదు. ఈ తరం యువతకూ, పిల్లలకు ఆసక్తి కలిగించేలా కొన్ని సంఘటనల సమాహారంగా, తమ అనుభవాలూ- జ్ఞాపకాల ఆల్బమ్ తిరగేసి చూపుతూ వివరించే విధంగా- ఈ రచన చేయడంలో - ఒక రొటీన్ యాంత్రికతనూ, మూసనూ ఆయన ఛేదించారు. మన అంతరాత్మను జాగృతం కావిస్తే స్వాతంత్ర్య జీవితం కరతలామలకమవుతుందన్న గాంధీ సూక్తికి అనుగుణంగా రూపొందిన కథనం ఇది.

గాంధీజీ ప్రబోధంలో నైతిక ఆధ్యాత్మిక స్ఫూర్తి ఏదయితే వుందో, వ్యక్తి బలహీనతలను కప్పిపుచ్చడంలో కాక వాటిని వెలిబుచ్చి వాటిపై పోరాడడంలోనే ఆత్మబలం ఏదయితే వుందని చెప్పడం జరిగిందో, ఆ అద్భుత పార్శ్వాన్ని ఆసాంతం, ఆకర్షణీయంగా అభివ్యక్తం చేసే మంచి ప్రయత్నం ఈ రచన అని పాఠకలోకం ప్రశంసించగలదు. 'ఒక వజ్రం కనిపెట్టడానికి వందలకొద్ది టన్నుల మన్ను తవ్వి శాయశక్తులా ప్రయత్నించాలి. సత్యమనే వజ్రాన్ని అన్వేషించడానికి మనం మనలో వున్న అసత్యమనే మన్ను తొలగించడానికి దీనిలో వెయ్యోవంతయినా శ్రమపడుతున్నామా?' అంటారు గాంధీజీ.

అసత్యమూ, హింసా, నేరమూ, అవినీతి పెరిగిపోతున్న వర్తమాన సమాజపు చీకట్లలో- సత్యజ్యోతిని వెలిగిస్తూ గాంధీమార్గమే భావి ప్రపంచానికి కూడా అనుసరణీయం అని చాటిచెప్పేదిగా వుంది రాజలింగంగారి ఈ పుస్తకం.

ఈ తరానికి ఇంత మంచి ఉపాయనాన్ని అందిస్తున్న రాజలింగంగారు అభివందనీయులు. నవతరం దీనిని సమాదరించాలని నా ఆకాంక్ష. సమాదరిస్తుందని విశ్వాసం.

ఆగస్టు - 2000




# అన్నయ్య సన్నిధి- అక్కయ్య పెన్నిధి

## బాలానందం - ఆంధ్ర బాలానంద సంఘం
## అన్నయ్య, అక్కయ్య గార్ల ముద్రిత రచనలు

**పి**ల్లలకు తాము చెప్పదలుచుకున్నది ఏదో అది రాయడం 'బాలసాహిత్యం' అని కాకుండా, పిల్లలకు కావలసిందేమిటో, వారికి ఏది నచ్చుతుందో, ఏది వారు అభిలషిస్తారో – ఆ కోణంలో ఆలోచించి, వారికి నచ్చే విధంగా చెబుతూ – ఆ చెప్పడంలోనే పిల్లల మానసిక వికాసానికీ, వ్యక్తిత్వ పురోగతికీ కృషిచేసిన నిజమైన బాలసాహితీవేత్తలు రేడియో అన్నయ్య, అక్కయ్యలు. పిల్లల్లోని సృజనాత్మకతను వారిచేతనే కథలుగా, కవితలుగా, బొమ్మలుగా వెలువరించడానికి దోహదం చేస్తూ, వారికి నచ్చే, వారు మెచ్చే సాహిత్యాన్ని – 'బాల' పత్రిక ద్వారా అందించిన, పిల్లలకే స్వరాజ్యం తెచ్చి పెట్టిన అలుపెరుగని బాలానందసంఘ యోధులు వారు.

బాలన్నయ్య – న్యాయపతి రాఘవరావు. అక్కయ్య – న్యాయపతి కామేశ్వరి. గేయాలు, గేయకథలు, కథలు, పాటలు, నాటికలు... ఇలా ఒకటేమిటి! బాలసాహిత్యానికి వారు అందించిన సాహిత్యసంపద అపారం. రేడియోలో పిల్లల కార్యక్రమాల ద్వారా, ఆంధ్ర బాలానందసంఘం కార్యక్రమాల ద్వారా, 'బాల' పిల్లల మాసపత్రికద్వారా బాలప్రపంచానికి వారు అందించిన సేవ, బాలసాహిత్యానికి చేసిన కృషి నిత్యస్మరణీయాలు.

ఇవాళ్టి సమాజంలో, సాహిత్య కళారంగాలలో ప్రముఖులైన ఎందరికో వారి బాల్యంలో స్ఫూర్తినీ, దోహదాన్నీ కలిగించి, వారి వ్యక్తిత్వ నిర్మాణానికి హేతువులు, సేతువులు అయినారు ఈ దంపతులు. పిల్లలకోసం జీవితాల్ని అంకితం చేసిన మహనీయమూర్తులు. ఒక తరాన్ని ఎంతో ప్రభావితం చేసిన వారి రచనలు తరతరాల పిల్లలకూ అందించవలసిన పెన్నిధులు.

ఈ సంపుటి బాలన్నయ్య, బాలక్కయ్య రచించిన అలాంటి మంచి రచనల సమాహారం. మీరు మీ పిల్లలకూ, మీ పిల్లలు వారి పిల్లలకూ అందించి చదివించవలసిన విలువైన పుస్తకం ఇది. బాలసాహిత్య సరస్వతి హృదయాన్ని అలంకరించి, ఆనందింపచేసే సువర్ణకంఠాభరణం.

*మార్చి 2005*




# సామెత - భాషకు ఆమెత

## ప్రజాసూక్తం - యువభారతి

"A proverb is a short, generally known sentence of folk which contains wisdom, truth, morals and traditional views in a metaphorical, fixed and memorizable form and which is handed down from generation to generation. ***-Wolfgang mider***

ఏదో సామెత చెప్పినట్లు... అంటూ సంభాషణలో సామెత ఏదో గుర్తురాకపోయినా, దానికిగల ఉపబలకాన్ని ఆధారం చేసుకొని ఉటంకించేవారిని చూస్తూనే వుంటాం. ముఖ్యంగా పెద్దల మాటల్లో సామెతలు దొర్లుతుంటాయి. సామెత ఏదో ఒకటి ఉటంకించకుండా మాట్లాడలేని నైజంగలవారూ కొందరుంటారు. అయితే తెలుగు భాష అస్తిత్వమే ప్రశ్నార్థక మవుతున్న ఈనాడు- భాషలోని ఈ సంపద గురించిన అవగాహన వున్నవారూ, సామెతలను ఉదాహరించి మాట్లాడేవారు క్రమంగా మరుగవుతున్నారు కూడాను.

సంస్కృతంలో లోకోక్తులు, న్యాయములు అనేవే తెలుగులో సామెతలుగా వ్యవహృత మవుతూ వచ్చాయి. విశేష లోకానుభవంతో రూపొందినవే సామెతలు. ఇవి ఎవరో ఒకరు కూచుని రాసినవో, సృజించినవో కావు. జనుల ఆచారవ్యవహారాలు, సాంఘికాది పరిస్థితులు, అనుభవమనోభావాలు ప్రకటించేలా తక్కువపదాలలో విశేషార్థస్ఫోరకంగా నీతి బోధకంగానూ, కొండొకచో హాస్యఫణితిలో కూడా, తరతరాలుగా ప్రాపంచిక విజ్ఞానాన్ని కూడా అభివృద్ధి పరుస్తూ, సామెతలు శోభిల్లుతూ వున్నాయి.

'తెలుగు సామెతలు' సముద్రంలా అంతులేనన్ని వున్నాయి. కొందరిని కదిలిస్తే 'సామెతలపుట్ట' అన్నట్లుండేవారు. ముఖ్యంగా సామెతలు స్త్రీలు వాడడం- అందునా అమ్మమ్మలు, నాయనమ్మల వంటివారు ఉపయుక్తం చేయడం ఎక్కువగా వుండేది. ఎక్కువ చదువుకోకపోయినా, జీవితానుభవం నుండి వారు ఉదాహరించే సామెతలు వారి జ్ఞానానికీ, తెలివికీ దాఖలాగా వుండేవి. "A proverb is the wit of one and the wisdom of many అనే మాట కూడా వుంది. - సామెతలు అన్ని దేశాల్లోనూ, అన్ని భాషల్లోనూ వున్నాయి. ఇవి ఒక జాతి నాగరికతా సంకేతాలుగా కూడా పరిఢవిల్లేవే. జీవితపు బహుముఖీన పార్శ్వాలు వీటిలో ప్రతిబింబిత మవుతూ, పండిత పామరులందరికీ చెందినవిగా ఆబాలగోపాలం వ్యవహరించుకునేవిగా రాణిస్తుంటాయి.

భాషలోని గొప్ప సొగసు అయిన ఈ సామెతల సంపదను ఈతరం కోల్పోకుండా అందిపుచ్చుకోవలసిన అవసరం వుంది. ఇవి ప్రజాసూక్తాలు కనుక- అందరిసొత్తు! సహజంగా, సరళంగా, సుందరంగా, సంక్షిప్తంగా, శబ్దార్థసౌందర్యంతో భాసించే సామెతలు సంభాషణా కళకు, ప్రసంగకళకు ఎంతో వన్నె చేకూరుస్తాయి. ఇవాళ 'యాంకరింగ్' చేసేవారికి సమయోచితంగా ఈ సామెతలు ప్రయోగించే నేర్పు కూడా అబ్బితే, బంగారానికి తావి అబ్బినట్లే!

యువభారతి 1973లో 'ప్రజాసూక్తం' పేరిట నాటి ప్రధాన సంపాదకులు డా॥ జి.వి.సుబ్రహ్మణ్యంగారి నేతృత్వంలో ప్రచురించిన ఈ సామెతల చిరుసంకలనం ఇప్పటికి నాలుగు ముద్రణలు పొంది, పదిహేనువేల ప్రతులు ముప్ఫైఏళ్ల క్రితమే అమ్ముడుపోయింది. ముప్ఫైఏళ్ల తరువాత ఇప్పుడీ అయిదవ ముద్రణకు మా యువభారతీయుడు శ్రీ అశ్వినీకుమార్ సంకల్పం హేతువయ్యింది. తన సత్సంకల్పానికి కృతజ్ఞతాభివందనాలు చెప్పక తప్పదు. అమృతగుళికల వంటి ఈ 'ప్రజాసూక్తం' నేటి యువతరానికి ప్రయోజనదాయకం కావాలనేది మా ఆకాంక్ష. సంభాషణల్లో, వేదికలపై ప్రసంగాల్లో, కార్యక్రమ వ్యాఖ్యానాల్లో, రచనల్లో వీటిని సందర్భోచితంగా ప్రయోగించుకుంటే- వ్యక్తిత్వ వికాసానికీ ఎంతగానో దోహదంగా వుంటాయి.

పౌరాణిక గాథా సంబంధులుగా, వ్యావసాయక సంబంధులుగా, నీతి బోధకాలుగా, వివాహాది సాంఘికాచారాల సంబంధులుగా, కథాంశాలుగా, లోకానుభవ, లోకజ్ఞానావబోధకాలుగా, సామాజిక వైఖరుల ప్రతిబింబాలుగా... ఇలా సామెతలు సర్వవిషయ సంగ్రహాలుగా భాసించేవిగా వున్నాయి. అకారాది క్రమంలో కూర్చిన, ఎంపిక చేసిన తెలుగు సామెతలు ఈ 'ప్రజాసూక్తం'. భాషాసౌందర్యంతో, అనుభవసారంతో ప్రజల భాషలో దీపిస్తూండేవి ఈ సామెతలన్నీ. 'మాటకు సామెత- ఇంటికి ఆమెత' అంటారు. నిజంగా భాషకు ఇది ఒక 'ఆమెత'. అనగా విందు. ప్రసంగాలకు పసందు. పదాల కూర్పులోని ఒక పొందిక, ఒక లయ, సామెతను శ్రవణానందకారకం చేస్తూంటుంది. కటువైన విషయాన్నయినా సామెతల ద్వారా సామరస్యంగా చెప్పగలం. తన బలహీనవాదానికి సామెత ద్వారా తరతరాల అనుభవాన్ని జోడించిన బలం పొందే వీలుంటుంది. సంభాషణకు ఒక చైతన్యాన్నీ, ప్రసంగానికి ఒక రక్తినీ సమకూరుస్తాయి. భాషా సాహిత్యాల అధ్యయనానికీ, పునరుజ్జీవనానికి సామెతలు ఆసక్తిదాయకమైన అంశాలు. జనజీవితానికి వున్న వైవిధ్యమంతా వీటిల్లో వుంటుంది. కనుకనే, ప్రపంచమంతటా అన్ని భాషల్లో సామెతలున్నాయి.

అల్బేనియా, ఆఫ్ఘన్, ఆఫ్రికా, చైనా, ఇథియోపియా, గ్రీక్, గుయానీస్, ఇరానియన్, ఇటాలియన్, లెబనాన్, ఉగాండా, మాసాయి, మాల్టా, రష్యన్, సమోవా, సెర్బియా, టర్కిష్, ఉజ్బెక్ దేశాలన్నీ సామెతల సంపత్తి కలిగినవే. అలాగే బెంగాలీ, తమిళ, కన్నడ, తుళు, మళయాళ వంటి భారతీయ భాషల్లోని సామెతలు పరిశీలించినప్పుడు, తెలుగుతో సమానార్థకాలున్న అనేక సామెతలు గోచరిస్తాయి. నిడదవోలు వేంకటరావుగారి సంపాదకత్వంలో 1950 ప్రాంతాల్లోనే 'సాటి సామెతలు' అనే సంకలనం అటువంటిది వెలువడింది. 'లోకోక్తి ముక్తావళి' పేరిట తెలుగు సామెతలు విద్వాన్ పి. కృష్ణమూర్తి వెలువరించారు. వావిళ్లవారు 1955లో కెప్టెన్ ఎం.డబ్ల్యు. కార్ కూర్చిన 'తెలుగు సామెతలు' ప్రచురించారు. దివాకర్ల వేంకటావధాని, పి.యశోదారెడ్డి, మరుపూరి కోదండరామిరెడ్డిగారలు కూర్చిన 'తెలుగు సామెతలు' మూడవ కూర్పు పునర్ముద్రణ 1986లో తెలుగు విశ్వవిద్యాలయం వెలువరించింది. శ్రీ పి. రాజేశ్వరరావు, గీతిక శ్రీనివాస్,

రెంటాల గోపాలకృష్ణగారలు కూర్చిన 'తెలుగు సామెతలు' పుస్తకాలున్నాయి. 'సామెతలు', 'ఆంధ్రలోకోక్తి చంద్రిక' వంటి పురాతన సంకలనాలూ సరే! ఈ ఉటంకింపులు ఎందుకంటే మా ఈ 'ప్రజాసూక్తం' కలిగించే స్ఫూర్తితో, ఆసక్తి కలిగిన పాఠకులు ఆ వనరులు కూడా అన్వేషించి అందుకోవచ్చుననే.

యువభారతి అయిదవ ముద్రణగా వెలువడుతున్న ఈ 'ప్రజాసూక్తం' సామెతల సంకలనంగా ఒక కరదీపిక. విద్యార్థులు, యువకులు, ముఖ్యంగా నేటి మీడియారంగంలోని యాంకర్లు, సభాకార్యక్రమాల వ్యాఖ్యాతలు, భాషా సాహిత్యాభిమానులు ఈ చిరుపొత్తాన్ని ఆత్మీయంగా తమ గుండెలకు హత్తుకుని ప్రయోజనం పొందగలరని ఆకాంక్షిస్తున్నాం. సామెతల సంపదను సదా పరిరక్షించుకుంటే- ఆరుద్ర గారన్నట్లు తప్పక "తెలుగు మాట్లాడే దీపాలు- తెల్లవార్లూ వెలుగుతూనే వుంటాయి".

*23 మార్చి 2012*



# ఆప్తవాక్యం

## వ్యక్తిత్వ వికాసం – (సూత్రాలు, సూక్తులు) – యువభారతి

"మాటకు విలువతెచ్చేది – అది మనసులో నాటుకునేదిగా ఉండే తీరే. సంభాషణ అనేది ఒక యజ్ఞంలాంటిదయితే, ఆ యజ్ఞంలో 'దక్షిణ'గా పనికివచ్చేది – 'సూక్తి అనే సొమ్మే' అంటుంది పంచతంత్రం.

*"సుభాషితమయ ద్రవ్య సంగ్రహం న కరోతి యః*
*సతు ప్రస్తావయజ్ఞేషు కాం ప్రదాస్యతి దక్షిణామ్?"*

అంటూ సుభాషితాలనే విలువైన ద్రవ్యం సేకరించుకోకుండా, సంభాషణాయజ్ఞాన్ని దక్షిణగా ఏమిచ్చి నిర్వర్తించగలవని ప్రశ్నిస్తుంది మిత్రసంప్రాప్తి. మంచిని ఆచరించే వారు లేక లోకం చెడిపోతోందంటే నిజమేకానీ, రానురాను మంచిని చెప్పేవారు కూడా కరువవుతున్నారు. అంతా యథాలాప జీవులుగా మారుతూంటే సూక్తి సుధలు పంచేవారు మాత్రం ఎక్కడుంటారు?

ఇవాళ తీరు మరీ మారింది. ఒక మాట –అది నీతివాక్యంగానో, ధర్మపన్నగానో తోచిందో – దానిని ఛాందసంగానో, త్రేతాయుగం పలుకుగానో జమకట్టేసి పదపదమంటున్నారు కొందరు యువత. వ్యక్తిత్వ వికాసం అన్నది ప్రచలితమౌతూనే వుంది కానీ, దానికి 'మూలాధారనాడి' – విలువలతో కూడిన మాట, పలుకు అనేది కూడా ముఖ్యంగా గ్రహించుకోగలగాలి! నీతివాక్యాలు, బోధనలు అని కాకుండా, నిత్య జీవన సరళికి ప్రాధమికంగా ఉపయుక్తం అవుతూ, తనను వికాసశీలి గానూ, ఆశాజీవిగానూ, ఆచరణలో విజేతగానూ నిలిపే అంశాలేమిటో అన్న 'కెరీర్' పురోగమన స్పృహ ఈ తరానికి వుంది. అందుకే

నేటి యువత వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే క్రమంలో, వారికి ఇవాళ వెన్నుదన్నుగా నిలిచి, మనోబుద్ధి వికాసాన్ని అందించేవీ, ఎదను తాకి ప్రమత్తులుగా వుంచేవీ, అయిన అంశాలు తెలియచేయవలసి వుంది.

పెద్దలు, మహనీయులు, ప్రవక్తలు ఎందరో చెప్పిన అంశాల నుంచి నేటి యువతకు నచ్చేవి, వారిని కర్తవ్యోన్ముఖులను కావించగలిగేవి అయిన అంశాలను గ్రంథస్థం చేయాల్సిన అవసరం ఎంతయినా వుందంటూ, యువశక్తిని నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దే కృషి చేస్తున్న నిరంతర చైతన్యశీలి ఆచార్య వంగపల్లి విశ్వనాథం గారు ఆంగ్లంలో సేకరించిన విలువైన విషయాలను, మిత్రుడు డాక్టర్ నాగినేని భాస్కరరావు తెలుగుచేసి సంకలనం చేసిన ఈ పుస్తకం వ్యక్తిత్వ వికాస గ్రంథాలలో అదనంగా చేర్చదగిన ఒక విలువైన కరదీపిక, భాషకన్నా భావం ముఖ్యం. ఆ భావం ఎదను కదలించగల స్థాయిని బట్టే ప్రభావం వుంటుంది. ఇందులో సేకరించి, వివరించిన అంశాలన్నీ దైనందిన జీవితంలో అందరికీ పనికివచ్చేవి. అడుగంటి పోతున్న మానవీయ విలువలను ప్రోదిచేసి మనుగడను వికాసవంతం చేసేవే. ఈ పుస్తకం దివంగత మిత్రుడు కె.వి. కామేశ్వరరావుకు అంకితం ఇవ్వడం సదాశయానికి సదాచరణనుజోడించడం ముఖ్యమని నిరూపించడమే.

ఈ పుస్తకంలోనివి వట్టి నీతులు, సూక్తులు మాత్రమే కావు, జీవితాన్ని నలుగురూ మెచ్చే రీతిలో ‘తీరు’గా మలచుకునేందుకు కచ్చితంగా పనికివచ్చే మార్గదర్శక సూత్రాలు. అన్నీ కాకపోయినా కొన్నింటినయినా జీర్ణించుకుని, తదనుగుణంగా అనుష్ఠించగలిగితే, ఆచరించగలిగితే, తమలో వచ్చిన మార్పేమిటో తామే స్వయంగా చదువరులు గ్రహించు కోగలగుతారు. ఎప్పుడు, ఎటువంటి సమయంలోనైనా సరే, పుస్తకం తీసుకుని ఏదో ఒక పేజీ తిప్పి ఏదో ఒక విషయాన్ని చదవండి. అది మీకు ఎలా మీ ఆలోచనలపై, మనస్సుపై సం‘చలనం’ కలిగించగలదో మీరే గ్రహించగలుగుతారు. ఎవరి కయినా ఒక మంచికానుక ఇవ్వాలనిపించినప్పుడు కూడా ఈ పుస్తకం మీరు నిర్భయంగా ఇవ్వవచ్చు.

ఇలాంటి పుస్తకాలను అందిస్తున్న యువభారతిని సదా సమాదరించండి. వ్యక్తిత్వ వికాసంతో జీవిత మాధుర్యాలను అనుభవించండి. మానవీయ విలువలతో మనుగడను ఫలప్రదం చేసుకోండి. ఇది నీతి సూక్తమో ధర్మపన్నాో కాదు. ఆప్తవాక్యం మాత్రమే.

*03 జూన్ 2012*



# సద్భావన

## భావన - (సుభాషితాల సంకలనం) - యువభారతి

"ఒక కష్టంలోనో, దుఃఖంలోనో వున్నప్పుడు ఒక మంచిమాట అనునయించి సేదతీరుస్తుంది. ఉదాసీనత నుండి ఉత్సాహం వైపుకి, ఉత్సాహం నుండి ఆశ వైపుకి, అశ నుండి ఆచరణకు నడిపిస్తుంది. సంతోషంగా వున్నప్పుడు పంచుకునే మంచిమాటలకీ, సంతోషం వైపు నడిపించే మంచిమాటలకీ రెండింటికీ ప్రాధాన్యము వుంది. .

మంచి ఎక్కడున్నా గ్రహించాలన్నదే మానవీయ విలువల దృష్ట్యా అభిమతం. మంచి చెప్పేవారు లేక కాదు, అనుష్ఠించేవారు లేక లోకం పాడైపోతోందంటారు కానీ, నిజానికి రానురాను మంచి చెప్పేవారూ కరువవుతున్నారు. సాహిత్యం, కళలు విస్మృతిలోకి నెట్టివేయబడుతూ మానవసంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలవుతున్నప్పుడు ఉదాత్త విలువలన్నీ క్రమేపీ కనుమరుగు అయ్యే విషాదస్థితి సంభవించే ప్రమాదం వుంది.

ప్రపంచానికంతటికీ ఉదాత్త విలువలనూ, మానవ జీవన సంస్కారాన్నీ ప్రోదిచేసిన మహోన్నత సంస్కృతి మనదేశానిది. మన సంస్కృత సాహిత్యం మొదలుకుని అంటే వేదాల నుంచి నేటిదాకా కూడా మన కవులు, రచయితలు, ఆధ్యాత్మిక గురువులు, సామాజిక చైతన్యం తెచ్చిన ఎందరో మహనీయులు ప్రవచించిన సూక్తిసుధలు అనేకం. ఒక సూక్తి జీవితాన్ని నిలబెట్టిన కథనాలూ

మనకున్నాయి. దేశకాలావధుల నధిగమించి ఎక్కడ ఏ మహనీయుడు ఎప్పుడు ఏ సందర్భంలో ఎవరికి ఎలా ఎందుకు చెప్పిన విషయమయినా అది పదిమందికీ పనికివచ్చే సూక్తి అయినప్పుడు అందిపుచ్చుకుని గుండెల కద్దుకునే నైజమే ఎవరి వ్యక్తిత్వ వికాసానికయినా ఒక అపురూప సంపద. సూక్తులు ఏవయినా అక్షరసత్యాలు. అవి మహనీయుల అనుభవసారాలు. అధ్యయన దీపాలు. వాంఛనీయమూ, ఆచరణీయమూ, సమాజ శ్రేయోదాయకమూ అయిన విషయాలు.

"చుట్టూరా ఆవరించి వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కంటే ప్రయత్నించి ఎంత చిన్న దీపాన్నయినా వెలిగించడం మంచిది" అన్న సూక్తియే యువభారతి సంస్థకు ప్రేరణాత్మక సూక్తి.

***"చెలిమియుఁ బగయును, దెలివియుఁ***
***గలకయు, ధర్మంబుఁ బాపగతియును బెంపుం***
***దులువతనంబునన వచ్చును***
***బలుకుబడిన, కానఁ బొసగఁ బలుకగవలయున్"***

స్నేహమైనా, పగ అయినా, తెలివి అయినా, మనసు కలత అయినా, ధర్మవర్తనమయినా, పాపపు చింతన అయినా, ఔన్నత్యమయినా, తుంటరితనమైనా మాట తీరును బట్టే వస్తాయి, బయటపడతాయి. అందువల్ల పద్ధతిగా మాట్లాడాలి అన్నది చాలా ప్రధానమయిన విషయం. మనిషి తీరుకు మూలం అతని మాటల అభివ్యక్తియే! మన ప్రాచీన మహర్షుల నుండి నేటి కాలం కవులు, రచయితల వరకు అలాగే దేశవిదేశాలలోని ఖ్యాతికెక్కిన ఎందరో మహనీయులు సందర్భవశాత్తూ ప్రవచించిన మంచి మాటలు అనేకం. సద్భావన విలసితాలయిన అలాంటి భాషితాలు అందిపుచ్చుకుంటే మన వ్యాసానికీ, ఉపన్యాసానికే కాదు జీవితంలోనూ ఉపయుక్తం చేసుకుని బ్రతుకును వికాసవంతం చేసుకోవచ్చు, చేయవచ్చు.

యువభారతి పునర్ముద్రణగా వెలువడుతున్న ఈ 'భావన' ఎందరో ప్రముఖుల ప్రవచనాల్లోంచి, గ్రంథాలనుంచీ సేకరించిన సూక్తి సుధలు.

మహనీయుల ఈ మహితోక్తులు అన్నీ ఆలోచనామృతాలే. ఉద్గ్రంథాలు చేయలేని పని ఒక్కొక్కసారి నాలుగు పంక్తుల, నాలుగు పదాల వాక్యం చేయగలుగుతుంది. అక్షరక్రమంలో ఇందులోని మంచిమాటలను కూర్చడం జరిగింది. మీరు ఎలాంటి సందర్భంలోనయినా పుస్తకంలోని ఏపేజీ అయినా తెరిచి ఏ వాక్యాలనయినా చదవండి. మీ మనసుకు భావనా పరీమళం సోకుతుంది. అది మిమ్ములను సేదతీర్చవచ్చు, సంతోషపెట్టవచ్చు, కర్తవ్యోన్ముఖం చేయవచ్చు. మీ సాటివారికి తోడ్పడేందుకు ఉపయుక్తమైనా కావచ్చు. ఇది మీ దగ్గర వుండవలసిన పుస్తకం మటుకేకాదు. మీరు మీ వాళ్లనుకున్న వాళ్ళందరికీ కానుకగా ఇవ్వదగిన పుస్తకం. ప్రతి ఇంటా ఉండదగిన ఇలాంటి చిన్నసూక్తులు, సుభాషితాల పుస్తకం ఉపయోగం గురించి 1796లోనే ప్రిన్స్ ఛార్లెస్-జోసెఫ్ డి లిగ్నె ఓ మాట అన్నాడు -

The only way to read a book of aphorisms without being bored is to open it at random and having found something that interests you, close the book and meditate.

అందుచేత మనలోకి మనం తొంగిచూసుకుని ఇంత మౌనానికీ, ఇంత ధ్యానానికీ చోటిచ్చి, మన వ్యక్తిత్వాన్ని వికసింపచేసి జీవితాన్ని రాణింపచేసే 'భావన' ఏదయినా సమాదరణీయం. ఔనుకదా!

*6 ఆగస్టు 2012*




# స్వరబేహారులు

## వాచస్పతి – (ఆకాశవాణి కళాకారుల పరిచయ గ్రంథం)

డైరెక్టర్ జనరల్ స్థాయి హోదాలో వున్న ఓ అధికారి ఫస్ట్‌క్లాస్‌లో రైల్లో ప్రయాణం చేస్తున్నాడు ప్రయాణంలో పక్కనున్న పెద్దమనిషితో మాటలు కలిసాయి. ఆ పెద్దమనిషి ఈ అధికారిని – "మీరేం చేస్తూంటారు" అని అడిగాడు. ఆకాశవాణిలో తన హోదా చెప్పాడు ఈ అధికారి. అతగాడు అది విని – "ఇంతకీ మీకు అనౌన్సర్‌గా ప్రమోషన్ రావడానికి ఎన్నాళ్లుపడుతుంది" అని అడిగాడట!

అనౌన్సర్స్‌కున్న ప్రాచుర్యం అటువంటిది. శ్రోతలకు పరిచితమయ్యే కంఠాలు వారివే. శ్రోతల కోసం రేడియోలో ఏ కార్యక్రమము రూపొందించినా అనౌన్సర్ బూత్ నుంచి నిర్దేశిత సమయానికి ఆ కార్యక్రమం గురించి ప్రకటించి, దానిని వినిపించి, చివర్లో 'ఫలానా కార్యక్రమం విన్నారు' అని ఆ వివరాలను చెప్పి తరువాతి కార్యక్రమం వైపు శ్రోతలను విన సంసిద్ధులను చేసేదీ అనౌన్సర్లే!

కార్యక్రమం ముందు వెనుకల వాటి వివరాలను చెప్పడం మాత్రమే వారి పని అయితే, కార్యక్రమం రూపొందించినవారు రాసి అందించిన వివరాలను చిలకపలుకుల్లా వల్లించడం మాత్రమే వారి పని అయితే అనౌన్సర్లు "అనవసరులే" అవుతారు! కార్యక్రమం రూపొందించినవారే ఆ వివరాలనూ తామే తమ గొంతుకతోనూ ప్రకటించవచ్చు. ఒక ప్రసారం చేసే కార్యక్రమాన్ని వినేందుకు శ్రోతలను ఆసక్తిగా సంసిద్ధులను చేసి వినిపించే ఆకర్షక శక్తివుండే గళాలు

వారివి! తమ కంఠస్వరంతో రేడియోను లక్షలాది శ్రోతలకు ఆత్మీయం చేసే అపురూప నైపుణ్యం వారిసొంతం! ఒక కార్యక్రమాన్ని అది చప్పటిదే అయినా చవులూరించేదిగా తమ గళంతో ప్రవేశపెట్టగల ప్రజ్ఞ, ఎంతగొప్ప కార్యక్రమమైనా చప్పటిదేమో అనిపించేలా తేల్చిపారేయగల ఉదాసీనత రెండూ వారివారి గళాలననుసరించే మరి!

ఆకట్టుకునే అందమైన కంఠస్వరం, సమయస్ఫూర్తి, శ్రోతలకు ఒక ఆత్మీయతా భావన, కార్యక్రమాన్ని గొప్పగా ప్రెజెంట్ చేయగలగడం వారిమీదే ఆధారపడి వుంటుంది.

ఒక పాటో, ప్రసంగమో, నాటకమో విన్నవెంటనే 'ఎంతమంచి ప్రోగ్రాం వినిపించార్రా' అనో, 'చాల్లేవోయ్! ఇదీ ప్రోగ్రామే' అనో- ప్రశంసించినా, విమర్శించినా ముందు అది శ్రోతలు అనౌన్సర్స్ ను ఉద్దేశించే అభివ్యక్తీకరిస్తారు.

ఉత్పత్తి చేసిన వస్తువుకు దానిని వినిమయ దారుడికి అందించడానికి దాని ప్యాకేజీ గురించో, రేపర్ గురించో అది అత్యంత ఆకర్షణీయంగా వస్తువుపట్ల ఇష్టాన్ని పెంచేదిగా ఉండేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవలసిన ఆగత్యం వుందో అలాగే రేడియో కార్యక్రమాల ప్రసారానికి ఆకర్షక అగత్యం అనౌన్సర్! ఎలా 'అనవసర' మనగలరు ఎవరైనా? గొంతు అమ్ముకుని కాదు నమ్ముకుని గొంతెట్టుకు బ్రతికేవాళ్లే!!

అనౌన్సర్ ప్రోడక్ట్ ప్రమోట్ చేసే ఓ సేల్స్‌మెనో, అందమైన సేల్స్ గర్ల్ మటుకే కాదు, నాందీ ప్రస్తావనలతో తన వ్యాఖ్యానంతో ఒక్కొక్కసారి పొరబాట్లను కప్పిపుచ్చి నాణ్యతను పెంచేలాగా, ఒక్కోసారి తన ప్రమేయం లేకుండా జరిగిన వాటికి కూడా శ్రోతలచే సత్వరం ప్రశంసలో, నిందలో పొందుతుండడం జరుగుతుంటుంది. అనౌన్సర్, కాంపీర్, డ్రామావాయిస్, న్యూస్ రీడర్, యాంకర్ ఏ పేరపిలిచినా స్వరసంచారులువారు.

గ్రామ్‌ఫోన్ రికార్డు మీద గాయకుడి పేరు జి.వి.రావు అని ముద్రించి వుంటే - ఫలానా సినిమా నుండి ఇప్పుడు జి.వి.రావు పాడిన పాట అని ప్రకటించి, పాట వినిపించే అనౌన్సర్లూ వుంటారు. జి.వి.రావు అని వున్నా అది పాడింది ఘంటసాల వెంకటేశ్వర రావు అని తెలిసి, శ్రోతలకు పరిచితమైన గాయకుని పేరుగానే ప్రకటించి, ఆ ఘంటసాలపాట వినిపించే అనౌన్సర్లూ

వుంటారు. అనౌన్సర్లకు రేడియో కార్యక్రమాలన్నింటికీ చెందిన ప్రాథమిక విషయ పరిజ్ఞానం అత్యవసరం. మార్కెట్ ధరలు చదివినా, గాంధీమార్గం వినిపించినా, ఓ సంగీత కార్యక్రమం వినిపించినా, నాటకం ప్రసారం చేస్తున్నా, బడ్జెట్ మీద ఓ చర్చను వినిపిస్తున్నా, పిల్లల కార్యక్రమమో, మహిళల కార్యక్రమమో వినిపిస్తున్నా, వార్తా విషయక కార్యక్రమం ప్రసారం చేస్తున్నా ఆయా కార్యక్రమాల గురించిన మౌలిక పరిచితివుండి తీరాలి! కర్ణాటక సంగీత రాగాలు, తాళాలు, కళాకారులు, వాద్యాలు, కృతులు, వాటి కర్తల గురించి తెలిసివుండి ప్రసారం చేయడానికీ, కార్యక్రమ నిర్వహణాధికారులో, ప్రొడ్యూసర్లో రాసిచ్చినదేదో వట్టినే చెప్పి ప్రసారం చేయడానికి బోలెడు తేడా వుంటుంది.

పైగా ప్రసారం చేస్తున్న ప్రతి కార్యక్రమంలోనూ అనౌన్సర్ కు అటాచ్ మెంట్ వున్నట్లు శ్రోతకు స్ఫురింపజేసేలా సాన్నిహిత్యం, ఆత్మీయత, ఆకట్టుకునే ధోరణి వ్యక్తీకరించాలి. మరి నిజంగా అంత సమర్థత, సమయజ్ఞత, గళమాధుర్యం, విషయపరిజ్ఞానం ఆకాశవాణి అనౌన్సర్లకు వున్నాయా అంటే శ్రోతృజన ప్రపంచంలో ఆకాశవాణికి ఏర్పడిన ప్రాచుర్యం, ప్రాముఖ్యం, ఇష్టాయిష్టాలే ప్రబలనిదర్శనాలు!!

మద్రాసు కేంద్రంలో తొలితెలుగు అనౌన్సర్ మల్లంపల్లి ఉమామహేశ్వర రావు గారితో మొదలిడి నేటిదాకా వున్న వందలాది అనౌన్సర్లూ ప్రస్తుతం క్యాజువల్ బేసిస్ మీద పనిచేస్తున్న అనౌన్సర్లూ అందరిలో ఎవరి గళం, ఎవరి ప్రజ్ఞ, ఎవరి విశిష్టత వారిదే.

కేవలం కార్యక్రమ ప్రసారాల ముందువెనుకల్లోనో, ఆహూతుల సమక్షాన జరిగే కార్యక్రమాల ప్రకటనతోనో వారిపాత్ర పరిమితమై వుంటే ఇంతలా చెప్పుకునేదేమీ వుండదు! వారిలో ఎందరో ప్రతిభావంతులు, సృజనశీలురు, కవులు, రచయితలు, నటులు, గాయకులు వివిధ కళారంగ నిష్ణాతులు వున్నారు.

సంస్థ వల్ల ప్రాచుర్యం పొందినవారు కొందరయితే, తమవల్ల సంస్థకు ప్రాముఖ్యం పెంచినవారు మరికొందరు. తమ స్వరాలతో ఎక్కడెక్కడి మారుమూల గ్రామాల్లోని నిరక్షరాస్యుల హృదయాల్లోకి కూడా ఆత్మీయంగా చొచ్చుకుపోయి, తమ గళపరిచితి వల్ల ప్రశస్తులు, ప్రఖ్యాతులు ఆయిన వారెందరో వున్నారు. అదీ ఆకాశవాణి అనౌన్సర్ల ఘనత!

1978 జూన్ 1న ఆకాశవాణి హైదరాబాద్ వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగంలో ట్రాన్స్ మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా చేరిన మీ సుధామ 1982లో ప్రధాన హైదరాబాద్ కేంద్రానికి బదిలీ అయి, ఆ తరువాత కార్యక్రమ నిర్వహణాధికారిగా 1991లో పదోన్నతి పొంది, విజయవాడ కేంద్రంలో 1995 ఆగస్టు వరకూ పనిచేసి తిరిగి హైదరాబాద్ కేంద్రానికి వచ్చి తెలుగు విభాగంలోనూ, పెక్స్ కోగానూ పనిచేసాడు. 2005లో వరంగల్ వెళ్లటం, తిరిగి 2006లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వివిధ భారతి వాణిజ్యప్రసార విభాగానికి రావడం జరిగింది. 2011 నవంబర్ వరకూ సర్వీస్ వున్నా కూడా, సి.బి.ఎస్.లో ఉన్నప్పుడే 30 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకుని 2008 ఆగస్టు ఒకటిన స్వచ్ఛంద పదవీ విరమణ చేసాను.

నేను ఆకాశవాణిలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా చేసిన పదమూడేళ్లూ అనౌన్సర్లతో ప్రత్యక్ష దైనందిన సంబంధమే! షిఫ్ట్ డ్యూటీల్లో పనిచేసే ఉద్యోగాలవి. నా ఉద్యోగం అనౌన్సర్ ఉద్యోగం కాకపోయినా కార్యక్రమాల్లో నా ఇన్వాల్మెంట్ వల్ల నా గళంతో శ్రోతలకు నా రచనలతో బాటుగా నేను సుపరిచితుడనయ్యాను. జీవితంలో, కుటుంబంలో ఎన్ని సాధకబాధకాలూ, కష్టసుఖాలువున్నా డ్యూటీలో మైక్ ముందుకు వచ్చేసరికి అనౌన్సర్ గళంలో ఆ చింతలు, చికాకులు ఏవీ ప్రతిఫలించకూడదు! ఎట్టి పరిస్థితుల్లోనైనా ఆ గళం వినగానే శ్రోతలకు ఆత్మీయం, ఆనందం, ఆకర్షణ కలగాలి. డ్యూటీ ఆఫీసర్ గా అనౌన్సర్లను మంచిమూడ్స్‌లో వుంచగలగడం కూడా ఒక బాధ్యతగా, శ్రోతలకు చేయగల న్యాయంగా, భావించి పనిచేసినందు వలననే ప్రసారాల సమయంలో వచ్చే ఒత్తిడులు ఎన్నిటినో సమర్థంగా తట్టుకుని, పొరబాట్లు జరగకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవడం మాకు సాధ్యమయ్యేది. ఒక నిష్ఠగా, శ్రద్ధగా పనిచేసే అనౌన్సర్లు మైకు ముందుకు వెళ్లేముందు అనౌన్స్‌మెంట్స్ రాసుకోవడం, వాటిని పరస్పరం పరిశీలించుకోవడం, ప్రసార సామగ్రినంతా ముందే సంసిద్ధం చేసి దగ్గర వుంచుకోవడం ఒక క్రమశిక్షణతో చేసే ధోరణి వుండడం వలన, అనుకోకుండా వచ్చే అవాంతరాలను ఆడుతూపాడుతూ అధిగమించగల స్థిరచిత్తం వుంటుంది.

వృత్తిని దైవంగా భావించడం, తమ ప్రవృత్తిని తదనుగుణంగా శ్రద్ధాభక్తులతో మలుచుకోవడం వున్నప్పుడు విజయాలు నల్లేరు మీద బండినడకలే! సృజనశీలురు ఒకచోట కలిసి పనిచేయడంలో ఈసునసూయలూ, కోపతాపాలూ, పోటాపోటీలు

అన్నీ సహజమే! అయితే అవి 'స్పర్థయావర్థతే విద్యా' అన్నట్లు ప్రతిభను ఉద్దీపనం చేసుకునేందుకు ఉపకరించేవిలా ఉండాలి, అవకాశాలు అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోగలగాలి. రేడియో కార్యక్రమాలకు జనాదరణ అధికంగా వుండడానికి కారణం... ఏదో ప్రత్యామ్నాయ మాధ్యమాలు లేకపోవడం కాదు, రేడియో కళాకారుల అందరి సమష్టి కృషి. నిజానికి అనౌన్సర్స్‌లో అద్భుత ప్రతిభామతులుండేవారు. వారి శక్తి యుక్తులు, సమయాలు రేడియో కార్యక్రమాలకే వెచ్చించేవారు. ఆకాశవాణి– ఉద్యోగికి జీతం మాత్రం ఇవ్వడం కాదు, గొప్ప కీర్తిని కూడా తెచ్చి పెట్టే సంస్థ. ఆ కీర్తి ప్రతిష్ఠలు తొలుతగా లభించేది అనౌన్సర్లకూ, స్టాఫ్ ఆర్టిస్ట్‌లకూ, కార్యక్రమ నిర్వాహకులకే.

నేను రేడియోలో చేరకముందు నుండే అంటే 1978 కన్నా ముందే దాదాపు ఎనిమిదేళ్లు క్యాజువల్‌గా పనిచేసిన కారణంగా శారదా శ్రీనివాసన్, జ్యోత్స్న, పండా శమంతకమణి, డి.వెంకట్రామయ్య, కపర్ది, ఆకెళ్ల సీతాదేవి, సత్యమూర్తి మొదలైన వారితో పరిచయాలుండేవి. వెంపటి రాధాకృష్ణ, నండూరి విఠల్ వంటివారినీ వట్టం సత్యనారాయణ, రతన్ ప్రసాద్‌నూ ఎరుగుదును! నా వాచికానికి స్ఫూర్తి మల్లాది నరసింహశాస్త్రిగారు. వేలూరి సహజానందగారు జాతీయ కవి సమ్మేళనానికి అనువాద కవితకు యువకునిగా నాకు అవకాశం ఇచ్చి, నా ఉచ్చారణ తీర్చిదిద్దడం గుర్తుంది! అంతకన్నా ముందు బాలానందం, బాలవినోదంలతో కూడా న్యాయపతిరాఘవరావు గారి ఆదరణ పొందిన వాడినే!

భాషకు, తెలుగు వ్యావహారిక వ్యాప్తికి ఆకాశవాణి చేసిన సేవలో ప్రథమగణ్యులు అనౌన్సర్లు, రేడియో వార్తలు చదివేవారే. ఖచ్చితమైన సమయం తెలుసుకోడానికి జనానికి రేడియో ఎలా మూలమైందో అలాగే భాషను వ్యావహారికంగా స్థిరీకరించడంలో కూడా విశిష్టమైన పాత్ర వహించింది. రేడియో వార్తలు వినీ, అనౌన్సర్ల గొంతులు వినీ, ఉచ్చారణలో స్పష్టతనూ, ఒక మాధుర్యాన్నీ, ఆత్మీయతనూ అలవరుచుకున్న జనావళి ఎందరో! అది అవిస్మరణీయం!

నా ముప్ఫై ఏళ్ల ఆకాశవాణి సర్వీసులో ఎందరో ఆనౌన్సర్లతో కలిసి పనిచేయడం జరిగింది. మా ముందే కొత్తతరం అనౌన్సర్లు రావడమూ జరిగింది. అద్భుత ప్రతిభతో రాణించినవారూ, కొత్త తరం అవకాశాలను అందిపుచ్చుకుని రాణిస్తున్న వారూ వున్నారు. 'పరిచయపత్రం' శ్రోతల ఉత్తరాలకు జవాబులు

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో నేను, జ్యోత్స్న ఆరేళ్లపాటు నిర్వహించాం! నేను విజయవాడలో కార్యక్రమ నిర్వహణాధికారిగా వున్నప్పుడు ఎస్.బి. శ్రీరామమూర్తి, పన్నాల సుబ్రహ్మణ్యభట్టు, మాడుగుల రామకృష్ణ వంటి వారితో, ఆంజనేయులు, వాసుదేవమూర్తి, పేరి కామేశ్వర్రావ్, కోకా సంజీవరావ్ వంటి పెద్దలతో రేడియో కార్యక్రమాల సేవల్లో భాగస్వామ్యం వహించడం జరిగింది.

ఎస్.బి. శ్రీరామమూర్తి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నప్పుడూ, భట్టు రిటైరయినప్పుడూ, హైదరాబాద్ కేంద్రంలో జ్యోత్స్న రిటైరయినప్పుడూ నా అనుభూతి స్పందనలను వారు అనౌన్సర్లు కావడం వల్ల మాత్రమే కాక, కల్గించిన ఆత్మీయభావనల వల్లే పత్రికా రచయితగా నా 'కాలమ్స్'లో రాయడం జరిగింది. హైదరాబాద్ కేంద్రంలో తెలుగు విభాగంలో అధికారిగా నేను వుండగా అనౌన్సర్ సాధన సహకరించిన తీరు ఎలా మరువగలను! అంబడిపూడి మురళీకృష్ణ, మడిపల్లి దక్షిణామూర్తి, పైడి తెరేష్‌బాబు, మల్లాది చంద్రశేఖర్, ఐనంపూడి శ్రీలక్ష్మి; వివిధభారతిలో రాజబాబు, బాలకృష్ణ, వి.వి.రామారావు ఇలా ప్రతిభామతులు నేటికీ వున్నారెందరో! ఏ పేరు చెప్పినా ఆ గళం విశిష్టత ఆ గళానిదే!

ఈనాడు ముఖ్యంగా ప్రసారమాధ్యమాల మధ్య ఒక పోటీ వాతావరణం నెలకొని వుంది. మిగతా ఏ మాధ్యమాలలోకన్నా ఆకాశవాణిలోనే నిజానికి ప్రతిభామతులైన వారూ, ఒక సుశిక్షిత కార్యశీలురు అయిన వారూ అనౌన్సర్స్‌లో వున్నారు. వారి సేవలనూ, ప్రతిభా ప్రాభవాలనూ సద్వినియోగపరుచుకోగల దిశగా సంస్థ పరిణామం చెందగలగాలి! ఆకాశవాణి వైభవప్రాభవాలు కనుమరుగు కాకుండా, పూర్వవైభవ దీప్తిని సంతరించిపెట్టగల తమ విద్యుక్తధర్మాన్ని అనౌన్సర్లు చిత్తశుద్ధితో, నిజాయితీతో, పనిపట్ల శ్రద్ధతో నిర్వర్తించగలగాలి. ఆకాశవాణి అందరికీ ఆదర్శం కాగలిగే తీరుకొనసాగేందుకు తమవంతు కర్తవ్యాన్ని వాచస్పతులైన స్వర సుధాకరులు నెరవేర్చగలరని ఆకాంక్ష ! అందరికీ అభినందనలు!!

*మే 2010*



# 'చంద్ర' హాసం

## డస్ట్‌బిన్ కార్టూన్లు – చంద్ర

తనదంతా కళాకళా, వేళావేళా!
మరి 'చంద్ర' కదా!
ఉండుండి విజృంభిస్తాడు.

'బద్ధకాన్నీ ప్రతిబింబిస్తాడు' అనుకుంటూండగానే – తన అసమాన కళా ప్రావీణ్యంతో, మనసు చుంబిస్తాడు. పాలకపక్షం చెమ్డాలూడదీసే ప్రతిపక్షంలానే కాదు, నచ్చకపోతే విపక్షాల వెర్రి ఎగురుళ్ళ 'పక్షాల'నయినా, తన 'వాడి' అయిన 'కుంచె'తో తెగ్గొట్టి, 'వాయగొడతాడు'. అభిమానం, సాన్నిహిత్యం ఎక్కువైతేనేగా – 'డు' అంటాం! అంచేత 'రు' అనదగ్గ ఉదాత్త గౌరవ స్థానంలో ఎత్తున వుండీ, మామూలు మనిషిలా సగటు మిత్రుడి భుజాలపై చెయ్యి వేసి చరుస్తాడు. కోపం వస్తే అరుస్తాడు కూడాను! కానీ అదంతా నిఖార్సయిన నిబద్ధతతోనే! 'విరసం' చంద్రను ఎంత తలకెత్తుకుందో వారపత్రికల 'సరసం' కూడా తననంతగా హత్తుకుంది. తన పెయింటింగ్‌లతో దేశ విదేశాల చిత్రకళాపిపాసుల చిత్తమలరించినవాడే! – మన 'చంద్ర'.

ఇప్పుడు ఇంతకీ తన 'కార్టూన్ల' పార్శ్వం గురించి! చంద్ర కార్టూన్లు మ...మ...మ.. 'మాస్' కన్న, క్లాస్' ఎక్కువ! అర్థం చేసుకోవడానికి 'తెలివి' ఉండాలి. తెలివైన కార్టూన్లు వేయడం వేరు. తెలివి 'తెప్పించే' కార్టూన్లు వేయడం వేరు.

"ఈ మధ్య కార్టూన్లు వేయడం తగ్గించేసావేమిటి బాసూ!" అందామను కుంటూండగా – గత ఏడాది సెప్టెంబర్‌లో అనుకుంటా 'రచన'లో తన వ్యంగ్య చిత్రరచనతో విజృంభించడం మొదలెట్టాడు. ఆ నెల సంపాదకీయ పేజీలో – 'అంత ఆశ కూడదురా అబ్బాయ్ జాగ్రత్త' అంటున్న కార్టూన్‌లో – పెద్దమనిషి కన్న, పక్కన కుర్రాడి గేలానికి 'పెద్ద చేప' తగులున్న అదృష్టం 'దృష్ట' మవుతుంది. "ఎందుకండీ! అలా బుర్రపాడు చేసుకుంటారూ.., ఐడియాలు వచ్చాకే వేసుకుందురుగాని కార్టూన్లు" అని ఆ తరువాత రెండు పేజీలకే మరోటి. వేస్తూ వేస్తూ వుంటేనే... ఐడియాలు వస్తూ వస్తూ వుంటాయన్నట్లు... అది మొదలు నెలనెలా 'రచన'లో చంద్ర 'సెకండ్ ఇన్నింగ్స్ కార్టూన్స్' సరికొత్తగా, అడుగడుగునా ఆకర్షించడం మొదలెట్టాయి అందరినీను. జైల్లో ఎలకపిల్ల బొచ్చెతో ముందుకొచ్చి – "ఒక కోటి దానం చెయ్యన్నా!" అంటుంది. అవినీతి మీదా, అవ్యవస్థ తీరుతెన్నుల మీదా, మీడియా మీదా, వేడివేడి రాజకీయాల మీదా... నెలనెలా వరసగా 'చంద్ర' సంధిస్తూ వచ్చిన వ్యంగ్యాస్త్రాలు చూసి తీరడానికి ఇప్పుడు ఒకచోట చేర్చడం గొప్ప సంతోషం.

డస్ట్‌బిన్ వ్యవస్థను కెలికి, 'చెత్తలో దొరికిన చిత్రరాజం'లా ముందెట్టాడు. 'చంద్ర' కు నంగితనాలూ, వెరవడాలూ, టోన్‌డౌన్ చేయడాలూ జాన్తానై! అనుకున్నదేదో... ఫెడీల్మన్నట్టుగా వున్నా సరే! కుంచె కొరడాలా ఝళిపించాల్సిందే! జగన్‌నీ వదిలిపెట్టలేదు. కేసిఆర్ నీ వదిలిపెట్టలేదు. పొలిటికల్‌తో బాటు, ప్రకృతి అంటే మానవ ప్రకృతి గురించి కూడా! పాదయాత్రల గురించీ, సంఘంలో మీడియా పాత్రల గురించీ ఎండగట్టాడు. చంద్ర బొమ్మల గురించి అందునా కార్టూన్ బొమ్మల గురించి చెప్పాలంటే – అవి కేవలం అందంగా ఉండడమే కాదు, 'సాహిత్యం ఆలోచనామృతం' అన్నారుగానీ, ఇప్పటి చంద్ర కార్టూన్లూ ఆ కోవలోనివే! అసలు ఒక్కొక్క కార్టూన్‌నూ విశ్లేషించి చూసుకుంటే, ఎన్ని విశేషాలు అద్భుత సంపాదకీయ వ్యాఖ్యల్లా వెల్లడవుతాయో!

"ఇవాళ విడుదలయ్యేది జగన్ నిర్దోషి సినిమానే పిచ్చిదానా – బాబుగారు కాదు".

"అమ్మోయ్ – నేనలా వీధుల్లోకి వెళ్లి పాదయాత్ర చేసొస్తా! ఇంట్లో లేనని కంగారుపడకు".

"మీరు ఈ జైలు నుంచే మీ చెల్లెలికీ బాణాలు సరఫరా చేస్తున్నారట! మాకు వార్తలొస్తున్నాయి".

"చూడు నాన్నోయ్ – ఎన్ని జంపు జిలానీలో".

"ఏవమ్మా... మీ యింట్లో ఎవరూ ఏ పనీ కోటికి తక్కువ చేయరా?".

"నాకు సంకేతాలు అందినయి సార్!...".

ఇలాగిలాగ కార్టూన్లలోని ఈ వ్యాఖ్యల వాక్యాలు, ఎంత వర్తమాన చరిత్రను నిబిడీకృతం చేసుకున్నాయో ఆలోచిస్తే అవగతం కాదా! కావడం లేదా!

'రచన' మాసపత్రిక తాజా సంచిక (ఏప్రిల్ 2013)లో "ఆవురావురుమని యింటి కొచ్చారు! రండి నాన్నా వేడివేడిగా దోశ వేశా!!" అన్నదాంట్లో 'ఫలానాది దోశ వేయడమంత సులభం కాదు' అన్న ఒక సమగ్ర రాజకీయ వ్యాఖ్యా సందర్భాన్ని ముందుకు తెస్తూంటే, "అమ్మా – మీ యిల్లు సోదా చేయటానికి కోర్టు ఆర్డరు తెచ్చానమ్మా" అన్న కార్టూన్లో బొమ్మను నిశితంగా చూడాల్సిందే – వంద రూపాయల నోటుతో కాగితప్పడవ చేసి, తన ఉచ్చలో పిల్లవాడు ఆడుకుంటూంటాడు. అలాగే జోడెద్దుల సమూహం – "గడ్డి తినకుండా పార్టీ కోసం పనులు ఎలా చేయగలం చినబాబూ!" అని ప్రశ్నించడం – పాలకపక్షం 'పాల'బడిన అవ్యవస్థా చరిత్రకు దృశ్య సాక్ష్యం. 'నీటి ఎద్దడి పై దృష్టి సారించడం', 'తమ్ములికి తెలుగొచ్చిందేవ్' కార్టూన్లు నిశిత పరిశీలనకే కాదు నిఖార్సయిన అభివ్యక్తి నైపుణికి నిదర్శనం. ఇదీ ఒక్క 'చంద్ర' కే సాధ్యమైన 'చంద్ర' తనం! హాస్యం, వ్యంగ్యం, అధిక్షేపం కలగలసిన 'తీంద్ర'తనం!

ఏమైనా చంద్రకు బాగా వొళ్లు మండింది. అందుకే డస్ట్ బిన్ కార్టూన్లంటూ నేటి అవ్యవస్థ సమాజ చిత్రణకూ, తద్వారా ఆలోచనాత్మక క్షాళనకూ సమకట్టాడు. "అన్నా హజారే'లు, 'కేజ్రీ వాలా'లే కాదు, ఇవాళ 'కార్టూనిస్టు చంద్ర' లు కావాలి! కిరణానికి ఉరేసుకుంటున్న సామాన్యుడి బొమ్మ గీశాక, తెలంగాణ 'తేవడం'

అన్నదాని మీద కార్టూన్లు సంధించాక, ఈ రాష్ట్రంలోనే ఇంకా ఎలా ఉన్నాడు? – అమెరికా చెక్కెయ్య కుండా అని కొందరు ఆశ్చర్యపోయినా వింతేం లేదులెండి!...

'చంద్ర' కాదు తను 'చంద్ర'. ఇంగ్లీషులో "chandra" అని రాస్తే ఇవాళ్టి తరం అలానే తెలుగు పలుకుతుంది! తెలుగులో ఇంత 'తెలివి పలుకుతూ', రాజకీయ కార్టూన్లు అనే దానికి ఒక 'కొత్త గీతల తొడుగు' నిస్తూ, నేటి వ్యవస్థలోని నానా రకాల కల్మశాన్ని 'డస్ట్ బిన్'కు ఎత్తి, సోకాల్డ్ మేధావులనుకునే వాళ్ళ బుర్రలకీ ఒక 'రీసైక్లింగ్' తలపెట్టినందుకు – తనకు హాట్సాఫ్!

'తెలుగు కార్టూన్'కు తన సరికొత్త వ్యంగ్య చిత్రాలతో కొత్త కుదుపు నిచ్చినందుకు కృతజ్ఞతలు 'చంద్ర' రాజేశ్వర్రావుగారూ! సారీ!...చంద్రశేఖర్ గారూ!

*09 ఏప్రెల్ 2013*




# కుదుళ్లలోంచి ఎత్తయిన రాంపా!

## భామ భీమ – రాంపా

ఈ రాంపా వున్నాడే
మహా గడుగ్గాయ్!

ఒక దాంట్లో వేలు పెట్టి ఊరుకోడు కదా! 'వేలు' సంపాదిస్తున్నానా? ఖర్చు పెడుతున్నానా? అని చూసుకోడు. అన్నింటా ప్రవేశమే! వట్టి ప్రవేశమేనా? ప్రావీణ్యం కూడాను. తన్ని చూసి కుళ్లుకునే వాళ్లుంటే ఉండొచ్చుగాక! కానీ కనిపించే 'కుళ్లు'ను కడిగి పారేయాలనేదే తన సంకల్పం! కార్టూన్ల చర్నాకోల విసిరినా, కథల కొరడా ఝుళిపించినా, నట కరవాలా లెత్తినా... అంతెందుకు? కలమెత్తినా, గళమెత్తినా – మొత్తానికి 'మెత్త'గా వుంటూనే, వ్యవస్థను మొత్తేచోట మొత్తుతూంటాడు. మంచి ఎక్కడున్నా పైకెత్తుతూంటాడు.

అరవైఏళ్లు దాటినా తను హుషారైన 'లైఫ్ బాయ్'. కార్టూనిస్టుగా, కథకునిగా, గాయకునిగా, వ్యాఖ్యాతగా, బుల్లితెర, వెండితెరలపై నటుడిగా, కార్యక్రమాలను వినూత్నంగా మలచి నిర్వహించే కార్యకర్తగా – రాంపా నలుగురి నోట్లో నానినవాడు. ఎందరికో 'తలలో నాలుక' వంటివాడు. ఎప్పుడూ 'గోలక్షేపం' చేస్తూ, తన 'చదివే అలవాటు'లో 'అహరహ' 'సుధారస శతప్రతా'లను విచ్చుకుంటూ, 'స్వీయసాధన'లో 'కొసవిసుర్లు' గా 'రాంపా హాస్యకథలు' లగాయితు, పలు పుస్తకాలను ప్రచురించి మస్తకాలకు వెలుగునిచ్చే పుస్తకాల రచయితగా, ఈసరికే ప్రసిద్ధుడు. ఎందులోనైనా తనదైన శైలిని పండించే శేముషి తనది. రచయితకూ, పత్రికా రచయితకూ తేడా

వుందిట! జనరల్ రచయితకూ జర్నలిస్టు రచయితకూ తేడా అన్నమాట! పత్రికా రచయిత నిత్యయాత్రికుడు.

సమకాలీనంలో కాలూనుతూ, కాంతులీనుతూ, అక్షరార్చన చేయడం అందరికీ చేతనయ్యే వ్యవహారం కాదు! అందుకే ఒక పత్రికలో 'కాలమిస్టు'గా ఎందరికో ఇష్టుడైన రచయిత కావడం, కచ్చితంగా, విశేషప్రజ్ఞే! గొప్ప ప్రతిభే! అందులోనూ రాంపా 'ధురంధరుడు' అనిపించుకున్నాడు. అందుకు ప్రబల నిదర్శనం మీ చేతుల్లోని ఈ పుస్తకమే. ప్రభలో ఒకప్పుడు వారంవారం ప్రభలు చిమ్మిన అక్షర రచనలివి.

ఆంధ్రప్రభ దినపత్రిక ఎడిట్ పేజీ మిడిల్ కాలమిస్టులుగా మీ సుధామ, ఈ రాంపా కొన్నాళ్లు సహచరించారు. రాంపా 'భామ–భీమ' కాలమ్‌గా వచ్చిన రోజుల్లోనే, నా 'కవికాలమ్' కవితాత్మకంగా వచ్చేది. 'కాలమ్' అంటే సమకాలీన సంఘటనల ప్రతిబింబంగానూ, వ్యాఖ్యానాత్మకంగానూ, ఆలోచనాత్మకంగానూ, పఠనీయంగానూ వుండడం చాలా ముఖ్యం! వారం వారం 'రాంపా' ఏం రాస్తాడో అని ఆసక్తిగా చదివే పాఠకుడిగా, కాలమిస్టునైన నన్నూ చేసేశాడు రాంపా!

పత్రికలో సమకాలిక రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విషయాలను ప్రతిబింబిస్తూ, విశదీకరిస్తూ, వ్యాఖ్యానిస్తూ, వారంవారం 'కాలమ్' రాయడానికి 'రాంపా' తన కలాన్ని ప్రయుక్తం చేసిన సృజనాత్మక ధోరణి ముందుగా ఆకట్టుకుంది. రెండు పాత్రలతో, ఇరువురిమధ్య సంభాషణాత్మకంగా 'కాలమ్' రాసే ఈ పద్ధతి– 'రాంపా' విలక్షణ వైఖరి. ఇలా రాయడం మాటలు కాదు. ఇద్దరు స్త్రీపురుషుల నడుమ మాటలుగా వర్తమాన సమాజాన్ని ఆ వారంలో జరిగిన ముఖ్యఘటనలనూ రాయడం – నిజంగా...మాటలు రాయడం మాటలు కాదు.

ఈ 'కాలమ్'లో రాంపా వ్యాఖ్యాన చాతుర్యం, విషయ పరిశీలనం, సంఘటనలు గుద్దిగుచ్చడం, హాస్య చమత్కారాలతో, వ్యంగ్య వైభవంతో ఆసాంతం నిర్వర్తించడం ముచ్చటగొల్పుతుంది. వారంవారం కొన్నేళ్లు 'కాలమ్' ఇలా రాయగలగడం, రాసి మెప్పించ గలగడం 'రాంపా' కే చెల్లింది.

'ఈ కాలమ్‌లో –
ఒక భామ–
ఒక భీమ'

ఎవరికి ఎవరూ తక్కువ కారు. ఎవరికి ఎవరూ తీసిపోరు. ఎప్పుడు ఎవరిది పైచేయో, ఎప్పుడు ఎవరు ఎంతమేరకు శ్రోతో, ఎంతమేరకు వ్యాఖ్యాతో, తనదైన దామాషా పద్ధతిలో నిర్వహించాడు ఈ రచయిత. ఒక అలవోక మాటతోనో, వ్యాఖ్యతోనో, ఎక్కడో మధ్యలోంచి మొదలయినట్లుగానో ఎత్తుగడే ముందుగా పాఠకుని చిత్తానికి హత్తుకుంటుంది.

"ఇదేమన్న బావుందా" గావుకేక పెట్టాడు భీమ.

"గొడవ చేయకుండా గొడవచూడాలని నేను చూస్తుంటే నాతో నీ గొడవేంటీ" అన్నాడు భీమ.

"కొద్దిపాటి ఆలోచన వున్న ఎవరికైనా ఏది ఎందుకు జరిగిందో ఏది ఎందుకు జరుగుతోందో అనేది ఊహకందని విషయం కాదు" అంది భామ.

"ఈ సాఫ్ట్‌వేర్ సంపాదనలొచ్చి మిడిల్ క్లాసు మానుని ఉన్నచోట ఉండనీయడం లేదు" అంది భామ.

"సబ్బుధర పెంచి సబ్బుపెట్టె ధర తగ్గించాం అని ఎలుగెత్తి ఎన్నికలమోత వినిపిస్తున్నట్లుందీ బడ్జెట్" అంది భామ.

ఇలా ఎత్తుగడలతోనే ఆసక్తికి నిజంగా నాందీ, ప్రస్తావన చేయడం ఒక విశేషం అయితే, ఈ కాలమిస్టు – ఇందులో సంకలించిన ఎనభై వారం వారం వ్యాసాలలోనూ ముగింపు ఒకేలా వుంటుంది.

"ఓర్నిన్నెత్తి కుదెయ్య" అంది భామ. పారిపోయాడు భీమ.

'ఎంత వారలయినా కాంతదాసులే' అన్నట్లు ఎంత 'భీమ' అయినా, 'భామ' ముందు – నేడు ఏమాత్రం అబలత్వం లేని మహిళా సాధికారత ముందు, వినమ్రుడే అనిపించడం ఒక పార్శ్వం అయితే, ఎత్తగల 'భీమ'ను 'కుదెయ్యడం' మాత్రం అంత ఈజీకాదు అని ధ్వనింపచేయడం మరో పార్శ్వం. అందుకే అన్నది– భామ, భీమ ఇద్దరూ సమానత్వ ప్రతీకలేనని. 'భీమ' పారిపోవడం వేగవంతమైన కాలచక్రంలో మరోవారం విశేషాలను వేగిరం పోగుచేసుకు రావడానికే అనిపిస్తుంది.

ఇక భామ–భీమల సంభాషణగా ఒక్కోసారి మాటల జోరుగా, విషయాల హోరుగా, అవ్యవస్థపై ఫైర్ గా, రాజకీయాల సెటైర్‌గా సాగే ఈ రచనలు

స్పృశింపని అంశాలు లేవు. సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు, సినిమా, క్రీడలు, భక్తి, ఒకటేమిటి!...ఆ వారం విశేషాలన్నీ వారిద్దరి సంభాషణల్లో అందిపుచ్చుకోవడం మాత్రమేకాదు, ఆ వార్తావ్యాఖ్యల 'రాంపా' జర్నలిస్టిక్ పనివాడితనం కూడా - వాడిగా, వేడిగా ద్యోతకం కావడం గ్రహించవచ్చు.

అలాగే ఈ వ్యాసాలకు శీర్షికలు కూడా తలమానికంగా నిలపడం రాంపా ప్రజ్ఞే! మచ్చుకి మీ మెచ్చుకి కొన్ని ఇచ్చుకోవాలంటే- 'సలహాలాహలం!', 'గాడ్సే-గాడ్-సే!', "సి 'వీక్' సెన్స్", 'అం ఫైరింగు', 'మధ్య తర'గతి', 'శుభం భూమి, యాత్!', 'చేతిలో పట్టు - బుట్టలో పెట్టు', 'క్రియేటివి టీ కాఫీ!, 'కేసిఆర్‌డీఎక్స్', 'రెడ్డి కాసులవాడు', 'పోలొట్టబ్యూరో', 'ధోని-ద్రోణి', 'ఫలి'తాలింపు!, 'జురాగంలిమరా', 'ఉగ్రవ్యాధి', 'సు-నామినేషన్లు' వంటివి బోలెడు చెప్పుకోవచ్చు.

మకుటంలోనే చెప్పే విషయం ప్రస్ఫుటంగా ప్రకటం కావడం - రాంపా తలపెట్టు తలకట్టు మహిమ! వాటికి వెలకట్టు తీరూ కష్టమే! తను కార్టూనిస్టు కనుకనే స్వయంగా బొమ్మకట్టు ప్రజ్ఞా, మేరియోమిరండా 'థిక్ లెటరింగే' కాదు 'థింక్ బెటరింగ్' కూడా తనకు సాధ్యమైంది. అక్షరాలంకరణ బ్రష్‌తోనేకాదు పెన్నుతోనూ - పదాలలో, వాక్యాలలో చేయొచ్చని తెగేసి, తెగచూపించాడీ రాతల్లో తాను. దటీజ్ రాంపా!

"నువ్వేమన్నా అనుకో. ఆకలిబాధ-పడ్డ వాడికి తెలుస్తుంది. అన్నంపెట్టేదే మతం. ఆకలి తీర్చేదే మతం."

"అభిమానం వుంచుకో. పెంచుకో నీ వ్యక్తిత్వాన్ని. నీ జీవితలక్ష్యాన్ని పణంగా పెట్టి మూఢాభిమానంతో గుడ్డివాడివి కాకు".

"క్షీరసాగరంమథనం అప్పుడు జరిగితే, యిప్పుడు క్షమయా ధరిత్రీ మథనం జరుగుతున్నది. పర్యవసానంగా కాలుష్యం కాలనాగై మనల్ని కాటేయబోతున్నది."

"ఓ నేరస్తుడు పట్టుబడితే వాడు చేసిన నేరం రుజువైతే వాడి తల్లిదండ్రులకు, తోడబుట్టిన వాళ్లకు, ఆ మాటకొస్తే వాడి కుటుంబం మొత్తానికి పదేళ్లపైన కఠినకారాగార శిక్ష వేసే చట్టం వస్తే బావుణ్ను. ఆ భయంతోనన్నా పెరిగే వయసులోనే నేరస్తులు బయటపడి సమాజం హాయిగా వుంటుంది."

"ప్రతి పల్లెలోనూ గ్రంథాలయాలు పునరుద్ధరణ కావాలి. ప్రతి ఊరిలో కనీసం ఒకరైనా సృజనాత్మకతను పదిమందికి వినిపించేవారుండాలి. వారికి

కొంతభరణం యిస్తే నిరుద్యోగం కొంత తగ్గుతుంది. ప్రజలకు మేలు కలుగుతుంది."

"మనం కొత్తదనాన్ని ఆహ్వానించాలి. ఆ తర్వాత అదీ పాతమూసలోనే వెళ్లిందనుకో! అప్పుడు మనం యింకో కొత్తదనం వెతుక్కోవాలి".

– ఇలా సందర్భోచితంగా రాంపా చెప్పే నిష్ఠురసత్యాలు, ప్రవచనాలు మానవీయ మహనీయతను ప్రోదిచేసేవిగా వుంటూ, బుద్ధినే కాదు హృదయాన్నీ తాకుతాయి. నవ్వేకళ్లలోని నిజాయితీ చెమ్మను, ఆర్ద్రంగా అనుభూతికి తేగల ప్రజ్ఞ రచయితకు వుంది.

భామలో భారతీయ మహిళా వుంది.<br>భీమలో భీష్మ దీక్షా మనిషీ వున్నాడు.

వీరి హాస్యపు నుడుల వెనుకా, మాటల చెడుగుడుల వెనకా చరిత్ర వుంది. ఒక డైరీలో నిక్షిప్తీకరించిన గడచిన ఒక చారిత్రక, రాజకీయ, సామాజిక కాలం వుంది. అందుకే ఎప్పుడో వచ్చిన 'కాలమ్' అయినా – ఈ కాలంలో చదువుతున్నా, బాగా అనిపించే రాతల పరంపర ఈ 'రాంపా' పుస్తకం. గతాన్ని క్యాప్సూల్స్‌లా చేసి దాచిన కాలనాళిక ఇది. హాస్యగుళికలుగా భాసిస్తూనే, అవ్యవస్థా రుగ్మతలకు ఆలోచనాత్మక ఔషధం ఇది.

ఇది రాంపా 'టోన్' – 'జీవన్‌టోన్'. అందరిదీ, అందరికీ!

"మెచ్చనంటా వీవు నీవిక మెచ్చకుంటే మించిపాయనే<br>కొయ్యబొమ్మలు మెచ్చు కళ్లకు కోమలుల సొరెక్కునా"

అని గురజాడ అన్నట్లు – భామ 'సొరు', 'కండగల వాడేన్ మనిషోయ్" అన్నట్లుగా – భీమ ఆలోచనల పటుత్వ 'జోరు', మీకు నచ్చితే – మీకు మీరు నచ్చినట్లే! మీరూ మేమూ కలిసి, జనం మెచ్చితే 'రాంపా? రాతల ఆశలు విచ్చినట్లే! నవంబర్ 30 గురజాడ వెళ్లిపోయిన తేదీ తెలిసేనా, నవంబర్ 29 న రాంపా పుట్టేసాడు? వ్యవస్థ 'దిద్దుబాటు'కు తనదైన అక్షరబాట పట్టేశాడు!

తన పుట్టినరోజు సందర్భంగా కలం చిందుల తన 'కాలమ్' ను ఈ కాలానికి కానుకగా గ్రంథస్థం చేస్తున్నందుకు రాంపాను మనసా అభినందిస్తున్నాను. మరి మీరూ చ(ది)వి చూడండి! శుభం భూయాత్!

*25 నవంబర్ 2015*




# సాహిత్యలహరి

## సాహితీ సుధానిధి - డా॥ తిరుమల శ్రీనివాసాచార్య అమృతోత్సవ సంచిక

**డా॥** తిరుమల శ్రీనివాసాచార్యగారి పేరు తెలుగు సాహితీ ప్రపంచానికి సుపరిచితమే. పద్యం, గేయం, వచన కవిత్వం, రుబాయి, వ్యాసం, ఉపన్యాసం ఇలా విభిన్న సాహితీ ప్రక్రియలలో నిష్ణాతులు ఆయన. సికింద్రాబాద్ సర్దార్ పటేల్ కళాశాల తెలుగు శాఖాధిపతిగా, యువభారతి సాహిత్య సంస్థ గౌరవాధ్యక్షులుగా వృత్తిలో, ప్రవృత్తిలో రాణకెక్కిన విశిష్ట సాహితీమూర్తిమత్వం వారిది. ఆయన ఎంత పండిత కవియో, అంతగా పాఠక జనహృదయాహ్లాదకులు. శ్రోతృజనమానస వాఙ్మయ వతంసులు. స్నేహవారధి, కవితాసారథియే కాదు విశిష్ట విమర్శకుడు, రుబాయిాల తెలుగు కవిసమ్రాట్టు శ్రీనివాసాచార్య. పాతిక గ్రంథాల దాకా విభిన్న ప్రక్రియల్లో వెలువరించి తనదైన ముద్ర పాదుకొల్పిన ఉత్తమ కవి, విమర్శకులు తిరుమల శ్రీనివాసాచార్యగారు. ఆయన అందుకున్న పురస్కారాలకు కొదవే లేదు. ఆయనను అందుకోవడానికి ఇంకెన్ని ఆరాటపడుతున్నాయో వేచి చూడాల్సిందే!

సాహిత్యంలోనే కాదు వ్యక్తిత్వంలోనూ ఆయన ఉన్నతులు. సౌజన్యం, సౌహార్ద్రం ఆయన సొత్తు. ఎంత స్నేహశీలియో అంత ప్రభావశీలి. ఎందరికో స్ఫూర్తిదాయకమైన గుణవర్తనం ఆయనది. యువభారతి వైభవ ప్రాభవాలకు

తమ శక్తియుక్తులు ధారపోసిన వారిలో ఆయన కృషి అవిస్మరణీయమైనది. ఆయన 77వ ఏట అడుగు పెట్టిన సందర్భంగా డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యగారి వివిధ గ్రంథాలపై పరిశీలనాత్మక వ్యాసాలతో ఒక సంకలనం వెలువరించాలన్నది యువభారతి సంకల్పం. ఆయన వ్యక్తిత్వం, సాహిత్య, మూర్తిమత్వానికి అద్దంపట్టే గ్రంథంగా ఇరవైరెండు వ్యాసాలతో వెలువడుతున్న ఈ సంపుటి పఠితృ జనహృదయామోదం పొందగలదని మా ఆకాంక్ష.

ఇందులోని వ్యాసాలలో ఆచార్య వంగపల్లి విశ్వనాథం, ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్, తిరుమల నరసింహాచార్యులు, డా॥ ఓలేటి పార్వతీశం గారలు ఆయన వ్యక్తిత్వాన్నీ, వచోవైభవాన్నీ విశదపరుస్తుండగా, ఆయన విమర్శక వైభవాన్ని ఆచార్య ఎస్వీరామారావు, గేయనాటికలపై ఆయన సాధికారిక సిద్ధాంత వైదుష్యాన్ని డా॥ వెలుదండ నిత్యానందరావు అందించారు. తిరుమలవారి హృద్యపద్య రచనా వైశిష్ట్యాన్ని డా॥ ఆచార్య ఫణీంద్ర వివరించారు. వారి లలితగీతాలను గురించి డా॥ జయరాములు, శ్రీనివాచార్య గారి కవితాత్మక సూక్తి వైభవాన్ని గూర్చి ఆచార్య మసన చెన్నప్ప, డా॥ కె.బి.లక్ష్మి, తిరుమలవారి లలితగీత వైశిష్ట్యం గురించి డా॥ వడ్డేపల్లి కృష్ణ విశదపరిచారు. ఇక రుబాయీల ప్రక్రియలో ఆయన విరాడ్రూపం డా॥ అద్దేపల్లి రామమోహనరావు, సుధామ, పెన్నా శివరామకృష్ణ, డా॥ అనంతలక్ష్మిగార్ల వ్యాసాలు విడమరచి చెబుతాయి. ఆయన అనుసృజన పటిమను ద్వానాశాస్త్రి, సమీక్షా వీక్షణను డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, యాత్రా రచన విన్నాణాన్ని యం.వి.పట్వర్ధన్ తెలియచెప్పగా మాడభూషి అనంతాచార్యులు, సాధన నరసింహాచార్య తిరుమలవారి కవన పరీమళాలను కనులకు కట్టించారు. ఇలా ఇందులోని వ్యాసాలన్నీ డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారి సమగ్ర సాహిత్య వ్యక్తిత్వాన్ని సజీవ శిల్పాకృతిలో పాఠకుల ముందుంచుతున్నాయనవచ్చును.

ఆయురారోగ్య ఐశ్వర్యాలతో డా॥ తిరుమల శ్రీనివాసాచార్యగారి సాహితీ జీవనయాత్ర నిరంతరాయంగా సాగాలని శుభాకాంక్షిస్తూ ఈ గ్రంథం సహృదయ పాఠక సమాదరణ పాత్రం కాగలదని ఆశిస్తున్నాను.

***

## కవిత్వ పదాకృతి

ప్రాచీన కవులు తమ కావ్యాలలో తమ ముందటి కవులను 'స్తుతి' చేయడం ఆనవాయితీయే! సుకవిస్తుతి, కుకవినింద కూడా గతంలో మనం చూసినవే! పెండ్లి సందర్భంగానో, షష్టిపూర్తి సందర్భంగానో వధూవరులపై 'పంచరత్నాలు' వంటివి రాసి సమర్పించడం కూడా పద్యకవులకు పరిపాటియే! ఆధునిక కవిత్వంలోనూ వీరులనూ, మహనీయ నేతలనూ స్తుతించడం వుంది. అయినప్పటికీ కవిత్వంలో వ్యక్తి ప్రశంస, వ్యక్తి ఆరాధన ఒక విశిష్ట అంశంగానే గుర్తించాల్సి వుంది. 'నా గురించి కథ వ్రాయవూ' అన్నట్లుగా, తన గురించి కవిత్వంలో రాయబడడం రాజులకాలం నుంచీ కుతూహలానంద కారకమే!

ఒక వ్యక్తి గురించి కవిత్వం రాయడం అనేది– ఆ వ్యక్తి ఎంతో విశిష్టుడయితే తప్ప కవులను స్పందనతో రాయించడం నేడు క్వచిత్తుగా జరిగే ప్రక్రియగానే భావించాలి. సాటికవులను కూడా కదిలించగల ప్రభావశీలి, సౌజన్యమూర్తి, స్నేహసాహితీమూర్తి డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యులుగారు. వివిధ సందర్భాలలోనూ, తిరుమల శ్రీనివాసాచార్యులుగారి షష్టిపూర్తి, అమృతోత్సవ శుభ సందర్భాలలోనూ తెలుగు సాహిత్య ప్రపంచంలోని నేటి ప్రముఖులు, యువకవులు ఆయనపై అభివ్యక్తీ కరించిన హృదయగత స్పందనల కవితాక్షర మాలలు ఈ సంపుటిలోని కవితలు. ఈ కవితలన్నింటా డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యగారి వ్యక్తిత్వ, కవిత్వ వైశిష్ట్య గుణగానం ద్యోతకమవుతోంది. ఇందరి సంస్పందనలకు ఆస్పదుడయిన సాహితీమూర్తి తిరుమల శ్రీనివాసాచార్య.

బహువిధ సాహితీ ప్రక్రియాలంకృత మహితాంధ్ర భాషోద్యమతిగా, మధుర వాగ్వైఖరీ మాధురీకంపిత సంతుష్ట బుధశిరస్తతివిగా ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడుగారి ఆశీస్సులందుకున్న కవివతంసులు తిరుమల శ్రీనివాసాచార్య గారిపై కీర్తిశేషులు బోయిభీమన్న, ఉత్పల సత్యనారాయణాచార్య, వి.వి.ఎల్. నరసింహారావు, వేముగంటి నరసింహాచార్యులు వంటి ప్రముఖులు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్. గోపి, జె.బాపురెడ్డి, చిల్లర కృష్ణమూర్తి అలాగే అవధాన సరస్వతీ మూర్తులు, డా॥ ఆశావాది ప్రకాశరావు, డా॥ గరికిపాటి,

గండ్లూరి దత్తాత్రేయశర్మ, డా॥ ఆర్. అనంతపద్మనాభరావు ప్రభృతులు వెలువరించిన కవితా రస ప్రసూనాల గుచ్ఛం ఈ కవితాసంపుటి. ఇందులో కవులు ఆచార్యుల వారిపై కూర్చిన కవితాత్మక భావాలన్నీ సహజోక్తులు. నిజంగానే ఆయన సాహితీ సుధానిధి. కవిత్వలోకాన ఉదయ పతాక.

ఇందరి కవుల ప్రశంసాపాత్రమైన డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యగారి బహుముఖీన ప్రతిభ, ఆయన సౌమనస్యం, సహృదయశీలం, రచనాపాటవం వీటన్నింటినీ ఈ కవితలు అద్దం పట్టి చూపుతున్నాయి. ఈ కవితలన్నింటినీ ఇలా సంకలనం చేసి వెలువరించాలన్న 'రసమయి' రాముగారి సంకల్పం ఎంతయినా ప్రశంసనీయం. తిరుమల శ్రీనివాసాచార్యగారిని కవితాత్మకంగా చిత్రిస్తున్న అక్షరాల ఫోటో ఆల్బమ్ ఇది. అందుకు ఆహ్వానించండి. అందుకొని అభినందించండి.

*21 మార్చి 2015*




# ముందుమాట

## పిల్లల చేతుల్లో పెన్నిధి-ప్రపంచవారసత్వం
## -తురగా వసంతశోభ

మనం అంతగా పట్టించుకోని విషయాలు కొన్ని వుంటాయి. వాటి గురించి పట్టించుకోవాలన్న ఊహ కూడా మనకు కలగదు. 'పనికిరానిది పన్నెండేళ్లు దాచమని' పెద్దలంటూ వుంటారు. అంటే నిజానికి పనికిరానిదంటూ వుండదనే అందులోని ఉద్దేశ్యం. కాలం గడిచే కొద్దీ పాతబడుతున్నాయి అని మనం అనుకునేవి నిజానికి వాటి విలువను, నాణ్యతను, వాటితో మన బంధాన్ని ఇనుమడింపజేస్తూ సరికొత్తదనాన్ని సంతరించుకుంటూంటాయి. వ్యక్తుల చరాస్థుల సంగతి ఏమోగానీ సమాజానికి, దేశానికి స్థిరాస్థులుగా నిలబడిపోయేవి వుంటూంటాయి. అవి వస్తువులు కావచ్చు. కట్టడాలు కావచ్చు. మరింకేవైనా మహోదాత్త నిర్మాణాలు కావచ్చు.

నిజానికి సంపద ధనరూపంగా కాదు, అనుభూతుల హృదయమథన రూపకంగా ఉంటుంది. పెరుగుతుంది. ఒకరి నుంచి ఒకరికి అది అందించవలసిన పద్ధతి కూడా అదే. నిజమైన సంపత్తి వ్యక్తిగతం కాదు సమాజగతమే. ప్రపంచపు వింతలు అందరివీ. ప్రపంచ సంపదలుగా అలా పరిగణించాల్సినవి ఎన్నో వున్నాయి. వాటి గురించి తెలుసుకోవాలి.పదిలపరుచుకోవాలి. పరిరక్షించుకోవాలి. ఆ పని- తరం నుంచి తరానికి నిరంతరం అందుతూండాలి. పట్టించుకునేలా కొన్ని అంశాలను పదేపదే చేయవలసి వుంటుంది. గుర్తు చేయవలసి వుంటుంది. వారసత్వం అలాంటి వాటిలో ఒకటి. వ్యక్తి వారసత్వాలకు, కుటుంబ వారసత్వాలకు

ఆరాధనా పూర్వకంగా అంగీకరించి తలవొగ్గుతున్న పౌరులు- సమాజానికి, దేశానికి, ప్రపంచానికి వారసత్వ సంపద కాగల వాటి గురించి శ్రద్ధ పెట్టకపోవడం చిత్రమే మరి.

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపబడే వాటిల్లో మనదేశ సంపద, మన నగర సంపద వుండడం ఎంత గర్వకారణం; అలా గుర్తింప చేసుకోగలగడం మన హక్కు. అయితే ఆ హక్కును బాధ్యతగా గుర్తించిన పౌరులెందరు? దేశం నాకేమిచ్చిందని కాక దేశానికి నేనేమిచ్చానని ఆలోచించడం నిజమైన జాతీయభావన.

పాఠశాలలో జాతీయగీతం పాడి ప్రతిజ్ఞ వాక్యాలు పలుకుతున్నప్పుడు 'మహోన్నతమైన నా దేశవారసత్వ సంపద నాకు గర్వకారణము' అన్నమాటను ఆచరణలో పెట్టగలగడం, ఆ సదవకాశాలను పట్టుబట్టి సాధించబూనడం అందరికి చేతనయ్యే పనికాదు. 'ఎమ్మార్క్' చేసిన కుమారి వసంతశోభ వృత్తిరీత్యా, ప్రవృత్తి రీత్యా కూడా ప్రపంచ వారసత్వ పరిరక్షణోద్యమంలో అభిరుచిని అభినివేశాన్ని పెంచుకుంది. హైదరాబాద్ నగరంలోని దాదాపు పది సముదాయాలకు ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించే అర్హత వుందని నిరూపిస్తూ అందుకై ఆరాటపడుతోంది. ప్రపంచపటంలో మన దేశం, మనరాష్ట్రం, మన నగరం, ఈ రూపేణా స్థిరీకరింపబడాలని అభిలషిస్తోంది. అధికారగణాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్నీ ఈ ఆలోచనా సరళికి అనుగుణంగా శ్రుతి చేసే పనిలో నిమగ్నమై పనిచేస్తోంది.

'పిల్లల చేతుల్లో పెన్నిధి- ప్రపంచ వారసత్వం' అనే ఈ కృతి అందుకు తార్కాణం. వసంతశోభ ఇందులో తాను అధ్యయనం చేసిన భవన నిర్మాణకళను, వాస్తు సంపదను గురించి పిల్లలకు తెలియజేస్తూ, తెలుసుకుని, పదిలపరుచుకుని, పరిరక్షించుకోవాల్సిన వాటి గురించీ, వాటికై మనం చేయవలసిన వాటిగురించీ ఎంతో వివరంగా సచిత్రంగా రాసింది. ఇది పాఠ్యగ్రంథం కాదు. ప్రతి ఒక్కరూ పఠించి ఆలోచించవలసిన గ్రంథం. ఇవన్నీ ఆసక్తి కలిగించే విషయాలు. అనురక్తిని పెంచే అంశాలు. పిల్లలు వీటిని తెలుసుకుని వుండడం చాలా అవసరం. ఆలోచనల మొగ్గలు తొడిగితే ఆచరణల పుష్పాలు వికసించకపోవు. అందుకోవలసిన ఫలాలు అందుకోకుండా పోము. వసంతశోభ చెబుతున్న ప్రపంచవారసత్వపు ఈ శోభాయమాన సంగతుల్లోకి ప్రవేశించండి. ఈ పెన్నిధిని మీ చేతుల్లోకి తీసుకోండి.

*నవంబర్ 2006*



# కొండూరి హాస్యయజ్ఞకుండం

## జోకులు వేయి – కొండూరి కాశీ విశ్వేశ్వరరావు

**జో**కులు వెయ్యి అంటే అందరూ వెయ్యలేరు! కానీ మాట్లాడిన ప్రతిదీ జోకు అన్నట్లుగా, నవ్వు తెప్పించగల ప్రజ్ఞ కొందరికి వుంటుంది. హాస్యం– శబ్ద, అర్థ, చేష్టాగతంగా వుంటుంది. శబ్దాశ్రయ హాస్యం, అర్థాశ్రయ హాస్యం, వినీ చదివీ అందుకోగల్గుతాం. చేష్టాగతమైనది మటుకు – చూసి ఆనందించగలమే కానీ, అక్షరీకృతం చేయడం సులభం కాదు. ఒకే అక్షరం పదే పదే పునపునః ప్రయుక్తమయ్యేలా, ఆ అక్షరం వచ్చే వివిధ పదాలను ఒకచోట ప్రయోగిస్తూ మాట్లాడడమూ ఒక రకం హాస్యమే!

కొండూరి కాశీ విశ్వేశ్వరరావు మెండుగా హాస్యం ఊరి, చూసీ చూడనట్లు ఊరుకోక, తన విష్‌తో, వాటిని 'హాస్యంబునకు దేశ, కాల పాత్రంబులు లేవా?' అని తిరుపతి వేంకట కవులు అన్నట్లుగా – ఈ హాస్యోక్తులు అన్నీ, అన్ని వేళలా, అందరికీ ఒకే విధంగా నవ్వు పుట్టించగలవన్న గ్యారంటీ వుండదు! మీకు ఏ మాత్రం చికాకుగా వున్నా విసుగ్గా వున్నా, తోచకుండా వున్నా ఈ పుస్తకాన్ని ఒకమారు అలా....అలా.... తిరగేయండి! ఇలా మిమ్మల్ని ఇట్టే ఆకట్టుకుని, పట్టుకుని నవ్వించేవి పట్టుమని పదయినా దొరికి తీరుతాయి. మీరు నవ్వడానికే కాదు, మీరు మీ వాళ్ళని నవ్వించడానికి కూడా.. ఇందులో 'జోకులు' పనికి వస్తాయి. ఉభయతారకం!

'ఎ జోక్ ఈజ్ ఎ జోక్ ఈజ్ ఎ జోక్ ఈజ్ ఎ జోక్ ఈజ్ ఎ జోక్' అని జోక్‌కి ఓ నిర్వచనం! అంటే ఏమన్నమాట... నవ్వు ఏదయినా నవ్వే! నవ్వలేకపోతే – నవ్వలేని మన తప్పేగానీ, నవ్వించేవారి ప్రయత్నం... మనం నవ్వక, నవ్వులపాలు చేసామనుకుంటే... నవ్వుతారు!

శ్రీ కొండూరి వారు ఈ గ్రంథంలో హాస్యం పేరిట తడమని రంగం లేదు. సమాజంలోని రకరకాల వ్యక్తుల మధ్య, రక రకాల చోట్ల, రవ్వలు రువ్వే నవ్వులు రువ్వారు! అలాగని గతానుగతికంగా ఇప్పటికే చాలామంది సంకలించిన 'ప్రముఖుల హాస్యం', వంటివి గ్రంథస్థం చేయలేదు. తనదైన హాస్యకల్పనలు 'నవీకరించే' ప్రయత్నం చేసారు. ఇంగ్లీషువారు 'ఈడియమ్స్" వాడితే, తెలుగువాడు "వడియమ్స్" వాడతాడని విశ్వేశ్వరరావు గారు– ఈ వేయి జోకుల్లో తెలుగుదనం 'పోపు' వేయ జూసినవీ వున్నాయి. అలాగే ఆధునిక శాస్త్ర సాంకేతికతలను జోడించినవీ వున్నాయి. "ఇంట్లో సోలార్ కరెంట్ కదా! పన్ను ఎందుకు చెల్లించాలంటే" "ఓజోను పొరను రక్షించడానికి" అని సమాధానించడం అలాంటి చమత్కారమే! ముఖ్యంగా– శబ్దాలతో... తెలుగు, ఇంగ్లీషు పదాల మిశ్రమంతో సృషించిన హాస్యవాక్యాలున్నాయి ఈ జోకుల్లో.

ఇది చూశాక కాశీ విశ్వేశ్వరరావు కూడా ఓ పాటి "సైంటిస్ట్" అని మీరు అనుకోవచ్చు! సైంటిస్టు అంటే "ఏం కనిపెట్టాడని" అడిగితే , మనం నవ్వదగిన విషయాలు ఇంతకుముందే ఎన్నో వున్నాయని కనిపెట్టేశాడనే చెప్పాలి మరి! తను కనిపెట్టినవాటిని ఈ పుస్తకంలో కూర్చిపెట్టడం వల్ల పాఠకులు ఈ హాస్యోక్తుల సంకలనాన్ని తమకు ఇష్టమైన వారికి నిరభ్యంతరంగా కొనిపెట్టవచ్చు కూడాను. 'వేయి జోకులు' వేయడం (పుస్తకంగా) మాటలు కాదు! మాటల్లోనే జోకులు వేయడం – బాటగా జీవిత ఫణితి కలిగినవాడు కావడం వల్లనే ఎక్కడెక్కడినుంచి ఎలా హ్యూమరసం పిండవచ్చో,చెఱకు పిప్పి అయ్యేదాకా సారం లాగినట్లు సంసారం నుండి సమాజం వరకు, సకల రంగాల విభిన్నాంశాల నుంచి నవ్వులు పిండి వడ్డించాడు. జోక్ ఎంత పరిధిలో వుండాలో అంత వుంటేనే నవ్వు విస్తరిస్తుంది. జోక్‌ని రబ్బరుబ్యాండ్‌లా సాగదీసినా, తగిన పాకంలో పడకుండా ముందే దింపేసినా, హాస్యం పండదు. అంటే "కుక్' బాగా చేసి కడుపు నిండా

కుక్కగలిగాలి– వడ్డించడంలో! 'కాశీ' అంటే అన్నపూర్ణేశ్వరి గుర్తొస్తుంది కదా! అంచేత పూర్ణంగా – 'నవ్వు' అన్నదానిని వేయడానికి – 'సహస్రజోకార్చన' చేసాడీయన. ఇదీ ఒక యజ్ఞమే! యజ్ఞం చేసిందీ, నవ్వులపాయసాన్ని యజ్ఞపురుషుడిగా పట్టుకొచ్చిందీ, రెండు విశ్వేశ్వరరావు కావడమే విశేషం!

"మనమంతా జీవితమంతా నవ్వుతూనే వుందాం
మనసారా నవ్వుకునే వారే ఆస్తిపరులు"

అన్నదే కాశీ విశ్వేశ్వరరావు సిద్ధాంతం! అంచేత ఏ రాద్ధాంతాలూ లేకుండా హాయిగా నవ్వుకోండి! శుభంభూయాత్!

*13 ఆగష్టు 2011*




# విలువైన ముచ్చట్లు

## లచ్చుమమ్మ ముచ్చట్లు - డా॥ సరోజన బండ

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం స్త్రీల కార్యక్రమం లక్షలాది శ్రోతలను అలరిస్తూ వైభవోపేతంగా రాణించిన కాలం ఉంది. ఆ రోజుల్లో స్త్రీల కార్యక్రమం నిర్వహణాధికారులుగా పనిచేసిన న్యాయపతి కామేశ్వరి, తురగా జానకీరాణి, డా॥ కె. విజయ, అల్లంరాజు ఉషారాణి, డా॥ బి.డి.ఎల్. ప్రసన్న మొదలైన వారంతా స్త్రీల కార్యక్రమాలకు కొత్త సొబగులు తెచ్చిపెట్టారు. కేవలం సంప్రదాయం అనే కాకుండా స్త్రీల అభ్యున్నతికి, సాధికారతకు చైతన్యానికి స్వీయ అస్తిత్వానికి, జీవన వికాసానికి దోహదపడే కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేసేవారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ రంగాలలో నిష్ణాతులైన మహిళలు పాలుపంచుకునేవారు.

డా॥ సరోజన బండగారు ఆకాశవాణి కార్యక్రమాలెన్నింటిలోనో పాల్గొన్నవారు. ప్రసార ప్రాసంగిక ప్రముఖులలో చెప్పకోదగినవారు. ఆకాశవాణి సకలకళల సమాహారంగా భాసించడమే కాదు, భాషా సాంస్కృతిక వికాసానికి కూడా దోహదం చేసిందని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. తెలంగాణ జీవద్భాషను ఆకాశవాణిలో పలికించిన ప్రముఖులలో ఆర్.సి.వి.రెడ్డిగారు (రేడియో ఎల్లయ్య), రేడియో చిన్నక్క రతన్ ప్రసాద్, పాడిపంటల చిన్నమ్మి గీత మొదలైనవారు ఆకాశవాణిలో పనిచేసినవారుకాగా, ప్రసార ప్రముఖులుగా రాణించినవారిలో డా॥ పి.యశోదరెడ్డిగారినీ, డా॥ సరోజన బండగారినీ పేర్కొనాలి. స్త్రీల కార్యక్రమంలో 'మాలచ్మి ముచ్చట్ల'ను తొలుత యశోదరెడ్డిగారు చెప్పగా ఆ ఒరవడిని అందిపుచ్చుకుని ఎంతో ముందుకు 'లచ్చుమమ్మ ముచ్చట్లు' గా తీసికెళ్లి

తెలంగాణ సజీవభాషలో అలరించినవారు సరోజనగారు. శ్రోతలు ఆ రోజుల్లో ఎంతగానో మెచ్చిన మంచి కార్యక్రమాలల్లో లచ్చుమమ్మ ముచ్చట్లు ఒకటి. సరోజనగారు ఆ ప్రసంగ వ్యాసాలను ఇలా గ్రంథస్థం చేయడం ఎంతో బాగుంది.

ఈ ముచ్చట్లు చదువుతుంటే తెలంగాణ గ్రామీణ జీవితంతో అందునా స్త్రీ బతుకు కతలతో పాఠకులు మమేకం అయిపోతారు. సద్దుల బతుకమ్మ పండుగ సంబరాలంత ఆనందం పొందుతారు. చిన్నప్పుడు "దొబ్బగడంచ" అనిపించుకున్న ఈ రచయిత్రి ఇంత నిబ్బరంగా ఎదిగి అనేక రంగాలలో ముఖ్యంగా విద్య, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ఖ్యాతినొంది నాటి ముచ్చట్లను ఈ కాలానికి పెన్నిధులుగా ఇలా కూర్చడం ఎంతో సంతోషదాయకం. తెలంగాణ భాషలోని మాధ్యురాన్ని, సొగసును, హృదయదఘ్నమైన ఆత్మీయతను, మానవీయ విలువల మూలకందాన్ని ఈ ముచ్చట్లు మనకు అందిస్తున్నాయి. సంకురాతిరి. ఓలి పండుగ, ఆట పాటలు, ఉగాది, గాంధీమహాత్ముడు వంటి ముచ్చట్లేకాదు అడోల్ల ఓద-సదువు, తల్లి బాస, ఓ ఆడపిల్ల కత వంటి ముచ్చట్లలో ఆడపిల్లలకు చదువు ఆవశ్యకత గురించి, భాష సంరక్షణ ఆవశ్యకత గురించి, మహిళా సాధికారత గురించి సరోజన గారు పలికిన ముచ్చట్లు అభ్యుదయ పథగాములను చేయగల ఆలోచనాత్మక రచనలు. తెలుగు భాష స్థితి గురించి రాస్తూ-

"గియ్యాల గా తెలుగు ఆచికాలుగుడ సక్కగలేవు.గా వాట్ని ఎవలు రాస్తున్నరో, ఎవలకోసం రాస్తున్నరో, ఎట్లరాస్తున్నరో, తెలుస్తలేదు. ఆచికాలు రాసేటందుకు కూడా ఒక రీతున్నది. రీతి రివాజులేని ఆచికాలు రాసి పోరగాండ్ల మీద రుద్దుతే ఎట్లా? పంతుల్లకు చెప్పస్తలేదు. పోరగాల్లకు సమజయితలేదు. గట్లయితే 'తెలుగు బాస' యాన్నుంచి అస్తది? పంతులు సదువు సెప్పేది లేదట. అన్ని పోరగాండ్లే సయంగ నేర్సుకోవాల్నట. గట్లయితే ఇస్కూలెందుకు, పంతుల్లెందుకు" అంటూ నేటి చదువుల పరిస్థితి గురించి యథార్థంగా చెప్పారు. విద్యారంగంలో అపార అనుభవంగల సరోజనగారు ఆ అనుభవసారాన్ని ఈ వ్యాసాలలో పలుచోట్ల సందేశాత్మకంగా చెప్పడం చూస్తాం. ఇవాళ తెలంగాణలో పాఠ్యగ్రంథాలను సరి కొత్తగా రూపొందించడం, సరికొత్త పాఠ్యప్రణాళికలను సంతరించడం జరుగుతోంది. పాఠశాల ఉన్నత విద్యాస్థాయి పాఠ్యగ్రంథాలలో సరోజనగారి ఈ ముచ్చట్లలోని అంశాలు వేటినయినా చేరిస్తే ఎంతో బాగుంటుంది. భావితరాలకు ఉపయుక్తమైన అంశాలెన్నో ఈ ముచ్చట్లలో వున్నాయి. ప్రయోజనదాయకమైన ఈ సంపుటికి సంతోషంతో స్వాగతం పలుకుతున్నాను.

మార్చి *2016*




# అక్షరానందిని దైనందిని

## అక్షరసేన (దైనందిని) - సాధన సాహితీ స్రవంతి

సంసారమనే విషవృక్షానికి రెండే రెండు అమృతఫలాలట! సద్గ్రంథపఠనం- సజ్జన సాంగత్యం. నిజానికి నిత్యం ఈ అమృతఫలాలు అందుకునే అవకాశం లభించడానికి మించిన 'సంపద' ఏముంటుంది? సాహిత్యాభిరుచి గలవారికి- ఈ దైనందిన ఫలాస్వాదనా అవకాశాలు ఎక్కువ. మంచిమాటలు వినడం, మాట్లాడుకోగలగడం, రాసుకోగలగడం, జీవితాన్ని వికాసవంతం చేస్తాయి. అన్నిరోజులూ, అన్నీ, అందరికీ, అన్నివేళలా, సమకూరే సమసమాజం ఇంకా ఏర్పడవలసేవుంది!

జీవితం వేగవంతం అయిన ఈరోజుల్లో, అందునా సాంకేతికత అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన నేడు, కలంపట్టి రాయడం, పుస్తకం చేతబట్టి చదవడం, ఆత్మీయంగా కలుసుకుని మాట్లాడుకోవడం అరుదైపోవడం వల్లనే-- ఉదాత్త విలువల జీవన స్వారస్యం మందగిస్తోంది అని పెద్దల అభిప్రాయం. పరికించి చూస్తే అది ఎంత వాస్తవమో అవగాహన లోనికి వస్తుంది.

కవులు, రచయితలూ, సాహితీవేత్తలూ- అక్షరసైనికులు. సాంకేతిక సైనికులు. "ఒక ఫిరంగి గుండు కన్న అక్షరానికి భయపడతా" నని నెపోలియన్ అంతటివాడే పేర్కొన్నాడు. 'అక్షర రూపం దాల్చిన ఒకేఒక్క సిరాచుక్క లక్షమెదళ్లకు కదలిక' అన్నారు కాళోజీ కవి. తమ దినచర్యను రాసుకోవడం అనేది ఎవరికయినా మంచి అలవాటు. అందునా సాహితీ పరుల 'దైనందిని' కి విలువ అధికం.

గురజాడ డైరీలు వంటివి కూడా సాహిత్య ప్రపంచంలో ఎంత విలువైనవిగా పరిణమించాయో– విజ్ఞులు ఎరుగనిది కాదు.

"రోజూ ముఖ ప్రక్షాళనం చేసుకున్నట్లు, దంత ధావనం చేసుకున్నట్లు, స్నానమాచరించినట్లు రోజూ నాలుగు వాక్యాలైనా కాగితం మీద రాయాలి" అని ప్రముఖ కథా నవలా రచయిత మల్లాది వెంకటకృష్ణమూర్తి అంటూంటారు. నిజంగా అది ఆచరణీయమైన మాట.

ఆ సాధన విస్మరించరాదనీ, అరపేజీ చోటులోనైనా దైనందిన అనుభూతినో, సాహిత్య సాంస్కృతిక అంశాన్నో, కలుసుకున్న వ్యక్తినో, చదివిన ఒక రచననో మనం నమోదు చేసుకోవాలనే సదాశయంతో– సాధన సాహితీ స్రవంతి రూపొందించిన డైరీ 'అక్షరసేన'. ప్రముఖ సాహితీ పరుల జయంతులు, వర్ధంతులు స్మరించుకోవడానికి, కవులూ, సజ్జన సాంగత్యం అభివృద్ధి పరుచుకోవడానికీ, తాము చదివిన పుస్తకాలను గుర్తుంచుకోవడానికీ, సభలూ సమావేశాల గురించి నమోదుచేసుకోవడానికీ, ఈ దైనందిని ఎంతగానో ఉపయుక్తమవుతుంది.

మామూలు డైరీలకూ, దీనికీ తేడావుందని మీరు గ్రహించగలుగుతారు. నిత్యం డైరీలో నిర్దేశింపబడిన జాగాలో ఏం రాసుకుంటారో మీ అభిరుచులమేరకు మీరే నిర్ణయించుకోవచ్చు. నెలనెలా మీరు చదివిన పుస్తకాల వివరాలనూ, కలుసుకున్న వ్యక్తులనూ మరిచిపోకుండా ఇందులో రాసిపెట్టుకోగల అవకాశం వుంది.

'అక్షరసేన' మీ వెంట వుంటే– మీ వ్యక్తిత్వ వికాసంతో– సంక్షుభిత వర్తమాన సమాజంలోని కల్లోల పరిస్థితులనూ ఆవలకునెడుతూ, అధిగమిస్తూ, మానవీయ విలువలతో, మనుగడలో జీవిత విజయాలనూ సాధిస్తూ, శాంతియుత ఆనంద జీవనం గడుపగలరని ఆకాంక్ష.

సాహితీ ప్రియుల సాధనా మార్గానికీ అందమైన ఊత 'అక్షరసేన'. రసరమ్య విజయాలని అనుభవంలోకి అందుకునే అనుభూతి యాత్రకు 'అక్షరసేన' అండదండ. మిమ్మల్ని మీరే దర్శించుకోగల అద్దంలో కొండ. దీనిని మీరు సమాదరించి సంతుష్టులవుతారని విశ్వాసం.

*2016*




# కొవ్వలి జాలపు పదాల వల

## 'పద'నిసలు – సత్యసాయి కొవ్వలి

మనకు 'కాలక్షేపం' అనే మాట ఒకటుంది. దానినే 'ఉబుసుపోక' అనీ అంటారు. 'ఉబుసు' అంటే – పనిలేని కాలము అని అర్థం. దాని 'పోక' ఎలా వుంటుందన్నదాని మీదే, 'ఉబుసుపోక' – అంటే 'తీరిక సమయ వినిమయం' ఆధారపడివుంది! తీరిక సమయాన్ని సద్వినియోగం చేసుకునే మార్గాలు అనేకం. నిజానికి లలితకళలు ఒకప్పుడు ప్రధాన వ్యావృత్తులు కాదు. ఉదరపోషణార్థం, వృత్తిరీత్యా చేసే పనులకూ; ప్రవృత్తిరీత్యా అభిరుచితో చేసే పనులకూ తేడా వుం(టుం)ది. అందుకే ఆ రోజుల్లో 'కళ కళ కోసమే' అన్న భావన ప్రాచుర్యంలో వుండేది.

ఒకప్పుడు 'ఉబుసుపోక' చేసే పనులు ఈ రోజుల్లో 'ప్రధాన వ్యావృత్తులు' అయ్యే పరిణామాలూ తటస్థిస్తున్నాయి. ఒకప్పుడు 'ఈల' వేయడం పోకిరీ లక్షణం. కానీ ఈలపాట రఘురామయ్య, విజిల్ విజార్డ్ శివప్రసాద్‌లు ఈలకు కూడా ఉదాత్త సంగీత గౌరవం కల్పించలేదా? అలా ఇవాళ అనేక 'కళ'లు ప్రయోజనం కోసమూ, సమాజహిత చింతనాభిలాషతోనూ కూడా పరిణమించాయి.

'గళ్ళ నుడికట్టు' – అనబడే 'క్రాస్‌వర్డ్ పజిల్' కాలక్షేపాన్ని ప్రధానంగా ఉద్దేశించే మొదలయింది. 19వ శతాబ్దిలో ఆంగ్లంలో ఇంగ్లాండులో మొదటిసారిగా రూపుదాల్చింది. 21 డిసెంబర్ 1913లో – 'న్యూయార్క్ వరల్డ్' దినపత్రిక ఆదివారం అనుబంధంలో డైమండ్ ఆకారంలో మొదటి క్రాస్‌వర్డ్ పజిల్

అచ్చయింది. లివర్ పూల్ వాసి 'ఆర్థర్‌వ్యిన్నె' దీనికి ఆద్యుడంటారు. దానికి విపరీతమైన స్పందన వచ్చింది. 1914లోనే పాఠకులు పజిల్స్ నిర్మించి పంపడాన్ని వ్యిన్నెనే ప్రోత్సహించాడట! 1920లో 'చదరపు పద్ధతి' ఆకారం అనేది స్థిరమైందిట! బ్రిటిష్ పత్రికల్లో మొదటిసారి 'పియర్సన్స్' మ్యాగజైన్‌లో 1922 ఫిబ్రవరిలో, అలాగే 1930 ఫిబ్రవరి 1న ప్రఖ్యాత 'టైమ్స్' మ్యాగజైన్‌లో క్రాస్‌వర్డ్ పజిల్ సాక్షాత్కరించింది. అమెరికా పత్రికలన్నీ ఈ ప్రక్రియను ఆదరించాయి. కానీ అమెరికన్ పజిల్స్ కన్నా, బ్రిటిష్ క్రాస్‌వర్డ్ పజిల్స్ నింపడం నిజానికి మెదడుకి మేతగానూ, ఆసక్తికరంగానూ వుండేవట. వాటికంత ప్రాచుర్యం, ప్రసిద్ధి లభించింది.

ఇచ్చిన ఆధారాలను బట్టి గడులలో అడ్డంగా, నిలువుగా పదాలను నింపాలి. ఆ పదం ఎన్ని అక్షరాలో ఆధారాల దగ్గర సూచించడమూ (గడుల విస్తృతిని బట్టి) సాగుతూ వుంటుంది. ఒక్కసారి కుడినుంచి ఎడమకు, పైనుంచి క్రిందకు చదువుకునేలా కూడా – నింపే పదాలకు ఆధారాలివ్వడం జరుగుతుంటుంది. అసలు ఆధారాలు ఇవ్వడంలోనే – పజిల్స్ నిర్మాత ప్రజ్ఞ, దానిని పట్టుకోవడంలోనే గళ్ళనుడికట్టు నింపేవారి తెలివీ ఆధారపడి వుంటాయి.

'కాలక్షేపం' కోసం నింపే పజిల్స్ – రాను రాను పజిల్స్ నింపడమే ఓ పనిగా మారినవారూ వున్నారు. క్రాస్‌వర్డ్ పజిల్స్ నింపే వ్యసనంలో పడి పనులు మందగిస్తున్నాయని, బ్రిటన్‌లో ఒక సందర్భంలో వీటి మీద నిషేధం కూడా విధించారట! ఆ తరువాతనే కార్యాలయ పనివేళల్లో – విశ్రాంతి సమయం అనేది ఏర్పరచి, అనుమతించారట! ఇటలీ, జపాన్, ఫ్రాన్స్, పోలెండ్, క్యూబా మొదలైన అనేక భాషల్లో క్రాస్‌వర్డ్ పజిల్స్ నేటికీ దూసుకు వెడుతున్నాయి.

ఇక మన సాహిత్యంలో చిత్రబంధ కవిత్వాల్లో నాగబంధాలు, పద్మబంధాలు వంటివి వున్నాయి. ఒక సిమ్మెట్రీలో పద్యాలను కూర్చడం వుంది. పాశ్చాత్య ఆంగ్ల ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్యంలోనూ క్రాస్‌వర్డ్ పజిల్స్ గళ్ళనుడికట్టులుగా, పదబంధ ప్రహేళికలుగా రూపుదాల్చాయి. తెలుగులో తొలి క్రాస్‌వర్డ్ పజిల్ శ్రీ దేవరాజు వేంకట కృష్ణారావ్ గారు 1937లో ప్రవేశపెట్టారట. కానీ శ్రీశ్రీ, ఆరుద్ర వీటికి విశేష ప్రాచుర్యాన్ని తెచ్చారు. తొలినాళ్ళలో కొన్ని పత్రికలలో ఓ అణాయో ఎంతో కట్టి పజిల్ నింపి పంపితే బహుమతులిచ్చే వ్యాపారధోరణి కూడా నడిచింది. జ్యోతి మాసపత్రిక శ్రీశ్రీ, ఆరుద్రల పజిల్స్ ప్రచురించింది.

ఇవాళ 'సుడోకు' అనే అంకెల కేళి పలు పత్రికల్లో కనిపిస్తోంది గానీ, దాని కన్నా భాషాసాహిత్యాలు, ప్రపంచపరిజ్ఞానం పెంచగల, కాలక్షేపానికి కాలక్షేపం, మెదడుకి చురుకు, హృదయానికి ఆనందం కలిగించగల గళ్ళనుడికట్టులే ఎక్కువ ప్రయోజనదాయకాలు. ముఖ్యంగా తెలుగుభాష అంతరించి పోగలదన్న భయాందోళనల కాలంలో అన్ని పత్రికలూ ఈ పదబంధాలను ప్రోత్సహించడమే మంచిదని విజ్ఞుల అభిప్రాయం! పిల్లలు తెలుగు మరిచిపోకుండా, తమకు వున్న తెలుగు పదసంపదను పెంచుకోవడానికీ, ఆనందంగా, ఆహ్లాదంగా ఓ క్రీడలా తెలుగు పదశక్తిని గ్రహించడానికీ, ఉపయుక్తం చేసుకోవడానికీ గళ్ళనుడికట్టులను మించిన ఆట'పట్టు'లు లేవు. నేటికీ అందుకే ఎన్నో తెలుగు దినపత్రికలు వీటిని అందిస్తున్నాయి. ప్రాచుర్యం తెస్తున్నాయి.

ఇది గ్రహించే 'అంతర్జాలం'లో కూడా వీటికి ఇప్పుడిప్పుడే సముచిత స్థానం కల్పిస్తున్నారు. 'మాలిక' అంతర్జాల పత్రిక రథసారథులైన శ్రీమతి జ్యోతివలబోజుగారు ఇచ్చిన ప్రోత్సాహంతో, తొలుత 'పొద్దు' అనే జాలపత్రికలో ఓ పాఠకునిగా 'గడి'ని తయారుచేసే అవకాశం లభించిన శ్రీ కొవ్వలి సత్యసాయిగారు – నెల నెలా కూర్చిన 'పదచంద్రిక'లను ఇప్పుడు 'పద' నిసలు పేర ఈ పుస్తకరూపంలో వెలయిస్తున్నారు. నిజానికి 'గళ్ళనుడికట్టులు' తెలుగులోనూ వేలాదిగా వచ్చినా, పుస్తకరూపంలో వచ్చినవి తక్కువే! శ్రీశ్రీ కూర్చిన పదబంధ ప్రహేళికలు శ్రీశ్రీ సర్వస్వంలో చోటుచేసుకున్నాయి. ఇటీవలే పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు తాము నిర్వహించిన పజిల్స్‌ను ఒక పుస్తకరూపంలో తీసుకువచ్చారు. ఈ పజిల్స్ పుస్తకాలు వ్రేళ్ళమీద లెక్కించేవిగానే తెలుగులో వున్నాయనడం సత్యదూరం కాదు.

శ్రీశ్రీ స్ఫూర్తితో, ఆరుద్రగారి ప్రేరణతో నేనూ ఇప్పటికి ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దిన, వారపత్రికల్లో, నవ్య వారపత్రికలో, రచన మాసపత్రికలో అయిదువేలకు పైగా గళ్ళనుడికట్టులు కూర్చాను. ప్రస్తుతం ఆంధ్రభూమి దినపత్రికలో 'మాటాట' పేరుతోనూ, 'నవ్య' వారపత్రికలో 'సుధామ పదగారడి' పేరిట, రచన మాసపత్రికలో 'పజిలింగ్ పజిల్' అనీ, ఆంధ్రభూమి వారపత్రికలో 'పదబంధ పారిజాతం' అనీ నా పజిల్స్ సాగుతున్నాయి. 'వార్త' దినపత్రిక ఆదివారం అనుబంధంలో పదేళ్ళు గళ్ళనుడికట్టులు నిర్వహించాను.

ఇలా పుస్తకరూపంలో గళ్ళనుడికట్టులు ప్రచురించాలన్న 'సత్యసాయి' సంకల్పం ఎంతో బాగుంది. బహుశా మొదటిసారిగా అంతర్జాలపు గళ్ళనుడికట్టు పుస్తకరూపంలో వెలువడుతున్న ఖ్యాతి సత్యసాయి కొవ్వలిగారికీ, ప్రచురిస్తున్న జ్యోతివలబోజుగారికే దక్కుతుంది. అయితే పుస్తకరూపంలో వచ్చే గళ్ళనుడికట్టులు ఒక సిమ్మెట్రీతో వుంటేనే ఎక్కువ బాగుంటాయి. అదేవిధంగా ఇచ్చే ఆధారాలు, తద్వారా పాఠకులు నింపుకునే పదాలు ఎప్పటికీ మాయని భాషా, సాహిత్యాలకు సంబంధించినవి అయి వుండాలి. అలాగే కూర్పరి తాను కూర్చిన నుడికట్టులకు వివరణలు ఇచ్చుకోనక్కరలేదు. 'ఈ ఏడాది రిపబ్లిక్ డే పెరేడ్ కు వచ్చిన అతిథి' అన్న బాపతుగా ఆధారాలు సమకాలిక గళ్ళనుడికట్టుల్లో నప్పుతుంది గానీ, ఇలా పుస్తకరూపంలో సంతరించినపుడు కాదు. అలాగే అధికశాతం పన్నెండు గళ్ళతో నిర్మించిన పజిల్స్ కనుక ఆధారాలులో విధిగా అది ఎన్ని అక్షరాల పదమో ఆధారం పక్కన సూచించడం బాగుంటుంది. (పదనిస 8, 9 వంటి వాటి చోట మిస్ అయినట్లున్నాయి) అలాగే పదనిస 22 వంటివి నాలుగు సమభాగాలుగా విభజింపబడక, పై రెండు భాగాలు అయిదు అడ్డం గడులు, ఆరు నిలువు గడులతో కూర్చడం ఒక ప్రయోగంగా భావించవచ్చు కానీ, అసలు అన్నీ ఒక సిమ్మెటీతో వుంటే - కూర్పరి నైపుణి, నింపేవారి కుశలత ఒక క్రమపద్ధతిలో రాణిస్తాయి. మున్ముందు వీటిపట్ల కూర్పరి మరింత శ్రద్ధ పెట్టవచ్చు.

ముందే చెప్పినట్లు దిన, వార, మాస పత్రికల్లో పజిల్స్ కూరుస్తున్నప్పుడు ఆయా దిన, వార, మాస విశేషాలనూ, సమకాలీనతను ప్రధానంగా కూర్పరి దృష్టిలో పెట్టుకోవడం, అలాగే అప్పటికప్పుడు వచ్చే పండుగలు, పబ్బాలవంటివాటిని, సమకాలీన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను దృష్టిలో వుంచుకుని పదాలనూ, వాటికి ఆధారాలనూ సంతరించడం ఎక్కువగా జరుగుతుంది. కాబట్టి - పుస్తకరూపంలో పజిల్స్‌కు ఒక సార్వకాలీనతను ఇవ్వదలిచినప్పుడు, భాషా, సాహిత్యాది నిర్ధారిత అంశాలతో, అన్ని కాలాలకూ వర్తించగల ఆధారాలనే చమత్కారంగా, నైపుణ్యంతో ఇస్తూ గ్రంథస్థం చేసినప్పుడు వాటిని ఎప్పుడు, ఎక్కడ, ఎవరయినా నింపుకుని ఆనందించగలుగుతారు. అందుకు తప్పక ఇలాంటి ప్రయత్నం దోహదం చేస్తుంది.

గళ్ళనుడికట్టుల కూర్పరి వైదుష్యం అంతా ఆధారాలు ఇవ్వడంలోనే వుంది. "పిల్లిలేని పినతల్లి వికారంతో కూడితే గరుత్మంతుడి తల్లి" అని 'వినత' అనే

పదానికి శ్రీశ్రీ ఆధారాన్ని సంతరించడం, పదబంధాలపై నా ఆసక్తికి తొలికారణం అయ్యింది! అలాగే సత్యసాయిగారు ఈ 'పదనిసలు'కు ఇచ్చిన ఆధారాలు – ఎంతో వైవిధ్యభరితంగా వున్నాయి. వీటిల్లో సాహిత్యం, సినిమాలు, సమకాలీన వ్యవహారాలు చమత్కారంగా, కొంత మకతికలతో బాగున్నాయి. సాధనవల్ల ఆధారాలు ఇచ్చే వైఖరి మరింత రాటుదేరుతూ వుంటుంది. గడిలో వచ్చే పదాలు ఒక్కోసారి రిపీట్ అవడం అతిమామూలయిన విషయమే! కానీ ఆ పదం గుర్తించేందుకు ఇచ్చే ఆధారం ఎప్పటికప్పుడు నవ్యతను సంతరించుకుని, అభివ్యక్తం కావడమే అసలయిన ప్రజ్ఞ!

సత్యసాయి ఆధారాల ఉదాహరణలు ఇవ్వాలనే లౌల్యం వదులుకుంటున్నాను. లేకపోతే కొవ్వలి వెయ్యి నవలలు లాగా, మా సత్యసాయి కొవ్వలి ఆధారాలలోని వైఖరులు తినబోతూ రుచులెందుకు? ఈ పుస్తకం మీ ప్రయాణంలో (రైల్లో, విమానంలో) నిజంగా బోలెడు కాలక్షేపం. అలాగే మీ పిల్లల తెలుగు పద సంపదను పెంచడానికీ, వారి భాషావికాసానికీ ఉపయుక్తం. ఇది సత్యం!

ఏ భాష అయినా అభివృద్ధి చెందాలంటే మాట్లాడడంతో సరిపోదు. ఆ భాషలో చదవటం, రాయటం, ఆలోచించటం కూడా చాలా ముఖ్యం! ఇవాళ తెలుగు మాట్లాడగలిగే ఎందరో పిల్లలకు చదవటం, రాయటం, తెలుగులో ఆలోచించటం మటుకు మృగ్యమవుతున్నాయి. ఆ దుర్దశనుండి రక్షించడానికీ – ఆడుతూ పాడుతూ, తెలుగులో ఆలోచిస్తూ, తెలుగు పదాలను ఈ గడులలో నింపుతూ, తెలుగు భాషాదీపం నిరంతరం వెలుగులీనేలా చేయడానికి ఉపయుక్తం కాగల ప్రచురణ ఇది.

మరింత కట్టుగా, మరింత పట్టుగా, రసమంచితంగా మున్ముందు సత్యసాయి పదబంధప్రహేళికలను సంతరిస్తారనీ, ఈ పదనిసలు సంతోషపు సరిగమలను పాఠక హృదయాలలో పలికిస్తాయనీ ఆశిస్తూ... అంతర్జాలపు తొట్టతొలి నుడికట్టు పుస్తకంగా దీనిని చారిత్రకం చేస్తున్న ప్రచురణకర్త, బ్లాగ్ గురువు శ్రీమతి జ్యోతి వలబోజుగారిని కూడా మనసా అభినందిస్తున్నాను. నాకీ నాలుగు మాటలు పలికే గౌరవాన్ని ఆపాదించినందుకు వారిరువురికీ నా ధన్యవాదాలు.

*జూన్ 2017*




# శారదాధామం సికింద్రాబాద్

## నా సిరిచుక్క సికింద్రాబాద్ - శారదా అశోకవర్ధన్

**తె**లుగు వారి జంటనగరాలుగా పేరుగాంచిన హైదరాబాద్ సికింద్రాబాద్‌లలో నిజానికి రెండింటివీ రెండు భిన్న సంస్కృతులు. చాళుక్యుల తరువాత ఈ ప్రాంతం కాకతీయరాజుల పరిపాలనలోకి వచ్చినా, 18వ శతాబ్దం నాటికి 'నిజాం' అధీనంలోకి వచ్చింది. బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ చేతిలో పరాజితుడైన రెండవ నిజాం అసఫ్‌జా - 1798 లో సికింద్రాబాద్ ప్రాంతాన్ని బ్రిటిష్ వారికి అప్పగిస్తూ, సంతకం చేయక తప్పలేదు. హైదరాబాద్ మూడవ నిజాం-నిజాం సికిందర్ జా, ఉల్ వుల్ (ULWUL) గా పిలవబడే ఈ ప్రాంతానికి, తన పేర 'సికింద్రాబాద్' అనే నామకరణం చేశాడు. 1806లో 'సికింద్రాబాద్'- నగరంగా వెలసిందన్నమాట!

సికింద్రాబాద్ అధికారభాష మటుకు-బ్రిటీష్ కంటోన్మెంట్ ప్రాంతం కనుక, ఇంగ్లీష్‌గానే వుండింది. పైగా ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాల స్థావరంగా ఇక్కడ దిగుమతి సరుకులకు 'కస్టమ్స్ డ్యూటీ' కూడా వుండేది కాదట!. వ్యాపార కూడళ్ళుగానే రెజిమెంటల్ బజార్, జనరల్ బజార్ నెలకొల్పబడ్డాయి. 1857 సిపాయిల తిరుగుబాటు అనంతరం-తిరుమలగిరిలో ఏడు మీటర్ల ఎత్తయిన ప్రహరీగోడ నిర్మాణం మొదలెట్టి, 1867లో పూర్తి చేశారు. దక్షిణమధ్య రైల్వే జోనల్ హెడ్‌క్వార్టర్స్‌గా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 1874లో ఏర్పడింది. ప్రస్తుతం గాంధీహాస్పిటల్‌గా మనం వ్యవహరిస్తున్నది-1851లో 'కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్

హాస్పిటల్‌గా' రూపుదాల్చిందే! బ్రిటిష్ రెసిడెంట్ కంట్రీహౌస్‌గా నిర్మించిన 1860 నాటి భవనం-నేడు 'రాష్ట్రపతి నిలయంగా' అయింది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటిష్ ఆర్మీ అధిపతిగా, 1890లో-యునైటెడ్ కింగ్‌డమ్ ప్రైమ్మినిస్టర్‌గా చేసిన, సర్ విన్‌స్టన్ చర్చిల్ సికింద్రాబాద్ లోనే పనిచేశారు. మలేరియా వ్యాధి గురించి సర్ రోనాల్డ్‌రాస్ సికింద్రాబాద్ లోనే నివసించి, ప్రాథమిక పరిశోధనలు చేశాడు. నేడు మినిస్టర్ రోడ్ లోని "సర్ రోనాల్డ్ రాస్ ఇనిస్టిట్యూట్" నాడు తాను నివసించిన భవనమే!

1945లో సికింద్రాబాద్ మున్సిపాలిటీ కూడా వేరుగా వుండేది. 1960కి హైద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైంది. హైదరాబాద్ జిల్లాలో నేడు సికింద్రాబాద్ ఒక ప్రాంతం! 2006లో సికింద్రాబాద్ ద్విశతాబ్ది ఉత్సవాలు జరిగాయి. స్వాతంత్ర్యానంతరం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు-ఇండియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ పరిధిలోకి వచ్చింది. దానితో పెద్ద మిలిటరీ యూనిట్స్ అనేకం ఇక్కడ వెలిసాయి. పారడైజ్ సర్కిల్, తిరుమలగిరి, జవహర్ నగర్ కాలనీ, మారేడ్ పల్లి, జీరా, జనరల్ బజార్, సీతాఫల్‌మండి, కార్ఖానా, రాణీగంజ్, న్యూ బోయిగూడ, బోయినపల్లి ఇవన్నీ సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలుగానే ప్రసిద్ధం. 2008 వరకూ బేగంపేట ఎయిర్ పోర్టే సికింద్రాబాద్ దగ్గరగా విమాన సర్వీసులను, జంటనగరాల వాసులకు అందించింది. హైద్రాబాద్, సికింద్రాబాద్‌లను అనుసంధానం చేసేదిగా ట్యాంక్ బండ్ ప్రసిద్ధమైంది. 'కింగ్స్ వే'గా పేరొందిన నేటి రాష్ట్రపతిరోడ్, నాడు 'జేమ్స్ స్ట్రీట్'గా పిలువబడిన నేటి మహాత్మాగాంధీరోడ్- రెండు నగరాలనూ కలిపే ప్రధాన రహదారులు. సంస్కృతిపరంగా పార్సీలు, ఆంగ్లో ఇండియన్లు సికింద్రాబాద్‌లో ఎక్కువగా వుండి, ఒక 'కాస్మోపాలిటన్ సిటీ'గా ఇది అభివృద్ధి చెందింది. నిజాం కాలంనాడు కూడా - ఒక విధంగా సికింద్రాబాద్ బ్రిటిష్ ప్రమేయంవల్ల, ఒక స్వేచ్ఛాయుత నగరంగానే 'లష్కర్' పేరున విరాజిల్లింది.

ఆ రోజుల్లో భారతదేశం మొత్తంమీద సికింద్రాబాద్ లోని ఒక్క 'ప్లాజా' సినిమా థియేటర్లోనే, సినిమా చూస్తూ ప్రేక్షకులు 'బీర్' తాగడానికి అనుమతి వుండేదట! అలాగే సికింద్రాబాద్ లోని సంగీత్ థియేటర్లోనే హాలీవుడ్ సినిమాల ప్రదర్శన అధికంగా జరిగేది. మొదటి సాలార్జంగ్ కానుకగా ఇచ్చిన - కంట్రీ హౌస్ లోనే 1878లో 'సికింద్రాబాద్ క్లబ్' స్థాపించబడింది. అలాగే

జింఖానా(గ్రౌండ్స్ లోనే-రిపబ్లిక్ డే పెరేడ్‌లు ఇతర బహిరంగ ప్రదర్శనలు జరగడం ఆనవాయితీ! బోనాలకు సికింద్రాబాదే ప్రధాన నిలయంగా వుండేది. ఇక్కడి మహంకాళి దేవాలయం, లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం ప్రసిద్ధాలు. అలాగే వెస్లీ చర్చ్, సెంట్‌మేరీ చర్చ్ ప్రముఖమై, క్రిస్మస్ వేడుకలకు కేంద్రకంగా భాసించేవి. హైద్రాబాద్ నవాబీ సంస్కృతికి భిన్నమైన సంస్కృతి సికింద్రాబాద్ లోనే పరిఢవిల్లింది! అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు ఎం. ఎల్.జయసింహ జన్మించింది సికింద్రాబాద్ లోనే. అలాగే ఒలింపిక్స్ లో పేరొందిన మిల్కాసింగ్ అథ్లెటిక్స్ ను సికింద్రాబాద్ లో, ఆర్మీలో, ఎలక్ట్రికల్ మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ లో పనిచేసినప్పుడే మొదలెట్టాడు. సికింద్రాబాద్ లోనే బాక్సింగ్ అసోసియేషన్, బాస్కెట్ బాల్ అసోసియేషన్, ఉమెన్స్ క్రికెట్ అసోసియేషన్, హాకీ అసోసియేషన్, స్కల్లింగ్ అండ్ రోయింగ్ అసోసియేషన్లకు స్థావరాలున్నాయి. ఇలా సికింద్రాబాద్ బహుముఖీనంగా విరాజిల్లిన, తనదైన అస్తిత్వంగల విశిష్ట నగరం.

అలాంటి సికింద్రాబాద్‌ను తన 'సిరిచుక్క'గా సంభావిస్తూ, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి శ్రీమతి శారదా అశోకవర్ధన్ గారు సికింద్రాబాద్ నగర వైభవ ప్రాభవాలను, ఇక్కడి జీవనసరళిని, మానవ సంబంధాలను తన స్వీయచరిత్ర మూలకందంగా పఠనీయంగా చెప్పిన, కదిలించే కమ్మని కబుర్ల కదంబం ఈ గ్రంథం. తన జీవితపు ఆటుపోట్లకు, ఒడిదుడుకులకు, సుఖదుఃఖాలకు కేంద్రకం ఈ నగరమే. శారదగారు స్వయంశక్తితో, ఆత్మస్థైర్యంతో ఎదిగివచ్చిన మహిళ. సికింద్రాబాద్ క్లాక్ టవర్ లాగానే, కాలంతో ఎత్తుకు ఎదిగిన ధీర ఆమె. ఆకాశవాణిలో ఎందరు శారదలున్నా ఆ రోజుల్లో 'గళం శారద'గా నాటక విభాగానికి చెందిన శారదా శ్రీనివాసన్‌గారు, 'కలం శారద'గా శారదా అశోకవర్ధన్ గారు ప్రముఖులు. శారదా అశోకవర్ధన్ గారు కలాన్నే కాక, తన గళాన్నీ ఎన్నో ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యాఖ్యాత్రిగా అందించిన వారే.

సమాచారశాఖ నుంచి డిప్యుటేషన్ పై కొన్నేళ్ళు ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రం కుటుంబనియంత్రణ విభాగంలో పనిచేసి, తనదైన ముద్రచూపి, తిరిగి సమాచారశాఖకు వెళ్ళి, బాలభవన్ డైరెక్టర్ గా బాలసాహిత్యాన్ని, చిన్నారుల ప్రపంచాన్నీ వికసింపజేసి పేరొందిన అధికారిణి. ఒకవంక సమర్థంగా ఏ ఉద్యోగంలో వున్నా అధికార బాధ్యతలు నిర్వర్తిస్తూనే, సృజనశీలిగా కవితలు, కథలు, నవలలు రాస్తూ రచయిత్రిగా, సాహితీవేత్తగా ఎదిగిన మహిళామణి

శారదా అశోకవర్ధన్. నాటికీ నేటికీ ఆవిడ సికింద్రాబాద్ వాసియే! అందుకే 'ఒక నివాసి కథనం' అంటూ సికింద్రాబాద్ చరిత్రను తన స్వీయ జీవితానుభవాలు, జ్ఞాపకాలతో ముడిపెడుతూ విలక్షణమైన ఈ రచన చేశారు. 1956లో ఉద్యోగజీవితం ప్రారంభించిన శారదగారికి ఈ 2016 ఒక విధంగా షష్టిపూర్తి సంవత్సరం. అలాగే ఆవిడ సాహిత్యసృజన ఆరంభించి కూడా అరవై ఏండ్లయిందని చెప్పాలి. ఇప్పటికి అరవై అయిదుకి పైగా పుస్తకాలు ఆవిడ ప్రచురించారు. తాను చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదనే చెప్పాలి. చరిత్రలో నమోదు కాలేదు గానీ, తెలుగు సినిమాపాట రాసిన తొలి కవయిత్రి కూడా తనే.

ఈ గ్రంథం ఈ తరానికి, ముఖ్యంగా యువతులకు స్ఫూర్తిదాయకంగా వుండగలదు. సంపదలన్నీ తొలగి, దారిద్ర్యస్థితికి నెట్టవేయబడిన స్థితిలోకూడా స్థిరంగా నిలబడి, ఆత్మవిశ్వాసంతో ఎదిగి, దీక్షాదక్షతలతో పనిచేసి, తనకంటూ సమాజంలో– వృత్తిలోనూ, ప్రవృత్తిలోనూ ఒక గుర్తింపు సుస్థిరం చేసుకున్న ఒక మహిళ అనుభవాలూ, జ్ఞాపకాల సంపుటి ఈ రచన. దానికి తోడు తాను ఏ గడ్డన తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్నదీ, ఆ నగర విశేషాలను తన జ్ఞాపకాలతో బాటు గుదిగుచ్చి వివరించిన కమనీయకథనం ఇది. కన్నతల్లినీ, ఉన్నఊరునూ విస్మరించక తన ఎదుగుదలకు కారణమైన వారిని స్మరిస్తూ, తన బ్రతుకు మలుపులనూ, ఉద్యోగజీవిత విశేషాలనూ, సాహితీవ్యాసంగాన్నీ, ఆసక్తిదాయకంగా ఆత్మీయుల కబుర్లు వింటున్నంత కుతూహలదాయకంగా ఈ పుస్తకం రాశారు శారదా అశోకవర్ధన్ గారు.

ఈ గ్రంథపఠనంవల్ల సికింద్రాబాద్ నగరం గురించీ, ఆ నగర నివాసిగా ఎంతో ఎదిగిన శ్రీమతి శారదా అశోకవర్ధన్‌గారి చైతన్యవంతమైన జీవితం గురించీ అనేక సంగతులు గ్రహించగలుగుతాం. ఇదొక విలక్షణ ఆత్మకథనాత్మక రచనం. తన జ్ఞాపకాల పొరల్లోంచి ఎన్నో విశేషాలను వెలికితీసి రాసిన రచన ఇది. రాస్తున్నప్పుడు మరుపు తెరల్లోకి వెళ్లిపోయిన ప్రదేశాలు, వ్యక్తులు, ఘటనలు కొన్ని వుంటే వుండవచ్చును. నిజానికి ఏ ఆత్మకథా సమగ్రం కా(లే)దు. అయినా ముఖ్యమైన, పఠనయోగ్యమైన కథనాలను ఇలా చక్కని రచనగా అందించినందుకు రచయిత్రికి మనసా అభినందనలు.

నాడు సికింద్రాబాద్ 5, కింగ్స్‌వేలోని శ్రీ వంగపల్లి విశ్వనాథంగారింట్లోనే జంటనగరాల పేరెన్నికగన్న నాటి సాహితీ సాంస్కృతిక సంస్థ 'యువభారతి' చిరునామా! ఇప్పటికి 185 పైగా గ్రంథాలను యువభారతి వెలువరించింది. యువకునిగా ఆరోజుల్లో కింగ్స్‌వే లోని యువభారతి కార్యాలయం అంటే మా విశ్వనాథంగారింట్లో కాళోజీగారు ఖలీల్ జిబ్రాన్ 'దిప్రాఫెట్'కు 'జీవనగీత' పేర తెనుగు చేసినప్పుడు, దాని ప్రెస్ కాపీ రాస్తూ గడిపిన దినాలు, అలాగే శివాజీ ప్రెస్‌లో యువభారతి పుస్తకాల ప్రూఫ్‌లు చూడడాలు, పబ్బా శంకరయ్యగారు, మడిపడగ బలరామాచార్యగారు, ఇక ఇంటింటి స్వంత గ్రంథాలయ ప్రణాళికలో చేరి ఎమెస్కో ప్రచురణాలయానికి వెళ్ళి ఆ పుస్తక ప్రపంచంలో మునిగి ఆనందించిన దినాలు ఇవన్నీ శారదగారి ఈ పుస్తకం నాలోనూ రేపిన జ్ఞాపకాల తేనెతుట్టెయే!

శ్రీమతి శారదా అశోకవర్ధన్‌గారి ఈ పుస్తకం జంటనగరాల వాసులకే కాదు, తెలుగు పాఠకులందరికీ మంచి ఉపాయనం. ఇలాంటి మంచి గ్రంథం వెలయించిన రచయిత్రికి మరోమారు నమస్సుమనస్సులతో...

*25 ఫిబ్రవరి 2016*



# బహుముఖ భావధార!

## అద్దంలో మనం (నాలుగో సంపుటం) - ఎ.ఎస్. లక్ష్మి

అద్దం అనగానే మన ప్రతిబింబం చూసుకునే సాధనం అని స్థూలంగా భావన. అది నిజమేగానీ! ఆవలివైపు దృశ్యాలనూ యథార్థంగా చూపించే అద్దాలు వున్నాయి. అద్దాల జాకెట్టు మీది బొట్టు బిళ్ళ అద్దం దగ్గర్నుండి, నిలువుటద్దం వరకూ బహు తరహా అద్దాలు వున్నాయి. అద్దాల బీరువాలు, డ్రెస్సింగ్ టేబుల్స్ ఇంట్లో ప్రధాన వస్తు సంచయమే! ఎక్కడవున్నా, ఎలావున్నా అద్దం, అద్దాని ప్రయోజనం అందరికీ తెలిసిందే!

అద్దం- మనల్ని మనకు చూపించడమే కాదు. మనల్ని మనం సంస్కరించుకోవడానికీ మూల కారకం! మనకి మనమే కాదు, ఎదుటి వారికీ ఎలా కనబడాలనుకుంటామో- అలా సింగారించుకోవడానికీ, ముఖసౌందర్యాన్ని మలుచుకోవడానికీ, వస్త్రధారణ చేసుకోవడానికీ ఉపయుక్తమైన హితవరి. బాహ్యసౌందర్యమే కాదు మానసిక సౌందర్యమూ ముఖ్యం. కనుకనే- 'అద్దంలాంటి మనస్సుండాలి' అన్నదీ ఆర్ష సంప్రదాయపు హితవు.

ఇదంతా చెప్పడం ఎందుకంటే అద్దం వెనుకగల ఇంతటి బహుముఖ భావధారను అందిపుచ్చుకునే- ఎ.ఎస్.లక్ష్మి తాను రాసే 'కాలమ్'కు 'అద్దంలోమనం' అనే ఎంతో ఔచితీమంతమైన పేరు పెట్టారనిపిస్తుంది.

"నేనింకా 'నా' నుంచి 'మా' వరకే రాలేదు. 'మన' అనుకున్నప్పుడు కదా ముందడుగు" అన్నారు ప్రజాకవి కాళోజి. అలాంటి ఒక ముందడుగుతో రూపొందిన కాలమ్- 'అద్దంలో మనం'. ఆంధ్రభూమి వారపత్రిక, మాసపత్రికల

అసిస్టెంట్ ఎడిటర్ గా బాధ్యతాయుతమైన వృత్తిని నిర్వహిస్తూనే- వారం వారం 'అద్దంలోమనం', నెలనెలా 'భలేశాల్తీస్' అంటూ లక్ష్మిగారు రాస్తున్న కాలమ్స్ ఆయా పత్రికలకు ఒక సొబగునూ, సౌందర్యాన్నీ, స్థాయినేకాక, పాఠకులను అలరించడంలో అగ్రగామి కావడానికి ఆధారభూమిక అయ్యాయి..

'అద్దంలో మనం'- తెలిసిన సంగతులకే కొత్త కోణం అనడం వినమ్రతా లక్షణమేగానీ, ఎందరికో తెలియని ఎన్నో సంగతులను, విషయాలను అందిపుచ్చుకుని, ఆలోచించవలసిన వైఖరులను పరిచయం చేసేవని పాఠకుల ఉత్తరాలే తార్కాణం! ఒక వంక సంపాదకత్వ బాధ్యతలను నిర్వహిస్తూ, ఇన్నేళ్ళుగా 'కాలమ్' రాసిన ఏకైక మహిళా జర్నలిస్టు ఎ.ఎస్. లక్ష్మిగారేనేమో! రికార్డు బుక్కుల కెక్కాలన్న చాపల్యం ఏమీ లేకుండా, ఇంత విస్తృతిని తన కలంతో సొంతం చేసుకున్న కాలమిస్టు.

ఎ.ఎస్. లక్ష్మి అంటే అద్దంలో సమాజ లక్ష్మి, అద్దంలో సాహిత్య లక్ష్మి, అద్దంలో సందేశలక్ష్మి, అద్దంలో సంగీత లక్ష్మి, అద్దంలో సమన్వయ లక్ష్మి, అద్దంలో సంస్కృతీలక్ష్మి, అద్దంలో సరదాలక్ష్మి అన్నట్లుగా శ్రీమతి అయ్యగారి సీతామహాలక్ష్మి రచనా వైదుష్యానికీ, విస్తృత అధ్యయనానికీ, విషయాల వింగడింపుకీ, పఠనాసక్తితో బాటు ప్రయోజనకరమైన ఆలోచనలను సంతరించుకోవడానికి పాఠకులకు దోహదపడుతున్న సంపాదకత్వానికీ దర్పణం- ఈ... 'అద్దంలో మనం'.

'అద్దంలో మనం' ఇది నాల్గవ సంపుటి. బాపుగారి ముఖచిత్రంతో తిలకం దిద్దుకుని, గతంలో వెలువడిన మూడు సంపుటాలూ పాఠకాదరణను చూరగొన్నాయి. వారం వారం పత్రికలో చదివినవే అయినా, విషయాలు ఆయా దేశ, కాల, పరిస్థితులకు అనుగుణంగా సమకాలీనత దృష్ట్యా రాయబడినవే అయినా, చదివినవే అయినా - వాటిని కూడా ఒక నెమరువేతగానేకాక, పునర్మూల్యాంకనం చేసుకునే ఆలోచనాత్మకతనూ కలిగినవి కావడం వల్లే- ఎంతగానో సమాదరణీయమవుతున్నాయి. తన వ్యాసాలనలా తీర్చిదిద్దడం ఆమె ప్రజ్ఞ.

శ్రీమతి లక్ష్మిగారి కలంలోని మరో ప్రత్యేకత ఏమిటంటే కాంతాసమ్మితంగా విషయవివరణం చేస్తూనే, స్త్రీవాద సాధికారతను నిలుపుకుంటూనే, అతివాద, మితవాద ధోరణులకు దూకుడుగా పోకుండా ఒక 'సమ్యక్ దృష్టి' ని తన రచనల్లో అభివ్యక్తం చేయడం!. అంతర్జాతీయ రాజకీయాలనుండి, ఇంట్లో అతివలు, పిల్లల

సమస్యల వరకూ వీటిల్లో స్పృశింపబడని అంశాలు లేవు. అయితే ఏది రాసినా తలస్పర్శిగా పైపైన గాక, లోతులు ముట్టే నిశిత అభివ్యక్తి కోణాలు ఈ రచనల్లో కానవస్తాయి. సంప్రదాయం పట్ల గౌరవం, మంచికోసం జరిగే మార్పుల పట్ల సదవగాహనం గల రచయిత్రి లక్ష్మి,

'అమెరికా అతి', 'కలికాలపు సత్యపీఠం', నోటాతో 'నో', 'మెదళ్ళకు చెదలు', 'అభద్రతాపథకాలు', 'ప్రజాగ్రహమే వజ్రాయుధం', 'నార్వే నుంచి నేర్వలేమా', 'విప్లవం వర్ధిల్లాలి', 'ఆత్మకథలు–అబద్ధాలు', 'హింస లేనిదెక్కడ', 'నీట్ నెట్', 'ఇంత అతి అవసరమా?', 'డిజైనర్ చదువులు' వంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే! ఈ సంపుటిలో వీటిని చదువుతూంటే– ఒక కాలమిస్టుగా, జర్నలిస్టుగా, ఎడిటర్‌గా మాత్రమే కాదు, ఒక సోషలిస్టుగా, ఒక హ్యూమనిస్టుగా లక్ష్మిగారి ముందడుగులు స్ఫుటంగా తెలుస్తాయి. సంప్రదాయం పునాదుల మీద సమాజహిత చింతనాభిలాషతో సమకాలీనతలను సమన్వయం చేసుకుని, సమ్యక్ దృష్టితో కలం పట్టిన కాలమిస్టు రచయిత్రిగా లక్ష్మిగారి విశిష్టతను గ్రహించగలం. ఎ.ఎస్.లక్ష్మి అద్దంలో మనంకు 'ఓ.యస్' అంటూ ఆంధ్రభూమి పాఠకులు పొంగిపోతున్న కారణాన్ని కనిపెట్టగలం! 'కొని' చదివి, మీరే కొనియాడవచ్చు మరి!

ఇలానే మానవ మనస్తత్వాలలోని విభిన్న పార్శ్వాలను ఒక సైకాలజిస్టు గ్రహించినంత బెస్టుగా, ఆంధ్రభూమి మాసపత్రికలో నెలనెలా రూపుకట్టిస్తున్న ఎ.ఎస్. లక్ష్మి 'భలేశాల్తీస్' కూడా ఇలా నిరంతరాయంగా సాగాలనీ, తన రచనా స్రవంతి జీవనధారగా పాఠక ప్రపంచాన్ని తనియింపజేస్తూ, అలరారాలనీ మనసారా ఆకాంక్షిస్తున్నాను. 'ముంజేతి కంకణానికి అద్దమెందుకు' అన్నట్లుగా ఇప్పటికే అసంఖ్యాక పాఠకుల ఆదరణపాత్రమైన, 'అద్దంలో మనం' సంపుటానికి ఈ మున్నుడి మిత్రవాక్యమే కానీ మరొకటి కాదని మాత్రమే చెప్పగలను. సరదాగా ఓ మాటందామా

*"సీతాలు సింగారం*<br>
*మాలచ్మి బంగారం*<br>
*సీతామాలక్ష్మి అంటే*<br>
*'అద్దంలో మనం'కు*<br>
*అచ్చమైన అక్షర శ్రీకారం"*

*జనవరి 2017*




# చెదరిన కళ్లను గట్టుడి!

## నుడిక్రీడ (ప్రామాణిక తెలుగు గళ్ల నుడికట్లు)- ఎలనాగ

ఈ నుడికట్టు కూర్పరి నేర్పరి ఎవరని
పదం చివర ముక్తాయింపుగా నాతో దీర్ఘం తీస్తే ఎలాగ

ఒకరోజు రాత్రి పదిన్నరకు ఫోన్ వచ్చింది. ఎక్కడో శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ ఆ వేళకు అలా ఫోన్ చేసింది తొంభయ్యవపడిలోని ఓ ప్రముఖ కథారచయిత. చేసిన కారణం- ఆయన నింపుతున్న గళ్ల నుడికట్టులో నేనిచ్చిన ఒక ఆధారానికి ఎంతకీ సమాధానమైన పదం స్ఫురించకపోవడం. అదొక్కటీ తెలిస్తే పూర్తి చేసిన తృప్తి కలుగుతుంది. అది తట్టక నిద్రపట్టడం లేదు. అంచేత ఇక ఉండబట్టలేక ఫోన్ చేసి తెలుసుకుని, పజిల్ పూర్తయిన గుండె నిబ్బరంతో నిద్రపోవచ్చుని. ఆలోచిస్తే అది ఆయన నింపగలిగేదే! అయితే ఆ వేళకు ఆధారంలోని తికమకను పట్టుకుని సమాధానం సాధించగలిగే వెసులుబాటు లభించలేదంతే! ఆయన కారా మాస్టారు.

గళ్ల నుడికట్టులనబడే ఈ క్రాస్‌వర్డ్ పజిల్స్ చాలామందికి ఒక వ్యసనం. అయితే ఒక ఆరోగ్యకరమైన వ్యసనం. నిజానికి ఆంగ్ల పజిళ్లు మూలకందంగానే- మన తెలుగులోనూ ఇవి రూపొందాయి. ఆంగ్లంలో 'న్యూయార్క్ వరల్డ్' దినపత్రిక తన ఆదివారం అనుబంధంలో 1913 డిసెంబర్ 21న మొదటిసారిగా ఈ క్రాస్‌వర్డ్ పజిల్ ప్రవేశపెట్టింది. 'ఆర్థర్ వ్యిన్నె' దాని కూర్పరి. పాఠకులే పజిల్స్

తయారు చేయడాన్ని 1914లో వ్యిన్నేనే ప్రోత్సహించాడు. 'టైమ్స్' మ్యాగజైన్ 1930 ఫిబ్రవరి ఒకటిన క్రాస్‌వర్డ్ పజిల్స్ మొదలెట్టింది. డైమండ్ ఆకారంలో తొలి క్రాస్‌వర్డ్ పజిల్ రూపొందగా, అనంతర కాలంలో 1920ల్లో 'చదరపు పద్ధతి' స్థిరపడింది. మన దేశంలో 'ద హిందు', 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఆంగ్ల పత్రికలు క్రాస్ వర్డ్ పజిల్స్ నిర్వహించే మేటి పత్రికలు. ముఖ్యంగా 'ద హిందు' పజిల్స్ నింపడం శ్రీశ్రీ వంటి మహాకవికి సైతం వ్యసనంగా వుండేది. నుడికట్టు మొదటగా తెలుగులో 1937లో తొలి తెలుగు అపరాధ పరిశోధక నవలారచయితగా మనం చెప్పుకునే శ్రీ దేవరాజు వేంకటకృష్ణారావుగారు ఆంధ్ర భారతిలో 'పదసమస్య బోధిని'గా కూర్చారట! అయితే తెలుగు గళ్ల నుడికట్టులకు 'పదబంధ ప్రహేళిక'గా విస్తృతినీ, వైశిష్ట్యాన్నీ అందించింది శ్రీశ్రీగారే. జ్యోతి మాస పత్రికలో శ్రీశ్రీ గళ్ల నుడికట్టులు నింపిన ఆరుద్ర అనంతర కాలంలో తానూ ఈ పజిల్స్ నిర్మించాడు.

నిజానికి ఈ గళ్ల నుడికట్టులు 'కాలిక' పత్రికల్లోనే బాగా రాణిస్తాయి అనిపిస్తుంది. దిన, వార, మాసపత్రికల్లో వీటిని నింపడానికి అలవాటు పడినవారు అసంఖ్యాకంగా వున్నారు. అందుకే నేటికీ తెలుగు పత్రికలనేకం వీటిని సమాదరిస్తున్నాయి. ఆధునిక సాంకేతికత పర్యవసానంగా వచ్చిన అంతర్జాల పత్రికల్లోనూ ప్రస్తుతం ఇవి క్రమేపీ ఆదరణను పుంజుకుంటున్నాయి. 'క్రాస్‌వర్డ్ పజిల్స్' పుస్తకాలుగా ఆంగ్లంలో విరివిగా వచ్చాయి. కానీ తెలుగులో తక్కువే! శ్రీశ్రీ సాహిత్య సర్వస్వంలో ఆయన పజిల్స్ అన్నీ గ్రంథస్థమయ్యాయి. అలాగే బహుళ సంఖ్యలో పజిల్స్ నిర్మించిన పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారూ, 'పొద్దు', 'మాలిక' అంతర్జాల మాసపత్రికల్లో గడి కూర్పరిగా ఇటీవలే సత్యసాయి కొవ్వలి 'పదనిసలు' పేర తాను కూర్చిన వాటిని పుస్తకరూపంలో వెలుగులోకి తెచ్చారు. ఇంకా మరికొన్ని వుండవచ్చు.

కానీ ఇప్పుడు సరికొత్తగా వెలువడుతున్న ఈ 'నుడి' క్రాస్‌వర్డ్ పజిళ్లలో డా॥ఎన్. సురేంద్రగారి ప్రస్థానం ప్రత్యేకించి చెప్పుకోవాలి. ఆంధ్రాంగ్లాలు రెండింటి లోనూ భాషపై గొప్ప పట్టు వున్నవాడీయన. ఒకప్పుడు 'రచన' మాసపత్రికలో, ఆపై 'వాకిలి' అంతర్జాల మాసపత్రికలో నిర్వహించిన పజిళ్లు తెలుగు పజిళ్లలో

ఇంతవరకూ వచ్చిన వాటన్నింటిలో నా దృష్టిలో (శ్రీశ్రీ, ఆరుద్రగార్ల వాటితో సహా) నవ్యతను, వైవిధ్యాన్ని ఉన్నత ప్రమాణాలలో కలిగినవని ఒప్పుకు తీరాలి! పలు దిన, వార, మాసపత్రికల్లో వేలాది గళ్ల నుడికట్టులు కూర్చిన మీ సుధామ పట్ల గల ప్రేమాదరాలతో ఈ 'మున్నుడి' సంతరించమని కోరడం తన అభిమానం, వాత్సల్యం మాత్రమే!

శరత్ బాబు (శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ) నవలలు ఎంత ప్రసిద్ధాలో, జనాదరణ పొందాయో మనకు తెలుసు. బెంగాలీలో బంకించంద్ర ఛటర్జీ (వందేమాతరం గీతకర్త, నవలారచయిత) రచనల గురించి ఒకసారి ఒకాయన శరత్ బాబుతో, "మీ నవలలు మాకు ఎంతో హాయిగా, గొప్ప పఠనీయంగా వుంటాయి. బంకించంద్ర గారివి అలా వుండవేం," అని అడిగాడట. దానికి శరత్ బాబు, 'నేను మీలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని మాత్రమే రాస్తాను. కానీ ఆయన మాలాంటి వారికోసం స్ఫూర్తిదాయకంగా రాసే రచయిత,' అని నవ్వుతూ సమాధానం ఇచ్చాడట. అలాగే పాఠకులకోసం దిన, వార, మాసపత్రికల్లో పజిల్స్ నిర్మించే ఎందరో కూర్పరులకు కూడా మేథకు పదును పెట్టే, స్ఫూర్తిమంతమైన నుడికట్టులు కూర్చే నేర్పరి ఈయన. శ్రీశ్రీ 'పదబంధ ప్రహేళి'కల ప్రామాణికత, జటిలతలను అధిగమించే కృషి వీటిల్లో కనబడుతోంది. 'న్యూయార్క్ టైమ్స్'లో వచ్చే క్రాస్‌వర్డ్ పజిల్స్ సోమవారం కొంచెం సులభంగా వుంటే, శనివారం వచ్చేనాటికి అతి క్లిష్టంగా వుంటాయి. అలా వివిధ స్థాయిల్లో వాటిని నిర్మించే దక్షతను తెలుగులో చూపిన ఘనతకూ, 'ద హిందూ' పత్రికలో వచ్చే ఆంగ్ల పజిల్స్ ఆధారాల తీరుతెన్నులను అద్భుతంగా అవలోధనం చేసుకుని తెలుగులో విస్మయానందాలకు గురిచేస్తూ, మెదడుకు మేతగా అందిస్తున్న తీరులోనూ ఉన్నతశ్రేణికి చెందినవి.

"పదం చివర ముక్తాయింపుగా నాతో దీర్ఘం తీస్తే ఎలాగ," అని నేను ప్రారంభంలో అన్న ఆధారాన్ని గళ్లనుడికట్టు పదం నింపడానికిగాను మీరు గ్రహిస్తే, సమాధానం 'ఎలనాగ' అని మీకు ఈసరికి తెలిసిపోతుంది. మేధకు పదునుపెట్టే ఉత్కృష్ట ఆధారాలతో కూడుకున్న పజిల్ ప్రక్రియ నిస్సందేహంగా ఒక విలక్షణ విశిష్ట సాహిత్య ప్రక్రియతో సమానం. 'ఎలనాగ' అందిస్తున్న ఈ నుడికట్టును

మీరు పట్టుకుంటే, ఆయన ఇచ్చే ఆధారాల కిటుకులను మీరు గ్రహించగలిగితే, ఆ మెళకువలను ఆకళింపు చేసుకుని సరిగ్గా పూరించే నైపుణ్యాన్ని సాధించగలిగితే బుద్ధికీ, హృదయానికీ కూడా గొప్ప వ్యాయామంతో ఆరోగ్యంగా జీవించుతున్నట్లే.

ఈ పుస్తకంలోని మరో ప్రత్యేకత ఏమిటంటే పజిల్స్ కు సమాధానాలు ఇవ్వడంతో బాటు ఆ సమాధానాలు ఎలా సాధించబడ్డాయో తెలిపే వివరణలను కూడా అవసరమైనచోట్ల అరటిపండు వొలిచి ఇచ్చినట్లు ఇవ్వడం వలన పజిల్స్ నింపడం ఎలాగ అనే నిపుణతా పాఠాలు చెప్పినట్లుంది. అంతేకాదు ఈ గ్రంథంలో ఎలనాగ రాసిన నాలుగు వ్యాసాలు– 'మేధకు పదును పెట్టే క్రాస్‌వర్డ్ పజిళ్లు', 'ద హిందు క్రాస్‌వర్డ్ పజిళ్లలోని చమత్కార వైవిధ్యం, విస్తృతి, వైచిత్రి', 'పాత తెలుగు క్రాస్‌వర్డ్‌లలోని ఉత్కృష్ట ఆధారాలు', 'క్రాస్‌వర్డ్ పజిళ్లు – నా ప్రస్థానం' నాలుగూ నాలుగు నాణ్యమైన రచనలు. గళ్ల నుడికట్టులు నింపేవారికి గొప్ప కానుకలు. పజిల్స్ ఆధారాల నిర్మితిలోని వైశిష్ట్యాన్నీ, విన్నాణాన్నీ, వైవిధ్యాన్నీ, వైరుధ్యాల్నీ విశదపరుస్తూ ఆ జటిలతను ఎలా అర్థం చేసుకుని సమాధానాలు కనుక్కోవాల్సిందీ సప్రామాణికంగా ఉదాహరణాత్మకంగా వివరించే మంచి దారిదీపాలు. ముఖ్యంగా 'ద హిందూ' పత్రికలోని క్రాస్‌వర్డ్ పజిల్స్ ఆధారాల గురించిన వ్యాసం 'నభూతో' అన్పించే అద్భుత రసగ్రహణం.

ఆంధ్రాంగ్ల భాషల రెండింటిపై ఎలనాగ గారికి వున్న పట్టువల్ల ఈ తెలుగు పజిళ్ల నిర్మాణం నిజమైన మెదడుకి మేత. శ్రీశ్రీ తెలుగు ఆధారాలు కూర్చిన వైభవ ప్రాభవ దీప్తులు చెబుతూనే ఆ మార్గంలో ఒక తదనంతర ఉన్నత ప్రమాణాలను నెలకొల్పిన ఘనత 'ఎలనాగ' కే దక్కుతుంది. తన వ్యాసాల్లోగానీ, వీటి నిర్మాణంలోగానీ తను చెప్పిన, చూపిన కొన్ని విశేషాంశాలు పజిళ్లు నింపేవారు, నిర్మించేవారూ కూడా గ్రహించాల్సి వుంది.

"ఇంగ్లీష్‌లో కానీ, తెలుగులో కానీ ఈ పజిళ్ల క్లూలు (ఆధారాలు) రెండు రకాలుగా వుంటాయి. నేరుగా ఉండే ఆధారాలు (డైరెక్ట్ క్లూస్) మొదటి రకం. ఇక్కడ సాధారణంగా ఆధారంలో ఒకటే పదం ఉండి, దానికి సమానార్థక పదం సమాధానంగా వుంటుంది. ఇక రెండవ రకం ఆధారాలను Cryptic Clues (నిగూఢ ఆధారాలు) అంటారు. ఇవి వాక్యాల రూపంలో ఉండి, డైరెక్ట్‌గా ఉండక

చాలా తికమక పెడతాయి. కాని సరైన సమాధానం దొరికితే గొప్ప థ్రిల్ కలుగుతుంది.”

తెలుగులో మన పత్రికల పజిల్స్‌లో వాక్యరూపక ఆధారాలకు అవకాశం తక్కువ. పత్రికలో ‘గళ్ల నుడికట్టు’కు ఒక పూర్తి పేజి కేటాయించినా అందులోనే గత పజిల్ సమాధానాలను, కొన్నిసార్లు ఆల్ కరక్ట్ నింపి పంపినవారి పేర్లు ప్రకటించడం ఈ శషభిషలు అన్నీ పెట్టుకున్నప్పుడు పదాలు గడులలో నింపడానికి ఇచ్చే ఆధారాలను పెద్ద వాక్యరూపంలో ఇచ్చే అవకాశం కొరవడుతుంది. ఉన్నంతలోనే వైచిత్రిని, చమత్కారాన్నీ చూపగలగాలి. అందువల్ల క్లుప్తతతో ఇచ్చే ఆధారాల్లో అంత ప్రజ్ఞను చూపగలగడం, పైగా నింపే పాఠకులకు విసుగు కలగకుండా, “ఇది మనవల్ల అయ్యే పని కాదులే,” అని మధ్యలో మూసేసి వెళ్లిపోయే ధోరణి లేకుండా ఉత్సాహప్రేరకంగా పజిల్స్ పూర్తి చేయించడం కోసం నిలిపి ఉంచడం ఆవశ్యకం. ‘ప్రామాణికమైన జటిలమైన క్రాస్‌వర్డ్‌లను ప్రతిరోజు నింపటానికి ప్రయత్నిస్తే’ మెదడుకు మంచి వ్యాయమము దొరికి జ్ఞాపకశక్తి పెరుగుతుంది, అన్న మాట యథార్థం. ఎలనాగ అన్నట్లు, ‘జటిలతను కలిగిన ప్రామాణిక పజిళ్లను వేసుకోవటానికి వ్యాపార పత్రికలు చాలా సందేహిస్తాయి.” తనే అన్నట్లు – “కేవలం జటిలత్వాన్ని నింపుకున్న పజిళ్లు మెదడుకు మేతను బాగానే ఇవ్వవచ్చు కాని, అవి వినోదాన్ని కలిగించవు. ఒక ఆధారాన్ని ఆకళింపు చేసుకుని సరైన సమాధానాన్ని రాబట్టిన తరువాత పాఠకునికి ఆనందం, సంతృప్తి కలగాలన్నది పజిల్ కూర్పరుల ప్రధాన ధ్యేయం కావాలి.”

పజిల్స్ నిర్మాణం గురించి ఎలనాగ మరో విలువైన మాట కూడా చెప్పారు. “గ్రిడ్ (తెలుపు, నలుపు గడుల చట్రం)ను రూపొందించడం నుండే ప్రారంభ మౌతుంది పజిల్‌ను తయారు చేసేవారి ప్రతిభ. ఏ పజిల్ గ్రిడ్‌కైనా ద్వైపార్శ్వ సౌష్ఠవం (Bilateral Symmetry) అతి ముఖ్యమైన Pre requisite. అంటే ముందుగా అవసరమైన అంశం. ఎందుకంటే అది అందాన్ని చేకూరుస్తుంది. Bilateral Symmetry లేకుండా గ్రిడ్‌ను రూపొందించడం సులభం. కవిత్వంలోనైనా, కథలలోనైనా లేక మరే సాహిత్య ప్రక్రియలోనైనా సౌందర్యం ప్రధానాంశంగా ఉండాలి. న్యూయార్క్ టైమ్స్, టైమ్స్ ఆఫ్ ఇండియా, ద హిందు, ఇండియన్ ఎక్స్ ప్రెస్

మొదలైన క్రాస్‌వర్డ్స్‌లో కాని, పూర్వం శ్రీశ్రీ, ఆరుద్రలు తయారుచేసిన క్రాస్‌వర్డ్స్‌లో కాని గ్రిడ్ సౌష్ఠవానికి చాలా ప్రాధాన్యం ఉండటానికి కారణం అదే. గ్రిడ్ ను చూడగానే అది కక్కిరిబిక్కిరిగా ఉన్నట్టనిపిస్తే అందులో సౌందర్యం లోపిస్తుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.”

అంతర్జాల పత్రికలలో పజిళ్లు కూర్చేవారు ముఖ్యంగా ఈ విషయాన్ని బాగా గ్రహించాల్సి వుంది. శ్రీ ఎలనాగ ఇంగ్లీష్ పజిల్స్ లోని చమత్కార విస్తృతినీ, వైచిత్రినీ ఎంతో గాఢంగానూ, లోతుగానూ అధ్యయనం చేశారు. తెలుగులో ఎన్నెన్ని రకాలుగా కొత్తదనాన్ని ప్రవేశపెట్టవచ్చునో ఆధారాలలో అంత వైవిధ్యం చూపారు. ‘వాకిలి’ పత్రిక ద్వారా ఆయన పజిల్స్ లోనూ, వ్యాసాలలోనూ పెంచిన, పంచిన అవగాహన పాఠకులకే కాదు, పజిల్స్ కూర్పరులకు కూడా పథనిర్దేశకాలు.

ఆధారంలోనే జవాబు దాగి వుండి బాగా ఆలోచిస్తే అది మెదడుకు తట్టే అంతర్లాపి ఆధారాలు ఎలనాగ ఎన్నో కూర్చారు. పదునైన ఊహాశక్తి, చురుకైన మేధ పెంచడానికి పదక్రీడలల్లారు. పర్యాయపదాల కోసం ఆలోచించడం, నిఘంటువులు వెతకడం అలవాటు చేశారు. మొత్తానికి గ్రిడ్స్ సౌష్ఠవం, ఆధార వాక్యాలలో నవ్యతా చమత్కారం, మేధోగత వ్యాయామం మూడూ ముప్పేటలుగా అల్లుకున్న విశిష్ట పజిళ్లు ఎలనాగవి. వివరణలతో ఎలనాగ పజిళ్ల ఆధారాలలోని వైచిత్రిని, వైవిధ్యాన్ని, చమత్కారాన్ని తెలిపేందుకు ఉదాహరణలు ఇవ్వడం మొదలిడితే అది మరో ఉద్గ్రంథం అవుతుంది. ఏ విశ్వ విద్యాలయంలోనైనా పజిళ్ల మీద ఎవరయినా ఓ సిద్ధాంత గ్రంథం రాసి డాక్టరేట్ సంపాదించదలచుకుంటే అందుకు ఎలనాగ పజిళ్లు గొప్ప సబ్జెక్టు!

చాలా ఎక్కువమంది పాల్గొనేలా పజిళ్లను రూపొందించకపోవడానికి కారణం ప్రామాణికతను నిలుపుకోవాలనే తన తపన మాత్రమేననీ, మామూలురకం పజిళ్లను చాలా పత్రికలు నిర్వహిస్తూనే వున్నాయి, వాటికి భిన్నంగా ఉన్నతస్థాయిలో నడపాలనే బలమైన కోరికతో, తెలుగుతనపు చమత్కారాలను మేళవించి, పూరించిన పాఠకుడికి థ్రిల్ కలిగించే రసోద్దీపనంతోనే వీటికి సమకట్టాననీ, అంటున్నారు ఎలనాగ,

ఒక మూసను ఛేదిస్తూ, 'మాస్'గా కాకుండా 'క్లాస్'గా, అసలు సిసలు 'మేధోక్రీడ'గా, తెలుగు వెలుగుల నవ్యతా చమత్కారాల జాడగా ఎలనాగ పజిల్స్ పదబంధ ప్రహేళికా చరిత్రలో నిలిచిపోతాయి. ఎలనాగ 'నుడి'తనపు ఆధారాల నుండి కొన్నయినా ఉదాహరణలు చూపాలన్న లౌల్యాన్ని వదులుకోలేక, మచ్చుకి ఉటంకిస్తున్నవి ఈ చమత్కార సుధలు -

- ఈ వాహనం లావుగా ఉండదు కనుక, రైతుల రకాన్ని చూపిస్తుందేమో (సన్నకారు)
- వంకరటింకరగా మిగులున్నా ఇవి విషసర్పాలే (మిన్నాగులు)
- వాదన సాధనమే కానీ వంపు తిరిగి ఉండదు (కమాను)
  కమాను: Bow of Violin. కమాను: Arch – ఇది వంపును కలిగి వుంటుంది)
- సగానికి లోయ (అరకు)
  (అరకు అంటే సగానికి కదా! అరకులోయ ప్రసిద్ధం)
- ఈ కరం ఎడమది కాదు కనుక తాగేయ్ (కుడిచేయి)
  (కుడిచేయి అంటే తాగేయ్ అని అర్థం. కుడి చెయ్యి ఎడమది కాదుగా!)
- ఆవు ఒక గుడి లేకుండా కలిపి మార్పు (కపిల)
  (కలిపి మారిస్తే కపిలి, చివరి లి కి గుడి తీసేస్తే కపిల)
- బురదలో చేప తోక పంచుట (పంపకం)
  (పంకం అంటే బురద. అందులో చేప అనే పదంలోని తోక అక్షరం ప మధ్యలో చేరిస్తే పంపకం)
- వదరుబోతుతనం పులిని చూసి మరో జంతువు పెట్టుకునే దాంట్లో ఎక్కువగా ఉంటుంది (వాచాలత)

  (పులిని చూసి మరో జంతువు నక్క పెట్టుకునేది వాత. వాత మధ్యలో ఎక్కువగా అంటే 'చాల'ను దూరిస్తే వాచాలత!)

- రోజా తిరగేసిన నిక్కరు పక్కన జాలి లేని జాబిలి (గులాబి) (నిక్కరు అంటే లాగు. లాగును తిరగేస్తే గులా. దాని పక్కన జాబిలిలో జాలి లేని బి అక్షరం చేరిస్తే గులాబి. గులాబి అంటే రోజా)
- క్షీరభాండం కోసం పాకల పునర్నిర్మాణం చేసి గారెను వెనక్కి తీసుకురావాలి (పాలకడవ)
- (పాకల పునర్నిర్మాణం అంటే పాలక. గారె అంటే వడను వెనక్కి తెస్తే డవ. కలిపితే పాలకడవ)

ఇలా చెప్పుకుంటూ పోతే ఎలనాగ ఆధారాల వైచిత్రులు అనంతాలు, జటిలతలయినా తటిల్లతల్లా మెరిసి తట్టినప్పుడు ఆనంద సంభరితాలు. ఇవి నింపడం ఓ మేధో యజ్ఞమే! కానీ యజ్ఞఫలితం ఆయురారోగ్య రసఝరీ యోగం! తాత్కాలికంగా కాక ఎప్పుడు పూరించినా ఎనలేని సంప్రీతిని బుద్ధికి, హృదయానికి అందించే ఈ భావచిత్రాలను పదిలపరుచుకోండి. Intellectual and emotional complex presented in an instant of time అనిపించే ఈ పజిల్స్ తెలుగుభాషను పరిపుష్టం చేసే 'మజిల్స్.' తెలుగు చమత్కృతిని పట్టి ఇచ్చే 'పల్స్'. హృదయానికి రసానందాల 'జిల్ జిల్స్!"

చివరగా–

కోరిక మధ్యగల శుభాలతో... లేతబొడ్డు నడుమ దీర్ఘం లేక చెదరిన ఆగకు కూతురులు.

(అంటే తెలిసిందిగా!

శుభాకాంక్షలతో... ఎలనాగకు అభినందనలు...)

*14 నవంబర్ 2017*

# సుధామ పరిచయం

| | | |
|---|---|---|
| అసలు పేరు | : | **అల్లంరాజు వెంకటరావు** |
| జననం | : | 25-11-1951 విశాఖజిల్లా అనకాపల్లి పట్టణంలో |
| తల్లిదండ్రులు | : | కీ॥శే॥ అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మ<br>కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వరరావు |
| విద్యాభ్యాసం | : | ఒకటో తరగతి నుండి ఎం.ఓ.యల్, ఎం.ఫిల్ వరకు హైదరాబాద్‌లోనే. కేశవ మెమోరియల్ పాఠశాల, మలకపేట ప్రభుత్వపాఠశాల, వివేకవర్ధనీ కళాశాల, ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలల్లో. |
| వృత్తి ఉద్యోగాలు: | | 1975-1977 బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల కరీంనగర్‌లో తెలుగులెక్చరర్‌గా.<br>1978లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధభారతి) ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా చేరిక.<br>1990లో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతి. విజయవాడ, వరంగల్, హైదరాబాద్ కేంద్రాలలో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేసి, 2008లో ఆకాశవాణి వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగం నుండి స్వచ్ఛంద పదవీ విరమణ. అనంతరం బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఏ (తెలుగు) ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అకడమిక్ కౌన్సిలర్‌గా కొన్నాళ్లున్నారు. |

అభిరుచులు : కార్టూనిస్టుగా, కవిగా, సమీక్షకునిగా, రచయితగా, చిత్రకారునిగా, సినీ విశ్లేషకునిగా, కాలమిస్టుగా, వక్తగా, పదబంధ ప్రహేళికలవంటి వివిధ పజిల్స్ నిర్మాతగా తెలుగు పాఠకలోకానికి, సాహితీలోకానికి పరిచితులు. రేడియో 'వాడి'గా శ్రోతలకు పరిచితులు.

*ముద్రిత గ్రంథాలు:* **కవితా సంపుటులు**

అగ్నిసుధ - 1990

మనసుపావనగంగ- 2010

చిత్రగ్రంథి- 2011

కవికాలమ్ - 2011

**కాలమ్‌వ్యాసాలు**

సం.సా.రాలు- 2001

మన తెలంగాణ (సుధామయోక్తి) - 2018

**ఇతరాలు**

పూతరేకులు (జోక్స్‌బాక్స్) -2001

రామాయణ పథం (ప్రశ్నోత్తరమాలిక- పజిల్స్) 2018

అవార్డులు, సన్మానాలు: 'అగ్నిసుధ' సంపుటానికి కలహంసి, ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం; 'సం.సా.రా.లు' గ్రంథానికి తెలుగు విశ్వ విద్యాలయం 2004 సాహితీ పురస్కారం; వంశీ ఇంటర్నేషనల్, జ్యోత్స్నాకళాపీఠం, తేజఆర్ట్స్ కవితా పురస్కారం, మునిమాణిక్యం హాస్యనిధి పురస్కారం, నోరి నరసింహశాస్త్రి ఛారిటబుల్‌ట్రస్ట్, దివాకర్ల సాహిత్య పీఠంవారి ఆచార్య దివాకర్ల వేంకటావధాని సాహిత్య పురస్కారం, ఆచార్య తిరుమల స్మారక సాహిత్య పురస్కారం, పింగళి జగన్నాథరావు స్మృతిసాహిత్య పురస్కారం, తురగా

కృష్ణమోహనరావ్ హాస్య పురస్కారం, చేతన మాసపత్రిక, లేఖిని సంస్థ పురస్కారం, ఖర్గపూర్, బెంగుళూర్ తెలుగు సాహితీ సంస్థలచే, ప్రపంచ తెలుగు మహాసభలు, కృష్ణా జిల్లా రచయితల సంఘం వారిచే సన్మానాలు మొదలైనవి.

1983లోనే ఆకాశవాణి జాతీయకవి సమ్మేళనానికి తెలుగుకవిగా ఎంపిక.

ప్రస్తుతం : యువభారతి సంస్థ ప్రచురణల ప్రధాన సంపాదకులు. ఆంధ్రభూమి దిన, వారపత్రికల్లో, నవ్య వారపత్రికలో, గళ్ళనుడికట్టులు: మాటాట, పదబంధ పారిజాతం, సుధామ పదగారడి నిర్వహణ, 'విజయక్రాంతి' దినపత్రికలో సోమవారాల్లో "వ'సుధా(స)మ'యం", 'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్' మాసపత్రికలో 'సీ'నియర్ కబుర్లు' కాలమ్స్ నిర్వహణ. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా ప్రస్థానం.

జీవన సహచరి : శ్రీమతి అల్లంరాజు (సూకూరు) ఉషారాణి
కుమారుడు : చి॥ అల్లంరాజు స్నేహిత్
కోడలు : చి॥ సౌ॥ అల్లంరాజు (దువ్వూరి) లక్ష్మి ప్రవంతి



# BHOOMIKA

### A collection of Prefaces and Forewords of

## Sudhama



Edited by

Allamraju Usharani

## సుధామ ముద్రిత గ్రంథాలు
























